శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపర బ్రహ్మణే నమః.



శ్రీమదాంధ్ర

వచనరామాయణము

ఉత్తరకాండము

సంస్కృతరామాయణమునకు సరిఁయైనతెనుఁగు.

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

చెన్నపురిః

వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచేఁ బ్రకటితము.

1961

All Rights Reserved.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11264

V.R. NARLA MEMORIAL
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11264

T
294.5922
SUB

Printed by
V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS
MADRAS.—1961.

విషయసూచిక

సర్గము.	విషయము.		పుట.
1.	అగస్త్యాదిమునులు రామునిఁ జూడ వచ్చుట	...	1
2.	అగస్త్యుఁడు రాక్షసులవృత్తాంతమును జెప్పుఁ బూనుట	...	4
3.	కుబేరుని జన్మప్రకారాదికము	...	6
4.	మాల్యవదాదులచరిత్రము	...	9
5.	మాల్యవదాదులవృత్తాంతము	...	11
6.	సురలు మునులు శివుని రాక్షసులఁ జంప వేఁడుట	...	14
7.	రాక్షసులతోడియుద్ధము	...	19
8.	రాక్షసులు లంకకుఁ బాఱిపోవుట	...	24
9.	రావణాదులవృత్తాంతము	...	26
10.	,,	...	29
11.	రావణునిలంకాప్రవేశము	...	33
12.	రావణాదులపెండ్లి	...	37
13.	కుబేరునిసౌభాగ్యము	...	39
14.	రావణుఁడన్నపైఁ దాడివెడలుట	...	42
15.	యక్షరాక్షసులయుద్ధము	...	44
16.	రావణుఁడు కైలాసమెత్తుట	...	48
17.	వేదవతివృత్తాంతము	...	51
18.	రావణుఁడు మరుత్తునియజ్ఞవాటకమునకుఁ బోవుట	...	54
19.	రావణుఁ డనరణ్యునిఁ జంపుట	...	57
20.	నారదరావణసమాగమము	...	59
21.	యమరావణులయుద్ధము	...	62
22.	యమరావణుల యుద్ధము	...	65
23.	రావణుఁడు వరుణలోకమునకుఁ బోవుట	...	69

ఁ. మొ. ఁ3 - వరకు ప్రక్షిప్తసర్గములు

ఁ.	రావణుఁడు బలినిఁ జూచుట	...	73
ఁ.	రావణుఁడు సూర్యలోకమునకుఁ బోవుట	...	79

సర్గము.	విషయము.		పుట.
3.	రావణునిచంద్రలోకప్రయాణము	...	80
౪.	బ్రహ్మసందర్శనము	...	85
౫.	రావణునకు దివ్యపురుషుఁడగపడుట	...	88
24.	రావణుఁడు పరస్త్రీల నపహరించుట	...	94
25.	రావణుఁడు మధురాక్షసుని మన్నించుట	...	97
26.	రావణుఁడు రంభను బట్టుకొనుట	...	101
27.	స్వర్గముపై రావణునిదండయాత్ర	...	105
28.	దేవదానవయుద్ధము	...	108
29.	,,	...	111
30.	బ్రహ్మ యింద్రుని విడిపించుట	...	114
31.	రావణుఁడు మాహిష్మతికిఁ బోవుట	...	117
32.	అర్జునునిచే రావణుఁడు పట్టువడుట	...	120
33.	పులస్త్యుఁడు రావణుని విడిపించుట	...	125
34.	రావణుఁడు వాలిచేఁ బట్టువడుట	...	127
35.	హనుమంతునిజననము	...	130
36.	హనుమంతునివరలాభాదికము	...	134
37.	రాముని ప్రాతఃకృత్యము	...	138
౬.	వాలిసుగ్రీవాదులజననాదికము	...	140
౭.	రావణుఁడు సనత్కుమారునితో మాటలాడుట	...	143
౮.	సనత్కుమారునియుపదేశము	...	145
౯.	,,	...	147
౧౦.	రావణునిశ్వేతద్వీపపు కథ	...	148
38.	జనకాదులవీడుకోలు	...	156
39.	రాముఁడు వానరులను గౌరవించుట	...	158
40.	వానరరాక్షసులవీడుకోలు	...	160
41.	పుష్పకమును వదలుట	...	162
42.	సీతారాములవనవిహారము	...	163
43.	పౌరులమాటలు భద్రుఁడు చెప్పుట	...	165
44.	రాముఁడు తమ్ముల రావించుట	...	167
45.	సీత నడవిలో విడువు మనుట	...	168
46.	లక్ష్మణుఁడు సీత నడవికిఁ గొంపోవుట	...	170

సర్గము.	విషయము.		పుట.
47.	సీతతో రామునియాజ్ఞ చెల్పుట	...	172
48.	సీత చింతించుట	...	173
49.	వాల్మీకి సీత నోదార్చుట	...	175
50.	సుమంత్రునివాక్యములు	...	177
51.	సుమంత్రుడు దుర్వాసునిమాటలు చెప్పుట	...	178
52.	లక్ష్మణుడు రామునియొద్దకు వచ్చుట	...	180
53.	రాముడు నృగమహారాజుచరిత్ర చెప్పుట	...	181
54.	నృగమహారాజు చరిత్ర	...	182
55.	రాముడు నిమిచరిత్ర చెప్పుట	...	184
56.	వసిష్ఠునిపునర్జన్మము	...	185
57.	నిమిపునర్జన్మము	...	187
58.	రాముడు యయాతిచరిత్ర చెప్పుట	...	188
59.	యయాతిచరిత్ర	...	190
	౧౧. రాముడు కుక్కివివాదమును విమర్శించుట	...	191
	౧౨. రాముడు గృధ్రోలూకవివాదము తీర్చుట	...	196
60.	తాపసులరాక	...	201
61.	లవణాసురునికథ	...	202
62.	రాముడు లవణుని జంపించెద ననుట	...	203
63.	శత్రుఘ్నుని మధురకు రాజునుగాఁ జేయుట	...	205
64.	రాముడు సైన్యమును లవణునిమీఁదికిఁ బంపుట	...	207
65.	వాల్మీకి శత్రుఘ్ననకు సౌదాసునికథ చెప్పుట	...	208
66.	కుశలవులజన్మము	...	210
67.	లవణునిబలాదివర్ణనము	...	211
68.	శత్రుఘ్నుఁడు లవణు నడ్డగించుట	...	213
69.	శత్రుఘ్నుఁడు లవణునిఁ జంపుట	...	214
70.	శత్రుఘ్నుఁడు మధురాపురమును వశపఱచుకొనుట	...	217
71.	శత్రుఘ్నుఁడు కుశలవులగానము వినుట	...	218
72.	శత్రుఘ్నుఁడు రామునిఁ జూచి మధురకుఁ బోవుట	...	220
73.	బ్రాహ్మణుఁడు మృతబాలునిఁ దెచ్చి యేడ్చుట	...	221
74.	నారదుఁడు బాలునిమృతికిఁ గారణము చెప్పుట	...	222

సర్గము.	విషయము.		పుట.
75.	రాముఁడు శంబూకునిఁ జూచుట	...	224
76.	శంబూకవధ, దేవతాదర్శనము	...	225
77.	అగస్త్యుఁడు చెప్పిన శ్వేతునికథ	...	228
78.	శ్వేతునిపూర్వవృత్తాంతము	...	230
79.	అగస్త్యుఁడు చెప్పిన దండునికథ	...	232
80.	దండుఁ డరజను బలాత్కరించుట	...	233
81.	శుక్రుఁడు దండుని శపించుట	...	234
82.	శ్రీరాముఁ డయోధ్యకు వచ్చుట	...	235
83.	భరతుఁడు రాజసూయము వల దనుట	...	237
84.	లక్ష్మణుఁ డశ్వమేధము చేయుట	...	238
85.	వృత్రవధవృత్తాంతము	...	239
86.	బ్రహ్మహత్యావిభాగము	...	240
87.	ఇలమహారాజుకథ	...	242
88.	ఇలమహారాజుకథ	...	243
89.	ఇలమహారాజుకథ	...	245
90.	ఇలమహారాజుకథ	...	246
91.	శ్రీరాముని యశ్వమేధప్రారంభము	...	248
92.	శ్రీరాముని యశ్వమేధము	...	249
93.	వాల్మీకి కుశలవుల రామాయణము గానముచేయు మనుట	...	250
94.	కుశలవులరామాయణగానము	...	252
95.	రాముఁడు సీత చే శపథముచేయింపఁ గోరుట	...	254
96.	వాల్మీకి సీత పరిశుద్ధురా లని చెప్పుట	...	255
97.	సీత పాతాళమునకుఁ బోవుట	...	256
98.	బ్రహ్మ రాము నోదార్చుట	...	257
99.	కౌసల్యాదులు స్వర్గమునకుఁ బోవుట	...	259
100.	యుధాజిత్తు గార్గ్యుని రాముని యొద్దకుఁ బంపుట	...	260
101.	భరతుఁడు గంధర్వుల గెల్చుట	...	262
102.	అంగదచంద్రకేతులపట్టాభిషేకము	...	263
103.	యముఁడు తాపసవేషముతో వచ్చుట	...	264
104.	యముఁడు బ్రహ్మసందేశము చెప్పుట	...	265

సర్గము.	విషయము.	
105.	దుర్వాసోముని రాముని జూడవచ్చుట	...
106.	లక్ష్మణుఁడు స్వర్గమున కేగుట	...
107.	కుశలవులపట్టాభిషేకము	...
108.	రాముఁడు సుగ్రీవాదులను దనతో రా నీయకొనుట	...
109.	రామాదులమహాప్రస్థానము	...
110.	శ్రీమన్నారాయణుఁడు స్వస్థానము చేరుట	...
111.	రామాయణఫలశ్రుతి	...

శ్రీరస్తు

శ్రీరామాయ నమః.

శ్రీమద్వాల్మీకిరామాయణము

ఉత్తరకాండము

1-వసర్గము

అగస్త్యాదిమునులు రామునిఁ జూడవచ్చుట

శ్రీరామచంద్రభగవానుఁ డీరీతిగా రాక్షసుల నందఱను సంహరించి రాజ్య మేలుచుండఁగా నతనిని గొనియాడుటకై తూర్పుదిక్కునందుండెడి యవక్రీతుఁడు, గార్గ్యుఁడు, గాలవుఁడు, మేధాతిథికుమారుఁడగు కణ్వుఁడు మొదలగు మునులును, దక్షిణదిక్కున నుండెడి స్వస్తి,ఆత్రేయుఁడు, నముచి, ప్రముచి, అత్రి,సుముఖుఁడు, విముఖుఁడు,అగస్త్యుఁడు మొదలగు మునులును, పశ్చిమదిక్కున నుండు పృషద్ధుఁడు, కవషుఁడు, ధౌమ్యుఁడు, మహర్షి యగురాధేయుఁడు మొదలగు మునులును, ఉత్తరపుదిక్కున నుండెడి వసిష్ఠుఁడు, కశ్యపుఁడు, అత్రి, విశ్వామిత్రుఁడు, గౌతముఁడు, జమదగ్ని, భరద్వాజుఁడు మొదలగు మునులును శిష్యసహితముగా వచ్చిరి. అగ్నిహోత్రునితో సమానమైన కాంతిగలవారును, వేదములు వేదాంగములు చదువుకొన్నవారును, నానాశాస్త్రము లెఱిఁగినవారును నగుమును లీప్రకారముగా శ్రీరామచంద్రుని మందిరము చెంతకు వచ్చి ద్వారమునొద్ద నిలువఁబడిరి. అప్పుడు ధర్మాత్ముఁడును మునులలో శ్రేష్ఠుఁడును నగు అగస్త్యుఁడు ద్వారపాలకుని జూచి యిట్లనియె: "ద్వారపాలకా! లోపలికిఁ బోయిఁ శ్రీరామునితో మునులు వచ్చి ద్వారమునొద్ద నిలువఁబడియున్నా"రని చెప్పి రమ్మనఁగానే, రాజనీతిని రాజులయింగితమును నెఱిఁగినవాఁడును, మంచినడవడి గలవాఁడును,

చెప్పినసని వేగముగాఁ జేయువాఁడును, ధైర్యశాలియును నగు నాద్వార పాలుఁడు లోపలికిఁ బోయి పున్నమచందురునితో సమానమైన కాంతిగల రామునిఁజూచి యగస్త్యాదిమునులు వచ్చి ద్వారమువద్దఁ నున్నా రని విన్నవించెను.

బాలసూర్యునితో సమానమైన కాంతి గల మునీశ్వరులు వచ్చి యున్నా రని ద్వారపాలకునివలన విని, తరువాత శ్రీరాముఁడు "సుఖముగా వారిని లోపలికిఁ దీసికొని రమ్ము," అని ద్వారపాలకునితోఁ జెప్పెను. ద్వారపాలకునిచేఁ దీసికొనిరాఁబడ్డ మునీశ్వరులను జూచి చేతులు జోడించుకొని యెదురుకొని పాద్యము, అర్ఘ్యము మొదలగు వానిచేఁ బూజించి యాదరముతో గోవును సమర్పించి నమస్కరించి రాముఁడు వినయముగా నాసనములమీఁద వారిని గూర్చుండుఁ డని యెను. ఆ మునిశ్రేష్ఠులు రామునియనుమతిప్రకారముగా బంగారుచేఁ జిత్రింపఁబడినవియు, గొప్పవియు, శ్రేష్ఠమైనవియు, మీఁదను దర్భలును, కృష్ణాజినములును బఱచినవియు నగు నాయాసనములమీఁదను వారి వారి యంతరమునకుఁ దగినట్లు గూర్చుండిరి. తరువాతను రామునిచేఁ గుశల మడుగఁబడి శిష్యులు మొదలగువారితోఁ గూడుకొనియున్న వేదవిదు లగు మహర్షులు రామునితో ని ట్లనిరి:

మహాబాహుఁడవగు నోశ్రీరామచంద్రా! మాకందఱకును గుశలమే. దైవవశమున సమస్తశత్రువులను జంపి క్షేమముగా నున్న నిన్నుఁ జూడఁగలిగితిమి. దైవవశమున నీవు ముల్లోకముల నేడిపించుచున్న రావణునిఁ జంపితివి. రామా! పుత్రపౌత్రాదులతోఁ గూడిన రావణుని జంపుట నీ కొకగొప్పకష్టమైనపని గాదు. నీవు ధనుస్సు పట్టితివేని నిస్సంశయముగా మూఁడులోకములను జయింపఁగలవు. అదృష్టవశమున నీవు రాక్షసరాజగు రావణునిఁ జంపితివి. ధర్మాత్మా! మాయదృష్టవశమున జయమును బొంది సీతతోను, నీహితమును సమకూర్చు తమ్ముఁడగు లక్ష్మణుని తోడను, తల్లులతోడను, తక్కిన తమ్ములతోడను గూడియుండఁగా నిన్నిప్పుడు మకలఁ జూడఁగలిగితిమి. అదృష్టవశమునఁ బ్రహస్తుఁడు, వికటుఁడు, విరూపాక్షుఁడు, మహోదరుఁడు, ధర్షింప శక్యముకాని యకంపనుఁడు మొదలగు రాక్షసులను జంపితివి. రామా! ఎవనిప్రమాణముకంటె గొప్పదియగు ప్రమాణము లేదో అట్టి కుంభకర్ణుని నీవు

యుద్ధములోఁ జంపితివి. ఇది గొప్పయదృష్టము. మఱియు నోరామ చంద్రా! అదృష్టవశమునఁ ద్రిశిరుఁడు, అతికాయుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు, భయంకరాకారులగు కుంభకర్ణునికొడుకులు కుంభనికుంభులు, ప్రళయకాలపు యమునితో సమానులగు యుద్ధోన్మత్తుఁడు, మత్తుఁడు, బలవంతుఁడగు యజ్ఞకోపుఁడు, ధూమ్రాక్షుఁడు మొదలగు మహాబలపరాక్రమములుగల రాక్షసులును శస్త్రాస్త్రపారగులై మహా ఘోరముగా యుద్ధము చేయుచుండఁగా యమునితో సమానముగా భయంకరమైన బాణములచేతఁ జంపితివి. రామా! దేవతలకుఁ గూడ నసాధ్యుఁడైన రావణునితో ద్వంద్వయుద్ధము చేసి జయమును బొందితివి. రావణాసురునికియుద్ధములో నెన్నఁడునుపరాజయముకలుగ లేదు.అదృష్ట వశమున ద్వంద్వయుద్ధమును జేయుటకు వచ్చినయింద్రజిత్తునిఁజంపుటయే గొప్ప. మహాబాహూ! దైవవశమున యమునివలె నెదురుగా వచ్చు నింద్రజిత్తుచేతను దప్పించుకొని వానిని జంపి జయమును బొందితివి. మహామాయాధురంధరుఁడగు నాయింద్రజిత్తు నెవ్వరును జంపఁజాలరు. అటువంటివానిని నీవు తమ్మునిచేఁ జంపించితివన్న సంగతి విని, మే మందఱమును సంతోషించుచున్నారము. ఇంద్రజిత్తును జంపుటయే మాకుఁ జాల నాశ్చర్యమును గలిగించుచున్నది. మఱియు నోరామా! మహావీరులును, కామరూపులును నగు రాక్షసుల నెందఱినో చంపితివి. సమస్తశత్రువులను జంపి పవిత్రమును సౌమ్యమును నగు నభయదక్షిణ నిచ్చి మాకే కాక లోకముల కన్నింటికిని సంతోషమును గలిగించి దైవవశమున వృద్ధిగానున్నాఁడవు.

భావితాత్ములగు నాఋషులు చెప్పినమాటలు విని యాశ్చర్యపడి చేతులు జోడించుకొని శ్రీరామచంద్రుఁడిట్లనియెఁ: "ఓమునిభగవాను లారా! మహాబలపరాక్రమములుగల రావణకుంభకర్ణులు, మహోదరుఁడు, ప్రహస్తుఁడు, విరూపాక్షుఁడు, మత్తోన్మత్తులు, తేఱిచూడ శక్యముగాని దేవాంతకనరాంతకులు, మహావీర్యముగల యతికాయుఁడు, త్రిశిరుఁడు, ధూమ్రాక్షుఁడు మొదలగు రాక్షసుల నందఱను గొనియాడక యింద్రజిత్తు నింతగాఁ గొనియాడుచున్నారేల? వానిప్రభావ మెట్టిది? వాని కెంతబలము గలదు? వానిపరాక్రమ మెటువంటిది? రావణునికంటెను గొప్పవాఁ డనిపించుకొనుటకుఁ గలకారణ మేమి? నేను వినుటకుఁ

జాలుదునేని, రహస్యమైనసంగతి' కాకుండెనేని సెలవిచ్చినచో వినఁదలఁచి యున్నాఁడను. చెప్పక తీఱుదని మీ కాజ్ఞాపించువాఁడనుమాత్రము గానుజుమండీ! ఆయింద్రజిత్తు దేవేంద్రునిఁగూడ జయించుటకుఁ దగిన వరమెట్లు పొందెను? అతఁడు తండ్రికన్నను బలవంతుఁ డెట్లాయెను? ఆయీసంగతులన్నియు వినఁదలఁచి యడుగుచున్నయీనాకు సెలవిత్తురు గాక."

2-వ సర్గము

అగస్త్యుఁడు రాక్షసులవృత్తాంతమును జెప్పఁబూనుట

మహాత్ముఁడగు శ్రీరాముఁ డడిగినమాటలు విని మహాతేజశ్శాలి యగు నగస్త్యుఁ డిట్లనియె: "రామా! ఆయింద్రజిత్తు శత్రువులచేఁ జావకుండ శత్రువులను జంపుటకుఁ దగినతేజోబలము వాని కెట్లు గలిగినదో చెప్పెదను వినుము. ముందుగా నీకు రావణాసురునికులము, జన్మము, వాని కిచ్చినవరములు మొదలగునవి చెప్పెదను. రామా! పూర్వము కృతయుగమున రెండవ బ్రహ్మదేవునివంటివాఁడు బ్రహ్మమానసపుత్రుఁడు పులస్త్యుఁ డనియెడు బ్రహ్మర్షి యొకఁడు గలఁడు. అతనిగుణములు వివరించి చెప్పుటకు వీలు గాదు. ఆతఁడు తన ధర్మమునుబట్టియు, మంచి స్వభావమునుబట్టియు బ్రహ్మకుఁ గుమారుఁ డనియే చెప్పఁదగినవాఁడు. బ్రహ్మకుమారుఁ డగుటచే దేవతలందఱికిను మిక్కిలి ప్రేమాస్పదుఁ డాయెను. మఱియు బుద్ధిశాలియగు నాపులస్త్యుఁడు తనస్వచ్ఛమైన గుణములచేత నెల్లలోకములవారికిని నిష్టుఁడై యుండెడివాఁడు. అతఁడు తపస్సు చేసికొనుటకై మేరుపర్వతప్రాంతమం దున్నతృణబిందునియాశ్రమమునకుఁ బోయియుండెను. స్వాధ్యాయముచేతను నియమింపఁబడిన యింద్రియములుగల యాధర్మాత్ముఁ డచ్చటఁ దపస్సు చేసికొనుచుండఁగా నతనియాశ్రమములోనికి దేవకన్యకలు, పన్నగకన్యకలు, రాజర్షికన్యకలు, అప్సరస్త్రీలు మొదలగువా రాటలాడుకొనుచుఁ బ్రవేశించుచుండెడివారు. అతనితపోవనము సర్వఋతువులయందును రమ్యమై యిచ్చకువచ్చిన మచ్చున విహరించుటకుఁ దగియుండుటవలన నిత్యమును వారక్కడకు వచ్చి పెచ్చు పెరిగి యాడుకొనుచుండెడివారు. ఇట్లు సుందరమైన యాపులస్త్యుని యాశ్రములోనికి వచ్చి యాటలచేతను, పాటల

చేతను, వాద్యవిశేషములచేతను అనింద్యలగు నాకన్యక లాపులస్త్యుని తపస్సునకు విఘ్నమును గలిగించుచుండిరి.

అంత మహాతేజశ్శాలియగు పులస్త్యుడు కోపించి, "నాతపోవనములోనికి వచ్చినయాఁడుది గర్భవతి యగుఁగావుత!"మని శపించెను. ఆకన్యక లందఱును మహానుభావుఁడైన యాపులస్త్యునిమాట విన్న వారై బ్రహ్మశాపమువలన భయపడి యదిమొద లాచోటికిఁ బోవ మానుకొనిరి. ఇట్లుండఁగానాతఁడిచ్చినశాపముసంగతి యెఱుఁగక తృణబిందుని కూఁతురు తనసఖులను వెదకుటకై యతనితపోవనమునకుఁబోయి నిర్భయముగా విహరించుచు నచ్చట నొక్కసఖినైనను జూడకపోయినది. ఆసమయమున మహాతపశ్శాలియగు నాపులస్త్యుడు స్వాధ్యాయాసక్తుఁడైయుండెను. ఆమె వేదధ్వని విని యతనిని దపోనిధినిగాఁ దెలిసికొన్నది. అంతట నామెకు గర్భచిహ్నములు గనుపట్టినవి. దేహము తెల్లఁబాఱినది. తనకు గర్భము గలుగుట చూచి దిగులుపడి యిది యేటిసంగతియో కదా! యనుకొనుచుఁ దండ్రియాశ్రమములోనికిఁ బోయి నిలువఁబడినది. ఆరీతిగా వచ్చి యెదుట నిలువఁబడియున్న కూఁతుం గాంచి తృణబిందుఁడు తెల్లఁబోయి "యేమమ్మా! నీశరీర మిరీతిగా నున్నది!" అని యడుగఁగా, నామె చేతులు జోడించుకొని "నాయనా! నారూప మిరీతిగా మాఱిపోవుటకుఁ గారణము నాకుఁ దెలియదు. కాని నేను సుందరమైన పులస్త్యమహాముని యాశ్రమములోనికి నాచెలికత్తెలను వెదకుటకై యొక్కతెను బోతిని. అచ్చట నాచెలికత్తియ యొక్కతెయు నాకగపడలేదు. నారూపముమాత్ర మిరీతిగా మాఱిపోవుటచే భయపడుచు నిచ్చటికి వచ్చితిని." అని దీనదీనముగాఁ దండ్రితోఁ జెప్పినది.

ఇట్లు తనకూఁతురు చెప్పినమాటలు విని తపశ్శాలియు రాజర్షియు నగు నాతృణబిందుఁడు ధ్యానదృష్టితోఁజూచి యిదియంతయుఁ బులస్త్యుని శాపప్రభావ మని తెలిసికొని, కుమారితను వెంటఁబెట్టుకొని పులస్త్యుని సన్నిధికిఁ బోయి యిట్లనియె: "పులస్త్యభగవానుఁడా! ఇది నాకూఁతురు; మంచిగుణవంతురాలు. తనంతటఁ దానుగా వచ్చియున్నదీనిని భిక్షగా నంగీకరింపుఁడు. ఇది తాము తపస్సు చేసిచేసి యలసతను బొంది వచ్చునప్పటికిఁ దమకు నిత్యమును శుశ్రూష చేయుచుండును. ఇందు సందియము లేదు."

అని యిట్లు చెప్పుచున్న తృణబిందుమహర్షియొక్క మాటలు విని యాపులస్త్యుఁ డాకన్యకను బరిగ్రహింప నిచ్ఛగలవాఁడై "వల్లె" యని బదులుచెప్పెను. తృణబిందుఁడు తనకూఁతును యథాన్యాయముగా నత నికి సమర్పించి తనయాశ్రమమునకుఁ బోయెను. ఆమెయుఁ దనగుణముల చేతను బెనిమిటికి సంతోషమును గలిగించుచు నచ్చట నుండెను. ముని శ్రేష్ఠుఁడగు నాపులస్త్యుఁ డాకన్యకయొక్క స్వభావముచేతను నడవడి చేతను సంతోషించినవాఁడై యామెతో నిట్లనియె: "సుందరీ! నీగుణ మునకు నేను సంతోషించితిని. కావున నుభయవంశములకును గర్తయుఁ బులస్త్యుఁ డనుప్రసిద్ధి గలవాఁడును నాతో సమానుఁడును నగుకుమా రుని నీ కిచ్చుచున్నాను. నే నధ్యయనము చేసికొనుచుండఁగా నీ వా వేదమును వినియుంటివి గావున నీకుమారుఁడు విశ్రవసుఁ డనిపేరు పొందఁగలఁడు." ఈరీతిగా సంతోషించిన యాముని చేఁ జెప్పఁబడినది యై యామె కొలఁదికాలములోనే విశ్రవసుఁ డనుకుమారుని గన్నది. ఆకుమారుఁడు మూఁడులోకములయందును ప్రసిద్ధిగలిగినవాఁడును, కీర్తి తోడను ధర్మముతోడను కూడినవాఁడును, వేదవేదాంగము లెఱిఁగిన వాఁడును, సమదృష్టిగలవాఁడును, వ్రతములయందును ఆచారముల యందును మిక్కిలి యాసక్తిగలవాఁడును నై తండ్రివలెనే తపస్సుతోఁ గూడినవాఁ డాయెను.

3-వ సర్గము

కుబేరుని జన్మప్రకారాదికము

పిమ్మటను సత్యవంతుఁడును, శీలవంతుఁడును, శాంతుఁడును, స్వా ధ్యాయాసక్తుఁడును, శుచిఁయు, భోగములయం దాసక్తిలేనివాఁడును, నిత్యమును దపస్సునందేయాసక్తిగలవాఁడును, బుల స్త్యమహాముని కుమా రుఁడును నగు నావిశ్రవసుఁడు కొలఁదికాలములోననే తండ్రివలెఁ దపో నిధి యాయెను. అతనినడవడి యంతయుఁ దెలిసికొని భరద్వాజమహా ముని తనకూఁతును దేవవర్ణిని యసుదానిని దెచ్చి యతనికి భార్యనుగా నిచ్చెను. ఆతఁడును భరద్వాజమహాముని కూఁతుం బరిగ్రహించి సకల శ్రేయోనిదానంబగు గృహస్థాశ్రమము నవలంబించెను. అంతటఁ గొన్నా ళ్లకు సంతతిఁబడయవలయు ననుబుద్ధిగలవాఁడై మిక్కిలి సంతోషముతోఁ

గూడి దేవవర్ణిని యను భార్యయందు వీర్యశాలిని కుమారు నొకనిఁ గనియెఁ. ఆకుమారుఁడు ధర్మాత్ముఁడును బ్రహ్మగుణము లన్నియుఁ గలవాఁడును నై యొప్పారుచుండెను. ఆకుమారుఁడు పుట్టఁగానే విని వచ్చి బ్రహ్మదేవుఁడు మిగుల సంతోషించెను. శ్రేయస్కరమగు నతనిబుద్ధిని జూచి వీఁడు ధనమున కధిపతి గాఁగలఁ డనిచెప్పి దేవర్షులును దానును వాలోచించి వీఁడు విశ్రవసునికుమారుఁడు గనుకను, సాదృశ్యమునుబట్టి తండ్రిని బోలియున్న వాఁడు గనుకను లోకములో వైశ్రవణుఁ డను ప్రసిద్ధినొందఁగలఁ డనిచెప్పి యంతర్ధానమాయెను. తండ్రితపోవనములో నున్న యావైశ్రవణుఁడు హోమము చేయఁబడి జాజ్వల్యమానముగా వెలుఁగుచున్న యగ్నిహోత్రునివలె వృద్ధి నొందుచుండెను.

అతఁడిరీతిగాఁ దండ్రియాశ్రమములో నుండఁగాఁ దపస్సే మిగుల నుత్తమమైన గతి కనుకఁ దపస్సు చేయవలయు ననియాతనికి బుద్ధి పుట్టి నది. అతఁడు వేలకొలఁదిసంవత్సరములు మహావనములో నుగ్రములగు నియమముల నవలంబించి ఘోరమగు తపస్సు చేసెను. మొదటివేయి సంవత్సరములు జలము త్రాగియు, రెండవవేయిసంవత్సరములు వాయువునే భక్షించియు, మూఁడవవేయిసంవత్సరములు నిరాహారుఁడయ్యుఁ దపస్సు చేయుచుండఁగా నామూఁడువేలసంవత్సరములును నొక్కసంవత్సరమువలెఁ గడచినవి. తరువాత నతనితపస్సునకుఁ జాలసంతోషించి యింద్రాదిదేవతలతోఁగూడ బ్రహ్మదేవుఁ డతనియాశ్రమమునకు విచ్చేసియిట్లనియె: "వత్సా! నీవు చేసిన తపస్సునకుఁ జాలసంతోషించితిని. మహామతీ! నీకుఁ గావలసినవరములు గోరుము. నీవు వరము లిచ్చుటకుఁ దగినవాఁడవు." అని చెప్పినబ్రహ్మదేవునిమాటలు విని "తాతా! నేను జేసినతపస్సునకు సంతోషించితివేని నాకు లోకపాలకత్వమును, ధనాధిపత్యమును దయచేయుము" అని యడిగెను. ఆమాటలకు సంతోషించి, "నాయనా! నీవు కోరినప్రకారముగానే యిచ్చితిని. నేనును నాల్గవలోకపాలకుని సృజింపవలయు ననియే యాలోచించుచున్నాను. యమునిపదమో వరుణునిపదమో యింద్రునిపదమో నీ కేదికావలయునో దానిని గైకొనుము. ధర్మజ్ఞా! నీవు నిధులకధిపతి వయ్యెదవు. యమవరుణేంద్రులకు నాల్గవవాఁడ వయ్యెదవు. ఇదిగో నిది పుష్పకమను పేరుగల విమానము. సూర్యునితో సమానముగా వెలుఁగుచున్న దీనినిఁ బుచ్చు

కొనుము. దీనిమీఁద నారోహించి దేవతలతో సమానుఁడవై యుండుము. నీకు మేలగుఁగాక? నీవు కోరుకొన్న రెండువరములును నీ కిచ్చి మేము కృతార్థులమైతిమి. మేమందఱమును వచ్చినత్రోవనే మరలఁ బోయెదము" అని చెప్పి బ్రహ్మ దేవతలతోఁగూడఁ దనలోకమునకుఁ బోయెను.

బ్రహ్మ మొదలగు దేవతలు వారివారి లోకములకుఁ బోయినతర్వా తను నియమవంతుఁడైన యావైశ్రవణుఁడు తండ్రియున్న తపోవనమునకు వచ్చి చేతులు జోడించుకొని యిట్లనియెఁ: "తండ్రీ! బ్రహ్మవలన నాకిష్ట మైన వరములను పొందితిని గాని, యతఁడు నాకు నివసించుటకుఁ దగినస్థల మేర్పాటు చేయకపోయెను. కావున నేప్రాణికిని బాధాకరము గాకుండ సుండెడి యొకానొక నివాసము నాకొఱకుఁ జూడుము." అని యిట్లు కుమారుఁడు చెప్పినమాటలు విని విశ్రవోబ్రహ్మ సంతోషించుచు నిట్ల నియెఁ: "వత్సా! చెప్పెదను వినుము. దక్షిణసముద్రతీరమునందుఁ ద్రికూటమను పేరుగల పర్వతము గలదు. దానిపైని దేవేంద్రుని యమ రావతివలెనే విశ్వకర్మచే నిర్మింపఁబడి విశాలమైన లంక యను పేరుగల పట్టణ మొకటి యున్నది. అది మిక్కిలి రమణీయమైనది. అది మొదట రాక్షసులనిమిత్తము నిర్మింపఁబడినది. నీ వాలంకాపట్టణమునకుఁ బోయి సుఖముగా నుండుము. ఆపట్టణము బంగారుప్రాకారములు పరిఘులు గలది. యంత్రములతోడను శస్త్రములతోడను గూడియున్నది. బంగా రునఁ బొదివిన వైడూర్యములుగల తోరణములు గలది. అదియే మిక్కిలి చక్కని పట్టణము. పూర్వము విష్ణుమూర్తికి భయపడి రాక్షసు లాపట్టణ మును విడిచి పాతాళలోకమునకుఁ బోయిరి. ఇప్పు డాపట్టణము జన శూన్యమైయున్నది. దాని కెవ్వఁడును ప్రభువు లేఁడు. కావున నాయనా! నీ వాపట్టణములోఁ బ్రవేశించి సుఖముగా నుండుము. నీ కచ్చటివాసము నిర్దోషమైనది. అచ్చట నెవ్వరికిని నేవిధమైన బాధయు నుండదు." అని తండ్రి చెప్పినమాటలు విని వైశ్రవణుఁడు వెంటనే త్రికూటపర్వతముపై నున్న లంకాపట్టణమునకుఁ బోయి వేలకొలఁది నైర్బుతులు మొదలగు వారితోఁగూడ నందు నివసించెను. అతనినివాసనమువలన వా రందఱును మిక్కిలి సంతోషించుచు నందుండిరి. నైర్బుతిశ్రేష్ఠుఁడునుధర్మాత్ముఁడును నగు నావైశ్రవణుఁడు సముద్రమేయగడ్తగాఁగల యాలంకాపురములో

సుఖముగాఁ గాపురముండి యప్పుడప్పు డప్పుష్పకవిమానము నెక్కి-వచ్చి తల్లిదండ్రులను జూచి పోవుచుండెడివాఁడు. ఇట్లు లాధనాధిపతియగు వైశ్రవణుఁడు దేవతలు, గంధర్వులు మొదలగువారిచే స్తుతిచేయఁబడు చున్నవాఁడును, అప్సరసలనృత్యములచేత నలంకరింపఁబడిన యాలయ ములు గలవాఁడును నై కిరణములచేత సూర్యుఁడు వెలుఁగుచున్నట్లు వెలుఁగుచుఁ దండ్రియొద్దకు వచ్చుచుఁ బోవుచు నుండెడివాఁడు.

4-వ సర్గము

మాల్యవదాదుల చరిత్రము

ఇట్లగస్త్యుఁడు చెప్పిన కథ విని పూర్వము "లంకలో రాక్షసు లెట్లు పుట్టిరి?" యని యాశ్చర్యపడి శిరస్సు కంపింపఁజేసి త్రేతాగ్నితో సమానమై వెలుఁగుచున్న దేహముగల యగస్త్యునివైపు మాటిమాటి కిని జూచుచుఁ జిఱునగవు మొగము నలంకరింప శ్రీరామచంద్రుఁ డిట్లనియె: "మహాత్మా! పూర్వమందుగూడ నాలంకలో రాక్షసు లుండెడివా రని యిపుడు తాము సెలవిచ్చినసంగతి విన్నప్పటినుండియు నాకు మిక్కిలి యాశ్చర్యము గలుగుచున్నది. ఇదివఱకు రాక్షసులు పులస్త్య వంశములోఁ బుట్టినవా రనియే నేను వినియున్నాను. అంతకు ముందు కూడ నెందఱెందఱో రాక్షసు లున్నట్లు తా మిప్పుడు సెలవిచ్చితిరి. అటులేని యారాక్షసులు రావణుఁడు, కుంభకర్ణుఁడు, ప్రహస్తుఁడు, వికటుఁడు, రావణునికొడుకులు మొదలగువారి:ఁ బెను బలవంతులా? వారికి మూలపురుషుఁ డెవఁడు? వానిపే రేమి? వానిబల మెట్టిది? వారేమి యపరాధ మొనరించి రని విష్ణుమూర్తి వారి నచ్చటినుండి వెడలఁ గొట్టెను? ఈసంగతియంతయు విస్తరించి నాకుఁ జెప్పఁగలయమును. సూర్యుఁడు చీఁకటిని బోఁగొట్టునట్లు తాము నాసందేహమును బోఁగొట్టుదురుగాక!" అని యిట్లడిగిన శ్రీరామునివాక్యములు విని కొంచెము నవ్వుచు సంస్కారాలంకృతవాక్చాతుర్యధురీణుఁడగు నారాముని తో నగస్త్యుఁ డిట్లనియె:

పద్మసంభవుఁ డగు బ్రహ్మ పూర్వ ముదకములను సృజించి వానినిఁ గాపాడుటకై జంతువులను గొన్నింటిని సృజించెను. ఆజంతువు లాఁకలి దప్పికలచేతను భయముచేతను బీడింపఁబడిన వై తమ్ము సృజించిన బ్రహ్మ

యొద్దకు వచ్చి వినయముగా నిలువఁబడి "యేమిచేయుదుము?" అని యడిగి నవి. ఆమాట విని బ్రహ్మ "మీ రీయుదకములను బ్రయత్నపూర్వకముగా రక్షించుచుండుఁ"డని నవ్వుచు ననియె. అందుఁ గొన్ని సత్త్వముల రక్షింతు మనియు, మఱికొన్ని జక్షింతు మనియుఁ జెప్పినవి. ఇట్లాఁకలి గొనియు నాఁకలిగొనకయు నున్న సత్త్వములు చెప్పినమాటలు విని భూత కర్త యగు బ్రహ్మ వానిని జూచి "మీలో రక్షింతు మన్న వారు రాక్షసులును, జక్షింతుమన్న వారు యక్షులును" నగుదురుగాక యనియెను.

ఆసత్త్వములలో రాక్షసాధిపతులును, మధుకైటభులతో సమానులును, శత్రుసంహారకులును నగు హేతి ప్రహేతి యనునిద్ద ఱన్నదమ్ములు గలరు. ఆయిద్దఱిలోఁ బ్రహేతి ధర్మాత్ముఁడై తపస్సు చేసికొనుటకుఁ బోయెను. హేతియనువాఁడు పెండ్లి చేసికొనుటకై మిక్కిలి ప్రయత్నించుచుండెను. మహామతి యగునా హేతి తానే ప్రయత్నించి తుదకు యమునిచెల్లెలు, భయమును గలిగించునదియు నగు భయ యనుపేరుగలదానిని బెండ్లియాడెను. రాక్షసశ్రేష్ఠుఁడగు నా హేతి యా మెయందు విద్యుత్కేశుఁ డనునొకకుమారునిఁ గనియెను. హేతికొడుకగు నావిద్యుత్కేశుఁడు ప్రచండసూర్యునితో సమానమైన కాంతిగలవాఁడై నీటిలోని పద్మమువలె వృద్ధిని బొందుచుండెను. అతనికి యౌవనము రాఁగానే తండ్రి పెండ్లిచేయుటకుఁ బ్రయత్నించెను. అట్లు ప్రయత్నించి హేతి సంధ్యయనుదానికూఁతును సంధ్యాసమప్రభావము గలదియు నగు సాలకటంకట యనుపేరు గలగానిని దనకొడుకుకొఱకు వరించెను. "ఇది యితరుల కెవ్వరికైనను నీయఁదగినదియే కదా!"యని యాలోచించి యాసంధ్య తనకూఁతును విద్యుత్కేశున కిచ్చినది. విద్యుత్కేశుఁడు రాక్షసుఁడు సంధ్యకూఁతుం బెండ్లియాడి యామెతోఁగూడి శచీదేవితో నింద్రుఁడు క్రీడించుచుండునట్లు క్రీడించుచుండెను. కొన్నాళ్లకు సంధ్యకూఁతు సాలకటంకటయనునది సముద్రునివలన మేఘుపంక్తివలె విద్యుత్కేశుని వలన గర్భమును ధరించినది. తదనంతర మామె గంగ కుమారుని గన్నయట్లు మందరపర్వతప్రాంతమున నొక కుమారునిఁ గన్నది. ఆమె విద్యుత్కేశుని రతియందాసక్తురాలై పుట్టినబిడ్డ నచ్చటనే విడిచి వచ్చి మగనితోఁ గ్రీడించుచుఁదుదకుఁ గొడుకుసంగతియే మఱచిపోయినది. తల్లి విడిచిపెట్టి పోయినతరువాత మేఘగర్జనతో సమానమైన స్వరముగలవాఁడును శర

తా్రలసూర్యనికాంతివంటి కాంతిగలవాఁడును నగు నాశిశువు పిడికిలి నోటియందుంచుకొని మెల్లఁగా నేడువ మొదలిడెను. అంతట్ఁ బార్వతీ పరమేశ్వరులు వృషభవాహనముపైఁ గూర్చుండి యాకాశమార్గమునఁ బోవుచు నాశిశువుయొక్క రోదనధ్వని వినిరి. వెంటనే దయపుట్టి వారిద్దఱును దగ్గఱగా వచ్చి యాయేడ్చుచున్న శిశువును జూచిరి. అక్షరుఁడును నవ్యయుఁడును నగు మహాదేవుఁడా రాక్షసశిశువునుదల్లితో సహానమైన యీడుగలవానినిగాను, చావులేనివానినిగాను జేసి పార్వతియొక్క సంతోషముకొఱకుఁగా నాకాశమువీఁదను బోవఁదగిన యొకపట్టణము నతనికి దయచేసెను. అప్పుడు పార్వతిగూడ రాక్షసులకు సద్యోగర్భము సద్యఃప్రసూతితత్తుణమే వయఃప్రాప్తితల్లితోసమానమైనయీడుగలిగి యుండుట వరముగా నిచ్చినది. తరువాతను వరప్రాప్తిచే గర్వించియున్న యాసుకేశుఁడను రాక్షసుఁడు ప్రభువగు నీశ్వరునిదయవలన నైశ్వర్యవంతుఁడై యాకాశమార్గమున సంచరింపఁదగిన పట్టణమును పొంది దేవేంద్రునివలె సుఖముగా విహరించుచుండెను.

ప-వ స ర్గ ము

మాల్యవదాదుల వృత్తాంతము

శ్రీరామచంద్రా! ఇట్లు సుకేశుఁడనురాక్షసుఁడు వరములను బొందియున్న వాఁడనియు, ధర్మాత్ముఁడనియుఁ దెలిసికొని విశ్వావసునితో సమానకాంతిగల గ్రామణి యనుపేరుగల గంధర్వుఁడు దేవవతి యను పేరుగల తనకూఁతును రెండవలక్ష్మివలె మూఁడులోకములయందును బ్రసిద్ధమైనదానిని రూపయౌవనములుగలదానిని, రాక్షసలక్ష్మియోయనఁ దెచ్చి యథావిధిగా నాసుకేశున కిచ్చి పెండ్లిచేసెను. వరములు పొంది మహైశ్వర్యసంపన్నుఁడై యున్న పెనిమిటి, తన కిష్టమైనవాఁడు దొరకుటచే నాదేవవతి యనుసుందరి ధనము దొరకిన బీదవానివలె సంతోషించినది. అంజనపర్వతమునుండి బయటకు వచ్చిన యేనుఁగుగున్న యాఁడేనుఁగును గూడి సంతోషించుచుండున ట్లాసుకేశుఁడాదేవవతితోఁ గూడి మిక్కిలి సంతోషించుచుండెను. శ్రీరామా! ఆసుకేశుఁడనురాక్షసుఁడాదేవవతి యనుసుందరియందుఁ ద్రేతాగ్నిహోత్రములతో సమానముగా వెలుంగుచున్న ముగ్గురు కుమారులను గనియెను. వారికి మాల్య

వంతుఁ డనియు, సుమాలి యనియు, మాలి యనియుఁ బేరులు పెట్టిరి. వారు ముగ్గురును బలవంతులు. ఆరాక్షసుఁడు గన్నయామ్ముగ్గురును త్రిజగత్త్రునిఁబోలు రూపముగలవారై మూఁడులోకములవలెను, మూఁడగ్నులవలెను, మూఁడుమంత్రములవలెను, ఘోరమైన మూఁడురోగములవలెను నిర్భయులై, భయంకరులై, సమయమును గనిపెట్టి చికిత్స చేయకుండ నుపేక్షించిన రోగములవలె వృద్ధినొందుచుండిరి.

వారు తమతండ్రి యీశ్వరునిదయవలన వరములు పొందినసంగతి దెలిసికొని ముగ్గురును మేరుపర్వతమునకుఁ దపస్సు చేసికొనుటకై పోయిరి. శ్రీరామా! ఇట్లు వారు తపస్సు చేసికొనుటకు నిశ్చయించుకొని ఘోరమయిన నియమముల నవలంబించి సమస్తభూతములకును భయము గలుగునట్లుగా ఘోరమైన తపస్సును జేయుచుండిరి. సత్యము ఆర్జవము, శమము మొదలగు గుణములతోఁ గూడినవియు నితరులచేఁ జేయ శక్యముగానివియు నగువారితపస్సులచే మూఁడులోకములవారికిని సంతాపము గలుగ మొదలిడినది. అప్పుడు చతుర్ముఖుఁడు విమాన మెక్కి వచ్చి "మీతపస్సులకు మెచ్చితిని, మీకు వరముల నిచ్చెద"నని పలికెను. ఇంద్రాదిదేవతలతోఁ గూడి వర మిచ్చుటకు వచ్చిన బ్రహ్మను జూచి యా ముప్వ్వురును జేతులు జోడించుకొని గాలిచేఁ గదలుచున్న వృక్షములవలె నెదుట నిలువఁబడి యిట్లని విన్నవించిరి: "దేవా! మీతపస్సులచే నీకు సంతోషము గలిగి మాకు వరము లిచ్చుటకై వచ్చినచో మాయుద్దేశములు విన్నవించెదము వినుము. మే మెవ్వరిచేతను బరాజయమును నొందనట్లును, సకలశత్రువులను సంహరించునట్లును, దీర్ఘాయుష్మంతులుగనుండునట్లును, బ్రభవిష్ణులగునట్లును మాకు వరములు దయచేయవలయు" నని కోరఁగా బ్రహ్మణులయందుఁ బ్రీతిగలయా బ్రహ్మమీకోరినప్రకారమే వరముల నిచ్చితి నని చెప్పి సత్యలోకమునకుఁ బోయెను.

రామా! ఇట్లు వారు ముగ్గురును బ్రహ్మవలన వరములు పొంది యేవిధమయిన భయమును లేక మూఁడులోకములవారిని బాధింప మొదలిడిరి. వారిచే బాధింపఁబడుచున్న దేవతలు, ఋషులు, సిద్ధులు, సాధ్యులు, చారణులు మొదలగువారు నరకమునందలి జీవులవలె రక్షకునిఁ గానలేకపోయిరి. తరువాత నాముగ్గురు రాక్షసులును శిల్పశ్రేష్ఠుఁ

డగువిశ్వకర్మను బిలిపించి యిట్లనిరి: "ఓయీ విశ్వకర్మా! ఓజస్సుచేతను, తేజస్సుచేతను, బలముచేతను గొప్పగా రనిపించుకొనుచున్న దేవతలకు గృహములు నిర్మించి యిచ్చినవాఁడవు నీవే యని తెలియవచ్చుచున్నది. కావున మాకుఁగూడ మంచుకొండమీఁదఁగాని మేరుపర్వతముపైని గాని మందరపర్వతమునందుఁగాని మహేశ్వరుని గృహముతో సమానముగా మనోహరమైన గృహమును సిద్ధముచేయుము." ఇట్లు చెప్పిన రాక్షసులమాటలు విని విశ్వకర్మ యిట్లనియె: "రాక్షసేశ్వరులారా! దక్షిణసముద్రతీరమునఁ ద్రికూట మనియు, సువేలమనియు రెండుపర్వతములు గలవు. మేఘములతో సమానమైనదియు, పక్షులైనను జేరుటకు వీలుకానిదియు, ఉలులచేఁజెక్కఁ నలుమూలలు దీర్ఘబడినదియు నగు నా త్రికూటపర్వతముయొక్క మధ్యమశిఖరమునందు ముప్పదియోజనముల విస్తీర్ణమును, నూఱుయోజనములపొడవును, బంగారుప్రాకారములచేఁ జుట్టఁబడినదియు, స్వర్ణతోరణములచే నావరింపఁబడినదియు నగు లంకా పట్టణమును రెండవస్వర్గపట్టణమువలెనే దేవేంద్రునియాజ్ఞాప్రకారము నేను గట్టియించితిని. మీ రాపట్టణమునకుఁబోయి నివాస మేర్పఱుచు కొనుఁడు. ఇంద్రాదిదేవతలు స్వర్గపట్టణమం దున్నట్లు మీరును జాలమంది రాక్షసులతోఁగూడి యాలంకాదుర్గములో నుంటిరేని మి మ్మెవ్వరును జేఱఁజాలరు.

అంత నారాక్షసోత్తములు విశ్వకర్మ చెప్పినమాటలు విని చాల సంతోషించి వేలకొలఁది పరిజనులను వెంటఁబెట్టుకొని యాలంకాపుర ములోఁ బ్రవేశించిరి. దృఢమైన ప్రాకారములు పరిఖలు గలిగి బంగారు మయములైన గృహములు గలిగి యొప్పారుచున్న యాలంకాపురి వారి కమందమైన యానందమును గూర్చినది. ఇట్లుండఁగా నింతట నర్మద యను గంధర్వస్త్రీకి హ్రీ, శ్రీ, కీర్తులతో సమానమయిన కాంతిగల ముగ్ధుర కూఁతుం ద్రుండెడివారు. ఆమె తన ముగ్ధురకూఁతుండ్రను దెచ్చి పెద్ద వానికిఁ బెద్దకూఁతును, రెండవవానికి రెండవకూఁతును, మూఁడవవానికి మూఁడవకూఁతును నిచ్చి మఖానక్షత్రముతో కూడుకొనిన మంచి ముహూర్తమునందుఁ బెండ్లిచేసినది. సుకేశునికుమారులగు నామాల్య వంతుఁడును సుమాలియు మాలియు, దేవత లచ్చరలతోనలె నీముగ్ధురి తోడను నిచ్చకువచ్చినమచ్చున విహరించుచుండిరి. తరువాత మాల్య

వంతునిభార్యయగు సుందరి యను పేరుగల సుందరికి వజ్రముష్టి, విరూపాక్షుఁడు, దుర్ముఖుఁడు, సుప్తఘ్నుఁడు, యజ్ఞకోపుఁడు, మత్తుఁడు, ఉన్మత్తుఁడు నను నేమగురుకొడుకులును, అనల యను పేరుగల కూఁతురును బుట్టిరి. పున్నమచందురునితో సమానమైన ముఖము గల సుమాలి భార్య పేరు కేతుమతి. ఆమె వానికిఁ బ్రాణములకంటెను నధికప్రియురాలు. సుమాలివలన నాకేతుమతియందుఁ గలిగిన సంతానము పేర్లు చెప్పెద నాలింపుము. ప్రహస్తుఁడు, అకంపనుఁడు, వికటుఁడు, కాలకార్ముకుఁడు, ధూమ్రాక్షుఁడు, దండుఁడు, సుపార్శ్వుఁడు, సంహ్రాది; ప్రఘసుండు, భాసకర్ణుఁడు నను కొడుకులును, రాక, పుష్పోత్కట, శుచిస్మిత యగు నైకసి, కుంభీనస యను కుమారితలును బుట్టిరి. మాలి యను రాక్షసునిభార్య పేరు వసుధ. ఆమె మిక్కిలి రూపసి. తామరతేకులవంటి కన్నులు గలది. స్వకీయగు యక్షసుతవలె నెంతయుఁ జక్కనిది. మాలి కాయువతి యందుఁ బుట్టినసంతతిసంగతి చెప్పెదను వినుము. అనిలుఁడు, అనలుఁడు, హరుఁడు, సంపాతి యను నలుగురకుమారులుమాత్రము పుట్టిరి. వీరే విభీషణుని నలుగురమంత్రులును నైరి. ఇట్లారాక్షసశ్రేష్ఠులు ముగ్గురును బుత్రులతోడను దక్కిన రాక్షసులతోడను గూడినవారై యింద్రాదిదేవతలను, ఋషులను, నాగులను, దానవులను బాధించుచు నుండిరి. వారు బాహుబలముచే గర్వించి యెవ్వరికిని లొంగక గాలివలె నెక్కడఁ జూచినను దామే యై రణభూమిలో శత్రువులను జయించుచు మృత్యువును గూడ లక్ష్యము సేయక సమస్త యజ్ఞములను నాశమునొందించుచు వర గర్వితులై తిరుగుచుండెడివారు.

6-వ సర్గము

సురలు ఋషులు శివుని రాక్షసులఁ జంపవేఁడుట

శ్రీరామచంద్రా! ఈరీతిగా బాధింపఁబడినవారై దేవతలును, తపోధనులగు ఋషులును భయార్తులై దేవదేవుఁడును, మహేశ్వరుఁడును, జగత్తులను బుట్టించుచుఁ బెంచుచు నశింపఁజేయుచు నుండెడివాఁడును, పుట్టువు లేనివాఁడును, స్పష్టముగాని రూపము గలవాఁడును, సమస్త లోకములకును నాధారభూతుఁడును, అందఱిచేతను ఆరాధింపఁదగినవాఁడును, పరమగురువును, మన్మథుని సంహరించినవాఁడును, త్రిపురా

సురులను నశింపఁ జేసినవాఁడును, మూఁడుకన్నులు గలవాఁడును అగు నీశ్వరుని శరణుజొచ్చి చేతులు జోడించుకొని భయముతో గద్గదస్వర మున నిట్లనిరి:

"సమస్తమైన ప్రజలకును ఆధ్యక్షుఁడవగునోశంకరా! బ్రహ్మదేవుని వరములవలన గర్వించి శత్రుసంహారము చేయఁబూనిన సుకేశునికొడు కులు సమస్తప్రజను బాధించుచున్నారు.మాయాశ్రమములుమాయింప్లు శూన్యముగాఁ జేసివైచిరి. స్వర్గమునుండి దేవతలను దరిమివైచి వారే దేవతలవలె స్వర్గములో విహరించుచున్నారు. మాల్యవంతుఁడు, మాలి, సుమాలియు నేనే విష్ణువును, నేనే రుద్రుఁడను, నేనే బ్రహ్మను, నేనే దేవేంద్రుఁడను, నేనే యమునుఁడను, నేనే వరుణుఁడను, నేనే చంద్రుఁ డను, నేనే సూర్యుఁడను అని మమ్ముల నందఱను బాధించుచున్నారు. వా రెప్పుడు చూచినను యుద్ధసన్నద్ధులై కనుపట్టుచున్నారు. మఱియు వారియనుచరులును నట్లే బాధించుచున్నారు. దేవా! భయార్తులమగు మా కభయదానము దయచేయుము. భయంకరమైనశరీరము నవలంబించి దేవాదులను బాధించు నారాక్షసులను జంపుము." అని యిట్లు దేవతలు మొఱలగుహారు విన్నవింపఁగా నాయీశ్వరుఁడు సుకేశునియందలి పక్ష పాతముచే దేవతలతో నిట్లనియె:

"ఓదేవతలారా! మహర్షులారా! నేను వారిని జంపఁజాలను. మఱియు నారాక్షసులు నాచేఁ జచ్చువారును గారు. కాని వారిని జంపు నుపాయమును మీకుఁ జెప్పెదను. నాయాలోచనప్రకారముగా మీ రందఱును విష్ణుమూర్తిని శరణు పొందుఁడు. ప్రభువగు నాయన వారిని దప్పక చంపఁగలఁడు." అని యుపాయమును జెప్పఁగానే రాక్షసులభయ ముచేఁ బీడితులయినదేవత లందఱును జయజయశబ్దములచే నీశ్వరుని గొనియాడి విష్ణునిసమీపమునకుఁ బోయిరి. ఇట్లు పోయి శంఖచక్రగదా ధరుఁడగు నావిష్ణుదేవునికి నమస్కరించి తొట్రుపాటుపడుచు నారాక్షసు లనుగూర్చి యిట్లు విన్నవించిరి: "దేవా! త్రేతాగ్నిహోత్రములతో సపూనులగు సుకేశునికొడుకులు ముగ్గురును బ్రహ్మవరముచే గర్వించి మాస్థానముల నాక్రమించికొనిరి. త్రికూటపర్వతపు శిఖరమునందు లంక యను పట్టణము గలదు. అది చొరశక్యముగానిది. ఆరాక్షసు లాలంక లో నుండి మమ్ములనందఱను బాధించుచున్నారు. మధుసూదనా! నీవు

మా మేలుకొఱ కారాక్షసులను జంపుము. దిక్కు లేని మేము నిన్ను శరణు చొచ్చితిమి. నీవే మాకు దిక్కు. నీ చక్రముచే వారిశిరస్సులను ఖండించి యముని కప్పగించుము. భయము గలిగినప్పు డభయమిచ్చువారు నీకంటె మాకు వేఱుగా లేరు. గర్వించి మమ్ములను బాధించుచున్న యా దురాత్ములను సపరివారముగా జంపి, సూర్యుడు మంచును మాయించు నట్లు మాభయమును మాలుంపుము".

ఈరీతిగా దేవతలందఱును విన్నవింపఁగావిని దేవదేవుఁడగు విష్ణు మూర్తి శత్రువులను జంపెద ననిదేవతల కభయమిచ్చి యిట్లనియె: "దేవతలారా! ఈశ్వరుఁ డిచ్చినవరములచే గర్వించి యున్న సుకేశుఁడను రాక్షసు నెఱుఁగుదును. వానికొడుకులు ముగ్గురినిగూడ నే నెఱుఁగుదును. వారిలో మాల్యవంతుఁడు పెద్దవాఁడు. మర్యాద నతిక్రమించియున్న యారాక్షసుల నందఱను నేను జంపెదను. నాకును గోపము వచ్చినది. మీ రింక భయపడక యుండుఁడు." ప్రభవిష్ణుఁడగు విష్ణుఁ డీరీతిగాఁ జెప్పఁగానే సంతోషించి దేవతలందఱును విష్ణుమూర్తిని గొనియాడుచుఁ దమతమనివాసములకుఁ బోయిరి.

ఇచ్చట లంకలో మాల్యవంతుఁడు దేవతలప్రయత్నమువిని వీరు లగు తనతమ్ములతో నిట్లనియె: "తమ్ములారా! దేవతలును, ఋషులును గలిసి మనచావును గోరుచు శివునిపాలికిఁబోయి యిట్లు విన్నవించిరఁట: 'దేవా! శంకరా! సుకేశునితనయులు వరదానబలముచే గర్వించి మాటి మాటికిని మమ్మును బాధించుచున్నారు. వారు మహాఘోరరూపులు. ఆ రాక్షసులు చేయునల్లరి సహింపశక్యము గాకుండ నున్నది.ఆదురాత్ములకు భయపడిమామాస్థానములను విడిచిపెట్టితిమి. కావున నో త్రినేత్రా! మా మేలుకొఱ కారాక్షసులను జంపుము. శత్రువులను దహించుటలో నీవంటి దేవుఁడు లేఁడు. కావున నారాక్షసుల నొక్కహుంకారముచేదహించుము' అని యిట్లు దేవతలు మొఱ్ఱలిడఁగా నంధకసంహార మొనరించినశివుఁ డాలకించి చేతులు శిరస్సు కంపింపఁజేయుచు వారితో నిట్లనెనఁట: 'దేవతలారా! సుకేశునికొడుకులను నేను యుద్ధములోఁ జంపఁజాలను. ఎవరారాక్షసులను జంపఁగలరోవారిని జెప్పెదను. నాయాలోచన విని మీరాయనదగ్గఱకుఁ బొండు. విష్ణుమూర్తి వారినిఁ జంపఁగలఁడు. కావున మీరాతనిపాలికిఁ బొండు' అని యాలోచనచెప్పిన శివునికి నమస్కరించి

విష్ణునియొద్దకుఁబోయి సర్వమును విన్నవించుకొనిరఁట! ఆతఁడును మన
నందఱను జంపెద నని వారి కభయఁడాన మిచ్చెనఁట! భయభీతులగు దే
తలనిమిత్తమై మనలను జంపుటకు విష్ణుమూర్తి ప్రతిజ్ఞ పట్టియున్నాఁడఁ
కావున ముందుసంగతి యాలోచింపవలసియున్నది. అతఁడు హిరణ్యక
పుఁడు మొదలైన రాక్షసులను జంపియున్నవాఁడు. సముచి, కాలనేమి
వీరసత్తముఁడగు సంహ్రాదుఁడు, మహామాయాధురంధరుఁడగు రా
యుఁడు, యమళార్జునులు, హార్దిక్యుఁడు, శుంభుఁడు, నిశుంభుఁడు మొ
లగువారును, నుఱియుఁ బరాజయ మన నెట్టిదో యెఱుంగనివారును
వందలకొలఁది యజ్ఞములు చేసినవారును, సర్వాస్త్రకుశలులును, శత్ర
భయంకరులును, మహాబలవంతులును, మాయావిదులును అగు రాక్షసు
నెందఱనో యుద్ధములలోఁ జంపియున్నాఁడు. ఈసంగతియంతయు నాలో
చించి యిప్పుడు మనము చేయవలసినదానిని జేయుట యుక్తము.

ఇట్లు చెప్పిన మాల్యవంతునిమాటలు విని మాలియు సుమాలియ
నుష్మనీదేవతలు దేవేంద్రునితో నన్నట్లుగా నిట్లనిరి. "మనము బాగుగా
జదువుకొంటిమి. దానములుచేసితిమి. యజ్ఞము లెన్నేనిఁ జేసితిమి. వల
నంత యైశ్వర్యమును బొంది పరిపాలించితిమి. నిరామయమగు వాయ
వును సంపాదించుకొంటిమి. తోఁచఁ బెట్ట శక్యముంగాని దేవసముద్రమున
శస్త్రములతో నవగాహించితిమి. నిరుపమానులగు శత్రువులను జయిం
తిమి. కనుక మనకు మృత్యువువలన భయములేదు. నారాయణుఁడు
గాని, రుద్రుఁడు గాని, దేవేంద్రుఁడు గాని, యముఁడు గాని మనయెదు
టికివచ్చి నిలువఁబడఁజాలరు. ఎప్పుడును మన కందఱును భయపడుచు
యుందురు. రాక్షసేశ్వరా! విష్ణునకు మనమీఁద ద్వేషము గలుగుటకు
గారణ మొకింతయుఁ గానరాదు. దేవతలే మనపైని లేనిపోనిమాటల
చెప్పి విష్ణునిమనస్సును బాడుచేసియుందురు. కనుక మన మిప్పుడు సై
సమేతులమై బయలుదేఱి దేవతలనే హింసింతము. వారేకదా మనపై
విష్ణున కింతద్వేషమును గలుగఁజేసినవారు."

బలవంతులగు నారాక్షసు లిట్లాలోచించుకొని తమయేర్పాటిన
జాటించి సైన్యసమేతులై జంభవృత్రబలాసురులవలె యుద్ధముచేయ
తాత్పర్యముతో స్వర్గమువైపునకు బయలుదేఱిరి. రామా! వార
బయలుదేఱునపుడు గొప్పగొప్పరథములు, కొండలవంటి యేనుఁగులు

గుఱ్ఱములు, గాడిదలు, వృషభములు, ఒంటెలు, శింశుమారములు, పాములు, మొసళ్లు, తాబేళ్లు, చేపలు, గరుత్మంతునితో సమానమైన పక్షులు, సింహములు, పెద్దపులులు, వరాహములు, స్మమరమృగములు, చమరమృగములు మొదలగు వాహనములు సిద్ధపఱుచుకొని లంకా పట్టణమును విడిచి రాక్షసులందఱును బలగర్వితులై దేవలోకమును ముట్టడించుటకుఁ బ్రయాణమైరి. వారు ప్రయాణము కాఁగానే లంకకుఁ జేటు మూడునని లంకలోనుండు భూతములన్నియు భయమునుజూపుచుఁ గలఁతఁజెందియుండినవి. వేలకొలఁది లక్షలకొలఁది కోట్లకొలఁది రాక్షసులు తమతమవాహనము లెక్కి వేగముగాఁ బ్రయత్నపూర్వకముగా దేవలోకమునకుఁ బోవుచుండిరి. రాక్షసులతోడనే లంకలోని దైవతములన్నియుఁ దొలఁగిపోయినవి. కాలముచేఁ బ్రేరేపింపఁబడి భూతములు మిక్కిలి భయమును జూపింప మొదలిడినవి. రాక్షసులకు వినాశమును దెల్పుచు భూమియందును, అంతరిక్షమునందును భయంకరముగా నుత్పాతములు బయలుదేఱినవి. మేఘములు వేఁడివేఁడిరక్తమును, ఎముకలను వర్షింపమొదలిడినవి. సముద్రములు పొంగి చెలియలిగట్టు దాఁటినవి. పర్వతములు కదలఁజొచ్చినవి. జీవజంతువులు ఘోరమైన రూపములను ధరించి ప్రళయకాలపుమేఘములతో సమానమైనధ్వనితో మిక్కిలిగానట్ట హాసములుచేయుచు నక్కలు దారుణముగాఁ గూయ మొదలిడినవి. క్రమముగా భూతములువచ్చి పడుచున్నట్టు కనుపట్టుచున్నవి. గ్రద్దలు గుంపులు గూడి నోటినుండియగ్నిహోత్రకణములనుమిగుచు రాక్షసులమీఁదుగా నాకాశమునందుఁ గొఱకచ్చు త్రిప్పినట్లు తిరుగుచున్నవి. కపోతములు, రక్తపాదము లనుపక్షులు, గోరవంకలు భయపడి పాఱిపోవుచున్నవి. కాకులు, పిల్లులు మొదలగునవి యార్చుచున్నవి.

బలగర్వితులగు రాక్షసులు మృత్యుపాశములచేఁ గట్టువడి యున్న వార లగుటంజేసి యాయవశకునములను లక్ష్యము సేయక ముందఱకు పోవుచునే యున్న వారు గాని వెనుకకు మరలరైరి. యజ్ఞముల కగ్ని హోత్రములవలె మహాబలవంతులగు మాల్యవంతుఁడు, మాలి, సుమాలి యను ముగ్గు రన్నదమ్ములును తమసైన్యమునకు ముందఱగా నడుచుచున్నారు. దేవతలందఱును బ్రహ్మదేవుని నాశ్రయించుకొని యున్నట్లు రాక్షసు లందఱును మాల్యవత్పర్వతమునంటి మాల్యవంతు నాశ్రయిం

చుకొని యుండిరి. మాలి సేనానాయకుఁడుగా నున్న యా రాక్షససైన్య మంతయుఁ బ్రళయకాలపు మేఘమువలె గర్జించుచు జయమును బొందు నిచ్ఛతో స్వర్గలోకమునకుఁ బోవుచుండెను.

ఇట్లు రాక్షసు లందఱును యుద్ధోద్యోగు లయి బయలుదేఱి రన్న సంగతి దేవదూతవలన విని ప్రభువగు నారాయణుఁడు యుద్ధమువిష యమై సంకల్పించెను. అతఁడప్పుడే యాయుధముల నన్నింటిని సిద్ధము చేసికొని వేయిమందిసూర్య లుదయించినట్లు వెలుఁగుచున్న కవచముదొ డిగికొని, బాణములతో నిండియున్న యమ్ములపొదులు గట్టుకొని,పీతాం బరము బాగుగా సవరించుకొని శంఖము, చక్రము, ఖడ్గము, గద, శార్ఙ్గ మనుధనుస్సు చేతఁ బట్టుకొని మేరుపర్వతమువలెఁ బ్రకాశించు గరుత్మం తునిపైని గూర్చుండి రాక్షససంహారముకొఱ కతివేగముగా బయలు దేఱెను. పచ్చనివస్త్రములను గట్టుకొని వర్షాకాలమేఘమువలెఁ బ్రకాశిం చుచు గరుత్మంతునిమీఁదను గూర్చుండి వచ్చుచున్న యావిష్ణుమూర్తి మేరుపర్వతశిఖరముపై మెఱుపుతోఁ గూడిన వర్షాకాలమేఘమువలెఁ గనుపట్టుచుండెను. ఆయన సిద్ధులు, దేవతలు, ఋషులు, పన్నగులు, గంధర్వులు, యక్షులు మొదలగువారిచేఁ గొనియాడఁబడుచు సమస్తా యుధములను ధరించి దేవసైన్యమును గలిసికొనెను. ఆయన రాఁగానే యారాక్షససైన్యమంతయు గరుత్మంతుని తెక్కల గాలిచేత క్షోభ పెట్టఁబడిన బలముగలదియు, గిరగిరఁ దిరుగుచున్న జెండాలుగలదియు, చెల్లాచెదరైపోయిన యాయుధములు గలదియునై కదలుచున్న రాళ్లు గల కాటుకకొండవలెఁ జలించినది. తరువాతను రక్తముచేతను బూయఁ బడిన తెక్కలు గలిగి ప్రళయకాలపుటగ్నివలె మండుచున్న యాకార ములుగల బాణములచేతను వేలకొలఁది రాక్షసులు విష్ణుమూర్తినిజుట్టు వాఱుకొని వివిధాయుధములతోఁ గొట్ట మొదలిడిరి.

7-వ సర్గము

రాక్షసులతోడి యుద్ధము

శ్రీరామచంద్రా! ఆరాక్షసులు గర్జించుచుఁ బర్వతమువైని మేఘ ములు వర్షించినట్లు విష్ణుమూర్తిపైని బాణవర్షము గురిపించిరి. నల్లని

దేహాములుగల యారాక్షసులు బాణవర్షమును గురియుచు ఘ్యానుల మూర్తియగు విష్ణుమూర్తి నావరించి యున్నప్పు డతఁడు వర్షించుచున్న మేఘములచే నావరింపఁబడిన కాటుకకొండవలెఁ బ్రకాశించుచుండెను. సస్యపూర్ణమైన క్షేత్రమునందుమిడుతలదండువలెను,కొండపైని దోమల వలెను, అమృతఘటముచుట్టును ఈఁగలవలెను, సముద్రములో మొసళ్లవలెను, పిడుగులకంటెను గాలికంటెను మనస్సుకంటెను వేగముగల రాక్షసులధనుస్సునుండి బయలుదేరిన బాణములు ప్రళయాంతమునందు లోకములవలెనే యావిష్ణునియందుఁ బ్రవేశించినవి.రథికులు రథములమీఁదను, హస్తికులేనుఁగులమీఁదను, ఆశ్వికులు గుఱ్ఱములమీఁద నుండియు,కాలి బంటు లంతరాళమున నిలిచియు నీరీతిగా రాక్షసులు కొండలవంటివారు, శక్తులు, అస్త్రులు, తోమరములు మొదలగు నాయుధములచేఁ బ్రాణాయామములు ద్విజుని కూపిరి యాడనీయనట్లు విష్ణుమూర్తి కూపిరి యాడనీయకపోయిరి. ఈరీతిగా రాక్షసులచేతఁ జేపలచే సముద్రుఁడు గొట్టఁబడినట్లుగాఁ గొట్టఁబడి, ధర్షింప శక్యముకాని యావిష్ణుమూర్తి తనశార్ఙ్గ మనుధనుస్సు నెక్కుపెట్టి రాక్షసులపై బాణవర్షము గురిపింప నారంభించెను. పిడుగులవలెనమోఘమైన ముఖములు గలిగి మనస్సుకంటెను వేగముగల బాణముల నాకర్ణాంతము లాగి ప్రయోగించి విష్ణుమూర్తి వేలకొలఁది రాక్షసులశిరస్సులను ఖండించెను. వర్షాకాలపు గాలి మేఘములఁ బరువెత్తించినట్లు బాణవర్షముచే రాక్షసులను బరువులెత్తించి పురుషోత్తముఁడగు విష్ణుమూర్తి పాంచజన్య మనుపేరుగల శంఖమూఁదెను. విష్ణుమూర్తి తనయావచ్ఛక్తిని వినియోగపఱచి యూఁదిన శంఖరాజము భయంకరమైనధ్వని గలవియై మూఁడులోకములను బీడించుచున్నట్లు కనుపట్టినది. అడవిలో సింహము మదించినయేనుఁగులను దనధ్వని చేతను భయపెట్టినట్లు, శంఖనాదము తనధ్వనిచేతను రాక్షసులను భయపెట్టినది. ఆశంఖము చప్పుడు వినఁగానే బలముచెడి గుఱ్ఱములు నిలువఁబడఁజాలకపోయినవి. ఏనుఁగులమద మణఁగిపోయినది. వీరులు రథములనుండి క్రిందఁబడిపోయిరి. పిడుగులవలె నమోఘమైన నోళ్లతో శార్ఙ్గ మనుధనుస్సునుండి బయలుదేఱిన బాణము లారాక్షసులను భేదించుకొని పుంఖములతోఁ గూడ భూమిలోఁ దూఱిపోయి

నవి. విష్ణుమూర్తి ప్రయోగించిన బాణములచేఁ జంపఁబడి వజ్రము చేఁ గొట్టఁబడిన కొండలవలె రాక్షసులు భూమిమీఁదఁ బడిపోయిరి. విష్ణుమూర్తి చక్రముచే నఱకఁబడిన రాక్షసుల దేహములనుండి కొండల నుండి స్వర్ణధారలవలె రక్తము స్రవింప మొదలిడినది. శంఖరాజము యొక్క ధ్వనియు, శార్ఙ్గమనుధనుస్సుయొక్క ధ్వనియు, వైష్ణవధ్వనియు రాక్షసులు చేయు ధ్వనిని భ్రుంగివేయుచుండెను. మఱియు నావిష్ణు మూర్తి కదలుచున్న వారి శిరస్సులను, జెండాలను, బాణములను, ధను స్సులను, రథములను, అమ్ములపొదులను బాణములచేఁ దెగఁగొట్టి క్రింఁద బడవైచుచున్నాఁడు. సూర్యునినుండి ఘోరమైనకిరణములు, సముద్రము నుండి తరఁగలు, పర్వతమునుండి నాగేంద్రములు, మేఘమునుండి వర్షధా రలు బయలుదేఱినట్లు విష్ణుమూర్తి చేతిలో నున్న శార్ఙ్గమనుధనుస్సునుండి బయలుదేఱుచున్న బాణములు వేగముగా వేలకొలఁది రాక్షసులను బరుగులెత్తించుచుండినవి. శరభమృగముతో సింహములువలెనే, సింహ ముతో నేనుఁగులువలెనే, యేనుఁగుతో వ్యాఘ్రములువలెనే, పెద్ద పులితోఁ జిఱుతజంతువులువలెనే, చిఱుతపులితోఁ గుక్కలువలెనే, కుక్కతోఁ బిల్లులువలెనే, పిల్లితోఁ బాములువలెనే, పాముతో నెలు కలువలెనే ప్రభవిష్ణుఁడగు విష్ణుమూర్తితో యుద్ధము సేయఁజాలక కొందఱు రాక్షసులు పాఱిపోవుచుండిరి. కొందఱు పాఱిపోయిరి. మఱికొందఱు భూమిమీఁదను బడిపోయిరి. ఈరీతిగా వేలకొలఁది రాక్షసులను జంపి మేఘమును దేవేంద్రుఁడు పూరించినట్లు విష్ణుమూర్తి శంఖమును పూరించినవాఁడాయెను. విష్ణుమూర్తి బాణముల దెబ్బలకును శంఖముయొక్క ధ్వనికిని భయపడి నిలువఁజాలక రాక్షసబలమంతయు లంకవైపు పారిపోవుచుండెను. విష్ణుమూర్తిచే దెబ్బలు దిని తమసైన్యము పాఱిపోవుచుండుట చూచి సుమాలి యనువాఁడు బాణములను వర్షిం చుచు విష్ణుమూర్తిని వారింప మొదలిడెను. తుదకు వాఁడు విష్ణుమూర్తిని బాణములచేతను మంచు సూర్యునిగప్పినట్లు గప్పెను. అది చూచి సత్వ సంపన్నులగు రాక్షసులు మరల ధైర్యము నవలంబించిరి.

పిమ్మట నారాక్షసుఁడు బలముచే గర్వించి రాక్షసులకు జీవములు వచ్చునట్లు సింహనాదములు సేయుచు వచ్చి విష్ణుమూర్తి నెదుర్కొనెను.

వేలాడుచున్న యాభరణములుగల తుండమును మీఁదికెత్తి జాడించు నేనుఁగువలెను, మెఱుపులతోఁగూడిన మేఘునివలెను సంతోషముచే నా రాక్షసుఁడు ధ్వని చేసెను. ఇట్లు సుమాలి అంకెలువై చుచుండఁగా వాని రథసారథియొక్క- శిరస్సును కుండలములచేఁ వెలుఁగొందుచున్న దానిని విష్ణుమూర్తి తెగఁగొట్టెను. వానిగుఱ్ఱములు గిరగిరఁదిరుగ సాఁగినవి. భ్రాంతములైన యాగుఱ్ఱములచేతనుబలు తెఱఁగులుగాఁబరువు లెత్తుచున్న యింద్రియములను గుఱ్ఱములచే ధైర్యము లేని మనుష్యుఁడు ద్రిప్పఁబడు చున్నట్లు సుమాలి ద్రిప్పఁబడుచుండెను. అట్లు సుమాలి రథము గుఱ్ఱ ములచేత నిటునటు నీడ్వఁబడుచుండఁగా, విష్ణుమూర్తిరథమున కడ్డముగా ధనుర్బాణములను పట్టుకొని మాలి పరుగెత్తెను. బంగారుచే నలంకరింపఁ బడి మాలిధనుస్సునుండి వెలువడినబాణములు హంసలు క్రౌంచపర్వత మునఁ బ్రవేశించినట్లు విష్ణుమూర్తియందుఁ బ్రవేశించినవి. అంతట నావిష్ణు మూర్తి మాలిప్రయోగించినబాణములచే వేలకొలఁది దెబ్బలు తిన్నవాఁ డయ్యు మనోవ్యాధులచే జితేంద్రియుఁడు కలఁత నొందనియట్లు కలఁత నొందకుండెను. పిమ్మట శత్రుసంహారకుఁడును భూతభావనుఁడునునగు విష్ణుభగవానుఁడు ధనుష్టంకారమును గావించి మాలిపైని బాణవర్ష మును వర్షించెను. వజ్రముతోడను మెఱుపులతోడను సమానమైన యాబాణ ములు వానిశరీరముఁకుఁ దగిలి పాము లమృతమును బీల్చినట్లు వాని రక్తమును బీల్చివైచినవి. శంఖచక్రగదాధరుఁడగు నావిష్ణుమూర్తి మాలిని విముఖునిగాఁ జేసి వానికిరీటమును, జెండాను, ధనుస్సును, గుఱ్ఱములను క్రిందఁ బడఁగొట్టెను. రాక్షసోత్తముఁడగు నామాలి విరథుఁడయ్యును గద పట్టుకొని యారథమునుండి కొండమీఁదినుండి సింగపుఁగోదమ గంతినట్లు క్రిందికి గంతెను. అంతకుఁ డీశానుని గొట్టినట్లు, దేవేంద్రుఁడు వజ్రముతోఁ గొండను గొట్టినట్లు మాలి తన గదచే గరుడుని నుదుటి మీఁదఁ గొట్టెను. అంత మాలిచే గదతో లెస్సగాఁ గొట్టఁబడినవాఁడై గరుత్మంతుఁ డపుడు విష్ణుమూర్తిని మోసికొనుచునే యుద్ధరంగమునుండి పాఱిపోయెను. ఇట్లు మాలిచేతను గరుత్మంతునిచేతను విష్ణుమూర్తిఁ బరా జ్ఞుఖుఁడుకాఁగానే సంతోషించుచున్న రాక్షసులలో నొకగొప్పశబ్దము బయలుదేఱినది. ఇట్లు సింహనాదములు చేయుచున్న రాక్షసులసంగతి కనిపెట్టి విష్ణుమూర్తి చాలఁ గోపించినవాఁడై యడ్డముగా నాగరుడునిపైఁ

గూర్చుండి పరాఙ్ముఖుఁడయ్యెను, మాలిని జంపఁగోరినవాఁడై చక్రమును ప్రయోగించెను. సూర్యమండలమువలె వెలుఁగుచున్న యాచక్రము తనకాంతిచే నాకసమును వెలిగింపఁజేయుచు వచ్చి కాలచక్రమువలెనే మాలియొక్క శిరస్సును గ్రిందఁబడవైచినది. చక్రముచే నఱికఁబడి భయంకరమైన యారాక్షసునిశిరము భూర్వము రాహువుశిరస్సువలెనేరక్తముఁ గ్రక్కుచుఁ గ్రిందఁబడెను. తరువాత దేవత లంపటును జూల సంతోషించి తమయాపచ్ఛత్రిని వినియోగించి సాధువాదములు గావించిరి.

ఇట్లు మాలి పడిపోవుట చూచి సుమాలియు మాల్యవంతుఁడును సైన్యముతోఁగూడ దుఃఖించుచులంకలోనికిఁబరుగెత్తిపోయిరి.గరుడుఁడు కొంతతడవునకు సేదఁదేరి మరలఁ నెప్పటియట్ల యుద్ధభూమివైపు మరలి కుపితుఁడై తన తొక్కలగాలిచే రాక్షసులను దఱిమెను. చక్రముచే శిరస్సులు తెగఁగొట్టఁబడినవారు, గదచే నలుగఁగొట్టఁబడిన వక్షఃస్థలములు గలవారు, నాగలిచేఁ బీడింపఁబడిన మెడలుగలవారు, రోఁకళ్లచే గుండ గొట్టఁబడిన తలలుగలవారు, కత్తులచేఁ నఱికఁబడినవారును, మఱియు బాణములచేఁ గొట్టఁబడినవారు నగురాక్షసులు శీఘ్రముగా నాకాశము నుండి సముద్రములోఁ బడిపోయిరి. నారాయణుఁడు శార్ఙ్గమను ధనుస్సు నుండి పిడుగులవంటి బాణములను వర్షించి రాక్షసులను విదళించెను. ఆరాక్షససైన్యము గొడుగులు తెగిపోయి, చేతిలోనియస్త్రములు జాఱిపోయి, విష్ణునిబాణములచే వేషములు పోయి, ప్రేగులు బైటికి వచ్చి భయమును గలిగించు చంచలనేత్రములు గలిగి పిచ్చిపట్టినట్టు కనుపట్టుచుండెను. సింహములచేఁ బీడింపఁబడిన యేనుఁగులవలె నావిష్ణుమూర్తిచేఁ బీడింపఁబడిన రాక్షసులు కేకలును వేగమును నొక్కమాఱుగఁ జెలరేఁగెను. విష్ణుమూర్తి ప్రయోగించిన బాణములచే నివారింపఁబడియు తమబాణములను విడువుచు గాలి వీచినప్పు డెగిరిపోవు మేఘములవలె రాక్షసులు పాఱిపోవుచుండిరి. చక్రప్రహారములచే శిరస్సులు దెగియు, గదాప్రహారములచే నొడలు పొడియయ్యి, కత్తివ్రేట్లచే తునుఁకలుగాఁ జేయఁబడియు రాక్షసులు కొండలవలె నేలఁ గూలుచుండిరి. వ్రేలాడుచున్న మణిహారకుండలములు గలిగి నల్లనిమేఘములవలెఁ బ్రకాశించుచున్న యారాక్షసులు దట్టముగాఁ గ్రిందఁబడి యుద్ధప్రదేశమును కాటుకకొండలతోఁ గప్పినయెప్పునఁ జేసివైచిరి.

8-వ సర్గము

రాక్షసులు లంకకుఁ బాఱిపోవుట

పద్మనాభుఁడగు విష్ణుదేవుఁ డీరీతిగా వెసఁ నుండి తరుముకొని వచ్చుచుండఁగాఁ జెలియలికట్ట నతిక్రమించి సముద్రుఁడు వచ్చినట్లు మాల్యవంతుఁడు యుద్ధమునకువచ్చెను. కోపముచేఁ గన్ను లెఱ్ఱఁబడఁగాఁ గిరీటము కంపించుచుండఁగా నామాల్యపంతుఁడనురాక్షసుఁ డావిష్ణుమూర్తిని బిలిచి యిట్లనియె: "నారాయణా! అనాదిగా వచ్చుచున్న క్షత్రధర్మము నెఱుఁగకపోతివి. అందుచేతనే పామరునివలె యుద్ధముచేయక పాఱిపోవుచున్న మమ్ములను వెంటాడించి కొట్టుచున్నావు. రాక్షసుఁడుగాకుండ నుండియు నెవ్వఁడు పరాఙ్ముఖులను జంపుట యను మహాపాతకము నాచరించునో వాఁడీ దేహమును విడిచినతరువాతను బుణ్యాత్ములు పోఁదగిన స్వర్గమునుగూర్చి పోఁజాలఁడని కదా ప్రాజ్ఞులు చెప్పుచుందురు. ఓయీ శంఖచక్రగదాధరా! నీకంతగా యుద్ధము సేయవలెనను శ్రద్ధయే యున్నయెడల నిదిగో నే నున్నాను రమ్ము. నీబలము చూచెదను జూపింపుము." ఇట్లుచెప్పి మాల్యవంతమను పర్వతమువలె నిశ్చలముగా నెదుట నిలువఁబడియున్న మాల్యవంతుఁడును రాక్షసుని జూచి విష్ణుమూర్తి యిట్లనియె: "ఓయీ రాక్షసోత్తమా! మీవలన భయపడిన దేవతలకు మిమ్ములను జంపెదనని యభయదాన మిచ్చితిని. దానిని నేను బరిపాలించుకొనుచున్నాను. నేను నాప్రాణములచేతను గూడ దేవతలకు మేలు చేయుచుందును.మీరు పాతాళలోకములో డాఁగినను మిమ్ములను జంపకమానను." ఇట్లు కోపించి యెఱ్ఱఁగామఁ బోకులం బోలినకన్నులుగల విష్ణుమూర్తి చెప్పుచుండఁగనే మాల్యవంతుఁడు కోపించి శక్తియనునాయుధముచే విష్ణుమూర్తి వక్షఃస్థలముమీఁదను గొట్టెను. గంటలప్రాతతోఁ గూడినయాశక్తి మాల్యవంతుని బాహువుచేవిడువఁబడివిష్ణుమూర్తివక్షఃస్థలముమీఁదఁబడినదై మేఘముమీఁదనున్న మెఱుపువలె వెలుఁగుచుండెను. శక్తిధరప్రియుండగు నావిష్ణుమూర్తి యంతట నాశక్తినే తీసి మాల్యవంతునిపైకి విసరెను. కుమారస్వామి చేతితోఁ విడువఁబడిన శక్తివలెనే విష్ణుమూర్తి విసరినయాశక్తి కాటుకకొండనుగూర్చిపోయిన యింద్రశక్తివలె నారాక్షసునిగూర్చి పోయినది. ముత్యాలహారములు

మొదలగువానిచేఁ బ్రకాశించుచున్న విశాలమైన యతని వక్షఃస్థలముపై నాశక్తి కొండశిఖరముపైని పిడుగుపడినట్లు పడినది. ఆశక్తిదెబ్బ తగులఁగానే మాల్యవంతుఁడు కవచము భిన్నము కాఁగా మూర్ఛవోయి చాలతడవునకు మరలఁ దెలివి దెచ్చుకొని కొండవలె నిశ్చలముగాఁ నిలువఁబడి యుండెను. తరువాతను మాల్యవంతుఁడు పెక్కు ముండ్లతో నిండియున్న యినుపశూలమును గిరగిరఁ ద్రిప్పి విష్ణుమూర్తి వక్షఃస్థలముపై గట్టిగాఁ గొట్టెను. మఱియు నట్లులే రణాసక్తుఁడగు నామాల్యవంతుఁడు విష్ణుమూర్తిని పిడికిలితోఁ గొట్టి యొక వింటిపెట్టుమేర వెనుకకుఁ దొలఁగిపోయెను. తరువాత నాకాశమునందు సాధువాదములతోఁ గూడిన మహాశబ్ద మొకటి బయలుదేఱినది. మాల్యవంతుఁడు విష్ణుమూర్తిని గొట్టుటయే కాక గరుత్మంతునిగూడఁ గొట్టెను. గరుత్మంతుఁడును గోపించి తెక్కలగాలిచేత బలవంతమగు వాయువు దూదిపింజె నెగురఁ గొట్టునట్లు లాఁగాఁకును నెగురఁగొట్టెను. తనయన్న గరుత్మంతుని తెక్కల గాలిచే నెగురఁగొట్టఁబడిపోవుట చూచి సుమాలి తనసైన్యముతోఁగూడ లంకకుఁ బాఱిపోయెను. గరుత్మంతుని తెక్కల గాలిచే బలవంతముగా నెగురఁగొట్టఁబడిన యామాల్యవంతుఁడును మరలఁ దనసైన్యమును గలిసికొని సిగ్గుపడుచు నెట్లో లంకకుఁబోయెను.

తామరతేకులవంటి కన్నులుగల శ్రీరామచంద్రా! విష్ణుమూర్తిచే నీవిధముగా ననేకపర్యాయములు యుద్ధములలోఁ గొట్టఁబడి మేటివీరులెల్లఁజూవఁగా, విష్ణుమూర్తితో నెదిరించి యుద్ధము సేయఁజాలక భయపడి లంకవిడిచి, చావఁగా మిగిలినవారు భార్యాపుత్రాదిపరివారముతోఁ బాతాళలోకమునకు నివాసార్థమై పోయిరి. రక్షకులశ్రేష్ఠుఁడవగు నోరామా! అట్లు పాతాళలోకమునకుఁ బోయి సాలకటంకటవంశమునఁబుట్టిన యారాక్షసులు సుమాలియనువాని నవలంబించి ప్రసిద్ధికెక్కియుండెడివారు. నీచేఁ జంపఁబడిన రావణకుంభకర్ణాదులకంటెను మాల్యవంతుఁడు మొదలగు రాక్షసులు మిగుల బలవంతులు. దేవతలను బాధించు రాక్షసులను జంపువిషయమై శంఖచక్రగదాధరుఁడగు నారాయణునికంటె నితరులకు సాధ్యముగాదు. రామా! నీవు చతుర్బాహుఁడవును, సనాతనుఁడవును నగు నారాయణుఁడవే. రావణాదిరాక్షసుల సంహారముకొఱకు దశరథుని కుమారుఁడవై పుట్టితివి. శరణాగతవత్సలుఁ

డగు నారాయణుఁడు పోయినధర్మములను మరల నిలుపుటకై, యీయీ కాలములయందుఁ బ్రజలయున్నతికై, దుర్మార్గులను సంహరించుటకై పుట్టుచుండును. రాజేంద్రుఁడవగు రామచంద్రా! ఇపుడు నీకు రాక్షసుల జన్మప్రకారమంతయుఁ జెప్పెదిని. ఇటుపైని రావణునియొక్కయు వాని సంతతియొక్కయు నిరుపమానమైన జన్మప్రభావాదికమును జెప్పెద నాలకింపుము. అట్లు విష్ణుమూర్తికి భయపడి సుమాలి మొదలగు రాక్షసులు పుత్రులు పౌత్రులు మొదలగు పరిజనులతోఁగూడి చిరకాలము పాతాళలోకములో నివసించుచుండిరి. అటుపైని ధనేశ్వరుఁడు లంకలో నివసించుచుండెను.

9-వ సర్గము

రావణాదుల వృత్తాంతము

తరువాతను మఱికొంతకాలము గడచినవెనుక నల్లనిమేఘముతో సమానమైనవాఁడును, పుటముపైచిన బంగారుకుండలములు గలవాఁడును నగుసుమాలి యను రాక్షసుఁడు చేతిలోఁ బస్తము లేకుండ నుండులక్ష్మి వలెఁ బ్రకాశించుచున్న తనకూఁతుం దీసికొని పాతాళలోకమునుండి వచ్చి భూలోకములో విహరించుచుండెను. అట్లు భూమిపైఁ దిరుగుచుండఁగా బుష్పకమను విమానమెక్కి పోవుచున్న ధనేశ్వరుఁ డారాక్షసునికంటికగపడెను. విశ్రవోబ్రహ్మను జూచుటకై పోవుచున్న దేవకుమారునివంటి యాధనేశ్వరునిఁ జూచి యాశ్చర్యపడుచు భూలోకమునుండి పాతాళలోకమునకుఁ బోయి, రాక్షసులలో బుద్ధిశాలి యగు నాసుమాలి "యేమిచేసిన మనకు శ్రేయము గలుగును? ఎట్లు వృద్ధిలోనికి వత్తుము?" అని యాలోచించెను. తరువాత నతఁడు కైకసి యను తనకూఁతుం జూచి యిట్లనియె: "పుత్రీ! నీకు యౌవన మతిక్రమించుచున్నది. కావునఁ బెండ్లి చేయవలసియున్నది. నీవు నిరాకరింతువేమో యను భయముచేవరు లెవ్వరును నిన్నుఁ గోరమానుకొనుచున్నారు. నీనిమిత్తమై మేమందఱమును ధర్మాసక్తులము ప్రయాసపడుచున్నాము. పుత్రీ! నీవు సర్వగుణములతోడను గూడినదానవు; రెండవలక్ష్మివలెఁ బ్రకాశించుచున్నావు. మానమును గాపాడుకొంద మనుకోరిక గలవారి కందఱికిని గన్యాపితృత్వము దుఃఖకరమైనది గదా? తమకన్యక నెవ్వఁడు వరించునో తెలిసి

కొనుటకు వీలుగాదు, తల్లివంశమును, తండ్రివంశమును, పెనిమిటివంశమును గన్యకే సర్వదా సంశయమునం దుంచియుండును. కావున నీవు మునివరుఁడును, శ్రేష్ఠుఁడును, బ్రహ్మవంశమునందుఁ బుట్టినవాఁడును, బుల స్త్యబ్రహ్మకుమారుఁడును నగు విశ్రవసును స్వయముగా వరించి సేవించుము. పుత్రీ! తప్పకుండ నీకును నిటువంటి కొడుకులే పుట్టఁగలరు. తేజస్సుచేత సూర్యునితో సమానముగాఁ బ్రకాశించుచు ధనేశ్వరుఁడెట్లున్నాఁడో చూచితివిగదా!" కైకసి తండ్రిచెప్పిన ఆమాటలు విని తండ్రియందలి గౌరవమువలన విశ్రవో బ్రహ్మ తపసుచేయుచోటికిఁ బోయి నిలువఁబడినది.

శ్రీరామా! ఇంతలో నాలవయగ్నిహోత్రముపలెఁ బ్రకాశించుచున్న పులస్త్యనికుమారుఁడు విశ్రవసుఁ డగ్నిహోత్రమును సుపాసించుచుండెను. అది సాయంకాలము. ఆకైకసి తండ్రియందలి గౌరవమువలన నట్టిదారుణమైన వేళనుగూర్చి విచారింపక యతనియొద్దఁ దలవంచుకొని పాదాంగుష్ఠముచే భూమిని రాయుచు నిలువఁబడినది. ఆవిశ్రవసుఁడు పున్నమచందురునితో సమానమైనముఖముగల యాకైకసిని దనతేజస్సుచే వెలుఁగుచున్నదానిని జూచి మిక్కిలి యుదారమైన యంతఃకరణము గల వాఁడై యిట్లనియె: "సుందరీ! నీ వెవనికూఁతురవు? ఎందుండి యిచ్చటికి వచ్చితివి? నీవు వచ్చినకార్య మేమి? ఏహేతువున వచ్చితివి? అంతయు నిజముగాఁ జెప్పుము" అని యతఁ డడుగఁగానే యాకన్యక చేతులు జోడించుకొని యిట్లనియె: "మునిచంద్రా! నావృత్తాంతమంతయుఁ దమతపఃప్రభావముచేతనే తెలిసికొనఁదగును. బ్రహ్మర్షిచంద్రా! నేను నాతండ్రియాజ్ఞ ననుసరించితిని, వచ్చితిని. నాపేరు కైకసి. తక్కిన సంగతియంతయుఁ దామే తెలిసికొందురుగాక!" ఆమె చెప్పిన యామాట విని యాముని వెంటనే ధ్యానదృష్టితోఁ జూచి యిట్లనియె: "సుందరీ! నీమనస్సులోని సంకల్పమంతయుఁ దెలిసికొంటిని. నావలనఁ గుమారోత్పత్తిని గోరి వచ్చితివి"అనియిట్లు పలికి యాకైకసిని పెండ్లాడి విశ్రవసుఁ డామెతోఁ గ్రీడించి మఱలనామెకిట్లనెను: "దారుణమైన యిట్టివేళను నీవు నాయొద్దకు సంతానార్థినివై వచ్చితివి గనుక నీవు దారుణులును, దారుణమైన యాకారముగలవారును, దారుణమైన వంశమునం దిష్టము గలవారును, క్రూరకర్ములును నగు రాక్షసులను గనియెదవు."అని. ఆమాటలు

వినఁగానే చింతించియామె నమస్కారపూర్వకంబుగా నిట్లనియె:"తపస్సం పన్నుఁడవును బ్రహ్మవిదుఁడవును నగు నీవలన నిట్టిబిడ్డలా నాకుఁబుట్టుట! అంతటి దురాచారులు నాకక్కఱలేదు. నాయందు దయయుంచి మంచి వారిని దయచేయుము." అని యనేకవిధముల బతిమాలఁగా ముని శ్రేష్ఠుఁడగు నావిశ్రవసుఁడు కైకసివంకఁ జూచి పూర్ణచంద్రుఁడు రోహిణితో నన్నవిధమున నిటనియె:"సుందరీ! నీచిన్నకొడుకు నావంశమునకు దగినవాఁడై ధర్మాత్ముఁడై యుండును."

శ్రీరామా! ఈరీతిగా విశ్రవోమునిచేఁ జెప్పఁబడినదియై యా కైకసి యనుకన్నియ పుట్టుకొంతకాలమునకుఁ జూచుట కసహ్యముగా నుండువాఁడును, రాక్షసరూపము గలవాఁడును, మిక్కిలి భయంకరమైనవాఁడును. పదితలలు గలవాఁడును, పెద్దకోఱలు గలవాఁడును, కొటుకకొండవంటి వాఁడును, ఎఱ్ఱనిపెనవులు గలవాఁడును, ఇరువది బాహువులు గలవాఁడును, పెద్దనోళ్ళు గలవాఁడును నగు కుమారుని గనెను. ఆతఁడు పుట్టినతోడనే యగ్నిజ్వాలలఁ గ్రక్కుచు నక్కలును గ్రవ్యాదములును మండలములు గట్టి యపసవ్యముగాఁ దిరుగ మొదలిడినవి. పర్జన్యుఁడు రక్తమును వర్షించెను. మేఘములు కడుఘోరముగ నుఱుమ మొదలిడినవి. సూర్యునిప్రకాశము లేకపోయినది. ఆకాశము నుండి యుల్కలు రాలినవి. భూమి కంపించినది. దారుణముగా వాయువులు వీచినవి. అబ్ధిభూములను నదులకుఁ బతియు నగు సముద్రుఁడు క్షోభింప మొదలిడెను. తరువాత బ్రహ్మదేవునితో సమానుఁడగు తండ్రి విశ్రవసుఁడు పదితలలుగలవాఁడై పుట్టెను గనుక వానికి దశగ్రీవుఁడని నామకరణము చేసెను. అతఁడు పుట్టిన తరువాత మహాబలశాలి యగు కుంభకర్ణుఁడు పుట్టెను. అతనిప్రమాణముకంటె నెక్కువప్రమాణముగల జంతువు మఱియుండఁబోదు. తరువాత వికృతమైన ముఖము గల శూర్పణఖయుఁ, దరువాతను ధర్మాత్ముఁడగు విభీషణుఁడును పుట్టిరి. కైకసిసంతతిలో నతఁడే కడసారి బిడ్డఁడు. సత్త్వశాలి యగు నావిభీషణుఁడు పుట్టఁగానే పుష్పవర్షము గురిసినది. అంతరిక్షమున దేవదుందుభులు మ్రోఁగినవి. మఱియు దేవతలు సాధువాదములు పల్కిరి. మహాబలవంతులగు నారావణకుంభకర్ణ లిద్దఱును లోకములకు దిగులు పుట్టించుచు నామహారణ్యములోనే వృద్ధిపొందుచుండిరి. అందుఁ గుంభకర్ణుఁడు

మఁచినవాఁడై ధర్మవత్సలు లగు మహాఋషులను మూఁడులోకముల వారిని మ్రింగుచు నిత్యమును సంతుష్టినొందక సంచరించుచుండెను. ధర్మాత్ముఁడగు విభీషణుఁడుమాత్రము ధర్మమార్గమునం దాసక్తుఁడై స్వాధ్యాయతత్పరత్వముచే నియమముగా నాహారమును భుజించుచు, నింద్రియములను స్వాధీనమున నుంచుకొనియుండెను.

ఇట్లుండఁగా నొకానొకనాఁడు స్వయంప్రకాశమానుఁడును వైశ్రవణుఁడును, నగుధనేశ్వరుఁడు పుష్పక మనువిమాన మెక్కి- తండ్రిని జూచుటకు వచ్చెను. అట్లు వచ్చి తన దివ్యతేజముచేత జాజ్వల్యమానుఁడై యున్న యాకుబేరునిఁ జూచి సహింపఁజాలక కైకసి తనపెద్ద కుమారుఁ డగురావణునితో నిట్లనియె: "నాయనా! చూచితివి గదా మీయన్న వైశ్రవణుఁ డెంత తేజశ్శాలియై ప్రకాశించుచున్నవాఁడో! ఒకతండ్రిబిడ్డ లందఱును సమానముగా నుండవలసి యుండఁగా, నీవు కుబేరునివలె నుండక దివ్యవైభవము లేనివాఁడవై యుంటివి. అమితబలశాలివగు నోదశగ్రీవా! నాకడుపునఁ బుట్టిన నీవు వైశ్రవణునితో సమానముగా నుండుటకుఁ దగినట్లు ప్రయత్నింపుము." అను తల్లిమాటలు విని ప్రతాపశాలి యగు దశగ్రీవుఁడు మిగుల రోషము నొందినవాఁడై వెంటనే తల్లియెదుటఁ బ్రతిజ్ఞఁజేసెను:"తల్లీ! నేను నిజముగాఁ జెప్పుచున్నాను వినుము. నేను నాసవతియన్నతో సమానుఁడనో, వానికంటె నధికుఁడనో యగుదును. నీమనస్సునందలి సంతాపమును మానుము"అని యాకోపముచేతనే తమ్ముఁడగు కుంభకర్ణునితోఁగూడ దుష్కరకార్యమును జేయఁగోరినవాఁడై తపస్సు చేయ సంకల్పించెను. తపస్సుచేతను గోరినకోరికలను బొందెద ననిసంకల్పించుకొని యాత్మసిద్ధికై శుభకరమైన గోకర్ణాశ్రమమునకుఁ బోయెను. అట్లు తమ్ములతోఁగూడ నచ్చటకుఁబోయి భయంకరమైన పరాక్రమముగల యాదశగ్రీవుఁడు నిరుపమానముగాఁ దపస్సు చేసి బ్రహ్మను సంతోషపఱిచెను. విభుఁడగు నాబ్రహ్మయు సంతోషించి జయమును గలిగించువరముల నిచ్చెను.

10-వ సర్గము

ఇట్లగస్త్యమహాముని చెప్పఁగా విని శ్రీరామచంద్రుఁడిట్లనియె: "అగస్త్యభగవానులవారూ! మహాబలవంతు లగు నాయన్నదమ్ము

లావనములో నేరితిగా నెట్టితపస్సు చేసిరి." అని యడుగఁగా నగస్త్యుఁడు సంతుష్టాంతరంగుఁడై యున్న శ్రీరామచంద్రునితో నిట్లనియె: "రామా! అట్లు గోకర్ణమునకుఁ బోయి వాయు ముగ్గురును నాయాయి ధర్మవిధుల నవలంబించిరి. కుంభకర్ణుఁడు నియతముగా ధర్మమార్గమునం దుండి గ్రీష్మ కాలమునఁ బంచాగ్నిమధ్యమునను, వర్షాకాలమున వీరాసన స్థుఁడై మేఘోదకములచేఁ దడియుచును, హేమంతకాలమున జలములో నుండియుఁ దపస్సు చేయ మొదలిడెను. ఇట్లు ధర్మము విషయమై ప్రయత్నించుచు మంచిసూర్గమునందు నిష్ఠ గల యాకుంభకర్ణునకుఁ బదివేలసంవత్సరము లతిక్రమించినవి. ధర్మాత్ముఁడగు విభీషణుఁడు నిత్యమును శుచియు ధర్మాసక్తుఁడును నై యేకపాదముతో నిలువఁబడి యైదువేల సంవత్సరములు తపస్సు చేసెను. అతనితపోనియమము పూర్ణముకాఁగానే యాకసమునం దచ్చర లాడిరి. పుష్పవర్షము గురిసినది. దేవతలు క్షోభపడిరి. అతఁడు మఱియైదువేలసంవత్సరములు చేతులు మోఁది కెత్తి సూర్యునిఁ జూచుచు స్వాధ్యాయమునందు నియమింపఁబడిన మనస్సు గలవాఁడై తపస్సు చేసెను. ఇట్లు నియతాత్ముఁడై స్వర్గలోకములోని నందన వనములో నున్నట్టుండి తపస్సు చేయుచున్న విభీషణునకును బదివేలసంవత్సరము లతిక్రమించినవి. రావణుఁడును నిరాహారుఁడై పదివేలసంవత్సరములు తపస్సు చేసెను. వేయేసిసంవత్సరములు పూర్తి కాఁగానే యొక్కొక్కశిరస్సుఁ గోసి యగ్నికుండమునందు వేల్చుచుండెను. ఇట్లు తొమ్మిదివేల సంవత్సరములు గడచినవి. తొమ్మిదిశిరస్సు లగ్నిహోత్రునిపా లయినవి. మరల నొకవేయిసంవత్సరములు ఘోరమైన తపస్సుచేసి పదియవశిరస్సును గూడఁ గోసి హోమము చేయుటకు సిద్ధుఁడై యుండఁగా, నంతట నచ్చటకు బ్రహ్మదేవుఁడు వచ్చెను. ఇట్లు దేవతలతోఁ గూడ వచ్చి సంతోషించుచు, "దశగ్రీవా! నీవు చేసినతపస్సునకుఁ జాల సంతోషించితిని. ధరజ్ఞా! నీ కిష్టమైన వరమును శీఘ్రముగాఁ గోరుకొనుము. నీవు పడినపరిశ్రమ వ్యర్థముగాకుండ నీకోరికను బూర్తిచేసెద"ననియె. అది విని దశగ్రీవుఁడు చాలసంతోషించి యాయనకు సాష్టాంగనమస్కారము చేసి హర్షముచే గద్గదస్వరము గలుగఁగా నిట్లనియె: "పితామహా! నిత్యమును బ్రాణులకు మరణముకంటె భయంకరమైనది లేదు. మృత్యువుతో సమానమైన శత్రువు ప్రాణికోటికి లేదు. నేను జావు లేకుండ వరము కోరుకొనుచు

న్నాను"అని చెప్పఁగానే విని బ్రహ్మదేవుఁ డత్తనితో నిట్లనియె:"నాయనా! చావులేకుండ వరమిచ్చుటకు వీలు పడదు. కావున మఱియొకవరమును గోరుకొనుము" అని లోకకర్త యగు బ్రహ్మ చెప్పఁగానే విని దశగ్రీవుఁడు చేతులు జోడించుకొని యెదుట నిలువఁబడి యిట్లనియె: "అయ్లేని పితామహా! నాకు సుపర్ణులు, నాగులు, యక్షులు, దైత్యులు, దానవులు, రాక్షసులు, దేవతలు మొదలగువారివలనఁ జావులేకుండ వరమిమ్ము. మఱి తక్కినప్రాణులవలన నాకెంతమాత్రమును భయము లేదు. మనుష్యులు మొదలగు ప్రాణులు నాకుఁ దృణప్రాయులేకదా?" అని చెప్పఁగా ధర్మాత్ముఁడగు బ్రహ్మదేవతలతోఁ గూడ "నోయీ రాక్షసశ్రేష్ఠుఁడా! నీవు కోరిన యట్లే వర మిచ్చితి" నని చెప్పి, మరల నిట్లనియె: "రావణా! నీవడుగక పోయినను నీవు చేసినతపస్సునకు నేను సంతోషించితిని గనుక నీ కిఁక నొక్కవర మిచ్చుచున్నా నంగీకరింపుము. నీవు పూర్వ మగ్నిలో హోమము చేసిన నీతొమ్మిదిశిరస్సులును మరల నెప్పటియట్లుండును. మఱియు నింకొకవర మిచ్చుచున్నాను పుచ్చుకొమ్ము. నీవు మనస్సులో నేరూపము ధరింపవలయు ననితలంచెదవో యట్టిరూపము గలుగును. నావర మమోఘమైనది." అని బ్రహ్మదేవుఁడు వర మియ్యఁగానే యగ్నిహోత్ర మునందు హోమముచేయఁబడిన దశగ్రీవుని శిరస్సులన్నియు నెప్పటియట్ల మొలచినవి.

శ్రీరామా! దశగ్రీవున కీప్రకారముగా వరములనిచ్చి లోకకర్త యగు పితామహుఁడు విభీషణునియొద్దకు వచ్చి యిట్లనియె: "వత్సా! విభీషణా! నీధర్మబుద్ధికి నేను జాలసంతోషించితిని. ధర్మాత్మా! సువ్రతా! నీయిష్టమైన వరము గోరుకొనుము." అని చెప్పఁగానే నిత్యమును గిరణ ములచేఁ జంద్రుఁడువలెనే, మంచిగుణములచే నావరింపఁబడిన ధర్మాత్ముఁడగు విభీషణుఁడు చేతులుజోడించుకొని యిట్లనియె: "పితామహా! నేను గృతార్థుండ నయితిని. లోకగురుఁడవగు నీవు సంతోషించి స్వయముగా నాకు వర మియ్య వచ్చితివి. సువ్రతా! నాకుఁ గావలసినవరము చెప్పెదను వినుము. ఎట్టియాపదలు తటస్థించి యున్నను నామన స్సెప్పుడును ధర్మమునందే యాసక్త మయి యుండవలయును. ఉపదేశ మక్కఱలేకుండఁగనే నాకు బ్రహ్మాస్త్రము స్ఫురించుఁగాక! ఏయేయాశ్రమములయందు నా కేయేబుద్ధి గలుగుచుండునో యదిధర్మిష్ఠమై యుండుఁగాక. నే నాయా

ధర్మములను బరిపాలించుకొనుచు నుందునుగాక! పరమోదారస్వభావమైన యంతఃకరణములుగల యోదేవా! ఇదియే నా కిష్టమైన వరము. ధర్మమునం దాసక్తులగువారికి మూఁడులోకములయందును దుర్లభమైనది లేదని కడా పెద్దలు చెప్పుచుందురు." అను విభీషణునిమాటలు విని సంతోషించి యతనితో బ్రహ్మ యిట్లనియె: "వత్సా! నీవు ధర్మిష్ఠుఁడవు గనుక నీవు కోరినయట్లులే యగును. అంతశ్శత్రులను నశింపఁజేసికొనియున్న యోవత్సా! రాక్షసయోనియందు జన్మించినను నీ కధర్మమునందు బుద్ధి లేదు గనుక నీకుఁ జావు లేకుండ వరమిచ్చుచున్నాను" అని చెప్పి కుంభకర్ణనకు వర మియ్య వచ్చిన బ్రహ్మదేవునితోఁ జేతులు జోడించుకొని దేవత లిట్లని విన్నవించిరి.

"దేవా! కుంభకర్ణనకు వర మీయవలదు. ఈదుర్మార్గుఁ డేరీతిగా లోకములకు హింస గలుగఁజేయుచున్నాఁడో నీవెఱుంగనిదిగాదుగదా! వీఁడు నందన వనములో విహరించుచుండఁగా నేడుగు రప్సరస్త్రీలను భక్షించెను. దేవేంద్రుని యనుచరులను బదిమందిని ద్రుంగెను. వీఁడుకబళించిన మునులకును ఋషులకును లెక్కయేలేదు. వరములు పొందక ముందే వీఁడిట్టి ఘోరకృత్యము గావించుచున్నాఁడు.ఇంక వీనికివర ప్రాప్తి గూడఁగలిగినచో మూఁడులోకములను భక్షించుట కభ్యంతరముండునా? అమిత ప్రభావశాలి వగు నోదేవా! ఇప్పుడు వీనికి వర మనుమిషచే మోహమును గలిగింపుము. అట్లు చేసితివేని మూఁడులోకములకును క్షేమము గలుగును. వానిపొగరు నణఁగును." అని యిట్లు దేవతలు విన్నవింపఁగానే పద్మసంభవుఁ డగు బ్రహ్మ సరస్వతిని స్మరించెను. వెంటనే సరస్వతీదేవి ప్రత్యక్షమై చేతులు జోడించుకొని ప్రక్కను నిలువఁబడి యిట్లనియె: "దేవా! ఇదిగో వచ్చితిని. ఏమి సెలవిచ్చినను జేయుటకు సిద్ధురాలనై యున్నాను"అని విన్నవించు సరస్వతినిజూచి బ్రహ్మ యిట్లనియె: "వాణీ! నీవీదేవతలకోరిక ప్రకార మీకుంభకర్ణనిముఖమునం బ్రవేశింపుము"అని చెప్పఁగానే యామె వానిముఖమునఁ బ్రవేశించినది. అప్పుడు కుంభకర్ణనిఁజూచి బ్రహ్మ యిట్లనియె: "మహాబాహుఁడ వగు నోకుంభకర్ణా! నీకిష్టమైన వరము గోరుకొనుము"అని చెప్పఁగానే కుంభకర్ణుఁ డిట్లనియె: "దేవదేవా! అనేకసంవత్సరములు నిద్రపోవలయు ననినాకుఁ గోరిక యున్నది. ఇదియే నా కిష్టమైనవరము" అని యడుగఁగానే యట్లే

యగుఁగావుత మనిచెప్పి దేవతలతోఁగూడ బ్రహ్మ యంతర్ధానమాయెను. సరస్వతీదేవియు వెంటనే ఆరాక్షసుని విడిచి పోయినది. ఇట్లు బ్రహ్మాదిదేవతలు నభస్థలమునుగూర్చి పోఁగానే సరస్వతిచే విమోహనఁబడి వాఁడు తెలివి దెచ్చుకొనెను. అప్పు డాదుష్టాత్ముఁడు దుఃఖించుచు నిట్లని యాలోచింప మొదలిడెను: "అకటా! నాముఖమునుండి యిటువంటిమాట యేటికి వచ్చినది? అన్నా! బ్రహ్మతోఁగూడి వచ్చినదేవత లేదో మాయ పన్ని నన్ను మోసపుచ్చియుందురని తలంచెదను. ఏమిచేయుదును? సమయ మతిక్రమించినది. మోసగింపఁబడితిని"అని వగచెను. ఇట్లు ముగ్గురన్నదమ్ములును దీప్తతేజస్కులై తపస్సు చేసి వరములను బొంది యచ్చటినుండి శ్లేష్మాతకవనమునుగూర్చి పోయి యచ్చట వారు సుఖముగా నుండిరి.

11-వ సర్గము

రావణుని లంకాప్రవేశము

శ్రీరామా! ఇట్లు మనుమలు ముగ్గురును దపస్సు చేసి వరములను బొంది యున్నారన్న సంగతి దెలిసికొని సుమాలి భయమును విడిచి పాతాళలోకమునుండి పరిచరులతోఁగూడ బయలుదేఱెను. మారీచుఁడు, ప్రహస్తుఁడు, విరూపాక్షుఁడు, మహోదరుఁడు నను సుమాలిమంత్రులును మిక్కిలి యాటోపముగలవారై యతనితోఁగూడ బయలుదేఱిరి. సుమాలి యిట్లు రాక్షసశ్రేష్ఠులగు మంత్రులతోఁ గూడి దశగ్రీవుని గలిసికొని హానిని గౌఁగిలించుకొని యిట్లనియె: "వత్సా! ధ్రువవశమునఁ గోరిన కోరిక నెఱవేఱినది. ముల్లోకములకును జ్యేష్ఠుఁడగు బ్రహ్మదేవుని వలన నుత్తమమయిన వరములను బొందితివి. మే మేకారణమువలన లంకాపట్టణమును విడిచి పాతాళమునకుఁ బోయితిమో ఆవిష్ణువువలని భయము పోయినది. మహాబాహూ! నీవలన మాకాభయము తీఱినది. మే మెన్నో మాఱులు వానికి భయపడి పరివారముతోఁగూడఁ బాతాళలోకమునకుఁ బాఱిపోతిమి. ఈలంకాపట్టణము ముందు మాదే. ఇది రాక్షసులు నివసించుటకుఁ దగియున్నది. బుద్ధిశాలి యగు నీసవతి యన్న ధనేశ్వరుఁడు దీనినాక్రమించుకొని యున్నాఁడు. మహాబాహూ! ఒకవేళ నీకు నసువగునేని మంచిమాట లాడి కాని, లంచ మిచ్చి కాని, బలాత్కారము చేసి కాని మరల నీలంకను బుచ్చుకొనుము. అంతియే

చాలును. నాయనా! నీవే లంక కధిపతి వగుదువు. సందేహింపకుము. ఇట్లు చేసితివేని దుఃఖసముద్రములో మునిగియున్న రాక్షసవంశము సుద్ధరించినవాడ వగుదువు. మహాబలుడ వగు నీవే మాకంచఅకును బ్రభువ వగుదువు" అని చెప్పిన మాతామహునిమాటలు విని దశగ్రీవుడిట్లనియె: "తాతా! ధనేశ్వరుడగు కుబేరుడు మాకు గురువు. నీవిట్లు చెప్పవచ్చునా?"అని దశగ్రీవునిచే నిరాకరింపబడి సుమాలి యతని యభిప్రాయమును దెలిసికొని యేమియు ననక యూరకుండెను. మఱి యొకప్పుడు రావణుడొక్కడును గూర్చుండి యుండగా బ్రహస్తుడు వినయముగా నెదుట నిలువబడి యుక్తియుక్తముగా నిట్లనియె:

"మహాబాహుడవగు దశగ్రీవా! నీరీతిగా బలుకదగునా? శత్రులకు సౌభ్రాత్రము (అన్నదమ్ములస్నేహము) లేదు. ఇందులకుఁ గారణము చెప్పెదను వినుము. అదితియు, దితియుఁ గలిపికోలుతనమున నుండెడియక్కనెల్లైంద్రు. పరమ రూపశాలినులగు నాయిద్దఱును గశ్యపబ్రహ్మకు భార్యలైరి. అదితి మూఁడులోకములకును బ్రభువులగు దేవతలను గన్నది. దితి రాక్షసులను గన్నది. ధరజ్ఞా! యీ లంకా పట్టణము రాక్షసులది. మఱియు వనములతోడను, సముద్రముతోడను, పర్వతములతోడను గూడియున్న యీభూమి నంతయు వారు ప్రభువులై యనుభవించుచుండిరి. ప్రభవిష్ణుఁడగు విష్ణు వీరాక్షసులను యుద్ధములోఁగొట్టి యవ్యయ మగు నీలోకత్రయమును దేవతలయధీనము చేసెను. ఒక్కనీవే విపరీతముగా నడువవలసినదని మేము చెప్పుట గాదు. ఇదివఱ కీవిపర్యయమును సురాసురు లాచరించియే యున్నారు. కనుక నేను జెప్పినట్లు చేయుము" అని యిట్లు ప్రహస్తుడు చెప్పఁగానే దశగ్రీవుఁడు సంతుష్టాంతరంగుఁడై కొంచెముసే పాలోచించి మంచిదే యనెను. బలశాలియగు నాదశగ్రీవుఁ డాసంతోషముతో నారాక్షసు లందఱితోడను గూడి యానాఁడు వనమునకు బయలుదేఱెను. ఆదశగ్రీవుఁడు త్రికూటపర్వతమునం దుండి మాటలయందు నేర్పరియగు ప్రహస్తునిఁబిలిచి "ప్రహస్తా! నీవు శీఘ్రముగాఁ బోయి, రాజా! యీలంక మహోత్తులగు రాక్షసులది. సౌమ్యా! నీవు దీని నాక్రమించుకొని యున్నావు. అనఘా! నీ కిది తగదు. అతులపరాక్రమశాలి వగు నన్నా! నీవు నామాట విని వెంటనే యీలంకాపట్టణమును రాక్షసుల కిచ్చితివేని నాముద్ద చెల్లించిన

వాఁడవుదువు. మఱియు ధర్మమును బాలించినవాఁడవును నగుదువు"అని సామపూర్వకముగా నేను జెప్పుచుంటి నని కుబేరునితోఁ జెప్పు మని యతనియొద్దకు దూతనుగాఁబంపెను. వాఁడును ధనేశ్వరునిచేత సురక్షిత మయిన లంకకుఁ బోయి యాదార్యవంతుఁడయిన కుబేరునితో నిట్లనియె; అందఱు శస్త్రధారులలోను శ్రేష్ఠుఁడవును, మహాబాహుఁడవును, సుప్ర తుండవును నగుధనేశ్వరా! నీతమ్ముఁడగు దశగ్రీవుఁడు పంపఁగా వచ్చితిని. సర్వశాస్త్రవిశారదుఁడవును మహాప్రాజ్ఞుడవునునగు నోధనేశ్వరా! దశాన నుఁడు సెప్పువున్నమాటలు చెప్పెద నాలకింపుము: "విశాలాక్షా! యీ లంకాపురి పూర్వము భీమపరాక్రములగు సుమాలి ప్రముఖులచే ననుభ వింపఁబడుచుండెడిదఁట! కావున నోవిశ్రవస్తనూజా! ఇట్లు విన్నవింపఁబడు చున్నావు. సామపూర్వకముగా నిన్ను యాచించుచున్నాఁడు గనుక వాని కీలంకాపట్టణ మిమ్ము"అని ప్రహస్తుఁడు చెప్పినమాటలువిని వాక్యవిశార దుఁడగు వైశ్రవణుఁడు ప్రహస్తునితో నిట్లనియె:

"నాకు తండ్రి రాక్షససామాన్యమైన యీలంకాపట్టణము నిచ్చియు న్నాఁడు. నే నీలంకలో దానమానాదిగుణముల ననలంబించి యక్షులతోఁ గూడియున్నాను. నారాజ్యము, నాపట్టణము, నాయైశ్వర్యము మొదలైన దంతయు నీదే. నీ వీరాజ్యమును నిష్కంటకముగా ననుభవింపుము. నీకును నాకును విభాగ మెందులకు? నీవును నేనును నొక్కతండ్రి బిడ్డలము." అని దశగ్రీవునితో నేను జెప్పు మన్నట్లు చెప్పుము, అని ప్రహస్తునితోఁ జెప్పి ధనాధ్యక్షుఁడు వెంటనే పుష్పక మెక్కి తండ్రి యొద్దకుఁ బోయి నమస్కరించి రావణునియభిమతము నంతయు నిట్లు చెప్పెను. "తండ్రీ! నాతమ్ముఁడగు దశగ్రీవుఁడు నాయొద్దకు దూతను బంపియున్నాఁడు. పూర్వము రాక్షసులకుఁ గాపురమైన యీలంకను తన కిమ్మని వర్తమానము పంపెను. సుప్రతా! యిప్పుడు నే నేమిచేయవలసి యుండునో యానతీయవలయును." ఇట్లు కుమారుఁడగు కుబేరుఁడు విన్నవించినమాటలు వినిమునిశ్రేష్ఠుఁడగు విశ్రవసుఁడు చేతులు జోడించు కొని యెదుట నిలువఁబడియున్న కుమారునితో నిట్లనియె: "నాయనా! నేను జెప్పెడిమాటలను వినుము. మహాబాహుఁడగు దశగ్రీవుఁ డిది వఱకే నాకడఁ జెప్పియున్నాఁడు. మాటిమాటికిని జెప్పుట విని యాదుర్వా ర్తని నేను ధిక్కరించితిని. కుపితుఁడ నై ధర్మమును, న్యాయమును,

మర్యాదను ధ్వంసముచేయుచున్నావు. అని యంటిని. నాయనా! మేలుగలిగించునదియు ధర్మమును దప్పనిదియు నగు నామాట వినుము. ఆదుర్మార్గునకు వరములు దొరకుటచే నొడలుదెలియక యున్నాడు. వానికి మాన్యామాన్యవిచారమే లేదు. వాడు నాశాపమునలననను దారుణమైన ప్రకృతిగలవాడై యున్నాడు. కావున నోమహాభాహూ! నీవు శీఘ్రముగా గైలాసపర్వతమునకుఁ బోయి యచ్చటఁ గాపుర ముండుము. నీవు పరివారముతోఁగూడ లంకను విడిచిపెట్టుము. అచ్చట నదులలో నుత్తమనదియగు మందాకిని ప్రవహించుచుండును. ఆనదిలో సూర్యసంకాశములయిన బంగారు తామరపువ్వులు వికసించియుండును. మఱియు నానదిలోఁ బరిమళయుక్తములగు కుముదములు, ఉత్పలములు మొదలగుపుష్పము లెప్పుడును వికసించియుండును. ఆపర్వతముపైని దేవతలు, గంధర్వులు, అప్సరస్త్రీలు, ఉరగులు, కిన్నరులు మొదలగువా రెప్పుడును విహరించుచు రమించుచుందురు. పుత్రా! నీకారాక్షసునితో వైరము తగదు. వాడు ప్రకృతము బ్రహ్మవలన వరములు పొందియున్న వాడు." అనియిట్లు తండ్రిచెప్పఁగానే యాయనయందలి గౌరవము వలన భార్యతోడను, బుత్రులతోడను, మంత్రులతోడను, వాహనముల తోడను, ధనముతోడను సపరివారముగాఁ గైలాసమునకుఁ బోయెను.

ఇటఁ బ్రహస్తుఁడు రావణునియొద్దకుఁబోయి సంతోషించుచు మంత్రులతోడను తమ్ములతోడను గూడుకొనియున్న మహోత్సుఁడగు రావణునితో నిట్లనియె: "రావణా! ఆలంకాపట్టణము శూన్యముగా నున్నది. కుబేరుఁడు దానిని విడిచిపోయెను. మాతోఁగూడ నీవందుఁ బ్రవేశించి స్వధర్మమును పరిపాలింపుము." అనియిట్లు ప్రహస్తుఁడు చెప్పఁగానే మహాబలుఁడగు దశగ్రీవుఁడు తమ్ములతోడను సైన్యముతోడను గూడి లంకాపట్టణములోఁ బ్రవేశించెను. కుబేరునిచేత విడువఁబడినదియు వేఱుపాటుచేయఁబడిన మహాపథములు గలదియు నగు నాలంకాపట్టణ ములోఁ దేవత లమరావతిలో దేవేంద్రు నభిషిక్తుని చేసినచందమున వెంటనే యభిషిక్తునిఁ జేయఁగా నందుఁ గాపురముండి రాక్షసులను బరి పాలించుచుండెను. నీలమేఘములతో సమానులగు రాక్షసులతో మిక్కిలి నిండి నిబిడీకృతమై యాలంకాపురియుఁ బ్రకాశించుచుండెను. ఇచ్చటఁ గుబేరుఁడును దండ్రియొక్కవాక్యములయందలి గౌరవమువలనఁ జంద్రుని

వలె నిర్మలమైన కైలాసపర్వతమునందు విరాజిల్లునదియు, బాగుగా నలం
కృతమ్మైలైన దివ్యభవనములతో నిండినదియు నగు నలకాపురములోఁ
బ్రవేశించి దేవేంద్రుఁడమరావతినివలెఁ బరిపాలించుచు సుఖముగా
నుండెను.

12-వ సర్గము

రావణాదుల పెండ్లి

శ్రీరామచంద్రా! దశగ్రీవుఁ డీరీతిగా లంకలో నభిషిక్తుఁడై తమ్ము
లతోఁగూడి చెల్లెలిపెండ్లివిషయమై యాలోచింప మొదలిడెను. ఇట్లాలో
చించి చెల్లెలగు శూర్పణఖను దానవశ్రేష్ఠుఁడును, కాలకేయవంశములోఁ
బుట్టినవాఁడును నగు విద్యుజ్జిహ్వున కిచ్చి పెండ్లిచేసెను. తరువాత నతఁ
డొకనాఁడు వేఁటకుఁ బోయి యావనములో దితికొడుకు మయుఁడు
గూఁతురును దానును నుండఁగాఁ జూచి, "ఓయీ! నీ వెవ్వఁడవు?
ఒక్కఁడవును నిర్మానుష్యమృగమైన యీవనమునం దీమృగాక్షితో
నెందుల కున్నావు?" అని యడుగఁగా, నా రావణాసునితో మయుఁ
డిట్లనియెఁ: "అయ్యా! నాసంగతి యంతయుఁ జెప్పెద నాలకింపుము.
హేమ యనునచ్చర యొకతె యుండెడిది. దానిని నీవును వినియే యుం
దువు. దేవేంద్రునకు శచీదేవినింబలె నాకు దానిని దేవత లిచ్చిరి.
నాయనా! నేను దానియం దాసక్తుఁడనై యెందువందలసంవత్సరములుంటిని.
అది యిప్పటికిఁ బదునాలుగుసంవత్సరములకు ముందు దైవతకార్యము
చేతఁ బోయినది. నే నాహేమకొఱకు మాయచేతను వజ్రవైదూర్యాది
రత్నములచే విచిత్రమైన బంగారువికారమగు పట్టణ మొకటి నిర్మించితిని.
నేను దానివియోగముచేత దీనుఁడ నయి యాపట్టణమునందే మిక్కిలి
దుఃఖించుచు నివసించుచుంటిని. ఆపట్టణమునఁ డి దీనిం దీసికొని యీవన
మునకు వచ్చితిని. ఇది నాకూఁతురు. ఆహేమాసుందరీగర్భమునుండి
పుట్టినది. దీనికిఁ దగినమగని వెదకుటకై దీనితోఁ గూడ బయలుదేఱితిని.
నాయనా! మానమును మర్యాదను గాపాడుకొందమను కోరిక గలవారికిఁ
గన్యాపితృత్వము దుఃఖకరముగదా! కన్యరెండువంశములను నిత్యమును
సంశయమం దుంచి యుండును గదా! నా కాహేమ యను భార్యయం
దిద్దఱుకొడుకులు గూడఁ బుట్టిరి. పెద్దవానిపేరు మాయావి. రెండవ

వానిపేరు దుందుభి. నీవడిగితివి గనుక నావృత్తాంతమంతయుఁ జెప్పితిని. నాయనా! నీ వెవరో నే నెట్లు తెలిసికోఁగలను?" అని యాఁవయుఁ డడుగఁగా, వినయముతో నారావణుఁడిట్లనియె: "నేను బులస్త్యబ్రహ్మకుమారుఁడు మూఁడవ బ్రహ్మయగు విశ్రవోమునికి సుతుఁడను. నాపేరు దశగ్రీవుఁడు." అని యిట్లు తనవృత్తాంతమును రావణుఁడు చెప్పుఁగానే విని రావణుని మహర్షితనయునిగాఁ దెలిసికొని మయుఁడు చాలసంతోషించి యతనికిఁ దన కూఁతు నిచ్చుట కిష్టపడెను. వెంటనే యచ్చటనే యా మయుఁడు తనకూఁతుకరము నతనికరముచే గ్రహింపఁజేసి యపుడు నవ్వుచు రాక్షసేంద్రుఁడగు నారావణునితో నిట్లనియె: "రాక్షసరాజా! ఇది నాకూఁతురు. హేమగర్భమునుండి పుట్టినది. కన్యక. దీనిపేరు మందోదరి. దీనిని భార్యగా గ్రహింపవలయును."

శ్రీరామా! ఇట్లు మయుఁడు ప్రార్థింపఁగానే "మంచిది" యని రావణుఁ డంగీకరించెను. అచ్చటనే యగ్నిని బ్రజ్వలింపఁజేసి యగ్ని సాక్షిగాఁ బాణిగ్రహణమహోత్సవము జరిగించెను. ఆమయుఁడు తపోధనునివలన శాపవృత్తాంతము విన్నవాఁడై యతనిది బ్రహ్మవంశ మని తెలిసికొనియే తనకూఁతు నిచ్చి పెండ్లిచేసెను. మఱియు నమోఘమును అత్యద్భుతమును నగుతనశక్తిని గూడ నిచ్చెను. ఆశక్తి నాతఁడు మిక్కిలి తపస్సు చేసి సంపాదించెను. దానిచేతనే రావణుఁడు మనలక్ష్మణునిఁ గొట్టినవాఁడు. లంకేశ్వరుఁడగు రావణుఁ డీరీతిగా భార్యను స్వీకరించి యామెతోఁగూడ లంకకుఁ బోయి తమ్ములపెండ్లిసంగతి యాలోచించెను. వైరోచనుని మనుమరాలు వజ్రజ్వాల యను దానిని బెద్దతమ్ముఁడగు కుంభకర్ణునకు భార్యనుగా నేర్పాటు చేసెను. మహత్తుఁడును, గంధర్వరాజును నగు శైలూషుఁడను నతనికూఁతును సరమ యనుదానిని విభీషణునకుఁ బెండ్లి చేసెను. ఆధర్మాత్మునకుఁ దగిన ధర్మజ్ఞురాలే భార్యగా దొరకినది. రామా! ఆమె మానస మను సరస్సునొయొడ్డునఁ బుట్టినది. ఆ మానససరస్సు వర్షర్తువుననే వృద్ధి పొందినది. ఆకన్నియతల్లి "సరో మా వర్ధయస్వ = సరోవరమా వృద్ధిని బొందకుము" అని స్నేహవశమున నాక్రందించినది. అక్కఱతమున నామెకు సరమ యని పేరు గలిగినది. ఈరీతిగా ముగ్గురును వివాహాములు చేసికొని, గంధర్వులు నందనవన ములోఁ గ్రీడించునట్లు లంకలోఁ దమతమభార్యలతోఁ గ్రీడించుచుండిరి.

ఇట్లుండఁగా రావణునిభార్య మందోదరి మేఘనాదుని గన్నది. రామా! వాఁడే సుమా మీాయందఱిచేతను నింద్రజిత్తని చెప్పఁబడుచుండెడి వాఁడు. ఆరావణునికొడుకు పుట్టినతోడనే యుఱుమువలె నేడ్చెను. ఆయేడుపుతో లంకాపట్టణ మంతయు జడ మయిపోయినది. అందుచేతను దండ్రివానికి మేఘనాదుఁ డని నామకరణము చేసెను. రామా! ఆశిశువు రావణుని యంతఃపురములో నుత్తమస్త్రీలచే రక్షింపఁబడుచుఁ గట్టలచేఁ గప్పఁబడిన యగ్నివలె వృద్ధి నొందుచుండెను. ఆశిశువువలన రావణు నకును మందోదరికిని గలిగినసంతోష మింతింత యని చెప్ప వలనుగాదు. అపత్యస్నేహ మట్టిది గదా!

13-వ సర్గము

కుబేరుని సౌభ్రాత్రము

పిమ్మట మఱికొన్నాళ్లకు బ్రహ్మచేతను వరముగా నియ్యఁబడిన నిద్రాదేవి రూపమును ధరించివచ్చి యాకుంభకర్ణు నావహించినది. అప్పుడు సభలోఁ గూర్చుండియున్న యన్నతోఁ గుంభకర్ణుఁ డిట్లనియె: "అన్నా! నన్ను నిద్ర బాధించుచున్నది. కావున నేను బరుండుటకుఁ దగినయి ట్లేర్పాటు చేయవలయును." అను కుంభకర్ణునిమాటలు విని రావణుఁడు వెంటనే శిల్పుల కాజ్ఞాపించెను. ఇట్లు రాక్షసరాజుచే నాజ్ఞాపింపఁబడిన వారై యాశిల్పులు విశ్వకర్మవలెనే, యోజనము విస్తీర్ణమును సంతకు రెండురెట్లు పొడవును గలిగి శుభ్రమయినదియుఁ జూడఁదగినదియు నేవిధమయిన బాధయులేనిదియు స్ఫాటిక స్తంభములచేతను బంగారు చిత్రములచేతను బ్రకాశించునదియు వైడూర్యమణులచేఁ జేయంబడిన సోపానములు గలదియుఁ జిఱుగంటలతో నలంకరింపఁబడినదియు దంతపుఁ దోరణములచేఁ బొందిక చేయఁబడినదియు వజ్రములచేతను స్ఫటికముల చేతను గట్టఁబడిన యరుగులు గలదియు మనస్సును హరింపఁదగినదియు సమస్తవిధములచేతను సుఖకరమైనదియుఁ బవిత్రమైన మేరుపర్వతపు గుహవలె నుండునదియు నగు నొకయింటిని సిద్ధము చేసిరి. ఆయింటిలో మహాబలుఁడగు కుంభకర్ణుఁడు నిద్రాధీనుఁడై యనేకములగు వేలసంవత్స రములు నిద్రపోయెను. ఇట్లు తమ్ముఁడగు కుంభకర్ణుఁడు నిద్రావశం వదుఁడై యుండఁగా దశాననుఁడు దేవతలను, ఋషులను, యక్షులను,

గంధర్వులను నిరంకుశముగా బాధింప మొదలిడెను. నందనవనము మొదలగు దివ్యోద్యానములకుఁ బోయి మిక్కిలి కోపించి వానిని విఱచి పైఁ జెను. నదులను గజరాజు కలఁచివై చినట్లు కలఁచివై చుచుఁ గ్రీడించుచు చెట్లను గాలివలెఁ బెల్లగిల్లఁ జేయుచు నగములను వజ్రమువలెఁ గొట్టుచు ధ్వంసము చేయుచుండెను.

అప్పుడు ధర్మజ్ఞుఁడును ధనేశ్వరుఁడును నగువైశ్రవణుఁడు దశగ్రీవుఁ డట్టివ్యాపారములగలవాఁడయి యుండుటను దెలిసికొని తనవంశమున కనురూప మయిన వృత్తములను సంస్మరించి తనసోదరత్వమును జూపించుటకై దశగ్రీవునకు హితము బోధింప నెంచి లంకలోనికి దూతను బంపెను. ఆదూత లంకకుఁ బోయి ముందుగా విభీషణునిఁ గలిసికొనెను. ఆవిభీషణుఁడు ధర్మముగా నాదూతను గౌరవించి వచ్చిన కార్య మడిగెను. మఱియు నన్నయగు కుబేరునియొక్కయు జ్ఞాతులయొక్కయు కుశలము నడిగెను. తరువాత సభలోఁ గూర్చుండియున్న దశగ్రీవుని దర్శనము చేయించెను. ఆదూత సభలోఁ దనతేజస్సుచే దేదీప్యమానుఁడై యున్న రాక్షసరాజును రావణునిఁజూచి గౌరవపూర్వకముగా జయస్తుతులు చేసి ముహూర్తకాల మూరక కూరుచుండెను. సభలో వరాస్తరణశోభితమైన యుత్తమపర్యంకమునందుఁ గూర్చుండి యున్న రావణునిఁ జూచి దూత యిట్లనియె.

మహావీరుఁడవగు నోరాక్షసేంద్రా! మీవంశమునకును నడవడికిని సదృశముగా మీయన్నయగు కుబేరుఁడు నీకుఁ జెప్పుమని చెప్పిపంపిన మాటలు మనవిచేయుచున్నాను; జిత్తగింపుము. "తమ్ముఁడా! ఇంతవఱకుఁ జరిత్రను సంగ్రహించితివి చాలును. ఇటుపయిని వీలగునేని సాధుమార్గమునం దుండుట మంచిది. నీవు నందనవనమును బాడుచేసితివి. నేను గన్నులార జూచితిని. ఋషులను జంపితి వని నేను వినియుంటిని. రాజా! నీవలన దుఃఖపడుచుండు దేవతలు ప్రతిక్రియకై చేయునేర్వాట్లు నేను వినియుంటిని. రాక్షసాధిపా! నీవనేకపర్యాయములు నన్ను నిరాకరించితివి. నీయందుఁ బ్రీతిగల బంధువులయెడ బాలభావమున నపరాధివయితివి. నేను రుద్రసంబంధమైన వ్రతము నవలంబించి నియమముతో నియమింపఁబడిన యింద్రియములు గలవాఁడనై ధర్మము నుపాసించుచుండుటకుఁగా హిమవత్పర్వతము మీఁదికిఁ బోయియుంటిని. అచ్చట

నేను బార్వతితో గూడియున్న యీశ్వరునిఁ జూచితిని. హఠాత్తుగా నాయెడమక న్నా దేవియందుఁ బ్రసరించినది. "ఈమె యెవరు చెపుమా యింతసుందరమూర్తి?"యని చూచితిని గాని, మఱియొక దురుద్దేశముతోఁ జూచినవాఁడను గాను. ఈమె నిరుపమానమైన రూపమును ధరించిన రుద్రాణి. ఆదేవి తన దివ్య మయిన ప్రభావముచేత నాయెడమకంటిని దహించినది. దీపము ధూళి పడి ధ్వంసమయినట్లు కంటిలోనిపాప పింగళ వర్ణమైపోయినది. తరువాత నే నచ్చటనుండి విస్తీర్ణమగు నాకొండ యొక్క మఱియొకతటమునకుఁ బోయి యొనిమిదివందలసంవత్సరములు మహావ్రత మవలంబించితిని. నానియమము పూర్తికాఁగానే యీశ్వ రుఁడు సంతోషించి "నాయనా! నీవు దేవిరూపమును జూచుటవలన నీకన్ను పింగళవర్ణమును బొందినది. ఇపుడు నీవు చేసినతపస్సునకు నేను సంతోషించితిని. ఈవ్రతమును వెనుక నే నవలంబించితిని. ఇపుడు నీవు చేయఁగలిగితివి ఇటువంటివ్రతము పూర్తి చేయఁదగువాఁ డీకనొకరుఁ డుండఁబోఁడు. దుష్కర మగు నీవ్రతమును నేనే మొట్టమొదటఁ గని పెట్టితిని. కనుక నిటుపయిని నాతోఁ జెలిచేసి యుండుము. తపస్సుచేతను జయమును పొందిన నీవు నాకు స్నేహితుఁడవై యుండుము. దేవి నీయెడమకన్ను తనదివ్యప్రభావముచేత దహించినది గనుక నీకిటుపయిని శాశ్వతముగా నేకాక్షిపింగళుఁ డనుపేర లోకములయందుఁ బ్రసిద్ధ మగును." అని సంతోషపూర్వకముగా నీశ్వరుఁ డనెను. ఈరీతిగా నాదేవదేవునితో సఖ్యమును సంపాదించుకొని యాయన యాజ్ఞవలన నింటికి వచ్చి నీవు చేయుపాపపుఁబను లన్నియు వింటిని. కావున నాయనా! వంశమునకు నిందను గలిగించు నిట్టియధర్మసంబంధము సుండి మనస్సును మరలించుకొనుము. ఋషులు దేవతలు మొదలగువా రందఱును నేకమయి నీచావున కుపాయ మాలోచించుచున్నట్లు వినవచ్చినది."

ఇట్లు కుబేరునిమాటలుగా దూత చెప్పఁగా విని, దశగ్రీవుఁడు కోపించి కన్ను లెఱ్ఱఁజేసికొని హస్తములను జఱచి పండ్లు పటపటగొఱికి "ఓరీ దూతా! నీవుప్రేలినమాటలయర్థముఁ దెలిసికొంటిని. నీవు నుండవు; నిన్నుఁ బంపిన యానాభ్రాతయు నుండఁడు. ధనేశ్వరుఁడు నాకు బోధించునది హితమునుగాదు. మూఢా! శివునితోఁ జెలిమిని నాకు విని పించితివి. ఆమాట యేమాత్రమును మన్నింపఁదగినదికాదు. దూతా!

యింతవఱకును జ్యేష్ఠుఁడు గురుసమానుఁ డని యాలోచించి చంపఁగూడ దని మన్నించి యున్నాను. ఇపుడు నీవు చెప్పిన యాతని మాటలు వినిన పిదప నేను నాబాహాబలము నాశ్రయించి మూఁడులోకములను జయింప నిశ్చయించితిని. ఒక్కయాతని కారణమున నలుగురులోకపాల కులను జంపి మృత్యువున కప్పగించెదను" అని చెప్పి రావణుఁడు వెంటనే యాదూతను గత్తితో నఱికివైచి హానిశారికమును దుర్గ్రహులగు రాక్షసు లను దినుఁ డని యాజ్ఞాపించెను. తరువాత బ్రయాణ మంగళాశీర్వ్యా దములను బడసినవాఁడై రథమెక్కి మూఁడులోకములును జయించుకోరి కతో బయలుదేఱి ముందుగాఁ గుబేరునిమీఁదికిఁ బోయెను.

14-వ సర్గము

రావణుఁ డన్నపై దాడి వెడలుట

తరువాత నారావణుఁడు బలగర్వితులును యుద్ధమునందుఁ గోరిక గలవారును నగు మహోదరుఁడు ప్రహస్తుఁడు మారీచుఁడు శుకుఁడు సారణుఁడు ధూమ్రాక్షుఁడు నను నాఱుగురుమంత్రులతోడను గూడిన వాఁడై, కోపమువలన లోకములను దహించువానివలె బయలుదేఱి పట్టణములను నదులను కొండలను వనములను ఉపవనములను దాఁటి మహార్ఘకాలములోఁ గైలాసపర్వతమును జేరెను. ఆకొండ మీఁదను యుద్ధసన్నద్ధుఁడై మంత్రులతోఁగూడి కూర్చుండియున్న రావ ణునిఁ జూచి వాని యెదుట నిలువఁబడఁ జాలక యక్షులు వీఁడు తమరా జగు కుబేరునకుఁ దమ్ముఁడన్న సంగతి దెలిసికొని కుబేరుఁ డున్న చోటికిఁ బోయి రావణునివ్యాపారమంతయుఁ గుబేరునితో విన్నవించిరి. వెంటనే కుబేరుఁడు తనవారిని యుద్ధమునకుఁ బొండని పంపివిచ్చెను. ఇట్లును జ్ఞాతులై సంతోషించుచు యక్షులు యుద్ధమునకు సన్నద్ధులయిరి. తరు వాతను నైఋతరాజగు కుబేరునిసైన్యము పొంగుచున్న సముద్రమువలె సంక్షోభించినదై పర్వతమును సంచలింపఁజేయునా యని తోఁచినది. తరు వాతను యక్షులకును రాక్షసులకును సంకులముగా యుద్ధము జరిగినది. రావణునిమంత్రులు చాలఁ బీడింపఁబడిరి. రావణుఁ డట్టియక్షసైన్య మును జూచి విశేషముగా హర్షనాదములు చేయుచుఁ గోపముతోఁ నెదురుకొనెను. ఘోరవిక్రము లగు నారావణునిమంత్రు లొక్కఁ

డొక్కఁడు వేయేసిమంది యక్షులతో యుద్ధము చేసిరి. తరువాతను గదలచేతను, ముసలములచేతను, కత్తులచేతను, శక్తులచేతను, తోమర ములచేతను కొట్టఁబడుచునే రావణుఁ డాయక్షసైన్యములోఁ బ్రవే శించెను. ఇట్లు ప్రవేశించి యాపిరి తిరుగకుండఁ గొట్టఁబడుచు వర్షించు మేఘములవలె బాణములను విడుచునాయక్షులచే నరికట్టఁబడెను. ఎంత వర్షించినను పర్వతము చలింపనట్లు యక్షు లెంతగాఁ గొట్టుచున్నను రావణుఁడు వ్యథపడఁడాయెను. తరువాత దుర్ధర్షుఁడగు నారావణుఁడు కాలదండమువఁటి గద పట్టుకొని యక్షసైన్యమును యమునియింటికిఁ బంపమొదలిడెను. ఆరావణుఁ డెండుకట్టెలను ఎండుగడ్డిని వాయు ప్రేరితుఁడైన యగ్ని దహించినట్లు యక్షసైన్యమును దహించెను. మహో దరుఁడు శుకుఁడు మొదలగు రావణునిమంత్రులు చావఁగా మిగిలియున్న యక్షసైన్యమును గాలి మేఘములను బరువెత్తించినట్లు పరువెత్తించిరి. కొందఱు యక్షులు చచ్చియు నలిగియు నాయుద్ధభూమిలోనే పడిపోయిరి. మఱికొందఱు తీక్ష్ణములయిన తమదంతములచేఁ బెదవులను గఱచు కొనుచుఁ బడిపోయిరి. మఱికొందఱు మిక్కిలి యలసి యొకరి నొకరు గౌఁగిలించుకొని చేతులలోనుండి జాఱిపోయిన యస్త్రముల నెఱుంగక పడిపోయిరి. మఱికొందఱు నీటివేగముచేఁ గూలెడు నదులఁదరులవలెఁ గూలిపోయిరి. చచ్చి స్వర్గమునకుఁ బోవువారిచేతను భూమిపై యుద్ధము చేయువారిచేతను యుద్ధమునుజూచు ఋషులు మొదలగువారిచేతను ఆక సమున నెచ్చటఁజూచినను దెఱపిలేకుండనున్నది. మహాబలులగు యక్షులు భగ్నులై రన్నసంగతి విని కుబేరుఁడు మరల మఱికొందఱు యక్షులను యుద్ధమునకుఁ బంపెను. శ్రీరామా! ఇంతలో సంమోహకంటకుఁ డను పేరుగల యక్షుఁడు విస్తారమైన బల వాహనములు గలవాఁడయి వచ్చి విష్ణుమూర్తివలెనే చక్రముచే మారీచునిఁ గొట్టెను. ఆదెబ్బచే వాఁడు పుణ్యము క్షీణించినవాఁడు స్వర్గమునుండి పడినవడువున నాకొండమీఁది నుండి క్రిందఁబడెను. ఇట్లు క్రిందఁబడి కొంతసేపటికిఁ దెలివిఁ దెచ్చుకొని లేచి యామారీచుఁడు కొంచెముసేపు విశ్రమించి వచ్చి యాయక్షునితో యుద్ధము సేయఁగా, నిలువఁబడఁజాలక యాయక్షుఁడు పారిపోయెను. తరువాతను బంగారుచేఁ జిత్రింపఁబడినదియు వైడూర్యమాణిక్యము లచేఁ బొదుగఁబడినదియు ద్వారపాలకులకు హద్దుగా నేరుపాటు చేయఁ

బడినదియు నగు తోరణము నొద్దకు రావణుఁడు రాఁగా, సూర్యభానుఁ డను పేరుగలయక్షుఁ డాద్వారమునొద్దనుండువాఁడు రావణుని లోపలకుఁ బోకుండ నడ్డెను. ఇట్లాదాద్వారపాలుఁ డడ్డుచున్నను నిలువక రావణుఁడు లోపలఁ బ్రవేశించుచుండుట చూచి యాయక్షుఁడు తోరణమును బెల్ల గించి దానిచేత నారావణుని గొట్టెను. అప్పు డాదెబ్బ తిని రావణుఁడు రక్తము గ్రక్కుచు గైరికాదిధాతువులను స్రవించు కొండవలెఁ బ్రకా శించెను. అట్లు కొండశిఖరమువంటి తోరణముచేతఁ గొట్టఁబడియు బ్రహ్మ యిచ్చినవరము ప్రభావమువలన వీరుఁడగు రావణుఁడు చావక, మరలఁ దా నాతోరణముతోనే పట్టి యాయక్షుని గొట్టఁగా వాఁడు భస్మీకృతశరీరుఁడై కానరాకపోయెను. తరువాత నాయక్షు లంబరమును రావణునిపరాక్రమమును జూచి నిలువలేక భీతులై తమయాయుధముల నాయుగ్రభూమిలోనే విడిచిపెట్టి శాంతమును బొందినవారై తెల్లఁబోయిన మొగములు గలవారై పాఱిపోయి నదులలోను కొండగుహలలోను ప్రవేశించిరి.

15-వ సర్గము

యక్ష రాక్షసుల యుద్ధము

తరువాత యుద్ధమునుండి వేలకొలఁది యక్షులు పాఱిపోయి రన్నసంగతి విని కుబేరుఁడు మహాయక్షుఁ డగు మాణిభద్రునిఁ జూచి యిట్లనియె: "ఓయీ యక్షశ్రేష్ఠుఁడా! దుర్వృత్తిగలవాఁడును, పాపా త్ముఁడును నగు రావణునిఁ జంపుము. యుద్ధవిశారదులును మహావీరులును నగు యక్షులకు దిక్కుగమ్ము." అని యిట్లు చెప్పఁగానే మహాబాహుఁ డును సుదర్శనుఁడును నగు మాణిభద్రుఁడు నాలుగులక్షలమంది యక్షులతోఁ గూడినవాఁడై రాక్షసులతో యుద్ధము చేయ మొదలిడెను. ఆయక్షులప్పుడు గదలు, ముసలములు, ప్రాసములు, శక్తులు, తోమర ములు, ముద్గరములు మొదలయిన యాయుధములతోఁ గొట్టుచున్న వారై రాక్షసులను బరుగెత్తించిరి. మఱియు వారు డేగలవలె లఘు గతిగలవారై దొమ్మియుద్ధము చేయుచుండిరి. మిమ్ములను బ్రాణములతో విడువ మని గట్టిగా గేకలువైచి చెప్పుచుండిరి. తరువాతను గంధర్వ లతోఁ గూడినదేవతలు బ్రహ్మవాదులగు మునులు మొదలగువా రా

ద్వంద్వయుద్ధము చూచి మిక్కిలి విస్మయమును బొందిరి. అప్పుడు ప్రహస్తుఁ డొక్కలక్షమంది యక్షులను జంపెను. మహోదరుఁ డనురాక్షసుఁ డింకొక లక్షమందినిఁ జంపెను. మఱియు మారీచుఁ డనువాఁడు కోపించి తెప్ప పాటులో మిగత రెండులక్షలమంది యక్షులను జంపెను. అమాయకు లగు యక్షులుచేయు యుద్ధ మెక్కడ? మహామాయాధురంధరులగు రాక్షసులు చేయు యుద్ధ మెక్కడ? పురుషవ్యాఘ్ర వగు శ్రీరామ చంద్రా! కావున యుద్ధములో రాక్షసు లధికు లయిపోయిరి. అప్పుడు ధూమ్రాక్షుఁడు కోపముతో వచ్చి మాణిభద్రుని గుండెలమీఁద పుసలముతోఁ గొట్టెను; గాని యతఁ డాదెబ్బకుఁ గంపించినవాఁడు గాఁడు. తరువాతను మాణిభద్రుఁడు గదను గిర గిరఁ ద్రిప్పి ధూమ్రాక్షుని నెత్తిమీఁదఁ గొట్టఁగా, వాఁడు వికలేంద్రియుఁడై యాదెబ్బతోనే క్రిందఁ బడిపోయెను. అట్లు దెబ్బతిని రక్తము గాఱుచుండఁగా ధూమ్రాక్షుఁడు క్రిందఁబడిపోవుట చూచి రావణుఁడు మాణిభద్రునిమీఁదికిఁ బరుగెత్తెను. యక్షశ్రేష్ఠుఁ డగు మాణిభద్రుఁడు కోపించి తనమీఁదికి వచ్చుచున్న రావణుని మూఁడు శక్తులతోఁ గొట్టెను. అట్లు దెబ్బలు దిని రావణుఁడు మాణిభద్రునికిరీటమునుమీఁదఁ గొట్టెను. వాఁడు కొట్టిన యాదెబ్బచేత నతనికిరీటము ప్రక్కకుఁ దిరిగిపోయినది; యుద్ధము చేయు చున్న యామాణిభద్రుఁ డించుకయేనియును గంపమునొందక నిలువఁ బడెను. అది మొద లాయక్షుఁడు పార్శ్వశూలి యని ప్రసిద్ధి నొందెను. ఆయక్షుఁడు విముఖుఁడు కాఁగానే యాపర్వతమునీఁద గొప్ప కలకల ధ్వని పుట్టినది.

తరువాతను శుక్రుఁడు ప్రోష్ఠపదుఁడు ననుమంత్రులతోడను, పద్మశంఖనిధుల యధిదేవతలతోడను గూడియున్న వాఁడై గద పట్టుకొని కుబేరుఁడు దూరమునుండి చూచెను. అంత నాకుబేరుఁడు శాపవశమున గౌరవముపోయియున్న తమ్ముని రావణునిఁ జూచి బుద్ధిమంతుఁడు గనుక బ్రహ్మవంశమునకుఁ దగినట్లుగా ని ట్లనియె: "ఓరీ దుర్మతీ! నే నెంత వారించినను నామాటలు లక్ష్యము సేయకుండ నుంటివి. తరువాతను నీవు దీనికిఁ దగినఫలమునుబొంది నరకములో నున్నప్పుడు తెలిసికొందువు గాక! ఏదుర్బుద్ధి యజ్ఞానమువలన విషము ద్రావి తెలిసికొనఁజాలఁడో, వాఁడు దానిపరిణామమువలన దానిఫలము ననుభవించి తెలిసికొనును.

నీవు దుష్కార్యముల నాచరించుచు నీయజ్ఞానమును దెలిసికొనలేకున్న కారణమున నీకు దేవత లెట్టిమేలును దలంపరు. ఎవఁడు తల్లినిగాని, తండ్రినిగాని, యాచార్యునిగాని యవమానించునో వాఁడు దానికిఁ దగినఫలమును యమునియింటికి వెళ్ళినప్పుడు తప్పక పొందును. ఎవఁడు మూర్ఖుఁడై యశాశ్వతమైన శరీర ముండఁగనే తపస్సు చేయకుండునో వాఁడు చచ్చినవెనుకఁ దనకుఁ దటస్థించిన యధమగతికిఁ బశ్చాత్తాపమును బొందకపోఁడు. ధర్మమార్గమున సంచరించువానికి రాజ్యము, ధనము, సౌఖ్యము మొదలగునవి చేకూఱును. అధర్మమార్గమున సంచరించు వానికి దుఃఖముతప్ప వేఱొండులేదు. కావున సుఖాదులకై సదా ధర్మ మాచరించవలయును. పాపపుఁబనులుచేయరాదు. పాపమునకు దుఃఖము దక్క వేఱుఫలము రాదు. ఆదుఃఖమును దానే యనుభవించితీఱును. కావున మూఢుఁడు తనహానికొఱకే పాపము నార్జించుకొనును. బుద్ధి హీనుఁడగు నేపురుషునకును దనంతటనే శుభమతి గలుగఁబోదు. తానెట్టి కర్మము నాచరించునో యట్టిఫలమునే యనుభవించును. లోకములోని పుణ్యాత్ములు పుణ్యకర్మములచేతనే దానికి ఫలముగా మంచిబుద్ధిని, రూప మును, బలమును, ధనమును, పుత్రులను, మహత్త్వమును బొందుచుందురు. నీబుద్ధి యిట్టిదుష్కార్యములో నున్నది గనుక నీవు తప్పక నరకమునకుఁ బోదువు. నీవు మొత్తముమీఁద దుష్కర్మలలోనే చేర్పఁదగినవాఁడ వని నిర్ణయించుకొంటిని. కావున నీతో మాటలాడుటగూడఁ దగదు."

కుబేరుఁ డిట్లు చెప్పఁగానే మారీచుఁడు మొదలగు రావణుని మంత్రులందఱును విముఖులై పాఱిపోయిరి. తరువాతను దశగ్రీవుఁడు మహోత్సుఁ డగు నాకుబేరునిచే గదతో నెత్తిమీఁదఁ గొట్టఁబడెనుగాని నిలువఁబడినచోటునుండి కదలలేదు. తరువాతను రామా! వారిద్దఱును బరస్పరమును గొట్టుకొనుచు వికలేంద్రియులునుగా లేదు; అలసతనుబొందలేదు; పట్టుపల మొనలే విడువరైరి. అప్పుడు కుబేరుఁడు రావణునిపై నాగ్నేయాస్త్రమును ప్రయోగించెను. రాక్షసేంద్రుఁడగు రావణుఁడు వారుణాస్త్రముతో దానిని హరించెను. తరువాతను రావణుఁడు రాక్షస మాయ నవలంబించి వందలకొలఁది వేలకొలఁది రూపములఁ జూపించెను. దశాననుఁ డొకప్పుడు పెద్దపులివలెను, వరాహమువలెను, జీమూతము వలెను, మఱొకప్పుడు పర్వతమువలెను, సముద్రమువలెను, వేఱొకప్పుడు

చెట్టువలెను, యక్షునివలెను, రాక్షసునివలెను నగపడుచుండెను. ఈరీతిగా బహురూపములు మాత్రమే యగపడుచుండెడివి కాని రావణుఁడు మాత్ర మగపడుట లేదు. తరువాత నాదక్షానసుఁడు, రామా! గొప్పయస్త్రమును బట్టుకొనియు, గొప్ప గదను గిరగిరఁ ద్రిప్పియు నాకుబే రుని నెత్తిమీఁదను గొట్టెను. ఈరీతిగా నాకుబేరుఁడు రావణునిచేతఁ గొట్టఁబడి వికలేంద్రియుఁడై రక్తముచేఁ దడిసినవాఁడై మొదలు నఱికిన యశోకవృక్షమువలె భూమిపైఁ బడిపోయెను.

తరువాతను బద్మాదినిధుల కధిదేవతలు వచ్చి యాకుబేరుని నందన వనమునకుఁ గొనిపోయి యచ్చట నతని నోదార్చుచుండిరి. ఇచ్చట రాక్షసేంద్రుఁడగు రావణుఁడు కుబేరుని జయించి సంతుష్టాంతరంగుఁడై యతనిని జయించినందులకుఁ జిహ్నముగా నతనిపుష్పకవిమానము నపహరించెను. బంగారు స్తంభములు గలదియు, వైడూర్యమణులచేఁ గట్టఁబడిన తోరణములు గలదియు, ముత్యములజాలకములచే నలంకరింపఁబడినదియు, కోరినకోరికల నెల్ల నిచ్చునదియు, మనోవేగముగలదియు, కామగమనము గలదియు, కామరూపముగలదియు, ఆకసమునఁ బోవఁదగినదియు, మణులచేతను బంగారుచేతను నిర్మింపఁబడిన సోపానములు గలదియు, పుటమువేసిన బంగారుతోఁ చేయఁబడిన యరుగులుగలదియు, దేవతలను మోయునదియు, భయమును బొందింప శక్యము గానిదియు, నెల్లప్పుడును జూపులకును మనస్సునకును సుఖమును గలిగించునదియు, మిక్కిలి యాశ్చర్యమును గలిగించునదియు, ననేకచిత్రవిచిత్రములైన రచనలు గలదియు, బ్రహ్మదేవునిచే నిర్మింపఁబడినదియు, సర్వకామములతోడను నిర్మింపఁబడినదియు, మనోహరమైనదియు, నిరుపమానమైనదియు నంత శీతమును నంతయుష్ణమును గాక సర్వఋతువులయందును సుఖకరముగా నుండునదియు, శుభకరమైనదియుఁ, దనపరాక్రమముచేజయించి స్వాధీనము చేసికోఁబడినదియు నగు నాపుష్పకవిమానమెక్కి దర్పోద్రేకముచే దుర్మతి యగు నారావణుఁడు మూఁడులోకములను జయించినట్లు తలంచుచుఁ గుబేరుని జయించి కైలాసమునుండి దిగెను. ప్రతాపవంతుఁడును విమలము లైన కిరీటములును హారములును గలవాఁడును నగు నారావణుఁడు తన తేజస్సుచేత విపులమైన జయమును బొంది, గొప్పది యగు నావిమానము పైనుండి వేదికయందలి యగ్నివలె వెలుఁగుచుండెను.

16-వ సర్గము

రావణుఁడు కైలాస మెత్తుట

రామా! ఇట్లు రాక్షసాధిపతియగు రావణుఁ డన్న యగు కుబేరుని జయించి కుమారస్వామి పుట్టినస్థలమగు శరవణమునకుఁ బోయెను. అట్లు పోయి కిరణములసమూహముచే నావరింపఁబడి రెండవసూర్యునివలె వెలుఁగుచున్న బంగారువికార మైన గొప్పతెల్లువనమును జూచెను. అతఁడు రమ్యమయిన వనములుగల యొకానొక పర్వతము నెక్కి యక్కడనుండి పుష్పకవిమానము నిలువఁబడిపోవుట చూచెను. అట్లు కదలక నిలువఁబడిపోవుట చూచి "కామగమనముగల యీవిమాన మెందులకు నిలువఁబడిపోయినది?" అని తనమంత్రులతో నాలోచించెను. "ఈవిమానము నాయిష్టప్రకారముగా నెందులకుఁ బోవకుండనున్నది? ఈపర్వతము మీఁద నెవ్వఁడయినను నుండి యిట్లు చేయుచున్నాఁడా?" అని రావణుఁడనుచుండఁగా బుద్ధిమంతుఁడగు మారీచుఁడు లేచి యిట్లనియె: "రాజా! ఈపుష్పక మిచ్చటినుండి కదలకయుండుటకుఁ గారణ మేదియే నుండఁబోలును. ఇది కుబేరునివాహనముగాని యితరులది గాదు. ఒకవేళ నతనిని దక్కఁ దక్కినవారిని మోయదేమో? కావుననే కుబేరుఁడు లేకుండుటచేనిది చలనము మాని నిలువఁబడిపోయినది." అని యిట్లు మారీచుఁడు చెప్పుచుండఁగానే కరాళుఁడును, కృష్ణపింగళుఁడును, వామనుఁడును, వికటుఁడును, ముండియు, వంగిన భుజములు గలవాఁడును, బలవంతుఁడును, శివభగవానుని పార్శ్వచరుఁడునునగు నంది వచ్చి రావణునితో నిశ్శంకముగా నిట్లనియె: "దశగ్రీవా! ఇక్కడనుండి మరలి పొమ్ము. ఈపర్వతముపైని శంకరుఁడు క్రీడించుచున్నవాఁడు. సుపర్ణులు, నాగులు, యక్షులు, దేవతలు, గంధర్వులు మొదలగు నేభూతములకును నీపర్వత మగమ్యముగఁ జేయఁబడినది. ఓరిదుర్బుద్ధీ! నీ విచ్చటనుండి మరలిపోకుందువేని వినాశమును బొందఁగలవు."

అని యిట్లు చెప్పిన నందిమాటలు విని కోపమువలనఁ గదలుచున్న కుండలములు గలవాఁడై కన్ను లెఱ్ఱఁజేసికొని పుష్పకవిమానము నుండి దిగి, యారావణుఁడు "ఎవఁడాశంకరుఁడు" అని వెంటనే కొండయడుగునకు వచ్చెను. వచ్చి యచ్చట శివునికి సమీపముగానే యున్న నందిని

జూచెను. అనంది జాజ్వల్యమానుఁడై చేతితో శూలము పట్టుకొని రెండవశంకరునివలె నుండెను. ఆరాక్షసుఁడు వానరముఖుఁడగు నానంది నవమానపఱచి నీటితో నిండియున్న మేఘము గర్జించినట్లు పెద్దనవ్వు నవ్వెను. శంకరభగవానుని యపరశరీరమగునానందిభగవానుఁడు కోపించి యచ్చట నిలువఁబడియున్న రాక్షసుని రావణునిఁ జూచి యిట్లనియె : "దశాననా! వానరరూపుఁడనగు నన్ను వమానించి పెడగుపాటుతో సమానముగఁ జూప్పుడగునట్లు నవ్వితివి; కనుక నాతో సమానమైన రూపముగలవారును, మద్వీర్యముతో సమానమైన వీర్యముగలవారును, యుద్ధోన్మత్తులును, బలోద్రిక్తులును, నడగొండలవంటివారును, నఖములు దంష్ట్రలును ఆయుధములుగాఁ గలవారును, క్రూరులును, వాయువేగమనోవేగములు గలవారును నగు వానరులు నీకులమును నిన్నును జంపుట కొఱకుఁ బుట్టఁగలరు. వారు ప్రబలమైన నీగర్వమును, నీయాటోపమును బోఁగొట్టుదురు. మఱియు నిన్ను మంత్రులతోడను బుత్రాదులతోడను యుద్ధములోఁ జంపఁగలరు. నిశాచరా! నేనే ని న్నిప్పుడు చంపఁగలను గాని చంపఁదగినవాఁడవు గావు. ఇదివఱకు నీవు చేసిన చెడుకర్మముల చేతనే చచ్చియున్నావు." మహోత్సుఁడును స్వయంప్రకాశమానుఁడును నగు నంది యిట్లు చెప్పుచుండఁగా దేవదుందుభులు మ్రోఁగినవి. అంత రిక్షమునుండి పుష్పవర్షము గురిసినది. మహాబలుఁడగు నారావణుఁడు నందిచెప్పినమాటలు లక్ష్యముసేయకయే పర్వతముదగ్గఱకుఁ బోయి యిట్లనియె : "గోపతీ! నేను బోవుచుండఁగా నాపుష్పకమయొక్కగమన మాఁగిపోయినది గావున నే నిపు డీపర్వతమునే పెల్లగించెదను. నీయేలిక యగు భవుఁ డేప్రభావముచేత రాజువలె నిత్యమును క్రీడించు చుండెనో తెలిసికోవలసియున్నది. అతనికి భయంకరుఁడనగు నేను వచ్చి యున్నానని తెలిసియుండలేదు గాఁబోలును!" రామా! ఇట్లు చెప్పి రావణుఁడు తనబాహువులను క్రిందికిఁజొనిపి యాపర్వతమును మీఁది కెత్తమొదలిడెను. అప్పు డప్పర్వతము కంపించినది. పర్వతచలనమువలన దానిపైనున్న ప్రమథులు పార్వతియుఁ గంపముఁజెందిరి. పార్వతి భయపడి వెంటనే మగనిఁ గౌఁగిలించుకొన్నది. తరువాతను దేవదేవుఁడగు శివుఁడు సంగతిని దెలిసికొని తనపాదాంగుష్ఠముచేత నాపర్వతమును లీలగాఁ గ్రిందికి నొక్కెను. ఆనొక్కుటవలనఁ గొండ క్రిందను బడియున్న

రావణునియిరువదిచేతులును గానుగలోఁ బెట్టినచెఱుకుగడలవలె నలిగి పోయినవి. అచ్చట నిలువఁబడి చూచుచున్న రావణునిమంత్రు లాశ్చర్యమును బొందిరి. రావణుఁడు రోషముచేతను భుజములబాధచేతను మూఁడులోకములును గంపమునొందునట్లు వెంటనే మొఱ్ఱిపెట్టుటకు మొదలిడెను. మానవు లాశబ్దముచే భీతినొందినవారై ప్రళయము దాపురించిన దని తలఁచిరి. అప్పుడు దేవేంద్రుఁడు మొదలైనదేవతలు తమస్థానములనుండి చలనమును బొందిరి; సముద్రములు క్షోభించినవి. పర్వతములు కదలినవి. యక్షులు, విద్యాధరులు, సిద్ధులు మొదలగువారిది యేమని యాకులపాటొందిరి. తరువాత నతనిమంత్రు లిట్లు మొఱ్ఱిపెట్టుచున్న రావణునిఁ జూచి యిట్లనిరి: "రాక్షసరాజా: నీలకంఠుఁడును, ఉమాపతియు నగుమహాదేవుని స్తుతించి సంతోషపెట్టుము. ఇపు డతనిని విడిచి వేఱు దిక్కు గనుపడదు. నమ్రుఁడవై స్తుతించుచు నతనినే శరణు పొందుము. దయాళుఁడగు శంకరుఁడు నీయం దనుగ్రహము గలవాఁడగును." ఇట్లు మంత్రులు చెప్పఁగానే యారావణుఁడు నమస్కారపూర్వకముగా సామములచేతను, వివిధములైన స్తోత్రములచేతను వృషభధ్వజుఁడగు శివుని స్తుతించెను. ఇట్లు స్తుతిచేయుచు నేడుచుచు నుండఁగాఁ నొక్కవేయిసంవత్సరములు గడచినవి.

శ్రీరామా! తరువాతను గొండశిఖరముపైనున్న శివుఁ డాతని స్తుతులకు సంతోషించి పాదాంగుష్ఠమును దీసివైచి రావణునితో నిట్లనియె: "దశాననా! నీపరాక్రమమునకును, నీశౌండీర్యమునకును నీ స్తుతికిని నేను జాల సంతోషించితిని. కొండక్రిందను బడి నీచేతులు నలుగుచున్నప్పుడు నీచే విడువఁబడినధ్వని మూఁడులోకములను భయము పాలుచేసి పరుగులెత్తించినది; కనుక నీ వింటుపైని రావణుఁడవని పేరు పడయఁగలవు. ఇటుపైని దేవతలు, మనుష్యులు, యక్షులు, మఱియు నితరులు లోకరావణుఁడవగు నిన్ను రావణుఁడనియే వ్యవహరించుచుందురు. పౌలస్త్యా! ఇటుపైని నీయిష్టమైనవారిని బొమ్ము. నేను నీకనుజ్ఞ యిచ్చితిని." ఇట్లు శివుఁడు చెప్పినమాటలు విని యాయనతో రావణుఁడిట్లనియె: మహాదేవా! నీవు నావిషయమై సంతోషించితివేని యాచించుచున్న నాకు వరమిమ్ము. నే నిదివఱకే దేవగంధర్వాదులచేఁ జావులేకుండ వరమును బొందియుంటిని. మనుష్యులను నేను లెక్కసేయను. పాపము!

వారు స్వల్పులు కదా! దేవా! వారు నన్నేమిచేయఁగలరు? త్రిపురాం తకా! నేను బ్రహ్మవలన దీర్ఘమైన యాయువును బొందియే యున్నాను. బ్రహ్మ యిచ్చిన యాయువులోఁ బోయినభాగమును, శస్త్రమును నిన్నుఁ గోరుచున్నాను. అవి నాయం దనుగ్రహించి నాకు దయచేయుము. రావణుఁ డిట్లు కోరఁగానే యాశంకరుఁడు చంద్రహాస మనువేరుగల ఖడ్గ మును, ఆయుశ్శేషమును వాని కిచ్చి మరల వానితో నిట్లనియె: "రావణా! నీ వెప్పుడును దీని నవమానింపకుము. ఎప్పుడు నీవు దీని నవమానింతువో, అప్పుడే యిది నిస్సంశయముగా నాయొద్దకు వచ్చి చేరును." ఇట్లు శివునిచే రావణుఁడని నామకరణము చేయఁబడి యాయ నకు నమస్కరించి వెంటనే పుష్పకవిమాన మెక్కెను. రామా! తరువా తను రావణుఁడు మహావీర్యసంపన్నులగు రాజులను బాధించుచు భూమితలమున నిటునటుఁ దిరుగుచుండెను. తేజశ్శాలులును శూరు లును నగుకొందఱు క్షత్రియులును యుద్ధదుర్మదులై వానియాజ్ఞను మన్నింపక సపరివారముగా నశించిపోయిరి. మఱికొందఱు బుద్ధిమంతులు వీఁడు జయింపఁదగినవాఁడుగాఁడని నిశ్చయించుకొని యోషితిమని చెప్పి బలగర్వితుఁ డగు నతనికి లొంగియుండిరి.

17-వ సర్గము

వేదవతి వృత్తాంతము

శ్రీరామచంద్రా! పిమ్మట మహాబాహుఁడగు రావణుఁడు భూమి యందుఁ దిరుగుచు హిమవత్పర్వత ప్రాంతమునకు వచ్చెను. అచ్చట నొక కన్యక ఋషులమాదిరిగాఁ గృష్ణాజినజటావల్కలముల ధరించి దేవకన్యక వలె జాజ్వల్యమానురాలై యతని కగపడినది. రూపవంతురాలును మహావ్రతపరాయణురాలును నగు నాకన్యను జూచి కామమోహాపరీతా త్ముఁడై యారావణుఁడు నవ్వుచు నిట్లనియె: "సుందరీ! నీవేల యీ శీలను యౌవనమునకు విరుద్ధమైన యీవ్రతము నవలంబించియున్నావు? నీరూపమున కీతపస్సు చేయుట యెంతమాత్రమును యుక్తము గాదు. భీరూ! నీరూపము నిరుపమానమైనది. మఱియు మనుష్యులకుఁ గామో న్మాదమును గలిగించునది. కనుక నిటువంటిరూపమును దపస్సునం దుంచుట తగ దని నేను నిశ్చయించితిని. వరవర్ణినీ! నీ వెవనికుమారితవు? బింబోష్ఠీ!

నీపతి యెవరు? అహాహా! నీవంటి మచ్చికంటిని బెండ్లియాడిన పురుషు నిది గదా యదృష్టము! నీ వెందుల కీలాగు శ్రమపడుచున్నావో నాకుఁ జెప్పుము." అనునతనిమాటలు విని యశస్వినీయగు నాకన్యక యథార్థా ముగా నతని కతిథిసత్కారాదు లొనరించి యిట్లనియె: "బృహస్పతి కుమారుఁడును, బుద్ధిచే బృహస్పతితో సమానుండును, శ్రీమంతుండును, అమితప్రభావంతుఁడును నగు కుశధ్వజుఁడను బ్రహ్మర్షి యుండెడివాఁడు. నిత్యమును వేదాభ్యాసమును జేయుచుండు నామహాత్ముని కుమారితను. నే నతనికి వాఙ్మయి యగు కన్యను. నాపేరు వేదవతి యందురు. దేవ తలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు మొదలగువారు వచ్చి మాతండ్రిని నన్నుఁ బెండ్లమకు భార్యగా నిమ్మని యడుగుచుండెడివారు. రాక్షసశ్రేష్ఠా! యెంద రెన్నివిధములుగా వచ్చి యడిగినను నన్ను వారి కెవ్వరికిని మాతండ్రి యీయ ననెను. అట్లీయ ననుటకుఁ గారణము చెప్పెద నాలకింపుము. సురేశ్వరుఁడును త్రిలోకీపతియునగు విష్ణుభగవా నుని జామాతనుగాఁ జేసికొనవలయునని మాతండ్రి సంకల్పించుకొనెను కావుననే న న్నితరుల కీయ నంగీకరింపకుండెను. ఆసంగతి తెలిసికొని బల దర్పితుఁడును రాక్షసరాజును నగు దంభుఁడు కోపించి రాత్రి పరుండి నిదురపోవుచుండఁగా వచ్చి మాతండ్రిని జంపిపోయెను. తరువాతను దీనురాలగు నాతల్లి మాతండ్రి మృతశరీరమును గౌఁగిలించుకొని యగ్ని లోఁ బ్రవేశించినది. తరువాత నేను మాతండ్రియొక్కసత్యమైన మనో రథమును బూర్తిచేయుట మనుసంకల్పము గలదానినై నారాయణుని మన స్సునే భర్తనుగాఁ జింతించుచు నిట్లు తపస్సుచేయుచున్నాను. రాక్షస పుంగవా! నావృత్తాంతమంతయుఁ జెప్పితిని. నారాయణుఁడు నాపెనిమిటి కాని యాపురుషోత్తమునికంటె నితరుఁడు గాఁడు. నారాయణుని వరించు కోసమై యీఘోరమైననియమము నవలంబించియున్నాను. పౌలస్త్య నందనా! రావణా! నిన్ను నేను దెలిసికొంటిని. నీవు పొమ్ము. నేను దపస్సుచేతను మూఁడులోకములయందు జరుగువృత్తాంతములు దెలిసి కొనఁగలను" అను నావేదవతిమాటలు విని సుమహావ్రతురాలగు నా కన్యను జూచి మన్మథబాణములకు వశంవదుఁడై విమానమునుండి దిగి యామెతో మిక్కిలి నిట్లనియె:

సుశ్రోణీ! నీవు గర్వించినట్లు కనుపట్టుచున్నావు. కావుననే నీ

బుద్ధి యీరీతిగా నున్నది. మృగశాబాక్షీ! తపస్సు మొదలగు పుణ్య సంపాదనము వృద్ధులకు శోభించును. సర్వగుణసంపన్నురాల వగు నీ వీరీతిగాఁ బలుకవచ్చునా? త్రైలోక్యసుందరీ! భీరూ! వ్యర్థముగా నీ యౌవనము పోవుచున్నది. సుందరీ! నేను లంకాధిపతిని. నాపేరు దశగ్రీవుఁ డందురు. అట్టినాకు భార్యవై సుఖముగా సమస్తభోగముల ననుభవించుము. ఎవనిని నీవు మాటిమాటికిని విష్ణుఁడనుచున్నావో వాఁ డెవఁడు? ఏపాటివాఁడు? వానికి నాపాటిపరాక్రమము గలదా? నావలెఁ దపస్సు చేసియున్నాఁడా? నే ననుభవించుచున్న భోగములు వాని కున్నవా? నాయంతటి బలవంతుఁడా? కామినీ! నీవు కోరు కొన్నవాఁ డేవిధము[illegible]నను నాతో సమానుఁడు గాఁడు." ఇట్లు రావణుఁడు చెప్పినన్[illegible]నిని యా వేదవతి యిట్లనియె: "రాక్షసరాజా! మూఁడులో[illegible]లయందుఁ బ్రభువును, సర్వలోకములవారిచేతను నమస్కరింపఁబడుచుండువాఁడును నగు విష్ణుమూర్తినిగూర్చి నీ విట్లనఁ గూడదు. నీవుదక్కఁ దక్కినవాఁ డెవఁడును నేమాత్రముబుద్ధియుండి నను విష్ణుమూర్తి నిట్లవమానింపఁడు." ఇట్లు వేదవతి యనఁగానే యా నిశాచరుఁడు రావణుఁడు తనచేతులతో నామెజుట్టు పట్టుకొనెను. తరువాతను వేదవతి కోపించినదై తనహస్తముచేతను దలవెండ్రుకలు ఛేదించినది. ఆమె చేయియే కత్తియై తలవెండ్రుకలను గోసివైచినది. మఱియు నాపె కోపముచే జాజ్వల్యమానురాలై నదివోలె రావణుని దహించుచున్నదివోలె మరణమునకు సంసిద్ధురాలై యెదుట నగ్నిని ప్రజ్వలింపఁజేసి వానితో నిట్లన్నది: "అనార్యా! నీచే నవమానింపఁబడినయీనాకు జీవిత మక్కఱలేదు. రాక్షసా! కావున నీవు చూచుచుండఁగానే యీ యగ్నిహోత్రములోఁ బ్రవేశించెదను. నే నీవనములోఁ దపస్సుచేసి కొనుచుండఁగా వచ్చి, పాపాత్మా! నన్ను నవమానించితివి గనుక నీ వధ నిమిత్తమై నేను మరలఁ బుట్టతీఱెదను. పాపనిశ్చయుఁడగు పురుషుని స్త్రీ చంపఁజాలదు. నిన్ను శపించినచో వ్యర్థముగా నాతపస్సు పోవును. ఒక వేళ నేను జేసినసుకృత మేదేని యున్నచో నయోనిజను బతివ్రతనుగా నావిర్భవించి ధర్మ యనునతనికిఁ గుమారిత నగుదును." ఇట్లు రావణునితోఁ జెప్పి వెంటనే మండుచున్న యగ్నిహోత్రములోఁ బ్రవేశించినది. అపుడాకాశమునుండి పుష్పవర్షము గురిసినది. ప్రద్మసమప్రభయగు

నామె మరల బ్రహ్మములోఁ బుట్టి యతనికే దొరకినది. పద్మగర్భముతో సమానమైన కాంతిగల యాకన్యను దీసికొని తనయింటికిఁ బోయి మంత్రికిఁ జూపించెను. లక్షణజ్ఞుఁడైన యామంత్రి యాకన్యను బాగుగాఁ బరీక్షించి యిది నీయింట నుండినచో నీవధకొఱ కగునని చెప్పెను. ఆ మాట వినఁగానే రావణుఁ డాకన్యను సముద్రములో విడిచెను. ఆకన్య క్రమముగా భూమిని బొంది యజ్ఞభూమిలో నాఁగటిచాలులో జనక రాజునకు దొరకినది.) ఆకన్యయే జనకమహారాజునింటఁ గన్నబిడ్డవలెనే పెరిఁగి నీకు భార్యయైనది. నీవేకదా సనాతనుఁడవగు విష్ణుఁడవు. పూర్వము కోపమును గలిగించిన రావణుఁ డను శత్రువును గొండవంటి వానిని మనుష్యదుర్లభమగు నీబలము నాశ్రయించి యామెయే చంపినది. ఆమహాభాగ్యురాలు మనుష్యలోకములో నీరీతిగా మరలఁ బుట్టినది. నాఁగటితో దున్నఁబడిన యజ్ఞభూమియందు వేదికయందలి యగ్ని శిఖవలె నామె పుట్టినది. పూర్వము కృతయుగములో వేదవతి యను పేరుతో నుండెడిది. త్రేతాయుగమున నారాఁకునుని జంపునిమిత్తమై మైథిలవంశమున మహాత్ముఁడగు జనకమహారాజుకూఁతు రని పేరుపొందినది. సీత యనఁగా నాఁగటిచాలు. దానియందు బుట్టినది గనుక నామె నందఱును సీత యని పిలుచుచుండువారు.

18-వ సర్గము

రావణుఁడు మరుత్తుని యజ్ఞవాటమునకుఁ బోవుట

శ్రీరామా! వేదవతి యిట్లు హుతాశనప్రవేశము కాఁగా రావణుఁడు పుష్పకమెక్కి భూమిపైఁ దిరుగుచుండెను. తరువాతను మరుత్తుఁడనురాజు దేవతలతోఁగూడి యజ్ఞము చేయుచుండఁగా రావణుఁడు చూచెను. బ్రహ్మర్షియు బృహస్పతికి సోదరుఁడును ధర్మజ్ఞుఁడును నగు సంవర్తుఁడు దేవతలందఱితోడనుగూడి యజ్ఞము చేయించుచుండెను. దేవత లారావణునిఁ జూచి వీఁడు వరదానమువలన దుర్జయుఁడని తెలిసికొని, వానిని జూడఁజాలనంతగా భయపడి తిర్యగ్జంతువుల యాకారము నవలంబించిరి. ఇంద్రుఁడు నెమిలియు, యముఁడు కాకియు, కుబేరుఁడు తొండయు, వరుణుఁడు హంసయు మఱికొందఱు దేవతలు మఱికొన్ని జంతువులుగాను నైరి. తరువాతను రావణుఁ డశుచి యగు కుక్కవలె

యజ్ఞవాటమునఁ బ్రవేశించెను. మరుత్తును జూచి యారావణుఁడు "యుద్ధమైనను జేయుము; లేదేని యోడితిననియేనిఁ జెప్పు"మనెను. తరువాతను మరుత్తమహారాజు "నీవెవ్వఁడ"వని యడుగఁగా నవ్వి రావణుఁడిట్లనియె. "రాజా! నీయకుతూహలభావమునకు, అనఁగా నన్నుఁ జూచియు నాశ్చర్యము లేకుండుటకు, భయము లేకుండుటకు, ఆదరము లేకుండుటకు నేను జాల సంతోషించితిని. నేను గుబేరునితమ్ముఁడను. నాపేరు రావణుఁడు; నన్నెఱుఁగఁ జాలకుండ నున్నావుగా! ఈమూఁడు లోకములయందును నాబల మెఱుఁగనివాఁడున్నాఁడా? వే యేల? నాయన్నను జయించి యీవిమాన మపహరించినవాఁడను." అను వాని మాటలు విని తరువాత నామరుత్తమహారాజు రావణునితో నిట్లనియె.

తండ్రితో సమానుఁడగు నన్ను జయించిన నీవు మహాధన్యుఁడవు. మూఁడులోకములయందును నీవంటి శ్లాఘింపఁదగినపురుషుఁడు లేఁడు. అధర్మసహితమైనపని శ్లాఘింపఁదగినది గాదు. అది యుత్తమలోకములను గూర్చునదియుఁ గాదు. అన్నను జయించుటకంటె దుష్కార్యపుఁబని యుండునే? అట్టినిందితమైనపని చేసియు మెచ్చుకొనుచున్నావుగా! నీవు పూర్వమం దేమిధర్మము నాచరించి వరమును బొందితివో కాని యిపుడు నీవు చెప్పుకొనుచున్నసంగతి నే నిదివఱకు విని యుండలేదు. దుర్మతీ! ఉండుండుము. నాయెదుటినుండి బ్రదికి పోఁజాలవు. ఇపుడే నిన్ను వాఁడిబాణములతోఁ జంపి యమునియింటికిఁ బంపెదను." అని చెప్పి యారాజు ధనుర్బాణములను గ్రహించి యుద్ధమునకు బయలు దేఱెను. అప్పుడు సంవర్తుఁడద్దముగా వచ్చి స్నేహమును సూచించు నట్లుగా నారాజుతో నిట్లనియె: రాజా! నీవు నామాట వినఁదలఁచితివేని వినుము. ఇపుడు వీనితో యుద్ధము మంచిది గాదు. ఈమహేశ్వరయజ్ఞము పూర్తిగానిచో వంశమును దహించును. యజ్ఞదీక్షితుఁడెట్లు యుద్ధము చేయఁదగును? మఱియు యజ్ఞదీక్షితునికిఁ గోపము దగునా? అదిగాక యుద్ధములో జయమే ఁలుగుననునిశ్చయ మెక్కడ? ఈరాక్షసుఁడా దుర్జయుఁడు." ఇట్లు గురువగు సంవర్తుఁడు చెప్పిన మాటలు విని యామరుత్తుఁడు యుద్ధవ్యాపారము మానుకొని శరచాపములు విడిచి మరలి యజ్ఞముచేసికొనుట కుద్యుక్తుఁడాయెను. తరువాత నతఁడే యోడిపోయె నని తలఁచి రావణునిమంత్రియగు శుకుఁడు, రావణుఁడే జయించె

నని చాటించి సంతోషముగాఁ బెద్దకేకలువై చెను. రావణుఁ డాయజ్ఞ వాట ములోనున్న ఋషులను భక్షించి వారిరక్తముచేఁ దృప్తి పొంది యచ్చట నుండి మఱియొకవై పునకుఁ బోయెను. ఇట్లు రావణుఁడు వెడలిపోయిన తరువాత నిద్రాదిదేవతలు తమతమ నిజరూపములను బొంది యాయా జంతువులను బిలిచి యిట్లనిరి :

అపు డింద్రుఁడు నల్లనిపించెముగల నెమిలిని జూచి సంతోష ముతో నిట్లనియె : "ధర్మజ్ఞా ! సంతోషించితిని. నాయీవేయికన్నులును నీపించవుమై నుండును. కావున నీకుఁ బాములవలన భయము లేదు. నేను వర్షించునపుడు ప్రీతిలక్షణమైన సంతోషమును బొందఁగలవు," ఈరీతిగా నింద్రుఁడు నెమిలికి వరమిచ్చెను. రామా ! పూర్వము నెమిళ్లకుఁ బించెములు నల్లగా నుండెడివి. ఇంద్రునివలన వరమును బొంది నెమి ళ్లన్నియు విచిత్రవర్ణములు గలవైనవి. అపుడు యముఁడు ప్రాగ్వంశము నందున్న కాకినిఁ జూచి యిట్లనియె: పక్షీ ! నేను నీవిషయమున సంతో షించితిని. నాసంతోషమునకు సూచకముగా నేను జెప్పునది వినుము. నేను వివిధరోగములచేఁ బ్రాణులను బీడించుచుండునట్లు నిన్నుఁ బీడిం పను. ఇది నాసంతోషమునకు సూచకము. ఓవిహంగమా ! నావరము వలన నీకు మృత్యువువలన భయము లేదు. నిన్ను మనుష్యులు చంపునం దాఁక బ్రతికియుండఁగలవు. అకలితోఁ బీడింపఁబడుచు నాలోకములో నున్నపితరులు నీవు భుజించినచో వారు బంధువులతోఁగూడ తృప్తిని బొందుదురు." తరువాతను వరుణదేవుఁడు గంగాజలవిహారి యగు హం సను జూచి యిట్లనియె : "ఓపక్షిరాజా ! ప్రేమతోఁగూడిన నామాటను వినుము : సౌమ్యా ! నీశరీరకాంతి చంద్రబింబముతో సమానమై మనో హరముగా నుండును. మఱియు శుద్ధమైన నురుగుతో సమానముగా నున్నతమై యుండఁగలదు. నాశరీరమగు జలమును బొంది నిత్యమును మనోహరముగా నుండఁగలవు. నిరుపమానమైన సంతోషమును గూడఁ బొందఁగిలవు. ఇదియే నీయందు నాకుఁ గలిగినప్రేమకు లక్షణము." రామా ! పూర్వము హంసలు నీలవర్ణము పాండురవర్ణము గలవియై యుండెడివి. మఱియు వానిఱెక్కలు నీలవర్ణముచేత నగ్రదేశమునందుఁ గూడియుండెడివి. ఉదరప్రదేశములు బాలతృణాగ్రముతో సమానమైన కాంతిగలిగి నిర్మలముగా నుండెడివి. తరువాతను గుబేరుఁడు కొండ

మీఁదనుండు తొండను జూచి యిట్లనియె: "ఓక్కకలాసమా! నేను నీయందుఁ జాలప్రేమగలవాఁడ నయితిని. నీకు బంగరువంటి కాంతి గలుగునట్లును, నీశిర స్సెప్పుడుచూచినను ద్రవ్యముతోఁ గూడి యుండు నట్లును వర మిచ్చితిని. నాప్రేమకు సూచకముగా నిదిగో బంగారువర్ణము నీకుఁ గలుగును." ఆయజ్ఞోత్సవమునందు దేవత లీరీతిగా వరము లిచ్చి యరాజుతోఁగూడఁ దమలోకమునకుఁ బోయిరి.

19-వ సర్గము

రావణుఁ డనరణ్యుని జంపుట

తరువాతను రాక్షసాధిపతి యగు నారావణుఁడు మరుత్తమహా రాజును జయించి యుద్ధము చేయుదమనుకోరికతో రాజు లుండు పట్టణ ములకు బయలుదేఱెను. మహాంప్రహరణోపములగు రాజులయొద్దకుఁ బోయి 'నాతో యుద్ధము చేయుటకు రం'డని పిలిచెను. 'యుద్ధముచేయఁ జాలరేని యోడితి'మనియైనను జెప్పుఁ డనెను. 'ఇదియే నానిశ్చయ' మనెను. 'ఈరెంటిలో నేదిచేయకయున్నను మిమ్ములను విడుచువాఁడను గా'ననెను. తరువాత భయములేనివారును, ప్రాజ్ఞులును, ధర్మనిశ్చయు లును, మహాబలులును నగురాజు లనోన్యము నాలోచించుకొని శత్రు వగు రావణుని వరబలము దెలిసికొని యోడితి మని చెప్పిరి. దుష్యం తుఁడు, సురథుఁడు, గాధి, గయుఁడు, పురూరవసుఁడు మొదలగురాజు లందఱును నోడిపోయిరి మని యొప్పికొనిరి. తరువాత రాక్షసాధిపతి యగు రావణుఁడు దేవేంద్రుఁ డమరావతిని బాలించుచుండును నట్లనరణ్య మహారాజుచేఁ బాలింపఁబడుచున్న యయోధ్యకు వచ్చి పురుషశార్దూల మును, బలమున నింద్రసముఁడును నగు నాయనరణ్యమహారాజునొద్దకేగి యిట్లనియె: "రాజా! నాతో యుద్ధమెనను జేయుము; లేదేని, యోడితి ననియైనను జెప్పుము. ఇది నాయాజ్ఞ" ఇట్లనినపాపాత్మునిమాటలు విని యయోధ్యాపతి యగు నాయనరణ్యమహారాజు కోపించి వానితో నిట్లనియె: "ఓయీ, రాక్షసరాజా! రమ్ము. నాతో ద్వంద్వయుద్ధము చేయుదువు. ఇదిగో నేనుసిద్ధముగా నున్నాఁడను. నీవును సిద్ధుఁడవుగమ్ము."

రామా! తరువాత నంతకుముందుగనే యీసంగతియంతయుఁ దెలిసికొనియుండుటచే నాయనరణ్యమహారాజుయొక్క సైన్యము

మిక్కిలి యక్కసుతో రాక్షసవధనిమిత్తమై బయలుదేఱినది. ఆసైన్యము యొక్క లెక్క వక్కాణించెద వినుము: పదివేలయేనుఁగులు, ఒకనియు తము గుఱ్ఱములు, పెక్కువేలు రథములు, పదాతులును. ఈచతురంగ బలము భూమిని గప్పివైచినట్లు బయలుదేఱినది. యుద్ధవిశారదుఁడవగు నోశ్రీరామా! తరువాతను రావణునకు ననరణ్యమహారాజునకును ఘోరమైన యుద్ధము జరిగినది. ఆమహారాజుసైన్యమంతయు రావణునిబలముతో నెదుర్కొని యగ్నిలో వేల్వఁబడిన యాజ్యాదిహవిస్సువలెనే పేరులేకుండ భస్మమైనది. మఱియు నాసైన్యము నిరుపమానపరాక్రమము నవలంబించి చిరకాలము యుద్ధము చేసి మండిపడుచున్న యారావణసైన్యమును సమీపించి, తుద కల్పావశేషమయిపోయినది. వేయేల? సంకులమై యాసైన్యమంతయు మండుచుండు నగ్నిహోత్రములో మిడుతల సమూహమువలెఁ బడిపోయినది. అప్పుడనరణ్యమహారాజు తనసైన్యమంతయు పంపలకొలఁది యడవియేల్గు సముద్రములోఁ గలిసి పేరులేకుండఁ బోయినట్లు పోవుచుండుట చూచి మిక్కిలి కోపించి, యింద్రధనుస్సుతో సమానమైనధనుస్సు పట్టుకొని రావణు నెదుర్కొనెను. రావణునిమంత్రులు మారీచుఁడు, శుకుఁడు, సారణుఁడు, ప్రహస్తుఁడు మొదలగువా రనరణ్యునిచేఁ గొట్టఁబడి మృగములవలెఁ బాఱిపోయిరి. అప్పుడిక్ష్వాకుకులనందనుండగు నాయనరణ్యమహారాజు రాక్షసరాజగు రావణునినెత్తిమీఁద నెనిమిదివంపలబాణములచేఁ గొట్టెను. ఇట్లెన్ని బాణములు పడినను వాని నేమియుఁ జేయఁ జాలకపోయినవి. కొండపైనిఁ బడి వర్షధార లేమి చేయఁగలవు? అపుడు రావణుఁడు మిగులఁ గోపించినవాఁడై తనయరచేతితో నామహారాజునెత్తిమీఁద నొకచఱుపు చఱచెను. వెంటనే యాదెబ్బకుఁ దాళఁజాలక యనరణ్యుఁడు రథమునుండి క్రిందఁబడెను. ఇట్లు పడి శిథిలమైన యవయవములుగలవాఁడై కంపను నొందుచు నరణ్యములోఁ బిడుగుపడి దగ్ధమైన చెట్టువలెఁ బడిపోయియుండెను అపుడు రావణుఁడు నవ్వుచు నాయనతో నిట్లనియె: "రాజా! నాతో యుద్ధము చేసినందుకుఁ దగినఫలము దొరికినది గదా! నాతో ద్వంద్వయుద్ధము చేయువాఁడు మూఁడులోకములయందును లేఁడని నేను మొదటనే చెప్పితిని. భోగాసక్తుఁడవైయుండుకతన నాబలపరాక్రమములు వినియుండలేదు గాఁ

బోలును!" రావణుఁ డిట్లనుచుండఁగా మంద ప్రాణుఁడగు రాజిట్లనియె: ఇపు డేమిచేయుటకును వీలుగాకపోయినది. కాలము దురతిక్రమమైనది. ఆత్మప్రశంసాపరాయణుఁడవగు నోరావణా! నీచే నేను జయింపఁబడుట లేదు. నన్నుఁ గాలము జయించినది. కారణమాత్రము నీవై తివి. ఇంత మాత్రముచే నన్ను జయించితి నని సంతోషపడకుము. కాని యిపుడు నాప్రాణము పోవుటకు సిద్ధముగా నున్నది. ఏమి చేయుటకును శక్యము గాదు. నీతో యుద్ధముచేయుచుండఁగా నేను విముఖుఁడను గాలేదు. నీవు నన్నన్నమాట యిక్ష్వాకువంశపువారి కందఱకు నవమానకరమైనది గనుక, నే నిప్పు డొక్కమాట చెప్పుచున్నాను. నేను దానములు చేసిన వాఁడనైతినేని, నాచేసినహోమాదులచే దేవతలు సంప్రీతులై రేని, మఱియు నే నేమాత్రమైనను బుణ్యము చేసితినేని, నేను బ్రజలను ధర్మమార్గమునఁ బాలించినవాఁడ నయితినేని నే నన్నమాట యథార్థ మగుఁగాక! మహత్తులగు నిక్ష్వాకుకులవంశమందు దశరథమహారాజునకుఁ గుమారుఁడై రాముఁడనునతఁడు పుట్టఁగలఁడు. అతఁడు నీప్రాణములను హరింపఁగలఁడు. ఇట్లా యనరణ్యమహారాజు శాపమిాయఁగానే మేఘము వలె నుదగ్రమైన దేవదుందుభి మ్రోఁగినది; అంతరిక్షమునుండి పుష్ప వర్షము గురిసినది. రాజేంద్రా! శ్రీరామా! తరువాత నామహారాజు స్వర్గమునకుఁ బోయెను. ఆరా జట్లు స్వర్గతుఁడు కాఁగానే యచ్చటినుండి రావణుఁడు వేఱొకచోటునకుఁ బోయెను.

20-వ సర్గము

నారద రావణసమాగమము

ఇట్లు రావణుఁడు భూమియందుఁ దిరుగుచు మనుష్యులను భయము నొందించుచు నాకాశమార్గమునఁ బోవుమునిపుంగవుని నారదుని జూచెను. నిశాచరుఁడగు దశాననుఁ డానారదమహామునికి నమస్కరించి కుశలమడిగి యాగమనప్రయోజనము నడిగెను. మహాతేజశ్శాలియు, దేవర్షియు, అమితప్రభ గలవాఁడును నగు నారదుఁడు మేఘపృష్ఠమునందుండియే పుష్పకవిమానమునైనున్న రావణునితో నిట్లనియె: రాక్షసాధిపతీ! సౌమ్యా! విశ్రవస్తనూజా! ఊర్జితములును, నీవంశమునకుఁ దగినవియు నగు నీపరాక్రమాదులకుఁ జాలసంతోషించితిని. విష్ణునిచేతనైన

రాక్షసభూతములచేతను, గంధర్వోరగయక్షగణములచేతను, నీవుచేసినయుద్ధములచేతను నేను మిక్కిలి సంతోషించితిని. అయినను నేను గొంచెము చెప్పవలయు ననియనుకొనుచున్నాను. వినఁదలఁచితివేని సావధానముగా వింపుపుగాక! విని తరువాతను నీకుఁ దోఁచినతీరునఁ జేయునది. నాయనా! రావణా! దేవతలచేఁగూడ వధ్యుఁడవు గాని నీవు వ్యర్థముగా మృత్యువశంవదులైన మనుష్యుల నేటికిఁ జంపెదవు? నిష్కారణముగా నీవు మనుష్యులను జంపకుము. తమకు శ్రేయస్సెట్లుకలుగునో తెలిసికొనఁ జాలనివారును, గొప్పగొప్ప వ్యసనములతోఁ గూడియున్న వారును, ముదిమితోడను వంటలకొలది రోగములతోడను గూడియున్న వారును నగు నిట్టిమనుష్యుల నెవ్వఁడైనను జంపఁజూచునా? మఱియు నాయాయి యనిష్టములతోఁ గూడి యుండువారితో యుద్ధము చేయుటకు బుద్ధిగల వాఁడెవ్వఁడైనను ప్రయత్నించునా? అఁకలివప్పలచే వ్యాకులపడుచుండు వారును, దైవవంచితులును నగు మనుష్యులను నీవు నశింపఁ జేయకుము. మహాబాహుఁడవగు నోరాక్షసరాజా! చూచితివిగదా! మనుష్యలోక మెట్లున్నదో! మూఢమై విచిత్రార్థమై యెటు చూచినను గతి యగపడక యున్నది. ఒకానొకచోట సంతోషించుచుండు జనులు నృత్యగీతవాద్యాదులతో సంతోషముగాఁ గాలము గడుపుకొనుచున్నారు. మఱియొక చోటున నెత్తి నోరు మొత్తుకొనుచు సంతతము కన్నులనీరు కాల్వలు గట్టి ప్రవహించుచుండఁగా నార్తులై యేడ్చుచున్నారు. తల్లిదండ్రులయు, దారపుత్రాదులయు స్నేహపాశములచేఁ గట్టుపడి యీమనుష్యలోకములోనిజనులు మోహితులై యెందులకును బనికిరాక తమతమ క్లేశముల నెఱుంగలేకుండ నున్నారు. మోహముచేతనే చచ్చినట్లున్న యీమనుష్యులను గష్టపెట్టినంతమాత్రమున నీ కేమి లాభము? నిస్సంశయముగా నీవు మనుష్యలోకమును జయించినవాఁడవే యైతివి. ఈ మనుష్యలోకములోనివా రందఱును దప్పక యెప్పటికైనను యమునియింటికి వెళ్లితీరవలసినవారే. కావున నోరావణా! నీకుశక్తియున్నదేని యమునినిగ్రహింపుము. అతనినొక్కనిని జయించితివేని సమస్తలోకములను జయించినవాఁడవే యగుదువు." అనియిట్లు చెప్పఁగా విని లంకాధిపతి యగు రావణుఁడు తన తేజస్సుచే వెలుఁగుచున్న నారదునిఁ జూచి నవ్వుచు నమస్కారపూర్వకముగా నిట్లనియె:

యుద్ధప్రియుఁడవును దేవగంధర్వులవిహారము గలవాఁడవునగు "బ్రహ్మర్షివర్యా! నారదా! నేను బాతాళలోకమును జయించుకోసము వెళ్లఁదలంచుకొనియున్నాను. తరువాతను మూఁడులోకములను జయించి నాకులను నాగులను స్వాధీనము చేసికొని, రసాలయ మగు సముద్ర మును మథించి యమృతమును సంపాదింపవలయు ననుప్రయత్నములో నున్నాను" అని యిట్లు చెప్పిన రావణునిమాటలు విని నారదుఁడిట్లనియె: "రావణా! ఇపుడు నీవు మఱియొకడారి నెక్కడికిఁ బోయెదవు? ఇదేకదా యగమ్యమైన ప్రేతరాజుండుపట్టణమునకుఁ బోవుదారి. ఇట్లే పొమ్ము." అనుమాటలు విని రావణుఁడు శరత్కాలమేఘమువంటి నవ్వు నవ్వి యతనితో నిట్లనియె: "మునివర్యా! మంచిమాట చెప్పితివి. చాల సంతో షమును గలిగించితివి. కావుననే నేనిపుడు యమునిం జంపుటకే యుద్యు క్తుఁడ నయితిని. సూర్యునికొడుకైన యాయమునిఁడు రాజయిన దక్షిణ దిక్కున కిదె యామార్గముననే పోవుచున్నాను. నేనొకపారి కోపించి యుపమును గోరినవాఁడనై నలుగురులోకపాలురను జయించితినైన నని ప్రతిజ్ఞ పట్టియున్నాఁడను. కనుక ముందుగా నిపుడే ప్రేతరాజగు యముని పట్టణమునకేపోయెదను. వాఁడు సమస్తప్రాణులపను గష్టము గలిగించు చున్నాఁడు గనుక వానిని మృత్యువున కప్పగించివచ్చెదను" అనిచెప్పినార దునకునమస్కరించి, సంతోషముగా మంత్రులతోఁగూడి దక్షిణదిక్కునకు బయలుదేఱెను.

మహాతేజశ్శాలియుఁ బొగలేని యగ్నివలెవెలుఁగుచున్న వాఁడును నగు నారదుఁడు ముహూర్తకాలము ధ్యానముపట్టి యిట్లాలోచింపఁ దొడఁగెను: ఆయువు క్షీణము కాఁగానే చరాచరప్రపంచముతోఁగూడిన మూఁడులోకములను నంతమొందించు నంతకున కంత మెట్లు కాఁగలదు? ఎవఁడు స్వదత్తములకు స్వకృతములకు సాక్షియై పొగలేని యగ్నిపగిది వెలుఁగుచుండునో, మఱియు లబ్ధసంజ్ఞములగు లోకముల నేమహాత్ముఁడు జయింపఁగలఁడో, యెవనికి భయంపడి మూఁడులోకములవారును నిత్య మును బరువు లెత్తుచుందురో, యటువంటి యమునిదగ్గఱ కీరాక్షసుఁ డెట్లు స్వయముగాఁ బోఁగలఁడు? మఱియు సుకృతదుష్కృతములను గూర్చి యెవఁడు ధాతయు విధాతయునై మూఁడులోకములను జయించి తన యధీనమునం దుంచుకొనెనో, అట్టియముని నీరావణుఁ డెట్లు జయింపఁ

గలఁడు? లేక మఱియొక యేర్పాటునుచేసికొనునా? నాకుఁ జాలఁ గుతూ హలము గలుగుచున్నది. ఇప్పుడే యమపట్టణమునుగూర్చి వెళ్లెదను. యముఁడును రావణుఁడును నెట్లు యుద్ధము చేయుదురో చూడవలసి యున్నది.

21-వ సర్గము

యమ రావణుల యుద్ధము

శ్రీరామచంద్రా! బ్రహ్మణశ్రేష్ఠుఁ డగునారదుఁ డిట్లాలోచించు కొని యీవృత్తాంత మంతయుఁ జెప్పుటకయి యతివేగముగా యముని యింటికిఁ బోయెను. ఇట్లు పోయి యగ్నిని బురస్కరించుకొని యేప్రాణి నేవిధముగా నిగ్రహింపవలయునో, యేప్రాణి నెట్లుగా ననుగ్రహింపవల యునో యీయీయిసంగతు లాలోచించుచున్న యమునిఁ జూచెను. ఆయముఁడును నచ్చియున్న నారదభగవానునిఁజూచి యర్ఘ్యపాద్యాదు లచే సత్కరించి సుఖాసనాసీనుఁజేసి యిట్లనియె: "నారదమహర్షి! తమకు క్షేమమే కదా! ధర్మమునకు నాశము లేదుగదా! దేవగంధర్వసేవితులగు తమయొక్క రాకకుఁ బ్రయోజనమేమి?" అనుయమునిమాటలు విని నారదుఁ డిట్లనియె: "ధర్మరాజా! నావచ్చినకార్యము చెప్పెదను. ఆది విని నీవు దానికిఁ దగినప్రతిక్రియ చేయుము. ప్రేతరాజా! దశగ్రీవుఁ డనువేరుగల రాక్షసుఁడు జయింపశక్యముగాని నిన్నుఁ దనపరాక్రమ ముచే జయించి స్వాధీనముచేసికొనఁ దలంపుగలవాఁడై వచ్చుచున్నాఁడు. ఈసంగతి నీతోఁజెప్పవలయు ననియే ప్రభూ! నేనతివేగముగా వచ్చి తిని. ఇప్పుడు నీచండమనునాయుధమునకు నేమికానున్నదోకదా!" అని యిట్లుచెప్పుచుండఁగానే యుదయించినసూర్యునివలె వెలుఁగుచు వచ్చు చున్న యారాక్షసునిపుష్పకవిమానము దూరమునుండి యగపడినది. ఆరావణుఁడుమహాబలవంతుఁడు. తనపుష్పకవిమానముయొక్క కాంతిచేత నాప్రదేశమునందలి చీఁకటి నంతయుఁ బోఁగొట్టుచు నతివేగముగా సమీపించెను.

ఇట్లు సమీపించి మహాబాహుఁడగు నారావణుఁ డచ్చటచ్చటఁ దమచేసినసుకృతదుష్కృతఫలము ననుభవించుచున్న ప్రాణులను జూచెను. మఱియు ఘోరరూపులును, ఉగ్రులును నగు యమకింకరులచే బాధింపఁ

బడుచుండువారును, కష్టములపాలు చేయఁబడుచున్న వారును, హాహా కారము చేయుచున్న వారును, తీవ్రముగాఁ గ్రూరమైన శబ్దమును జేయు చున్న వారును, పురుగులచే భక్షింపఁబడుచున్న వారును, కుక్కలచేఁ గఱపింపఁబడుచున్న వారును, భయమును గలిగించునవియుఁ జెవులకుఁ గాల్చిన యినుపసూదులవలెఁ దగులుచున్నవియు నగు వాక్యములను బలుకుచుండువారును, నెత్తుర నీటితో నిండిన వైతరణీనదిలో నీఁదింపఁ బడుచున్న వారును, మలమలమాడుచుండు నిసుకదిబ్బలమీఁద మాటి మాటికిని బడవైచి తపింపఁజేయఁబడుచున్న వారును, అసిపత్రవనములో నుండి యార్వఁబడుచుండువారును, రౌరవము, ఉప్పునది, క్షురధారలు మొదలగు నరకములలోఁబడి యాకలిదప్పులచే మలమలమాడుచుఁ బ్రాగుటకు జలమైనను దయచేయించుఁ డని గొంతెండిపోయి యతిదీన ముగా యాచించువారును, శవాకారముగా నున్న వారును, కృశించిన వారును, దీనులును, వివర్ణులును, విరియఁబోఁసిన జుట్టు గలవారును, మల పంకాదులను ధరించినవారును, రూక్షులును, ఇటునటుఁ బరుగులెత్తు చున్న వారును నగు ప్రాణులను మార్గమునందు వేలకొలఁదిగను లక్షల కొలఁదిగను జూచెను. మఱియుఁ గొందఱను మంచిమంచి గృహముల యందు నృత్యగీతవాద్యాదివినోదములచేఁ దమచేసిన సుకృతమునకు ఫలముగా సంతోషించుచుండువారినిఁ జూచెను. గోదానములు చేసిన వారు గోరసమును, అన్నదానముచేసినవా రన్నమును, గృహదానములు చేసినవారు గృహములను, దమరుచేసిన సుకృతవిశేషమునకు ఫలముగా ననుభవించువారును, మణులచేతను బంగారుచేతను ముత్తెములహార ములచేతను సుత్తమస్త్రీలచేతను నలంకరింపఁబడినవారును, ధార్మికులును, దమతమతేజస్సులచే వెలుఁగుచున్న వారును నగు ప్రాణులనుగూడఁ జూచెను. ఇట్లు చూచి రాక్షసాధిపతియు, మహాబాహుఁడును నగు నారావణుఁడు తనపరాక్రమముచేత బలాత్కారముగాఁ దమదుష్కృత ములచే బాధపడుచున్న ప్రాణులయందు దయగలిగి విడువఁజేయించెను. రావణునిచే విడిపింపఁబడిన యా ప్రాణులు ముహూర్తమాత్రము తలఁచు కొని, తలంపుగాఁ దటస్థించిన సుఖము ననుభవించిరి.

ఇట్లు గొప్పవాఁడగు రావణునిచేతను బ్రేతములు విడువఁబడిన వగు చునుండఁగా నాప్రేతములకావలివాండ్రు మిక్కిలి కోపించి రావణు నెదు

ర్గొనిరి. తరువాతను నాలుగుదిక్కులనుండియు హాలహలాశబ్దము బయలు దేఱినది. యమకింకరులు మహాశూరులు కోపించి యిటునటుఁ బరుగు లెత్తుచు వేలకొలఁదిగా గుమిగూడి ప్రాసములు,పరిఘములు, శూలములు, ముసలములు, శక్తులు, తోమరములు మొదలగు నాయుధములను రావ ణునిపుష్పకవిమానమునిండ వర్షించిరి. మఱియు వాండ్రు తేనె టీఁగలవ లె బయలుదేఱినవారై యాపుష్పకమునందలి యాసనములను, మంటపము లను,ప్రాసాదములను, వేదికలను,తోరణములను విఱిచివైచిరి. ఇట్లెంతగా విఱుఁగఁగొట్టఁబడుచున్నను పుష్పకవిమానము దేవతలకు వాహన మగు టచే యుద్ధములో బ్రహ్మతేజముచే నక్షయమై యెప్పటివలెనే యుండెను. ఆమహత్తుని సేవ గొప్పదియు లెక్కలేనిదియు నయి యున్నది. భయం కరముగాయుద్ధమునకు వచ్చినశూరులు వందలును వేలును నయిరి. తరు వాత వృక్షములచేతను, కొండలచేతను, వందలకొలఁది ప్రాసాద్యాయుధ ములచేతను యమునిమంత్రులు తమతమబలముకొలఁదిని కోరికికొలఁదిని యుద్ధము చేసిరి. రావణుఁడును యుద్ధముచేయ మొదలిడెను. ఆరావణుని మంత్రులు సర్వవిధము లయినయాయుధములచేతనుగొట్టఁబడి నెత్తురుచేఁ దడుపఁబడిన దేహములు గలవారై గొప్ప యుద్ధము చేసిరి. ఒకరి సైన్యము నొకరు మిక్కిలి తీవ్రముగా నానావిధములైన యాయుధముల చేతను గొట్టుచుండిరి. ఇట్లుండఁగా యముని యోధులు రావణునిమంత్రు లను గొట్టుట మాని శూలములను వర్షించుచు రావణునిమీఁదికిఁ బరు వెత్తిరి. యమదూతలయాయుధములచే బాగుగాఁగొట్టఁబడినవాఁడై నెత్తు రుచేఁ దడిసినదేహముగలిగి సర్వావయవములును శిథిలముకాఁగా రావ ణుఁడు పుష్పకముమీఁద వ్రాచినమోదుగుచెట్టువలె నగపడెను. అట్లు విమానముమీఁద నుండియే యారావణుఁడు శూలములు, గదలు, ప్రాస ములు, శక్తులు, తోమరములు, బాణములు, పరిఘములు, ముసలములు, రాళ్లు, చెట్లు మొదలగువాని నస్త్రబలము నవలంబించి యమదూతలపై వర్షించెను. అట్లతిదారుణముగా వర్షించుచున్న చెట్లయొక్కయు, రాళ్ల యొక్కయు, శస్త్రములయొక్కయు వర్షము భూమిమీఁద నిలువఁబడి యుద్ధముచేయుచున్న యమదూతలపైనిబడినది. వాండ్రును వానినన్నిం టిని భేదించి వానియస్త్రమును వ్యర్థముగాఁజేసి వందలకొలఁదిని వేల కొలఁదిని గుంపులు గూడి ఘోరస్వరూపుఁడగు నారావణు నొక్కనిని

కొట్టమొదలిడిరి. మఱియు యమదూతలు మేఘములు కొండనావరించి వర్షము గురిసినట్లు రావణు నావరించి భిండివాలములు శూలములు మొదలగు నాయుధములను వర్షించి యూపిరి తిరుగకుండఁ జేసిరి. అంతట రావణుఁడు కోపించి కవచము తీసివైచి నెత్తుటిచేఁ దడిసి యున్న వాఁడై పుష్పకము నుండి దిగి భూమిమీఁదను నిలువఁబడెను. తరువాత ధనుర్బాణములు చేఁబూని యుద్ధ మారంభించెను. ముహూర్తమాత్ర మునఁ దెలివిదెచ్చుకొని జాగరూకుఁడై యంతకునివలె కోపించి పాశుపత మనుదివ్యాస్త్రమును ధనుస్సునఁ గూర్చి "నిలువఁబడుఁడు, నిలువఁబడుఁడు" అని వారిని హెచ్చరించుచు ధనుస్సు నాకర్ణాంత మాకర్షించి త్రిపురములపై శంకరునివలె నాయస్త్రమును వాండ్రపై విడిచెను. అట్లు రావణునిచే విడువఁబడిన యస్త్రముయొక్కరూపము విధూమజ్వాలామండలమై వేసవిలో వనమును దహించు దావాగ్నివలె నయినది. జ్వాలలఁ గ్రక్కుచున్న యాపాశుపతాస్త్రము యుద్ధములోఁ గ్రవ్యాదములచేఁ ననుసరింపఁబడుచున్నదై యచ్చట నున్న పొదలను, చెట్లను భస్మముచేసి నలువైపులను వ్యాపించినది. ఆయమునిసైనికులు దానితేజస్సుచే దవాగ్నిచేఁ గాల్పఁబడినచెట్లనలెఁ గాల్పఁబడిరి. తరువాత భయంకర మయిన పరాక్రమముగల రావణుఁడు మంత్రులతోఁగూడ భూమియం తయుఁ గంపించులాగున పెద్దకేకవైచెను.

22-వ సర్గము

యమ రావణుల యుద్ధము

శ్రీరామా! అప్పుడు ప్రభువగు యముఁడాధ్వని విని తనబలము క్షీణించినట్లును, రావణుఁడు జయమును బొందినట్లును దెలిసికొనెను. తనసైనికులు హతులయినట్లు తలఁచి కోపముచే నెఱ్ఱఁబడిన కన్నులుగల వాఁడై వేగముగా రథము సిద్ధముచేసి తీసికొనిరమ్మని సారథి కాజ్ఞాపించెను. సారథియు నపుడే దివ్యమైన గొప్పరథమును సిద్ధముచేసి తెచ్చెను. మహాతేజశ్శాలియగు యముఁడారథముమీఁదను గూర్చుండి యుద్ధమునకు బైలుదేఱెను. మూఁడులోకములను సంహరించు మృత్యువు పాశముద్గరములను ధరించి యాతనిముందు నిలువఁబడెను. కాలదండము మూర్తిమంతమయి రథముమీఁది యమునిప్రక్కనుండెను. అది

యమునియాయుధము. దివ్యమైనది. దానితేజస్సు మండుచున్న నగ్ని హోత్రునితో సమానమైనది. మఱియుఁ దద్వార్మ్మములందు ఛిద్రము లేనికాలపాశములుండినవి. అగ్నిస్పర్శముతో సమానస్పర్శముగల ముద్గరమను నాయుధము మూర్తిమంత మయి నిలిచియుండెను. అపుడు మూఁడులోకములును సంక్షోభించినవి. దేవతలు కంపించిరి. కోపించిన యమునిఁజూచి సర్వలోకములును భయమును బొందినవి. తరువాత సూతుఁడు రక్తవర్ణములగు గుఱ్ఱములను దొంతరగాఁ దోలుచు భయం కరముగాఁ గేకలువైచుచు రాక్షసరాజున్న చోటికిఁ బోయెను. ఆగుఱ్ఱ ములు ముహూర్తమాత్రమున మనోవేగముతోఁ బరువెత్తి యుద్ధస్థలము జరుగుచున్నస్థలమునకు యమునిఁ దెచ్చినవి. మృత్యుదేవత మొదలగు వారితోఁగూడి వికారముగా నుండిన యారథమును జూచి రావణుని మంత్రులు చాలవేగముగాఁ బరుగులెత్తమొదలిడిరి. వారు చులకనయిన మనస్సులుగలవారగుటచేఁ దెలివి దప్పి భయముచేఁ బీడితులై "మేము యుద్ధము చేయఁజాల" మని చెప్పుచు నలుదిక్కులకును బాఱిపోయిరి. ఆరావణునిఁదమమాత్రము లోకములకు భయమును గలిగించునటువంటిరథ మును జూచి, క్షోభమునుగాని భయమునుగాని పొందినవాఁడు కాఁడయ్యెను.

అప్పు డాయముఁడు మిక్కిలి కోపించినవాఁడై రావణుని సమీ పించి శక్తులను తోమరములను బ్రయోగించి వానిమర్మస్థానములను నొప్పించెను. మఱికొంత సేపటికి రావణుఁడు స్వస్థుఁడై కొండమీఁదను మేఘము వర్షించునట్లు బాణవర్షమును వర్షించెను. తరువాతను యముఁడు ప్రయోగించిన బాణాదులచేత వక్షఃస్థలమునందు దెబ్బలు దగులుటచేత శల్యపీడితుఁడయిన యారావణుఁడు ప్రతిక్రియచేయుటకు శక్తుఁడు కాకపోయెను. ఈరీతిగా శత్రుసంహారకుఁడగుయముఁడు నానావిధములయిన యాయుధములను బ్రయోగించుచు నేడురాత్రులు యుద్ధముచేసి శత్రువగు రావణుని విముఖునిఁగాని, విజితునిఁగాఁ గాని చేయఁజాలకపోయెను. యుద్ధమునుండి మరలక జయమును గోరు చున్నట్టి యాయమరాక్షసులకు దొమ్మియుద్ధము జరిగినది. తరువాతను దేవతలు, గంధర్వులు, సిద్ధులు, పరమఋషులు, బ్రహ్మదేవునిఁ బురస్క రించుకొని యాయుద్ధభూమికి వచ్చిరి. రాక్షసశ్రేష్ఠుఁడగురావణుఁడును,

ప్రేతరాజగు యముఁడును యుద్ధము చేయుచుండఁగా లోకమునకుఁ బ్రళయము తటస్థించిన ట్లగపడినది. అప్పుడు రావణుఁడును నింద్రధనుస్సు వంటితనధనుస్సు నెక్కు-వెట్టి బాణముల వర్షించుచు నాకాశమును నిరవకాశము నేసెను. మఱియు మృత్యువును నాఁబుగు బాణములచేతను, సారథి నేఁబాణములచేతను, యముని వందలకొలఁది వేలకొలఁది బాణములచేతను శీఘ్రముగా మర్మస్థానములయందుఁ గొట్టెను. తరువాతఁ గోపించియున్న యమునిముఖమునుండి నిట్టూర్పులతోఁ గూడిన కోపాగ్నిహోత్రము పొగతోఁ గూడిన యగ్నివలె బయటికి వచ్చినది. తరువాతను దేవదానవులసమక్షమునందుఁ గలిగినయీయాశ్చర్యమును జూచి మిక్కిలి యాటోపముగలవాఁడై మృత్యువును యముఁడును సంతోషించుచుండిరి. అప్పుడు మృత్యువు మిక్కిలి కోపించి యమునితో నిట్లనియె: ధర్మరాజా! నన్ను యుద్ధమునకుఁ బంపుము. నే నీపాపాత్ముఁడగు రాక్షసుని జంపెదను. ఈరాక్షసు నిప్పుడే లేకుండఁజేసెదను. ఇది నైసర్గికమయిన మర్యాద.

శ్రీమంతులగు హిరణ్యాక్షు హిరణ్యకశిపులు, నముచి, శంబరాసురుఁడు విసంధి, ధూమకేతువు, బలి, దంభుఁడు, దైత్యులకు మహారాజగు వృత్రాసురుఁడు, బాణాసురుఁడు, రాజస్సులు, శాస్త్రవిధులు, గంధర్వులు, ఉరగులు, పన్నగులు, దైత్యులు, యక్షులు, అచ్చరలు వారమీరు నన నేల? యుగాంతమునప్పుడు సముద్రములతోడను, కొండలతోడను, నదులతోడను, వనములతోడను గూడిన యీభూమియు నాశము పొందుచుండఁగా నేను జూచితిని. మఱియు నెందఱో దురాసదులగుబలవంతులు నశించిపోఁగా నేను జూచియుంటిని. ఈరాక్షసుఁడనఁగా నేపాటివాఁడు? సకల ధర్మములు దెలిసిన యోయమఁడా! ఇంకను నన్ను యుద్ధమునకుఁ బంపవైతి వేమి? వీనిని జంపెదను. ఎంత బలవంతుఁడైనను నాదృష్టిపథమును బొందినవాఁడు తిరిగి పోఁగా నేను జూచియెఱుఁగను. ఇది నాబల మనుకొనవలదు. ఇది నాస్వభావసిద్ధమైన పద్ధతి. నేను జూచితినేని ముహూర్తకాలమైనను వీఁడు బ్రదుకఁజాలఁడు. అని యిట్లు మృత్యువు చెప్పినమాటలు విని ప్రతాపశాలి యగు యముఁడిట్లనియె: "నీ పూరక చూచుచుండుము. నేనే యీరాక్షసాధముని జంపెదను"అనిచెప్పి, తరువాతను గోపముచేఁ గన్ను లెఱ్ఱఁబడఁగాఁ బ్రభు

వగుయముండు తనయమోఘముగు కాలదండమును పట్టి యెత్తెను. మఱియు దేనిపార్శ్వములయందు సకల కాలపాశములును బ్రతిష్ఠితము లైయుండెనో, చిచ్చుఱపిడుగువోలె ముద్గరము మూర్తిమంతమై నిలువఁ బడియుండెనో, దేనిని జూడఁగానే ప్రాణులప్రాణములుపోవుట కెంత మాత్రమును నభ్యంతర ముండదో, యట్టిదానిని ముట్టినప్పుడుగాని ప్రయోగించినప్పుడుగాని జరుగుసంగతి చెప్పనే యక్కఱలేదు. అటువంటి కాలదండము బలవంతుఁడగువానిచేత స్పృశింపఁబడినదై జ్వాలలఁ గ్రక్కుచు రాక్షసుని దహించునవివోలె నగపడుచుండెను. తరువాత నా యుద్ధభూమిలో నున్న వారందఱును భయపడి పాఱిపోయిరి. యముఁ డిట్లు కాలదండమును బట్టియుండుట చూచి దేవతలును భయపడిరి. ఆ కాలదండముతో రావణుని గొట్టుటకు సిద్ధపడుచుండఁగా, బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై యాయమునితో నిట్లనియె: "మహాబాహుఁడవగు నోధర్మ రాజా! వలదు వలదు; కాలదండమును బ్రయోగింపవలదు. నీవీ కాలదండముచేత రావణుని జంపఁజాలవు. దేవశ్రేష్ఠుఁడ వగు నోయముఁడా! నేను వీనికి వర మిచ్చియున్నాను. నే నిచ్చినవరమును నీ వసత్యముగాఁ జేయుటకుఁ దగవు. నామాటను అసత్యముగాఁ జేయఁదలఁచినవాఁడు దేవతయైనను సరియే మనుష్యుఁడైనను సరియే మూఁడులోకములను అన్యథముగాఁ జేసినవాఁడే యగును. సంశయ మక్కఱలేదు. అదిగాక నీవు కోపించి యీకాలదండమును బ్రయోగించితివేని, యిది శత్రువులను మిత్రులను సంహరింపకమానదు. రౌద్రమైన యీకాలదండము మూఁడు లోకములకును భయంకరమైనది; ఇది యమోఘము. ప్రాణిమాత్రమును సంహరించుటకు దీనికధికారము గలదు. మృత్యుపురస్సరముగా నే నీ కాలదండమును పూర్వమందు సృజించితి. కావున దీనిని రావణునిపైఁ బ్రయోగింపకుము. ఇది పడినయెడల నెవ్వఁడును నిమిషమాత్రమైనను బ్రదుకఁజాలఁడు. ఒకవేళ నీవు నామాట లక్ష్యపెట్టక దీనిని వీనిమీఁదఁ బ్రయోగించినప్పుడు, రాక్షసుఁడు చచ్చినను జావకున్నను నామాట వ్యర్థమగును. కనుకఁ బ్రయోగించుటకు సిద్ధముచేసి యుంచిన కాలదండమును మరలింపుము. నీవు లోకములక్షేమమును గోరువాఁడవేని నామాటను యథార్థముగాఁ జేయుము." ఇట్లు బ్రహ్మదేవుఁడు చెప్పఁగానే ధర్మాత్ముఁడగుయముఁ డిట్లనియె: "స్వామీ! ఇదిగో దమయాజ్ఞాప్రకారముగాఁ

గాలదండమును మరలించితిని. నీవు మాయండఱికును యజమానుఁడవు గదా! కాని యిప్పుడు వరపురస్కృతుఁడగువీనిని జంపుటకు వీలుగాదేని యిఁక నిక్కడనుండి నే నేమిచేయవలయును? కావున నిదిగో నిపుడే యీ రాక్షసునిదర్శనపథమునుండి యంతర్ధానమైపోయెదను" అనిచెప్పి రథము తోఁగూడ నచటనే యంతరానమెపోయెను. రావణుఁడాయమునిఁ జయించి నట్లే తననామధేయమును వినిపించి పుష్పకవిమానమువిూఁదఁ గూర్చుండి యమపురమునుండి పోయెను. ఆయమునుఁడు బ్రహ్మమొదలగు దేవతలతో స్వర్గమునకుఁ బోయెను. ఇది యంతయుఁ జూచి నారదమహాముని చాల సంతోషించెను.

23-వ సర్గము

రావణుఁడు వరుణలోకమునకుఁ బోవుట

దేవతాశ్రేష్ఠుఁడగుయమునిఁ జయించి తరువాత రావణుఁడు తనయుధ్ధమును గొనియాడుచుఁ దనసహాయులను జూచెను. వారు రక్తముచేఁ దడిసిన యంగములు గలవాఁడును, ఆయుధములచే శిథిలముగాఁ జేయఁబడినవాఁడును నగురావణునిఁజూచి మిగుల నాశ్చర్యమునుబొందిరి. తరువాత మారీచుఁడు మొదలగువారందఱును జయజయధ్వనులచేతఁ రావణునిఁబొగడి రావణునిచేత నోదార్పఁబడినవారై పుష్పక మెక్కిరి. తరువాత రావణుఁడు పాతాళలోకమునకుఁ బోవ నుద్యుక్తుఁడై దైత్యులచేతను, ఉరగులచేతను గూడి యున్నదియు వరుణదేవునిచేతఁ బరిపాలితమును నగుసముద్రములోఁ బ్రవేశించెను. ఆరావణుఁ డట్లు పాతాళమునందలి భోగవతీపురములోఁ బ్రవేశించి, వాసుకిచే రక్షింపఁ బడుచున్న నాగులను స్వాధీనముచేసికొని సంతోషించుచు నక్కడనుండి మణిమతి యనుపేరుగల పట్టణమునకుఁ బోయెను. అచ్చట వరగర్వితులగు నివాతకవచులను రాక్షసులు గలరు. వారిని సమీపించి యుధ్ధమునకు రండని పిలిచెను. బలవంతులును పరాక్రమశాలురును నగువారందఱును నానావిధములయిన యాయుధములను బట్టుకొని యుధ్ధదురంధరులయి సంతోషించుచు నెదురుకొనిరి. తరువాత శూలములతోడను, త్రిశూలములతోడను, కులిశములతోడను, పట్టణములతోడను, కత్తులతోడను, పరశ్వధములతోడను రాక్షసులు దానవులు పరస్పరము యుధ్ధము చేయ మొదలిడిరి. ఇట్లు వారి కొక్కసంవత్సరము యుధ్ధము జరిగినది. అంతిరు

తెగల వారికిని జయముగాని పరాజయముగాని కనుపించలేదు. అప్పుడు త్రిలోకగతియు నవ్యయుఁడును సగు బ్రహ్మదేవుఁడు విమాన మెక్కి యచ్చటికి వేగముగా వచ్చి నివాతకవచాదులను యుద్ధమునుండి వారించి కోపయుక్తుఁడై సర్వమును దెలిసినవాఁడు గనుక నిట్లనియె: "రాక్షసులారా! ఈరావణుఁడు సురాసురులచేతను జయింపఁదగినవాఁడుగాఁడు. మీరును నట్లే దేవదానవులచే జయింపఁదగినవారు గారు. కావున మీరు రావణునితో స్నేహము చేసికొనుఁడు. స్నేహితులగు మీకు సర్వార్థములును విభక్తములు గాకుండ నుండునుగాక! ఇందు సందియ మొందకుఁడు." అనిచెప్పి వారికిని రావణునకును అగ్నిసాక్షికముగా స్నేహము చేయించి బ్రహ్మదేవుఁడు సంతోషించుచు సత్యలోకమునకుఁ బోయెను. రావణుఁడు యథాన్యాయముగా నచ్చట నొక్కసంవత్సరము వఱకును నివసించినవాఁడై తనపట్టణములో నున్నట్టుగానే యమంద మైన యానందమును బొందుచుండెను. ఇట్లచ్చట వారితో స్నేహముగా నుండి నివాతకవచుల వలన తొంబదితొమ్మిది మాయలు నేర్చుకొనెను. తరువాత వరుణదేవునిపట్టణమును వెదకుచు నారసాతలములో సంచ రించుచుండెను. తరువాతఁ గాలకేయు లనురాక్షసులు కాపురమున్న యశ్మనగరమును గూర్చి పోయి, యచ్చట బలవంతులగు కాలకేయులను జంపెను. మఱియు శూర్పణఖయొక్కభర్తయగు విద్యుజ్జిహ్వుని గట్టితో నటికెను. వాఁడు మిక్కిలి బలగర్వితుఁడు. అట్టిబొవమఱఁదిని యుద్ధములో మెఱపుదీఁగవంటి తననాలుక సాచి రాక్షసులను నాకివైచుచున్న వానిని వధించి, మిగిలినరాక్షసులను నాలుగు పందలమందిని ముహూర్తకాల ములోఁ జంపెను.

తరువాత శరత్కాలమేఘమువలెను, వెండికొండవలెను బ్రకా శించుచున్న వరుణునిమందిరమును రాక్షసరాజైన రావణుఁడు చూచెను. అచ్చటఁ బొలువర్షించుచున్న కామధేనువును జూచెను. ఆకామధేనువు పొదుగునుండి స్రవించుచున్న క్షీరముచేతనే పాలసముద్రము ప్రవర్తిం చినది. దానినుండి చల్లనికిరణములు గల చంద్రుఁడు పుట్టెను. మఱియు నాకామధేనువు శివునకు వాహనమైన నందిని గన్నది. నురుగు దిని జీవించు పరమఋషు లాసముద్రము నాశ్రయించియుందురు. స్వధను భుజించువారికి స్వధయు, దేవతల కమృతమును నాసముద్రమునుండియే

పుట్టినవి. ఆకామధేనువునే మనుష్యులు సురభి యని చెప్పుచుందురు. ఇట్టిపరమాద్భుతనిధాన మగు కామధేనువునకుఁ బ్రదక్షిణము చేసి యనేకవిధసైన్యముచే రక్షింపఁబడుచు మహా భయంకరముగా నున్న వరుణునిపట్టణములోఁ బ్రవేశించెను. అది జలధారతో నిండి యున్నది. శరత్కాలమేఘమువలెఁ బ్రకాశించుచున్నది. అందు నిత్యమును సంతో షించుచుండు వరుణుని మందిరమును జూచెను. తరువాత యుద్ధములో వరుణునిసేనాధ్యక్షులనుగొట్టి వారిచే దెబ్బలుదిని, తరువాత 'రావణుఁడు యుద్ధమునకు వచ్చియున్నాఁడనియు రావణునితో యుద్ధమైనను జేయుము లేదేని చేతులు జోడించుకొని యోడితి నని నైనను జెప్పుము. నీకు భయము లేదు. అని మీరాజుతోఁ జెప్పి రం'డని యోధులతోఁ జెప్పిపం పెను. ఇంతలో మహోత్సుఁడగు వరుణునికొడుకులు మనుమలు తమ సేనాధ్యక్షులగు గోప్రుష్కరులతోఁగూడఁ గోపించినవారై తమతమ సైన్యములతోఁ గూడుకొనినవారయి, కామగమనము గలవియు నుదయించిన సూర్యునివలెఁ బ్రకాశించునవియు నగు రథములపై నెక్కి బయలుదేఱిరి. తరువాత వరుణునివారికిని రావణునికిని రోమహర్షణమును నగు యుద్ధము జరిగినది. మహాబలపరాక్రమములు గల రావణునిమంత్రులచే క్షణకాలములో వరుణునిబలమంతయుఁ బడఁ గొట్టఁబడినది. వరుణపుత్రులు తమసైన్యము యుద్ధములోఁ బడిపోవుట చూచి బాణములచేఁ బీడింపఁబడి యుద్ధము చాలించి మరలిరి. ఇట్లు మహీతలమందున్నవారై వారు పుష్పకవిమానముపై నున్న రావణుని జూచి కామగమనము గల రథములతోఁగూడ శీఘ్రముగా నాకాశ మార్గమునఁ బ్రవేశించిరి. తరువాత వారు సమానమైన స్థానమును ప్రవేశింపఁగానే దేవదానవులవలెనే యురుతెగలవారికిని రోమాంచ నాకాశయుద్ధము జరిగినది. తరువాత వారు యుద్ధములో నగ్నిజ్వాల లతో సమానము లగు బాణములను ప్రయోగించి రావణుని విముఖుని గాఁజేసి సంతోషసూచకముగా వివిధములయిన ధ్వనులు గలుగునట్లుగా నార్చిరి. తరువాతను రావణుఁడు విముఖుఁడైయుండుటను జూచి మహో దరుఁడను రాక్షసుఁడు కోపించి మృత్యుభయము విడిచి యుద్ధము గోరి వచ్చెను. వాఁడు వరుణపుత్రులరథములను, కామగమనముగలిగి వాయువుకంటెవేగముగాఁ బోఁగల గుఱ్ఱములను, సారథులను, గదతో,

గొట్టి క్రిందఁ బడఁజేసెను. ఇట్లు వరుణపుత్రుల యోధులనందఱను జంపి వారిని విరథులనుగాఁ జేసి పెద్ద అంకెవేసెను. ఇట్లు మహోదరునిచేఁ దమబలమంతయు నేలఁ గలుపఁబడుట చూచి వరుణునికొడుకులు రథములను విడిచి తమప్రభావమువలన భయము లేకుండ నాకాశమునందు నిలిచిరి. తరువాత ధనుస్సులను సిద్ధముచేసి మహోదరుని భేదించి యతి కోపముతో రావణుని వెంటఁబడిరి. మేఘములు కొండమీఁద వరించినటుల, మిక్కిలి దారుణములును పిడుగులతో సమానములును నగు బాణములను రావణునిపైని వర్షించి మిక్కిలి పీడించిరి. తరువాత రావణుఁడు కోపించి ప్రళయాగ్నివలె బయలుదేఱి మహాభయంకరములగు బాణములను వర్షించి వారి మర్మస్థానములను గొట్టి బాధించెను. పదాతులగు వరుణపుత్రులాబాణవర్షముచేతనే మిక్కిలి వ్యాకులపడుచుండఁగా రావణుఁడు విచిత్రములగు భల్లములను, ముసలములను, పట్టసములను, శక్తులను, శితఘ్నులను, తోమరములను వారిపైని విడిచెను. వారట్లు దెబ్బలు తిన్నవారై యఱువదిసంవత్సరములయేనుఁగులు బురదలోఁ జొచ్చి పీడింపఁబడుచున్నట్లు పీడితులై పడిపోయిరి. ఇట్లున్న వరుణపుత్రులను జూచి రావణుఁడు సంతోషించుచు వర్షకాలపు మేఘములుఱుమినట్లు పెద్దఅంకెవైచెను. మఱియు నారావణుఁడు మహానాదముచేసి వరుణపుత్రులను గొట్టుచుండెను. ఇట్లు మేఘములు వర్షించినట్లు బాణాదులను వర్షించి బాధించుచుండఁగా వరుణపుత్రులు విముఖులయి భూమిమీఁద పడిపోయిరి. చావఁగా మిగిలియున్న పరిచారకులు వారిని శీఘ్రముగా నింటికిఁ దీసికొనిపోయిరి. తరువాత రావణుఁడు వరుణునితోఁ జెప్పుఁడని వరుణపరిచరులతోఁ జెప్పఁగా, తారుణుఁడగు మంత్రిప్రహస్తుఁడనువాఁడు రావణునితో నిట్లనియె: "మహారాజా! వరుణుఁడు సంగీతము వినుటకై బ్రహ్మలోకమునకుఁ బోయియున్నాఁడు. రా జింట లేనప్పుడు నీపరిశ్రమమంతయు వ్యర్థము. ఇంటిదగ్గఱ నున్న వరుణపుత్రులు వచ్చి నీతో యుద్ధముచేసి పరాజయమును బొందిరిగదా! ఇఁక నెవరితో యుద్ధము చేయుదువు?" అని చెప్పఁగానే సంతోషించి రావణుఁడు తనపేరు చాటించి, యట్టహాసములుచేయుచు సింహనాదములు చేయుచు వరుణనగరమునుండి మరలి వచ్చినత్రోవనే పుష్పకవిమానముపై లంకకు బయలుదేఱెను.

ఇక్కడనుండి ప్రక్షిప్తసర్గములు

1-వ సర్గము

రావణుఁడు బలిని జూచుట

ఇట్లు వరుణునిపురమునుండి రావణుఁడు హర్షధ్వనులు చేయుచు బయలుదేఱి హర్షముచేత గద్గదస్వరముపడి మాటలాడుచున్న మహోదరునితోఁ గూడి మరల నక్షనగరమునకు వచ్చి యుక్తదూరదుఁడై విహరించుచుండెను. ఇట్లు విహరించుచు రావణుఁడచ్చట వైడూర్యతోరణములతోఁగూడినదియు, ముక్తాజాలకములతో నలంకరింపఁబడినదియు, బంగారుస్తంభములచే సాంద్రమైనదియు, నెచ్చటఁ జూచినను తిన్నెలుగలదియు, వజ్రములచేతను స్ఫటికములతోను గట్టఁబడిన సోపానములుగలదియు, చిఱుగంటలతోఁ గూడినదియు, పలువిధములైన యాసనములు గలదియు, దేవేంద్రునిమందిరముచందమున నందమైనదియు నగు నొకానొకదివ్యమందిరమును జూచెను. ప్రతాపవంతుఁడగు నాదశగ్రీవుఁడాయింటిని జూచి "మేరుమందరములతో సమానమైన యీచక్కని యిల్లెవరిదో తెలిసికొని రమ్ము" అని ప్రహస్తునితోఁ జెప్పఁగా, నతఁడు వెంటనే బయలుదేఱి యాయింటిలోఁ బ్రవేశించి యాతోలిద్వారమునందెవ్వరును లేకుండుట చూచి రెండవకక్ష్యలోనికి వెళ్లెను. ఇట్లు కక్ష్యాంతరము లేడు దాఁటి యచ్చట నొకజ్వాలను జూచెను. అచ్చట నొకదివ్యపురుషుని జూచెను. ఆయన వీనిఁ జూచినవెంటనే సంతోషించి యొక్కమాఱు నవ్వెను. ప్రహస్తుఁడాతఁడు నవ్వుట చూచి పులకితగాత్రుఁడైపోయెను. అపురుషుఁడు జ్వాలామధ్యమున హేమమాలియై మోహమును గలిగించుచు సూర్యునివలెనే తేఱిచూచుటకు సాధ్యపడక రెండవయమునివలెఁ గనుపడెను. అచ్చటి వృత్తాంతమంతయుఁ జూచి తొందరపడుచుఁ బ్రహస్తుఁడచ్చటినుండి బయలుదేఱి రావణునియొద్దకు వచ్చి చెప్పెను. ఆమాట వినఁగానే రామా! రావణుఁడు వెంటనే పుష్పకముసుండి దిగి కాటుకకొండవలెఁ జూపట్టుచు నాదివ్యమందిరములోఁ బ్రవేశింపఁదలఁచి యటుపోవఁగాఁ నెదుటఁ జంద్రమాళియు వపుష్మంతుఁడునగు పురుషుఁడగపడెను. అతఁడు చూచుటకు భయంకరుఁడై జ్వాలాజిహ్వుఁడైద్వార మావరించియుండెను. ఎఱ్ఱనికన్నులు, తెల్లనిమొగము, దొండ

పండువంటి పెదవి, ఊర్ధ్వరోమములు, మహాభయంకరమైన ముక్కు, శంఖమువంటి కంఠము, పెనుదౌడలు, గూఢమైన గడ్డము మీసములు, అణఁగియున్న యెముకలు, పెద్దపెద్దకోఱలు గలిగి చూడఁగనే గగుర్పాటును గలిగించుచున్న పురుషుని, అతనిచేతిలోనున్న లోహాముద్గరమును, అతఁడు ద్వారమున కడ్డుగా నిలిచియుండుటయుఁ జూడఁగనే రావణుని శరీరమంతయు నొక్కమాఱుగాఁ బులకరించినది. వానిహృదయము చలించినది. ఒడలు వడవడవడఁకుచున్నది. రామా! రావణుఁ డపశకునములనుగూడఁజూచి యాలోచింపఁదొడఁగెను. ఇట్లాలోచించుచుండఁగా నాపురుషుఁడే యిట్లనియె: "రాక్షసుఁడా! నీవు దేనిని జింతించుచున్నావో వేగముగాఁ జెప్పుము. నీకు భయములేదు. నీయిచ్ఛకువచ్చిన మచ్చుననే చెప్పుము" అని యడుగఁగా "నేను యుద్ధభిక్షకై వచ్చితి" ననెను. అతఁడు సంతోషించి "మంచిది. యుద్ధభిక్ష యిచ్చెద"నని చెప్పి మరల నిట్లనియె: రావణా! నీవు నాతో యుద్ధము చేయుదువా? బలితో యుద్ధము చేయుదువా? ముం దాసంగతి చెప్పు"మని యనఁగానే మరల రావణునకు శరీరమంతయుఁ బులకరించినది. కొంతసేపునకు ధైర్యము దెచ్చుకొని యిట్లనియె: "పలుకునేర్పుగల యోమహాత్మా! యీ యింటిలో నెవ్వరున్నారో చెప్పుము. వానితోడనే యుద్ధముచేసెదను. లేకున్న నీయిష్టముచొప్పునఁ జేసెదను" అనఁగానే "దానవేంద్రుఁడగు బలిచక్రవర్తి లోపల నున్నాఁ"డని బదులు చెప్పి మఱియు నిట్లనియె: "రావణా! బలిచక్రవర్తి మిక్కిలి యుదారమైన యంతఃకరణము గలవాఁడు, మహాశూరుఁడు, సత్యమైన పరాక్రమము గలవాఁడు, మహావీరుఁడును, అనేకములగు మంచిగుణములు గలవాఁడు. వేయేల? పాశహస్తుఁడగు నంతకునివంటివాఁడు. ఉదయించిన సూర్యునివలెఁ దేజశ్శాలి; యుద్ధమునఁండి యెన్నఁడును మరలినవాఁడు గాఁడు, పట్టుదల గలవాఁడు, జయింప వీలులేనివాఁడు, గుణసముద్రుఁడు, జయించువాఁడు. మఱియు మధురములగు మాటలాడువాఁడు, గురువులయందును విప్రులయందును భక్తిగలవాఁడు, సంవిభాగము గలవాఁడు, కాలము నెదురుచూచువాఁడు, మహాసత్త్వసంపన్నుఁడు, సత్యవచనుఁడు, చల్లగాఁజూడఁదగినవాఁడు, అట్టి సర్వగుణోపేతుఁడగు శూరుఁడును నిత్యమును స్వాధ్యాయమునం దాసక్తుఁడును నైయుండును. అతఁడే గర్జించువాఁడును,

వర్షించువాఁడును. అతఁడే వీచుచుండును, జ్వలించుచుండును, తపించు చుండును. అతఁడు దేవతలకుఁగాని, రాక్షసులకుఁగాని, భూతములకుఁ గాని, పన్నగులకుఁగాని, మహర్షులకుఁగాని భయంపడువాఁడు గాఁడు. అట్టివానితో నేల యుద్ధము చేయఁబోయెదవు? రాక్షసేశ్వరా! అంతగా నీవు బలిచక్రవర్తితో యుద్ధము చేయ నిశ్చయించితివేని వేగముగా లోపలకుఁబోయి యామహాసత్త్వునితో యుద్ధము చేయుము. ఎవరు వల దన్నారు?" ఇట్లాపురుషుఁడు చెప్పఁగానే లోపలకుఁ బోయి రావణుఁడు బలిని జూచెను. అతఁడును వీనిని జూచి యట్టహాసము చేసెను. ఆదానవ శ్రేష్ఠుఁ డగుబలి సూర్యునివలెఁ దేజరిల్లుచూడఁగాక విశ్వరూపియై వెంటనే రావణుని బట్టుకొని తొడమీఁద గూర్చుండఁబెట్టుకొని, 'నాయనా! రావణా! నీ వేమిపని కలిగి వచ్చితివో చెప్పుము. నీకోరిక నెఱవేఱిచి పంపెదను' అని యడుగఁగానే, రావణుం డతనితో నిట్లనియె: "మహా భాగా! నావచ్చినకార్యము మఱియేమియు లేదు. నిన్నుఁ బూర్వము విష్ణుమూర్తి మాయచేసి బద్ధునిగాఁ జేసె నని వినియుంటిని. కావుననే నిన్ను విడిపించుటకు శక్తిగలవాఁడను గనుక వచ్చితిని. నిన్ను విడిపించి పోయెదను. సంశయపడకుము" అని యనఁగానే యతఁడు నవ్వి రావణు నితో నిట్లనియె.

"రావణా! అటులేని వినుము చెప్పెదను. ఇప్పుడు నీకు ద్వారము దగ్గఱ యగపడిన పురుషుఁడు నిత్యమును నచ్చటనే యుండును. అతనిచే రాక్షసశ్రేష్ఠులు మఱియుఁ గొందఱు బలవంతులు పూర్వులు పూర్వ తరులు పూర్వతములు స్వాధీనపఱుచుకోఁబడిరి. అతఁడే యిట్లు నన్నుఁ గట్టి పడవైచినవాఁడు. విధి దాఁటరానిదిగదా! రావణా! ఆమహాపురు షుని నెవరు వంచింపఁగలవారు? వే యేల? ఆద్వారమునొద్ద నున్న పురు షుఁడు సర్వభూతములను సంహరించువాఁడు. అతఁడే చేయువాఁడును, జేయించువాఁడును, ధాతయు, భుననముల కీశ్వరుఁడును నని యెఱుఁ గుము. కాలత్రయమునకును సాక్షిగా నుండు నాయనను నీవు గావు, నేను గాను, బ్రహ్మాదులుగూడఁ దెలిసికొనజాలరు. అతఁడే కలిరూపుఁడు, కాలరూపుఁడు, సర్వభూతాపహారకుఁడు, లోకత్రయమునకుఁ గర్త, భర్త, సృజించువాఁడు, సంహరించువాఁడును. అతని కాద్యంతములు లేవు. అతఁడే మాటిమాటికిని లీలగా జగములను బుట్టించుచుఁ బెంచుచు

సంహరించుచు నుండును. ఆమహేశ్వరుఁడే కరణము, కారణము, కర్తయు నైయుండును. అతఁడు చేసినయజ్ఞములకును దానములకును హోమాది క్రియలకును ఫల మిచ్చువాఁడు. ఆలోకేశుఁడు సర్వమును సృజించువాఁడును రక్షించువాఁడును. ఇందులకు సందియపడ నక్కఱలేదు. వేయేల? నాయనా! ఇట్టి మహాభూతస్వరూపుఁడగుపురుషుఁడింకొకఁడెందును లేఁడని యెఱుంగుము. పౌలస్త్యా! నేను నీవు మనపూర్వులు మొదలగువారందఱును నీమహాత్మునిచేఁ బశువులు త్రాడునఁ గట్టఁబడినట్లు గట్టఁబడియున్నాము. మఱియు వృత్రాసురుఁడు, అనలుఁడు, వసువు, శుంభుఁడు, నిశుంభుఁడు, శృంభుఁడు, కాలనేమి, ప్రహ్లాదుఁడు, వైరోచనుఁడగుబలి, కాలకేయులు, తారకుఁడు, ముచుకుందుఁడు, వివర్ధనుఁడు, హిరణ్యాక్షుఁడు, మధుఁడు, కైటభుఁడు, ధూమ్రుఁడు, శంబరుఁడు, యమళార్జునులు, కంసుఁడు, శకుఁడు, కూటుఁడు, మృదువు మొదలగు వీరందఱును అగ్నివలెనే తపించువారును, సూర్యునివలెనే వెలుంగుచుండువారును, గాలివలె వీచుచుండువారును, మేఘునివలె వర్షించుచుండువారును నైయుండెడివారు. అందఱును యజ్ఞములు చేసినవారు. అందఱును గొప్పతపస్సు చేసినవారు. అందఱును మహాత్ములు. మఱియు నందఱును యోగనిష్ఠులు. అందఱును మహైశ్వర్యములను సంపాదించి యఖండమైనభోగముల ననుభవించినవారు. అందఱును దానములు చేసిరి; యజ్ఞములు చేసిరి; వేదములు చదువుకొనిరి; ప్రజలను బాగుగాఁ బరిపాలించిరి; తమపక్షమువారిని బాగుగా రక్షించిరి; శత్రువులను సంహరించిరి; మూఁడులోకములయందును వారికి యుద్ధములో సమానులు లేరు. వారు మహాశూరులు; మంచిమంచివంశములయందుఁ బుట్టినవారు; సమస్తశస్త్రాస్త్రములను దెలిసికొన్నవారు. వారికిఁ దెలియని విద్యలే లేవు. యుద్ధములలో నుండి వారు మరలి యెఱుఁగరు. ఆమహాత్ములందఱును దేవరాజ్యములఁ గోరినవారలే; యుద్ధములో వేలకొలఁదిమాఱులు దేవతలను జయించినవారు; దేవతల కప్రియము నాచరించుటయందు సామర్థ్యము గలవారు; స్వపక్షమును పరిపాలించుటకు శక్తిగలవారు; మిక్కిలి మదించినవారు; భోగాసక్తులు; బాలసూర్యునితో సమానమైన తేజస్సుగలవారు నగు నిట్టివారికందఱికి నీశ్వరుఁడైన విష్ణువితఁడు; నశింపఁ జేయు నుపాయము నెఱింగిన హరి యితఁడు. అప్పుడప్పుడు సంహారము

చేయనెంచి ప్రాదుర్భవించి యాపని కాఁగానే తనయెప్పటిరూపము నవలంబించియుండును. ఈరీతిగా నీమహాత్మునిచేత మహాత్ములగు దానవశ్రేష్ఠులు నాశమును బొందింపఁబడిరి. మఱియు నతఁడు యుద్ధములలో ధర్షింపశక్యముగాని రాజులనుగూడఁ బరాజయమునుబొందించి కృతాంత బలచోదితులయినవారి నందఱను నశింపఁజేసియున్నాఁడు."

ఇట్లు చెప్పి మరల నాబలిచక్రవర్తి రావణునితో నిట్లనియె:

"సరియేకాని, నాయనా రావణా! ఆమండుచున్న యగ్నివలెనున్న కుండలము పట్టుకొని నాదగ్గఱకు రమ్ము. తరువాత నేనవ్యయమగు ముక్తికారణమును జెప్పెదను. నేను జెప్పినట్లు కుండలము దెమ్ము. ఆలస్యము చేయకుము" అని బలిచెప్పఁగానే యామాట విని మహాబలుఁడగు రావణుఁడు నభ్వచు గొప్పదగు దివ్యమైన యాచక్రమున్నచోటికిఁ బోయి రామా! బలదర్పితుఁడైన యారావణుఁ డద్దానిని విభాసముగాఁ బెల్లగింపఁబోయెను. కాని దానినిఁ గదలుపఁజాలకపోయెను. ఎంతప్రయత్నించినను అది గదలినదే కాదు. సిగ్గుపడిపోయెను. మరల మరలఁ గదలించిచూచెను. లాభము లేకపోయినది. తుదకుఁ దానే భూమిమీఁదఁ బడిపోయెను. మొదలునఱికినమ్రానువలెఁబడిపోయి నెత్తురు క్రక్కుకొనెను. ఇంతలో రాక్షసునిమంత్రి లాపుష్పకమునుండి యాహాకారముచేయఁగా నాచప్పుడు వినవచ్చినది. తరువాత రావణుఁడు గొంతసేపటికిఁ దెలివితెచ్చుకొని లేచి సిగ్గుపడి శిరస్సు వంచుకొని యుండుటచూచి బలి యిట్లనియె:

"రాక్షసశ్రేష్ఠా! ఇటు రమ్ము. నేను జెప్పుమాట వినుము. ఇప్పుడు నీవెత్తఁబోయి యెత్తఁజాలక పోయిన యది మణివిభూషితమైన యీకుండలము మాపూర్వుఁడగు హిరణ్యకశిపుఁడు చెవినిదాల్చినది. బాగుగాఁజూడుము. ఇది యొక్కటి యిచ్చటఁ బడినది. మహాబలా! రెండవకుండలము మఱియొకచోఁ గొండచఱియమీఁదఁ బడినది. అతఁడు యుద్ధము చేయుచుండఁగాఁ గిరీటము చేదిసమీపమున భూమిమీఁదఁ బడిపోయినది. అపి కృతాస్త్ర కశిపుఁడు మాపూర్వపితామహుఁడు. అతనికి మృత్యుభయ మేమాత్రమును లేదు. యుద్ధమందు లేఁడు. రోగములు లేవు. అతనికిఁ బగటియందుఁగాని రాత్రియందుఁగాని యుభయసంధ్యలయందుఁ గాని మరణము లేదు. పచ్చిద్రానిచేతనుగాని యెండినదానిచేతనుగాని యేవిధమైన యాయుధమునిచేతనుగాని దివ్యాస్త్ర విశేషములచేతనుగాని మరణము లేదు. అతఁడు తనయమాత్యుఁడు

దునితో నతిదారుణమైన వాదమును బెట్టుకొనెను. ఇట్లు వాదము జరుగు చుండఁగనే లోకభయంకరుఁడగు నాదివ్యపురుషుఁడు సర్వమును భగవం తునిగాఁ జూచుచున్న మహాభక్తుఁడగు ప్రహ్లాదునిమాట యథార్థము చేయుటకై యప్పుడు నరసింహరూపముతో స్తంభమునుండి బయటికివచ్చి, యచ్చటియల్లరియంతయుఁజూచి బాహువులు సాఁచి యాహిరణ్యకశిపుని బట్టుకొని గోళ్లతో నతని హృదయముఁజీల్చి యమునియింటికిఁబంపించెను. అటువంటి మహానుభావుఁడగు నాభగవంతుఁడే నాద్వారము నొద్దద్వార పాలకుఁడై యున్నాఁడు. ఆహానుదేవుఁడు నిరంజనుఁడు. ఆదేవాధిపుని యొక్క యథార్థము నేను జెప్పెద నాలకింపుము. నీహృదయము భక్తి భావముతోఁ గూడియుండునట్లు చేసికొని యాకర్ణింపుము. ఇపు డా ద్వారముకడ నున్న పురుషుఁడు వేలకొలఁది యింద్రులను, అయుతముల కొలఁది దేవతలను, వందలకొలఁది సప్తఋషులను దనయధీనము చేసికొని యున్నాఁడు" అని యిట్లు చెప్పిన బలిమాటలు విని రావణుఁడిట్లనియె.

నేను బాశహస్తుఁడును, మహాజ్వాలాపరీతుఁడును, ఊర్ధ్వరోముఁ డును, భయంకరుఁడును, బ్రేతములకు రాజునునగుయమని మృత్యువుతోఁ గూడఁజూచితిని. మఱియు నాయముఁడు మెఱుపుఁదీఁగవంటినాలుకయు, పెద్దపెద్దదంష్ట్రలు, సర్పములవంటియు వృశ్చికములవంటియు రోమములు, ఎఱ్ఱనికన్నులు, భయంకరమయిన వేగము గలిగి సర్వజంతుప్రలకును భయం కరుఁడై సూర్యునివలె దేఱిచూడఁ జాలనివాఁడు; యుద్ధములలో మరలనివాఁడు; పాపాత్ములను శిక్షించువాఁడునుగదా! నే నట్టివానిని యుద్ధములో జయించితిని. నాకు వానితో యుద్ధము చేయునపుడు భయముగాని పీడగాని కలుగలేదు. ఇప్పుడు నీవు చెప్పుచున్నవానిని మాత్రము నే నెన్నఁడును విని యుండలేదు. కాఁబట్టి యతనిసంగతి చెప్పవలయు నని యడుగఁగా బలి యిట్లనియె. "నాయనా! ఇతఁడే మూఁడులోకములను బుట్టించువాఁడు. ఇతఁడే హరియు నారాయణుఁడు నగుప్రభువు. ఇతఁడు కపిలుఁడు, అనంతుఁడు, విష్ణువు, నారసింహుఁడు, మహాద్యుతిఖాలి. మఱియు సత్యమునకుఁ జోటు, తేజశ్శాలి, పాశ హస్తుఁడు, భయంకరుఁడు, ద్వాదశసూర్యులతో సమానమైన కాంతి గలవాఁడు, పురాణపురుషోత్తముఁడు, నీలమేఘమువంటి కాంతికల వాఁడు, సురలందఱికిను నాయకుఁడు, దేవతలలో నుత్తముఁడు. మఱియు

జ్వాలామాలి. మహాబాహుఁడు, యోగి, భక్తజనులకు మేలుచేయు వాఁడు. ఇతఁడే లోకములను ధరించువాఁడును, సృజించువాఁడును, కాలరూపుఁడై సంహరించువాఁడునునై యుండును. చక్రాయుధధారి యగునితఁడే యజ్ఞములు, యజ్ఞములుచేయువాఁడునునై యుండును. ఇతఁడే సర్వదేవమయుఁడును, సర్వభూతమయుఁడు నని చెప్పఁబగిన వాఁడు. ఇంతయేల యితఁడే సర్వలోకమయుఁడు, సర్వజ్ఞానమయుఁడును సర్వరూపియు మహారూపియు బలదేవుఁడు మహాభుజుఁడు వీరహంత యు. మూఁడులోకములకును గురువును, అవ్యయుఁడును నని యిట్లు మునులగు మును లందఱును జెప్పుచుందురు. ఇట్టి పురుషుని దెలిసి కొన్న వారికిఁ బాపములతో సంబంధ ముండఁబోదు. అతనిని స్మరించినను అతనినిగుఱించి యజ్ఞాదులు చేసినను సర్వకామములును నెఱవేఱు చుండును." అని యిట్లు చెప్పినబలి మాటలు విని కోపముచే నెఱ్ఱఁబడిన కన్నులుగలవాఁడై యాయుధములు పట్టుకొని మహాబలశాలి యగు రావణుఁ డక్కడనుండి బయలుదేఱెను. అటువంటిరావణునిఁ జూచి ముసల మనునాయుధముచేతితోఁ బట్టుకొని ద్వారమునొద్ద నున్న యాభగవంతుఁడు బ్రహ్మకు మేలుచేయు తలంపుగలవాఁడయి "ఈపాపాత్ముని నే నిపుడు చంపను." అని నిశ్చయించుకొని విశ్వరూపుఁడు గసుకనాయన యచ్చటనే యంతర్ధానము నొందెను. ఎంతప్రయత్నించినను మఱి యాపురుషుఁడు రావణునికిఁ గనుపడలేదు.

2-వ సర్గము

రావణుఁడు సూర్యలోకమునకుఁ బోవుట

తరువాత నాలోచించుకొని రావణుఁడు సూర్యలోకమునకుఁ బోయెను. అచ్చట మేరుపర్వతశిఖరముపై నారాత్రి నివసించి సూర్యుని గుఱ్ఱములవేగమును మనోవేగమును గలదియు, దివ్యమును విహార ప్రదేశమును నగు నాకసమున నున్నదియు నగు పుష్పక మెక్కి బయలు దేఱి సర్వతేజోమయుఁడును, స్వయంప్రకాశమానుఁడును, శుభమయిన యాకృతిగలవాఁడును, మంచిబంగారుభుజకీర్తులచేతను రక్తాంబరముల చేతను నలంకరింపఁబడినవాఁడును, శుభంకరము లగుకుండలములచే వెలుఁగుచున్న ముఖముగలవాఁడును, రక్తమాలావిభూషితుఁడును,

కేయూరాదులగునాభరణములుగలవాఁడును, రక్తచందనముచేఁ బూయఁ బడిన దేహము గలవాఁడును, వేయికిరణములచే నుజ్జ్వలుఁడై యొప్పువాఁడును, ఏడుగుఱ్ఱములచేఁ బూన్పఁబడినరథముపైఁ గూర్చుండి యున్నవాఁడును, ఆదిమధ్యాంతములు లేనివాఁడును, సమస్తలోకములకు సాక్షీభూతుఁడును, ప్రభువును నగు సూర్యభగవానునిఁ జూచెను. ఇట్లు చూచి యారావణుఁడు సూర్యునితేజస్సునొక్కబలముచేఁ బీడితుఁడై యున్న ప్రహస్తునితో నిట్లనియె : "ప్రహస్తా! నీవు పోయి యతనితో నాయాజ్ఞను వినిపింపుము. రావణుఁడు నీతో యుద్ధము చేయఁదలంచి వచ్చియున్నాఁడని వినిపింపుము. ఇష్టమున్నచో యుద్ధము చేయుము; లేదేని యోడితిననియైనను జెప్పుమనుము. రెండింటిలోను నేదేని యొక పక్షమవలంబింపుమనుము" అని రావణుఁడు చెప్పఁగా యాప్రహస్తుఁడు సూర్యునియొద్దకుఁబోయి పింగళుండును దండియు ననుసూర్యుని ద్వార పాలకులను జూచి, వారితో రావణుని నిశ్చయమంతయుఁ జెప్పి యూరక యుండెను. ద్వారపాలకులలో నొకఁడగు దండి లోపలకుఁబోయి యా వృత్తాంతమంతయు సూర్యునితోఁ జెప్పెను. దండి యనువాఁడు చెప్పిన సంగతియంతయు విని బుద్ధిపూర్వకముగా సూర్యుఁ డిట్లనియె : దండీ! నీవు వెళ్లి రావణునినైనను జయింపుము; లేదేని యోడితి ననియఁయినను జెప్పుము. ఇపుడు నీబుద్ధికిఁ దోఁచినట్లు చెప్పుము. నేను కాలహరణమును సహింపఁజాలను" అని యిట్లు సూర్యుఁడు చెప్పఁగానే యామాటలువిని పోయి దండి రావణునితోఁ జెప్పెను. రావణుఁ డామాటలు విని సూర్యుని జయించితి ననిచాటించి యచ్చటినుండి బయలుదేఱిపోయెను.

3-వ సర్గము

రావణుని చంద్రలోకప్రయాణము

తరువాత శ్రీరామా! బాగుగా నాలోచించుకొని రావణుఁడు చంద్రలోకమునకుఁ బోయెను. అచ్చట మేరుపర్వతముయొక్క రమ్యమైన శిఖరముపై నాఁటిరాత్రి నివసించెను. అప్పుడు దివ్యమాలికలు ధరించి దివ్యగంధ మలందుకొని యచ్చరలు సేవించుచుండఁగా నొకఁడు రథముపైఁగూర్చుండి పోవుచుండెను. అతఁడు రతిశ్రాంతుఁడై యచ్చరల దేహములచేఁ జుంబింపఁబడినవాఁడగుచున్నవాఁడై విబోధమును గను

చుండెను. అటువంటివానిని జూచి రావణుఁడు కౌతూహలముతోఁ గూడినవాఁడై యచ్చటనే పర్వతుఁడను పేరుగల ముని నొకనిని జూచెను. రావణుఁ డామునివర్యునిఁ జూచి యిట్లనియె: "ఋషివర్యా! నీకు స్వాగతము. దైవవశమునఁ దటస్థించితివి. అచ్చరలచే సేవింపఁబడుచు రథ మెక్కి పోవుచున్న యాపురుషుఁ డెవఁడు? వానికి సిగ్గున్నట్లు కను పట్టదు. వానికి భయము గూడ లేనట్లున్నది." అని రావణుఁ డనఁగా విని పర్వతుఁ డిట్లనియె. 'మహామతి వగువత్సా! యథార్థ మయిన సంగతి చెప్పెదను. ఇతఁడు లోకముల నన్నింటిని జయించి బ్రహ్మను సంతోషిం పఁజేసినవాఁడు. ఇతఁడు మోక్షమునకుఁ బోవుచున్నాఁడు. అది యుత్త మమయిన సుఖమును గలిగించుస్థానము. నీవు పరాక్రమముచేతను లోక ములను జయించి నట్లే, యితఁడును దనతపస్సుచే నన్ని లోకములను జయించినవాఁడు. ఇతఁడు పుణ్యాత్ముఁడు. వత్సా! యితఁడు సోమరసము బ్రాగి పోవుచున్నాఁడు. ఇందులో సందియము లేదు. రాక్షసాధ్యక్షా! నీవును శూరుఁడవు; సత్యవ్రతుఁడవు. నీవంటి బలవంతు లిటువంటి బ్రహ్మ చారులపైఁ గోపింపరు.' అని యిట్లాపర్వతముని చెప్పుచుండఁగానే మహా కారము గలిగి తేజశ్శాలి యగు నొక రథికుఁడు గానవచ్చెను. అతఁడు మఱియు గీతవాద్యవినోదములఁ దగిలియుండెను. వానిని జూచి రావణుఁ డిట్లనియె: దేవర్షి! కిన్నరులు పాడుచుండఁగా నచ్చరలాడుచుండఁగానో భాయమానుఁడైనమహాద్యుతియగునీపురుషుఁడెచ్చటికిఁబోవుచున్నాఁడు? అని రావణుఁడడుగఁగాఁ బర్వతుఁడిట్లనియె: రావణా! ఇతఁడు మహాశూ రుఁడు. యుద్ధములోఁ జయించువాఁడు. స్వామికార్యమునకయి జీవిత మును త్యజించినవాఁడు. ఇతఁడు యుద్ధములో సైన్యముతోఁ గూడిన మహావీరుల ననేకులను జంపి తాను జచ్చెను. ఇతఁడు యుద్ధములలో మరలనివాఁడు. ఇతఁడు యుద్ధము చేయుచుండఁగా నాయుధముచే నితని శరీరము శిథిలముగాఁ జేయఁబడినది. ఇతఁడిపుడు దేవేంద్రుని యింటి కతి థిగాఁ బోవుచున్నాఁడు. కాదేనితనయిచ్ఛకువచ్చినచోటికిఁ బోవఁగలఁడు. ఈనరసత్తమునిఁ కిన్నరాదులు నృత్తగీతాదులచే సేవించుచుందురు. ఆమాటలు విని మరల నొకసూర్యునివంటి తేజస్సుగల పురుషునిఁ జూచి 'వీఁ డెవఁ'డని పర్వతు నడుగఁగా బర్వతుఁ డిట్లనియె: "రావణా! బంగారు వికారమయిన రథముపైని గూర్చుండి యప్సరోగణముచే సేవింప

బడుచుఁ బూర్ణచంద్రునితో సమానమయిన ముఖముగలవాఁ డయి కనుపడుచున్న యీపురుషుఁడు సువర్ణమును దానము చేసినమహాత్ముఁడు. కావునఁనే విచిత్రములయిన యాభరణములును వస్త్రములును గలవాఁడై యున్నాఁడు. ఇతఁడు శీఘ్రగామియగు విమానమెక్కి పోవుచున్నాఁడు." అని చెప్పినపర్వతునిమాటలు విని రావణుఁడు మరలఁ బర్వతునితో నిట్లనియెఁ: "మునీశ్వరా! ఈపోవుచున్న రాజు లెవరు? వీరిలో నెవ రైనను నాకు యుద్ధభిక్ష యీయఁగలవా రున్నారా? పర్వతమునీ! వేగముగ చెప్పుము. ధర్మజ్ఞా! నీవు నాకుఁ దండ్రివంటివాఁడవు." అని యడుగఁగాఁ బర్వతుఁ డిట్లనియెఁ. "రావణా! వీరు స్వర్గమును గోరి పోవుచున్నారు. వీరుయుద్ధము చేయువారు గారు. కావలసినచో నీతో యుద్ధముదేయఁదగినవానిని నేనుజెప్పెదను వినుము. భూలోకమున మాంధాత యనురా జొకఁడు గలఁడు. అతఁడు విచిత్రాంబరభూషణుఁడు. సప్తద్వీపము లేలువాఁడు. చాల గొప్పవాఁడు. అతనిదగ్గఱకు బోయితివేని నీకు యుద్ధభిక్ష తీఱఁగలదు." అని పర్వతుఁడు చెప్పఁగా విని రావణుఁ డిట్లనియెఁ. "పర్వతమునీ! నీవు చెప్పిన మాంధాతృమహారా జెచోఁ్చసుండును?నిజముగాఁజెప్పుము;నేనిప్పుడే వానితో యుద్ధముచేయఁ బోయెదను." అను రావణునిమాటలు విని పర్వతుఁ డిట్లనియెఁ. రావణా! మాంధాత యనురాజు యువనాశ్వుని కుమారుఁడు; రాజశ్రేష్ఠుఁడు. అతఁడు తనబలముచేత సప్తద్వీపములను జయించి స్వర్గమునకుఁ బోవ సున్నాఁడు. అని చెప్పఁగానే మహాబాహుఁ డగు నారావణుఁడు బ్రహ్మయిచ్చినవరములచే గర్వించి యయోధ్యాధిపతియు, వీరుఁడును, రాజశ్రేష్ఠుఁడునుసప్తద్వీపములకుఁ బ్రభువును రథమెక్కిపోవుచున్న వాఁడును బంగారువికారమై విచిత్రమై ప్రకాశించుచుండు మహాహారముచే వెలుఁగుచు దివ్యమైనగంధ మలందుకొని దివ్యమాలాలంకృతుఁడై రూపముచేతను జాజ్వల్యమానుఁ డైనవాఁడును నగు మాంధాతను జూచి "నాకు యుద్ధభిక్ష యిమ్ము. లేదేని యోడితి ననియైనను జెప్పుము" అని యనుచున్న రావణునిఁ జూచి నవ్వుచు మాంధాత యిట్లనియెఁ: "రావణా! నీకుఁ బ్రాణములమీఁద నాశ లేకయున్నచో నాతో యుద్ధమునకు రమ్ము"అను మాంధాతమాటలు విని రావణుఁ డిట్లనియెఁ: "ఓరీ! యీరావణుఁడు వరుణునకుఁగాని, కుబేరునకుఁగాని, యమునకుఁగాని భయపడి యెఱుఁ

గఁడే. ఇఁక మనుష్యమాత్రుఁడవగు నీకు భయపడు ననుకొంటివటరా!" అని యతనితోఁజెప్పి రావణుఁడు కోపమునలన వానిని దహించువాని వలె యుద్ధదుర్మదు లగురాక్షసుల కాజ్ఞాపించెను. దురాత్ముఁడగురావణుని యొక్కమంత్రులు కోపించినవారై బాణవర్షమును వర్షించిరి. తరువాత నామహాబలవంతుఁడగు మాంధాత కోపించి యజిహ్మగము లగుకంకపత్ర ములు గలబాణములచేఁ బ్రహస్తుఁడు, శుకుఁడు, సారణుఁడు, మహో దరుఁడు, విరూపాక్షుఁడు, మారీచుఁడు, అకంపనుఁడు మొదలగువారిని గట్టిగాఁ గొట్టెను. తరువాత ప్రహస్తుఁడు రాజుమీఁద బాణవర్షము వర్షించెను. ఆరాజు తనదగ్గఱకు రాకుండఁగనే యాబాణములను ద్రోవ లోనే ఖండించెను. మఱియు నతఁడు ప్రయోగించిన భుశుండులచేతను, భల్లములచేతను, భిండివాలములచేతను, తోమరములచేతను గొట్టఁబడి రాక్షసులు మండుచున్న యగ్ని నెదుర్కొనిన మిడుతలవండువలె మాఁడి పోవుచుండిరి. మఱల నారాజు కోపించి నైదుబాణములచేత నారావ ణునిఁ గొట్టెను. మఱియు నామహారాజు తోమరములు మొదలగువాని చేతఁ బూర్వము కుమారస్వామి క్రౌంచపర్వతమును భేదించినట్లు రావ ణుని భేదింప మొదలిడెను. తరువాత వజ్రాయుధమువంటి ముద్గరమును గిరగిరఁద్రిప్పి యతివేగముగా రాక్షసునిరథముపైఁ బడునట్లుగా విసరెను. అది వచ్చి పడుగుసడినవడువున రావణునిమీఁదను బడినది. దానిపాటుచే రావణుఁడు ఘూర్ణితుఁడై యింద్రధ్వజమువలెఁబడిపోయెను. అప్పు డా రాజు చాలసంతోషించినవాఁడై హర్షముతోఁ గూడినబలము గలిగి ప్రకాశించెను. వేయేల? ఆతఁడుచంద్రునియొక్కసమస్తకిరణములతోడను స్పృశింపఁబడిన సముద్రమువలెఁ బొంగియుండెను. తరువాత రాక్షస సైన్యమంతయుఁ దెలివితప్పిపడియున్న రావణునిఁజుట్టు వాకొనియుండిరి. కొంతసేపటికిఁ దెలివితెచ్చుకొని లంకేశ్వరుఁడును లోకరావణుండును నగురావణుఁడు మాంధాతశరీరమును బీడింపమొదలిడెను. మహాబలుఁ డగురావణుఁ డతనిరథమును గుఱ్ఱములతోఁగూడఁ బాడుచేసెను. అట్లు విరథుఁడై మరల వెంటనే పెల్లుగ్రహ్మాయుగంటలతోఁ గూడికొనిన శక్తిని బూని బలపూర్వకముగా రావణునిమీఁదికి విసరెను. ఇట్లు మాంధాతచే విసరఁబడి యర్కజ్వాలవలెను, అగ్నిశిఖవలెను వెలుఁగుచు వచ్చుచున్న యాశక్తిని రావణుఁడు శూలముచేతను వారించి యగ్ని మిడుతనుదహించి

నట్లు దానిని దహించెను. తరువాత నారావణుఁడు తనకు యముఁ డిచ్చిన యస్త్రమును దీసి యతివేగముగా మాంధాతపైని ప్రయోగించెను. అతఁడు దానిచేఁ గొట్టఁబడినవాఁడై మూర్ఛిల్లెను. అట్లు మూర్ఛవోయిన మాంధాతను జూచి రాక్షసులు సంతోషించిరి; సింహనాదములు చేసిరి. తరువాత మహార్తకాలములోనే తెలివి దెచ్చుకొని శత్రువులగు రాక్షసులచేత గౌరవింపఁబడుచున్న శత్రువును రావణునిఁజూచి కోపించిన వాఁడై దురాధర్షుఁడు చంద్రసూర్యులతో సమానమైనకాంతిగలవాఁడును నగు మాంధాత గొప్పది యగు బాణవర్షముచేత రాక్షసబలము నంతను బీడించెను. తరువాత ధనుష్టంకారముచేతను, బాణవర్షముచేతను, సైన్యమంతయు సముద్రముపలె నల్లకల్లోలమైనది. అప్పుడు నరులకును రాక్షసులకును దొమ్మిగా యుద్ధము జరిగినది. నరశ్రేష్ఠుఁడగు మాంధాత యు రాక్షసశ్రేష్ఠుఁడగు రావణుఁడును గోపావేశముగలవారై ధనస్సులు గత్తులు పట్టుకొని యుద్ధము చేసిరి. మాంధాత రావణుని, రావణుఁడు మాంధాతను మిక్కిలిగా బాణవర్షము వర్షించి పీడింపఁజొచ్చిరి. ఇట్లు పరస్పరమును సంక్షోభము గలిగి ప్రహారములచేతను శిథిలమైన యవ యవములు గలవారైయుండిరి. అప్పుడు రావణుఁడు రాజాస్త్రమైని రౌద్రా స్త్రమును ప్రయోగించెను. ఆమాంధాత యాగ్నేయాస్త్రమును ప్రయో గించి దానిని వారించెను. మరల రావణుఁడు గాంధర్వాస్త్రమును ప్రయో గించెను. మాంధాత వారుణాస్త్రమును ప్రయోగించి దానిని వారించెను. రావణుఁడప్పుడు సర్వభూతములకును భయావహమైన బ్రహ్మాస్త్రమును ప్రయోగించుటకును,మాంధాత దివ్యమగు పాశుపతాస్త్రమును ప్రయో గించుటకును సిద్ధముగా నుండిరి. ఆరెండస్త్రములును మహాఘోరమైనవి, మూఁడులోకములకును భయమును గలిగించునవి. అప్పు డా రెండస్త్రము లను జూచి చరాచరప్రపంచమంతయు భయపడినది. పాశుపతము రుద్రుని వరదానమువలనఁ బొందఁబడినది. దేవతలు, నాగులు కంపము నొంది యింకఁ బ్రళయము దప్పదని నిశ్చయించుకొనిరి. ఇట్లుండఁగాఁ బులస్త్యుఁ డును, గాలవుఁడును ధ్యానముచేత నీసంగతియంతయుఁ దెలిసికొని యు ద్ధముచేయుచోటికి వచ్చి మాంధాతను వారించిరి. రావణునియొద్దకును వచ్చి మంచిమాటలాడి మానిపించిరి. తరువాత నారావణమాంధాత

లిద్దఱును శాంతించిరి. ఇట్లామునీశ్వరులు వారియిద్దఱికును స్నేహము గలుగఁజేసి వచ్చినదారినే పోయిరి.

4-వ స ర్గ ము

బ్రహ్మసందర్శనము

ఆమును లిద్దఱును నట్లు పోఁగానే రాక్షసాధిపుఁ డగురావణుఁడు పుష్పక మెక్కి పదివేలయోజనములదూరముగల మొదటిమరున్మార్గము నతిక్రమించెను. అచ్చటనే సన్న్యస్తులగు పరమహంసలు సర్వగుణా న్వితులయి యుందురు. అటు పయిని రెండవమరుత్పథము నతిక్రమిం చెను. అదియుఁ బదివేలయోజనములపరిమాణము గలదియే. అచ్చట మేఘము లన్నియు నుండును. ఆమేఘములు మూఁడువిధములు. నిత్య మును నచ్చట నాశ్రయించి యుండును. అవి యాగ్నేయము లనియుఁ, బక్షజములనియు, బ్రాహ్మము లనియు మూఁడువిధములుగాఁ బేరొంది నవి. తరువాత నారావణుఁ డచ్చటినుండి బయలుదేఱి మూఁడవవాయు మార్గమునకుఁ బోయెను. అచ్చట నిత్యమును మనస్సిద్ధి గలసిద్ధులు చారణులును నుందురు. అది గడచి పదివేల యోజనముల దూరము పోఁగా నచ్చట నాలవవాయుమార్గ మగపడినది. అచ్చట నిత్యమును వినాయకులతోఁగూడి భూతములు నివసించుచుండును. అచ్చటినుండి పదివేలయోజనముల దూరము గడచి యయిదవవాయుమండలమును జూచెను. అచ్చట గంగయుఁ గుముదాదులగు నాగులును నివసించుచుం దురు. మఱియు నాచోటను గంగలో నివసించి యేనుఁగులు నానావిధ ముల బుణ్యమును సంపాదించుకొనుచుఁ దమ తొండములచే జలబిందు వులను విడుచుచుండును. శ్రీరామా! ఆయేనుఁగులతొండములనుండి జాతి వాయువుచేతను లోలిత మయి యచ్చటిపాదలలోఁ బడి జలము మం చగుచుండును. అచ్చటినుండి బయలుదేఱి పదివేలయోజనముల దూరమునం దున్న యాఱవవాయుమండలమును జూచెను. అచోట్టున గరుడుఁడు తనజ్ఞాతులచేతను, బంధువులచేతను సత్కరింపఁబడుచు నిత్య మునుండును. మఱియు నచ్చటినుండి యట్లే పదివేలయోజనములదూర మతిక్రమించి సప్తమమైనవాయుమండలమునఁ బ్రవేశించెను. అందున్న సప్త ఋషులను జూచి యచ్చటినుండి మరలఁ బదివేలయోజనములదారి గడచి

గంగ ప్రవహించుచున్న యొనిమిదవవాయుమార్గమును జూచెను. అచ్చటి గంగ కాకాశగంగ యని పేరు. అది యాదిత్యపథమునం దున్నది.దానిని వాయువు ధరించుచుండును. దానివేగము చప్పుడును నింతింతయనిచెప్ప శక్యముగాదు. అటుపై నుండుచోటు సంగతి చెప్పెదను వినుము. అచ్చటనే చంద్రుడుండును. అచ్చటినుండి యొనుబదివేలయోజనము లతిక్రమింపఁగా నచ్చట గ్రహములతోడను, నక్షత్రములతోడను గూడి చంద్రుఁడుండును. ఆచంద్రునిమండలమునుండి యసంఖ్యము లగుకిరణములు లోకములను ప్రకాశింపఁజేయుచుండును. ఆకిరణములు సర్వజంతువులకును సుఖమును గలిగించును. ఇట్లు తనలోకమునకు వచ్చియున్న రావణునిఁజూచి చంద్రుఁడు శీతాగ్నిచే దహించువాఁడుసోలె నగపడెను. రావణునిమంత్రులాశీతాగ్నికిఁ దాళఁజాలక భయపీడితులై యుండఁగా నపుడు ప్రహస్తుఁడు జయశబ్దపూర్వకముగా రావణునితో నిట్లనియె: "రాజా! మే మందఱమును శీతముచే బాధింపఁబడిపోవుచున్నాము. మనమిఁక నిచ్చటినుండి మకలిపోవుదము. చంద్రునికిరణముల ప్రభావముచేత రాక్షసులకు భయము గలిగినది. ఈశీతాంశుఁడు తనకాంతిచేతను దహనస్వరూపుఁడుగా నగపడుచున్నాఁడు"అని చెప్పిన ప్రహస్తునిమాటలు విని రావణుఁడు కోపముతోఁ గూడినవాఁడై ధనుస్సున నారిని సారించి యొక్కమాఱు ధనుష్టంకారముచేసి బాణములతో నతనిని బీడించెను. అపుడు బ్రహ్మదేవుఁడు త్వరగాఁ జంద్రలోకమునకు వచ్చి రావణునితో నిట్లనియె: "దశగ్రీవా! మహాబాహూ! నీవు మావిశ్రవసుని కుమారుఁడవు. నామాట వినుము. నీవు చాలమంచివాఁడవు. చంద్రుని నిష్కారణముగాఁ బీడింపక యిఁక నీపాటి కిచ్చటినుండి మరలి పొమ్ము. ఇతఁడు లోకమునకు హితము చేయువాఁడు. ద్విజరాజు మహాకాంతిగలవాఁడు. నేను నీకుఁ బ్రాణములకు హానిగలుగునపు డభయమును సమకూర్చు మంత్ర మొకటి యుపదేశించెదను. నాయనా! ఆమంత్రమును జపము చేసినవారికి మృత్యుభయము లేదు" అని యిట్లు బ్రహ్మ చెప్పఁగా విని చేతులు జోడించి రావణుఁడిట్లనియె.

"దేవా! నీవు నన్నుఁ జూచి సంతోషించితివేని నేనను గ్రహింపఁదగినవాఁడనుగా నగపడితినేని నీయిష్టప్రకారముగానే యామంత్రరాజమును బ్రసాదింపుము. నీయనుగ్రహమువలన నేను దానిని జపము చేసి

కొనుచు సర్వదేవతలవలన నిర్భయుండ నైయుండెదను. మఱియు సర్వా సురులవలనను దానవులవలనను పక్షులు మొదలగువానివలనను నీ దయ వలన నాకు భయము లేదు" అని చెప్పుకొనఁగా విని బ్రహ్మ సంతోషించి యిట్లనియె: "రావణా! దీనిని ప్రాణములకు హాని చేకూడినప్పుడే తప్ప నిఁకెప్పుడును బ్రయోగింపరాదు. ఈశుభమంత్రము నక్షమాత్రము పట్టు కొని జపము చేయవలయును. రావణా! ఇది జపముచేయనిచో సిద్ధించు నదిగాదు. ఇదిగో చెప్పుచున్నాను వినుము. దీనిప్రభావము నీ కిప్పుడే ప్రత్యక్షమగును. నీవు యుద్ధములలో జయమును బొందుదువు.

"దేవదేవేశా! నీకు నమస్కారము. సురాసురనమస్కృతా! నీకు నమస్కారము. భూతభవ్యమహాదేవా! హరా! పింగళలోచనా! వ్యాఘ్రాజినధారీ! నీవు బాలుఁడవు. వృద్ధరూపుఁడవు. దేవా! నీ వాయణ్ణే యుఁడవు, త్రైలోక్యప్రభువవు, ఈశ్వరుఁడవు నగుచున్నావు. నీవు హరుఁడవు, హరితనేమివి, యుగాంతమునందు దహించు నగ్నివి నగుచున్నావు. గణేశుఁడు, లోకశంభువు, లోకపాలుఁడు, మహాభుజుఁడు, మహాదేవుఁడు, మహాశూలి, మహాదంష్ట్రుఁడు, కాలుఁడు, కాలరూపుఁడు, నీలగ్రీవుఁడు, మహోదరుఁడు, వేదాంగుఁడు, వేదమయుఁడు, పశుపతి, అవ్యయుఁడు, శూలధరుఁడు, శూలకేతుఁడు, నేత, గోప్త, హరి, శివుఁడు, జటి, ముండి, శిఖండి, లగుడి, మహాయశుఁడు, భూతేశ్వరుఁడు, గణాధ్యక్షుఁడు, సర్వాత్మ, సర్వభావసుఁడు, సర్వదుఁడు, సర్వహారియు, ప్రభ్వు, గురువు, కమండలధరుఁడు, దేవుఁడు, పినాకి, ధూర్జటియు, మానసీయుఁడు, అర్వాణీయుఁడు, ఓంకారుఁడు, సామవేదగుఁడు, మృత్యువు, మృత్యుదూతయు, పారియాత్రుఁడు సుప్రతుఁడు, బ్రహ్మచారి, గృహి, యోగి, వీణాపణవ తూణవంతుఁడు, అమరుఁడు, దర్శనీయుఁడు, బాలసూర్యసమప్రభుఁడు, శశానచారి, భగవానుఁడు, ఉమాపతి, అరిందముఁడు, భగనేత్రహర్త, పూషదంతనిపాతనుఁడు, జ్వరహర్త, పాశహస్తుఁడు, ప్రళయుఁడు, కాలుఁడు, ఉల్కాముఖుఁడు, అగ్నికేతుఁడు, మునిదీప్తుఁడు, విశాంపతి, ఉన్మాదమోహనకరుఁడు, సమర్థుఁడు, త్రిదశోత్తముఁడు, వామనుఁడు, వామదేవుఁడు, ప్రాగ్దక్షిణాయ్యదనునామముగలవాఁడు, భిక్షువు, భిక్షురూపి, త్రిజటి, జటిలుండు, చక్రహస్తుఁడు, ప్రతిస్తంభి, చమూస్తంభనుండు, ఋతువు, ఋతుకరుఁడు, కాలుఁడు, మధువు, మధులోచనుఁడు,

వానస్పత్యుఁడు, శ్రీకరుఁడు, నిత్యమును ఆశ్రితపూజితుఁడు, జగద్ధాత, కర్త,పురుషుఁడు, శాశ్వతుఁడు,అజుఁడు, ధర్మాధ్యక్షుఁడు, విరూపాక్షుఁడు; త్రివర్త్మ, భూతభావనుఁడు, త్రినేత్రుఁడు, బహునేత్రుఁడు, సూర్యాయుతసమప్రభుఁడు, దేవదేవుఁడు, అభిదేవుఁడు,చంద్రాంకితజటుఁడు, నగ్నకుఁడు, లాసకుఁడు, పూర్ణేందుసదృశాననుఁడు, సుబ్రహ్మణ్యుఁడు, శరణ్యుఁడు, సర్వవేదమయుఁడు, సర్వభూతనివాసుఁడు, సర్వబంధవిమోచకుఁడు, మోహనుఁడు, వంచకుఁడు, సర్వధారి, నరోత్తముఁడు, పుష్పదంతుఁడు, విభాగుఁడు, ముఖ్యుఁడు, సర్వహరుఁడు, హరిశ్మశ్రువు, ధనుర్ధారి, భీముఁడు, భీమపరాక్రముఁడు, భక్తాభీష్టప్రదుఁడు, స్థాణువు, పరమాత్మ, సనాతనుఁడు నని యీరీతిగా నాచేఁ జెప్పఁబడిన యీపుణ్యమైన శివనామాష్టోత్తరశతమును దప్పక జపముచేయుము. దశగ్రీవా! అట్లు జపము చేసితివేని శత్రువినాశమును గలిగించును. ఇట్లు కమలాసనుఁడా రావణునకు వర మిచ్చి తనబ్రహ్మలోకమునకుఁ బోయెను. దురాత్ముండగు రావణుఁడు బ్రహ్మవలన వరమును బొంది యక్కడినుండి మరలి సంతోషముగా మఱియొకవైపునకుఁ బోయెను. అట్లు పోవుచుఁ ద్రోవలోఁ గను పడిన రాజులయము, ఋషులయము, గంధర్వులయముఁ గన్యకల నపహరించుకొని పోయెను.

౬-వ సర్గము

రావణునకు దివ్యపురుషుఁడగపడుట

ఇట్లు బయలుదేఱి లంకలోఁ బ్రవేశించి కొంతకాల మచ్చట నుండి మఱియొకప్పుడిట్లు బయలుదేఱి మంత్రులతోఁగూడఁ బశ్చిమసముద్రతీరమునకుఁ బోయెను. అచ్చటనుండఁగా నొకద్వీపమునందుఁ బావకప్రభగలవాఁడును, పుటము వేసిన బంగారువంటిచాయగలవాఁడును, నేకాకియు నగుపురుషుఁడగపడెను.అతఁడు యుగాంతమందలి యగ్నితో సమముగాఁ గనుపడెను. మఱియు నతఁడు గ్రహములకు సూర్యుఁడువలెనే దేవతలందఱికిని ప్రభువు. శరభములలో సింహమువలెను, ఏనుఁగులలో నైరావతమువలెను, పర్వతములలో మేరువువలెను, వృక్షములలోఁ బారిజాతవృక్షమువలెను, కుండమధ్యమునం దగ్నివలెను నుండి ప్రకాశించువాఁడును, వివిధములగుధ్వనులు గలుగునట్లుగా గర్జించుచున్నవాఁడును,

లంబహస్తుఁడును, భయంకరుఁడును, దంష్ట్రాలుఁడును, వికటుఁడును, కంబుగ్రీవుఁడును,మహాజసుఁడును, మండూకమువంటియుదర ప్రదేశము గలవాఁడును, పింగాక్షుఁడును, కైలాసశిఖరోపముఁడును, పద్మములవంటి పాదతలములు గలవాఁడును, భీముఁడును, ఎఱ్ఱనిపద్మమువంటి ముఖము గలవాఁడును, మహాశరీరుఁడును, మహానాదముచేయువాఁడును, మనస్సు తోడను గాలితోడను సమమైన వేగముగలవాఁడును, భయంకరముగాఁ గట్టఁబడిన యంబులపొదులుగలవాఁడును, కూర్పఁబడినచామరములుగల వాఁడును, జ్వాలామాలాపరిష్కృతుండును, కింకిణీకృతనిస్వానుండును, బంగారుపద్మములమాల వక్షఃప్రదేశమునందు వ్రేలుచున్న వాఁడును, ఋగ్వేదమువలెఁ శోభించుచున్న వాఁడును,పద్మమాలావిభూషితుఁడును,బంగారు కొండతో సమానముగా నున్న వాఁడును నగు పురుషునిఁ జూచి కాటుక కొండవంటియాకారముగల రావణుఁడు నాతో యుద్ధము చేయుదువు రమ్మనియెను. మఱియు శూల శక్ష్టి పట్టసము లను నాయుధములు పట్టుకొని మంత్రులు డానును గట్టిగా గర్జించెను. పెద్దపులిచేత సింహమువలెను, శలభముచేత ఏనుఁగువలెను, మేకచేత మేరువు వలెను, నదీవేగముచేత సముద్రుఁడువలెను కంపింపఁ జేయుటకు వీలు గాని యాపురుషుఁడు రావణునిఁ జూచి యిట్లనియె: "రావణా! నీకుఁగల యుద్ధశ్రద్ధను నాశము నేనెరను రమ్ము. దుర్మతి !"అని యనుచుండఁగానే సర్వలోకభయావహమగు నేవేగము రావణునకుఁ గలదో అటువంటివేగ ములు వేలకొలఁదిగ వచ్చి యాపురుషు నాశ్రయించినవి. అతనిదృష్టి గ్రహమాలవలె నత్యద్భుతమై యగపడినది. అతఁడు దంతములను పట పటమని కొఱుకుచుండఁగా యంత్రమువలె నతిభయంకరమైనచప్పుడు గలిగినది. మఱియు నతనిధర్మము తపస్సు జగత్సృష్టికి హేతువులు; అవి యతనియూరుప్రదేశముల నాశ్రయించియుండినవి. మన్మథుఁ డతని గుహ్యేంద్రియము నాశ్రయించియుండెను. విశ్వేదేవత లతనికటిప్రదేశమును,మరుత్తులతనిశీర్షప్రదేశమును,అష్టవసువులు నతనిమధ్యదేశమును, సముద్రము లుదరదేశమును నాశ్రయించికొనియుండెను, దిక్కులన్నియుఁ బార్శ్వములం దుండెను. సర్వసంధులయందును మారుతము లుండినవి. పితరు లతనిపృష్ఠభాగము నాశ్రయించియుండిరి. పితామహుఁడతనిహృదయమం దున్నాఁడు. పవిత్రములైన గోదానములు, భూదాన

ములు, సువర్ణనాదములు మొదలగునవి యతనిరోమకూపముల నాశ్ర
యించియున్నవి. హిమవత్పర్వతము, హేమకూటము, మందరము,
మేరువు ననుపర్వతము లతని నాశ్రయించి యస్థిభూతములైయున్నవి.
భూమి యతనివక్షస్థలముగాను, ఆకాశ మతనిశరీరముగాను సున్నవి.
రెండుసంధ్యలును శరీరసంధియం దున్నవి. మేహనమందు మేఘము
లున్నవి. ధాత విధాత యతనికి బాహులుగాను, భగుఁడు పూష కర
ములుగాను ఉండిరి. ఐరావతుఁడు, విశాలాక్షుఁడు, శేషుఁడు, వాసుకి,
కంబళుఁడు, అశ్వతరుఁడు, కర్కోటకుఁడు, ధనంజయుఁడు, ఘోరమయిన
విషముగల యాపుకుఁడు అనునాగు లతనిగోళ్లు నాశ్రయించి విషమును
వీర్యమును విడుచుచున్నారు. అగ్ని యతనికి ముఖమైయున్నాఁడు.
స్కంధములు రుద్రులచేత నధిష్ఠింపఁబడియున్నవి. దంతములయందు
మాసములు, దంష్ట్రలయందు ఋతువులు, నాసికములయందుఁ గుహువు
అమావాస్యయు, తచ్ఛ్రవములయందు వాయువులు నాశ్రయించి యు
న్నవి. సరస్వతీదేవి యతనిగ్రీవాప్రదేశమం దున్నది. అశ్వినీదేవత లతని
చెవులుగాను, సూర్యచంద్రులు కన్నులుగాను నున్నారు. మఱియు
వేదాంగములు యజ్ఞములు నానారూపములై మంచిమంచిసృత్తములు
వాక్యములు తేజస్సు సిద్ధి తపస్సులు మొదలగున వన్నియు నరరూపము
తో నున్న యాపురుషునియం దున్నది.

ఆటువంటిపురుషుఁడు మెల్లఁగాఁ బిడికిలి పట్టి లీలఁగాఁ జేయుమొత్తి
కొట్టఁగానే రావణుఁడు క్రిందఁబడి మూర్ఛపోయెను. రాక్షసుఁడు పడి
పోవుట చూచి మిగిలినరాక్షసులను బరుగు లెత్తునటులఁ జేసి ఋగ్వేదప్రతి
ముఁడును పద్మమాలావిభూషితుఁడును నడచుచున్న కొండవంటియాకా
రము గలవాఁడు నగుపురుషుఁడు పాతాళలోకముల్లోఁ బ్రవేశించెను.
తరువాత రావణుఁడు లేచి స్వయముగా మంత్రులను బిలిచి "యో
మంత్రులారా! యిప్పటిపురుషుఁ డెచ్చటికిఁ బాఱిపోయినాఁడో వేగ
ముగాఁ జెప్పుఁడు" అని యడుగఁగానే యామంత్రు లిట్లనిరి: "దేవా!
దేవదానవగర్వభంజనుఁడగు నాపురుషుఁ డీబిలములోఁ బ్రవేశించుచుం
డఁగాఁ జూచితిమి" అనుమంత్రులమాటలు విని గరుత్మంతుఁడు పామును
బట్టినట్టు కత్తి చేతితోఁబట్టుకొని దుర్మతియగు రావణుఁడు వేగముగా నా
బిలద్వారములోఁ బ్రవేశించెను. అట్లు లోపలకుఁబోయి యచ్చట నల్లని

దేహములు గలవారును, కేయూరములును ధరించినవారును, శూరులును, రక్తమాల్యములు రక్తగంధము గలవారును, ఉంగరములు హారములు మొదలగు నలంకారములచే నలంకరింపఁబడినవారును నగు పురుషులను జూచెను. మఱియు నచ్చట మూఁడుకోట్లుమహాత్ములు నృత్యము చేయుచుఁ గనుపడిరి. వారందఱును నితోత్సవులు నిర్భయులు విమలులు పావకజ్వాలలతో సమానులు నైయున్నారు. ఇట్లు వారు క్రీడించుచుండగా భీమపరాక్రముఁడగు రావణుఁడు చూచి ద్వారమునొద్ద నిలువఁబడి యాశ్చర్యపడుచుండెను. మొదటఁ దనకుఁ గనుపడిన పురుషునిగలెనే యచ్చట నున్న వారందఱును నొక్కకాంతి గలిగి యొక్కమాదిరి బలవంతులై యగపడిరి. చతుర్భుజులు, మహోత్సాహులు నగు వారలందఱును జూచి రావణుఁడు పులకాంకితగాత్రుఁడాయెను. బ్రహ్మచే నీయఁబడిన వరములుగల యారావణుఁ డచ్చటినుండి మరలి సర్పశయ్యపై బవ్వళించియున్న యొకానొకదివ్యపురుషునిఁజూచెను. మిక్కిలి వెలువగలిగి తేల్లగాఁ బ్రకాశించుచుఁ గౌస్తుభమాణిక్య మతనివక్షస్థలమునం దగపడినది. అతఁడు పాపరాపాన్పుపై నగ్ని ముసుఁగు వైచుకొని నిదురపోవుచుండెను. మఱియు నతఁడు దివ్యగంధ మలందుకొని దివ్యమాల్యములు ధరించి దివ్యములైన యాభరణములచే నలంకృతుఁడై దివ్యమయిన వస్త్రములు గట్టుకొనియుండెను. అతనిపార్శ్వమునందుఁ ద్రిలోకసుందరియు, పతివ్రతయు నగుస్త్రీయొక తె వింజామరపట్టుకొని వీచుచుండెను. ఆమెయే లక్ష్మి. ఆమె చేతిలోఁ బద్మము పట్టుకొని జాజ్వల్యమానురాలై యగపడినది.

చారుహాసినియగు నాలక్ష్మిని జూచి రావణుఁడు పట్టుకొనుటకుఁగా నామెకూర్చుండియున్న సింహాసనమువంకకు దృష్టిసారించి చూచెను. దుర్మతియగు నారావణుఁడు మంత్రులనందఱను బయటఁ విడిచివచ్చియున్నాఁడు. అప్పుడు మన్మథవశంవదుఁడై యామెను బట్టుకొనుటకుఁ జేతులు చాఁపఁబోయెను. ఇట్లు కాలచోదితుండై నిదురించుచున్న పామును బట్టుకొనఁబోవునట్లు లక్ష్మీదేవిని బట్టుకొను ప్రయత్నములో రావణుఁడుండుట చూచి యగ్ని ముసుఁగు వైచికొని నిదురపోవుచున్న పురుషుఁడు హఠాత్తుగా ముసుఁగు తొలఁగించి యారావణునివైపు చూచి గట్టిగా నవ్వెను. అప్పుడు లోకరావణుఁడగు రావణుఁ డతని తేజస్సుచేతఁ దపింపఁజేయఁ

బడినవాఁడై యారసాతలమునందే దీర్ఘమగుఘూర్ణవాయువుచే మొదలు నఱకఁబడిన చెట్టువలె భూమిమీఁదను బడిపోయెను. రావణుఁ డట్లు పడి పోవుట చూచి యాపురుషుఁ డిట్లనియె : "రాక్షసశ్రేష్ఠా! లెమ్ము లెమ్ము. నీకిప్పుడు మృత్యుసమయము గాదు. నీవు బ్రహ్మయిచ్చినవరమువలన నిప్పటికి బ్రతికియుండుము. బ్రహ్మవాక్య మన్యథా చేయఁదగినది గాదు. రావణా ! నీయిచ్చకు వచ్చినమచ్చునఁ బొమ్ము. నీకిచ్చట మరణము లేదు" అని యిట్లు చెప్పుచుండఁగానే ముహూర్తకాలములో రావణునకుఁ దెలివివచ్చినది. వెంటనే రావణుఁడు మహత్తుఁడగు నాపురుషునిఁ జూచి భయఁపడెను. దేవకంటకుఁడగు రావణు డు పురుషుఁడు చెప్పినమాటలు స్మరించుకొని మేనంతయు గగుర్పాటు చెందుచుండఁగా నామహాముని ని జూచి యిటనియె.

"శౌర్యసంపన్నుఁడవును యుగాంతాగ్నితో సమానుఁడవును నగు నీ వెవ్వరు ? సర్వదేహములయందును సుస్థితుఁడవై యున్న దేవుఁడవా ? చెప్పుము" అని యిట్లు రావణుఁ డడుగఁగా నాదేవుఁడు నవ్వుచు మేఘ గంభీరమైనమాటలతో నిట్లనియె. "దశగ్రీవా ! నీవు నాచేత శీఘ్రముగాఁ జంపఁదగినవాఁడవు గావా?" అనఁగానే రావణుఁడు చేతులు జోడించు కొని యిట్లనియె : "దేవా ! నేను బ్రహ్మదయవలన మృత్యువునకుఁ జిక్కువాఁడను గాను. నాతో సమానుఁ డిదివఱకుఁ బుట్టియుండలేదు ; ముందు పుట్టఁబోఁడు. త్రిలోకములయందును బ్రహ్మవరమును వ్యర్థముగాఁ జేయువాఁ డుండఁబోఁడుగదా ! ఆవిషయమై పరిహారము లేదు. ప్రయత్నించినను లాభములేదు. మూఁడులోకములయందును బ్రహ్మవరమును వృథగాఁ జేయువానిని జూచి యెఱుఁగను. ఒకవేళ నాకు నీవలన మృత్యువు గలుగునేమో కాని యితరులవలన నెంతమాత్రమును గలుగదు. నీచేత నాకు మరణము గలుగుటకంటెఁ గీరికరమును గొనియాడఁదగినదియుఁ గలదా?" అని యిట్లు చెప్పుచుండఁగా నాదేవదేవుని శరీరమునందు భీమవిక్రముఁడగు రావణునకు మూఁడులోకములును నగపడినవి. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, మరుత్తులు, అశ్వినీదేవతలు, సిద్ధులు, పితరులు, యముఁడు, కుబేరుఁడు, సముద్రములు, కొండలు, నదులు, విద్యలు, వేదములు, అగ్నిహోత్రత్రయము, గ్రహములు, తారాగణము, ఆకాశము, సాధ్యులు, గంధర్వులు, చారణులు, మహా

ర్షులు, వేదవిదులు, గరుడులు, పాములు, ఇంకను మిగిలిన దేవతలు, రాక్ష
సులు వారు వీరును నని విభజించి చెప్పనేల ? చరాచర ప్రపంచమంతయు
నిదురించుచున్న యాపరమపురుషుని యవయవములయందు సూక్ష్మరూప
మునఁ గనుపట్టినది. ఇంతవఱకును విని శ్రీరామచంద్రుఁ డగస్త్యభగ
వానునిఁ జూచి యిట్లనియె.

"అగస్త్యమహర్షీ! ద్వీపమునందు రావణున కగపడిన పురుషుఁ
డెవరు ? ఆమూఁడుకోట్లమందియు నెవరు ? లోపలఁ బండుకొని యున్న
పురుషుఁ డెవరు?" అని యిట్లడిగిన శ్రీరాముని వాక్యములు విని యగస్త్యుఁ
డిట్లనియె : రామా ! నీవడిగినసంగతియంతయుఁ జెప్పెదను వినుము. ఆ
ద్వీపమునం దతనికిఁ గనుపడిన యతఁడు దేవదేవుఁడును సనాతనుఁడును
నగు కపిలభగవానుఁడని చెప్పఁబడుచున్నాఁడు. అతఁడే నారాయణుఁడు,
శంఖచక్రగదాధరుఁడగుదేవుఁడు, భూతముల సృజించువాఁడు, పోషించు
వాఁడు, సంహరించువాఁడు నగు దేవుఁడు. అతని కాదిమధ్యాంతములు
లేవు. అతఁడు విష్ణువు. సర్వమునకుఁ గారణము, శాశ్వతుఁడు, అవ్య
యుఁడు నని చెప్పఁబడుచున్నాఁడు. మఱియు నచ్చట నృత్యము చేయు
చున్నవారు దేవతలు. వా రతనితో సమానమైన తేజస్సు, ప్రతాపము
గలవారు. పాపనిశ్చయుఁడగు నారావణుని, మహాత్ముఁడగు నాకపిలుఁ
డంతకోపదృష్టితోఁ జూడలేదు. కావుననే వెంటనే భస్మము గాలేదు.
కాని కొండనుబోలిన యాతఁడు భిన్నగాత్రుఁడై చెట్టువలె నేలఁగూలెను.
అతఁడు కొండీఁడు రహస్యమును భేదించునట్లు శల్యములవంటి మాటల
చేత భేదించెను. తరువాత రావణుఁడు చాలఁగాలమునకుఁ దెలివొం
దినవాఁడై లేచి తేజస్సంతయు క్షీణముకాఁగాఁ దనమంత్రులున్న చోటికి
వచ్చిచేరెను. అచ్చటినుండి మంత్రులతోఁగూడి తిన్నఁగా లంకకుఁ
బోయెను. ఇట్లగస్త్యుఁడు చెప్పినసంగతియంతయువిని శ్రీరాముఁడాశ్చర్య
పడెను. మఱియు రాముసిసన్నిధిని గౌరవింపఁబడుచున్న వానరులు రాక్ష
సులును జాల నాశ్చర్యమే యనిరి. అప్పుడు శ్రీరాముని ప్రక్కనున్న విభీ
షణుఁ డిట్లనియె : "దేవా ! ఇప్పుడు చిరకాలముక్రిందట జరిగిన సంగతి
యంతయు మిక్కిలి యాశ్చర్యముగా స్మరణమునకు వచ్చినది."

తరువాత నగస్త్యుఁడు "రామా ! చెప్పవలసినసంగతి యంతయుఁ
జెప్పితిని. నిన్నుఁ జూచితిమి. నీచే గౌరవింపఁబడితిమి. ఇఁకను నీయొద్ద

నసుజ్ఞను పొంది మామాయాశ్రమములకుఁ బోయెదము" అని చెప్పిన యగస్త్యనిమాటలు విని యానందమును గలిగించువారిలో శ్రేష్ఠుఁడగు రాముఁడు సంతోషించెను.

ప్రక్షిప్తసర్గములు సమాప్తము.

24-వ సర్గము

రావణుఁడు పరస్త్రీల నపహరించుట

ఇట్లు వరుణనగరమునుండి సంతోషించుచు లంకకుఁ బయనమైన దురాత్ముఁడగు రావణుఁడు దారిలో రాజులయు, ఋషులయు, దేవతలయు, గంధర్వులయు కన్యకల నపహరించెను. మఱియు నా రావణుఁడు సుందరి యగు కన్నియగాని యన్నులమిన్న గాని యగపడినచోఁ దద్బంధుజనులను జంపి దానిని దనవిమానముమీఁద నరికట్టుచుండెను. ఈరీతిగాఁ బన్నగకన్యలను, రాక్షసకన్యలను, అసురకన్యలను, మనుష్యకన్యలను, యక్షకన్యలను, దానవకన్యలను దెచ్చి విమానముమీఁద బంధించెను. వాండ్రందఱును సుముగా దుఃఖములను శోకాగ్నిభయములనఁ గలిగిన వేఁడికన్నీటిని విడిచిరి. రావణునిభయములనను బంధువియోగములనను గలిగిన దుఃఖములనను అమంగళమైన కన్నీటిని విడుచు నా సర్వాంగసుందరులచేతను నదులచే సముద్రములే నాతనివిమానము నిండెను. మఱియు నాగంధర్వకన్యకలు, మహర్షికన్యకలు, దైత్యదానవ కన్యకలు వందలకొలఁదిగ నావిమానమునందుండి యేడువ మొదలిడిరి. దీర్ఘమైన శిరోజములుగలవారును, సుందరమైన యవయవములు గల వారును, పూర్ణచంద్రునితో సమానమైన ముఖములు గలవారును, బలసిన స్తనములుగలవారును, వజ్రవేదిమధ్యసమమైన నడుములుగలవారును, బండికుండలతో సమానమైన పిఱుఁదులు గలవారును, దేవతాస్త్రీలను బోలినవారును, పుటమువేసినబంగారుతో సమానమైన శరీరకాంతి గల వారును అగుస్త్రీలు దుఃఖముచేతను భయముచేతను వ్యాకులమయిన యింద్రియములు గలవారై యావిమానముమీఁదనుండి యేడుచుచుండఁగా, నాస్త్రీలనిట్టూర్పువాయువులచే నావిమానము మిక్కిలి కుములుచున్న యగ్నిహోత్రము గల యగ్నికుండమువలెఁ బ్రకాశించుచున్నది. శోకాకులచిత్తలై రావణునియధీనమున నున్న యాస్త్రీలు దీనములయిన

ముఖములు కన్నులు గలిగి, సింహావశమునసున్న యాఁడు లేళ్లవ లెఁ గాన వచ్చిరి. అందులో నొకతె "వీఁడు నన్ను భక్షించును గాఁబోలు" ననియు, మఱియొకతె "వీఁడు నన్నుఁ జంపును గాఁబోలు" ననియు నాలోచింప మొదలిడిరి. ఈరీతిగాఁ దల్లిదండ్రులను, భర్తలను, సోదరులను, బంధువులను దలంచుకొని దుఃఖశోకసమావిష్టలై గుంపుగాఁగూడి యేడ్చుచుండిరి.

"అక్కటా! నన్ను విడిచి నాకుమారుఁ డెట్లు బ్రతుకఁగలఁడు? అయ్యో! మాయమ్మ నన్ను విడిచి యెట్లుండఁగలదు? కట్టా! నాముద్దు తమ్ముఁ డేమైపోవునోకదా? అహహా! తండ్రి నన్నుఁ దలఁచుకొని యెంతగా నేడ్చుచున్నాఁడో? దైవమా! ఏమిచేయుదును? నాభర్త నన్ను గుఱించి యెంతదిగులుపడియుండునో? మృత్యువా! బ్రతిమాలు కొనుచున్నాను. నాయందు దయయుంచి నన్నుఁ దీసికొనిపొమ్ము. నేనీ దుఃఖమును భరింపఁజాలను. క్రింటిజన్మలో నేనెట్టిపాపము చేసితినో కదా?" ఈరీతిగా దుఃఖించుచు నంతఃపుస్త్రీలును దుఃఖసముద్రములో మునిగియుండిరి. ఇట్లు దుఃఖించుచు నాస్త్రీలంతఃపురమును నొక్కచోఁ గూడి యీరీతిగాఁ బలవింప మొదలిడిరి: "ఇఁక నీదుఃఖమునొక్క యంతమును జూడము గాఁబోలును! ఓహో! మనుష్యలోక మెంతనింద్యమయినది! ఇంతకంటె నధముఁ డొకఁ డుండునా? ఉదయించినసూర్యుఁడు నక్షత్రములను నశింపఁజేయునట్లీదుర్మార్గుఁడు బలవంతుఁడై దుర్బలులైన మాభర్తలను నశింపఁజేసినాఁడు. ఓహో! బలవంతుఁడగు నీనీచునివధ కేదియు నుపాయము గానరాకుండ నున్నది. కట్టా! ఈచెట్టరక్కసుఁ డెట్టికట్టిడి వృత్తి నవలంబించియున్నాఁడు? తన్నుఁ దాను నిందించుకొనఁడేమి? భగవంతుఁడీదుర్మార్గునికిఁ దగినబలమునే యిచ్చియున్నాఁడు? పరస్త్రీలను బలవంతముగాఁ దీసికొని వచ్చుట వీనికిఁ దగదు. ఏమిచెప్పుమా! ఈనీచుని మనస్సు పరస్త్రీలయందు రమించుచున్నది? దీనింబట్టి యోజింపఁగా దుదకు వీఁడు పరస్త్రీహరణమహాపాతకముచేతనే చచ్చువాఁడుగా నగపడుచున్నాఁడు." ఇట్లు పతివ్రతలగు నాస్త్రీలు మాటలాడుకొనుచుండఁగానే దేవదుందుభులు మ్రోఁగినవి. ఆకాశమునుండి పుష్పవర్షము గురిసినది. ఎప్పుడీస్త్రీలంతఃపురమును శపించిరో అప్పుడే తేజస్సు తగ్గిపోయినవాని వలె రావణుఁడు కాంతిహీనుఁడై పోయెను. ఈరీతిగా నాసుందరుల

యేడుపునిసుచునే రాక్షసులచేఁ బూజింపఁబడుచు రావణుఁడు లంకలోఁ బ్రవేశించెను.

రావణుఁ డింటికిరాఁగానే యింతలో ఘోరాకారము గలదియు, కామరూపిణియు నగు రావణునిచెల్లెలు శూర్పణఖ వచ్చి యేడుచుచు నన్నపాదములమీఁదఁ బడినది. అట్లు పడియున్న చెల్లెలిని లేవఁదీసి యోదార్చుచు "అమ్మాయీ! నీవేదో చెప్పఁబోవుదానివలె నగపడు చున్నావు. శీఘ్రముగాఁ జెప్పుము" అని రావణుఁ డడుగఁగా శూర్పణఖ యిట్లనియె: "అన్నా! ఇఁక నేమున్నది. నన్ను విధవను జేసివైచితివి. నీవు బలవంతుఁడవై నందుకు ఫలము నా కిట్లు సంప్రాప్తమైనది. నీవు మహాబల వంతులగు పదునాలుగువేల కాలకేయులను జంపితివే, వారిలో ప్రాణ ములకంటెను ప్రియమైన నాభర్తగూడ నున్నాఁడు. నాయనా! నీవతనిని గూడఁ జంపితివి. నీవన్నవు గావు. అన్నరూపముగా నున్న మహాశత్రు వవు. నీవే నాకొంప యీలాగున ముంచివైచితివి. నీవలన నేనిఁకవైధవ్య దుఃఖము ననుభవింపవలసిఁచ్చినది. ఎంతయుద్ధములోనైనను బావమఱఁ దిని గాపాడుకోనక్కఱలేదా? అయ్యో! అన్నా! స్వయముగా నా మగనిని జంపియు సిగ్గుపడకుండ నున్నావేమి?" అని యిట్లు చెల్లెలేడు చుచుఁ జెప్పినమాటలన్నియు విని యామెను మంచిమాటలచే నోదార్చి రావణుఁ డిట్లనియె.

అమ్మాయీ! ఎందుల కేడిచెదవు? ఇఁక నెంతయేడిచినను లాభము లేదు. మించినకార్యమున కేమిచేయవచ్చును? నీవెందులకును భయపడ నక్కఱలేదు. నీకేవిధమైన లోపమును గలుగకుండ దానమానప్రసాదము లచే నీకు సంతోషమును గలుగఁజేయుచుందును. యుద్ధమదముచే నొడ లెఱుంగక మతిపోయి జయమునే ప్రధానముగాఁ గోరుచు బాణములను జిమి తనవారిని బరాయివారిని దెలిసికోఁజాలక పోయితిని. నేను మా బావమఱఁదిసంగతి యెఱుంగనైతిని. కావుననే నీకీవైధవ్యదుఃఖమును గలి గించితిని. మించినదాని కెంతచింతించినను లాభములేదుగదా? ఇక ముందు సంగతి యాలోచించుకొందము.నీవిటుపైని మిగుల నైశ్వర్యవంతుఁడైన మనఖరాసురునియొద్ద నుండుము. పదునాలుగువేలమంది రాక్షసులకుఁ బ్రభువగు ఖరుఁడు నీకేవిధమైనలోపమును లేకుండ గారవించుచుండును. అతఁడు మహాబలుఁడు. అతఁడును మనకుఁ బినతల్లికుమారుఁడేకాని లాఁతి

వాఁడు కాఁడు. అతఁడు నీయాజ్ఞను శిరసావహించి నీచెప్పుఁజేఁతులలోనుండును. అతఁడును శీఘ్రముగా దండకారణ్యమునకు రక్షణార్థమై పోవలసియేయున్నది. అతనికి దూషణుఁడు బలాధ్యక్షుఁడై యుండఁగలఁడు. వారందఱును నీమాటను జాలగౌరవింతురు. అతఁడు కామరూపులగు రాక్షసులకుఁ బ్రభువుగదా!"అనియిట్లుచెప్పి చెల్లెలి నోదార్చి మహాబలవంతులగు పదునాలుగువేలమంది రాక్షసులను బయలుదేరఁజేసి యామె నతనివశము చేసెను. ఆఖరాసురుఁడును ఘోరాకారులగు రాక్షసులతోఁగూడి యేవిధమయిన భయమును నెఱుంగక దండకారణ్యము లోనికి వచ్చెను. ఇట్లు వచ్చి యచ్చట నిష్కంటకముగా రాజ్య మేలుచుండెను. ఆశూర్పణఖయు ఖరాసురునియొద్దనే సుఖముగా నుండెను.

25-ఏ స ర్గ ము

రావణుఁడు మధురాక్షసుని మన్నించుట

ఈరీతిగా రావణుఁడు ఘోరమైన దండకారణ్యమును బినతల్లి కుమారుఁడైన ఖరునకు స్వాధీనముచేసి చెల్లెలి నోదార్చి సంతోషముతో నెన్నుది నుండెను. ఇట్లుండి యొకనాఁడు నికుంభిల యను పేరు గల లంకో ద్యానము చూచుటకుఁ బరిజనులతో నందుఁ బ్రవేశించెను.అచ్చట వందల కొలఁది యూపములతోడను, సౌమ్యమగు చైత్యములచేతను శోభిత మునునయి జరుగుచున్న యజ్ఞమును జూచెను. ఆయజ్ఞశాలలోఁ గృష్ణాజినము ధరించినవాఁడును, కమండలువుచేతను కుశములచేతను ప్రకాశించుచున్న వాఁడును, శత్రుసంహారకుఁడును నగు కుమారు నింద్రజిత్తును చూచెను. చూచి సమీపించి చేతులతో వానిఁగౌఁగిలించుకొని "వత్సా! నీవిక్కడ నేమిచేయుచున్నావో యథార్థముగాఁ జెప్పు"మని యడుగఁగా, రాక్షసశ్రేష్ఠుండగు రావణునితో ద్విజశ్రేష్ఠుఁడును, మహాతపస్వియు నగు శుక్రాచార్యుఁ డిట్లనియె: "రాజా! నీవడిగిన సంగతియంతయు నేను జెప్పెదను వినుము. నీకుమారుఁడు బహువిస్తారములయిన యేడుయజ్ఞములను బొందియున్న వాఁడు. అగ్నిష్టోమము, అశ్వమేధము, బహుసువర్ణకములుగల రాజసూయము, గోమేధము, వైష్ణవము ననునవి యేకాక మనుష్యదుర్లభమగు మాహేశ్వరయజ్ఞము ప్రవర్తించినవఁగుచుండఁగా సాహసోత్సుఁగాఁ బశుపతివచ్చి నీకుమారునకు వరముల నిచ్చెను.

దివ్యమును, కామగమనము గలదియు సంతరిక్షమునందు సంచరింపఁదగి నదియు నగు రథమును, అంతటను జీకటిని గలిగించుటకుఁ దగిన తమో గుణప్రధానమైన మాయనుగూడఁ బొందియున్నాఁడు. రాక్షసేశ్వరా! ఈమాయయుద్ధములలోఁ బ్రయోగింపఁబడినచో సురాసురులైనను దెలిసి కోఁజాలరు. మఱియు సుదుర్జయమగు ధనుస్సును, బాణపూర్ణములయిన యక్షయతూణీరములను, శత్రువులను దప్పక చంపఁజాలిన దృఢమయిన యస్త్రమును, మఱియు ననేకములను శివభగవానునివలన వరరూపము గాఁ బొందియున్నాఁడు. ఇఁక నీయజ్ఞము సమాప్తము కాఁగానే నిన్నుఁజూడ దలఁచుచున్నాఁడు" అను గురునిమాటలు విని రావణుఁ డిట్లనియె: "మీరు చేసినపని యెంతమాత్రమును బాగుగా నుండలేదు. ద్రవ్యములన్నియుఁబొడుచేసి యింద్రుఁడు మొదలయిన శత్రువులను బూజించితిరి. చాలు నిప్పటికైనదేమో యయినది. ఇఁక నీపుణ్యము చాలును, నాయనా! మేఘనాదుఁడా! రమ్ము. ఇంటికిఁ బోవుదము" అనిచెప్పి రావణుఁడు కుమారుఁడు విభీషణుఁడు మొదలగువారితోఁబోయి, కనుల నీరుగార్చుచున్న స్త్రీలనందఱను పుష్పకవిమానమునుండి దింపెను. లక్షణ వతులును రత్నభూషితములును నగు నాదేవతానవరకన్యకలయెడ రావ ణునికిఁగల బుద్ధిని దెలిసికొని ధర్మాత్ముఁడగు విభీషణుఁ డిట్లనియె.

"అన్నా! నీవుకీర్తిని, ధనమును, వంశమును నశింపఁజేయఁజాలిన యిటువంటి సమాచారములచేత జ్ఞాతుల ధర్షణమును దెలిసి స్వేచ్ఛగా సంచరించుచున్నావు. జ్ఞాతుల నందఱను బీడించి నీవు వారిస్త్రీలను జెఱ దెచ్చితివి. రాజా! నిన్ను లక్ష్యము సేయక మధువనువాఁడు కుంభీనసను హరించియున్నాఁడు" అను విభీషణునిమాటలు విని రావణుఁ డిట్లనియె. "విభీషణా! నీవు చెప్పినది నాకుఁ దెలియరాకుండ నున్నది. సంగతియేమి? ఇప్పుడు నీవు మధువనునామ ముచ్చరించితివి గదా! వాఁ డెవఁడు? అని యడుగఁగాఁ జాలఁ గోపించి విభీషణుఁ డన్నతో నిట్లని విన్నవించెను. "అన్నా! నీవు చేసినపాపమునకు వెంటనే ఫలము సంప్రాప్తించినది. చెప్పెదను వినుము. మనమాతామహుఁడైనసుమాలి నెఱుఁగుదువుగదా! అతనికిఁ బెద్దయన్న మాల్యవంతుఁడనఁగా విఖ్యాతుఁడైనవాఁడు, వృద్ధుడు, ప్రాజ్ఞుఁడు నగు నొకరాక్షసుఁడు గలఁడు. అతఁడు మనతల్లికిఁ బెదతండ్రి. మనకుఁ బెద్దమాతాహుఁడగును. అతనికుమారితకుమారిత కుంభీనస

యనునది గలదు. అది మనపినతల్లికొమార్తె. అనల యనునామె దానిఁ గన్నది. మనకు ధర్మమునుబట్టిచూడఁగాఁ జెల్లెలే యగును. రాజా! ఇపుడు తెలిసినదిగదా! దానిని బలవంతుఁడగుమధు వనురాక్షసుఁడు హరించెను. నీకుమారుఁడు మేఘనాదుఁడు యజ్ఞము చేసికొనుచున్నాఁడు. నేను జలములో మునిఁగి తపస్సుచేసికొనుచున్నాను. కుంభకర్ణుఁడు నిద్ర పోవుచున్నాఁడు. అటువంటిసమయమున వచ్చి యీమధురాక్షసుఁడు రాక్షసశ్రేష్ఠులగు మంత్రులను జంపి నీయంతఃపురములో రక్షింపఁబడి యున్నప్పటికిని బాని నపహరించెను. ఆసంగతి తరువాత వినియు మేము వానిని జంపఁబోలేదు. ఎప్పుడైనను కన్య యొకని కీయఁదగినదియే కదా! అని యూరక యుంటిమి. దుర్మతి వగురావణా! ఇది నీవు చేసిన చెడు కర్మమునకు ఫలము గాక మఱేయేమనుకొంటివి? ఇహమందుఁ జేసినపాప మునకు ఫల మిహమందే కలిగినది. ఈసంగతి జ్ఞప్తియందుంచుకొనుము" ఇట్లని చెప్పిన విభీషణునిమాటలు విని రాక్షసేంద్రుఁడగురావణుఁడు తన దురాచరణమునకుఁ దానే యవమానితుఁడై, మఱుగుచున్న జలము గల సముద్రమువలెనే తప్తుఁడై కోపము దెచ్చుకొని కన్ను లెఱ్ఱఁజేసికొని యిట్లనియె.

"నాకు శీఘ్రముగా రథమును సిద్ధము చేయుఁడు. శూరులందఱును సిద్ధులై బయలుదేఱుడుగాక! నిదురించుచున్న మాతమ్మునిఁ గుంభకర్ణుని మేలొ్కలుపుఁడు. ఇంకను ముఖ్యులగు రాక్షసులుగూడ బయలుదేఱుఁడు. మీకందఱును వాహనము లారోహించుఁడు. నానా విధము లైనయాయుధములను బట్టుకొండు. నావంటి రావణునకుఁగూడ భయంపడని యీమధురాక్షసుని జంపి యచ్చటినుండి బయలుదేఱి యుద్ధముకొఱకు స్నేహితులు మొదలగువారితోఁగూడి స్వర్గలోకమునకుఁ బోయెదను" అని రావణుఁడాజ్ఞాపించినతోడనే శేషము లైన నాలు గక్షౌహిణీసహస్రములు నానావిధములయిన యాయుధములను ధరించి యుద్ధమును గోరుచు సిద్ధమైయున్నది. ఈసైన్యమునంతయు వెనుకనుండి నడిపించుచు నింద్రజిత్తుముందఱ నడచుచుండెను. మధ్యను రావణుఁడును, వెనుకను గుంభకర్ణుండును నడచుచున్నారు. ధర్మాత్ముఁడగు విభీషణుఁడు తపస్సు చేసికొనుచు లంకలోనే యుండిపోయెను. మిగిలినవారం దఱును యుద్ధము చేయు కుతూహలముతో రావణునివెంటనే పోయిరి.

రాక్షససైనికులు ఖరములు, ఉష్ట్రములు, గుఱ్ఱములు, శింశుమారములు, మహాసర్పములు మొదలగు వాహనము లెక్కి యాకాశమంతటను వ్యాపించి నడచిరి. అదివఱకు దేవతలపై నసూయ గల రాక్షసులును ధనుపగ దీర్చుకొందమని డెందమునఁ దలంచి వందలకొలంది వేలకొలంది రావణుఁడు యుద్ధమునకుఁ బోవుచుండుట చూచి వెనుకనుండి వారును బయలుదేఱిరి. ఇట్లు బయలుదేఱి రావణుఁడు తిన్నఁగా మధుపురములోఁ బ్రవేశించెను, గానిమధురాక్షసుఁడుమాత్ర మగపడలేదు. పినతల్లికూఁతు రగుకుంభీనస యన్న రాక విని భీతితో నెదురుగావచ్చివినయముతోఁ జేతులు జోడించుకొని సాష్టాంగదండప్రణామము చేసినది. రావణుఁడు మంచి మాటలాడి భయపడవలదని యోదార్చెను. మఱియు నీకేమిగావలయునని యడిగెను. "అన్నా! నాయందు నీకు నిజముగా దయయున్నచో నీ వొవమఱఁదినిమాత్రము చంపక కాపాడుము. వైధవ్యదుఃఖమును భరింపఁజాలను. కులస్త్రీల కీవైధవ్యదుఃఖముకంటెను దుస్సహ మైనదుఃఖ ముండునా? వేయేల? అన్నా! అన్నిభయములకన్ను వైధవ్య మను భయము మిక్కిలి గొప్పది. ఇట్టిది మఱొక్కటి లేదని నమ్ముము. రాజేంద్రా! సత్యవాక్యుఁడవు కమ్ము. అన్నా! చేతులు జోడించుకొని నిన్ను యాచించుచున్నాను. నాపసపుకుంకుమములకు లోపము గలుగనీయకు. ఇదిగాక రాజా! నీవు ముందుగా భయపడవలదని యభయదానముగూడ దయచేసితివి" అని దీనముగా బ్రతిమాలుచున్న చెల్లెలినిజూచి సంతోషించి యిట్లనియె: "అమ్మాయీ! ఇపుడు నీభర్త యెచ్చట నున్నాఁడో నాకుఁ జెప్పుము. అతనినిఁ జంపను. అతనితోఁగూడి దేవలోకమునకు యుద్ధార్థము పోయెదను. నీయందలిప్రేమచేతను దయచేతను నీమగనిని జంపునుద్దేశము వదలితిని" అని యన్నయగు రావణుఁడు చెప్పఁగానే యాకుంభీనస చాలసంతోషించి యింట నిదురపోవుచున్న మగనిని మేల్కొలిపి సంతోషపూర్వకముగా నిట్లనియె: "మహాబలశాలి యగు మాయన్న దశగ్రీవుఁడు వచ్చియున్నాఁడు. అతఁడు దేవతలను జయించుటకై స్వర్గమునకుఁ బోవుచు నిన్ను సహాయము గోరుచున్నాఁడు. రాక్షసా! నీవును నీబంధువులును మాయన్నసహాయముగావెళ్లుట మంచికార్యము. అటువంటివానిస్నేహము మనకన్నివిధములుగాను సంపాదింపఁదగినది గదా!" అని భార్యచెప్పినమాటలువిని మధువనురాక్షసుఁడు వల్లె యని

యంగీకరించి యథావిధిగా వచ్చి రావణుని సందర్శించెను. అర్ఘ్యపాద్య
దులతో రావణునిఁ బూజించెను. ఇట్లు బొవమఱిఁది యగు మధురాజుసు
నిచే గౌరవింపఁబడి యొకరాత్రిమాత్రమచ్చటనుండి మరునాఁడు ప్రయా
ణోద్యక్తుఁడాయెను. అక్కడనుండి బయలుదేఱి వైశ్రవణుఁ డుండు
కైలాసమునొద్దకు వచ్చి యచ్చటఁ దనదండునంతయు నిలిపెను.

26-వ సర్గము

రావణుఁడు రంభను బట్టుకొనుట

అరావణుఁ డచ్చట సాయంకాలమగుటచేఁ దానును సైన్యమును
నివసించుట కేర్పాటుచేసెను. అంతటఁ గైలాసపర్వతముతో సమానకాంతి
గల చంద్రుఁడుదయించెను. నానాప్రహరణాయుధమగు నతనిమహాసైన్య
మంతయు నిదురించెను. మహాబలుండగు రావణుండు కొండమీఁదను
గూర్చుండి చంద్రకిరణములచే శోభితమగుచున్న గుణాతిశయములను
జూచుచుండెను. కర్ణికారవనములచేతను, కదంబవృక్షములచేతను, వికసించిన బంగారువన్నెపద్మములు గల మందాకినీజలములచేతను, చంపక
శోకమందారపున్నాగవృక్షములచేతను, చూతపాటల లోధ్ర ప్రియంగు
కేతకార్జున తగర నారికేళ ప్రియాలుపనస తమాలారగ్వధ వకులాదులగు
వృక్షములచేతను మిక్కిలి ప్రకాశించుచున్న యొకవనాంతరమునందు
మదనార్తులగు కిన్నరులు రక్తులై మధురకంఠములుగలవారై మనస్సులకు
సంతోషమును గలిగించున ట్లందఱును గలసి గానము చేయుచుండిరి.
మదించి కన్ను లెఱ్ఱఁబడిన విద్యాధరులు స్త్రీలతోఁగూడి యొడలు మఱచి
క్రీడించుచు సంతోషించుచుండిరి. కుబేరునిమందిరమున గానము చేయు
చున్న యచ్చరలమధురస్వరమైన గానధ్వని ఘంటానాదమువలె వినవచ్చు
చుండెను. గాలికిఁ గదలు వృక్షములు పుష్పములను వర్షించుచు మధు
మాధవగంధులై యాపర్వతమును బరిమళింపఁజేయుచున్నవో యనున
ట్లుండెను. మకరందముతోను, పుష్పపరాగముతోను గూడిన పుష్కలమైన
పరిమళమును సంగ్రహించుకొని సుఖకరమైన మందమారుతము రావణు
నకుఁ గామోద్రేకమును గలిగించుచు వీచుచుండెను. వారిగానముచేతను,
పుష్పముల సమృద్ధిచేతను, మందమారుతముచేతను, కైలాసముగుణముల
చేతను, రాత్రి కడచనినకొలఁదిని బ్రకాశించు చంద్రునిచేతను రావణుఁడు

కామవశంవదుఁడై నిట్టూర్పులు విడిచివిడిచి చంద్రుని జూచుచుండెను. ఈలోపున నచ్చటకు దివ్యాభరణభూషితురాలై యచ్చరలందఱిలోను బేర్వడినరంభ దివ్యపుష్పము లలంకరించుకొని, దివ్యచందనమలందుకొని, జుట్టునిండ మందారపుష్పములు చుట్టుకొని, సురతోత్సవకృతారంభయుఁ బూర్ణచంద్రనిభాననయుఁ జక్రవర్తనోహారమును బలసినదియు మొల నూలిచే నలంకృతమును నుత్తమమును రతిని వృద్ధినొందించునదియు నగు కటిపురోభాగముచే మందగమనము గలదియు, నాఱుఋతువులయందలి క్రొంబూవులచేఁ జేయఁబడిన యలంకారములు ధరించినదియు నై కాంతి శ్రీద్యుతికీర్తులచే రెండవలక్ష్మివలెఁ బ్రకాశించుచు వర్షాకాలపు మేఘము వంటి నల్లనివస్త్రము ముసుఁగువైచికొని సైన్యమధ్యనుండి పోవుచు రావణునిచేఁ జూడఁబడినది. ఆసుందరిమోము పున్నమచందమామ తోడను, ఆపూఁబోఁడి కనుబొమలు పూవింటివానిచాపమువలెను, ఆ నారీమణితొడ లేనుఁగుతొండములవలెను, ఆహల్లకగంధికరములు పల్లవ కోమలములునునై ప్రకాశించుచుండెను. అట్టిరంభ పోవుచుండఁగా కామవశంవదుఁడైన రావణుఁడు లేచి చేతితో నామెచేయి పట్టుకొని,యది సిగ్గుపడుచుండఁగా నవ్వుచు నిట్లనియె: "వరారోహా! నీవిపు డెచ్చటికిఁ బోవుచున్నావు? ఎవనియొక్కభోగసిద్ధిని నీవు స్వయముగాఁ గోరుచున్నావు? ఎవనికిపు డభ్యుదయకాలము తటస్థించినది? నిన్ననుభవించు పుణ్యాత్ముఁడెవఁడు? పద్మోత్పలసుగంధియై యమృతరసమును దిరస్కరించు నీయధరామృతమును బానముచేసి తృప్తినొందు నదృష్టముగల పురుషుఁ డెవ్వఁడు? నిండుచంద్రునిఁబోలినదియు, నొచ్చెములేని కలువలంబోలిన కన్నులుగలదియు నగు నీమోము నమృతము, నింద్రునివలె నెవ్వఁడు గ్రోలఁగలఁడు? భీరూ! నిరంతరములును, పీనములును, శుభం కరములును స్వర్ణకుంభసదృశములును నగు నీయీకుచము లెవ్వని యుర స్థలమును స్పృశించును? సువర్ణచక్రసమానమును, స్వర్ణదామచితమును, గొప్పదియు, సర్వరూపియు నగు నీజఘనచక్రముపై నారోపించు నదృష్ట మిప్పుడెవ్వనికిఁ బండియున్నది? సుందరీ! నాకంటె నెక్కువవాఁ డెవఁ డున్నాఁడు? దేవేంద్రుఁడా? విష్ణుఁడా? అశ్వినీదేవతలా? నన్నతిక్ర మించిపోవుట నీకెంతయు మంచిపని కాదుసుమా! పృథుశ్రోణీ! నీవీ శిలాతలమునై నధిష్ఠించి కొంచెముసేపు విశ్రమింపుము. మూఁడులోక

ములయందును నేవిధమునఁ జూచినను నన్ను మించినవాఁడు లేఁడనియే నమ్ముము. అట్టిదశాననుఁడు నిన్నుఁ జేతులు జోడించి ప్రతిమాలుకొను చున్నాఁడు. మూఁడులోకములకును భర్తను, విధాతను నగుననున్నుగ్ర హింపుము" అని యిట్లు రావణుఁడు చెప్పినమాటలు విని కంపించుచుఁ జేతులు జోడించుకొని రంభ యిట్లనియె: "నావిషయమై యనుగ్రహ ముంచఁదగును. ఈరీతిగా నన్ననఁదగదు. నీవు నాకు గురుసమానుఁడవు గదా! ఇతరులవలన నాకేవిధమైనబాధయేని గలిగినప్పుడు నీవు రక్షింప వలసియుండఁదగినవాఁడవు. నేను యథార్థముగాఁ జెప్పుచున్నాను. నేను నీకు ధర్మమునుబట్టి కోడలను" అని శిరస్సువంచుకొని నిలువఁబడి, తన్నుఁజూచి భయకంపితురాలై పులకరించియున్న రంభనుజూచి రావణుఁ డిట్లనియె.

"సుందరీ! నీవు నాకుమారునికి భార్యవై నప్పుడుగదా నాకుఁగోడలి వగుట" అని యనఁగానే, "అవును" అని రంభ యిట్లు బదులు చెప్పెను. "రాక్షసపుంగవా! ధర్మమునుబట్టి నేను నీకుమారునిభార్యను. నీయన్న యగు వైశ్రవణునకుఁ బ్రాణములఁంటెను ప్రియమయినకుమారుఁడును, మూఁడులోకములయందును బేరుపడినవాఁడును నగు నలకూబరుఁ డను నతఁడు గలఁడు గదా! అతఁడు ధర్మమునుబట్టి బ్రాహ్మణుఁడును, పరాక్రమ మునుబట్టి క్షత్రియుఁడును, కోపించినచో నగ్నియు, శాంతిచే భూమికి సమానుఁడును నని యెంచఁదగును. లోకపాలసుతుఁడగు నాతనియొద్దకే కృతసంకేతనై యిట్లలంకరించుకొని పోవుచున్నాను. అతనియెడఁ దక్కఁ దక్కినవారియెడ నాహృదయము దగులమునొందదు. అరిందమా! ఆ సత్యముచేత నన్ను విడువవలయును. ఆధర్షాత్ముఁడు బలాటపడుచు నాకై యెదురుచూచుచుండును. కుమారుని యాయుబలాటమున కభ్యంతరము కలిగింపకుము. నన్ను విడువుము. రాక్షసపుంగవా! సజ్జను లాచరించు మార్గమునఁబొమ్ము. నీవు నాకు మాననీయుఁడవు. నేను నీకుఁ బాల నీయను" అని యిట్లు రంభ చెప్పినమాటలు విని రావణుఁ డిట్లనియె.

"సుందరీ! నీవు నాకుఁ గోడల నంటివి. అది పతివ్రతలలోఁ గాని తక్కువారిలోఁ గాదు. ఇది దేవలోకములోఁ జిరకాలమునుండి జరుగు చున్న మరియాద. అప్సరసలకుఁ బతి యనఁగా నొకఁడు లేఁడు. పతియు నేకస్త్రీపరిగ్రహమును లేదు" అని యిట్లు బదులు చెప్పి యారావణుఁడు

రంభను పట్టుకొని కామపరతంత్రుఁడై గ్రామ్యభర్మమున కుపక్రమించెను. తరువాత వానిచేతులనుండి తప్పించుకొని భ్రష్టమాల్యాభరణయై గజేంద్రము చేఁగలఁచి వేయఁబడిన నదివలె వ్యాకులతఁ జెందెను. ఇట్లు లులితాలకకేశాంతయు; కరవేపితపల్లవయు నగు రంభ పవనావధూతయు కుసుమశాలినియు నగు లతవలె శోభాహీనురాలై కంపించుచు, సిగ్గుపడుచు, భయంపడుచు, జేతులు జోడించికొని నలకూబరునిదగరకుఁబోయి యతని పాదములమీఁదను బడినది. మహాత్ముఁడగు నలకూబరుఁ డట్టియవస్థతోఁ గూడియున్న రంభను జూచి "సుందరీ! ఇది యేమి? నాపాదములపైఁబడితివి?"అని యడిగెను. రంభ నిట్టూర్పులు విడుచుచుఁ దనకు జరిగినసంగతి సందర్భములన్నియు నిట్లు చెప్ప మొదలిడినది.

"దేవా! ఏమని చెప్పఁగలను? ఇదిగో దశగ్రీవుఁడు స్వర్గమునకుఁ బోవుచు నీప్రాంతమున రాత్రి సైన్యముతోఁ గూడ విడిసియున్నాఁడు. నీదగ్గఱకు వచ్చుచుండఁగా నన్నాదుర్మార్గుఁడు దారిలోఁ జూచెను. అడ్డముగా వచ్చి జేయి పట్టుకొని నీవెవనిదానవని యడిగెను. ఉన్నసంగతి యంతయు యథార్థముగాఁ జెప్పితిని. కామమోహితుఁడగు నామూర్ఖుఁడెంతచెప్పినను వినఁడాయెను. 'దేవా! నేను నీకుఁ గోడలను నన్ను విడిచిపెట్టుము' అని యెంతబ్రతిమాలినను నామాటలు పెడచెవులఁబెట్టి బలాత్కరించెను. సువ్రతా! దైవనశమునఁ గలిగిన నాయీయపరాధమును మన్నింపుము. ఆఁడుది పురుషునితో సమానమైన బలముగలది కాదు గదా!" అని యిట్లు రంభ చెప్పిన దీనదీనము లగు పలుకులు విని నలకూబరుఁడు ధ్యానించి యిదినిజమని తెలిసికొనిముహూర్తమాత్రము కోపము చేఁగను లెట్టఁజేసికొని చేతితో నీరు పట్టుకొనియథావిధిగా నాజలముప స్పృశించి రావణు నిట్లు దారుణముగా శపించెను. "సుందరీ! నీ విష్టపడకుండ నుండఁగా వాఁడు నిన్ను బలాత్కరించినవాఁడు గనుక నిటుపైని గామించనికామినిని ముట్టఁడు. కామార్తుఁడై యొకవేళఁ గోరికలేనిదానిని బలాత్కరించినచో వెంటనే వాని తల వేయిశకలములగును." అని యిట్లు నలకూబరుఁడు శపింపఁగానే దేవదుందుభులు మ్రోఁగినవి. ఆకాశమునుండి పుష్పవర్షము గురిసినది. బ్రహ్మ మొదలగు దేవతలందఱును సంతోషించిరి. లోకముయొక్కగతినంతయును రావణునిమరణమును దెలిసికొని ఋషులు పితరులు చాల సంతోషించిరి. రావణుఁ డాతఁడిచ్చినశాపపుసంగతి తెలిసి

కొని యదిమొదలుగా నిష్టపడని గాంతను బలాత్కరింపమానుకొనెను. ఆరావణునిచే జెఱిదీసికొనిపోఁబడిన పతివ్రతలగు స్త్రీలు నలకూబరుఁడిచ్చిన మనఃప్రియమైన శాపమును విని పరమసంతోషమును బొందిరి.

27-వ సర్గము

స్వర్గముపై రావణునిదండయాత్ర

తరువాత రావణుఁడు కైలాసమతిక్రమించి యింద్రలోకమునకుఁ బోయెను. వానిసైన్యము నాలుగువైపులనుండియు వచ్చుచుండఁగా సముద్రము మథించునప్పటివలెఁ జప్పుడు దేవలోకమునందు వ్యాపించినది. రావణుఁడు వచ్చెననివినఁగానే యింద్రుఁడు సింహాసనముపైనుండి యదరిపడి లేచి యచ్చటికి వచ్చియున్న దేవతలతో నిట్లనియె: "వసువులు, రుద్రులు, విశ్వేదేవతలు, సాధ్యులు, మరుద్గణములు మొదలగు దేవతలారా! మీరందఱును రావణునితో యుద్ధము చేయుటకు సిద్ధముగానుండుఁడు. వాఁడు మహోదుర్ధర్షుఁడు" అని దేవేంద్రుఁడు చెప్పఁగానే యుద్ధములలో నింద్రునితో సములగు దేవతలు యుద్ధము చేయుటకు, శక్తిగలవారై సిద్ధముగా నుండిరి. ఇంద్రుఁడు రావణుఁడన్న భయముగలవాఁడై దీనత్వముగా విష్ణునియొద్దకుఁబోయి యిట్లనియె: "విష్ణూ! మహాబలపరాక్రమములుగల రావణుఁడు యుద్ధమునకువచ్చియున్నాఁడు. ఇపుడు నేనేమిచేయఁగలను? వాఁడు వరములచేత బలవంతుఁడైయున్నవాఁడు. మఱియొకకారణము గాదు. బ్రహ్మ చెప్పిన మాటను సత్యము చేయక తప్పదు. ఇదివరలో నీబలము నాశ్రయించి నముచి, వృత్రాసురుఁడు, బలి, నరకాసురుఁడు, శంబరుఁడు మొదలగు రాక్షసులు నాచే జయింపఁబడిరి. ఇప్పుడును నీవక్లే సాయపడవలయును. మధుసూదనా! మూఁడులోకములయందును నీకంటె మాకెవ్వరు దిక్కున్నారు? నారాయణుఁడవు, శ్రీమంతుఁడవు, పద్మనాభుఁడవు, సనాతనుఁడవును నీవేకదా! నీచేతనే యీలోకములు స్థాపింపఁబడినవి. నీవే నన్నింశక్రపదమం దుంచితివి. మల్లోకములను నీవే సృజించితివి. యుగాంతమందు మరల నీలోనే యీలోకములు ప్రవేశించగలవు. ఇపుడు నేనేమిచేయవలయునో నీవే చెప్పుము. ప్రభూ! నీవు చక్రసహాయుఁడవై రావణునితో యుద్ధము చేయుదువా?" అనియిట్లు దేవేంద్రుఁడనఁగానే విష్ణుఁడిట్లనియె:"ఇంద్రా!

నీవిపుడు భయపడనక్కఱలేదు. నేను జెప్పునది వినుము. సురాసురులచే నీదురాత్ముడు జయింపశక్యుడుగాడు. మనమిపు డెంత ప్రయత్నించినను వాడు వరదానముచే దుర్జయుండే యగును. ఏవిధముగానైనను బలగర్వితుడగువాడు చాల గొప్పపని చేయకమానడు. అందును బలవంతుడగు పుత్రునితోడగూడి వచ్చియున్నవాడు, జయింపఁజాలమని నాకుఁ దెలిసియేయున్నది. సురేశ్వరా! నన్నువచ్చి యుద్ధము చేయుమంటివి. వానితో నేనిపుడు యుద్ధము చేయను. విష్ణుడు యుద్ధములో శత్రువును జంపకుండ మరలువాడు గాడు. అయినను వాడు వరదానము కలిమిని దుర్జయుండైయున్నవాడు గనుక నిపుడు మనకోరిక నెఱవేఱునది కాదు. శతక్రతూ! నేనిపుడు నీతోఁ బ్రతిజ్ఞ చేయుచున్నాను. నేనే వీని మృత్యువునకుఁ గారణమగుదును. వానిని బుత్రమిత్రాదులతోఁ గాలముగూడినపుడు చంపి, దేవతలు మొదలగువారిని సంతోషపఱచెదను. దేవరాజా! యథార్థమైనసంగతియంతయుఁ జెప్పితిని. ఇప్పటికి నీవే భయపడక దేవతలందఱుతోడనుగూడి వానితో యుద్ధము చేయుము."

తరువాత రుద్రులు, ఆదిత్యులు, వసువులు, మరుద్గణములు, అశ్వినీదేవతలు మొదలగువారందఱును యుద్ధసన్నద్ధులై పట్టణమునుండి బయలుదేఱి వేగముగా రాక్షసులమీఁదికిఁ బోయిరి. ఇంతలోఁ దెల్లవాఱుఁగానే ప్రకృష్టయుద్ధశాలియగు రావణునిసైన్యముయొక్క కోలాహలమంతటను వ్యాపించినది. మహాబలులగు నారాక్షసులు లోకరి నొకరు చూచుకొని సంతోషపూర్వకముగా యుద్ధాభిముఖులై బయలుదేఱిరి. రణరంగమునం దారాక్షససైన్యమును జూడఁగానే దేవసైన్యము సంక్షోభమును బొందినది. తరువాత దేవతలకును రాక్షసులకును నానాయుధములతోడ దొమ్మియుద్ధము ప్రారంభమైనది. ఈలోపల ఘోరదర్శనులగు రావణునిమంత్రులు యుద్ధమునకు సిద్ధపడిరి. మారీచుఁడు, ప్రహస్తుఁడు, మహాపార్శ్వుఁడు, మహోదరుఁడు, అకంపనుఁడు, నికుంభుఁడు, శుకుఁడు, సారణుఁడు, సంహ్లాదుఁడు, ధూమకేతువు, మహాదంష్ట్రుఁడు, ఘటోదరుఁడు, జంబుమాలి, మహాహ్రదుఁడు, విరూపాక్షుఁడు, సుప్తఘ్నుఁడుఁ, యజ్ఞకోపుఁడు, దుర్ముఖుఁడు, దూషణుఁడు, ఖరుఁడు, త్రిశిరసుఁడు, కరవీరాక్షుఁడు, సూర్యశత్రువు, మహాకాయుఁడు, అతికాయుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు మొదలగు రాక్షసులతోఁగూడి మహాబల

శాలియగు రావణునితాత సుమాలి యనువాడు దేవసైన్యములోఁ బ్రవేశించి వాడిగల నానావిధములైన యాయుధములతో వాయువు జలధరములనువలె దేవతలను ధ్వంసముచేయ మొదలిడెను. రామా! రాక్షసులచే దెబ్బలు తినఁజాలక దేవసైన్యము సింహమునకు భయపడిన మృగములవలె నాలుగువైపులకును బాఱిపోయిరి.

అటువంటిసమయమున శూరుఁడగు నెనిమిదవవసువు సావిత్రుఁడను నతఁడు యుద్ధభూమిలోఁ బ్రవేశించెను. అతఁడు నానావిధములైన యాయుధములు ధరించియున్న సైన్యముతోఁగూడి సంతోషించుచు సింహము క్షుద్రమృగములను భయపఱిచినట్లు శత్రుసైన్యమును భయపఱుచుచుండెను. మఱియు మహాబలులగు త్వష్ట, పూష యనునాదిత్యలిద్దఱును కవచములను ధరించి నిర్భయముగా సైన్యసమేతులై యుద్ధభూమిలోఁ బ్రవేశించిరి. తరువాత దేవతలకును రాక్షసులకును యుద్ధము తటస్థించినది. ఆరాక్షసులనేకయుద్ధములలో మరలకుండఁ గీర్తిని సంపాదించియున్న వారు. తరువాత రాక్షసులందఱును యుద్ధభూమిలో నున్న దేవతలను వేలకొలఁదిగ ఘోరమైన యాయుధములతోఁ గొట్టిరి. దేవతలును మహాబలపరాక్రమములు గలవారు గనుక నానావిధశస్త్రాస్త్రములను ప్రయోగించి చాలమందిరాక్షసులను యమునియింటికిఁ బంపించిరి. రామా! ఇంతలో సుమాలి యనురాక్షసుఁడు మిక్కిలికోపించి దేవసైన్యమునకి నానావిధములైన యాయుధములతోడను వచ్చిపడెను. వాయువు మేఘముల నెగురఁగొట్టిన ట్లాదేవసైన్యము నెగురఁగొట్టెను. ఆ దేవతలు సుమాలియొక్క బాణవర్షముచేతను దారుణములగు శూలాద్యాయుధప్రహారములచేతను బీడింపఁబడినవారై పాఱిపో మొదలిడిరి. ఇట్లు సుమాలితో యుద్ధము చేయఁజాలక దేవతలు పాఱిపోవుచుండుట చూచి సావిత్రుఁడనుపేరుగల యెనిమిదవవసువు మిగులఁ గోపించి తన సైన్యముచే నావరింపఁబడినవాఁడై కొట్టుచున్న సుమాలిని దనపరాక్రమముచేతను వారించెను. తరువాత వారిద్దఱికిని రోమహర్షణముగా మహాయుద్ధము జరిగినది.

యుద్ధములలో మరలనివారే వారిద్దఱును. తరువాత సావిత్రుఁడు మహాబాణములు ప్రయోగించి క్షణమాత్రములో నాసుమాలియొక్క పన్నగము లెక్కెముగాఁగల రథమును బడగొట్టెను. ఇట్లు

వసువు వందలకొలఁదిగ బాణములను బ్రయోగించి రథమును బాడుచేసి వానిని జంపు తలంపుతో గద పట్టుకొనెను. ఇట్లు దీప్తాగ్రయుఁ గాల దండోపమయునగు గదనుబట్టి యాసుమాలి నెత్తిమీఁదను గొట్టెను. ఆ గద వానినెత్తిమీఁదను గొప్పయుల్క పడుచున్నట్లును, ఇంద్రునిచే విడువఁబడిన పిడుగువలెఁ బడినది. ఆరాక్షసుఁ డాగదాఘాతముచే నెమకలు విఱిగి నేలఁగూలెను. శిరస్సు పగిలిపోయినది. మాంసము చెల్లాచెదరై పోయినది. వేయేల? గదపడఁగానే యాయుద్ధభూమిలోనే భస్మమైపోయినవాఁడాయెను. ఇట్లు సుమాలి పడిపోవుటచూచి రాక్షసులంతటును మొఱ్ఱలుపెట్టుచు గుంపులుగుంపులుగాఁ బాఱిపోయిరి. వసువు వారిని వెంటఁ దఱుముచునే యుండెను. రాక్షసులలో నొక్కఁడైనను యుద్ధభూమిలో నిలువఁజాలఁడయ్యెను.

23-వ సర్గము

దేవదానవయుద్ధము

ఇట్లు వసువుచేత సుమాలి కొట్టఁబడి భస్మముపాలగుటయుఁ, దమసైన్యము దేవతలచేఁ బీడితమై పాఱిపోవుటయుఁజూచి బలవంతుఁడగు రావణునికొడుకు కింప్రజిత్తు యుద్ధభూమిలో నిలువఁబడి రాక్షసులను మరలించెను. అగ్నివర్ణము కామగమనము గల రథమెక్కి యా మహారథుఁడగు మేఘనాదుఁడు వనముల నగ్ని కాలుచునట్లు కాల్చుచు దేవసైన్యమును వెంటాడించెను. అనేకాయుధములు ప్రయోగించుచు యుద్ధభూమిలోఁ బ్రవేశించిన మేఘనాదుని జూడఁగానే దేవతలు భయపడి నాలుగువైపులకుఁ బాఱిపో మొదలిడిరికాని యొక్కరుఁడైనను వాని కభిముఖముగా నిలువఁజాలకపోయెను. అపు డింప్రఁడు దేవతలను మరలించు తలంపున నిట్లనియె: "దేవతలారా! భయపడకుఁడు. పాఱిపోకుఁడు. మరలి రండు; యుద్ధము చేయుఁడు. ఇదిగో నాకుమారుఁ డపరాజితుఁడు జయంతుఁడు, మనకు సాయము వచ్చుచున్నాఁడు" అని యింద్రుఁడు చెప్పుచుండఁగానే, జయంతుఁ డనుపేరుగల యింద్రుని కొడుకు మిక్కిలి యద్భుతమును గలిగించు రథమెక్కి యుద్ధమునకు వచ్చెను. తరువాత దేవతలందఱును జయంతుని జూట్టువాటుకొని మేఘనాదు నెదుర్కొని కొట్ట మొదలుపెట్టిరి. అపుడు వారికిని వారికిని దేవ

రాక్షససదృశమైన యుద్ధము జరిగినది. తరువాత మేఘనాదుఁడు మాతలి కొడుకును జయంతునకు సారథియు నగు గోముఖునిపైని కనకభూషణము లగుబాణములను వర్షించెను. జయంతుఁడు మేఘనాదునిసారథిని గొట్టెను. మేఘనాదుఁడు జయంతునిగొట్టెను. మఱియు బలవంతుఁడగు మేఘ నాదుఁడు కోపపూర్ణుఁడై కన్నులెఱ్ఱఁజేసి జయంతుని బాణవర్షముచే ముంచివైచెను. అటుపైని, వాఁడిధారలుగల నానాయుధములను శతఘ్ను లను, ముసలములను, గదలను, కొండశిఖరములను వేలకొలఁదిగ దైవత సైన్యముపైనఁ బ్రయోగించెను. అపుడు లోకములన్నియు భయంపడినవి. ఎక్కడఁజూచినను జిమ్మచీఁకటి బలసిపోయినది. ఇట్లు మేఘనాదుఁడు దేవ సైన్యమును గొట్టుచుండఁగా దైవతసైన్యముజయంతుఁడునుగూడ బహు విధములుగా నస్వస్థతను బొంది శరజీవితమును నిందించుకొనిరి. దేవత లెవరో రాక్షసులెవరో తెలియరాకపోయినది. అచ్చటచ్చటఁ జెదరిపోయి నాలుగువైపులకును బాఱిపోవుట తటస్థించినది. అట్టిసమయమున దేవతలు దేవతలను, రాక్షసులు రాక్షసులను గొట్టుకొమొదలిడిరి. మఱికొందఱు చీఁకటిచే నేమియుఁ జేయఁజాలక పాఱిపోయిరి.

ఇంతలో వీరుఁడును, వీర్యవంతుఁడును, దైత్యేంద్రుఁడును నగు పులోముఁడనువాఁడు వచ్చి జయంతుని తీసికొనిపోయెను. అతఁడు తన దౌహిత్రుఁడగు జయంతు నెత్తుకొని సముద్రములోఁ జొచ్చెను. ఆపులో ముఁడు జయంతునికి మాతామహుఁడు; శచీదేవికిఁ దండ్రి. అపుడు దేవ తలు జయంతునివృత్తాంతము తెలియక చచ్చిపోయెనేమో యని చాల భయపడిరి. కొందఱు దేవతలు పాఱిపోయిరి. అపుడు మేఘనాదుఁడు మిక్కిలి కోపించి తనసైన్యముతోఁగూడి మహానాదములు చేయుచు దేవ తలను వెంటాడించెను. అపుడు దేవేంద్రుఁడుకొడు కగుపడకుండుటయు సైన్యము పాఱిపోవుచుండుటయుఁజూచి రథము తెమ్మని మాతలికి నియో గించెను. దివ్యమును మహాభయంకరమును నగు నారథము సిద్ధముగనే యుండెను. మాతలి యామహావేగము గల రథమును దెచ్చెను. తరు వాత మెఱుపులుగలిగి మహాబలవంతములయిన మేఘము లారథమునకుఁ గట్టఁబడినవి. ఆమేఘములు ముందరనుండి వాయువుచేఁ గదలుచు మిక్కిలి ధ్వనిచేసినవి. ఆరథముమీఁదఁ గూర్చుండి గంధర్వులు నానా విధములయిన వాద్యములు వాయించిరి. దేవేంద్రుఁడు యుద్ధమునకు

బయలుదేఱఁగానే యచ్చరలాడిరి. దేవేంద్రుఁడు, రుద్రులు, వసువులు, ఆదిత్యులు, సాధ్యులు, మరుద్గణములు నానావిధాయుధములను ధరించి చుట్టుబలసివచ్చుచుండఁగా యుద్ధమునకు బయలుదేఱెను. ఇట్లు దేవరాజు బయలుదేఱునపుడు గాలి పరుషముగా వీచినది. సూర్యుఁడు తేజశ్శూన్యుఁడాయెను. ఉల్కలు రాలినవి.

ఇంతలో వీరుఁడును ప్రతాపవంతుఁడును నగు రావణుఁడు విశ్వకర్మచే నిర్మింపఁబడిన రథమునెక్కి బయలుదేఱెను. రోమహర్షణమును గలిగించుచు గొప్పగొప్పపడగలు గల పాములచే నారథము వేష్టింపఁబడియున్నది. వానినిట్టూర్పులగాలిచే యుద్ధరంగము జ్వాలామాలాపరీతమయినట్లున్నది. మఱియు రాక్షసులెందఱో ఆరథమును జుట్టువాఱుకొని నడచుచుండిరి. ఇట్లు సన్నద్ధుఁడై రావణుఁడింద్రునిపైకి వెడలెను. తన కొడుకును వారించి తానే యుద్ధోన్ముఖుఁడాయెను. మేఘనాదుఁడును యుద్ధము చాలించి కొంతవడి విశ్రమించుచుండెను. తరువాత దేవతలకును రాక్షసులకును యుద్ధము ప్రారంభమైనది. మేఘములు వర్షమును వర్షించినట్లుభయసైన్యములవారును బాణములు వర్షించుకొనుచున్నారు. అపుడు దుష్టాత్ముఁడును నానాయుధధరుఁడును నగు కుంభకర్ణుఁడెవరితో యుద్ధము చేయుచున్నాఁడో యెవ్వరికిని దెలియరాకుండెను. దంతముల చేతను భుజములచేతను పాదములచేతను శక్తులు, తోమరములు, బాణములు అవి యివి యన నేల? చేతికి దొరికినదానితో నెల్ల దేవతలనుగొట్ట మొదలు పెట్టిరి. తరువాత మహాఘోరస్వరూపులగు రుద్రులువచ్చి కలసి రావణునితో యుద్ధము చేసిరి. చాలవఱకుఁ గుంభకర్ణుని గొట్టిరి. వారి యాయుధములచే బాగుగాఁ గొట్టఁబడి రక్తమును స్రవించు నాకుంభకర్ణుఁడు మెఱుపులతోడను, ఉఱుములతోడను గూడి వర్షించు మేఘమువలెఁ జూపఱకును.

తరువాత నారాక్షససైన్యము మరుద్గణములతో యుద్ధముచేసి నానాయుధములచేతను గొట్టఁబడి పాఱిపోయెను. కొందఱు కొట్టఁబడిరి; కొందఱు నఱకఁబడిరి. కొంతఱు క్రిందఁబడి దొరలుచుండిరి. మఱికొందఱు వాహనములమీఁదనే పడిపోయియుండిరి. ఇంకఁ గొందఱు రథములను, ఏనుఁగులను, గాడిదలను, లొట్టియలను, పాములను, గుఱ్ఱములను, శింశుమారములను, వరాహములను బాహుబలులచే నాలింగించుకొని

యట్లేయుండిపోయిరి. మొత్తమునకుఁ జాలమంది రాక్షసులు దేవతలచేఁ జంపఁబడిరి. అప్పటివారియుద్ధభూమి చిత్తరువు వ్రాసినరీతిని గనుపడ్డది. చచ్చిపడిన రాక్షసులరక్తము నదులై ప్రవహించినది. రాఁబులుగులు, గ్రద్దలు మొదలగునవి నిండియున్నవి. శస్త్రము లారక్తనదిలో గ్రహాముల వలె నొప్పుచున్నవి. ఇంతలో రావణుఁడు కోపించి దేవతలచేఁ గొట్టఁబడిన తనసైన్యమువాటు చూచి యా దేవతాసైన్యములోనికి సముద్రములోనికి గ్రాహము చొఱఁబడినతెఱఁగునఁ జొఱఁబడి దేవతలను గొట్టుచుఁ దిన్నఁగా దేవేంద్రునివంకకుఁ బోయెను. ఇంద్రుఁడును మహాధనుస్సు చేతఁబట్టుకొని ధనుష్టంకారముచేయుచు యుద్ధమునకభిముఖుఁడాయెను. అతనిధనుష్టంకారముఁజలనఁ బడిదిక్కులును బ్రతిధ్వను లీనుచున్నవి. అట్టి ధనుస్సెక్కుపెట్టి రావణునినెత్తిమీఁదఁ బావకునితోను, సూర్యునితోను సమానములగు బాణములను బ్రయోగించెను. రావణుఁడును నట్టే నిలువఁబడి యింద్రునిపైన నసంఖ్యములగు బాణములను వర్షించుచుండెను. ఇట్లాయిద్దఱును ఘోరముగా యుద్ధముచేయుచుండఁగా నంతటను జీఁకటి కమ్మిపోయియుండుటచే నెవ్వరికి నేదియు నగపడకపోయినది.

29-వ సర్గము

ఇట్లు చీఁకటి క్రమ్మియుండఁగా నాదేవతలు రాక్షసులును బలోన్మత్తులై యొకరినొకరు గొట్టుకొనుచు యుద్ధముచేసిరి. తరువాత దేవసైన్యము రాక్షససైన్యములోఁ బడియవసంతుమాత్రముంచితక్కినసైన్యమును యమునియింటికిఁ బంపెను. అట్టిచీఁకటియుద్ధములో నొకరి నొకరు తెలియఁజాలక పరస్పరము యుద్ధము చేయుచుండిరి. అట్టిసమయమున నింద్రుఁడు రావణుఁడు మేఘనాదుఁడునుమాత్రమే మోహమును బొందరైరి. రావణుఁడు క్షణమాత్రములోఁ దనసైన్యమంతయు నశించిపోవుట చూచి చాలఁ గోపించి మహానాదము చేసెను. కోపమాఁపుకోఁజాలక రథమునుపైనున్న సారథితో నిట్లనియె: "సారథీ! శత్రుసైన్యముయొక్క మధ్యప్రదేశమునకు రథమునడుపుము. ఇపుడే యీదైవతసైన్యమునంతను మహాఘోరములగు శస్త్రాస్త్రములను బ్రయోగించి యమునియింటికిఁ బంపించెదను. నేను దేవేంద్రుని కుబేరుని వరుణుని దేవతలను జంపి, తరువాత నిశ్శత్రుఁడనై యందఱికిను బైఁగా నుండెదను. నీవు దుఃఖింప

కుము. నారథమును వేగముగా నడపుము. ఇపుడు మనమున్నది నందన వనప్రదేశము.నన్ను నుదయపర్వతమునొద్దకు దీసికొనిపొమ్ము" అనియిట్లు రావణుడు చెప్పిన మాటలు విని సారథి మనోవేగము గల గుఱ్ఱములను శత్రుమధ్యమునుండి నడపించెను. అప్పుడు దేవేంద్రుడు రావణుని యభిప్రాయమును దెలిసికొని రథముమీదనుండి దేవతలతో నిట్లనియె.

"దేవతలారా! నాకుం దోచినమాటలు చెప్పెదను వినుడు. రావణుని బ్రతికియుండగానే పట్టుకొనుడు. బలవంతుడగు వీడు సైన్యము లతోగూడ వాయువేగముగల రథమెక్కి పర్వమునందుం బ్రవృద్ధతరంగ శాలియగు సముద్రమునకలె వచ్చుచున్నాడు. వరదానప్రభావమునకల నిపుడు వీనిని జంపరాదు. కావున మీరు సావధానముగా నుండుడు. వీనిని బట్టుకొందము. ఏరీతిగా బలాసురుని నిరోధించి మూడులోకము లను నేననుభవించుచుంటినో, యట్లే యీపాపాత్ముని నిరోధము నాకిష్ట మగుచున్నది. తరువాత దేవేంద్రుడు రావణుని విడిచి యితరస్థానమును బొంది యుద్ధములో రాక్షసులను భయపఱచుచు యుద్ధము చేసెను. రావణుడు దడ్డులేకుండనుత్తరముసుండియు దేవేంద్రుడు దక్షిణమునుండి యుం బ్రవేశించిరి. పిదప నారావణుడు యోజనశతము ప్రవేశించి దేవ సైన్యమునంతను బాణవర్షముతో ముంచివైచెను. అపు డింద్రుడు తన సైన్యమునశించుటచూచి బెదరులేనివాడై రావణుని నావరించి మకలింప జేసెను. రావణుడు దట్టడ్డంబడుటచూచి "ఆహా! చచ్చితిమి" అని దాన వులు రాక్షసులు కేకలు వైచిరి. పిదప మేఘనాదుడు కోపించి రథమెక్కి దారుణమగుసైన్యములోం బ్రవేశించెను. తనకుం బూర్వము శివుం డిచ్చిన మహామాయ నవలంబించి యాసైన్యమును బరుగులెత్తించెను. మఱియు వాడు దేవతలను విడిచి యింద్రునిమీదికిం బరుగెత్తెను. ఇంద్రుం డాతని రాక నెఱుంగఁడాయెను. అంత నింద్రుడు, దిక్పాలకులు, రుద్రులు, వసు వులు, ఆదిత్యులు మున్నగు సకల సురనికరములు తోడరా రావణు నెది రించి ముట్టడించి, పలుమాఱుం గలంతపెట్టెను. మఱియు వానియరదము మీఁది కుఱికి,సారథిని గుఱ్ఱములనుజంపితేరిపైనున్న రావణునిం గడురయ మున నొడిసి పట్టుకొని గొప్ప సింహనాదము చేసెను. రావణుడు పట్టు వడుటగాంచి దేవతలెల్లరుం బెనుబొబ్బలిడిరి. ఇట్లు పట్టికొని రావణుని యింద్రుడు స్వర్గమునకుం గొనిపోవుచుండెను. అపుడు పాఱిపోవుచున్న

రాక్షసుల యార్తనాదము నాలకించి మేఘనాదుఁడు మిగుల భయంకర ముగ బొబ్బపెట్టి రణరంగమున నింద్రుఁడున్నయెడకు శరవేగమునఁ బోయెను. వినుక్తకవచుఁడయిన యారావణి గొప్పబలవంతులగు దేవత లచేఁ గొట్టఁబడుచున్న వాఁడయ్యు వారినేమియుఁ జేయక యింద్రసారథి యగు మాతలిని, గుఱ్ఱములను మోది యింద్రునిపయి బాణవర్షమును గ్రుమ్మరించెను. అపుడు దేవేంద్రుఁడు రథమును సారథిని విడిచి యైరావ తముపైఁ గూర్చుండి రావణిని వెదక మొదలిడెను. మాయాబలము నాశ్రయించి యంతరిక్షమునుండి రావణి యగపడకుండఁగనే యింద్రుని మాయలోముంచి బాణములతోఁ గొట్టమొదలిడెను. మఱియు నింద్రుఁ డెప్పుఁ డలసిపోయెనని తెలిసికొనెనో అపుడే మేఘనాదుఁ డాతని మాయ తోఁగట్టి తనసైన్యమున కభిముఖముగాఁ దీసికొనిపోయి తనతండ్రిని విడి పించెను. అట్లు రావణి యింద్రుని బలవంతముగాఁ గట్టి తీసికొని పోవు చుండఁగాఁ జూచి దేవత లిదియేమని చింతింప మొదలిడిరి. శత్రుజయుఁ డగు రావణి మాయావి యగపడకయేమంత్రవిద్యావంతుఁడైన యింద్రుని మాయచేఁ దీసికొనిపోయెను. ఇంతలో దేవతలందఱును గోపించినవారై రావణునెదుర్కొని బాణవర్షముచేముంచిరి. శత్రువులచేఁ బీడింపఁబడిన రావణుఁడు వసువులు, ఆదిత్యులు మున్నగువారి నెదుర్కొని యుద్ధము చేయఁజాలకపోయెను. రావణి దెబ్బలచే శిథిలుఁడై హర్షతుయమును బొందియున్న తండ్రియొద్దుట ప్రత్యక్షమై యిట్లనియె: తండ్రీ! రమ్ము పోవుదము. ఇఁక యుద్ధమక్కఱలేదు. నేను జయమును పొందితిని. నీవు నెమ్మది నుండుము. సురసైన్యమునకునుమూఁడులోకములకును బ్రభువగు నింద్రుఁ డిడుగో! వీనిని బట్టుకొంటిని; దేవతలగర్వమునంతను బోఁగొట్టి తిని. శత్రువుని బలముచే నిగ్రహించి నీయిచ్చకు వచ్చిన మచ్చున ముల్లోకముల నేలుకొనుము. తండ్రీ! ఇఁక నీవు వ్యర్థముగా నేల శ్రమ పడవలయును? ఇఁక యుద్ధము నిష్ఫలము. తరువాత దేవతలు యుద్ధము నుండి మరలిరి. రావణుఁడు కొడుకుమాటలు విని స్వస్థచిత్తుఁడాయెను. పిమ్మట రావణుఁడు రణమునలని జ్వరమును విడిచినవాఁడై జయమును బొంది సంతోషించుచు లంకాభిముఖుఁడై తనకుమారునితో నిట్లనియె: "బలశాలివగు నీకుమారా! నిరుపమానమగు పరాక్రమమును బ్రకటించి నాకులమునకు గౌరవమును వృద్ధిచేసితివి. అతుల్యబలుఁడగు నీదేవేం

ద్రుని దేవతలను జయించి నాకెంతయు సంతోషమును గలిగించితివి. కనుక నీవాసవుని రథమెక్కించి రాక్షససేనాపరివృతుఁడవై లంకాభిముఖుఁడవు గమ్ము. నేనును మంత్రిముఖ్యులతోఁ గూడి నీ వెనువెంటనే వచ్చెదను. ఇట్లు రావణుఁడు చెప్పిన తోడనే యింద్రజిత్తు సేనాపరివృతుఁడై యింద్రుని పరిగ్రహించి లంకకుఁబోయి, యుద్ధముచేసి యలసిన రాక్షసులకు సెలవిచ్చి వారివారియిండ్లకుఁ బొమ్మనెను.

30-వ సర్గము

బ్రహ్మ యింద్రుని విడిపించుట

ఇట్లు రావణునికుమారునిచే నింద్రుఁడు జయింపఁబడినతోడనే దేవతలు బ్రహ్మదేవుని బురస్కరించుకొని లంకకుఁ బోయిరి. అప్పుడు బ్రహ్మ యంతరాళమందుండి పుత్రభ్రాతృప్రముఖులచేఁ బరివృతుఁడై యున్న రావణునిఁ జూచి సామపూర్వకముగా నిట్లనియె: వత్సా! రావణా! నీకుమారునిపరాక్రమమునకు సంతోషించితిని. వీని విక్రమౌదార్యము నిన్ను మించినది సంశయములేదు. నీవు నీతేజస్సుచే మూఁడులోకములను జయించితివిగదా! పట్టినప్రతిజ్ఞ సఫలమయినది. నీకుమారునివిషయమున నేను సంతోషించితిని. ఇవి మొదలు నీకొడుకు లోకములలో నింద్రజిత్తని ప్రసిద్ధినొందఁగలఁడు. అతిబలవంతుఁడగుటచే నితని నెవ్వరును జయింపఁజాలరు. వీనిబలము నాశ్రయించియేకదా! నీవు దేవతలను స్వాధీనముగా నుంచుకొంటివి. కావున మహాబాహూ! దేవేంద్రుని విడిచిపెట్టుము. మఱియు నింద్రుని విడిపించుటకు దానవుల కాజ్ఞాపింపుము.

తరువాత సమితింజయుఁడగు నింద్రజిత్తిట్లనియె: "దేవా! వీనిని విడుచుట తప్పనిచో నాకమరత్వమును గోరుచున్నాను". ఇట్లనిన నింద్రజిత్తుతో బ్రహ్మ యిట్లనియె: "చతుష్పాత్తులు, ఖేచరులు, మఱియు నితరులగు మహౌజసులు, వృక్షములు, గుల్మములు, లతలు, తృణములు, రాళ్లు, పర్వతములు మొదలగునవన్నియు భయము గలిగినపుడు భయపడుచుండును. దీనినిబట్టిచూడఁగా నన్నింటివలనను, అన్నింటికిని భయమున్నట్లే స్పష్టపడుచున్నది. నాయనా! సామాన్యముగా నేప్రాణికిని సర్వామరత్వములేదు. చతుష్పదములు పక్షులు మొదలగుభూతమున

కిదియేరీతి" అని యిట్లు పలికిన ప్రభువగు బ్రహ్మమాటలు విని యింద్రజి త్తాయనతో నిట్లనియె: "దేవా! ఇంద్రుని విడిచినందులకై నాకుఁ గావ లసినసిద్ధి వినుము. నీకిష్టముగా నిత్యమును హవ్యములను మంత్రముల చేత నగ్నిహోత్రునియందు ప్రేల్చుచుందును. శత్రువులను జయించుతలం పుతో యుద్ధోన్ముఖుఁడ నైనపుడు గుఱ్ఱములతోఁ గూడిన రథము నాకై యగ్నిహోత్రమునుండి రావలెను. దానిపై నున్నంతసేపు నేను తప్పక యమరుఁడనే. ఇది నానిశ్చయమయిన వరము. అట్లగ్నియందు హోమము చేయఁదగిన క్రతువు పూర్తిగాకుండ యుగ్రముచేయుట తటస్థించినచో నాశమును బొందినఁ బొందుదునుగాక. మఱియును, దేవా! అందఱును దపస్సులచే నమరత్వమును బొందుచుందురుగాని నేనుమాత్రము నా పరాక్రమముచేతనే యమరత్వమును బొంచితిని" అన నట్లే యని బ్రహ్మ యనెను. ఇంద్రజిత్తు దేవేంద్రుని విడిచెను. దేవతలు స్వర్గమునకుఁ బోయిరి.

రామా! అట్టిసమయమున స్వర్గభ్రష్టుఁడగు నమరునివలెఁ గాంతి తఱిగినవాఁడై యింద్రుఁడు చింతాసముద్రములోమునిఁగి ధ్యానతత్పరుఁ డాయెను. అట్టియింద్రునిజూచి బ్రహ్మ యిట్లనియె: "శతక్రతూ! నీవు పూర్వము మహాదోష మెందులకుఁజేసితివి? అందువలననే సుమా నీకిట్టి కష్టము గలిగినది. అమరేంద్రా! నే నేకవర్ణముగలవారు, సమానభాషలు గలవారు, సమానరూపములుగలవారు నగు పలుమంది ప్రజలను సృజిం చితిని. వారి దర్శనములోను లక్షణములోను విశేష మేమియు లేకపోయి నవి. అపుడు నే నేకాగ్రమానసుఁడనై ప్రజలనందఱను ధ్యానించితిని. వారి విశేషము కొఱకు నే నింకొక సుందరిని సృజింపనెంచి ప్రజలయంద ఱిలోన నుండు చక్కఁదనమును గ్రహించి యహల్యయను స్త్రీని సృజించితిని. హలమనఁగా వైరూప్యము. హల్యమనఁగా దానివలనఁ బుట్టినది. ఆస్త్రీ యం దదిలేదు గనుక నహల్యయని పేరుపడినది. నేనే యొక్కఁడను నామెకు విరూపత్వము లేదని యహల్యయని పేరుంచితిని. అట్లు సృజించి యామెకుఁ దగినవరుఁ డెక్కఁడనుండును? అని యోచింప మొదలిడితిని. ఇంద్రా! నీవప్పుడామెనుగోరితివి. నేనే మూఁడులోకముల నేలుచుంటిని గదా! నాకెందుల కీసుందరి లభింపకపోవును? అని తలంచితివి. నేనదివఱకే గౌతమమహాముని కీయ సంకల్పించుకొనియుంటిని. అనేకసంవత్సరములు

నాయొద్దనే యుంచుకొని తుదకాయనకు సమర్పించితిని. అతని తపస్సున కును మనఃస్థైర్యమునకును నాకంత సంతసము గలిగినది. అతఁడామెతో గృహస్థాశ్రమమును సార్థకపఱుచుచుండె. ఆమెను గౌతముని కీయఁగానే యదివఱకుఁ దమకే లభించు ననుకొనుచున్న వారందఱును నిరాశచేసి కొనిరి. ధర్మాత్ముఁడవయిన నీవు కోపించితివి. ఆతని యాశ్రమములోనికిఁ బోయి యీమేమ జూచితివి. అది నీకు దీప్తమగు నగ్ని జ్వాలవలె నగపడి నది. కామార్తుఁడవును కోపివిని నగు నీవామెను మోసపుచ్చితివి. నిన్ను మహాముని చూచినవాఁడై దశాభాగవిపర్యయమును బొందునట్లు కోప మాఁపుకొనుటకు వీలుగాక శపించెను. ఏమని యనిన; "వాసవా! నిర్భ యముగా నన్ను ధర్షించితివి గనుక యుద్ధములో శత్రువులచేఁ బడి పోదువు. దుర్బుద్ధి! నీవిపుడు ప్రవర్తింపఁజేసినభావము మనుష్యలోక మునఁగూడఁ బ్రవర్తించును. అది చేసినవారికి సగముపాపము. నీకు సగముపాపము. నీకు స్థిరమగుస్థానముండదు. నిస్సందేహము. ఎవఁడెవఁడు సురేంద్రుఁడగునో వాఁడు శాశ్వతముగా నుండకపోవుఁగాక! నే నిట్లు శపించుచున్నాఁడను"అని యతఁడు నిన్ననెను. పిదప నతఁడు దనభార్యను నిందించుచు నిట్లనియె :"దుర్మార్గురాలా! ధ్వంసమైపొమ్ము. నాయాశ్రమ ములో నుండకుము. నీవు రూపము యౌవనము గలిగి మదించి యుండు టచే నీకీదుర్బుద్ధి పుట్టినది. కనుక లోకములో నీఁక నీవొక్కతెవే రూప వంతురాలవుగావు. నీరూపమును లోకులందఱును బంచుకొందురు. దాని చేతనేకదా లోకాతీతమైన యీముచ్చట జరిగినది!"అనెను. అదిమొదలు చాలమంది ప్రజలు రూపవంతులై యుండిరి. అపుడామె గౌతముని ప్రస న్నుని జేసికొన్నది. అదిగదా యచ్చటి చమత్కారము! "నాథా! నే నజ్ఞానమువలన మోసపోతిని. ఆయింద్రుఁడు నీరూపముతో వచ్చినఁజూచి నిజమే యనుకొంటిని, కాని నేను బుద్ధిపూర్వకముగా నంగీకరింపలేదు. కావున నాలోపమును మన్నించి దయతలఁచుము" అని యహల్య యనఁ గానే గౌతముఁ డిట్లనియె.

"ఓసీ! బ్రాహ్మణుల సంరక్షించుటకై మహాబాహుండగు విష్ణువు మనుష్యశరీరమును ధరించి రాముఁడనుపేరుతో నిక్ష్వాకువంశములోఁ బుట్టఁగలఁడు. అతఁడు మహాతేజశ్శాలియు మహారథుఁడును నగును. అత

డీవనములోనికిఁగూడ వచ్చును. అతనిదర్శనము కాఁగానే నీవు పవిత్రు రాల వగుదువు. నీవు చేసిన మహాపాతకము నతఁడు శాంతింపఁజేయఁ దగినవాఁడు. అతని కాతిథ్యముచేసి నాయొద్దకు రాఁగలవు. అదిమొదలు నీవు నాఁగ్గరనేయుండుదువు" అని యిట్లా బ్రహ్మర్షిచెప్పి తనయాశ్రమము లోనికి వచ్చెను. బ్రహ్మవాదియగు నామహర్షిభార్య శిలారూపమునొంది చిరకాలము గొప్పతపస్సుచేసినది. ఆయనశాపమువలననే యిదియంతయుఁ దటస్థించినది. ఇంద్రా! ముందు నీవు చేసిన మహాపాతకమును జ్ఞప్తికిఁ దెచ్చుకొమ్ము. అందుచేతనే నీవిపుడు శత్రువులచేఁ జిక్కితివిగాని వేఱు కారణము గాదు. కనుక నీవు శీఘ్రముగా వైష్ణవయజ్ఞమును జేయుము. ఆయజ్ఞముచేఁ బవిత్రుఁడవై తరువాత స్వర్గము చేరుదువు. నీకొడుకు యుద్ధములో వినాశమును బొందుటలేదు. వానిని వాని మాతా మహుఁడు వచ్చి సముద్రములోనికిఁ దీసికొనిపోయి దాఁచియుంచెను. ఇట్లు బ్రహ్మచెప్పినమాటలు విని వైష్ణవయజ్ఞము నాచరించి స్వర్గము ప్రవేశించి యెప్పటియట్ల యేలుచుండెను. ఇది రావణునికి నింద్రజిత్తుఁడనివేరు గలిగినవిధము. వానిబలముసంగతియంతయుఁ జెప్పితినిగదా! అతఁడు దేవేంద్రునే జయించినప్పు డితరులసంగతి వేఱుగాఁ జెప్పవలయునా?" అని యిట్లు చెప్పిన యగస్త్యమహాముని మాటలు విని రాముఁడు లక్ష్మణుఁడు వానరులు రాక్షసులు మొదలగువా రందఱును "ఆశ్చర్యమే" అనిరి. అపుడు రాముని ప్రక్కనేయున్న విభీషణుఁడు "పూర్వకాలమందు జరిగిన యాయా యాశ్చర్యములన్నియు జ్ఞప్తికి వచ్చినవి" అనెను. అపుడు రాముఁడు "యథార్థమయినసంగతియంతయు వింటి"నని యగస్త్యునితో ననెను. తరువాత నగస్త్యుఁడు "ఈరీతిగా రామా! రావణుఁడు లోకకంటకుఁడాయెను. వానికొడుకు దేవేంద్రునిగూడ జయించినవాఁడు" అనెను.

31-వ సర్గము

రావణుఁడు మాహిష్మతికిఁ బోవుట

తరువాత మహాతేజుఁడగు రాముఁడు చాల నాశ్చర్యమునుబొంది యగస్త్యునిజూచి వినయముగా నిట్లనియె: "భగవానులవారూ! క్రూరుఁడగు రావణుఁడు భూమిపైఁ దిరుగుకాలమున లోకములు శూన్యము

లయినవా? రాజుగాని, రాజసూత్రుడుగాని రావణుని బాధించువాడు లేకపోయెనా? లేక వారందఱును రావణునిచేతనే హతవీర్యులయిరా? లేదు లేదు. గొప్పగొప్పవారందఱును రావణునిచేత జయింపఁబడిరని తలఁచెదను" అని యిట్లడిగిన శ్రీరామునిమాటలు విని యగస్త్యుఁడు నవ్వుచు, బ్రహ్మపరమేశ్వరునితో నన్న చందమున నిట్లనియె: "శ్రీరామా! ఈరీతిగా రావణుఁడు రాజులను బాధించుచు భూమిపైఁ దిరుగుచుఁ గ్రమముగా నమరావతితో సమానమగు మాహిష్మతీపురమునుగూర్చి పోయెను. అందు సదా వసురేతసుని సాన్నిధ్యము గలదు. ఆవసురేత సుని ప్రభావముతో సమానమైన ప్రభావముగల యర్జునుఁడాపట్టణము నేలుచుండెను. ఒకదినమున నార్యర్జునుఁడు స్త్రీలతోఁగూడి నర్మదానదిలో జలక్రీడకై పోయియుండెను. నాఁడే రావణుఁడును మాహిష్మతికిఁ బోయెను. అట్లుపోయి యాతనిమంత్రులనుజూచి యిట్లనియె: "మీరా జగు నర్జునుఁడెక్కడ? ఉన్నదున్నవిధమునఁ జెప్పుఁడు. నేను రావణుఁడను వాఁడను. మీరాజుతో యుద్ధము చేయవలయు ననుకోరికతో వచ్చితిని. నేను వచ్చియున్నానని వేగముగా మీరాజుతోఁజెప్పుఁడు"అని రావణుఁ డనఁగానే ప్రాజ్ఞులగు మంత్రులు మారాజు ప్రకృతము పట్టకుములో లేఁడనిరి.

రావణుఁ డట్లు మంత్రులవలనను బౌరులవలనను గార్తవీర్యార్జు నుఁడు లేఁడని విని యచ్చటినుండి హిమవంతునితో సమానమగు వింధ్య పర్వతమునకుఁ బోయెను. ఆపర్వతము క్రిందఁ బాతాళమువఱకును మీఁద నాకాశమువఱకును వ్యాపించి వేలకొలఁది శిఖరములతోఁగూడి సింహాదులగు భయంకరమృగములచే నాశ్రయింపఁబడిన గుహాలుగలిగి మీఁదినుండి పడుజలముచే సముద్రమును నవ్వుచున్నదివోలె, దేవతలు, దానవులు, గంధర్వులు, కిన్నరులు, అప్సరసలు మొదలగువారిచే విహార మునకై యాశ్రయింపఁబడి రెండవస్వర్గఖండమోయన నగపడుచుఁ, బ్రవ హించుచుండు నదులచే సదా స్ఫటికకాంతిగల జలము గలిగి పడగలు చాచి నాలుకలు గీటుచు నాకసము నంటుచున్నట్లుండు ననంతునివలె నుండెను. రావణుఁ డట్టియత్యద్భుతమైన పర్వతమును జూచుచుఁ గ్రమ ముగా నర్మదానదినిగూర్చి పోయెను. అనది రాళ్లమీఁదఁ బడుచున్న జలముగలదై పడమటిసముద్రములోనికిఁబోయి కలియును. మఱియు

నెండచే బడలిన మహిషములు, స్మమరములు, సింహాములు, పెద్దపులులు, భల్లూకములు, మదపుటేనుఁగులు మొదలగువానిచే సంక్షోభింపఁబడు చున్న జలముగలిగి చక్రవాకములు, కారండములు, హంసలు, జల కుక్కుటములు, సారసములు మొదలగు మదించిన పక్షుల కూజితము లచే మనోహరమెయుండెను. రామా! ఆనర్మద తీరమునందలి వికసించిన చెట్లచేఁ బూవులు ముడుచుకొన్నట్లును, చక్రవాకదంపతుల కల్మిని స్తన యుక్తయును, విశాలములైన యిసుకదిబ్బల పిఱుఁదులుగాఁ గలదియు, హంసలపంక్తిచే మొలనూలు గలదియుఁ, బద్మములయందలి పరాగముచే గంధము పూసికొన్నట్లును, నీటిపైనుండు సురుగుచేఁ జీనాంబరము గట్టు కొన్నదియు,వికసించిన కలువలచే నేత్రములు గలదియునయి యొకానొక దివ్యసుందరివలె నగపడుచుండెను. అట్టి నర్మదనుజూచి రావణుఁడు పుష్ప కమునుండిదిగి యందుఁగృతావగాహుఁడై రమ్యమై నానామునినిషేవిత మగు తత్తీరమున సమీపమున మంత్రులు మొదలగువారు సేవించు చుండఁగాఁ గూర్చుండి యానదిని గంగనుగాఁ గొనియాడుచుఁ దత్సంద స్మనలాభమున సంతోషించుచుండెను. అపుడు సమీపమున నున్న మంత్రులు శుకసారణులను జూచి యిట్లనియె.

"సూర్యుఁడు తన వేయికిరణములచేత జగమంతయు బంగారు పూఁతపూసిన ట్లొనరించి వేఁడిని జూపుచు నాకసమునడుమ నాశ్రయించి వెలుంగుచున్నాఁడు. నే నిచ్చట నున్నాఁడనని కాఁబోలును ప్రకృతము తనవేఁడిని దక్కువగాఁజేసి చంద్రునివలెనే చల్లఁగా నున్నాఁడు. ఈ నర్మదానదీతరంగములపైఁ బ్రసరించి యందలి పద్మముల పరిమళమును సంగ్రహించుకొని వాకు భయపడినదివోలె సావధానముగా మారుతము మందముగాఁ బ్రసరించుచు నాశ్రమమును బోఁగొట్టి నాదయకుఁ బాత్ర మగుచున్నది. ఈనర్మదయు ననుఁజూచి భయపడిన యాఁడుదివోలె నాకు నర్మవర్ధినియై తనపేరు సార్థకపఱుచుకొనుచున్నది. మంత్రులారా! మీరందఱును యుద్ధములలోఁ జాల నలసటను బొందియున్నారు. శస్త్ర ములచే దెబ్బలు తినియున్నారు. దేహములనిండఁ జందనము పూసి కొన్నట్లు రక్తముతోఁ దడిసియున్నారు. కావున మీరందఱును మదపు టేనుఁగులు గంగలోఁ దిగి మునిఁగిన ట్లీశర్మద యగు నర్మదలో మునుఁ గుఁడు. ఇందులో మునిఁగితిరేని మీపాపములన్నియుఁ బటాపంచలై

పోవును. నేనును శరచ్చంద్రునితో సమానముగనున్న యీనదియొడ్డునఁ గూరుచుండి మెల్లఁగా శివభగవానుని బుష్పాదులచేఁ బూజించెదను" అని యిట్లు రావణుఁడు చెప్పఁగానే ప్రహస్తుఁడు, శుకుఁడు, సారణుఁడు, మహోదరుఁడు, ధూమ్రాక్షుఁడు మొదలగువా రానదిలోనికి దిగిరి. మదపుటేనుఁగులవంటి యారాక్షసులచే క్షోభిత యగు నానది వామనాంజన పద్మాది దిగ్గజములచే క్షోభితయగు గంగానది ననుకరించియున్నది. తరువాత మహాబలులగు నారాక్షసు లానదిలో స్నానముచేసి యొడ్డెక్కి తమ యేలికయగు రావణుఁడు చేయఁబోవు శివభగవానుని పూజకై పుష్పములు తెచ్చిరి. శరత్కాలమేఘముతో సమానమై మనోహరమైన యానర్మదయొడ్డునముహూర్తమాత్రమున నారాక్షసులు పువ్వులుదెచ్చి యొకకొండంతరాశి పోసిరి. ఇట్లు పరిజనులు పూవులు తేఁగా రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు గంగలోనికి మహాగజము దిగిన ట్లానర్మదానదిలో స్నానార్థము దిగెను. అందులో స్నానముచేసి విధిగా జపింపవలసిన మంత్రములను జపించి యానదీజలమునుండి బయటికి వచ్చెను. ఒడ్డెక్కి తడివస్త్రములు వదలి తెల్లనివస్త్రముఁగు ధరించియున్న యారావణుఁడు చేతులు జోడించుకొని పోవుచుండఁగా రాక్షసులందఱును వెంటఁబడి పోవుచుండిరి. అప్పుడు వారు మూర్తిమంతములగు కొండలవలె నగపడుచుండిరి. ఆరావణుఁ డెచ్చటికిఁ బోయినను బంగరులింగమును దీసికొనియే పోవుచుండును. రావణుఁ డాలింగము నిసుకతిన్నియపై నుంచి షోడశోపచారములచేతఁ బూజించెను. ఈరీతిగా రావణుఁడు సత్పురుషుల యార్తిని హరించువాఁడును బలముఁడును శ్రేష్ఠుఁడును వరప్రదాతయుఁ జంద్రకలాభూషణుఁడునునగు శివభగవానుని బూజించి తన యిరువదిచేతులను జాచి యాయనయెదుటఁ బొడుచు నాట్యము ప్రారంభించెను.

32-వ సర్గము

అర్జునునిచే రావణుఁడు పట్టుపడుట

సుదారుణుఁడగు రావణుఁ డెచ్చోటఁ గూర్చుండి శివునకుఁ బూజ చేయుచుండెనో యచ్చటికి సమీపమునకే జయించువారిలో శ్రేష్ఠుఁడును, మాహిష్మతీపట్టణమునకుఁ బ్రభువునునగునర్జునుఁడు స్త్రీలతోఁగూడి నర్మదానదిలో జలక్రీడ చేయుచుండెను. ఆస్త్రీలమధ్యనుండి యాయర్జునుఁడు

వేలకొలఁది కరేణువులమధ్య సుండు మదపుటేనుఁగువలెఁ బ్రకాశించు చుండెను. ఆరాజు తనవేయి బాహువుల యుత్తమబలమును దెలిసికొంద మను నిచ్చచే నొక్కమాఱుగా నర్మదావేగము నడ్డుకొనెను. ఇట్లాతని చేతులచే నడ్డఁబడిన నిర్మలమగు నానదీజలము ముందునకుఁ బోవ వలను పడక వెనుకకు మరలినది. మీనములు మొదలగు జలజంతువులతోఁ గూడి సపుష్పకుశసంస్తరమగు నానర్మదానదియొక్క ప్రవాహవేగము వర్షాకాలమునందువలెనే ప్రకాశించుచుండెను.

ఇట్లానర్మదయొక్క వెనుకకు మరలినప్రవాహవేగము కార్తవీర్యార్జునునిచేఁ బంపఁబడినదివోలె రావణునిచే శివునకు సమర్పింపఁబడిన పుష్పోపహారమును హరించినది. అపుడు రావణుఁడు సగము ముగిసిన తన నియమమును విడిచి ప్రతికూలురాలైన కాంతనువలె నానదిని జూచెను. ఆనదీ ప్రవాహము పశ్చిమసముద్రమునకుఁ బోవునది యయ్యును దూర్పునకు మరలియున్నది. అంతకంతకు సముద్రము పొంగిపొఱలినవిధమున నానదీ ప్రవాహము వృద్ధిపొందినది. తరువాత రావణుఁడు తొందరపాటుపడు చున్న శకునములు గలిగి స్వభావోపపతిని బొంది నిర్వికారచిత్తము గల యంగనభంగిని గన్పట్టు నదిని జూచెను. అపుడు కుడిచేతివ్రేలిని జప్పుడు చేయుచు రావణుఁడు శుకసారణులను బిలిచి నదీప్రవాహము మరలు టకుఁ గారణము తెలిసికొని రమ్మనెను. ఇట్లు రావణునిచేఁ బంపఁబడిన యన్నదమ్ములు శుకసారణులిద్దఱును నాకాశమార్గముగాఁ బశ్చిమాభి ముఖులై బయలుదేఱి యర్ధయోజనమాత్రదూర మేగి స్త్రీలతో జల క్రీడ చేయుచున్న పురుషునిఁ జూచిరి. అతఁడు పెక్కుశాఖలు గల పెద్ద వృక్షమువలె నుండి నీటియందు విఱిజిమ్ముంబడిన తలవెండ్రుకలు గలిగి మదముచే నెఱ్ఱఁబడిన కన్నులు గలవాఁడై వేలకొలఁది ప్రత్యంతపర్వత ములచే భూమి నావరించియుండు కొండవలెఁ దనబాహుసహస్రముచే నర్మదానది నడ్డఁగట్టియుండెను. మఱియు నతఁడు మదించిన కరేణువుల సహస్రముచేనావరింపఁబడిన యేనుఁగుగున్నవలె నుత్తమస్త్రీసహస్రముచే నావరింపఁబడియున్నాఁడు. ఇట్టి యద్భుతతముఁడగు నాపురుషుని శుకసార ణులు చూచి మరలి వచ్చి రావణునితో నిట్లనిరి: "దేవా! అతఁడెవ్వఁడో కాని వెనుప్రాణివలె నున్నాఁడు. ఆనకట్టనలె నది కడ్డముగా నిలువబడి స్త్రీలను విహారింపఁజేయుచున్నాఁడు. అతని వేయిచేతులచే నడ్డంబడిన

జలముగలనది మాటిమాటికినిసముద్రమువలెనురుగుగ్రక్కుచుఁ బొంగు చున్నది." ఇట్లని చెప్పిన శుకసారణుల మాటలు విని రావణుఁడు వాఁడే కార్తవీర్యార్జునుఁ డనిచెప్పి యుద్ధమునందుఁ గోరికగలవాఁడై బయలు దేఱెను. రాక్షసాధిపుఁడగురావణుఁడు కార్తవీర్యార్జున కెదురుగా బయలు దేఱినతోడనే ప్రచండముగా దుమ్ము గాలి హోరు మనిపెద్దయుచు వీచి నది. మేఘము లుఱిమినవి. రక్తవర్షము గురిసినది. రావణుఁడు వానిని లక్ష్యపెట్టక మహోదరుఁడు, మహాపార్శ్వుఁడు, ధూమ్రాక్షుఁడు, శుకుఁడు, సారణుఁడు మొదలగువారితోఁగూడి వెంటనే యర్జునుఁ డున్న చోటికిఁ బోయి చేరెను. అప్పటి కతఁడు నర్మదలోనే యున్న వాఁడు. ఆఁడేనుఁగుల మధ్యనున్న మదపుటేనుఁగువలె వేలకొలఁది స్త్రీలతోఁ గూడియున్న యాయర్జునుని జూడఁగానే కోపించి కన్నులు జేవుర్పింప రావణుఁ డిట్లనియె :

"మంత్రులారా! మీరు వేగముగా రావణుఁడు యుద్ధమును గోరి వచ్చియున్నాఁడని యర్జునునితోఁ జెప్పుఁడు" అని మేఘగంభీరముగ నాయర్జునుని మంత్రులతోఁ జెప్పఁగానే, వారు రావణునిమాటలు విని యాయుధములు పట్టుకొని రావణునొద్దకు వచ్చి యిట్లనిరి : "రావణా! యుద్ధమునకు మంచిసమయము నాలోచించితివి. వహ్వారే! నీబుద్ధి మెచ్చఁ దగినది. ఎవఁడైనను మద్యపానమత్తునితోను స్త్రీలతోఁగూడియుండువాని తోను యుద్ధము చేయ నుత్సహించునా? యుద్ధధర్మములన్నియుఁ దెలిసిన నీవెట్లు స్త్రీలదగ్గఱ నుండఁగా మారాజుతో యుద్ధము చేయనెంచితివి? నీ రాక చూడఁగా నాఁడేనుఁగులమధ్య నున్న మదపుటేనుఁగు గున్న మీఁదికి వచ్చిన లేడిపిల్ల రాకవలె నున్నది. రావణా! ఇప్పటికి తమించి యీరాత్రి తెల్ల వాఱనిమ్ము. నాయనా! నీకంతగా యుద్ధమునందు శ్రద్ధ యున్నచో రేపు నీయిచ్చకు వచ్చినట్లుల నర్జునునితో యుద్ధము చేసికొందువు గాని ముందుగా మమ్ముఁ జంపియో, జయించియో తరువాత మాయేలికపైకిఁ బొమ్ము." ఇట్లు వారన్న వెంటనే రావణునిమంత్రులు కార్తవీర్యార్జునుని మంత్రులను గొందఱను యుద్ధములోఁజంపిరి. మఱికొందఱను భక్షించిరి. తరువాత నర్మదాతీరమున నర్జునుపగిచరులకును రావణునిమంత్రులకును దొమ్మిగా యుద్ధమైనది.అంతటను హాలహలాశబ్దము వ్యాపించినది. అప్పుడు బాణములు, తోమరములు, త్రిశూలములు, వజ్రకర్షణములు మొదలగు

వానిచేఁగొట్టి యంతటను వెంటఁబడుచు రావణుని వానిమంత్రులను బీడించిరి. అర్జునుని యోధుల వేగము జలజంతువులతోఁగూడిన సముద్రముధ్వని వలె నతిదారుణమైనది. రావణమంత్రులు ప్రహస్తుఁడు మొదలగువారు కోపించి యర్జునుబలమును దమతేజస్సుచే దహించివేయుచుండిరి. అపుడు మంత్రులతోఁగూడిన రావణునివ్యాపారమంతయుద్వారపాలకుఁబోయి జలక్రీడచేయు నర్జునునితోఁ జెప్పిరి. అతఁడామాటలు విని స్త్రీలను భయపడవలదనిచెప్పి వెంటనే గంగాజలమునుండి యేనుఁగువలె నర్మదాజలమునుండి యొడ్డెక్కెను. తరువాత నర్జునాగ్నిహోత్రుఁడు క్రోధదూషితనేత్రుఁడై ప్రళయాంతమందు మండినవిధమున నొక్కసారి మహాఘోరముగా మండెను. వరహేమాంగదుండగునతఁడు వేగముగా గదగొని చీఁకట్లను సూర్యుఁడు వెంటఁదవిలినవిధమున రాక్షసులను వెంబడించెను. అతఁడు తనభుజబలమంతయు మెఱయ గద గిఱగిఱఁ ద్రిప్పుచు మీఁదికివచ్చుచుండఁగాఁ బ్రహస్తుఁడు ముసలాయుధము చేఁబూని, వింధ్యుఁడు సూర్యుని మార్గము నడ్డినవిధమున నతనిమార్గము నడ్డుకొనెను. వెంటనే ప్రహస్తుఁడు మహాటోపముగాఁ దనచేతిముసలము నతనిపై విసరుచుఁ బ్రళయకాలపు మేఘమువలె ధ్వనిచేసెను. ప్రహస్తుఁడు పంపిన ముసలమునుండి పడినయగ్ని యశోకపుష్పముల రాశివలె దహించుచు నగపడెను. అపుడు నిరుపమానపరాక్రముఁడగు నర్జునుఁడు వచ్చిన ముసలమును దన గదతో రూపుమాపెను. తరువాతఁ దన గ్రొందువందల చేతులతోను గదను ద్రిప్పుచుఁ బ్రహస్తుని వెంటాడించెను. అపుడు బాగుగా గదచే దెబ్బలు దిన్న వాఁడై యింద్రునివజ్రముచేఁ గొట్టఁబడిన గట్టునట్టుల క్రిందఁబడిపోయెను. ఇట్లు ప్రహస్తుఁడు పడఁగానే మారీచుఁడు, శుకుఁడు, సారణుఁడు, మహోదరుఁడు, ధూమ్రాక్షుఁడు మొదలగువారు యుద్ధరంగమునుండి తొలఁగిరి. ప్రహస్తుఁడు పడుటయుఁ దక్కినవారు తొలఁగిపోవుటయుఁ జూచి రావణుఁడే యర్జును నెదుర్కొనెను. వేయిచేతులవానికిని, ఇరువదిచేతుల వానికిని మహాదారుణముగను రోమహర్షముగను యుద్ధము ప్రారంభమైనది. ఇట్లిద్దఱును సంరంభమునుబొందిన సముద్రములవలెను, మొదలుగదలిన పర్వతములవలెను, తేజోవంతులగు సూర్యులవలెను, మండుచుండు నగ్నిహోత్రములవలెను, మదించిన యేనుఁగులవలెను, వృషభములవలెను, గర్జించుచుండు మేఘములవలెను, బలోత్కటములగు

సింహాములవలెను, కోపించిన రుద్రాంతకులవలెను నున్న యారావణాగ్ర
నులు కోపించి యన్యోన్యమును మిక్కిలిగా గదలతోఁ గొట్టుకొనిరి.
ఒకగదాప్రహారము నొకరు ఘోరములగు వజ్రప్రహారములను గొండలు
సహించునట్లు సహించుచుండిరి. పిడుగులు పడినప్పుడు గలుగు చప్పుడు
వలె వారిగదాపాతములవలనఁ గలిగిన చప్పుడుచే దిక్కులన్నియుఁ బ్రతి
ధ్వనులిచ్చుచుండెను. అర్జునునిచేతిగద రావణునివక్షస్థలమునఁబడి మేఘ
ముపై మెఱుపువలెఁ బ్రకాశించెను. అట్లే రావణునిచేఁ బ్రయోగింపఁ
బడినగద యర్జునునిపైఁబడి కొండమీఁదను బడిన యుల్కవలెఁ బ్రకా
శించెను. రాక్షసరాజుగాని యర్జునుఁడుగాని ఖేదమును బొందరయిరి.
పూర్వము బలిచక్రవర్తికిని దేవేంద్రునికిని బలెనిట్లు వారిద్దఱకును ఘోర
ముగా యుద్ధము జరిగెను. రావణార్జునులు మహోవృషభములు కొమ్ముల
తోను, ఏనుఁగులు దంతములతోను బోరాడినట్లు పరస్పరము బోరాడి
కొట్టుకొనుచుండిరి. తరువాత నర్జునుఁడు కోపించి తన యాపచ్ఛక్తిని విని
యోగించి తనచేతి గదను గిఱగిఱఁ ద్రిప్పి రావణునివక్షముపైఁ బ్రయోగిం
చెను. వాఁడు వరదానముచే రక్షింపఁబడి యుండువాఁడగుటచే మీఁదఁ
బడినయాగద యేమియుఁ జేయఁజాలక దుర్బలమై రెండై క్రింఁబడిపోయి
నది. ఆదెబ్బ తగిలి రావణుఁడు ధనుస్సుపెట్టుమాత్రము దూరముగాఁ
దొలఁగిపోయి చతికిలఁ బడిపోయెను.

అపుడు రావణుఁడు విహ్వలుఁడైయుండుట చూచి యర్జునుఁడతి
వేగముగా సమీపించి గరుత్మంతుఁడు పామును బట్టుకొన్నట్లు ఆరావ
ణుని బట్టుకొనెను. అతఁడు తనవేయిచేతులతోడను బలాత్కారముగా
రావణుని బట్టుకొని, బలిని నారాయణుఁడు గట్టినట్లు గట్టివైచెను. రావ
ణుఁడు కటువడుచుండఁగా నంతరిక్షమునుండి సిద్ధులు మొదలగువారంద
రును సాధువాదములు చేయుచుఁగా గ్రహీతార్థుఁడగు నర్జునునిపైఁ బుష్పవర్షము గురి
పించిరి. అర్జునుఁడు పెద్దపులి లేడిని, సింహము గజమును బట్టినట్లు రావ
ణుని బట్టుకొని సంతోషముచే మాటిమాటికిని మేఘమువలె ధ్వని
చేసెను. అప్పటికిఁ బ్రహస్తుఁడు తెలివొంది కట్టువడి యున్న రావణుని
జూచి కోపించి రాక్షసులతోఁగూడి రాజుపై నెదుర్కొనెను. ఇట్లువచ్చు
చున్న రాక్షసులవేగము వర్షాకాలమున సముద్రాభిముఖములగు మేఘ
ముల వేగమును బోలి ప్రకాశించుచుండెను. వారు మాటిమాటికిని

విడువువిడువుమనియు నిలునిలుమనియుఁ బలుకుచు ముసలములు మొద
లగు నాయుధముల నర్జునునిపై విసర మొదలిడిరి. అతఁడు వానికి
సుంతేనియు జడియక నడుత్రోవలోనే వానిని వెంటనే గ్రహించెను.
మఱియు రాక్షసులను వారు ప్రయోగించిన యాయుధములతోడనే
భేదించి, వాయువు మేఘములను దూలించిన లీలను దూలించెను. అపుడు
కార్తవీర్యార్జునుఁడు రాక్షసులను బరువు లెత్తించి స్నేహితులు మొదలగు
వారితోఁగూడ రావణుని దీసికొని పట్టణములోఁ బ్రవేశించెను. ఇంద్ర
నితో సమానుఁడగు నా యర్జునుఁడు పౌరులచేఁ జల్లఁబడుచున్న పూవులు
మొదలగువానిచే నొప్పుచు నగరములోఁ బ్రవేశించెను.

31-వ సర్గము

పులస్త్యుఁడు రావణుని విడిపించుట

వాయువును బట్టుకొనుటతో సమానమయిన రావణుని పట్టుకొను
టను దేవతలు స్వర్గమందుఁ జెప్పఁగాఁ బులస్త్యబ్రహ్మ వినెను: మహాధైర్య
శాలియైనను నతఁడు పుత్రకృత స్నేహముచేఁ గంపించుచుఁ గార్తవీర్యార్జు
నుని జూచుటకుఁగా మాహిష్మతికి వచ్చెను. వాయువుతో సమాన
మయినగమనముగల యా ఋషి మనోవేగమున నంతరిక్షమార్గముననే
మాహిష్మతికి వచ్చెను. అతఁడమరావతితో సమానమయి హృష్టపుష్ట
జనాకీర్ణమయి యుండు నా మాహిష్మతిలో బ్రహ్మ యమరావతిలోఁ
బ్రవేశించినట్లు ప్రవేశించెను. క్రిందికి దిగిన సూర్యునివలె వెలుఁగుచుఁ
జూడ శక్యము గాకుండనున్న యా మునినిజూచి పరిజనులు తెలిసికొని
రాజుతో విన్నవించిరి. వారిమాటలు విని యర్జునుఁడు పులస్త్యబ్రహ్మయని
తెలిసికొని శిరస్సునంజలి గూర్చుకొని యా తపోధను నెదుర్కొనెను.
అతని పురోహితుఁడర్ఘ్యపాద్యములు సంగ్రహించుకొని యింద్రుని
ముందు బృహస్పతివలె బయలుదేఱెను. ఉదయించిన సూర్యునివలె
వెలుఁగుచున్న యాయననుజూచి భయసంభ్రమములతోఁ గూడినవాఁడై
యింద్రుఁడీశ్వరునికింబలె వందన మాచరించి యర్ఘ్యముపాద్యమునిచ్చి
గోవును నివేదించి యర్జునుఁడు సంతోషముతో గద్గదస్వరమునఁ బుల
స్త్యునితో నిట్లనియె.

"పులస్త్య భగవానులవారూ! తమ పాదారవిందముల సంస్పర్శ

మును బొందుటచే నేఁడు నా మాహిష్మతి యమరావతితో సమాన మయి నది. చూడ శక్యముగాని తమ దర్శనము లభించుటవలన నాకుఁ గుశ లము గలిగినది. నా జన్మము సఫల మయినది. నా వ్రతములు ఫలించినవి. నా తపస్సు సఫల మయినది. దేవతలచే నమస్కరింపఁబడుచున్న తమ పాదారవిందములకు వందనము చేయఁగలిగితిని. ఇంతకన్నను నా జన్మ మున కెక్కువ యేమిగావలయును? ఇదిగో రాజ్యము, వీరు నా పుత్రులు, వీండ్రు నా భార్యలు. నేను, మే మందఱమును దమయాజ్ఞను నెఱ వేర్చుటకు సిద్ధముగా నున్నారము ఏమి యాజ్ఞ? సెలవిత్తురుగాక!" అను రాజుమాటలు విని యాయన సంతోషించి ధర్మము, పుత్రులు మొదలగువారి క్షేమమడిగి హైహయ రాజగు నర్జునునితోఁ బులస్త్యుఁ డిట్లనియె: "నరేంద్రా! పద్మపత్రవిశాలాక్షా! పూర్ణచంద్రసమానవా! నాయనా! నీవు దశగ్రీవునిగూడ జయించితివి గనుక, నీ బలము నిరుప మాన మయినదని చెప్పక తప్పదు. ఎవనికి భయపడి సముద్రము గాలి చలింపకుండ నుండునో యట్టి నా మనుమని, రణములలో జయింపఁదగని వానిని రావణుని నీవు జయించి కట్టియుంచితివి. నా మనుమని కీర్తిని నీవు గ్రావి నీ పేరు ప్రసిద్ధినొందఁ జేసికొంటివి. నా మాటను మన్నించి, వత్సా! దశాననుని విడిచిపెట్టుము." అను పులస్త్యుని మాటలు విని యర్జు నుఁడు మాఱుపలుకక సంతోషపూర్వకముగా రావణుని విడువలచేసెను. మఱియు నా యర్జునుఁడు దేవతలకుఁ బరమ శత్రువగు రావణుని విడిచి దివ్యములయిన యాభరణములు పూవులదండలు వస్త్రములు మొదలగు దానిచేఁ బూజించి గౌరవించి యగ్నిసాక్షికముగా హింసలేని స్నేహము చేసికొని బ్రహ్మసుతుఁడగు పులస్త్యునికి నమస్కరించి గృహాముఖముగూర్చి పోయెను. ఇట్లు ప్రతాపవంతుఁడగు రావణుఁడు పులస్త్యునిచే విడువఁ చేయింపఁబడి తా నోటమిని జెందుటచే సిగ్గుపడుచుఁ దాతకు నమస్కరించి యాయనచేఁ గౌఁగిలింపఁబడి యనుజ్ఞాతుఁడాయెను. పితామహుని మానస పుత్రుఁడగు పులస్త్యమహాముని మనుమఁ డగు దశగ్రీవుని విడువఁ చేయించి వెంటనే బ్రహ్మలోకమునకుఁ బోయెను. రామా! ఇట్లు రావ ణుఁడు కార్తవీర్యార్జునునివలనఁ బట్టువడి తరువాతఁ దనపితామహుఁడగు పులస్త్యునిచే విడిపింపఁ బడెను. కనుక నిట్లే యొకరికన్న నొకరు బల వంతులు గలరు. ఇతరుల విషయమున నవమానము చేయరాదు. అట్టి

వానికి మేలు గలుగదు. తరువాత రాక్షసరాజు సహస్రబాహునితో స్నేహము సంపాదించుకొని మరల రాజులతో యుద్ధము చేయు తాత్పర్యముతో గర్వించి భూమిపైఁ దిరుగుచుండెను.

34-వ సర్గము

రావణుఁడు వాలిచేఁ బట్టువడుట

రాక్షసాధిపతియగు రావణుఁ డిట్లర్జునునిచే విడువఁబడి విచారము లేకుండ భూమియం దంతటను దిరుగుచుండెను. రాక్షసుఁడుగాని మనుష్యుఁడుగాని బలవంతుఁడెచ్చటనున్నట్లు దెలిసిననుబోయి గర్వించి వానిని యుద్ధమునకు రమ్మని పిలుచుచుండెడివాఁడు. తరువాత నొకసారి వాలి పాలితమగు కిష్కింధకుఁబోయి హేమమాలియగు వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. ఇట్లు యుద్ధోత్సుకుఁడైవచ్చిన రావణునిజూచి వాలికి మంత్రియగు తారుఁడను వానరుఁడిట్లనియె: "రావణా! నీతో యుద్ధముచేయఁ జాలినవాలి ప్రస్తుత మూరఁలేఁడు. ఇఁక దక్కినవానరులు నీయెదుట నిలువఁబడఁగలరా? వాలి నాలుగు సముద్రములలోను సంధ్యావందన మాచరించియిపుడే వచ్చును. ముహూర్తమాత్రముతాళుము. శంఖముల రాశివలెఁ దెల్లనైన యీ యెముకల ప్రోవులను జూచితివిగదా! వాన రాధిపుఁడగు వాలితో యుద్ధము గోరివచ్చిన నీవంటి బల గర్వితులవే చుమా యివి. నీవొకవేళ నమృతము ద్రావినవాఁడవే కావచ్చును. అయినను వాలి నెదుర్కొనువఱకే నీజీవితమని నమ్ముము. విశ్రవఃపుత్రా! ఇపుడే నీవు జగచ్చిత్రమును జూడుము. ఈయొక్కముహూర్తముమాత్రముండుము. ఇట్టిది మఱి నీకు దుర్లభము గదా! ఒకవేళ నీవు మరణించుటకుఁద్వరపడుచుంటివేని దక్షిణ సముద్రమునకుఁ బొమ్ము. అచటనే భూమియందున్న సూర్యునివంటివానిని వాలిని జూచెదవు.

లోకరావణుఁడగు రావణుఁడు తానుని నిందించి వెంటనే పుష్పకమెక్కి దక్షిణ సముద్రమునకుఁ బోయెను. అచ్చట మేరుపర్వతమువంటి వాఁడును, ఉదయించిన సూర్యునివంటి ముఖము గలవాఁడును, సంధ్యోపాసనాపరుండును నగు వాలిని రావణుఁడు చూచెను. కాటుకకొండవంటి రావణుఁడు వెంటనే పుష్పకమునుండిదిగి వెనుకనుండి పాదములు చప్పుడు గాకుండ వాలిని బట్టుకొనుటకు సమీపించెను. పట్టుకొనుటకు సిద్ధముగా

నుండునప్పటికి వాలిహతాత్తుగావెనుకకుందిరిగి రావణునిజూచి వానిదురు
ద్దేశమును గ్రహించియేమియు నెఱుంగనివానివలె నూరకుండెను. చెవుల
పిల్లినిజూచి సింహము, పామునుజూచి గరుత్మంతుడు లక్ష్యముసేయనట్లు
పాపనిశ్చయుండగు రావణుని వాలి లక్ష్యము సేయఁడాయెను. ఇట్లు
పాపోద్దేశముగలిగి తన్నుఁ బట్టుకొనుటకు వచ్చుచున్న రావణునిఁ "జటు
క్కున నేనే పట్టుకొని కక్షమునం బిఱికించుకొని తక్కిన మూఁడు సముద్ర
ములకును బోయెదను. మఱియు నీ రావణుఁడు నాకక్షమునందు శిథిల
శిథిలములగు నవయవములుగల్గి గరుత్మంతుడు పట్టిన పామువలె వ్రేలాడు
చుండఁగా నెల్లరును జూతురుగాక" యని తనలో నాలోచించుకొనెను.
ఇట్లాలోచించి వాలి మౌనావలంబియై వేదమంత్రములు జపము చేసి
కొనుచుఁ బర్వతరాజువలెనుండెను. వాలిరావణు లొకరినొకరు పట్టుకొంద
మని యాలోచించి బలదర్పితులై యందుల కుపక్రమించిరి. వాలి రావ
ణుని కాలిచప్పుడు విని చేతికి దొరకుపాటి దూరమునందే యున్న వాఁ
డని తెలిసికొని పరాఙ్ముఖముగానుండియే గరుత్మంతుఁడు పామును బట్టు
కొన్నట్లు లా రావణుని బట్టుకొనెను. తన్నుఁ బట్టుకోదలఁచిన రావణుని
చానే పట్టుకొని వాలి చంక నిఱికించుకొని యతివేగముగానంతరిక్షమున
కెగిరెను. రావణుఁడు తన్ను మాటిమాటికిని గోళ్లతోను దంతముల
తోను బాధించుచున్నను లక్ష్యముసేయక గాలి మేఘమునువలె నెత్తు
కొనిపోయెను.

తరువాత రావణుని మంత్రులు రావణుని విడిపించుటకై కేకలు
వైచుచు వాలిని వెంటాడించిరి. వాఁడు వెంటఁ బోవుచుండఁగా నాకాశము
మధ్యమునందుండి వాలి మేఘములు వెంటఁబడిన సూర్యునివలెఁ బ్రకా
శించుచుండెను. ఆరాక్షసోత్తములు వానిని గలిసికొనఁజాలక చాలనలసి
పోయి వెనుకకు మరలిపోయిరి. లేనిచో జీవనముపై నాసగలవాఁడెవఁ
డైనను వాలితో డీకొనఁగలఁడా ? పక్షులుగూడఁ జేరరాని సముద్రము
లకుఁబోయి సకాలమున వాలి సంధ్యావందన మాచరించెను. మొదట
దక్షిణ సముద్రమునుండి పశ్చిమసముద్రమునకుఁ బోవుచుండఁగా నాకాశ
మునందు సంచరించు భూతములన్నియుఁ గొనియాడుచుండెను. సరావ
ణుఁడై వాలి యచట దిగి స్నానముచేసికొని సంధ్యాదికృత్యములు
ముగించి మరల రావణుని మోసికొనుచు నచ్చటనుండి యుత్తరసముద్ర

మునకు బయలుదేఱెను. అనేకయోజనములదూరముగల యాయుత్తర సముద్రమునకు సరావణుఁడై వాయువేగమనోవేగములతోఁ బోయి చేరెను. అచ్చట స్నానాదికృత్యములు దీర్చుకొని యెప్పటియట్ల తూర్పుసముద్రమునకుఁ జేరెను. హరీశ్వరుఁడగువాలి యచ్చటను సంధ్యా వందనాదికమును జేసికొని కిష్కింధకు బయలుదేఱెను. ఇట్లు వాలి నాలుగుసముద్రములలోను నిత్యకృత్యములు దీర్చుకొని రావణుని మోయుటచే నలసటపొందినవాఁడై కిష్కింధలోని యుద్యానవనములోఁ బడెను. అపుడు తనకక్షభాగమునందున్న రావణుని విడిచెను. "రావణా! ఎచ్చటినుండి వచ్చుచున్నావోయీ!" యని నవ్వుచు మాటిమాటికి నమగ మొనలిడెను. శ్రమచేతఁ గన్నులు తలక్రిందు లగుచుండఁగా రావణుఁడు మిక్కిలి యాశ్చర్యముతోఁ గూడినవాఁడై వాలి కిట్లనియె:

"వానరేంద్రా! మహేంద్రసమవిక్రమా! నేను రాక్షసరా జగు రావణుఁడను. నేను యుద్ధముగోరి యిట వచ్చితిని. అట్టినన్ను నీవు పట్టు కొంటివి. ఓహో! ఏమి నీబలము! ఆహా! ఏమి నీపరాక్రమము! బళిరే! నీగాంభీర్యము! నీవు నన్నుఁ బశువును బట్టుకొన్నట్టు పట్టుకొని నాలుగు సముద్రములలోను ముంచితివి. మహావీరా! ఈరీతిగా విశ్రాంతి లేకుండ నతివేగముగా నాలుగుసముద్రములలోను నన్ను మోసికొనిపోయి ముంచినవానిని నినొక్కనినే చూచితిని. నీకుందక్కఁ దక్కినవారి కెవ్వరి కేని నిట్లుచేయ శక్యమగునా? నే నిదివఱలో నిట్టిగమనవేగము మనస్సు గాలి గరుత్మంతుఁడు నను మువ్వురకేకలదని యనుకొంటిని. ఇపుడు నాలవ వానిని నిన్నుఁ జూచితిని. నేనిపుడు నీబలపరాక్రమములు చూచి యగ్ని సాక్షికముగా నీతోఁ జిరకాలమువఱకును స్నేహము చేయఁ దలంచు చున్నాను. వానరేంద్రా! భార్యలు, పుత్రులు, పురము, రాష్ట్రము, భోగములు, భోజనములు మొదలగునవన్నియు మన కిట్టిపై నవిభక్తము లైయుండవలయునని నాకోరిక" అని రావణుఁడన్న వెనుక నగ్నిని ప్రజ్వ లింపఁజేసి పరస్పరమును గౌఁగిలించుకొని భ్రాతృస్నేహమును బొందిరి. ఒకరిచేయి యొకరు పట్టుకొని సంతోషించుచు సింహాములు కొండగుహ లోఁ బ్రవేశించినట్లు కిష్కింధలోఁ బ్రవేశించిరి. ఆరావణుఁడు కిష్కిం ధలో సుగ్రీవునివలెనే యొక నెలవఱకు నివసించెను. మూఁడులోకములను ధ్వంసము చేయఁదలఁచిన మంత్రులు వచ్చి రావణుని చాల గౌరవించి

లంకకుఁ బిల్చుకొనిపోయిరి. ఈరీతిగా రావణునకును వాలికిని బూర్వము జగిగినది. వాలి ముందుగా రావణునిధర్షించి తరువాత నగ్నిసాక్షిగముగా స్నేహము పట్టి తమ్మునివలె నాచరించెను. రామా! వాలిబలము నిరుపమానమైనది. అట్టివాలిని నీవు నిమిషమాత్రములో నగ్ని మిడుతను దహించినట్లు దహించితిని.

35-వ సర్గము

హనుమంతునిజననము

ఇట్లు చెప్పిన యగస్త్యునిమాటలు విని యప్పుడు శ్రీరాముఁడు చేతులు జోడించుకొని వినయముగా నిట్లని యగస్త్యునడిగెను. "అగస్త్య భగవానులవారూ! వాలి రావణుల బలము నిరుపమానమైనది. కాని హనుమంతునితో వీరు సమానులు గారని తలంచెదను. శౌర్యము, దక్షత, బలము, ధైర్యము, ప్రాజ్ఞత, నయసాధనము, పరాక్రమము, ప్రభావము మొదలగు గుణములు హనుమంతునియందుఁ గలవు. సముద్రమును జూచి వ్యాకులపడుచున్న వానరసైన్యమును జూచి యోదార్చి మాటలు యోజనములు దాఁటినవాఁడు. లంకాపురమును ధర్షించి యపుడు రావణునియంతిపురిలోనికిఁబోయి తరువాత సీతను జూచి మాటలాడి యోదార్చెను. సేనానాయకులను, మంత్రికుమారులను, కింకరులను, రావణునికుమారుఁడగు నక్షుని హనుమ యొక్కడే చంపెను. మరల బంధవిముక్తుఁడై రావణుని భయపెట్టి యగ్ని భూమిని దహించినట్లు లంకను భస్మముపాలు చేసెను. యుద్ధములో హనుమంతునికిఁగలకర్మములు యమునకు, దేవేంద్రునకు, విష్ణునకుఁ, గుబేరునకుఁగూడ లేవని తలంచెదను. ఇట్టి హనుమంతుని బాహుపరాక్రమముచే నాకు లంక, సీత, లక్ష్మణుఁడు, జయము, రాజ్యము, మిత్రులు, బంధువులు దొరకిరి. సుగ్రీవునిసఖుఁడగు నాంజనేయుఁడే మాకు దొరకనినాఁడు జానకి సంగతియే మాకుఁ దెలియకుండునుగదా! అట్టియాంజనేయుఁడు సుగ్రీవునికి మేలుచేయుతలంపుతో వైరముపుట్టగానే వాలిని లతను దహించిన క్లొందులకు దహింపకుండెను! లేదు లేదు. హనుమంతుఁడు తనబలమును దాను దెలిసికోఁజాలకుండెనని తలంచెదను. అట్లే కానినాఁడు తనకుఁ బ్రాణములకంటెను బ్రియుఁడగు సుగ్రీవుఁడు కష్టములపాలగుచుండఁగాఁ జూచుచు నూరకయుండునా?

భగవానులవారూ ! హనుమంతుని విషయమున నాకు సందియముగా నున్నది గాఁబట్టి తాము విస్తరించి యథార్థమైనసంగతియంతయు నెలవీయవలయును" అని హేతుయుక్తముగ నడిగిన శ్రీరామునిమాటలు విని హనుమంతుని సమక్షమునసే యతఁడతనితో నిట్లనియె.

రామా! నీవు హనుమంతుని విషయమై యడిగినది యంతయు నిజమే. హనుమంతునివంటి బలముగాని గమనశక్తిగాని బుద్ధిగాని మఱొకరికి లేదనుట వాస్తవము. కాని ముసలీతనికి బాల్యమున శాప మిచ్చిరి. కావుననే యరిమర్దనుఁడగు నీహనుమంతుఁడు తనబలమును దాఁ దెలిసికోఁజాలకపోయెను. బాల్యమునం దితఁడు చేసినపనులు వర్ణించుటకు శక్యముగాదు. అపుడు బాలుఁడగుటచే నీతఁడును దెలిసికొని యుండఁడు. ఆసంగతియంతయు వినవలయు ననికోరికయున్నచో సావధానమనస్కుఁడవై వినుము చెప్పెదను. సూర్యునిచే నీయఁబడిన వరముచే సువర్ణసదృశమైన మేరువుపర్వతము గలదుగదా! ఆపర్వతముపై నతనితండ్రియగు కేసరి యను నతఁడు రాజ్యమేలుకొనుచుండెను. ఆతని కంజన యను భార్య గలదు. ఆమెయందు వాయుభట్టారకుఁడీహనుమంతుని గనెను. బాల్యగ్రమువలెఁ బింగళవర్ణముగల యీతని నామె ప్రసవించి యొకచోఁ బరుండఁబెట్టి ఫలములు దెచ్చుటకై యడవికిఁ బోయినది. ఇతఁడు తల్లివియోగముచేతను, ఆఁకలిచేతను జాలఁబీడితుఁడై శరవణమందుఁ గుమారస్వామివలె నేడువ మొదలిడెను. అపుడు జపాపుష్పమువలె నెఱ్ఱఁగా సూర్యభగవానుఁడుదయపర్వతమం దగపడెను. ఆయనను జూచి యీమహానుభావుఁడు పండనుకొని సూర్యునిఁబట్టుకొనుటకై యెగిరెను. బాలార్కుని కభిముఖముగా మూర్తిమంతుఁడగు రెండవబాలార్కునివలె నాకాశమధ్యమునఁ బోవుచుండఁగా శైశవదశలో నున్న యీతనిఁజూచి దేవతలు, దానవులు, యక్షులు మొదలగువారు మిగుల నాశ్చర్యపడిరి. అపుడితనిగమనవేగము వాయువునకుఁగాని గరుత్మంతునకుఁగాని లేదు. ఇంతటిశిశువై యే యిట్లెగురుచున్నాఁడే! ఇతఁడు పెద్దవాఁడైనచో నెంతవేగము గలవాఁడగునో యని చూచినవారందఱును దలంచిరి. అట్లెగురుచున్నపుత్రునితోఁగూడ వాయుభట్టారకుఁడును సూర్యదాహభయమునుండి రక్షించుచు నుంచుబిందువులచేఁ జల్లనగుచు వెంటఁబోయెను. అట్లు తనబలమువలనను, తండ్రిబలమువలనను

బహుయోజనము లతిక్రమించి మెల్లఁగా సూర్యునిసమీపమును బొం దెను. "ఇతఁడు శిశువు. ఏపాపమును నెఱుఁగనివాఁడు. మఱియు నితని వలన ముం దనేకమహాకార్యములు గావలసియున్నవి" అని యాలో చించి సూర్యుఁ డీతనికిఁ దనవేఁడిమిని జూపకుండెను. ఇత్తఱి డేదినమున సూర్యునిఁబట్టుకొనఁబోయెనో నాఁడే రాహువు సూర్యునిఁబట్టుకొనుదిన మగుటచే సూర్యునిరథమువై నగపడెను. రామా! ఏమని చెప్పఁగలను? అంతట నితఁడు సూర్యునివిడిచి రాహువువై పునకుఁ దిరుగునప్పటికిఁజం ద్ర సూర్యులను బీడించురాహువు భయపడి పాఱిపోయెను. ఇట్లు పాఱి పోయి తిన్నఁగా దేవేం ద్రునిభవనమునకుఁ జేరి, కోపించి కన్ను లెఱ్ఱఁజేసి కనుబొమలు ముడివడుచుండ దేవసంఘముతోఁ గూడియున్న యింద్రుని జూచి యి ట్లనియె :

"ఇంద్రా! ఆఁకలి దీర్చుకొనుటకుఁగాఁ జంద్ర సూర్యులను నాకిచ్చి యిపుడేమి మఱల మఱియొకని కిచ్చితివి? నేఁడు నేను బర్వకాలముగదా యని సూర్యునిఁబట్టుకొనుటకుఁ బోయితిని. ఇంతట మఱియొకరాహువు వచ్చి సూర్యునినేకాక నన్నును గూడఁ బట్టుకొనఁబోయెను. ఇట్లుచేయుట నీకుఁ దగునా?" అను రాహువాక్యములు విని యింద్రుఁడు తొంప రతోఁ గూడినవాఁడై బంగరుమాలిక చేతఁబట్టుకొని సింహాసనమునుండి యెగిరెను. తరువాత కైలాసశిఖరమును బోలి నాలుగుదంతములచే నొప్పుచు మదము స్రవించుచు నున్న తమ్మై యలంకరింపఁబడియున్న యైరా వతముపైఁగూర్చుండి, రాహువును బురస్కరించుకొని యూహనుమంతు నితోఁగూడియున్న సూర్యునియొద్దకు వచ్చెను. అపుడు మిక్కిలి తొంద రతోఁ గూడినవాఁడై రాహువు దేవేం ద్రుని విడిచి సూర్యునిదగ్గరకు వచ్చుచుండఁగా నతఁడుచూచి రాహువును పండనుకొని సూర్యునివిడిచి మరల వానిపైకిఁ బరుగెత్తెను. అట్లు సూర్యునివిడిచి తనమీఁదకుఁ బరు గెత్తుకొని వచ్చుచున్న యితనినిజూచి రాహువు పరాఙ్ముఖుఁడై యింద్రుని శరణుచొచ్చెను. "ఇంద్రా! ఇంద్రా! రక్షించుము రక్షించుము" అని మొఱ్ఱపెట్టెను. అదివఱకే రాహువుయొక్క యేడుపు వినుచున్న వాఁడు గనుక నింద్రుఁడు రాహువును జూచి నీవు భయపడకుము. నేను వీనిని జంపెదను; చూచుచుండుమనెను. అంతట నీహనుమవెనుకకుఁదిరిగి యైరా వతమును జూచి యిది యొకతెల్లనిపండు వచ్చినది. చాలఁ బెద్దది యని

తలంచి యేనుఁగుమీఁది కెగురఁబోయెను. అట్లు తెల్లయేనుఁగును బట్టు కొనుటకుఁ బరుగెత్తుచున్న యితనిరూపము ముహూర్తమాత్రముమహా ఘోరముగా నుండెను. అట్లు పరుగెత్తుకొని వచ్చుచున్న యితనిపై నింద్రుఁడంతగాఁ గోపింపక మెల్లఁగాఁ దనచేతిలో నున్న వజ్రాయుధ ముతో నితని గొట్టెను.

తరువాత నితఁడు దేవేంద్రునివజ్రముచేఁ గొట్టఁబడి యొకకొండ మీఁదఁ బడెను. అప్పు డీతని రొడమదవడ క్రిందఁబడినప్పుడు నలిగి పోయినది. తనకొడు కట్లుదెబ్బతిని వివశుఁడై పడియుండుటచూచి వాయు దేవుఁ డింద్రునిపైఁ గోపించి ప్రజలకుఁ గష్టము గలుగునట్లుగాఁ దనప్రచా రమును నిరోధించి యీతనిదీసికొని కొండగుహలోఁ బ్రవేశించియుండెను. దేవేంద్రుఁడు వర్షమును నిరోధించినట్లు వాయుదేవుఁడు దనసంచారమును నిరోధించినతోడనే ప్రాణిమాత్రమున కెల్ల మూత్రపురీషములు నిలిచి పోయినవి. ఎవ్వరికిని గదలుటకు శక్తిలేకపోయినది. ఊపిరి యాడుటయే లేదు. వాయుప్రకోపమువలన సర్వభూతములును నిరుచ్ఛ్వాసములై కట్టెబొమ్మలతో సమానమైపోయినవి. మఱియు బ్రహ్మాండమంతయు నిస్సార్థ్యాయవషట్కారము, నిర్వ్యాపారము, ధర్మశూన్యమునై నరకమం దున్నట్లయిపోయినది. తరువాత గంధర్వులు, దేవతలు, రాక్షసులు, మను ష్యులు మొదలగువారు చాలదుఃఖితులై యెట్లేని సుఖము గలుగునేమో యను నాశచే మెల్లఁగా బ్రహ్మదేవునిదగ్గరకుఁబోయిరి. అట్లు మహోదరు లున్న, లంబోదరులును నై వచ్చి తనయెదుట జేతులు జోడించుకొని "దేవా! నీవు నాలుగువిధములైన ప్రాణిజాతమును సృజించితివి. మఱియు మాయాయువులకు వాయువును యజమానునిగాఁ జేసితివి. అట్టివాయువు మాకుఁ బ్రాణేశ్వరుఁ డయ్యును నెందువలననో కాని తనసంచారము నరి కట్టి, యంతఃపురములో స్త్రీల నరికట్టి దుఃఖమును గలిగించునట్లు మాకు దుఃఖమును గలిగించుచున్నాఁడు. వాయుపీడితులనుగుటచే మేమిపుడు నిన్ను శరణు చొచ్చితిమి. మాదుఃఖముల నెప్పుడును పోఁగొట్టుచున్న యో దేవా! ఇప్పుడు మాకు వాయుప్రకోపమువలనఁ గలిగిన దుఃఖమును బోఁగొట్టి బ్రదికింపుము" అను ప్రజలమొఱ్ఱలను బ్రహ్మ వారితో నందులకుఁ దగినకారణము దివ్యదృష్టినిఁజూచి యిట్లనియె: "ప్రజలారా! ఏకారణము వలన మీ కిట్టిబాధ కలిగినదో సావధానముగా వినుఁడు. అది యిప్పుడు

తప్పక వినఁదగినది. ఇంద్రుఁడు తన వజ్రాయుధముచే వాయువుకొడుకును గొట్టెను. రాహువుచెప్పిన చెప్పుడుమాట నాయింద్రుని కంతకోపమును గలిగించినది. తనకొడుకును గొట్టి పడవై చెనుకోపముచే వాయు వలిగి దాఁగియున్నాఁడు. అతఁడేకదా అశరీరుఁడై మాయిమా శరీరములలో నుండి పాలించుచున్నాఁడు! అట్టిశరీరములో వాయు వెప్పుడుండదో అప్పుడే యవి కట్టెలతో సమానము లై పోవును. వాయువే ప్రాణము. సుఖము వాయువే. అది యిది యన నేల? ఈ బ్రహ్మాండము వాయువశమే యై యున్నది. వాయువు విడిచిన వెనుక నీజగమునకు సుఖమెక్కడిది? చూచి తిరిగచా! ఇపుడే వాయువు జగత్తును విడిచెను. వెంటనే జగత్తంతయుఁ గట్టెలతోను రాళ్లతోను సమానమైపోయినది. కావున మనమందఱమును గలసి మనకింత దుఃఖమును గలగించుచున్న యీవాయు వెచ్చట డాఁగి యున్నవాఁడో అచ్చటికిఁ బోవుదము రండు. ఇప్పుడు మన మాతనిని బ్రసన్నునిఁ జేసికొనకుందు మేని వినాశమును దప్పక పొందుదుము." అని బ్రహ్మ తనయొద్దకు వచ్చిన ప్రాణివర్గమును వెంటఁబెట్టుకొని యింద్రునిచే దెబ్బలు తిన్నకొడుకు నెత్తికొని వాయు వెచ్చట నుండెనో యచ్చటికిఁ బోయి సూర్యునితోను, అగ్నితోను, బంగారుతోను సమానమైన కాంతి గల కొడుకును దొడలపై నిడుకొని యున్న వాయువును నీతనిని జూచి బ్రహ్మ తనతో వచ్చిన యందఱితోడనుగూడి యితనిపై దయ చూపించెను.

36-వ సర్గము

హనుమనివఁగలాభాదికము

తరువాతఁ బుత్రవధచేఁ బీడితుఁడై యున్న వాయువు బ్రహ్మదేవుని జూచి శిశువు నెత్తికొని యెదుటకువచ్చి, కుండలాద్యలంకారములు ప్రకాశించుచుండఁగా మూఁడురూపములవాఁడగు నా బ్రహ్మపాదములమీఁదను బడెను. లంబాభరణశోభితమగు చేతితో బ్రహ్మ వాయువును నెత్తి కూర్చుండఁబెట్టి యాశిశువును చేతితో నిమిరెను. బ్రహ్మచేయి తగులుటయే తడవుగా నాశిశువు వాడినసస్యముపై వర్షముగురిసినప్పటివలె వెంటనే జీవమును బొంది యంచముగా నగపడెను. ఇతనికిఁ బ్రాణము రా వేగమే వాయుదేవుఁడు సంతోషించి యెప్పటియట్ల సంచరింప మొదలిడెను. తరువాతఁ బ్రజలందఱును శీతవాతవినిర్ముక్తములైన పద్మినులు సాంబుజము

లైనట్లు సంతోషించుచుండిరి. తగువాత త్రియుగ్ముండును, త్రికకుత్తును, త్రిధాముండును, త్రిదశార్చితుండును నగు బ్రహ్మదేవుండు వాయువునకు మేలుచేయు తలంపుతో నిట్లనియె: "ఇంద్రాదిదిక్పాలులారా! మీరందఱును నెఱిగినవారేనైనను మీకు హితము చెప్పుచున్నాను, వినుండు. ఈశిశువునలన మీకుఁ గావలసినకార్యములు చాలఁగలవు. కనుక మీరందఱును వాయుదేవుని సంతోషమునకై యీశిశువునకు వరముల నిత్తురుగాక!" అని బ్రహ్మచెప్పఁగానే, దేవేంద్రుఁడు ప్రేమతోఁ గూడిన వాఁడై పద్మమాలను దీసి యిట్లనియె: "నాచేతితో విడువఁబడిన వజ్రముచే నీతనిహానువునకు దెబ్బ తగిలినది గనుక నీకపిశ్మశ్రూలుండు హనుమంతుఁడనిపేరుగలవాఁడగును. మఱియు నిటుపైని నావజ్రముతో నీతనికేవిధమైనబాధయుఁ గలుగకుండుఁగాక" యనియు నేను వరమిచ్చుచున్నాను. పిదపఁ జీకటి పోఁగొట్టు సూర్యుఁ డిట్లనియె: "నేనితనికి నాతేజస్సులలో నూఅవవంతుతేజ స్సిచ్చుచున్నాను. మఱియు నితనికి శాస్త్రము లభ్యసించు వయసు వచ్చినపిమ్మట గొప్పవక్త యగునట్లు విద్యాదానము చేయుదును. ఇతనితో సమానమైన పండితుఁ డిక నొకఁడుండఁబోఁడు: తరువాత వరుణుఁ డిట్లనియె: "పదివేలసంవత్సరములయినను నాపాశములచేతనుగాని, జలముచేతనుగాని యితనికి మృత్యువులేదు." తరువాత "నాదండమువలన నితనికిఁ జావులేదు. ఎప్పుడును నారోగ్యవంతుఁడై యుండును. యుద్ధములలో విషాద ముండదు" అని యముఁడు సంతోషించి వరమిచ్చెను. "నాగద యితని నేమియు బాధింపఁజాల"దని సంతోషపూర్వకముగాఁ గుబేరుఁడు వర మిచ్చెను. "నావలనఁగాని నాయాయుధమువలనఁగాని, యితనికిఁ జావులే"దని శంకరుఁడు వరమిచ్చెను. "సమస్తమైనబ్రహ్మదండములకును వధ్యుఁడు గాఁడనియు, దీర్ఘాయుష్మంతుఁడగు"ననియు బ్రహ్మదేవుఁడు వరమిచ్చెను. అంత బాలసూర్యనితోఁ సమానుఁడైయుండు శిశువును జూచి విశ్వకర్మ యిట్లనియె: "నాచేఁ జేయఁబడిన యాయుధములు యుద్ధములలో నితని నేమియుఁ జేయఁజాలవు. మఱియు దీర్ఘాయుపు గలవాఁడైయుండును." అనఁగానే బ్రహ్మదేవతలవరముచే నలంకృతుఁడైయున్న కుమారునితోఁ గూడిన వాయువును జూచి సంతోషించుచు నిట్లనియె: "మారుతా! ఈమారుతి శత్రువులకు భయంకరుఁడును, మిత్రులకు సంతోషము గలిగించువాఁడును,

నెవ్వరిచేతను జయింపఁదగనివాఁడును, కామరూపుఁడును, కామగమనము గలవాఁడును, ఎచ్చటికిఁ బోఁదలఁచినను నడ్డులేనిగతి గలవాఁడును, కీర్తిసం పన్నుఁడునునయియుండును. మఱియు రావణునినాశమునకును రాముని సంతోషమునకును నుపయోగించునవియు రోమహర్షణకరణములును నగు నత్యద్భుతకర్మములను యుగ్మములలోఁ జేయుచుండును" అని యిట్లు వాయువును సంతోషపఱిచి బ్రహ్మాదిదేవతలందఱును దమతమ నివాసము లకుఁ బోయిరి. ఆవాయుభట్టారకుఁడును కొడుకునెత్తికొని యింటికి వచ్చి యంజనాదేవితో జరిగిన వృత్తాంతమంతయుఁ జెప్పి యచ్చటినుండి యెం దేనిఁ బోయెను: "రామా! అట్లితఁడు వరములను బొంది జలముతో సముద్రుఁడు నిండియున్నట్లు బలముతో నిండియుండెను. అట్లు బలాధిక్య ముచేఁ బూర్ణుఁడై యీవానరపుంగవుఁడు నిర్భయుఁడై యాశ్రమముల లోని మునీశ్వరుల కపరాధము చేయుచుండెను. వారిస్రుక్కులను, భాండములను, అగ్నిహోత్రములను, నారచీరలను, -కృష్ణాజినములను బాడుచేయుచుండెను. బహుబలుఁడై యిటువంటిపనులు చేయుచుండఁగా నితనివరములు మొదలైనవి వినియున్న వారు గనుక మునులు క్షమించు చుండిరి. తరువాత కేసరియు వాయుదేవుఁడును నిషేధించుచున్నను నీ యాంజనేయుఁడు మర్యాద నతిక్రమించుచునేయుండెను. తుదకు మహా ర్షులు సహింపఁజాలక క్రుద్ధులై యిట్లని శపించిరి: "వానరా! నీ వేబలము నాశ్రయించి మమ్ములను బాధించుచున్నావో, ఆ బలమును మాశాపము వలన మోహితుఁడవై చాలఁగాలమువఱకును దెలియఁజాలకుండుదువు గాక! ఎవ్వరైనను నెప్పుడు నీబలమును గూర్చి ప్రశంసింతురో, అప్పుడు నీబలము నీకుఁ దెలియఁగలదు" తరువాత నితఁడు మహర్షులవచనము వలనఁ బోయినబలముగలవాఁడై యాయాశ్రమములలోనే మంచిగాఁ దిరుగుచుండెడివాఁడు. ఇట్లుండఁగా వాలిసుగ్రీవులకుఁ దండ్రియగు ఋక్ష రజసుఁడనునతఁడు తేజస్సుచే రెండవసూర్యునివలెఁ బ్రకాశించుచు సకలవానరరాజ్యమును బాలించుచుండెను. అతఁడట్లు చిరకాలము రాజ్యమేలి కాలధర్మమునొందెను. అతఁడు మృతినొందినతోడనే మంత్ర కోవిదులగు మంత్రులు పెద్దవాఁడగు వాలిని తండ్రిపదమందభిషేకించి సుగ్రీవుని వాలిస్థానమున యౌవరాజ్యాభిషిక్తునిఁ జేసిరి. ఇతనికిఁ జిన్న నాఁటియుండియు సుగ్రీవునితో నిష్కపటముగా నగ్ని వాయువులకువలె

స్నేహము గలిగినది. ఇతడు మునులశాపమువలననే తనబలమును దాను దెలిసికోఁజాలకయుండెను. ఇట్లుండఁగా వాలిసుగ్రీవులకు వైరము గలిగినది. వాలిపెట్టుబాధలకు సహింపఁజాలక సుగ్రీవుఁడు నానాదేశములును దిరుగవలసితిరిగెను. తనస్నేహితుఁ డట్లుతిరుగుచున్నను మునులశాపము వలనఁ దనబలమును దాఁ దెలియలేక 'యేమియుఁ జేయఁజాలఁడాయెను. పంజరములోఁ గట్టువడియుండుసింహ మేమిచేయఁగలదు? పరాక్రమము, ఉత్సాహము, మతి, ప్రతాపము, సుశీలత్వము, మాధుర్యము, నయము, అనయము, గాంభీర్యము, చాతుర్యము, వీర్యము, ధైర్యము మొదలగు గుణములచే నితనితో సమానుఁడుగాని యధికుఁడుగాని మఱియొకఁ డుండఁబోఁ డని నమ్ముము. మఱియు నీతఁడు వ్యాకరణము నభ్యసింపఁ దలఁచి సూర్యాభిముఖుఁడై పెనుకనుండి యుదయగిరినుండి యస్తగిరి పర్యంతమునఁబడకును దిరిగి యీ గొప్పగ్రంథము నంతయు ధారణపట్టి జ్ఞాపియం దుంచుకొనుచుండెడివాఁడు. ఈతఁడు వ్యాకరణశాస్త్రమునంతయు తుఱ్ఱుగా నెఱిఁగినవాఁడు. ఇతనితో నేవిద్యలోను సమానుఁడే లేఁడన్నప్పు డిఁక నెక్కువవా రుందురా? దేవగురువు నతిక్రమించిన పండితుఁడు. ఇతఁడు నవవ్యాకరణవేత్త. రామా! నీదయవలన నితఁడు ముందు బ్రహ్మ దేవుఁడగును. లోకములను ముంపఁదలఁచిన సముద్రమునకును, ప్రపంచ మును దహింప నుద్యుక్తుఁ డగునగ్నికిని, ప్రళయాంతమునందలి యమునికిని, నీ హనుమంతునికిని నెదుటఁబడి యెవ్వరు బ్రదుకఁగలరు? రామా! ఇతఁడు, సుగ్రీవుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, నీలుఁడు, నలుఁడు, తారుఁడు, అంగదుఁడు, రంభుఁడు, శరభుఁడు మొదలగువానరు లందఱును నీ నిమిత్తమై దేవతలచే సృజింపఁబడినవారు. నీయడిగిన సంగతి యంతయుఁ జెప్పితిని. హనుమంతునికి బలము గలిగియు లేనట్లు లుండుటకుఁ గారణము విన్నవించితిని." ఇట్లనియగస్త్యుఁడు చెప్పిన కథయంతయు విని రాముఁడు, లక్ష్మణుఁడు, వానరులు, రాక్షసులు చాల నాశ్చర్యమును బొందిరి. అపు డగస్త్యుఁ డిట్లనియె: "రామా! వినఁదలఁచిన దంతయు వింటివి. నిన్నుఁ జూచితిమి. నీతో మాటలాడితిమి. కావున నిఁక మేము మాయాశ్రమములకుఁబోయెదము." అను నా యగస్త్యుని మాటలు విని చేతులు జోడించుకొని వినయముగా శ్రీరాముఁ డిట్లనియె: "భగవానులవారూ! తమ దర్శనలాభమువలన మా దేవతలు, పితరులు,

బంధువులు సంతోషించిరి. కాని యిపుడు నాచిన్నవిన్నప మొకటిగలదు. దానిని విన్నవించుటకుఁ గోరిక యగుచున్నది. మీరందఱును నాయందు దయఁయుంచి యది నెరవేర్తురని నమ్ముచున్నాఁడను. నేను బొరులను జాన పదులను దమతనుకార్యములయందుంచి వచ్చి మీయందఱతోడనుగూడి క్రతువులను చేయఁ దలంచుచున్నాఁడను. మీరు నిత్యముసు నాయజ్ఞ ములలో సభస్యులైయుండఁగోరితిని. అట్లు జరిపితిరేని నేను జాలసంతో షించెదను. తపస్సులచేఁ గలుషములను బోఁగొట్టుకొన్న మిమ్ముల నాశ్ర యించి పితృదేవతలచేతను దేవతలచేతను మిక్కిలి యనుగ్రహింపఁదగిన వాఁడ నగుదును. కనుక మీ రందఱును దఱచుగా వచ్చుచుండవల యును." ఇట్లని చెప్పిన రామునివాక్యములు విని సంశితవ్రతు లగు నగ స్త్యాదులు "తప్పక యట్లే చేయుదుము" అని చెప్పి వెళ్లుట కుపక్రమిం చిరి. క్రమముగా నందఱును వచ్చినదారినే పోయిరి. రాముఁ డాయా సంగతులను మాటిమాటికిని జింతించుచు నుండెను. తరువాత సాయంకాలము కాఁగానే రాముఁడు రాజులను వానరులను విడిచి సంధ్యావందనమునకుఁ బోయెను. రాత్రి కాఁగానే యంతఃపురములోనికిఁ బోయెను.

37-వ సర్గము

రామునిప్రాతఃకృత్యము

ధర్మాత్ముఁడగు శ్రీరాముఁడభిషిక్తుఁడు కాఁగా నారాత్రి పౌరులకు సంతోషదాయినియైనది. ఆ రాత్రి తెల్లవాఱినతోడనే ప్రాతఃకాలమున రాజులను నిద్రనుండి మేల్కొనఁజేయు స్తోత్రపాఠకులు రాజమందిరము నందువచ్చి నిండియుండిరి. వారందఱును గిన్నరులవలె సుధురకంఠములు గలవారుగా శిక్షింపఁబడియుండిరి. మహావీరుఁడగు శ్రీరామచంద్రుని యథార్థముగా నిట్లు స్తుతి చేయ మొదలిడిరి: "వీరా! సౌమ్యా! కౌసల్యాప్రీతివర్ధనా! మేల్కొనుము. నరాధిపా! నీవు నిద్రించినతోడనే ప్రపంచమంతయు నిద్రించినది. నీ పరాక్రమము విష్ణుని పరాక్రమము వంటిది. నీ రూప మశ్వినీదేవతలరూపము నతిక్రమించియున్నది. నీవు బృహస్పతికంటె నెక్కుడు బుద్ధి గలవాఁడవు; రెండవబ్రహ్మదేవునివంటి వాఁడవు. భూమితో సమానమైనక్షమ గలవాఁడవు. సూర్యునితేజస్సును

మించిన తేజస్సు గలవాఁడవు. నీవేగము వాయువేగము నతిక్రమించి యున్నది. సముద్రుని మించినగాంభీర్యము గలవాఁడవు. స్థాణునివలెనే యప్రకంప్యుఁడవు. నీ సౌమ్యత చంద్రునియందును గానము. పూర్వపు రాజులుగాని, ఇఁక ముందటి రాజులుగాని నిన్నుఁ బోలఁజాలరు. నీవతి దుర్ధర్షుఁడవును, ధర్మమే నిత్యముగాఁ గలవాఁడవును, ప్రజలకు హితము చేయువాఁడవును నగుటచేఁ గీర్తి, లక్ష్మి, శ్రీ, ధర్మము మొదలగునవి నిన్ను విడువ నోపవు" అని యీరీతిగాను, ఇంకను ననేకవిధములుగాను మధుర స్వరములు గల స్తుతిపాఠకులు సూతులు మొదలగువారు శ్రీరాముని మేలుకొలిపిరి. శ్రీరాముఁ డాస్తుతులన్నియు విని మేలుకొనెను. ఆతఁడు పాఁడురాచ్ఛాదనావృతమైన శయ్యనుండి శేషశయ్యనుండి నారాయణుని యట్లు లేచెను. ఇట్లు నిదురనుండి శ్రీరామచంద్రుఁడు లేచునప్పటికి సేవకులు వినయముగా శుభ్రములగు కలశములతో జలము పట్టుకొని సిద్ధముగా నుండిరి. నిత్యకృత్యములు నెఱవేర్చుకొని యగ్నిహోత్రముల హోమముచేసి యిక్ష్వాకువంశపువారిచే సేవింపఁబడుచుండు దేవపూజా గృహములోనికిఁ బ్రవేశించెను. అందుండి దేవతలను, పితరులను, బ్రాహ్మణులను యథావిధిగాఁబూజించి జనులు సేవించుచుండఁగా శ్రీరాముఁడు బైటనున్న కక్ష్యాంతరమునకు వచ్చెను. ఇంతట మంత్రులు పురోహితులు వసిష్ఠాదులు వెలుఁగుచున్న యగ్నిహోత్రములవలె వచ్చి సిద్ధముగా నుండిరి. అనేకదేశములనుండి వచ్చియున్న రాజులు మొదలగువారు రామునిపార్శ్వములయందు దేవతలు దేవేంద్రునిప్రక్కలను గూర్చుండునట్లు గూర్చుండిరి. యజమును మూఁడువేదములు నెట్లో యట్లే భరతుఁడు లక్ష్మణుఁడు శత్రుఘ్నుఁడు రాముని సేవించుచుండిరి. కింకరులందఱును సంతోషించుచుఁ జేతులు జోడించుకొని నమస్కరించి బయటికిఁ బోయిరి. మఱికొందఱు సంతోషముగా నందందు నిలిచిరి. సుగ్రీవాది వానరులు సంతోషించుచు నాసభలోనుండిరి. నలుగురుమంత్రులతోడను గూడి విభీషణుఁడు గుహ్యకులు కుబేరుని సేవించుచున్నట్లు రాముని సేవించుచుండిరి. మఱియు వేదవృద్ధులు కులీనులు మొదలగువారు రాజును నమస్కరించి యుపాసించుచుండిరి. అట్లు శ్రీరాముఁడు శ్రీమంతులచేతను, ఋషులచేతను, రాజులచేతను, మహాపరాక్రమవంతులును కామరూపులును నగు వానర రాక్షసులచేతను జుట్టువాఱుకోఁబడి దేవేం

ద్రునివలెఁ బ్రకాశించుచుండెను. అట్లుననేల? దేవేంద్రునికన్న నెక్కుడు వైభవము గలవాఁడై వెలుంగుచుండెను. అందఱును గూర్చుండియున్న తరువాత పురాణాదుల నెఱింగిన మహోత్ముఁ డాయా పుణ్యకథలు చెప్పి సంతోషింపఁ జేయుచుండిరి.

ప్రక్షిప్తసర్గములు

6-వ సర్గము

వాలిసుగ్రీవాదులజననాదికము

శ్రీరాముఁ డట్లగస్త్యుఁడు చెప్పినదంతయు విని మరల నాయనతో నిట్లనియె: "భగవానులవారూ! వాలిసుగ్రీవులకుఁ దండ్రియగు ఋక్ష రజసుఁ డెవరు? తల్లిదే రేమి? తాము సెలవీయ్యరే తిరి. ఇది నాకుఁ జాల సంతసము గొలుపుచున్నది. కావున సాంతముగా సెలవిండు." ఇట్లడిగిన రాముని కగస్త్యుఁ డిట్లనియె: "రామా! ఆ కథయంతయు సాంతముగాఁ జెప్పెద నాలింపుము. ఒకప్పుడు నారదభగవానుఁడు నాయాశ్రమము లోనికి వచ్చి నాకంతయుఁ జెప్పియున్నాఁడు. అట్లతఁడు భూమిపైఁ దిరుగుచు నాయాశ్రమములోనికి రాఁగా నేనతనిని యథావిధిగాఁ బూజించితిని. అతఁడు సుఖముగాఁ గూర్చుండి నేనడుగఁగా నీకథను "అగస్త్య! వినుము" అని నాకుఁ జెప్పెను. బంగారువికారమైన మేరువను పర్వతము గలదుగదా! దానిమధ్యమశృంగము సర్వదేవతలచేతను బూజింపఁబడుచుండును. అందు నూఱుయోజనముల విశాలముగల దివ్యమైన బ్రహ్మసభ యొకటి గలదు. ఆ సభలో సదా చతుర్ముఖుఁడగు బ్రహ్మ నివసించుచుండును. ఆయన యోగాభ్యాసమును జేయుచుండఁగా నేత్రముల నుండి జారిన యుదకమును జేతులతోఁబట్టి దానిని దుడిచివిదిర్చెను. లోక కర్తయగు బ్రహ్మచేతినుండి యది గ్రిందఁబడినతోడనే దానినుండి వానరుఁ డొకఁడు పుట్టెను. రామా! ఆవానరుఁడు పుట్టినతోడనే బ్రహ్మ వానిని మంచిమాటలచే నోదార్చి యిట్లనియె: "వానరపుంగవా! విశాలమగు నీ పర్వతమును జూచితివిగదా; దీనియం దెప్పుడును దేవతలు విహరించుచుందురు. నీ వీపర్వతమునందు దుంపలు, పండ్లు మొదలగునవి తినుచు నాదగ్గరనే యుండుము. నీ వట్లు కొంతకాలమువఱకును నుందువేని నీకు

మేలు గలుగును" అని యిట్లు బ్రహ్మ చెప్పఁగానే, దేవదేవుఁడగు నాతని పాదముల కావానరుఁడు నమస్కరింబి లోకకర్తయు నాదినేవుఁడును నగు బ్రహ్మతో నిట్లనియెఁ: "దేవా ! నీవాజ్ఞాపించినరీతిగనే నీయాజ్ఞలో నుండెదను" అని చెప్పి యావానరశ్రేష్ఠుఁడు సంతోషించుచు ఫలములచేతను, దుంపలచేతను, పుష్పములచేతను నిండియున్న చెట్లుగలచోటికిఁ బోయెను. అతఁడు బ్రహ్మతో సమాన మగు బలము వేగము గలవాఁడు. ఇట్లు పగ లంతయు నడవిలోఁదిరిగి యిచ్చకువచ్చిన మచ్చున ఫలములు మొదలగు నవి తిని సాయంకాలమునకు మంచిమంచి పుష్పములు ఫలములు సంగ్ర హించుకొని బ్రహ్మయొద్దకువచ్చుచుఁ, దాను దెచ్చినవానిని దేవదేవుఁడగు బ్రహ్మయొక్కపాదసన్నిధిని సమర్పించుచు నుండెను. ఇట్లాకొండమీఁదఁ దిరుగుచుండఁగాఁ జాలఁగాలము గతించినది.

ఇట్లు దిరుగుచుఁ దిరుగుచు మఱికొంతకాలమునకు వానరశ్రేష్ఠుఁ డొకనాఁడు డప్పికొని మేరుపర్వతముయొక్క యుత్తరశిఖరమునకుఁ బోయెను. ఆతఁ డచ్చట ననేకవిధములైన జలపక్షులతో నిండినదియు నిర్మలమైన నీరు గలదియు నగు నొకానొక సరస్సును జూచెను. అతఁడు తనకేసరములను జలించునట్లుగాఁజేసి యాతటాకమునొడ్డునఁ గూరుచుం డెను. అంతట నానీటిలోఁ దన ప్రతిబింబము నేత్రగోచర మైనది. అది చూచి మఱియొకక్రోఁతి తనశత్రువు నీటిలో దాఁగియున్న దని తలంచి కోపించి "దీని గర్వ మణఁచవలయును. ఇది నిజముగా నన్నవమానించు చున్నది. కనుక నెట్టులఁయినను దీనిని బట్టుకొని నిగ్రహించి తీఱెదను" అని యిట్లు మనసులో నాలోచించి యతఁడు వానరబలమువలన నెగిరి యానీటి యమికెను. అటు దుమికి యెంత వెదకినను లోపల నేమియుఁ గానరామిచే మవల నొడ్డునకు వచ్చిచేరెను. రామా! ఆక్షణముననే యా వానరుఁడు స్త్రీత్వమును బొందెను. ఆస్త్రీ సుందరమైనరూపము గలది, లావణ్యముచే నెంతయు నొప్పుచున్నది. శుభమైనయాకృతిగలది. విస్తీర్ణమైన జఘనప్రదే శము గలది. సొగసు గులుకు కనుబొమలు గలది. ఇంద్రనీలములకాంతిని దిరస్కరించుచు సుందరములవంటి ముంగురులు గలిగి ముడ్డులు మూట గట్టుచున్నది. ముగ్ధ; చిఱునగవుతోఁ గూడిన మొగముగలది. పీనమైన స్తనతటము గలది. అట్టి స్త్రీ ముల్లోకములవారి మనస్సులను హరింపఁజాలి యాసరస్సుగట్టున బుజాయష్టి యగు లతవలెను, పద్మము చేతలేని లక్ష్మి

వలెను, నిర్మలమైన చంద్రుని చంద్రికవలెను నొప్పారుచుండెను. వేయేల? ఆమె తనరూపముచే త్రిమూర్తులస్త్రీలను దిరస్కరించుచుండెను. ఇట్లామె దిక్కులను వెలిగించుచు నాగట్టునఁ గూర్చుండి యుండఁగా నంతట నింద్రుఁడు బ్రహ్మను సేవించి యింటికిఁ బోవుచు నామార్గమున వచ్చెను. అదేవేళకు సూర్యుఁడును దిరుగుచుఁ దిరుగుచు నచ్చటికే వచ్చెను.

ఆస్త్రీ యేయడవిలో నున్నదో ఆవనములోనికే యింద్రుఁడు సూర్యుఁడునువచ్చియొక్కమాఱుగానాసుందరిపైనిగన్నువైచిరి. ఆమెను జూచి యాయిద్దఱును మన్మథవశంవదులైపోయిరి. తరువాత సురేంద్రుఁడును, సూర్యుఁడును సర్వాంగసుందరి యగు నాసుందరిని జూచి సర్వాంగములును క్షోభింపఁగా ధైర్యమూఁపుకోఁజాలకపోయిరి.అపు డింద్రుని తేజస్సాసుందరిశిరస్సునైఁబడినది. అది యాస్త్రీని పొందకయే తిన్నఁగా వాలదేశమునకు జారినది. పిమ్మట నామె బలశాలి యగు వానరపతిని గన్నది. ఆదేవేంద్రుఁడమోఘవీర్యుఁడగుటంజేసి వాలదేశమునందుఁ బడిన బీజమువలనఁ గలిగినవానికి వాలి యని పేరిడెను. సూర్యుఁడు దైవవశమున నామె గ్రీవాప్రదేశమున వీర్యమును విడిచెను. ఆమెయు నేమియు ననక యూరకయుండెను. అంతట సూర్యుఁడు నివృత్తమవనుఁడాయెను. గ్రీవాదేశమునఁబడిన బీజమువలన సుగ్రీవుఁడు పుట్టెను. ఈరీతిగా సురేంద్రుఁడును సూర్యుఁడును వీరులగు వాలిసుగ్రీవులను గనిరి. అపుడు దేవేంద్రుఁడు తనమెడలోనున్న బంగారుతామరపూలమాలను వాలిమెడలో వైచి స్వర్గమునకుఁబోయెను. సూర్యుఁడును దనకుమారుఁడగు సుగ్రీవునకు నీవాయుపుత్రుని స్నేహితునిగానుకార్యములయందుఁ దోడ్పడువానినిగాను నిరూపించి యచ్చటినుండి వెడలిపోయెను.

ఆరాత్రి తెల్లవాఱినది. మరల సూర్యోదయము కాఁగానే యాస్త్రీ యెప్పటియట్ల వానరరూపమును బొందెను. అతఁడే వానరుఁడై తన కొడుకుల నిద్దఱను బంగేక్షణులును హరివరులును కామరూపులును నైయున్న వారిని జూచెను. వెంటనే యమృతమునంటి తేనె దెచ్చి యాయిద్దఱకుఁ ద్రావించెను. తరువాత నాయిద్దఱుకొడుకులను జంకఁ బెట్టుకొని బ్రహ్మయొద్దకుఁ బోయెను. లోకపితామహుఁడగు బ్రహ్మ కొడుకులతో వచ్చిన తనకొడుకును ఋక్షరజస్సునువానిని మంచిమాటలతో నోదార్చి తరువాత దేవదూతను రావించి యిట్లాజ్ఞాపించెను. "దూతా!

నీవు నాయాజ్ఞను శిరసావహించి శుభప్రదమైన కిష్కింధ యనుపట్టణమునకుఁ బొమ్ము! అపురి వీనికిఁ దగినది, సర్వగుణసంపన్నము, పెద్దపట్టణము. అందు పెక్కుమంది వానరులు నివసించియున్నారు. మఱియు నాపురి బహుశత్నసమాకీర్ణము; కామరూపులగు వానరులతో నిండియున్నది. మఱియు నాలుగువర్ణములవారును నందుఁ గలరు. అది శత్రువులకుఁ జొర శక్యముగాక సదాయంగళ్లతో నొప్పారుచు నుండును. నాయాజ్ఞవలననే దానిని విశ్వకర్మ బాగుగా నిర్మించెను. అచ్చటికి నాపుత్రుఁడైన యీబుక్షరజ స్సనువానిని బిడ్డలతోఁగూడఁ దీసికొనిపోయి సామాన్యులగు వానరులను, యూథనాథులను రావించి యందఱియెదుటను సింహాసనమునై వీనిని గూర్చుండఁబెట్టి యభిషేకము చేయుము. అచ్చటనున్న వానరులందఱును నీబుక్షరజస్సునిచేఁ జూడఁబడినతోడనే స్వాధీనులై యుందురు." ఇట్లని బ్రహ్మ చెప్పఁగానే, యాదూత వానరాధిపునిఁ బరస్కరించుకొని శుభమగు నాకిష్కింధకుఁ బయనమాయెను. అతఁడు వాయువేగముగాఁ గిష్కింధలోఁ బ్రవేశించి యతని నందు బ్రహ్మాయాజ్ఞ ననుసరించి రాజునుగా స్థాపించెను. తరువాత బుక్షరజస్సనువాఁడు రాజ్యాభిషేకవిధిగా నభిషిక్తుఁడై పూజింపఁబడెను. తరువాతఁ గిరీటమును శిరస్సునందు ధరించి బాగుగా నలంకృతుఁడై సప్తద్వీపములలోఁ నుండు వానరులను సంతోషపూర్వకముగా నేలుచుండెను. రామా! వాలిసుగ్రీవులకుఁ దల్లియుఁ దండ్రియు నాబుక్షరజస్సునతఁడే యని యెఱుఁగఁదగును. నీకు క్షేమమగుఁగావుత! ఈకథను విన్నవారును, వినిపించినవారును సర్వకార్యములును నెఱవేఱి యానందించుచుందురు. విభూ! ఇదియంతయు యథార్థముగాను విస్తారముగాను నీకుఁ జెప్పితిని. ఇదివఱకు రాక్షసులపుట్టుకయు నిపుడు వానరులపుట్టుకయుఁ జెప్పితిని.

7-వ సర్గము

రావణుఁడు సనత్కుమారునితో మాటలాడుట

దివ్యమును బ్రాచీనమును నగు నీకథను విని శ్రీరాముఁడు తమ్ములతోఁగూడఁ జాల నాశ్చర్యమును బొందెను. ఇట్లు చెప్పిన యగస్త్యభగవానుని వాక్యమును విని రాముఁ డిట్లనియె: "మునిపుంగవా! తమ దయ

వలన నేను గొప్పపుణ్యకథను వింటిని. అది విన్నది మొదలు చాలఁ గుతూ హలముతోఁ గూడినవాఁడ నయితిని. వాలిసుగ్రీవుల దివ్యమయిన పుట్టుక యెట్టిదో యది నాకేల చిత్రము గాకుండెడివి ? దేవేంద్రుఁడును సూర్యుఁడును బలవంతులలో శ్రేష్ఠులగు వాలిసుగ్రీవులై పుట్టిరి" అని యిట్లు శ్రీరాముఁడనఁగా నేయగస్త్యుఁ డిట్లనియె: "మహామహాఁడవగు నోరామా! అదియట్టులే. అది పూర్వ మట్లే జరిగినది. దాని సంగతి కేమి గాని, యిఁక నొకదివ్యమైన ప్రాచీనకథ చెప్పెదను వినుము. ఎందునిమిత్తమై పూర్వము రావణుఁడు వై దేహిని హరించెనో ఆసంగతి తేటపడును. నీవు సావధాన చిత్తుఁడవై వినుము. పూర్వము కృతయుగమున రావణుఁడు బ్రహ్మపుత్రుఁడగు సనత్కుమారుఁడు రెండవయగ్నివలె జాజ్వల్యమానుఁడై వెలుఁగుచుఁ గూర్చుండియుండఁగా వినయావనతుఁడై చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె: "భగవానులవారూ! ఈలోకములో శ్రేష్ఠుఁడును, దేవతలకంటె బలవంతుఁడును నెవరు ? ఎవని నాశ్రయించి దేవతలు యుద్ధములలో శత్రువుల జంపుచుందురు? నిత్యము జను లెవనిని బూజించుచుందురు? యోగు లెవనిని ధ్యానించుచుందురు? లోకులు తపోధనులు గనుకఁ దమకుఁ దెలియనిసంగతి యుండఁబోదు. నాయడిగినదంతయు విస్తరించి చెప్పుదురుగాక" అని రావణుఁ డడిగినతోడనే వానిమనోభావమును గ్రహించి "నాయనా! వినుఁ"మని యతఁ డిట్లనియె: "ఎవఁ డీబ్రహ్మాండము నంతయు భరించుచుండునో, ఎవనిపుట్టుక తెలియరాదో. సురాసురులెవని నాశ్రయించి సమరమున నసురులను జయించుచుండురో ఆతఁడు నారాయణుఁడు. అతనినాభిపద్మమునుండి సృష్టికర్తయగు బ్రహ్మ పుట్టెను. స్థావర జంగమాత్మకమగు నీసర్వమును నతఁడు సృజించెను. విబుధులు విధిగా యజ్ఞములయందుఁ బూజించుచుందురు; మఱియు నమృతమును ద్రావుచుందురు. యోగులు పురాణములచేతను, వేదములచేతను, పాంచరాత్రాగమములచేతను నిత్యము ధ్యానించుచు యజ్ఞములచేత నతనిని బూజించుచుందురు. దైత్యులను, దానవులను, రాక్షసులను,మఱియు దేవతలకు విరోధులగువారినెల్లరను యుద్ధములలోనతఁడే జయించుచుండును. అతఁ డందఱిచేతను బూజింపఁబడుచుండును" అనియిట్లు చెప్పిన సనత్కుమారునిమాటలువిని రావణుఁడు నమ్రుఁడై మరల నిట్లనియె: "మహాత్మా! యుద్ధములలో నాతనిచేఁ జచ్చినరాక్షసులు మొదలగువారికేమిగతి గలు

గును? అతనిచేఁ జచ్చినవా రెవరు?" అని యడిగిన రావణుని మాటలు విని యాయన యిట్లనియె: "దేవతలచేఁ జంపఁబడినవారు స్వర్గము చేరుదురు. పుణ్యము క్షీణము కాఁగానే యచ్చోటు వాసి భూమిపైఁ బుట్టుదురు. పూర్వజన్మములయందు సంపాదించుకొన్న పుణ్యపాపములచే సుఖదుఃఖముల ననుభవించుచుఁ బుట్టుచుఁ జచ్చుచు నుందురు. రావణా! త్రిలోకనాథుఁడును జనార్దనుఁడును నగు చక్రధరునిచేఁ జంపఁబడినవారు పోయి యాతనియందు లయమును బొందుదురు. ఆ దేవునికోపముగూడ వరమువలో సమానమైనదే." అని యిట్లు సనత్కుమారుఁడు చెప్పఁగా విని రావణుఁ డాశ్చర్యమును సంతోషమును బొందుచు "యుద్ధములో నే నెట్లాభగవంతుని నెదిరొక్కందును?" అని యాలోంచిప మొదలిడెను.

కి-వ సర్గము

సనత్కుమారునియుపదేశము

ఇట్లాలోచించుచున్న దురాత్మునితో సనత్కుమారుఁడు మరల నిటనియె: "రావణా! కొంచెము కాలము సహించితివేని నీమనోరథము తప్పక నెఱవేఱును. అంతవఱకును సుఖముగా నుండు" మన విని వాఁడతనితో నిట్లనియె: "మహానుభావా! అతనిస్వరూప మెట్టిది? మఱియు నాతనిసంగతియంతయు విస్తరించి చెప్పుదురుగాక!" యన సనత్కుమారుఁడిట్లనియె: "రావణా! నీయడిగినయంతయుఁ జెప్పెదను వినుము. ఆదేవదేవుఁడు సర్వత్ర నిండియున్నవాఁడు. సూక్ష్ముఁడు, అవ్యక్తుఁడు, సనాతనుఁడు. ఈమూఁడులోకములును నతనియం దిమిడియున్నవి. అతఁడు భూమియందు, స్వర్గమందు, పాతాళమందు, పర్వతములయందు, వనములయందు, స్థావరములయందు, పట్టణములయందు నున్నాఁడు. ఓంకారము, సత్యము, సావిత్రి, పృథివియు నతఁడే. అతఁడే భూమిని భరించు ననంతుఁడని పేర్వడియున్నాఁడు. పగలు, రాత్రి, రెండుసంధ్యలు, సూర్యుఁడు, యముఁడు, సోముఁడు, కాలము, అనలము, వాయువు, బ్రహ్మ, రుద్రుఁడు మొదలగువారందఱును నతఁడే. ప్రకాశించువాఁడు, జ్వలించువాఁడు, మెఱయువాఁడు, రక్షించువాఁడు, లోకములను సృజించువాఁడు, సంహరించువాఁడు, శాసించువాఁడు, క్రీడించువాఁడును నతఁడే. మఱియు నవ్యయుఁడు, లోకనాథుఁడు, విష్ణుఁడు, పురాణపురు

షుఁడు, భక్తులజన్మముల నశింపఁజేయువాఁడును నతఁడనియే తెలిసి కొనుము. రావణా! అదికాక వేయిమాటలు చెప్పనేల? ఈమూఁడు లోకములను చరాచరప్రపంచమును నతనిచేతనే నిండియున్నది. నల్ల కలువఱేకువంటి శరీరకాంతి గలిగి, కింజల్కమువంటి కాంతిగల వస్త్రము లను ధరించి యతఁడు వర్షాకాలముల్లో నాకసమునందు మెఱుపులతోఁ గూడిన మేఘమువలెఁ బ్రకాశించుచుండును. శ్రీమంతుఁడును, మేఘము వంటి చామనచాయగల శరీరముగలవాఁడును, పంకజములవలెనే యెఱ్ఱని కన్నులు గలవాఁడును, శ్రీవత్సము వక్షఃస్థలమునందుఁ గలవాఁడును, శశాంకునిచేఁ జేయఁబడిన లక్షణము గలవాఁడును నై యొప్పుచుండును. మేఘమునందు మెఱుపుతీఁగవలె నిత్యమును నతనిశరీరమునందు సంగ్రామ రూపిణి యగు లక్ష్మి యుండును. అతనిని దేవతలుగాని, రాక్షసులుగాని, పన్నగులుగాని చూడఁజాలరు. అతఁడెవరియందుఁ బ్రసన్నుఁడగునో వారే యతనిని జూడఁగలరు. నాయనా! యజ్ఞములచేతను, సంచితమైన తపస్సులచేతను, దానములచేతను, పూజలచేతను నతనిని జూడఁజాలరు. అతనిపాదములయందు భక్తిగలవారును, అతనియందు నిలుపఁబడిన ప్రాణములుగలవారును, చిత్తమతనియందుంచినవారును, అతఁడే దిక్కని నమ్మినవారును, జ్ఞానముచే దహింపఁబడిన పాపములు గలవారును మాత్రమే యతనిని జూడఁజాలుదురు.

రావణా! ఒకవేళ నీ వాతనిని జూడఁదలఁచితివేని నీకొక చక్కని యుపాయము చెప్పెదను. నీకిష్టమైనచో నట్లు చేయుము. కృతయుగము గడచినపిమ్మట త్రేతాయుగప్రారంభమున నతఁడు దేవతలకును మనుష్యుల కును మేలుచేయుతలంపున రాజశరీరమును ధరించును. ఇక్ష్వాకువంశ ములో దశరథుఁడను రాజొకఁడు పుట్టఁగలఁడు. అతనికిఁ మహాతేజశ్శాలి యగు రామునఁడను కుమారుఁడు పుట్టును. అతఁడు మహాతేజశ్శాలి, మహాబుద్ధిశాలి, మహాబలపరాక్రమశాలి, మహాబాహుశాలి, మహాసత్త్వ శాలి, భూమితో సమానమైన క్షమగలవాఁడు, సూర్యునివలెఁ దేజో చూడరానివాఁడు, యుద్ధవిశారదుఁడును నై నారాయణుఁడే యట్లు పుట్టఁగలఁడు. అతనిపేరు శ్రీరాముఁడందురు. ఆతఁడు తండ్రియాజ్ఞ ననుసరించి తమ్మునితోడను భార్యతోడను మిగుల భయంకర మగు దండ కలో విహరింపఁగలఁడు. ఆతనిభార్య మహాభాగురాలు, లక్ష్మి సీత యని

ప్రసిద్ధి కెక్కును. ఆమె జనకునికూఁతురై భూమినుండి ప్రజనన మొందును. ఆమె రూపము నిరుపమానము. లక్షణములన్నియు నామెయందే నిండి యుండును. చంద్రుని వెన్నెల యనుసరించినట్లును, నీతి మనుష్యుల ననుస రించునట్లును నామె యతని ననుసరించియుండును. ఆమె మంచిస్వభా వము, ఆచారము మొదలగు మంచిగుణములతోఁ గూడియుండును. పతి వ్రతలలోఁ దిలకమువలెఁ బ్రకాశించుచుండును. ధైర్యమున నామెదేయని చెప్పనొప్పును. ఏకమూర్తినిబొందిన సూర్యుని సహస్రరశ్ములవలెనుండును. రావణా! ఈరీతిగా నీకంతయుఁ జెప్పితిని. దేవదేవుఁడగు నాపరాత్పరుని సంగతి యట్టిది. వేయేల? అతఁడు శాశ్వతుఁడు, అవ్యయుఁడు" అని యిట్లు చెప్పిన సనత్కుమారునిమాటలు విని "ప్రతాపవంతుఁడును, మహా బాహుఁడును నగు రావణుఁడు నీతోఁగూడ విరోధమును గోరుచు రామా! చింతింప మొదలిడెను. మాటిమాటికిని సనత్కుమారుని వాక్య ములను దలపోయుచు రావణుఁడు సంతోషపూర్వకముగా యుద్ధమును గోరుచుఁ దిరుగుచుండెను." అని యిట్లు చెప్పిన యగస్త్యునిమాటలు విని రాముఁడుత్ఫుల్లలోచనుఁడై యదే యర్థమును జింతించుచు శిరశ్చాలన మొనరించుచుండెను. నరేశ్వరుఁడగు రాముఁడు మునిభగవానుని మాటలు విని సంతోషించుచు విస్మయగ్రస్తమానసుఁడై మరల జ్ఞాను లలో శ్రేష్ఠుఁడగు నాయగస్త్యుని నింకొక పురాతనకథను జెప్పు మనెను.

9-వ సర్గము

తరువాత మహాతేజశ్శాలియు మహాకీర్తిశాలియు నగు నగస్త్యుఁడు ప్రణతుఁడగు రామునితోఁ బితామహుఁడీశ్వరునితో నన్నట్లినియెఁ: "సత్యపరాక్రముఁడవగు నోరామా! వినుము. ఇంకను గథాశేషము గలదు. ఆపై నేనెట్లు వింటినో యెట్లు జరిగినదో అట్లే చెప్పెదను" అని ప్రీతమనస్కుఁడై మహామతియగు నగస్త్యుఁడు రాముని కిట్లనిచెప్ప మొద లిడెను: "మహామతివగు రామా! ఇందు నిమిత్తమై రావణుఁడు దురా త్ముఁడు జనకరాజుకూఁతును హరించెను. ఈ కథను నాకు నారదుఁడు పూర్వము మేరుపర్వతముపై నొకప్పుడు చెప్పెను. అపుడచ్చట దేవతలు గంధర్వులు సిద్ధులు ఋషులు మొదలగువారుగూడఁ గలరు. రామా! ఆనారదుఁడే మరలఁ గథాశేషమును జెప్పెను. అతఁడు నవ్వుచు నాతోఁ

జెప్పిన యాకథాశేషమును జెప్పెదను. అది సమస్తపాపములను బోగొట్టు నది. ఋషులును, దేవతలును మొదలగువారు సంతోషించినవారై యీ కథను చెప్పుమని నారదునికోరిరి. ఎవరు దానిని భక్తిశ్రద్ధాతాత్పర్యము లతో విందురో వినిపింతురో వారిలోకమందుఁ బుత్రపౌత్రాదులతో సంతోషించి దేహాంతమందు స్వర్గములో నుందురు.

10-వ సర్గము

రావణుని శ్వేతద్వీపపు కథ

"రామా! తరువాత రావణుఁడు విజయమును గోరుచు శూరులగు రాక్షసులతోఁగూడి తిరుగుచుండెను. దైత్యులలోఁగాని, దానవులలోఁగాని, రాక్షసులలోఁగాని బలవంతుఁడున్నాఁడని విన్నచో వానిని యుద్ధమునకు రమ్మని బలగర్వితుఁడై పిలుచుచుండెడివాఁడు. రామా! ఈరీతిగా నారావణుఁడు భూమియందుఁ దిరుగుచు బ్రహ్మలోకమునుండి వచ్చుచున్న వాఁడును, మేఘపృష్ఠముపై నుండి రెండవసూర్యునివలెఁ బ్రకాశించుచున్న వాఁడును నగు నారదునిఁ జూచి, సమీపించి సంతోషించుచుఁ జేతులు జోడించుకొని నమస్కరించి యిట్లనియె: "నారదభగవానులవారూ! బ్రహ్మలోకము మొదలు తా మనేకలోకములు చూచియే యుందురు. కావున నడుగుచున్నాను. ఏలోఁకములోని మనుష్యులు బలవంతులో చెప్పితిరేని నేను బోయి వారితో యథేచ్ఛముగ యుద్ధము చేయుదును" అని యిట్లడిగిన దురాత్ముఁడగు రావణునిమాటలు విని నారదుఁడు ముహూర్తమాత్ర మాలోచించి రావణునితో నిట్లనియె:

"రావణా! క్షీరసముద్రమునకు సమీపమున గొప్పద్వీప మొకటి గలదు. అచ్చటి మనుష్యులు చంద్రునివంటివారు, మిక్కిలి బలవంతులు, గొప్పగొప్పశరీరములుగలవారు, మహావీర్యులు, మేఘములయుఱుముల వంటి కంఠధ్వనులు గలవారు, మహామాత్రులు, ధైర్యవంతులు, గొప్ప పరిఘములవంటి బాహువులు గలవారు. నే నట్టివారిని శ్వేతద్వీపములోఁ జూచితిని. నీవెటువంటివారితో యుద్ధముచేయఁ గోరుచుంటివో వారట్టి వారే" అను నారదునిమాటలు విని రావణుఁడిట్లనియె: "నారదభగవానులవారూ! ఆద్వీపమునందు బలవంతు లెట్లు పుట్టుదురు? ఆమహాత్ములకు శ్వేతద్వీపములో నివాస మెట్లు ప్రాప్తించినది? ఆ యీసంగతియంతయు

నాకు యథార్థముగాఁ జెప్పవలయును. తాము సర్వప్రపంచమును చేతి లోని యుసిరికకాయవలెఁ జూడఁగలరు" అను రావణునిమాటలు విని వారదుఁ డిట్లనియె: "రావణా! నిత్యమును నితరులయందు మనస్సులేని వారును, నారాయణపరాయణులును, నారాయణు నారాధింప నాసక్తిగల వారును, సదా మనస్సు నతనియందే యుంచువారును, అతఁడే దిక్కని నమ్మినవారును, ఏకాంతభావమును బొందినవారును, ప్రాణములనుసైతము నతనియందే యుంచువారును శ్వేతద్వీపవాసమును బొందఁగలిగిరి. వారు తమపుణ్యములచేతనే యచ్చట వసించుచుందురు. యుద్ధములలో శార్ఙ్గ మను వింటి నెక్కిడి నారాయణుఁ డెవరిని జంపునో వారును, చక్రాయుధముచేఁ జచ్చినవారును నాలోకమునకుఁ బోవుదురు. యజ్ఞముల ఫలముచేతను, తపస్సులచేతను, నియమములచేతను, దానములవలనఁ గలుగు ఫలముచేతను ఆలోకము ప్రాప్తింపదు" అని చెప్పిన నారదుని వాక్యములు విని రావణుఁడు మిక్కిలి యాశ్చర్యమును బొందినవాఁడై చాలకాల మాలోకించి "యతనితో యుద్ధము చేసెదను" అని నిశ్చయించుకొని నారదునియొద్ద ననుజ్ఞాతుఁడై శ్వేతద్వీపమునకుఁ బోయెను. నారదుఁడును జిరకాలము ధ్యానించి కౌతూహలముతోఁ గూడినవాఁడై పరమాశ్చర్యమును జూడఁదలఁచి యతివేగముగా నచ్చటికి పోయెను. అనారదుఁడు కేళికరుఁడును యుద్ధప్రియుఁడును గదా! రావణుఁడు రాక్షసులతోఁగూడి యచ్చటికిఁ బోవుచు, నచట సింహనాదముచేసి పదిదిక్కులను బ్రతిధ్వను లీసునట్లు చేసెను. నారదుఁడు శ్వేతద్వీపమునకుఁబోయినవెనుక రావణుఁడును దేవతలకుఁగూడ లభ్యముగాని శ్వేతద్వీపములోఁ బ్రవేశించెను. ఆద్వీపముయొక్క తేజస్సుచేత బలవంతుఁడగు రావణుని పుష్పక మను విమానము వాయువేగసమాహతమై మేఘము నిలువఁ జాలనట్లు నిలువఁజాలకపోయినది. రావణునిమంత్రులు తేఁకి చూడ శక్యముగాని యాద్వీపములోఁ బ్రవేశించి భయపడి రావణునితో నిట్లనిరి: "రాక్షసేంద్రా! మేము మూఢులము; తెలివితప్పియున్నారము. ఇచ్చట నిలుచుటకే మాకు శక్యము గాకుండ నున్నది. ఇఁక యుద్ధమేలాగు చేయఁజాలుదుము?" అని చెప్పి యారాక్షసులందఱును బాఁకిపోయిరి. రావణుఁడును దనపుష్పకమునుగూడ నారాక్షసులతోడనే

విడిచిపెట్టెను. ఇట్లు పుష్పకము పోయినవెనుక రావణుఁడు మహాభయం కరమగు రూపమును ధరించి యేకాకి యై యా శ్వేతదీపములోఁ బ్రవే శించెను.

రావణుఁ డట్లు ప్రవేశించినతోడనే యందలి యాడువాండ్రచేఁ జూడఁబడెను. అందులో నొకసుందరి ముదసి తసుందరవదనారవింద యై రావణుని చేతితోఁబట్టుకొని "నీ వెవరు? ఇచ్చటి కెందులకు వచ్చితివి? ఎవనికొడుకవు? ని న్నెవరు పంపిరి? యథార్థము చెప్పుము" అని యి ట్లడుగఁగానే, రామా! రావణుఁడు చాలఁ గోపించి యిట్లనియె: "నేను విశ్రవో బ్రహ్మకుమారుఁడను; నాపేరు రావణుఁడందురు. నేను యుద్ధము కొఱ కిటవచ్చితిని; కాని నాతో సమముగా యుద్ధము చేయువారు గను పడకుండ నున్నారు" అని యిట్లు దురాత్ముఁడగు రావణుఁడు చెప్పుచుం డఁగా నచ్చటిస్త్రీలందఱును పకపక నవ్విరి. అందులో నొకతె కోపించి బలవంతముగా బొలునివలె లాగికొని విలాసముగాఁ జెలులమధ్యను గిఱగిఱఁ ద్రిప్పి మఱియొకతెను బిలిచి "చెలియా! నేను పురుగును బట్టు కొంటిని జూడుము. దీని కిరువదిచేతులు పదితలలును గలవు. మఱియుఁ గాటుకకొండవలె నల్లగా నున్నది" అనునప్పటి కింకొకతె దానిచేతిలో నుండి మఱియొకతె, దానిచేతిలోనుండి వేఱొకతె, దానిచేతిలోనుండి యింకొకతె లాగికొని ముచ్చటగాఁ జూచుచుండిరి. రావణుఁ డాస్త్రీల చేతులలోఁబడి నలిగిపోవుచు నూపిరియాడక బాధపడెను. ఇట్లు పీడిం చుచు గిఱగిఱఁ ద్రిప్పుచుండఁగాఁ బ్రాజ్ఞుఁడుగనుక నొకతెచేయి కఱచెను. దానికిఁ గోపమువచ్చి వానిని నేలనువైచి కొట్టినది. ఇంకొకతె వానినెత్తి కొని యఱచేతిలో నుంచుకొని యంతరాళమున కెగిరినది. దానిని గోళ్లతోఁ జీరెను. అది భయపడి గిఱగిఱఁద్రిప్పి నీటిలోనికి విసరివైచినది. వాఁడు భయాతురుఁడై సముద్రజలములోఁబడెను. వజ్రముచేఁ గొట్టఁ బడిన పర్వతశిఖరము సముద్రములోఁ బడినచందమైనది. ఇట్లు విసరఁబడి సముద్రజలములోఁ గొంతసేపుండి పైకివచ్చెను. రామా! రావణుఁ డీరీతిగా శ్వేతద్వీపమున నుండు స్త్రీలచేతనే యెన్నో బాధములకు లో నయ్యెను. నారదుఁడా రావణునిపాట్లను చూచి చాల నాశ్చర్యమును బొంది నవ్వుచు నాట్యమారంభించెను. తరువాత రావణుఁడు సముద్రము నుండి బైటికివచ్చి శిరోజములనుండి నీరుగారుచుండఁగా దక్షిణముపైపున

నున్న యొడ్డుచేరి యాశ్చర్యపడుచు నాలోచింప మొదలిడెను. నేనెన్నో లోకములను జయించితినిగాని యిట్టియాపదకు లోను గా లేదని యను కొనెను. స్వభావముచేతనే యబలలగు స్త్రీ లెంతవిరుద్ధపు బని చేసిరి? నిజమే యీలోకములోనివా రేమి చేయఁదలఁచినను చేయఁగలవారే. స్త్రీరూపముగా నుండు శరీరములను ధరించి రని నారదుఁడు నాకుఁ జెప్పి యున్నాఁడు. ఇపు డాలోచింపఁగా బలవంతులతో సంధిచేసికోవలయు నని నిశ్చయమైనది.

రామా! రావణుఁడు మరల వారివృత్తాంతమును దెలిసికొను టకై యూహనమంతయు వెదక మొదలిడెను. ఇట్లుండఁగా నింతట బ్రహ్మ మానసపుత్రుఁడగు సనత్కుమారుని యోగనిష్ఠాగరిష్ఠునిఁ జూచెను: అతఁడు సమిధలచే నగ్నిహోత్రుఁడు వెలుగుచుండునట్లు తపస్సుచే వెలుంగుచుండెను. అతఁడు దక్షిణపార్శ్వమందు గుహాశ్రయుఁడై తీరుగు చుండెను. రావణుఁడు తపోవృద్ధుఁడగు సనత్కుమారునిజూచి చేతులు జోడించి నమస్కరించి సిగ్గునొందుచు నిట్లని యడిగెను. "బ్రహ్మర్షీ! సత్య వాదీ! మహాత్మా! యీలోక మెవ్వనిచే సృజింపఁబడినది? సర్వజ్ఞానుల లోను శ్రేష్ఠుఁడవగు నోబుషివర్యా! యీలోకములో నెవ్వ రుందురు? మఱియు నీ వింతసమాధి నవలంబించి ధ్యానించువస్తు వెద్ది? నీవు సర్వ జ్ఞుఁడవని నాకుఁ దెలిసినది." అని యడిగిన రావణునియభిప్రాయము దెలిసి కొని నవ్వుచు నతఁడిట్లనియె: "నాయనా! రావణా! చెప్పెదను వినుము. ఈచరాచరప్రపంచమునంతను నెవఁడు భరించుచున్నాఁడో, మూఁడు లోకములును నేమహాత్మునిపుట్టుకను దెలిసికోఁజాలకుండునో, వేదవిదు లేపురుషుని దమస్సుకంటెఁ బైఁగానుండువాఁడనియు, నజరమగు నాచిత్య రూపమును ధరించినవాఁడనియుఁ, బరమాత్ముఁడనియు, నీశ్వరుఁడనియుఁ జెప్పుచుందురో, నాతండ్రియగు బ్రహ్మ యెవనినాభినుండి పుట్టెనో కైలాస నిలయుండగు శివుఁ డెవ్వనిక్రోధమునుండి పుట్టెనో, యెవని నాశ్రయించి విబుధులు విధిగా యజ్ఞములలో హవిర్భాగములను, అమృతమును గొనుచుందురో, మఱియు హారు రాక్షసులను లక్ష్యముసేయక యుందు రో, యెవని నిశ్వాసవాయువువలనఁ బుట్టినస్త్రీలు పరాజయ మెఱుఁగని నిన్నును బట్టుకొని కడుంగడుఁ గష్టములకులోనుజేసి గిలగిలఁద్రిప్పిసము ద్రములోఁ బడవైచిరో, యెవనిచేతను మహావీర్యులగు దైత్యులు చాన

వులు నైర్ఋతులు నిహతులగుచుందురో, అట్టిమహానుభావుఁ డట్టిలోక నాథుఁ డట్టిమహాత్ముఁడు గోవిందుఁ డీలోకమును గల్పించెను. నారాయ ణునియం దాసక్తిగలవా రాతనినిఁ బూజించుచుందురు. సమస్తభూతముల యందును ద్వేషము లేనివారును, గొప్పయోగబలము నాశ్రయించిన వారును, మధుసూదనుని విధిగాఁ బంచయజ్ఞములచేత నారాధించుచుం దురు. ఏకాంతభక్తి గలవారును,మిక్కిలి సత్త్వగుణము గలవారును,సావ ధానమనస్కులును నతనియం దుందురు. ఎవఁడు పురాణములయందును, వేదములయందును, పాంచరాత్రములయందును బఠింపఁబడియున్నాఁడో, ఎవనిని మునులు సాంఖ్యయోగములచే ధ్యానించుచుఁ బూజించుచుం దురో, మునీశ్వరులు దేవతలు భగవంతుఁడగు నాహరిని గనుఁగొనుచుం దురో, మధుకైటభులను జంపిన యాభగవంతుని నెవ్వరు వెదకఁగలరు? వేయిమాట లేల? రావణా! పితామహుఁడుగూడ నాదేవుని తెలిసికోఁ జాలఁ డనఁగా నిఁక దక్కినవారిసంగతి చెప్పవలయునా? ఎవఁడు నిత్య మును హరియు నారాయణుఁడును విభువును జగత్తుల కాభరణమును పుణ్యాత్ముఁడునునగు నామహాత్ముని దెలిసికొనునో వానికిఁదప్పక మోక్షము సిద్ధించును. ఇందు సందియము లేదు."

రామా! రావణుఁ డిట్లు చెప్పిన సనత్కుమారుని వాక్యములను బ్రసన్నచిత్తముతో విని మరల నాయన నిట్లని యడిగెను:"దేవా!ఆదేవుఁ డెట్లు కనుపడును? ఎట్లు వినఁబడును? అతఁడెట్లు లోకమునఁ గ్రీడించుచుం డును? అతని నెట్లు చూడఁ గలను ? నేనెంతకాలము తపస్సుచేసినచో ననా యాసముగా నీలోకములోఁ బ్రవేశింపఁగలను? ఆ యాసంగతు లన్నియు నీకు స్పష్టము గనుక నాకుఁ జెప్పవలయు"నను కోరికతోఁ గూడిన రావణు నితో వాక్యవిశారదుఁడు గనుక నాసనత్కుమారుఁడు బాగుగా నాలో చించి మొదటినుండి తుదివఱకుఁ జెప్పఁదలఁచి యిట్లనియె : "ఆదేవుఁడే సర్వగతుఁడు, సూక్ష్ముఁడు, అవ్యక్తుఁడు,సనాతనుఁడు. ఈచరాచరప్రపంచ మంతయు నతనిచేత వ్యాపింపఁబడియున్నది. అతఁడు భూమియందును, స్వర్గమందును, పాతాళలోకమందును, పర్వతములయందును, వనముల యందును, సకలసముద్రములయందును, నదులయందును, నెల్ల వేళలయం దును నుండును. పగలు,రాత్రి, రెండుసంధ్యలు, సూర్యుఁడు, యముఁడు, సోముఁడు నతఁడే. అతఁడే కాలము. వరుణుఁడును నతఁడే. అతఁడే బ్రహ్మ,

రుద్రుఁడు, ఇంద్రుఁడు మొదలగువారందఱు నని తెలియఁవలెను. ఓంకారము, భూర్భువస్స్వరాదులు, గాయత్రి, సంధ్యలు నతఁడే. భూమిని పర్వతములను ధరించు ననంతుఁ డతఁడే యని ప్రసిద్ధి నొందియున్నాఁడు. మెఱియువాఁడు, జ్వలించువాఁడు, వర్షించువాఁడు, వీచువాఁడు, రక్షించువాఁడు, గర్జించువాఁడు, సమీపించువాఁడు, తపించువాఁడు, దహించువాఁడును నతఁడే. లోకములను సృజించి పాలించి సంహరించుచు నుండు దేవుఁ డాయనయే. మఱియు లోకములో నుండు దురాత్ములగు రాక్షసులను బలాత్కారముగా నతఁడే దహించును.

దేవతలు రాక్షసులు పన్నగులు మొదలగువా రాతనిని జూడఁజాలరు. ఆయన కెవనియం దనుగ్రహము గలుగునో వాఁడే యాయనను జూడఁగలఁడు. తద్గతులు, తద్గతప్రాణులు, శుచియగు చిత్తము గలవారు, తత్పరాయణులు, జ్ఞానముచేఁ బాపములను దొలఁచుకొన్న వారును నీ లోకములోఁ బ్రవేశింపఁగలరు. కామము లేకుండఁ గర్మములు చేయువారును, క్రోధము లేనివారును, తమోగుణము లేనివారును, స్వయంప్రకాశమానులును నగు నిటువంటి పురుషశ్రేష్ఠులు మాత్రమే యీ లోకమును బొందఁజాలుదురు. మహాకాయుఁడగు నెవఁడీలోకములోఁ బ్రవేశించునో యతఁడు హరితోఁగూడియుండును. ఇరువది యొనిమిదవ యుగము ప్రాప్తింపఁగా వైవస్వత మనుసంశము వాఁడు వైష్ణవమూర్తి నావేశించి యీలోకములోఁ బ్రవేశింపఁగలఁడు. రావణా! ఇటుపైని నా వలన నీవు వినఁదగవు. లెమ్ము పొమ్ము నీకు మేలుగలుగును. నీ విష్టమైన గతిని బొందఁగలవు."

ఇట్లు చెప్పఁబడి యట్లే యని యతనిని బూజించి నమస్కరించి తన సైన్యమును గలిసికొని నిశ్శంకముగా లంకకుఁ బోయెను. నారదుఁడును సంతోషించుచు నీసంగతియంతయుఁ జూచి యతివేగముగా మేరుపర్వత మునకు వచ్చి యచ్చటిసభలోఁ బ్రవేశించెను. అందుఁ గూర్చుండియున్న బ్రహ్మకు నమస్కరించి కృతాంజలియై యాయన వినుచుండఁగా నీసంగతి యంతయు దేవతలతోఁ జెప్పెను. మిగులఁ బుణ్యకరమగు నీకథ విని బ్రహ్మ గతాగతములు దెలిసినవాఁడు గనుక నారదునిఁ గౌఁగిలించుకొని యిట్లనియె: "ఈరాక్షసుఁడు పూర్వము హిరణ్యకశిపుఁడై పుట్టెను. వర దానమువలన బలవంతుఁడగుటచే ననేకయోగములచే నవధ్యుఁడాయెను.

వాఁడొకప్పుడు సభలో నారాయణుని నిందింపఁగా నాయన నరసింహ రూపము నవలంబించి వాఁడియగు తనగోళ్లతోఁ జీరిచంపెను. ఆరాక్షసునికి రక్తస్పర్శమువలన దివ్యదృష్టి గలిగినది. వాఁడు తనదివ్యదృష్టిచేతను మరలఁ దనకు రాక్షసజన్మము గలుగు ననియు నపుడు తనకు మనుష్యుని వలన మృతి గలుగు ననియుఁ దెలిసికొనెను. నరసింహభగవానుఁడు తన తొడలపైని వైచుకొని గోళ్లతోఁజీరుచుండఁగా క్షణమాత్రము దీనుఁడై చేతులు జోడించుకొని మెల్లఁగా భగవంతునితో నిట్లనియెఁ: "పుటము వేసిన బంగారువంటి కేశాంతము గలవాఁడవును, మందుచుండు నగ్ని వంటి కన్నులు గలవాఁడవును, వజ్రాయుధముతో సమానమైన నఖ స్పర్శము గలవాఁడవును నగు నోదివ్యసింహమా! నీకు నమస్కారము. కైటభారీ! హరీ! దేవా! విష్ణూ! విపులవిక్రమా! భూతభవ్యేశా! శరణా గతవత్సలా! నన్ను రక్షింపుము. నీవు మనుష్యరూపమున నారాక్షసత్వ మును బోఁగొట్టఁగా నేను త్వన్మయుఁడనై నీలోకమును బొందెదను. లోకనాథా! నావిషయమునఁ బ్రసన్నుఁడవు గమ్ము." ఇట్లని హిరణ్యకశి పుఁడు విన్నవించినతోడనే "యట్లే" యని విష్ణువు హింసయుక్తమును కింకిణీజాలమాలియు నగు విమానముపైఁ గూర్చుండి యంతర్ధాన మాయెను.

ఆరాక్షసుఁడే మరల రాక్షసశరీరము నవలంబించియుండుటచే రాక్షసకృత్యములను జేయుచుండెను. మనుష్యత్వమునుబొంది లోకము లను నాశముచేయుట కుద్యుక్తుఁడైనవానిని జంపఁగాఁ దరువాత శ్వేత ద్వీపములోఁ బ్రవేశింపఁగలఁడు. అపుడు విష్ణుతేజస్సు గలుగును.! బ్రహ్మ వాది యగు సనత్కుమారుఁడు చెప్పినదంతయు నేనిచ్చటనుండియే దివ్య దృష్టిచే గనిపెట్టితిని. మఱియుఁ బరమాత్ముఁడగు నాదేవునిసంగతియు నాకుఁ దెలిసియున్నది. నారదుఁడు చెప్పిన యీపుణ్యకథను మొదటినుం డియు భక్తిశ్రద్ధాతాత్పర్యములతో విన్నవారును, జదివినవారును నుత్తమగతిని బొందుదురు.విష్ణుసంబంధమైన యుత్తమకథ సమస్తపా పములను బోఁగొట్టునదిగదా! అది విన్న వారిపాపములన్నియుఁ బటాపంచలై పోవును. మఱియు నట్టివారికి జాతిస్మరత్వము, బ్రాహ్మణత్వము, గొప్ప వంశములో జన్మము, సర్వజ్ఞత్వము మొదలగునవి గలుగును. ఇందు సందియము లేదు. బ్రహ్మదేవుఁడట్లు విష్ణుమూర్తినిస్తుతించి దేవతలకసుజ్ఞ

యిచ్చి తనలోకమునకుఁబోయెను. తరువాత నారదుఁడు మేరుపుపైని తిరుగుచు నాయొద్దకు వచ్చెను. నేనతనిని యథావిధిగా నమస్కరించి పూజించితిని. అతఁడు నాయందలి యనుగ్రహముచే నీకథ నాకుఁ జెప్పెను. నేను నీసభకు వచ్చి పవిత్రుఁడనై మనోహరమగు నీకథను భక్తితోఁ జెప్పితిని. రామా! ఇందు నిమిత్తమై సుమా దురాత్ముఁడగు రావణుఁడు నీచేతను జావు గోరి యెఱిఁగియే సీతాపహరణ మొనరించెను. నీవు శంఖచక్రగదాధరుండవగు శ్రీమన్నారాయణుఁడవు; శార్ఙ్గపద్మాద్యాయుధములను ధరించువాఁడవు; సర్వదేవనమస్కృతుఁడవు; హృషీకేశుఁడవు; సర్వదేవతల చేతను బూజింపఁబడువాఁడవు; పద్మనాభుఁడవు; మహాయోగివి; భక్తుల కభయ మొసఁగువాఁడవు; రావణుని వధించుటకై నీవు మనుష్య శరీరము నవలంబించితివి. నీవుమాత్రము "నేను నారాయణుఁడను" అని యెఱుఁగ కున్నావా? మోహమును బొందకుము. నిన్ను నీవే తెలిసికొనుము. నీవు రహస్యములన్నింటికంటెను రహస్యమైనవాఁడ వని పితామహుఁడన్నాఁడు. నీవు త్రిగుణుఁడవు, త్రివేదివి, త్రిధాముఁడవు, త్రిపదాత్మకుఁడవు, త్రికాలకర్తఁడవు, త్రివిద్యుఁడవు, త్రిదశారిమర్దనుఁడవు, పురాణములగు మూఁడుపాదన్యాసములచే మూఁడులోకములను నీవే యాక్రమించితివి. నీవే యుపేంద్రుఁడవు. బలిని బంధించుకొఱకై యదితి గర్భమున వామనుఁడవై పుట్టితివి. సనాతనుఁడవగు విష్ణుఁడవు నీవే. ఇపుడు లోకముల ననుగ్రహించు తలంపుతో మానుషదేహము నవలంబించి దేవతలకార్యమును సాధించితివి. పాపాత్ముఁడగు రావణుని పుత్రపౌత్రాదులతోఁ జంపితివి. అందువలన దేవతలు మొదలగువారు పరమానందమునుబొందిరి. లోకమంతయు శాంతినిబొందినది. ఇదియంతయు నీదయవలననే జరిగినది. సీత మహాలక్ష్మి, మహాభాగురాలు; నీనిమిత్తమై భూలోకములో జనకునియింటఁ బుట్టినది. ఆరావణుఁడు లంకలో నుంచి తల్లిని గౌరవించినట్లు గౌరవించెను. ఈకథ యిట్లు జరిగినది. ఇదంతయు రామా! నీకీర్తియే. దీర్ఘజీవి యగు నారదుఁడీకథ నాకుఁ జెప్పెను. సనత్కుమారుఁడు రావణునికిఁ జెప్పినది నారదుఁ డెఱిఁగెను. ఆతఁడపుడే సర్వమును వెల్లడిపఱిచెను. ఎవఁడు దీనిని శ్రాద్ధసమయమున బ్రాహ్మణుల సన్నిధియందు వినిపించునో వానిపితృదేవతల కక్షయమై యతఁడిచ్చిన

దందును" అని యిట్లు కుంభసంభవమహాముని చెప్పిన కథను విని రాజీవ లోచనుఁడగు రాముఁడు తమ్ములతోఁగూడ మిక్కిలి యాశ్చర్యమును బొందెను. సుగ్రీవాదులగు వానరులు, విభీషణుఁడు మొదలగు రాక్షసులును, మంత్రులతోఁ గూడినరాజులు, ఇంకను నచ్చటఁ గూడినవారు, బ్రాహ్మణులు, రాజులు, వైశ్యులు, ధర్మాత్ములగు శూద్రులు మొదలగు వారందఱును వికసించిన కన్నులుగలిగి సంతోషముతోఁ గూడినవారైరి. మఱియు వారందఱును సంతోషించుచు రామునే చూచుచుండిరి. "రామా! వినఁదగినదంతయు వింటివి. నిన్నుఁ జూచితిమి. నీతో మాటలాడితిమి. ఇఁక మేము వెళ్లుచున్నాము" అని చెప్పి వచ్చిన మునులందఱును శ్రీరామునిచే యథావిధిగాఁ బూజితులై వచ్చినత్రోవనే పోయిరి.

ప్రక్షిప్తసర్గములు సమాప్తము.

39-వ సర్గము

జనకాదులవీడుకోలు

శ్రీరాముఁడిట్లు పౌరులయు జానపదులయుఁ గార్యములు విచారించుచు దినదినమును జక్కఁగాఁ గడపుచుండెను. తరువాతఁ గొన్నాళ్లకు మిథిలాపతి యగు జనకునిఁ జూచి చేతులు జోడించుకొని యిట్లనియె: "మామా! నీవే మాకుఁ దగిన దిక్కు. నీచేత మేము పాలింపఁబడితిమి. ఉగ్రమగు నీతేజస్సుచేత నేను రావణునిఁ జంపఁగలిగితిని. ఇక్ష్వాకువంశపువారికిని మైథిలవంశపువారికిని సర్వవిధములచేతను సంబంధకపురస్కృతములై ప్రీతులు నిరుపమానములై యున్నవి. కావున రత్నములను గైకొని మాపట్టణమునకు వెళ్లుదువుగాక. మాభరతుఁడు సహాయముగా నీవెంటవచ్చును." అనఁగానే "మంచిదే" యని రామునితో జనకుఁడిట్లనియె: "రామా! నీదర్శనముచేతను, నీనయవినయములచేతను నేను జాలసంతసించితిని. నానిమిత్తమై నీవెన్నిరత్నములను సంపాదించియిచ్చెదవో, అవి యన్నియు నాకుమారిత కిచ్చెదను" అని శ్రీరామునితోఁ జెప్పి జనకుఁడు సంతుష్టాంతరంగుఁడై రామునిచేఅనుజ్ఞాతుఁడై మిథిలకుఁబోయెను. జనకుఁడు వెళ్లినతరువాత మేనమామ యగు కేకయునిఁ జూచి చేతులు జోడించుకొని యిట్లనియె: "మామా! ఈరాజ్యము, ఈనేను, మాభరత

లక్ష్మణశత్రుఘ్నులు నీయధీనులము. నీవే మాకు దిక్కు. నీనిమిత్తమై యిదివఱకే తాతగారు చాల సంతసించుచుందురు. కావున నేఁడే యీరికిఁ బ్రయాణ మేర్పఱిచినచోఁ జాలఁ బాగుగా నుండును. మాలక్ష్మణుఁడు సహాయార్థము వెంటవచ్చును. కావలసినంతధనము, రత్నములు తీసికొని వెళ్ళవలయును" అను రామునిమాటలు విని "మంచిదే" యని యుధాజిత్తు ప్రయాణమున కిష్టపడి "నీవిచ్చురత్నములు ధనము నీకే యక్కఱ మగుచునుండుఁగాక!" యని రాముఁడు ముందుగాఁ దనకుఁ బ్రదక్షిణనమస్కారములు చేసినవెనకఁదాను రామునకుఁ బ్రదక్షిణముచేసి లక్ష్మణుఁడు వెంటవచ్చుచుండఁగా, వృత్రాసురుఁడు హతుఁడైనపిమ్మట విష్ణునితో నింద్రుఁడు వెళ్లినట్లు వెళ్లెను.

ఇట్లు యుధాజిత్తును బంపించి తరువాత శ్రీరాముఁడు స్నేహితుఁడును, నెందును భయములేనివాఁడును, కాశీపతియును నగు ప్రతర్దనునిఁ గౌఁగిలించుకొని యిట్లనియె: "నీవు మాయందుఁగల ప్రీతిని జూపించితివి. మఱియు స్నేహమును జూపించితివి. రాజా! భరతునిచేతనునీతోఁగూడ నుద్యమము చేయఁబడినది, కావునఁ గాశేయా! నీ విపుడు అతిరమణీయమైనదియు, నీచే రక్షింపఁబడినదియు, మంచిప్రకాశముగలదియు, మంచితోరణములుగలదియు నగు వారాణసీపట్టణమునుగూర్చి వెళ్లుము" అని యిట్లు చెప్పి శ్రీరాముఁడు సింహాసనమునుండి లేచి యతనిని గాఢముగాఁ గౌఁగిలించుకొని యాకాసల్యానందవర్ధనుఁడగు రాముఁడతనిని వీడుకొలుపఁ శ్రీరాముని యొద్దననుజ్ఞాతుఁడైన కాశీశుఁడును నెందును భయములేనివాఁడై శీఘ్రముగాఁ గాశికిఁ బోయెను. ఇట్లు కాశీపతిని పంపించి తరువాత మున్నాఁటిమంచిరాజులను జూచి నవ్వుచు నిట్లనియె: "తేజస్సునఁ జే రక్షింపఁబడిన మీ ప్రీతి నిరుపమానమైనది. మీసత్యము ధర్మము నియత మైనదియు నిత్యమైనదియునై యొప్పుచుండును. మహాత్ముల రగు మీ యనుభావముచేతను తేజస్సుచేతను దురాత్ముఁడును దుర్బుద్ధియు నగు రావణుఁడు రాక్షసాధముఁడు చంపఁబడెను. కారణమాత్రమే నేను గాని మీతేజస్సుచేతనే వాఁడు హతుఁడాయెను. వాఁడేకాక వానిపుత్ర పౌత్రాదులుగూడ హతులైరి. అడవిలోనుండఁగా రావణుఁడు జనకరాజు కూఁతును హరించె నని విని మహాత్ముఁడగు మాభరతుఁడు మిమ్ములను రప్పించెను. మీరందఱును యుద్ధోద్యుక్తులై వచ్చి చాలఁగాలమయినది.

ఇక మీరు మీగృహాముల కేగుట నాయిష్ట"మను రామునితో వా రిట్లనిరి: రామా! దైవవశమున జయమును బొంది స్వరాజ్యమునఁ బ్రతి ష్ఠితుఁడవైతివి. సీతను దెచ్చితివి. శత్రువులను జంపితివి. ఇదియే మా గొప్పకోరిక. ఇదియే మాయుత్తమమైన ప్రీతి. శత్రువులను జంపి జయ మును బొందియున్న నిన్నుఁ జూచుటయే మాకుఁ గావలసినది. నీవు మమ్ములను బ్రశంసించితివి. అది నీయం దుచితముగానే యున్నది. నీవు ప్రశంసింపఁదగినవాఁడవు కాని నిన్నెట్లు ప్రశంసింపవలయునో మే మెఱుఁగము. నీచే ననుజ్ఞాతులమై మా మాసట్టణములకుఁ బోయెదము. ని న్నెపుడును మాహృదయములయందే యుంచుకొనియెదము. మహా బాహూ! మేమందఱమును నిచట బహుసంతోషముగా సుంటిమి. నిత్య మును నీకు మాయందుఁ బ్రేమ యుండవలయు ననుటకంటె వేఱుకోరిక గలవారము కాము." తరువాత రాజులందఱును గమనోన్ముఖులై చేతులు జోడించుకొని సంతోషించుచు సెలవు పుచ్చుకొని రామునిచేఁ బూజితు లై తమతమదేశములకుఁ బోయిరి.

39-వ సర్గము

రాముఁడు వానరులను గౌరవించుట

ఇట్లారాజులందఱును సంతోషించుచు వేలకొలఁది గుఱ్ఱముల చేతను, ఏనుఁగులచేతను, రథములచేతను భూమిని కంపింపఁజేయుచు బయలుదేఱిరి. రామునికి సాయముచేయుద మను కోరికతో భరతుని యాజ్ఞాప్రకారముగా ననేకములగు నక్షౌహిణులు వచ్చియున్నవి. బల దర్పసమన్వితులగు నారాజులందఱును నిట్లనిరి: "రామునికి శత్రువగు రావణుని యుద్ధమునందు నెదుట నుండఁగాఁ జూడఁజాలితిమి. వ్యర్థముగా నుతయు ముగిసినవెనుక భరతుఁడు మనలను రావించెను. మనము ముందు గానే వచ్చినచో రాక్షసులను మనమే చంపుదుము. రామలక్ష్మణులచే రక్షింపఁబడుచు సముద్రము నవతల సుఖముగా యుద్ధము చేయుదుము" ఇట్లు వేలకొలఁది రాజులివియు మఱికొన్ని యనగు కథలు చెప్పుకొనుచు సంతోషపూర్వకముగా నిజమతమరాజ్యములనుగూర్చి పోయిరి. ముఖ్య ములు, సంపన్నములు, మండితములు, సమృద్ధధనధాన్యములు, పూర్ణ ములు, వసుమంతములు నగు తమతమరాజ్యములలోఁ బ్రవేశించి వివిధ

ములగు రత్నములు మొదలగునవి శ్రీరామునకుఁ గానుకగాఁ బంపిరి. మఱియు నశ్వములను, మదపుటేనుఁగులను, ముఖ్యములగు చందనములను, దివ్యములగు నాభరణములను, మణులు, ముత్యములు, పగడములు, దాసీజనము, అజావికము, రథములు మొదలగువానిని కానుకగా సమర్పించిరి. ఆవియన్నియుఁ గైకొని భరతుఁడు లక్ష్మణుఁడు శత్రుఘ్నుఁడు తమపట్టణములోఁ బ్రవేశించిరి. ఇట్లు రమ్యమగు నయోధ్యలోఁ బ్రవేశించి రాము తెచ్చినవన్నియు శ్రీరామునిసన్నిధిలో సమర్పించిరి. తమ్ములు తెచ్చియిచ్చినవాని నన్నింటినిఁగైకొని రాముఁడు సంతోషించుచుఁ దనకు జయముగలుగుటకుఁ గారణభూతులగు సుగ్రీవాదివానరులకును, విభీషణాదిరాక్షసులకును గానుకగా నొసఁగెను. మహాబలులగు వానరరాక్షసులు లవిపుచ్చుకొని సంతోషపూర్వకముగా ధరించిరి. అపుడిక్ష్వాకుకులధురంధరుఁడగు రాముఁడు హనుమంతుని, అంగదుని తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని సుగ్రీవునితో నిట్లనియె:

"సుగ్రీవా! అంగదుఁడు నీకుఁ గుమారుఁడు. హనుమంతుఁడు నీమంత్రి. వీరు నీహితమును గోరుచుండువారు; నాకును మేలుచేయుటకై వచ్చినవారు. నిన్నుఁబట్టి వీరెట్టిగౌరవమునకేని దగినవారు" అని చెప్పి మహోయశుండగు రాముఁడు తనదేహమునుండి నగలుతీసి యంగదునకును హనుమంతునకును దానే యలంకరించెను. తరువాత మహావీర్యులు, యూథపతులలోఁ శ్రేష్ఠులునునగు నీలుఁడు, నలుఁడు, కేసరి, కుముదుఁడు, గంధమాదనుఁడు, సుషేణుఁడు, పనసుఁడు, వీరుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, జాంబవంతుఁడు, గవాక్షుఁడు, వినతుఁడు, ధూమ్రుఁడు, వలీముఖుఁడు, ప్రజంఘుఁడు, సన్నాదుఁడు, మహాబలుఁడు, దరీముఖుఁడు, దధిముఖుఁడు, ఇంద్రజానుఁడు మొదలగువారిని ప్రేమపూర్వకముగాఁజూచి రాముఁ డిట్లనియె: "వానరశ్రేష్ఠులారా! మీరందఱును స్నేహితులు, మీరే నాశరీరము. మీరు నాసోదరులు. మీరు నన్నట్టి చిక్కులలోనుండి యుద్ధరించితిరి. మీవంటిస్నేహితులు గలిగియుండుటచే సుగ్రీవుఁడు ధన్యుఁడు." అని చెప్పి వారికందఱికును యథోచితముగ నాభరణములు వస్త్రములు మొదలగుననియిచ్చి కౌఁగిలించుకొనెను. ఇట్లు వానరులందఱును రామునిచే గౌరవింపఁబడి యిచ్చకు వచ్చినరీతుల మించి మంచి తేనెలు ద్రావుచు, మాంసములు దినుచు, పండ్లు తినుచు, లోక

MEMORIAL
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

పూసముదినములు నిమిషమాత్రముగాఁ గడపిరి. కామరూపులగు నా వానరులతోఁగూడి శ్రీరాముఁడును వినోదించుచుండెను. మఱియు వీర్యశాలురగు రాక్షసులు, మహాబలు లగు ఋక్షవరులును శ్రీరాముని సంతోషింపఁజేసిరి. ఇట్లు వారి కచ్చటనే చల్లఁగా రెండవనెలకూడఁ గడచినది. వానరులు రాక్షసులు నయోధ్యలో సర్వవిధములచేతను సంతోషించుచు రామునికి సంతోషమును గలిగించుచుఁ గాలము తెలియకుండ నుండిరి.

40-వ సర్గము

వానరరాక్షసులవీడుకోలు

ఈరీతిగా ఋక్షవానరరాక్షసు లుండఁగా మహాతేజుం డగు రాముఁడు సుగ్రీవునితో నిట్లనియె : "సౌమ్యా! సురాసురులచే దురాధర్షమగు కిష్కింధకుఁ బొమ్ము. మంత్రులతోఁగూడి నిహతకంటక మగు రాజ్యమును పాలించుము. అంగదుని పరమప్రీతితోఁ జూచుకొమ్ము. హనుమంతుని, మహాబలుఁ డగు నలుని, మామగారగు సుషేణుని, వీరుఁ డగు తారుని, బలవంతుఁడగు కుముదుని, దుర్ధర్షుఁడగు నీలుని; మహాబలుఁ డగు శతబలిని, మైందద్వివిదులను, గజుని, గవయుని, గవాక్షుని, శరభుని, గంధమాదనుని, ఋషభుని, సుపిక్రాంతుఁడగు జాంబవంతుని, మఱియు నానిమిత్తమై కష్టపడిన మహోత్సులగు నితరవానరులను, నీవు సదాప్రేమతోఁ జూచుచుండుము; వారి కెప్పుడును నప్రియము చేయకుము. వీ రెల్లరు నాకోసము జీవితమును త్యజింప సిద్ధపడినవారు." అని చెప్పి మాటిమాటికిని సుగ్రీవునిఁ గౌఁగిలించుకొని రాముఁడు తీయనిమాటలతో విభీషణుని జూచి యిట్లనియె: "విభీషణా! నీవు ధర్మముగా లంకను పాలించుము. నీవు ధర్మువు తెలిసినవాఁడవని నేనెఱుఁగుదును. పురమును, రాక్షసులను, అన్నయగు వైశ్రవణుని ధర్మబుద్ధిఁ జూచుచుండుము. రాజా! నీ వెప్పుడును ధర్మము దప్పి నడవకుము బుద్ధిమంతులగు రాజులు శాశ్వతముగా భూమి ననుభవించుచుందురు. విభీషణా! నీవును సుగ్రీవుఁడును నిత్యమును నన్నుఁ దలంచుచుందురుగాక. నాయందుఁ బ్రేమ యుంచి విచారింపక సంతోషపూర్వకముగా లంకకుఁ బొమ్ము" అని చెప్పిన యారామునిమాటలు విని ఋక్షవానరరాక్షసులు మాటిమాటికిని రాముని సాధు

వాదములచేఁ బ్రశంసించిరి. "రామా! నీబుద్ధియు, పరాక్రమము నత్యద్భుతమైనవి.స్వయంభువునకువలెనే నిత్యమును నీకు మాధుర్యము మిక్కిలిగాఁ గలదు." అని యిట్లు వానరులు రాక్షసులు పలుకుచుండఁగా హనుమంతుఁడు సవినయముగా రామునితో నిట్లనియె: "రాజా! నాస్నేహము నిత్యమును నీయందుండుటగాక. నీయందే తప్పఁ దక్కినచోట్లను నాకు భక్తి యుండకుండుటగాక! ఈభూతలమందు నీకథ యెంతవఱకుండునో అంతవఱకును నాశరీరమునందుఁ బ్రాణము లుండుటగాక! రఘునందనా! నీదివ్యచరిత్రమును, నీకథలను నాకచ్చరలు నిత్యమును వినిపించుచుందురుగాక! మహావీరా! అది విని వాయువు మేఘమూలను వలె నీయందలి యుత్కంఠను బోఁగొట్టుకొందునుగాక" అని యిట్లు చెప్పుచున్న హనుమంతునిఁజూచి రాముఁడు సింహాసనమునుండి దిగి స్నేహము మితిమీఱి హనుమంతునిఁ గౌఁగిలించుకొని యిట్లనియె: "కపిశ్రేష్ఠా! నీవిపు డన్నట్లే యంతయుఁ దప్పక జరుగును. నీ వన్నట్లు నాకథ భూలోకమునం దున్నంతదనుక నీకీర్తియుఁ బ్రాణములును స్థిరముగా నుండును. లోకము లున్నంతవఱకును నాకథ తప్పక యుండును. కపివరా! నీవు నావిషయమై చేసిన యొక్కొక్కయుపకారమునకు నీకుఁ బ్రాణముల నర్పింపఁదగును. నరుఁడు ఆపదలు రాఁగా ప్రత్యుపకారములకు పాత్ర మగుచుండును." అని చెప్పి వెంటనే చంద్రకాంతిం దిరస్కరించు ముక్తాహారమును దీసి హనుమంతునికంఠమునందు వైచెను. ఆ హారము వక్షస్థలము పై వెలుఁగుచుండఁగా హనుమంతుఁడు చంద్రునిచే నాక్రమింపఁబడిన మేరుపర్వతశిఖరము ననుకరించియుండెను. ఇట్లు రాముఁడు చెప్పిన మాటలు విని వానరులందఱును లేచి రామునిపాదములకు నమస్కరించి తొలఁగిరి. రాముఁడపుడు సుగ్రీవుని విభీషణునిఁ గౌఁగిలించుకొనెను. అందఱును గన్నుల నీరు విడిచిరి. అందఱును రాముని విడువవలసివచ్చినందులకై విచారము నొందిరి. మఱియు నందఱును రోదన మారంభించిరి. అందఱును రాముఁ డోదార్చి పంపెను. జీవుఁడు దేహమును విడువఁజాలక విడిచినట్లు రాముని విడిచి తమతమదేశములకు బయలుదేఱిరి. తదనంతర రాక్షసభల్లూకవానరులు రఘువంశవర్ధనుఁడగు రామునికి నమస్కరించి రామవియోగమువలనఁ గలిగిన కన్నీటితో నిండిన నేత్రములు గలవారై తమతమనివాసములకుఁ బ్రయాణము చేసిరి.

41-వ సర్గము

పుష్పకమును పదలుట

మహాబాహుడగు రాముఁ డిట్లు ఋక్షవానరరాక్షసులను బంపి తమ్ములతోఁగూడి సుఖియై సుఖముగా సంతోషించుచుండెను. తరువాత రాముఁ డపరాహ్ణసమయమునఁ దములతోఁగూడ నంతరిక్షమునుండి పలుకఁబడిన మధుర మగు వాక్యమును వినెను: "సౌమ్యా! రామా! సౌమ్యమగు మొగముతో నన్నుఁజూడుము. నేను బుష్పకమను విమాన మును; కుబేరునియొద్దనుండి నచ్చితిని. నీయాజ్ఞను శిరసావహించి కుబే రునియొద్దకుఁ బోతిని. నన్నుఁజూచి యత్ఁ డిట్లనియె: 'ఓవిమానమా! మహోత్సుఁడును రాజేంద్రుఁడును నగు శ్రీరాముఁడు యుద్ధములో రాక్షస రాజగు రావణుని జంపి నిన్నుఁ గైకొనెను. ఆరావణుఁడు పుత్రపౌత్ర సమేతముగాఁ జచ్చుట నాకెంతయుసంతోషకరము. పరమాత్మస్వరూపుఁ డగు రాముఁడు నిన్ను లంకలో జయించి తెచ్చుకొన్న వాఁడు గావున నీ వామహానుభావునినే మోయుచుండుము. నేను నీకాజ్ఞాపించుచున్నాను. నా కిదియే ముఖ్యమైన కోరిక. కావున నిర్విచారముగాఁబోయి యాతఁ నకు వాహనమవైయుండుము.' అని చెప్పిన కుబేరుని యాజ్ఞాప్రకారము నీయొద్దకు వచ్చితిని. కావున నిరనుమానముగా రామా! నన్నంగీకరిం పుము. కుబేరునియాజ్ఞవలన సర్వభూతములకును గనుపడకుండ నీ యాజ్ఞను బరిపాలించుచుఁ దిరుగుచుండెదను." అని యిట్లు పుష్పకవిమా నము విన్నవించినతోడనే తిరిగివచ్చిన యావిమానమును జూచి రాముఁ డిట్లనియె: "విమానవరమా! పుష్పకమా! అట్లేని నీకు స్వాగతము. కుబేరుఁ డంగీకరించె నని చెప్పితివి గనుక నీక నాయం దేవిధమైనదోష మును నుండదు" అని చెప్పి లాజలు పుష్పములు మొదలగువానిచేఁ బూజించి పరిమళించుధూపములు వేసి "యిచ్చకు వచ్చినచోటికిఁ బోయి నేను స్మరించినతోడనే నాయొద్దకు వచ్చుచుండు"మని విమానమున కాజ్ఞాపించి మరల నిట్లనియె: "ఓవిమానమా! సిద్ధులగతికి భంగము కలుగఁజేసి వారికి దుఃఖమును గలిగింపకుము. యథేష్టముగాఁ దిరుగు చుండు నీకెందును బ్రతిఘాతము కలుగకుండునుగాక" అనఁగానే యా విమాన "మట్లే"యని రామునిచేఁ బూజింపఁబడి విడువఁబడినదై తన

యిచ్చకు వచ్చిన మచ్చునఁ బోయినది. పుణ్యవంత మగు విమానము స్వేచ్ఛగా నంతర్ధానమును బొందిన పిమ్మట భరతుఁడు చేతులు జోడించు కొని రామునితో నిట్లనియెఁ: "అన్నా! మహావీరుఁడవును, నానాస్వరూ పుఁడవును నగు నీవు పరిపాలించుచుండఁగా నమానుషములగు సత్వముల మాటలు మాటిమాటికిని వినఁబడుచున్నవి. ఏసత్వమునకు రోగభయము లేదు. ఇప్పటి కొక్కనెల గడచినది. జీర్ణములగు జంతువులకైనను మృత్యువువలని భయము లేదు. స్త్రీలు సుఖప్రసవము గలవా రయిరి. మనుష్యులందఱును వపుష్మంతులయిరి. పురవాసులందఱికిను నెక్కుడు సంతోషము గలుగుచున్నది. కాలము తప్పకుండఁ బర్జన్యుఁడు వర్షించు చున్నాఁడు. వర్షమా! అమృతమును మించి యున్నది. వాయువులు స్పర్శానుకూలములును, సుఖకరములును, శివములును నై వీచుచున్నవి. పౌరులు, జానపదులు తఱచుగా నిట్టిరాజే మా కెప్పుడును నుండునుగాక యని మాటిమాటికిని జెప్పుచున్నారు" అని యిట్లు మధురముగాఁ జెప్పిన భరతునిమాటలు విని రాముఁడత్యంతసంతోషమును బొందెను.

42-వ సర్గము

సీతారాములవనవిహారము

తదువాత రాముఁడు హేమభూషిత మగు పుష్పకవిమానమును విడిచి యపుడశోకవనములోఁ బ్రవేశించెను. ఆవనము చందనవృక్షములు, అగురువృక్షములు, చూతవృక్షములు, ఉన్నతము లగు కాలేయకములు, దేవదారువనములు మొదలగువానిచే నంతటను శోభితమై యున్నది. మఱియుఁ జంపకములు, అశోకములు, పున్నాగములు, ఇప్పలు, పనసములు, అసనములు, పొగలేని యగ్నివలెఁ బ్రకాశించు పారిజాతములు, లోధ్రములు, నీపములు, అర్జునములు, నాగములు, సప్తపర్ణములు, అతిముక్తకములు, మందారములు, కదళులు, పొదరులు, లతాజాలములు, ప్రియంగువులు, కదంబములు, వకుళములు, జంబూషండములు, దాడిమములు, కోవిదారములు మొదలగు వృక్షాదులచే నెంతయు వింతసంతసమును గలిగించుచుండెను. సర్వకాలసర్వావస్థలయందును రమ్యములగు పుష్పములచేత మనోహరములగునవియు, ఫలవంతములును, దివ్యగంధరసోపేతములును, తరుణాంకురపల్లవములును, శిల్పులచేఁ గల్పితము

లును, నత్యంతము సొగసైన పల్లవములు పుష్పములు గలిగి మదించిన తుమ్మెదలచే నొప్పుచునుండు నానావిధములైన వృక్షములచేతను, కోకిలములు భృంగరాజములు నానావర్ణములగు పక్షులు మొదలగువానిచే నొప్పారుచుండునదియు, వందలకొలఁది చిత్రములు గలదియు నై యావనము ప్రకాశించుచుండును. మఱియు నందు బంగారువన్నెగలవియు, నగ్నిశిఖవంటి కాంతిగలవియు నీలాంజనసమానములు నగు వృక్షములు గలవు. ప్రతివృక్షమునందును పరిమళించు పుష్పములు గలవు. అనేక విధములైన మడుగులు తీయనినీటితో నిండారియుండును. ఆదీర్ఘికలకు మాణిక్యములచే సోపానము లేర్పఱుపఁబడియున్నవి. అచ్చటచ్చట స్ఫటికపురాళ్లచేఁ గట్టఁబడిన యరుగులు గలవు. ఆదీర్ఘికాజలములలో వికసించిన పద్మములున్నవి. చక్రవాళదంపతులు నిండియుండును. మఱియు దాత్యూహములు చిలుకలు ఘోషించుచుండును. హంసలు సారసపక్షులు ధ్వనిచేయుచుండును. వానితీరములయందు పూచినచెట్లు గలవు. వివిధాకారములగు ప్రాకారములును వైడూర్యమణులతోఁగట్టిన తిన్నెలును గలవు. వేయేల? ఆయుద్యానము దేవేంద్రునినందనవనమును, కుబేరునిచైత్రరథమును మించియున్నది. రామునియుద్యానముగదా! అది. ఎటులుండిన దన్నను నాశ్చర్యమేమియుండును? బహ్వాసనములు గల గృహములతో నొప్పుచు లతాగృహములతో నిండి సర్వసమృద్ధమైన యాయశోకవనములోఁ బ్రవేశించి, శ్రీరాముఁడు పుష్పవిభూషితమై శుభాగారమయిన యాసనమునందుఁ గూర్చుండెను. ప్రక్కనే సీతాదేవిని చేయిపట్టుకొని కూర్చుండఁబెట్టుకొనెను. ఆమెచే శుచియగు మైరేయకమును మద్యమును శచిచే నింద్రుఁడమృతమును త్రాగించినట్టు త్రాగించెను. బాగుగా వండఁబడిన మాంసములు వివిధములైన ఫలములు తెచ్చి కింకరులు సీతారాములసన్నిధి నుంచిరి. నృత్తగీతవిశారదలగు బాలికలు రూపవతులగు యువతులు త్రాగి యొడలుమఱచి రామునిసన్నిధి నాడుచుండిరి. ఇట్లు రాముఁడు నిత్యమును భూషితుఁడై మనోభిరామలగు నారామలను సంతోషింపఁజేయుచుండెను. శ్రీరాముఁడు తేజోవంతుఁడై యరుంధతితోఁగూడిన వసిష్ఠమహాముని వలె సీతాదేవితోఁ గూర్చుండి యొప్పారుచుండెను. సురసుతోపమయగు సీతను బ్రతిదినమును రాముఁడు సంతోషపూర్వకముగా రమింపఁజేయుచుండెను. ఈప్రకారముగా నాయశోక

వనములో సీతారాములు విహరించుచుండఁగా భోగార్హమైన శిశిరకాల మతిక్రమించినది. మహోత్సులగు నాసీరాములకుఁ బదివేలసంవత్సరము లతిక్రమించినవి. వివిధములగు భోగము లనుభవించుచుండఁగా శిశిర కాలము గడచినది. ధర్మాత్ముఁడగు రాముఁడు పూర్వాహ్ణమునందు ధర్మ కార్యములు నెఱవేఱుచుకొని మిగిలిన దివసభాగమునంతయు నంతఃపుర ములోఁ గడపుచుండును. సీతాదేవియుఁ బూర్వాహ్ణమునందు దేవ కార్యములను నిర్వర్తించి ముగ్గురత్తలకును సమముగా పూజావిధిని, శుశ్రూషను జేయుచుండును. తరువాత బాగుగా నలంకరించుకొని శచీ దేవి యింద్రునియొద్దకు వచ్చునట్లు రామునియొద్దకు వచ్చుచుండును. కల్యాణసమన్విత యై తనయొద్దకు వచ్చిన భార్యను జూచి రాముఁడు సంతోషించి స్తుతి చేయుచుండును. మఱియు వరారోహ యగు సీతను జూచి రాముఁ డిట్లనియె: "జానకీ! నీయం దిపుడు గర్భలక్షణము లగ పడుచున్నవి. నీకిపుడేమి కావలయును. ఏమిచేయుమందువో చెప్పుము." అను రామునిమాటలు విని చిఱునగవుతో సీత రామునిమొగము చూచియుఁ జూడఁజాలక యిట్లనియె: "రాఘవా! పుణ్యపుణ్యములగు తపోవనములు చూడఁ గోరిక పుట్టుచున్నది. గంగాతీరమునందలి ఋషుల యాశ్రమములు చూచి యచ్చటి వృక్షమూలములయందు విహరింప నిచ్ఛ గలిగినది. నాథా! ఒకదినమైనను దప్పక కందమూలఫలాశనులగు మునుల తపోవనములలో నుండి రావలయునను కోరికతప్ప వేఱుకోరిక లే"దని సీతమాటలు విని యక్లిష్టకర్ముఁడగు రాముఁ "డట్లే నమ్ముకొని యుండుము. రేపు తప్పక వెళ్లఁగలవు." అని జనకరాజాత్మజ యగు సీత తోఁజెప్పి స్నేహితులతోఁగూడి మధ్యకక్ష్యాంతరమునుండి బయటికి వచ్చెను.

43-వ సర్గము

పౌరులమాటలు భద్రుడు చెప్పుట

రాముఁడొకచోఁ గూర్చుండియుండఁగాఁ బండితులును, అనేకము లగు కథ లెఱిఁగినవారును, హాస్యము చెప్పువారును నగువిజయుఁడు, మధుమత్తుఁడు, కాశ్యపుఁడు, పింగళుఁడు, కుటుఁడు, సురాజుఁడు, శాలి యుఁడు. భద్రుఁడు, దంతవక్త్రుఁడు, సుమాగధుఁడు ననువారు పరిహాస

సమన్వితములైన యనేకకథలు చెప్పుచుండిరి. తరువాత రాముఁ డొకా నొకకథ చెప్పుచుండఁగా నిట్లనియె: "భద్రా! పట్టణమందును పల్లెలయం దును నావిషయమై యేమి చెప్పుకొనుచున్నారు? సీతనుగుఱించి యేమి యనుకొనుచున్నారు? భరతుని, లక్ష్మణుని, శత్రుఘ్నుని, కైకేయిని, మా యమ్మను, సుమిత్రను సుద్దేశించి యేమేమి చెప్పుకొనుచుందురు? శ్రేష్ఠ మగు రాజ్యమందలి రాజులు వక్తవ్యతను బొందుచునే యుందురుగదా!" అని రాముఁ డడుగఁగా, భద్రుఁ డనుహాఁడు చేతులు జోడించుకొని యిట్లనియె: "దేవా! పురవాసులు చెప్పుకొనుకథ లనేకములున్నవి. అవి యన్నియు మంచివే. రావణునిఁజంపి సంపాదించిన జయమునుగూర్చి మన పట్టణమం దనేకవిధములుగాఁ బౌరులు చెప్పుకొనుచున్నారు" అని భద్రుఁ డనఁగానే, రాముఁ డిట్లనియె: భద్రా! ఉన్నది యున్నట్లు సర్వ మును జెప్పుము. మంచిమాటలుగాని చెడ్డమాటలుగాని దాచక చెప్పుము. అవి విని యిటుపైని మంచిపనులు చేయుచుఁ జెడుపనులు మాను కొందును. నీమనసులో సుంతయు భయపడక విన్నవి విన్నయట్లు చెప్పుము. అందఱును పుణ్యాత్ములే యుండరు. జనపదములయందుఁ బాపాత్ములును నుందురు." అని రాముఁడు నొక్కియడుగఁగా, వాఁడు సావధానముగాఁ జేతులు జోడించుకొని యిట్లనియె: "రాజేంద్రా! అటు లేని వినుము. చత్వరములయందును, ఆపణములయందును, రథ్యల యందును, వనములయందును, ఉపవనములయందును పౌరులు చెప్పు కొనుచుండునవి యేమనఁగా:—"రాముఁడు దుష్కరమైన కార్యములు చేసెను. దేవదానవులకుఁగూడ దుష్కరమైన సేతువును సముద్రములోఁ గట్టించెను. ఇదివఱకు విన్నదియుఁ గన్నదియుఁ గాదు. దురాధర్షుఁ డగు రావణుని పుత్రపౌత్రాదులతోఁ జంపెను! ఋక్షవానరరాక్షసులను స్వాధీనము చేసికొన్నాఁడు. రావణుని యుద్ధములోఁ జంపి తనపౌరుష మును వెనుక నుంచుకొని సీతను దోడ్కొని మరల నింటికి వచ్చినాఁడు. రామునిహృదయములో సీతాసంభోగమువలనఁ గలిగిన సుఖమెట్టిదో తెలియదుగాని, పూర్వము రావణుఁడు బలాత్కారముగాఁ దనతొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని లంకకుఁ దీసికొనిపోయి యశోకవనములో నుంచిన సీతను మరలఁ దెచ్చుకొన్నాఁడు. రామునకు నుంచి చెడ్డ తెలియకపోయి నది. ఇటుపైని మాభార్యలవిషయమున నేమి జరిగినను మేముగూడ

సహింపక తీరదుగదా! ఏమన: రాజెట్లు నడచినఁ బ్రజలట్లేకదా నడువ వలసియుండును!" అని యీరీతిగాఁ బురవాసు లనేకవిధములుగాఁ జెప్పు కొనుచున్నారు. ఎక్కడఁజూచినను జనులు గుంపులుగూడి యీమాటలే చెప్పుకొనుచున్నారు" అని చెప్పిన భద్రునిమాటలు విని, రాముఁడు మిక్కిలి పీడ నొందినట్లు విచారించుచు మిత్రులవంకఁజూచి యిదేటికిసంగ తియో నాకుఁ జెప్పుఁడన, వారందఱును శిరస్సుచే భూమికి వందనములు చేసి దీనముగా"అవును. నిస్సంశయమే." అనిరి. అందఱును నేకీభవించి చెప్పినమాటలు విని శత్రుసూదనుఁడగు రాముఁ డందఱు చెలికాండ్రను వారివారియిండ్లకుఁ బోవ సెలవొసఁగెను.

44-వ సర్గము

రాముఁడు తమ్ముల రావించుట

ఇట్లుశ్రీరాముఁడు మిత్రవర్గమును విసర్జించి దగ్గఱనున్న ద్వారపాల కునిజూచి"శీఘ్రముగా శుభలక్షణుఁడగు లక్ష్మణునిఁ దోడితెమ్ము.మఱియు భరతుని శత్రుఘ్నునిఁగూడ రమ్మనుము." అను రాముని మాటను శిరసా వహించి చేతులు జోడించుకొని నిరభ్యంతరముగా లక్ష్మణుని యింటికిఁ బోయి"శీఘ్రముగా రాజు నిన్నుఁజూడఁగోరుచున్నాఁ" డనెను. లక్ష్మ ణుఁడు రాముని యాజ్ఞను విని మంచిదే యని రథమెక్కి యతివేగముగా నన్న యొద్దకుఁ వచ్చెను. లక్ష్మణుఁడు బయలుదేఱఁగానే ద్వారపాలుఁడు భరతునిఁజూచి నమస్కరించి యన్న యాజ్ఞను వినిపించెను. భరతుఁ డన్న శాసనమును విని వెంటనే యాసనమునుండిదిగి కాలినడకనే యన్న దగ్గఱకు బయలుదేఱెను. భరతుఁడు బయలుదేఱఁగానే ద్వారపాలుఁడు వేగ ముగా శత్రుఘ్నునియింటికిఁబోయి యాతనితోడ నిట్లనియె: రఘుశ్రేష్ఠా! లెమ్ము రమ్ము. రాజు నిన్నుఁజూడఁగోరెను.ఇదివఱకే లక్ష్మణుఁడును భరతుఁ డును వెళ్లియున్నారు" అని చెప్పఁగానే, శత్రుఘ్నుఁ డాసనము విడిచి యచ్చటనే నమస్కరించి యన్న యున్న చోటికిఁ బయనమాయెను. ద్వార పాలుఁడు రాముని సమీపించి ముగ్గురును వచ్చియున్నారని మనవిచేసెను. తమ్ములరాక విని రాముఁడు చింతాకులితమనస్కుఁడై శిరస్సునంచుకొని దీనమైన మనస్సుగలవాఁడై ద్వారపాలునితో నిట్లనియె : "నీవు శీఘ్ర ముగాఁ దమ్ములను లోపలకు రమ్మనుము. నా ప్రాణములు, జీవనము వీరియం

దున్నవి" అనఁగానే, ద్వారపాలుఁడు లక్ష్మణాదులను లోపలకుఁ బ్రవేశింపఁజేసెను. ఇట్లు రా జాజ్ఞాపించినతోడనే శుక్లవస్త్రధారులగువారు ముగ్గురును వినయముతోఁ జేతులు జోడించుకొని సావధానముగా దగ్గఱకు వచ్చిరి. వచ్చి చూచునప్పటికి రాముని ముఖము రాహుగ్రస్తమగు చంద్రునివలెను, సంధ్యాగతుఁడగు సూర్యునివలెను గాంతిహీనమైయగపడినది. ధీమంతుఁడగు రాముని ముఖము కన్నులనుండి నీరు వచ్చుచున్న దగుటచే మంచుతోఁ దడిసిన పద్మమువలె శోభాహీనముగాఁ గన్పట్టినది. అపుడు వారు ముగ్గురును త్వరితముగా రాముని పాదములకు నమస్కరించి సన్నిధిని నిలువఁబడిరి. రాముఁడు కన్నులనీరు గార్చుచుఁ దమ్ములను గౌఁగిలించుకొనియెత్తియాసనములయందుఁ గూర్చుండుమఁడని నియోగించియిట్లనియె : "తమ్ములారా! మీరు నాసర్వస్వము. మీరు నా ప్రాణము. మీచేతను నీయఁబడిన రాజ్యమును నేను బాలించుచున్నాను. మీరు శాస్త్రములన్నియుఁ జదువుకొంటిరి. బుద్ధిమంతులరు. ఇపుడు మీరందఱును గలిసి నాకొక కార్యము సంపాదింపవలసియున్నది" అని రాముఁడు చెప్పఁగా, సావధానమనస్కులయ్యును నొగిలిన చిత్తములుగలవారై "రాజేమని చెప్పఁబోవునొకో" అనుకొనిరి.

45-వ సర్గము

సీత నడవిలో విడువు మనుట

ఇట్లు వారు ముగ్గురును దీనచిత్తులై కూర్చున్నపిదప రాముఁడు నొచ్చెండిపోవుచుండఁగా నిట్లనియె : మీరందఱును వినుఁడు. మీకు మేలగుఁగాక. మనస్సున్యథాగా నుంచకుఁడు. సీతవిషయమై నాకుఁ బౌరుల వలనను జానపదులవలనను గలిగిన యపవాదము సహింపరానిది. అది మిగుల నసహ్యకరమై మర్మములను గోయుచున్నది. నేను మహోత్తులగు నిక్ష్వాకువంశమువారి కులమునఁ బుట్టితిని. సీతయు మహోత్తులగు జనకవంశపువారి సత్కులమునఁ బుట్టినది. మేము దండకలో నుండఁగా రావణుఁడు మేము లేనిసమయము చూచి సీత నపహరించెనుగదా! వానిని నేను జంపితిని. తరువాత 'నే నీసీతను మరల నెట్లు కైకొని పట్టణములోనికిఁ దీసికొని రావచ్చును' అని నాకచ్చటనే బుద్ధియందుఁ దోఁచినది. నమ్మికకొఱకై సీత యగ్నిలోఁ బ్రవేశించినది. లక్ష్మణా! యిదియంతయు

నీకుఁ బ్రత్యక్షమెనసంగతియేకదా! దేవతలు, అగ్ని దేవుఁడు, ఆకాశగోచరుఁడై వాయుదేవుఁడు 'సీత నిర్దోషురాలు' అనిచెప్పిరి. దేవతలసన్నిధిలోఁ జంద్రసూర్యులు, ఋషులు మొదలగువారు 'సీత నిర్దోషురాలు' అని చెప్పిరి. ఈరీతిగా సీతను శుద్ధసమాచారనుగాఁ జెప్పినపిదప మహేంద్రుఁడు లంకాద్వీపములో సీతను నాచేతి కప్పగించెను. సీత పరిశుద్ధురాలని నాయంతరాత్మ కూడ నంగీకరించినది. తరువాత నట్లసీతను దోడుకొని యయోధ్యకు వచ్చితిని. ఈలోకాపవాదము ప్రస్తుతము లోకమంతయు వ్యాపించి నాహృదయమునకు మిక్కిలి శోకమును గలిగించుచున్నది. ఎవరికైనను లోకములో నెంతవఱి కపకీర్తి వ్యవహరింపఁబడుచుండునో వాఁడంతవఱికును నరకకూపమునఁ గూలియుందురు. దేవత లపకీర్తినినిందించి కీర్తిని గొనియాడుచుందురు. మహాత్ములగువారందఱును గీర్తికై పాటుపడుచుందురు. నేనపవాదకు భయపడి నాజీవితమునుగాని, మిమ్ములను గాని విడుచుటకు సిద్ధమెయుండువాఁడను. అట్టిసంగతిలో జనకరాజు కూఁతురగు సీతను విడుచుటయున నెంత? కావున మీరు శోకసముద్రములో మునిఁగియున్న నన్నుఁ జూడుఁడు. ఇంతకంటె నధికమైన దుఃఖము నాకు వేఱొకటుండునా? తమ్ముఁడా! లక్ష్మణా! నీవు రేపుప్రభాతమున సుమంత్రుఁడు సారథిగాఁగల రథమ్మునై సీతను గూర్చుండఁబెట్టి యడవిలో విడిచిరమ్ము. గంగయవతలియొడ్డున వాల్మీకిభగవానుని దివ్యమయిన యాశ్రమముగలదుగదా! అది తమసాతీరము నాశ్రయించియున్నది. నీవావిజనమైన యడవిలో సీతను విడిచి వెంటనేరమ్ము. నేను జెప్పినమాట తప్పకుము. నీ విపుడు సీతవిషయమై యేమియుఁ జెప్పరాకుము. ఇందు విషయమై యాలోచింపక వేగముగాఁ జేసిరమ్ము; ఇందులకు నీవు మాఱు పల్కితివేని నీయందు నాకుఁ జాలఁ గోపమువచ్చును. మీముగ్గురిలో నెవరు ప్రతిచెప్పినను నాతోడు. నేను జెప్పినమాటనుగూర్చి యనునయ పూర్వకముగా నెవరేనిచెప్పినను వారు నాకుఁ బరమశత్రులుగా భావింపఁబడుదురు. నాయభీష్టమునకు విఘాతముచేయఁదగదు. మీరు నాయాజ్ఞయందున్న వారలైనచో నామాటను మన్నింపుఁడు. ఇక్కడనుండి నేడే సీతను దీసికొని పోవునది. నామాట చెల్లించి తీరవలెను. సీత పూర్వము గంగాతీరమందలి మునాశ్రమములను జూడఁగోరియున్నది. దానికోరికయుఁ బూర్తిపఱచినట్లగును" అని చెప్పి రాముఁడు కన్నీటితోఁ

గప్పఁబడిన దృష్టిగలవాఁడై తమ్ములు పరివారించియుండఁగా శోకసంతప్త హృదయుఁడై యేనుఁగువలె నిట్టూర్పులు విడుచుచు నంతఃపురములోఁ బ్రవేశించెను.

46-వ సర్గము

లక్ష్మణుఁడు సీత నడవికిఁ గొంపోవుట

తరువాత రాత్రి తెల్లవాఱినతోడనే దీనచేతసుఁడగు లక్ష్మణుఁడు నోరెండిపోవుచుండఁగా సుమంత్రునిఁ బిలిచి యిట్లనియె : "సుమంత్రా! శీఘ్రముగా రథమునకు గుఱ్ఱములను గట్టుము. రాజభవనమునుండి తెచ్చి సీతనిమిత్తమై మంచిమెత్తని యాసనము వేయుము. సీతను రామాజ్ఞప్రకారము పుణ్యాశ్రమములగు ముసులయాశ్రమమునకు నేను దీసికొనివెళ్లవలయును. వేగముగా రథముఁదెమ్ము."అను లక్ష్మణునిమాటలువిని సుమంత్రుఁ "డట్లే" యని మంచిగుఱ్ఱములను బూన్చినరథమును దెచ్చెను. దానిలో సుఖముగాఁ బరుండుటకుఁ దగినశయ్య సిద్ధముచేయఁబడియుండెను. అట్టి రథమును దెచ్చి మిత్రులమానమును వృద్ధినొందించు లక్ష్మణునిఁ జూచి సుమంత్రుఁ డిట్లనియె : "ప్రభూ ! రథముఁ దెచ్చితిని. చేయఁదగినపని చేయుఁడు." అను సుమంత్రునిమాటలు విని లక్ష్మణుఁడు రాజగృహము లోనికిఁబోయి సీతాదేవితో నిట్లనియె: "అమ్మా! నీవు ప్రభువుతో నాశ్రమములు చూడఁగోరి చెప్పితివఁట. రాజుగారియాజ్ఞ యయినది. కావున నిపుడే బయలుదేఱి గంగాతీరమునందలి మునీశ్వరులపుణ్యాశ్రమములను జూచివత్తువుగాక ! నేనును మాయన్న యాజ్ఞను శిరసావహించి నీవెంట వచ్చుచున్నాను. మునిసేవితములగు నరణ్యములయందు విహరించిన దానవు కాఁగలవు." మహాత్ముఁడగు లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగానే చాల సంతోషించి ప్రయాణమున కిష్టపడెను. మిక్కిలి విలువగల వస్త్రములను వివిధములగు రత్నములను గ్రహించి గమనమున కుపక్రమించినది. ఈ వస్త్రములు, మణులు, ధనము, ఆభరణములు నేను మునిభార్యల కిచ్చెద నన్నది. లక్ష్మణుఁడు మంచిదే యని సీతను రథ మెక్కించి రామాజ్ఞను స్మరించుచు నతివేగముగా రథమును నడిపింపఁజేసెను.

అపుడు సీత లక్ష్మణునితో నిట్లనియె: "రఘునందనా ! లక్ష్మణా ! అనేకములగు నశుభము లగపడుచున్నవి. నాకుడిక న్నదరుచున్నది.

దేహము కంపించుచున్నది. ఏమోకాని లక్ష్మణా! నాహృదయ మస్వస్థముగా నున్నట్లు తోఁచుచున్నది. మిక్కిలి యౌత్సుక్యము గలుగుచున్నది. అధైర్య మెక్కువయగుచున్నది. పృథులోచనా! నాకంటికిఁ బృథివియంతయు శూన్యముగా నగపడుచున్నది. భ్రాతృవత్సలా! మీ యన్నకు క్షేమముగా నుండునుగదా! వీరా! మాయత్తల కందఱకును నిర్విశేషముగా క్షేమముగా నుండునుగదా! పురమందు జనపదముల యందుఁ బ్రాణులకుఁ గుశలమే యగునుగదా!" అని సీత చేతులు జోడించుకొని దేవతలను వేఁడుకొనెను. లక్ష్మణుఁ డాపలుకులను విని సీతకు నమస్కరించి మనస్సున బెగడొందుచునే పైకి సంతోషించుచున్న వానివలె "నంతయు క్షేమమే"యని బదులుచెప్పెను. తరువాత గోమతీ తీరమునందు వాస మేర్పఱుచుకొని యారాత్రి యచ్చట నివసించి ప్రభాతమునందు లేచి లక్ష్మణుఁడు సూతునితో నిట్లనియె: "సూతా! వేగముగా రథమును సిద్ధము చేయుము. ఇపుడే గంగాజలమును శివుఁడు పర్వతమునందువలె శిరసా వహించెదను." అపుడు సూతుఁడు మనోవేగము గల గుఱ్ఱములను బూన్చి చేతులు జోడించికొని యారోహింపుమని సీతతోఁ జెప్పెను. ఆమె సూతుఁడు చెప్పఁగనే మంచిదే యని రథమెక్కెను. తరువాత లక్ష్మణుఁడును సారథియునెక్కిరి. అర్ధదివసము గడచునప్పటికి వారు గంగాతీరము చేరిరి. అట్టిగంగనుజూచి లక్ష్మణుఁడు దీనుఁడై యెలుఁగెత్తి యేడ్చెను. లక్ష్మణుఁ డట్లు రోదనము చేయుచుండుట చూచి ధర్మాత్మురాలగు సీత యిట్లనియె: "లక్ష్మణా! ఏమి యిది? యిట్లేడ్చుచున్నావేల? జాహ్నవీతీరమునకు రావలయునని నేను జిరకాలమునుండి కోరుచుంటిని. ఇన్నాళ్ళకు నాకోరిక తీరినది. నేను సంతోషముగా నుండవలసిన సమయమున నీవేడ్చి నాకు దుఃఖమును గలిగించెదవేల? ఇదిమేలా? పురుషర్షభా! నీవు నిత్యమును రామునిపార్శ్వమునందే యుండెదవు. ఒక్కనాఁ డాయనకు దూరమైనంతమాత్రమునకే యిట్లేడ్చువవలయునా? లక్ష్మణా! మీ యన్న నాకుమాత్రము ప్రాణములకంటె నెక్కువగా నుండుటలేదా? నేను నీవలెనే దుఃఖించుచున్నానా? నీ వీలాగు పామరులవలె దుఃఖింపఁ దగునా? నన్ను గంగ దాఁటించి తాపసులను జూపించుము. తరువాత మునులకు మునిభార్యలకు వస్త్రములు ఆభరణములు మొదలగునవి యిచ్చెదను. మునులకు యథాశాస్త్రముగా నభివాదన మాచరించి

యచ్చట నొకరాత్రి నివసించి మరల నయోధ్యకుఁబోవుదము. పద్మపత్రాక్షుఁడును, సింహోరస్కుఁడును, కృశోదరుఁడును నగు శ్రీరామునిఁజూచుటకై నామనసుగూడఁ ద్వరపడుచున్నది" అని చెప్పిన సీతమాటలు విని కన్నులు తుడుచుకొని లక్ష్మణుఁడు నావికులను రావించెను. వాంత్రును నిదిగో నావ సిద్ధముగా నున్న దని చేతులు జోడించుకొని విన్నవించిరి. లక్ష్మణుఁడు గంగను దాఁటి నిచ్చయించి నావ నెక్కెను. క్రమముగా లక్ష్మణుఁడు సావధానముగా నావను పరతీరమునకుఁ జేర్పించెను.

47-వ సర్గము

సీతతో రామునియాజ్ఞ చెల్పుట

తరువాత లక్ష్మణుఁడు సువిస్తీర్ణమును నిషాదులదియు నగు నావ యందు ముందుగా సీతను గూర్చుండఁజేసి తానును నావలోఁ గూర్చుండెను. తాను వచ్చువఱకును సుమంత్రుని గంగాతీరమున నుండుమనెను. లక్ష్మణుఁడు శోకసంతప్తుఁడై నావికుని నావ నడపు మనెను. తరువాత నావలియొడ్డు చేరి కన్నుల నీరు దెచ్చుకొనుచుఁ జేతులు జోడించుకొని సీతతో నిట్లనియె: "అమ్మా! సీతా, ధీమంతుఁడగు మాయన్న నాహృదయమునందు గొప్పశల్యము నుంచెను. వైదేహీ! అతఁడు లోకముచే నిందితుఁడైయున్నాఁడు. ఇపుడు నాకు మరణమే మేలు. మృత్యువుకంటె నాకుఁ గావలసినదిలేదు. నేనిట్టి లోకనిందితమైన కృత్యమునందు నియోగింపఁబడితిని. ఇది నాకుఁ దగదు. శోభనురాలా! నాయందు దయయుంచుము. నాయందుఁ బాప మాలోచింపకుము" అని యేడ్చుచు లక్ష్మణుఁడు చేతులు జోడించుకొని క్రిందఁ బడిపోయెను. ఏడ్చుచున్న వాఁడును, చేతులు జోడించుకొన్న వాఁడును, తనకు మృత్యువు వచ్చిన బాగుగనుండునని కోరుచున్న వాఁడును నగు లక్ష్మణునిఁజూచి సీత మిగుల బెగ్గిలినమనసు గలదియై యిట్లనియె: "లక్ష్మణా! లక్ష్మణా! నీవన్న మాటలకు నాకర్థము గాలేదు. స్పష్టముగాఁ జెప్పుము. నీవు నెమ్మదిగా నున్నట్లు కనుపడవు. రాజుగారికి క్షేమమేకదా! నీమనసులోని సంతాపమునకుఁ గారణము చెప్పవేని మాయన్నతోడు! నేను నీ కాజ్ఞాపించుచున్నాను. నాసన్నిధియం దున్నదున్నట్లు చెప్పుము." అని యిట్లు సీత ప్రశ్నింపఁగా లక్ష్మణుఁడు దీనచిత్తుఁడై శిరస్సు వంచుకొని గద్గదస్వర

ముతో నిట్లనియె: "అమ్మా! జానకి! పరిషన్మధ్యమున నీనిమిత్తమై సుదారుణమైన లోకాపవాదమును విని మాయన్న సంతప్తహృదయుఁడై నాతో నివేదించి లోపలికిఁ బోయెను. దేవీ! నే నానిందావాక్యములు నీయెదుట నుచ్చరింపఁజాలను. వాని నన్నింటిని మాయన్న నీకై పౌరుషమును వెనుక నుంచుకొని హృదయమున నుంచుకొన్నాఁడు. అట్టి నిన్ను మాయన్న విడిచెను. నీవు నిర్దోషురాల వని యాయనయే కాక నేనుగూడ నెఱుఁగుదును. అయినను లోకాపవాదకు భయపడి యట్లు చేసెను. నీవన్యథాగా గ్రహింపకుము. ఈయాశ్రమములలో నిన్ను విడిచి నేను మరలఁ బురికిఁ బోవలయును. అట్లు రాజుగారియాజ్ఞ గైనది. నీ విదియే దౌహృదముగాఁ గోరియుంటివఁట! కావున నిదిగో గంగాతీరమందలి ఋషుల యాశ్రమము.అమ్మా! ఇది పుణ్యమైనదియు రమణీయమైనదియుఁ గనుక మనసులో విచారింపకుము. మాతండ్రి యగు దశరథమహారాజు నకు వాల్మీకిమునింపుగవుఁడు మిక్కిలి స్నేహితుఁడు. మంచికీర్తిమంతుఁడు. ఆయనపాదచ్ఛాయ నాశ్రయించి సుఖముగా నుండుము. జానకీ! ఉపవాస పరాయణురాలవై యేకాగ్రచిత్తముతో నిచట నుండుము. పాతివ్రత్యమవలంబించి సవా రాముని హృదయమునం దుంచుకొనుము. అట్లు చేసితివేని దేవీ! నీ కెక్కువగా శ్రేయస్సు ప్రాప్తించును.

48-వ సర్గము

సీత చింతించుట

ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన దారుణమగుమాటలు విని జానకి మిగుల విషాదమును బొంది క్రిందఁ బడిపోయినది. ఆమె ముహూర్తకాలము తెలివితప్పినదిగై బాష్పపర్యాకులేక్షణ యగుచు దీనముగా లక్ష్మణు నితో నిట్లనియె: "లక్ష్మణా! నాశరీరము దుఃఖముకొఱకే సృజింపఁబడినది. ఇపుడు నా కెటు చూచినను దుఃఖమయముగానే యగపడుచున్నది. నేను పూర్వ మెట్టిపాపమును జేసితినో? ఏదంపతులకు వియోగమును గలిగించితినో? ఏమియుఁ జేయకున్న చో నిర్దోషురాలనని యెఱిఁగియు మాయన్న నన్ను విడుచునా? పూర్వము నేను రామపాదములసేవించుచు నాశ్రమములో నుండియు నాయన నన్ను నూఱడించుచున్నను దుఃఖించుచునే యుండెడిదానను. అట్టి నేను విజనమగు నీయాశ్రమములలో నెట్లుండఁ

గలను? సర్వదా దుఃఖపరాయణురాల నగు నే నీదుఃఖము నెవ్వరితోఁ జెప్పుకొందును? మునులు వచ్చి యడిగినచో నే నేమి చెప్పుదును? ఏమి మంచిపనిచేసితి నని చెప్పఁగలను? "నీమగఁ డేల విడచె"నని యడిగిన వారి కే నేమని చెప్పుదును? లక్ష్మణా! నే నిపుడే యీగంగాజలములోఁ బడి ప్రాణములు విడుతునా? అట్లు చేసినచో నాభర్తయొక్క రాజవంశము పరిహసింపఁబడునో యేమో! ఇఁక యోచన యెందులకు? లక్ష్మణా! మీ యన్న గారియాజ్ఞ చెల్లించుము. దుఃఖభాగిని నగు నన్ను విడువుము. నీవు మీయన్న గారియాజ్ఞలోనుండుము. నాచెప్పఁబోవు నీమాటలుమాత్రము వినుము. మాయత్తలందఱకును వినయముగాఁ జేతులు జోడించి నమస్కరించితినని చెప్పుము. రాజుగారిక్షేమ మడిగితినని చెప్పుము. లక్ష్మణా! అందఱకును శిరస్సాష్టాంగము చేసితి నని తప్పక చెప్పెదవుకదా!

ధర్మకార్యములయం దాసక్తుఁడగు రాజుగారితో "రాఘవా! నే నెట్టిశుద్ధిగలదాననో నీవు యథార్థముగా నెఱుఁగుదువు. నీయందుఁ బరమ భక్తురాలననియు నెఱుఁగుదువు నిత్యమును నీకు హితమే కోరుచుండు నది యని నీకే తెలియును. అట్టిసీతను లోకాపవాదకు భయపడి నిర్జనమగు నడవిలో విడువుమంటివి. నీకు వచ్చిన యపవాదము నే నెట్టులైనను బరి హరించి తీరవలయును. నీవే నాకుఁ బరమగతివి" అని నేను జెప్పుమంటిననని చెప్పుము. మఱియు "నీవు ధర్మమును సావధానముగాఁ గనిపట్టుచు నీ తమ్ముల నెట్లు చూచుచుందువో పౌరులను, జానపదులను నట్లే చూచు చుందువుగాక! అదియే నీపరమధర్మము. అందువలన నీకు త్తమకీర్తిగలుగును. పౌరులను ధర్మముగాఁ బాలించినచో నిరుపమానమైనకీర్తి గలుగును. నరర్షభ! నేనును పౌరుల యపదూరునకై విచారించునట్లులు నాశరీరము నకై విచారింపను. పౌరులయపవాద మెట్టిదైననగుఁగాక! ఆఁడుదానికిఁ బెనిమిటియే దేవత, అతఁడే బంధువు, అతఁడే గురువు. కావునఁ బ్రాణ ములచేతనైనను బెనిమిటికి హితము చేయవలయును" అనియు నేను సంగ్రహముగాఁ జెప్పు మన్నట్లు చెప్పుము. "నీవు గర్భిణి నగు నన్ను చూచి యిపుడే వెళ్లిపొమ్ము" అని యిట్లు సీత చెప్పుచుండఁగా లక్ష్మణుఁడు దీనచిత్తుఁడై సాష్టాంగవందన మాచరించి మాటలాడఁజాలకపోయెను. ఆమెకుఁ బ్రదక్షిణమాచరించి యేడుచుచునే ముహూర్తకాలము ధ్యానించి "శోభనురాలా! నా కేమిచెప్పెద"వనెను. "అమ్మా! ఇదివఱ కెన్నఁ

డును నీరూపము చూచినవాఁడనుగాను. పాదములుమాత్రము చూచితిని. రామునితో విరహామును బొందియుండఁగా నిచ్చట నిన్నెట్లు చూడఁగలను" అనిచెప్పి యామెకు నమస్కరించి మరల నావయెక్కెను. అట్లు నావ యెక్కి నావికులను ద్వరపెట్టెను. శోకభారసమన్వితుఁడై యు త్తరతీరముచేరి దుఃఖముచే సంమూఢుఁడైనవానివలె నావ దిగి రథ మెక్కెను. మాటిమాటికిని వెనుకకుఁ దిరిగి యనాథురాలివలెనై యావలి యొడ్డున దుఃఖించుచున్న సీతను జూచుచు లక్ష్మణుఁడు వెడలిపోయెను. దూరమైనరథమును, లక్ష్మణుని, మాటిమాటికిని చూచుచున్నదియు బెగ్గిలి నదియు నగు సీతహృదయమున శోకము ప్రవేశించినది. కీర్తివంతురాలగు సీత దుఃఖభారావనతయైమగనినిజూచు నదృష్టము లేక నెమ్మిల్లు మొదలగు నవి సంచరించు నావిజనమైన యడవిలో నెలుఁగెత్తి గోలు మని యేడువ మొదలిడెను.

47-వ సర్గము

వాల్మీకి సీత నోదార్చుట

అచ్చట నేడ్చుచున్న సీతను జూచి మునికుమారులు వాల్మీకిమహా మునియొద్దకుఁ బరుగులెత్తిరి. వారు మునిపాదములకు నమస్కరించి యామెరోదనవృత్తాంతమంతయు నాయనతో నిట్లు విన్నవించిరి: "భగవా నులవారూ! మేమెన్నఁడును జూచి యెఱుఁగము. ఆమె యేమహాత్ముని భార్యయో కాని రెండవలక్ష్మినలె నున్నది. సంమోహామునలన వికృతా ననయై యేడ్చుచున్నది. ఆమె యెవరో తామె చూపుఁడు. ఆకాశము నుండి జారిపడిన దేవతవలె నున్నది. ఆమె కేమి దుఃఖము తటస్థించినదో కాని గంగాతీరమున నున్నది. మిక్కిలి శోకపరాయణురాలై యున్నది. ఆమె దుఃఖింపఁదగనిది. ఒక్కతెయు దీనురాలై దిక్కులేనిదానివలె నగ పడుచున్నది. ఆమె మనుష్యస్త్రీ యని మే మనుకొనము. ఆమెను సత్కరింపవలయును. మనయాశ్రమమునకు సమీపమునసే యున్నది. మిమ్మును శరణుపొందినది. ఆపతివ్రత రక్షించువారినిఁ గోరుచున్నది. తా మాసతిని రక్షింపఁదగుదురు." ఇట్లు చెప్పినవారిమాటలు విని ధర్మజ్ఞుఁడైనవాల్మీకి బుద్ధిచే నిశ్చయించి తపోబలముచేఁ జూచి మైథిలియున్న చోటికిఁ ద్వరగాఁ బోయెను. మహామతి యగు వాల్మీకి వెళ్ళుచుండుట చూచి శిష్యులుకూడ

వెంటవెళ్లిరి.ఆవాల్మీకి రుచిరమగుసర్ఘ్యమును గ్రహించి గంగాతీరముఁజేరి అచ్చట దీనురాలై దిక్కులేనిదానివలె నున్న శ్రీరాముని భార్యను జూచెను. ఇట్లు మునిపుంగవుఁడగు వాల్మీకి శోకభారార్తురాలైన సీతను జూచి సంతోషము గలుగునట్లుగా నామెతో మధురముగా నిట్లనియె: "అమ్మా! దశరథుని కోడలవు, రామునికిఁ బ్రియమైనభార్యవు; జనకరాజునకుఁ గుమారితవు; పతివ్రతవు; నీకు స్వాగతము. నీవు వచ్చుచున్నదాన వని నేను ధర్మసమాధిచేఁ దెలిసికొంటిని. నీవిచ్చటికివచ్చినకారణమంతయు నేను మనసుచేఁ గనుఁగొంటిని. మూఁడులోకములయందును జరుగు సంగతులు నాకుఁ దెలియుచునే యుండును. నేను నిన్ను నాతపోబలముచే నిర్దోషురాలినిగాఁ దెలిసికొంటిని. నే నుండఁగా నీకేవిధమైన భయమును లేదు; విశ్వాసము గలిగియుండుము. ఇచ్చటికి సమీపమునసే నాయాశ్రమమున్నది. అందుఁ దాపసస్త్రీలు తపస్సుచేసికొనుచు నున్నారు. వారు నిన్నుఁదల్లులు పిల్లలను గాపాడినట్లు కాపాడుచుందురు. ఇదిగో,అర్ఘ్యము; గ్రహింపుము. మనస్సులో నేవ్యాకులమును లేకుండ విశ్రబ్ధురాలవై యుండుము. మీయింట నుండునట్లే యుండనచ్చును. ఇంక భగవకుము."

అని యిట్లుదార్చిన యద్భుతమగు మునిమాటలు విని చేతులు జోడించుకొని "మంచిదే" యని సీత యంగీకరించెను. ఆమునియాశ్రమములోనికిఁ బోవుచుండఁగాఁ జేతులు జోడించుకొని యాయనవెంటఁ బోయినది. సీతను వెంటఁబెట్టుకొని వచ్చుచున్న వాల్మీకినిఁ జూచి మునిభార్యలు త్వరగా నెదురొక్కని సంతోషించుచు నిట్లనిరి:

"మునిశ్రేష్ఠా! నీకు స్వాగతము. నీయాగమనము చిరకాలమునకుఁ గలిగినది. మేమువఱకును నీకు నమస్కరించుచున్నాము. ఏమిచేయ నాజ్ఞాయెసఁగెదవు?" అను తాపసస్త్రీలమాటలు విని వాల్మీకి యిట్లనియె. ధీమంతుడగు రాముని భార్య యీమె; సీత యని పిలువఁబడుచుండును. దశరథునికోడలు. జనకునికూఁతురు. పతివ్రత. ఏపాపమును నెఱుఁగదు. ఈమెను మగఁడు విడిచెను. నే నీమెను సదా పాలించుచుండఁదలయును. మీయందఱును నీమెను మిక్కిలి స్నేహమునఁ జూచుచుండవలెను. గౌరవముచేతను నామాటనుబట్టియు మీ కీమె విశేషముగాఁ బూజింపఁదగినది." ఇట్లు చెప్పి మహాయశుఁడగు వాల్మీకి మాటిమాటికిని సీతను దివ్యదృష్టితోఁ జూచుచు శిష్యపరివృతుఁడై మరలఁ దనయాశ్రమమునకు వచ్చెను.

50-వ సర్గము

సుమంత్రునివాక్యములు

ఆశ్రమములోఁ బ్రవేశింపఁజేయఁబడిన మైథిలిని సీతనుఁజూచి లక్ష్మణుఁడు దీనచేతనుఁడై ఘోరమగు సంతాపమును బొందెను. అతఁడు మంత్రసారథి యగు సుమంత్రునిఁజూచి యిట్లనియె: "సుమంత్రా! రాము నకు సీతాసంతాపమువలనఁ గలిగిన దుఃఖమును జూచితివిగదా! రామున కంతకన్న నెక్కుడు దుఃఖ మే ముండును? నిర్దోషురాలగు సీతను విడువ వలసివచ్చినది. సీతారాములకు దైవవశమున నీవియోగము గలిగినదని తలంచెదను. దైవ మెట్టివారికిని దురతిక్రమముగదా! కోపించినచో దేవ తలను, రాక్షసులను, గంధర్వులను జంపఁజాలిన రాముఁడుగూడ దైవము ననువర్తించువాఁ డాయెను. చూచితే! పూర్వము రాముఁడు తండ్రియాజ్ఞ వలనఁ బదునాలుగుసంవత్సరములు విజనమగు మహారణ్యములో నుండెను. ఇపు డంతకంటెను దుఃఖతరముగా సీతావియోగ మనుభవింపవలసివచ్చినది. ఇదియంతయుఁ బౌరులమాటలవలనఁగదా తటస్థించినది! ధర్మమునాశ్రయించినవాఁ డెవఁడిట్టికిర్తినాశకరమైనకర్మమును జేయును? అయినను పౌరులు నీచపుమాట లనుకొనుచుండుటవలన నిట్టిపనిపుట్టినది." అని యిట్లనేకవిధములుగా నాడుచున్న లక్ష్మణునిమాటలు విని ప్రాజ్ఞుఁడగు సుమంత్రుఁడు శ్రద్ధగా నిట్లనియె:

"లక్ష్మణా! నీవు సీతనుగుఱించి సంతాపింపకుము. పూర్వము నీతండ్రియొద్దట బ్రాహ్మణులు చెప్పఁగా వింటిని. రాముఁడు సదా దుఃఖప్రాయుఁడై యల్పసౌఖ్యము ననుభవించు ననిరి. మఱియు నతఁడు తనయిష్టజనముతో వియోగమును బొందు ననియుఁ జెప్పిరి. నిన్ను భరతశత్రుఘ్నులను చాలకాలమునకు విడువఁగలఁడు. లక్ష్మణా! యీసంగతి సీతోడను, భరతునితోడను, మఱియెవ్వరితోడను జెప్పరానిది. ఇప్పుడీ దుర్వాసోముని చెప్పియున్నాఁడు. మహాజనసమూహమునందును నేనుండగాను వసిష్ఠభగవానునిసన్నిధిని జరిగినది. ఆబ్రువిమాట నిన్ను మీతండ్రి 'సూతా! నీ వీసంగతి యెవ్వరితోడను జెప్పకుమ్ము.' అనుటలోక పాలసదృశుఁడగు మీతండ్రిమాటను నే నన్యథముగాఁ జేయ నని నిశ్చ

P.R. NARLA MEMORIAL LIBRARY D.P.R.I. ACCESSION NO.

యించుకొంటిని. ఈసంగతి నీయెదుట నేను జెప్పఁదగినదిగాదు. నీ కంత వినవలయు ననిశ్రద్ధ యున్నచో వినుము. మాతండ్రి నాతో నీసంగతి రహస్యమనిచెప్పినను నేను నీకుఁజెప్పెదను. దైవమలంఘ్యముగదా! ఆ దైవమువలననే యిట్టిదుఃఖము తటస్థించినది. నీతో నే నెందులకో చెప్పితిని. ఈసంగతి నీవు భరతశత్రుఘ్నులతోమాత్రము చెప్పఁబోకుము." ఇట్లని సుమంత్రుడు చెప్పిన గంభీరార్థపదములుగలమాటలు విని యథార్థముగాఁ జెప్పుమని లక్ష్మణుఁడు సుమంత్రు నడిగెను.

51-వ సర్గము

సుమంత్రుఁడు దుర్వాసునిమాటలు చెప్పుట

మహాత్ముఁడగు లక్ష్మణునిచే నట్లు ప్రేరితుఁడై సుమంత్రుఁడు దుర్వాసోముని చెప్పిన యామాటలు చెప్పుట కుపక్రమించెను: పూర్వమత్రిమహాముని కుమారుఁడు దుర్వాసుఁడనుమహాముని పుణ్యమగువసిష్ఠుని యాశ్రమమునందుఁ జాతుర్మాస్యవ్రతమునకై నివసించియుండెను. ఆయాశ్రమములోనికి మాతండ్రి తనపురోహితుఁడగు వసిష్ఠుని దర్శించుటకుఁ బోయెను. అతఁడు సూర్యసంకాశుఁడై తేజస్సుచే వెలుఁగుచు వసిష్ఠుని సవ్యపార్శ్వమునందుఁ గూర్చున్న దుర్వాసునిఁ జూచి యాయిద్దఱు మునులకును నమస్కరించెను. ఆయిద్దఱును మాతండ్రిని స్వాగతము చేతను, ఆసనదానాదికముచేతను బూజించిరి. అర్ఘ్యపాద్యాదులు గైకొని ఫలమూలము లుపయోగించి మాతండ్రి మునులతోఁ గూడి కూర్చుండెను. వారచ్చటఁ గూర్చుండి యపూర్వమధురములగు కథలు చెప్పుకొనుచుండిరి. అప్పుడు మధ్యాహ్నసమయము. తరువాత నొకానొక కథాసందర్భములో మాతండ్రి చేతులు జోడించుకొని దుర్వాసునితో నిట్లనియె: "భగవానులవారూ! నావంశమెంత ప్రమాణముగలదియగును? మారామున కెంతయాయువు? ఇతరులగుపుత్రులెన్నాళ్లు జీవింతురు? రామున కెందఱుసుతులు పుట్టుదురు? వారి యాయువెంత? నేను గోరితిని గనుక మావంశమునొక్కసంగతినిఁ జెప్పుదురుగాక!" అని యిట్లడిగిన మాతండ్రిమాటలు విని దుర్వాసుఁడిట్లుచెప్పనుపక్రమించెను: "రాజా! పూర్వము జరిగినది వినుము. ఒకప్పుడు దేవాసురులకు యుద్ధము

జరిగినది. సుకలచే నోటమి చెంది దైత్యులు భృగుపత్నిని శరణుచొచ్చిరి. ఆమె యభయదాన మిచ్చుటచే నిర్భయులై యందుండిరి. ఆమె శరణ మిచ్చినదగుటచే నిర్భయులైన రాక్షసులను జూచి విష్ణువు కోపించి చక్ర ముచే నామెశిరస్సు ఖండించెను. తరువాత భృగుమహాముని భార్య చచ్చి యుండుటచే వెంటనే కోపించి రిపుకులార్దనుఁడగు విష్ణుని 'అవధ్యలగు నాభార్యను కోపించి చంపితివి గనుక, జనార్దనా! నీవు మనుష్య లోకములోఁ బుట్టుము. అచ్చటఁ జిరకాలము నీవు భార్యావియోగమును బొందుము.' అని శపించెను. శాపాభిహతచిత్తుఁడై యతఁడు తనలోఁదాను భావితుఁడాయెను. శాపపీడితుఁడగు భృగువు విష్ణుదేవుని బూజించెను. తపస్సుచే నారాధితుఁడై భక్తవత్సలుఁడగు విష్ణుదేవుఁడు లోకోపకారార్థ మాశాపమును గ్రాహ్యముగా నంగీకరించెను. ఇట్లు భృగువుచేఁ బూర్వజన్మమందు శపింపఁబడి యీజన్మమునందు నీకుఁ గుమారుఁడై పుట్టినవాఁడనుమా! రాజా! అతఁడే రాముఁడని ప్రసిద్ధి కెక్కిన వాఁడు. భృగుశాపఫలమును దప్పక యనుభవించుఁ. రాముఁడయో ధ్యకుఁ బతియై చిరకాలము జీవించును. అతని ననుసరించినవారు సుఖవంతులు, సమృద్ధిగలవారును నై యుందురు. పదునొకండు వేలసంవత్సరములు రాజ్యమేలి బ్రహ్మలోకమునుగూర్చి పోవును. పరమదుర్జయుఁడై బహువిధములగు నశ్వమేధములు చేయును. అనేకములగు రాజవంశము లను స్థాపింపఁగలఁడు. రామునకు సీతయం దిద్దఱు కొడుకులు పుట్టుదురు. మఱియొకచోటఁ బుట్టుదురు గాని యయోధ్యలోఁ బుట్టరు. తరువాత సీతాపుత్రులకు రాముఁడు పట్టాభిషేకము చేయును." ఇట్లు మీవంశము సంగతియంతయుఁజెప్పి యాముని యూరకుండెను. ఆముని యిట్లు చెప్పి యూరకుండఁగానే మీతండ్రి యచ్చటి మునులకు నమస్కరించి మరలి పురమునకు వచ్చెను. ఆయన చెప్పుచుండఁగా నేను వింటిని. మనస్సులో నుంచుకొంటిని. అది యన్యథా గాదు. ఇట్లుండుటచే నీవు సీతవిషయమున రామునివిషయమున విచారింపక ధైర్యముగ నుండుము. లక్ష్మణుఁడు పరమాద్భుతమగు సారథిచెప్పినమాటలు విని సంతోషించి సాధువాదములు చేసెను. ఇట్లు సుమంత్రుఁడు లక్ష్మణుఁడు త్రోవలో మాటలాడుకొనుచు వచ్చుచుండఁగా సాయంకాలమైనది. అపుడు వారు గోమతి యను స్థలమున నివసించిరి.

52-వ సర్గము

లక్ష్మణుఁడు రామునియొద్దకు వచ్చుట

లక్ష్మణుఁ డారాత్రి గోమతియం దుండి తెల్ల వాఁగినతోడనే లేచి యయోధ్యకు బయలుదేఁతెను. మతిమంతుఁడగు లక్ష్మణుఁడు మిగుల దైన్యమును బొందెను. "రామునిసన్నిధికిఁ బోయి యేమి మనవి చేయుదును?" అని విచారింప మొనలిడెను. ఇట్లాతఁడు విచారించుచుండఁగానే చంద్రునివలెఁ బ్రకాశించు శ్రీరామునిభవనము ముందఱ నగపడినది. రాజద్వారమందు లక్ష్మణుఁడు రథముదిగి శిరస్సువంచుకొని దీనచిత్తుఁడై యని వానితుఁడై లోపలకుఁ బోయెను. అతఁడు కన్నుల నీరుగార్చుచు దీనమానసుఁడై సింహాసనముపైఁ గూర్చుండిన యన్నను జూచి వెంటనే పాదములకు నమస్కరించెను. మఱియుఁ జేతులు జోడించుకొని దీనముగా నిట్లనియె. "తమయాజ్ఞను శిరసావహించి జనకాత్మజను గంగాతీరమందలి వాల్మీకిమహాముని యాశ్రమములో విడిచి తమపాదముల సన్నిధికి వచ్చి చేరితిని. పురుషవ్యాఘ్రా! విచారింపకుము. కాలగతి యిట్టిది. మీవంటి బుద్ధిమంతులు, ధైర్యవంతులు దుఃఖింపరు. సర్వవృద్ధులు క్షయాంతములు. ఔన్నత్యము పతనాంతము. సంయోగములు వియోగాంతములు. జీవితము మరణాంతము. కావునఁ బుత్రులయందును, భార్యలయందును, మిత్రులయెడను, ధనమువిషయమున నతిప్రసంగము కూడదు. ఏ మనినెప్పటికైన వానితో వియోగము తప్పనిది. నీవు నీయాత్మను వినోదపఱుచుకొనశక్తిగలవాఁడవు. మఱియు లోకములకే వినోదమును గలుగఁ జేయఁగల నీవు నీయాత్మను శోకము చెందకుండఁ జేసికొనుట నీకొక గొప్పకార్యము గాదు. నీవంటిపురుషశ్రేష్ఠులిటువంటివిషయములు తటస్థించినపుడు మోహమును బొందరు. ఆయపవాదము దానంతట నదియే పోవును. ఏయపవాదమునకు భయపడి సీతను విడిచితివో యాయపవాదము తప్పకుండఁ బట్టణమున వ్యాపింపఁగలదు. కావున నీవు ధైర్యమవలంబించి యీదుర్బలమగు బుద్ధినివిడిచి సంతాపమును బొందక నెమ్మదిగానుండుము" అని యిట్లు లక్ష్మణుఁడు చెప్పఁగానే రామునకు డతనితో నిట్లనియె: "లక్ష్మణా! నీవిపుడు చెప్పినసంగతులన్నియు యథార్థములే. నీవు

నామాటను మన్నించినందులకు నేను చాలసంతోషించితిని. సౌమ్యా! నీమాటలవలన నాకు నివృత్తిగలిగినది. సంతాపము పోయినది. నీమంచి మాటలచే నూరట చెందితిని."

53-వ సర్గము

రాముఁడు నృగమహారాజు చరిత్ర చెప్పుట

ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన పరమాద్భుతము లగు వాక్యములు విని రాముఁడు చాల సంతోషించి యతనితో నిట్లనియె : తమ్ముఁడా! నీవంటి బంధుఁడు దుర్లభుఁడు. అందును నిట్టిసందర్భమున మఱియును దుర్లభుఁడు. నీవు తప్పక నామనస్సు ననుసరించువాఁడవని యెఱుఁగుదును. నామనస్సులో నొకసంగతియున్నది చెప్పెదనువినుము. అదివిని యట్లుచేయుము. నేఁటికి నాలుగుదినములసుండి నేను బౌరకార్యములు విచారింపఁజాలకయుంటిని. అది నామర్మములు గోయుచున్నది. పురజనులనందఱను, పురోహితులను, మంత్రులను, కార్యార్థులను, పురుషులను, స్త్రీలను బిలిపింపుము. ఏరాజు ప్రతిదినమును బౌరకార్యములను జక్కఁజేయఁడో యట్టిరాజు మృతినొంది తప్పక ఘోరనరకమునఁ బడు"నని పెద్దలు చెప్పుదురు. పూర్వము బ్రాహ్మణప్రియుఁడును. శుచియుఁ, గీర్తిమంతుఁడును, సత్యసంధుఁడును నగు నృగుఁడను మహారాజు గలఁడు. అతఁడొకప్పుడు పుష్కరములయందుఁ గోట్లకొలఁది గోవులను, సవత్సలను, స్వర్ణభూషితలను బ్రాహ్మణులకు దానమిచ్చెను. అంతేకాక యాపుమరల నారాజు నావుల మందలలోఁ గలసిపోయెను. అది తెలియక యారాజాయావునే దరిద్రుఁడును, ఉంఛవృత్తియునగు వేఱొక బ్రాహ్మణునకు దానమిచ్చెను. తొలుత దానము గొనిన బ్రాహ్మణుఁడాకలిచేఁ బీడితుఁడై తనగోవును వెదకి మొదలిడెను. ఎన్నోసంవత్సరము లన్ని రాజ్యములయందును దిరిగి తిరిగి వెదకియుఁ దానిని గానకపోయెను. తరువాతఁ గొన్నాళ్లకుఁ గనఖిలమును చోటున నొక బ్రాహ్మణునియింటఁ దనగోవును జూచెను. ఆతఁడాగోవును జూచి యదివఱకుఁ దాను వాడుకచేసినపేరున నాగోవును బిలువఁగా నది యాబ్రాహ్మణుని స్వరము విన్నది. ఆబ్రాహ్మణుఁడు వెళ్లిపోవుచుండఁగాఁ గట్టుత్రాడు తెంచుకొని యాఁకలిగొన్న యాదరిద్రుని వెంబడించినది.

అయింటి బ్రాహ్మణుఁ డాగోవును వెంబడించెను. అట్లు వెంబడించి "యిది నాగోవు; నీవు తోలుకొనిపోవుచున్నావే"మని యడిగెను. మఱియు "నీ గోవును నాకు నృగమహారాజు దానమిచ్చియున్నా"డనికూడఁ జెప్పెను. అయిద్దఱు బ్రాహ్మణులకును గొప్పవివాద మేర్పడినది. అట్లు వివరించి యిద్దఱును డాత యగు నృగునియొద్దకు వచ్చిరి. వారు ద్వారమం దుండి రాజు ననుమతినిఁ బొందఁజాలకపోయిరి. ఇట్లు వారిద్దఱును ద్వారము కడనే కొన్నియహోరాత్రము లుండి తుదకుఁ బ్రాణము విసిగి కోపించి "మేము కార్యార్థులమై వచ్చి యిన్నాళ్లు కాచియున్నను మాకు దర్శన మీయవైతివి గనుక సర్వభూతములకును గనుపడకుండ నూసరవెల్లి రూప మునుబొంది యొకగోతిలో ననేకసహస్రసంవత్సరము లుందువుగాక ! కొంతకాలమునకు యదువంశమందుఁ గీర్తివర్ధనుఁడగు వాసుదేవుఁడు పుట్టఁగలఁడు. అతఁ డీఘోరశాపమునుండి నిన్ను విడిపింపఁగలఁడు. నీవు చేసిన యీమహాపాతకమున కతఁడు ప్రాయశ్చిత్తము చేయును. కలియుగ ప్రారంభమునకు ముందు భూభారమును హరించుటకై నరనారాయ ణులు భూమియం దవతరింతురు" అని యిట్లు బ్రాహ్మణు లారాజును శపించి కోపమునుండి విరామమును బొందిరి. దుర్బలయు, వృద్ధయు నగు నాగోవును వారు మఱొక బ్రాహ్మణునకు దానమిచ్చిరి. ఈరీతిగా నానృగ మహారా జా బ్రాహ్మణశాపము ననుభవించుచున్నాఁడు. కావునఁ గార్యా ర్థులను విచారింపకుండుట రాజునకు మహాదోషావహ మగును. కనుకఁ గార్యార్థులను శీఘ్రముగా నాయొద్దకుఁ దీసికొనివచ్చులాగున నాజ్ఞాపిం చుము. అకృతకార్యమునకు ఫలమును రాజు పొందఁజాలఁడు. కావున నీవు పోయి కార్యార్థులను బ్రతీక్షించుచుండుము.

54-వ సర్గము

నృగమహారాజు చరిత్ర

రామునిమాటలు విని పరమార్థవిదుఁ డగు లక్ష్మణుఁడు చేతులు జోడించుకొని రామునితో నిట్లనియె: "అన్నా! ఆ బ్రాహ్మణులు స్వల్పాప రాధమునకై రాజర్షియగు నృగమహారాజునకు రెండవయమదండము వలె నిట్టిశాప మొసఁగిరి. పురుషర్షభా ! తన్నుఁ బాపాత్మునిగాఁ దలంచు

కొని యిట్టిశాపము విని యారాజు కోపముతోఁ గూడిన యా బ్రాహ్మణు లనుగూర్చి యే మనెను?" అని లక్ష్మణుఁ డడుగఁగా రాముఁ డిట్లనియె: "లక్ష్మణా! చెప్పెదను వినుము. ఆరాజు శాపోపహతుఁడై యా బ్రాహ్మణులు మార్గమునుబట్టి పోవుచుండఁగా మంత్రులను పౌరులను బురోహితులను బిలిపించి వారితో నిట్లనియె: "ప్రజలారా! మీరు నాపలుకులు సావధానముగా వినుఁడు. నారదుఁడు పర్వతుఁడు నను మునులు నాకు గొప్పభయమును గలిగించి వాయురూపమునఁ ద్రిభువనములు గ్రమ్మరుటకుఁ బోయిరి. ఈవసువసుకుమారునికి మీరు పట్టాభిషేకము చేయుఁడు. శిల్పులను బిలిపించి సుఖస్పర్శ మగుగోయి త్రవ్వించుఁడు ఆబ్రాహ్మణులిచ్చినశాపమును గోతిలో నుండి యనుభవించెదను. ఆశిల్పులచే వర్షమును నివారించు నొకగోయి, చలిని దొలఁగించు నొకగోయి, వేఁడిమిని బోఁగొట్టు నొకగోయి త్రవ్వించుఁడు. ఆగోతులకుఁ జుట్టును ఫలవంతములగు వృక్షములను పుష్పములతో నిండియుండు లతలను చాల నీడ గలుగునట్లు నాటింపించుఁడు. గోతులకు నలువైపులను రమణీయముగా నుండునట్లు చేయించుఁడు. శాపము దీఱువఱకును నేనాగోతులలో నుండెదను. యోజనమునఱనకును సుగంధములగు పుష్పములు గోతులకుఁ జుట్టును నుండవలయును" అని యీరీతిగా మంత్రులు మొదలగువారి తోఁజెప్పి కుమారునిఁబిలిచి "నాయనా! నీవు ధర్మముతప్పకుండఁ బ్రజలను నిత్యమును బాలించుచుండుము. చూచితివిగదా! నాకు బ్రాహ్మణు లెట్టి శాపమిచ్చిరో? నాయపరాధమైనను నంతగొప్పదికాదు. అయినను వారు కోపించి శాపమిచ్చిరి. నరర్షభా! నానిమిత్తమై నీవు తనువును సంతాపము నొందించుకోకుము. దైవము కుశలమైనది. ఆదైవమే నాకిట్టివ్యసనము గలుగఁజేసెను. పొందఁదగినవానినే ప్రాణి పొందుచుండును. వెళ్లఁదగిన చోటకే వెళ్ళుచుండును. పొంవఁదగినవానినే పొందుచుండును. సుఖములుగాని, దుఃఖములుగాని యూరక రావు. ఇవియన్నియుఁ బూర్వజన్మసంస్కారమువలనఁ గలుగుచుండును. ఈవిషయమై నీవు చింతింపకుము" అని యీరీతిగా నానృగమహారాజు కుమారునితోఁజెప్పి బాగుగా సిద్ధము చేయఁబడిన గోతిలోనికి నివాసార్థముపోయెను. ఈరీతిగా మహారత్నవిభూషితమగు నాగోతిలోనికిఁబోయి కోపముతో నా బ్రాహ్మణులిచ్చినశాపము ననుభవించుచుండెను.

55-వ సర్గము

రాముఁడు నిమిచరిత్ర చెప్పుట

"లక్ష్మణా! నృగమహారాజుయొక్క శాపముసంగతి నీకు విస్తరించి చెప్పితిని. ఇంకను నీకు వినవలయునని యున్నచో మఱియొకకథ చెప్పెదను వినుము" అని యిట్లు శ్రీరాముఁడనఁగానే లక్ష్మణుఁ డిట్లనియె: "అన్నా! ఆశ్చర్యభూతములైన కథలు వినుటయందు నాకుఁ దృప్తిలేదు" అని యిట్లు లక్ష్మణుఁ డనినవెంటనే శ్రీరాముఁడు మిక్కిలి ధర్మయుక్తమగు నొకానొకకథ చెప్పుట కుపక్రమించెను: "మహాత్ములగు నిక్ష్వాకువంశపు రాజులలో నిమి యను మహారాజొకఁడు గలఁడు. అతఁడు నిక్ష్వాకునకుఁ బదిరెండవ కుమారుఁడు. అతఁడు వీర్యమునందును, ధర్మమునందును గొప్పవాఁడు. వీర్యసంపన్నుఁడగు నారాజు దేవపురమువంటి యొకపుర మును గౌతమిసమీపమునఁ గట్టించెను. ఆపట్టణమునకు వైజయంత మను పేరుంచెను. మహాకీర్తిసంపన్నుఁడగు నారా జాపట్టణములో నుండి రాజ్య మేలుచుండెను. అతఁ డాపట్టణములో నుండి తండ్రి మనస్సునకు సంతో షముగలుగునట్లుగా గొప్పదగు యజ్ఞ మొకటిచేయవలయు"నని తలఁచెను. తరువాత నతఁడు మనువు కుమారుఁడగు నిక్ష్వాకు నామంత్రించి బ్రహ్మర్షి సత్తముఁడగు వసిష్ఠుని ముందుగా ఋత్విజునిగా వరించెను. అనంతరమున నిక్ష్వాకునందనుఁడగు నానిమి అత్రిని, అంగిరసుని, తపోధనుఁడగు భృగు వును వరించెను. అపుడు వసిష్ఠుఁడు "రాజా! నేను ముందుగా నింద్రునిచే వరింపఁబడియున్నాను. కొలఁదికాలము ప్రతీక్షించుము" అనెను. అనంత రము మహావిఖ్యాతుఁడగు గౌతముఁడు నిమి యజ్ఞమును బూర్తిచేయించెను. మహాతేజుఁడగు వసిష్ఠుఁ డింద్రుని యజ్ఞమునుజేయింపఁబోయెను. నిమి రాజు హిమవత్పార్శ్వమునందలి పట్టణమునొద్ద నైదువేలసంవత్సరములు దీక్షితుఁడై యజ్ఞము సమాప్తి నొందించెను. యింద్రునియజ్ఞము పూర్తి కాఁగానే వసిష్ఠభగవానుఁడు నిమి యజ్ఞమును జేయించు తలంపుతో వచ్చెను. తాను వచ్చినప్పటికిగౌతముఁ డాతనియజ్ఞమును బూర్తిచేయిం చుట చూచెను. బ్రహ్మకుమారుఁడగు వసిష్ఠుఁడు కోపించి రాజును జూచు కోరికతో ముహూర్తకాల మచటనే యుండెను. ఆదినమున నిమి నిద్రా గ్రస్తుఁడై పండియుండెను. అంతకంతకు వసిష్ఠభగవానునికిఁ గోప మధిక

మైనది. ఎంతసేపటికిని రాజగపడమిచే "రాజా! నన్నవమానపఱిచి యిత రులచే యజ్ఞము చేయించుకొంటివి గనుక నీదేహము చేతనశూన్యమగుఁ గావుత" మని శపించెను. తరువాత రాజు మేల్కొని శాపముసంగతి యంతయు విని కోపమాఁపుకోఁజాలక "తెలియక నిద్రపోవుచుండఁగాఁ గోపించి కలుషితుఁడవై నాయందు శాపాగ్నిని విడిచితివి గనుక మునివరా! నీదేహముగూడఁ జేతనశూన్యమగుఁగావుత"మని యాతని శపించెను. ఇట్లిద్దఱును కోపమాఁపుకోఁజాలక యొకరినొకరు ఘోరముగా శపించుకొనిరి. సమానప్రభావముగల యాయిద్దఱును వెంటనే విదేహులయిరి.

16-వ సర్గము

వసిష్ఠునిపునర్జన్మము

ఇట్లు రాముఁడు చెప్పినమాటలు విని లక్ష్మణుఁడు చేతులు జోడించుకొని రామునితో నిట్లనియె: "అన్నా! ఆయిద్దఱును నట్లు శపించుకొని దేహమును విడిచిరిగదా! మరల నెట్లు దేహములను బొందిరి" రన శ్రీరాముఁడిట్లనియె: "లక్ష్మణా! అట్లు వారు దేహములను విడిచి యిద్దఱును తపోధనులే కనుక వాయుభూతులైరి. వసిష్ఠమహాముని యశరీరుఁడై యితరశరీరముకొఱకు బ్రహ్మయొద్దకుఁబోయి యతనికి నమస్కరించి వాయుభూతుఁడైయుండియే బ్రహ్మతో నిట్లనియె: "తండ్రి! నిమి యిచ్చిన శాపమువలన నేను దేహములేనివాఁడనయితిని. లోకనాథా! మహాదేవా! నీ వండమునుండి పుట్టినవాఁడవయ్యును నబ్జమునుండి పుట్టినవాఁడవు. ఎవరికైనను దేహములేకయున్నచో మహాదుఃఖము గలుగును. దేహము లేని వానిక్రియలన్నియు లోపించునని నీకు నేను వేఱుగాఁ జెప్పనవలయునా? కావున నాకు వేఱొకశరీరము గలుగునట్లనుగ్రహింపవేఁడెదను" అని యిట్లు వేఁడిన వసిష్ఠునిఁ జూచి బ్రహ్మ యిట్లనియె: "వసిష్ఠా! నీవు మిత్రావరుణుల తేజమునఁ బ్రవేశింపుము. ద్విజోత్తమా! నీ వపుడును అయోనిజుఁడవే యగుదువు. గొప్పదియగు ధర్మముతోఁగూడి మరల నావశమును బొందెదవు" అని యిట్లు బ్రహ్మ చెప్పఁగానే వసిష్ఠుఁడాతనికిఁ బ్రదక్షిణమాచరించి యచ్చటినుండి తిన్నఁగా వరుణాలయమునకుఁ బోయెను. ఆకాలమందే మిత్రుఁడును నతఁడును క్షీరసముద్రముతోఁ

గూడినవాఁడై సురోత్తములచేఁ బూజింపఁబడుచు వరుణత్వమును జేయుం చెను. అట్టిసమయమున నప్సరశ్రేష్ఠురాలగు నూర్వశి చెలికత్తియలతోఁ గూడి స్వేచ్ఛగా సముద్రాధిపతియగు వరుణునియొద్దకు వచ్చినది. వరుణా లయములోఁ గ్రీడించుచున్నదియు, రూపవంతురాలును నగు నూర్వశిని జూచి వరుణుఁడు చాలసంతసించెను. పూర్ణచంద్రసమానముఖియుఁ, బద్మదళసమనేత్రయునగు నూర్వశిని వరుణుఁడు గ్రామ్యధర్మమునకుఁ గోరెను. అపు డామె చేతులు జోడించుకొని యెదుట నిలువఁబడి "సురేశ్వరా! ఇంతకు ముందుగా నేను మిత్రునిచే వరింపఁబడియుంటిని" అన్నది. కందర్ప శరపీడితుఁడగు వరుణుఁడు "దేవనిర్మితమగు నీకుంభమునందు నాయీ తేజస్సును విడిచెదను. సుశ్రోణీ! వరవర్ణినీ! నీవు నాతో సంగమము నిచ్ఛయింపనిచో నే నట్లు విడిచి కృతకాముఁడ నయ్యెదను" అనెను. ఇట్లు లోకపాలుఁడగు వరుణుఁడు చెప్పినమాటలు విని యూర్వశి మిక్కిలి సంతోషించి యతనితో నిట్లనియె: "దేవా! నాహృదయము నీయం దున్నది. నీ వన్నట్లు చేయుము. నాభావము నీయధీనము. దేహ మన్ననో మిత్రుని యధీనము" అని యూర్వశి చెప్పినతోడనే వరుణుఁడు పరమాద్భుతమును, జ్వలదగ్నిశిఖాప్రఖ్యమును నగు రేతస్సు నాకుంభమునందు విడిచెను. మిత్రుఁడును దేవత యున్నచోటి కా యూర్వశి పోయినది. మిత్రుఁ డాయూర్వశిసైఁ గోపించి యిట్లనియె: "ఓసీ! నీవు ముందుగా నాచేఁ గోరఁబడి నన్నువిడిచి మఱియొకమగని వరించితివి గనుక, దుష్టచారిణీ! నీ వీపాపము కారణముగా నాకోపముచేఁ గలుషితురాలివై మనుష్యలోకములోఁ గొంతకాలమువఱకును నుండుము. దుర్బుద్ధిగలదానవగుటచే బుధునికుమారుఁడును గాధిరాజును నగు పురూరవసునియొద్దకుఁ బొమ్ము. నీకతఁడు భర్తకాఁగలఁడు" అని శపించెను. తరువాత నామె శాపదోషమున పురూరవశ్చక్రవర్తినిఁ బొందినదిఁ అతఁడు బుధునకుఁ గడుపునఁబుట్టిన కుమారుఁడు. ఆతని కామెయం దాయువను కుమారుఁడు గలిగెను. ఇంద్రునితో సమానకాంతిగల నహుషుఁ డాయాయువునకుఁ గుమారుఁడై పుట్టెను. దేవేంద్రుఁడు వృత్రునిపై వజ్రము విడిచి యా బ్రహ్మహత్యవలన దేశములు దిరుగుచుం డఁగా నూఱువేలసంవత్సరము లానహుషుఁడు దేవేంద్రపదమునుబొంది లోకము లేలెను. చక్కనిపలువరుస కలదియు, సునేత్రయు నగు నా

యూర్వశి యీశాపమువలన భూలోకమును బొంది చాలసంవత్సరములు భూలోకములో నుండి శాపము క్షీణించిన తరువాత మరల నింద్రుని సభకు వచ్చి చేరెను.

57-వ సర్గము

నిమిపునర్జన్మము

లక్ష్మణుఁ డిట్లు శ్రీరాముఁడు చెప్పిన దివ్యసంకాశయు నద్భుత దర్శనయు నగు కథ విని మిక్కిలి సంతోషించి రామునితో ని ట్లనియె: "కాకుత్స్థా! దేహసమ్మతులగు నానిమి నసిష్ఠు లట్లు నిక్ష్వాకుదైవతలై రి గదా! మరల వారు దేహసంయోగము నెట్లు పొంది" రని యడిగిన లక్ష్మణునిమాట విని రాముఁ డాతరువాతి కథ యి ట్లని చెప్ప మొదలిడెను: "లక్ష్మణా! అట్లామహాత్ముల తేజస్సుచే బూర్ణ మగు నాకుంభమునుండి తేజోమయులగు నిద్దఱు విప్రులుపుట్టిరి. అందు ముందుగా బుషిసత్తముఁ డగు నగస్త్యభగవానుఁడు పుట్టెను. అతఁడు నేను నీకుమారుఁడనుగానని మిత్రుని విడిచెను. ఆతేజస్సు పూర్వము మిత్రునిదే యూర్వశి కూర్చి నది. వరుణునితేజ స్సేకుంభమునం దున్నదో ఆకుంభమునుండి మఱికొంత కాలమునకు మిత్రావరుణ సంభవుఁడై తేజస్సుతోఁగూడి యిక్ష్వాకుదైవత మగు వసిష్ఠుఁడు పుట్టెను. పుట్టినతోడనే యాయనను మహాతేజశ్శాలి యగు నిక్ష్వాకుమహారాజు మనవంశము వృద్ధినొందఁటకై పురోహితు నిగా వరించెను. తమ్ముఁడా! యిట్లు పోయినదేహము మరల మన వసిష్ఠ భగవానులవారికిఁ గలిగినకథ వింటివిగదా! ఇఁక నిమిసంగతి చెప్పెదను వినుము: అట్లు నిమి విదేహుఁ డగుట బుషులందఱును జూచి తరువాత మనీషు లతనిని యాగదీక్షను యోజింపఁజేసిరి. బ్రాహ్మణు లాశరీరమును జాగరూకతగా గంధమాల్యాదులచే నలంకరించి పారభృత్యసమన్వితులై రక్షించుచుండిరి. తరువాత యజ్ఞము పూర్తికాఁగానే భృగుమహాముని యిట్లనియె: "రాజా! నేను సంతోషించితిని. నీకుఁ జైతన్యమును గలిగించెద"ననెను. దేవతలందఱును నిమియొక్క చేతనమునుగూర్చి సంతోషించి యిట్లనిరి: "రాజర్షి! వరము గోరుము. నీచేతన మెచ్చట నుండవలయునో నిరూపింపుము" అని యందఱు దేవతలును పలుకఁగానే నిమి

యొక్క చేతనము "దేవతలారా! నేను సర్వప్రాణుల నేత్రములయందును నుండఁగోరితి" ననఁగానే దేవతలందఱును నిమిచేతనమునుగూర్చి "యట్లే యగుఁగా"కనిరి. నీ విటుపైని వాయుభూతమవై సర్వభూతముల నేత్ర ములయందును సంచరింపుము. రాజా! నీకొఱకుఁగన్నుల నార్చుచుందురు. నీవు వాయుభూతుఁడవై చరించునపుడు మాటిమాటికిని నీకు విశ్రాంతి గలుగుచుండును" అని వరమిచ్చి దేవతలందఱును యథాగతముగాఁ బోయిరి. మహాత్ములగు ఋషులు నిమిదేహమును దెచ్చిరి. దానియందరణి నుంచి బలముగా మథించిరి. పుత్రజననముకై మంత్రములచేతను హోమ ములచేతను మథింపఁగా మహాతపశ్శాలి యగు పుత్రుఁడు పుట్టెను మథిం చుటివలనఁ గలిగినవాఁడగుటచే వానికి మిథియని పేరిడిరి. జననమువలన జనకుఁ డనిరి. విదేహునివలనఁ బుట్టుటచే వైదేహుఁ డయ్యెను. ఇట్లు విదేహుఁ డని జనకుఁ డని వీరి మూలపురుషుఁడాయెను. మిథి యనువాని పేర మిథిల యను నగరము వర్ధిల్లెను.

ఏబది-వ సర్గము

రాముఁడు యయాతిచరిత్ర చెప్పుట

శ్రీరాముఁడిట్లు చెప్పఁగా విని తేజస్సుచే వెలుఁగుచున్న మహాత్ముఁ డగు శ్రీరామునితో లక్ష్మణుఁడిట్లనియె: "అన్నా! విదేహుని పూర్వకథ మిగుల నాశ్చర్యముగా నున్నది. రాజశార్దూలా! రామా! నిమి యొక్కయు వసిష్ఠునియొక్కయు సంగతి వేరొక్కనఁబడినది. నిమి క్షత్రి యుఁడు, శూరుఁడు, అందును విశేషించి దీక్షితుఁడు. మహాత్ముండగు వసి ష్ఠునివిషయమున శాంతిని జూపవలసియుండఁగా నట్లు చూపకపోయెను" అని యిట్లు లక్ష్మణుఁడడుగఁగా రాముఁడిట్లనియె: "తమ్ముఁడా! అంత టను బురుషులయందు శాంతి కసుపడుట దుర్లభము. రోషము నెట్టివాఁ డును నాఁపుకోఁజాలఁడు. ఒక్కయయాతిమాత్రము తనసత్త్వగుణము నవలంబించి క్షాంతినే చూపెను. ఆకథ చెప్పెదను; సావధానముగా వినుము: నహుషునికి యయాతి యను కుమారుఁడు గలఁడు. ఆతనికి రూపవతులగు నిద్దఱు భార్యలు గలరు. అందొకతె వృషపర్వమహారాజు కూఁతురు శర్మిష్ఠ యనునది. రెండవభార్య శుక్రాచార్యుని కూఁతురు

దేవయాని. కాని శర్మిష్ఠయంతగా యయాతికి దేవయాని ప్రేమాస్పద రాలుగాదు. ఆయిద్దఱు భార్యలకు రూపవంతులగు కొడుకులు పుట్టిరి. శర్మిష్ఠ యనునది పూరుని గన్నది. దేవయాని యదుఁడనువానిని గన్నది. రాజునకుఁ బూరుఁ డెక్కువ ప్రేమాస్పదుఁడాయెను. ఎందుచేత ననఁగా నాబాలుఁడు మొదలే గుణవంతుఁడు. రెండవది ప్రేమపాత్రమగు శర్మిష్ఠ కొడుకు. వానియందుఁ దండ్రికిఁ గల ప్రేమను సహింపఁజాలక యదుఁడు తల్లితో నిట్లనియె: "అమ్మా! నీవంతటి శుక్రాచార్యుని కూఁతురవై యిట్టి యవమానమును సహించుచున్నావు. కనుక మన మిద్దఱమును నగ్ని హోత్రములోఁ బ్రవేశింతము. రాజు రాక్షసరాజు కూఁతురగు రాక్షసి శర్మిష్ఠతో రమించుచు నుండనీ! ఒకవేళ నీవు సహించినను నే నాయవ మానమును సహింపఁజాలను. నాకనుజ్ఞయిమ్ము. నేనిపుడే బలవంతముగాఁ జచ్చెదను" అని యిట్లేడ్చుచుఁ జెప్పిన కొడుకుమాటలువిని దేవయాని పట్టరానంత కోపమును వహించి వెంటనే తండ్రిని స్మరించినది. ఆశుక్రుఁడు కూఁతు నభిప్రాయమును దెలిసికొని దేవయాని యున్న చోటికే వచ్చెను. పతిలేక ప్రకృతిచెడి సంతోషము దక్కియున్న కూఁతును జూచి "అమ్మా యిదేటి సంగతి?" అని యడిగెను. ఇట్లు మాటిమాటికిని నడుగుచున్న తండ్రినిఁజూచి దేవయాని మిగులఁ గోపించి యిట్లనియె:"తండ్రీ! నే నగ్ని లోఁబడికాని, విషముతినికాని, నీళ్లలోఁ బ్రవేశించికాని చచ్చెదనుగాని యిఁక బ్రతికి యుండఁజాలను. నే నిదివఱకే యవమానింపఁబడి దుఃఖ సముద్రములో మునిఁగియున్నాను. నన్ను మఱింత యవమానమునకు లోనుగాఁజేసి దుఃఖింపఁజేయకుము. వృషపర్వుని కవమానము గలుగుట వలన వృషపర్వజీవులు ఖేదమును బొందుదురు. నామగఁడు నన్నవమానించి తిరస్కరించియున్నాఁడు. నన్ను బహుమానించుటయే లేదు" అని యిట్లు కూఁతురు చెప్పినమాటలు విని శుక్రాచార్యులు చాలఁ గోపించి యయా తినిగూర్చి మాటలాడుట కుపక్రమించెను: "ఓరీ దురాత్మా! యయాతీ! నీవు నన్నవమానించితి గనుకఁ బూర్ణముగా జరచే జీర్ణించి శైథిల్య మును బొందుము" అని యల్లుని శపించి ద్విజపుంగవుఁడగు నాశుక్రా చార్యులు కూఁతురగు దేవయాని నోదార్చి సూర్యసమానతేజుఁ డతఁ డింటికిఁ బోయెను.

59-వ సర్గము

యయాతిచరిత్ర

అపుడు నహుషాత్మజుఁడగు యయాతి శుక్రుఁడు కోపించె నని విని గొప్పది యగు ముదిమినిబొంది యార్తుఁడై యదువును బిలిచి యిట్లనియె: "యదూ! నీవు ధర్మజ్ఞుఁడవు. నానిమిత్తమై ముదిమిని నీవు వహింపుము. నేను భోగము లనుభవింతును. విషయసుఖములయందును నాకింకను దృప్తి చాలకున్నది. నేను భోగముల ననుభవించి మరల నా ముదిమిని నేను గొందును" అను తండ్రిమాటలువిని యదువు తండ్రితో నిట్లనియె: "నీకు ముద్దులకుమారుఁడగు పూరుఁడు నీముదిమిని గ్రహించుఁగాక! ప్రతివిషయమందును నేను బహిష్కరింపఁబడియే యుంటిని. నీతోఁగూడి యెవ్వఁడు భుజించుచున్నాఁడో వాఁడే నీముదిమిని గ్రహింపరాదా?" అను యదునిమాటలు విని రాజు పూరునిఁ బిలిచి యిట్లనియె: "నాయనా! పూరూ! నీవు నావిషయమ్మై యీముదిమిని గ్రహింపుము" అను తండ్రిమాటలు విని యతఁడు చేతులు జోడించుకొని యిట్లనియె: తండ్రీ! నేను ధన్యుఁడను. అనుగ్రహింపఁబడినవాఁడనైతిని. నీయాజ్ఞను శిరసావహించెదను"అను పూరునిమాటలు విని యయాతి మిగుల సంతోషించి తన ముదిమిని వానియందు సంక్రమింపఁజేసెను. తరువాత నారాజు యౌవనమును బొంది వేలకొలఁది యజ్ఞములు చేసి పెక్కువేలసంవత్సరములు భూమిని బాలించెను. ఇట్లు చాలఁగాల మతిక్రమించినవెనుకఁ బూరుని బిలిచి యిట్లనియె: "నాయనా! నేను నీయందు సంక్రమింపఁజేసిన నాముదిమిని నాకిమ్ము. నేను నీయొద్ద దాచుకొంటిని గనుక దానిని నేను ప్రతిగ్రహించుచున్నాను. వేఱుగాఁ దలఁపకుము. నాయాజ్ఞను నీవు మన్నించినందులకు నేనెంతయు సంతసించితిని. కనుక నిన్ను నారాజ్యమం దభిషిక్తునిగాఁ జేసెదను"అని పూరునకుఁ బట్టాభిషేకము చేసి దేవయాని కొడుకగు యదువునుజూచి కోపపూర్ణుఁడై యిట్లనియె:"ఓరీ!నీవు రాజసుఁడవు. నాకుఁ బుత్రరూపమునఁ బుట్టితివి. నీవు నాయాజ్ఞను మన్నింపవైతివి గనుక నీవు రాజ్యార్హత లేనివాఁడ వగుము. గురుభూతుఁడనగు తండ్రిని నన్నవమానించితివి గనుక నీవంశమునందు దుర్జనులగు రాజసులే జన్మింతురు. చంద్రునివలనఁ బుట్టిన నావంశమందు దుర్జనుఁడవగు నీవంశము

డదు. నీవంశము నీతో సమానమేగ్గొ దుర్వినయసంపన్నము గాఁగలదు" అని వాని నిట్లు ధిక్కరించి పూమనకుఁ బట్టాభిషేకముచేసి వానప్రస్థాశ్రమములోఁ బ్రవేశించెను. అతఁడు మఱికొంతకాలమునకు దైవగతిని బొంది తానుజేసిన సుకృతములఫల మనుభవించుటకై స్వర్గమున కేఁగెను. తరువాతఁ బూరుఁ డను కుమారుఁడు ప్రతిష్ఠానపట్టణమం దుండి రాజ్యమే లెను. యదు వసువాఁడు వేలకొలఁది రాక్షసులను గనెను. వానిని రాజవంశము బహిష్కరించుటచేఁ గ్రౌంచ మను పేరుగల దుర్గమైన యడవిలోనికిఁ బోయియుండెను. "తమ్ముఁడా! ఇట్లు శుక్రుఁ డిచ్చినశాపమును యయాతి సహించెను. రాజధర్మమునం దున్ననిమి గురుశాపమును సహింపఁజాలకపోయెను. ఇది వెనుకటిరాజులచరిత్రము. నీకంతయుఁ జెప్పితిని. కావున వీవైనంతలో నృగమహారాజునందువలె దోషము తటస్థింపకుండ మసలుకొనుట చాల మంచికార్యము." ఇట్లు చంద్రతులాత్మజనుఁడగు రాముఁడు కథలు చెప్పుచుండఁగా నపుడు నభోభాగమంతటను జుక్కలు పలుచనైనవి. తూర్పుదిక్కున వరుణుని కిరణములు వ్యాపించి ప్రకాశించినవి. తూర్పు కుసుమరసముతో రంగువేసిన వస్త్రమువలె నెఱ్ఱఁబడినది.

ప్రక్షిప్తసర్గములు

11-వ సర్గము

రాముఁడు కుక్కవివాదమును విమర్శించుట

తరువాతఁ బ్రభాతము కాఁగానే రాముఁడుపౌర్వాహ్ణికక్రియలు నిర్వర్తించుకొని ధర్మాసనమునం దుండి బ్రాహ్మణులతోడను, పౌరులతోడను, వసిష్ఠునితోడను, కశ్యపుఁడను ఋషితోడను, వ్యవహారజ్ఞానము గల మంత్రులతోడను, ధర్మజ్ఞులగు నితరులతోడను, న్యాయశాస్త్రసంపన్నులగు సభ్యులతోడను, రాజులతోడను గూడి రాజధర్మములు కనుఁగొనుచుండెను. అక్లిష్టకర్ముఁడగు రామునిసభ మహేంద్రయమవరుణుల సభ నతిక్రమించియుండెను. తరువాత నాసభలో రాముఁడు లక్ష్మణునితో నిట్లనియె: "సుమిత్రానందవర్ధనుఁడవగు లక్ష్మణా! నీవు బయటికిఁబోయి కార్యార్థులెవ్వరైన నున్నచోఁ గనుఁగొని తీసికొనిర"మ్మనఁగానే యతఁ

డక్కడపోయి ద్వారదేశమునందు నిలువఁబడి స్వయముగాఁ గార్యార్థులను బిలువ మొదలిడెను. "నాకు నేఁడు కార్యమున్నది" అని యొక్కఁడును జెప్పఁడాయెను. రాముఁడు రాజ్య మేలుచుండఁగా నాధులుగాని వ్యాధులుగాని లేవు. భూమి పక్వసస్యయు, సరౌషధిసమన్వితయునై యుండెను. ఱయనరాజ్యములో బాలుఁడుగాని, వయసులోనున్న వాఁడు గాని మృతినొందుటయే లేదు. అంతయు ధర్మయుక్తముగాఁ బాలింపఁ బడుచున్నది. ఎవ్వరికిని నేవిధమైన బాధయు లేదు. రాముఁడు రాజ్య మేలుచుండఁగాఁగార్యార్థియొక్కఁడును గనుపడఁడు. లక్ష్మణుఁడు రాము నకుఁ జేతులు జోడించి "యెవ్వరును లే" రని విన్నవించెను.

తరువాత రాముఁడు ప్రసన్నుఁడై తమ్మునితో నిట్లనియె: "తమ్ముఁడా! నీవు మరలఁబోయి కార్యార్థులను విచారించిరమ్ము. బాగుగాఁ బ్రయోగింపఁబడిన నీతిచేతను నెచ్చటను నధర్మముండదు. ఆరాజభయము వలననే పరస్పరమును రక్షించుకొనుచుండునట్లుందురు. నాచే విడువం బడిన బాణములవలె నాప్రజలు రక్షించుచుందురు. అయినను నీవు జాగ రూకుఁడవై ప్రజలను రక్షించుచుండుము" అనియిట్లు శ్రీరాముఁడుచెప్పఁ గానే లక్ష్మణుఁడు రాజభవనమునుండి బయలుదేఱి ద్వారమునొద్దకు వచ్చి యచ్చట నొకకుక్కను జూచెను: అది లక్ష్మణునివైపుచూచి మొఱ గుట ప్రారంభించినది. ఆసంగతి చూచి లక్ష్మణుఁడు దానితో నిట్లనియె: "మహాభాగా! శ్వానమా, నీకార్య మేమైన నున్నదా? నిర్భయముగాఁ జెప్పుము" అని లక్ష్మణుఁ డడుగఁగాఁ గుక్క యిట్లనియె: "సర్వభూత శరణ్యుఁడును, అక్లిష్టకర్ముఁడును, భయము గలిగినవారి కభయమిచ్చు వాఁడును అగు రాముని తోడనే మనవిచేయఁదలఁచితిని." లక్ష్మణుఁ డిట్లు చెప్పిన కుక్కమాటలు విని యాసంగతి రామునితో విన్నవించుటకు లోపలికిఁబోయెను. అట్లుపోయి రామునితో విన్నవించి మరల ద్వారము నొద్దకు వచ్చి "చెప్పవలసిన సంగతులు నీవే లోపలకు వచ్చి రామునితో విన్నవింపు"మన లక్ష్మణునిమాటలు విని కుక్క యిట్లనియె: "దేవాలయ మందును, రాజమందిరమందును, బ్రాహ్మణులయిండ్లయందును వహ్ని, దేవేంద్రుఁడు, సూర్యుఁడు, వాయుదేవుఁడును నుందురు గావున నచ్చటికి మాబోఁటి నీచజంతువులు రాఁదగదు. అందును రాజు శరీరమును ధరిం చిన ధర్మమనికదా పెద్దలు చెప్పుచుందురు! రాముఁడు సత్యవాది, యుద్ధ

విశారదుఁడు,సర్వభూతములకును మేలుచేయుటయం దాస క్తిగలవాఁడు, షాడ్గుణ్యముయొక్క సంగతిని బాగుగాఁ దెలిసినవాఁడు, నీతిని బాగుగా వ్యాపింపఁ జేయువాఁడు, సర్వజ్ఞుఁడు,సర్వమును గనుగొనువాఁడు,సంతో షించువారలలో నుత్తముఁడు, ఆతఁడే సోముఁడు, అతఁడే మృత్యువు, అతఁడే యముఁడు, కుబేరుఁడు, వహ్ని, దేవేంద్రుఁడు, సూర్యుఁడు, వరుణుఁడును నైనవాఁడు. కావున లక్ష్మణా !నీవేపోయి ప్రజాపాలకుఁడగు రామునితో విన్నవించుము. ఆయనయాజ్ఞ కాకుండ లోపలకు రానిచ్చి గింపను" అని కుక్క–చెప్పఁగానే దయాళువును, మహాభాగుఁడును, మహా ద్యుతియునునగు లక్ష్మణుఁడు రాజసభలోనికిఁబోయియిట్లనియె:"కాసలా నందవర్ధనుఁడ వగు రామా ! నావిన్నపము వినవలయును. నీయాజ్ఞను శిరసావహించి బయటికిఁబోయి చూచితిని. ద్వారమునొద్ద గుక్క–యొకటి కార్యార్థియై యున్నది" అని పలికిన లక్ష్మణునిమాటలు విని "కార్యార్థి యగువా రెవ్వరైనను సరియే లోపలకుఁ దీసికొనిర"మ్మని రాముఁ డాజ్ఞా పించెను.

12-వ స ర్గ ము

రామునివాక్యము విని లక్ష్మణుఁ డతిత్వరగాఁ గుక్క–ను బిలుచు కొని రామునియొద్దకుఁబోయి విన్నవించెను. అట్లు వచ్చియున్న కుక్క–ను జూచి రాముఁ డిట్లనియె: "సారమేయమా, చెప్పఁదలఁచినసంగతి నాతోఁ జెప్పుము. నీకు భయములేదు."అంత తలపగిలియున్న యాకుక్క రాముని జూచి యిట్లనియె: "రాజు ప్రజలు నిదురించుచుండఁగా మేలుకొని యుండును. రాజు ప్రజలను బాలించుచుండును. కర్తయుగోప్తయు రాజే. రాజే సర్వలోకములకును దండ్రి. రాజు కాలము యుగము. అది యిది యన నేల? ఈజగమంతయు రాజే. రక్షకుఁడగురాజు బాగుగాఁ బ్రయో గింపఁబడిన నీతిచేత ధర్మమును రక్షించుచుండును. రాజు పాలించని నాఁడు ప్రజలందఱును వెంటనే నశింతురు. ధారణమువలన ధర్మమందురు. ధర్మముచేతను బ్రజలు ధరింపఁబడిరి. ధర్మము చరాచరప్రపంచమును ధరించుచుండును. ప్రజలనుగూడ ధరించుటవలనను, ధర్మముగాఁ బ్రజ లను రంజింపఁజేయుటవలనను ధారణ మని చెప్పఁబడినది. అదియే ధర్మ మని నిశ్చయము. రాజా ! ఈధర్మము బాగుగాఁ రక్షింపఁబడి యైహికా ముష్మికముల నొసఁగును. ధర్మమువలనఁ బ్రాప్తింపనివస్తు వెందును లేదు.

దానము, దయ, సజ్జనులను బూజించుట, వ్యవహారములయం దార్జవము ననునవే పరమధర్మము. దానిని రక్షించుటవలన నైహికాముష్మికములు సులభము. సుప్రతుండవగు రామా! నీవన్ని ప్రమాణములకును బ్రమాణమువైయుంటివి. సజ్జనులచే నాచరింపఁబడినధర్మము నీవెఱుఁగనిది గాదు. ధర్మములకు నీవు పరధామమవు. గుణములకు సముద్రునితో సమానుఁడవు. రాజసత్తమా! నే నజ్ఞానమువలన నీతో నింతయుఁ జెప్పితిని. నేను తలయొగ్గి నీయనుగ్రహమును వేఁడుచున్నాను. నాపైని నీవు కోపింపకుము."అని చెప్పిన కుక్కమాటలువినిరాముఁడిట్లనియె: "సారమేయమా! నే నిపుడు నీ కేమిచేయవలయును? వెంటనే నిర్భయముగాఁ జెప్పు." మనఁ గుక్క యిట్లనియె.

"ధర్మముచే రాష్ట్రము పొందఁబడును. ధర్మముచేతనే పాలింపఁబడును. రాజు ధర్మమువలన శరణ్యుఁడగును. మఱియు నంతఅభయమును బోఁగొట్టుచుండును. ఇది తెలిసికొని నా కేమిచేయవలయునో రామా! విను. సర్వార్థసిద్ధుఁడనుభిక్షుండు బ్రాహ్మణగృహమునం దుండెను. నే నేయపరాధమును జేయకుండఁగనే యా బ్రాహ్మణుఁడు నాతల పగులఁ గొట్టెను."అను కుక్కమాట విని రాముఁడు వెంటనే ద్వారపాలకునిఁబంపి యా బ్రాహ్మణుని రావించెను. అపు డా బ్రాహ్మణుఁడు రాముని౦జూచి "రామా! నేనిపు డేమిచేయవలసియున్నదో చెప్పు"మన రాముఁడిట్లనియె: "బ్రాహ్మణా! నీ వీకుక్కను దల పగులఁగొట్టితివఁట! ఇది నీకేమపకారము చేసినది? నిష్కారణముగా దండముతో దీనినిగొట్టితివి. కోపము ప్రాణములను హరించు శత్రువు. క్రోధము మిత్రరూపమున నుండు శత్రువు. కోపము మిక్కిలి వాఁడిగల కత్తి. క్రోధమన్నింటిని నపకర్షించును. ఎంత తపస్సుచేసినను, ఎన్ని యజ్ఞములను జేసినను, ఎన్ని దానములిచ్చినను కోప మున్న చో నవియన్నియు గంగలోఁగలియును, కావున౦ గోపమును విడువ వలయును. ఇంద్రియములు పెంకెగుఱ్ఱములవలెఁ బరుగులిడుచుండును. వానిని ధైర్యమును సారథిగాఁజేసి యింద్రియగోచరమును సంహరించి స్వాధీనమునం దుంచుకొనవలయును. మనస్సుచేతను, వాక్కుచేతను, కర్మములచేతను, చూపులచేతను లోకులకు శ్రేయస్సు గలుగఁజేయవలయును. అట్లు నడచువానికి ద్వేష్యుఁడుండఁడు. వాని కేపాపమును గలుగదు. తీక్ష్ణమగు కత్తిగాని, కాలిత్రోఁ ద్రొక్కఁబడిన పాముగాని, నిత్యమును

గోపించు శత్రువుగాని, క్రోధము గలిగి చెడునడతగలవానితో సమానములు గావు. ఎంతవినయముగలవానికిని బ్రకృతి విధేయమైయుండదు" అనియి ట్లకిషకర్ముఁడగు రాముఁడు చెప్పఁగనే సర్వార్థసిద్ధి యను బ్రాహ్మణుఁడు రామసన్నిధి నిట్లని విన్నవించెను: "రాజా! నేను గోపమాఁపుకోఁజాలక కుక్కను గొట్టితిని. నేను భిక్షకై యిల్లిల్లు దిరిగితిని. నాకు భిక్ష దొరకకపోయినది. అపు డీకుక్క బారిలోఁ నిలువఁబడియుండఁగా నేను 'బొమ్ము పొమ్ము' అని పలుమాఱు చెప్పఁగాఁ బోవక దారికడ్డముగి వచ్చి నిలిచినది. నేను మొదలే యాఁకలిచేఁ బీడింపఁబడియుంటిని. కోపమాఁపు కోఁజాలక దీనిని గొట్టితిని. రాజేంద్రా! నేనపరాధిని నన్ను దండించుము. రాజదండనమైనచో యమదండన లే దందురు."

అపుడు రాముఁడు సభాసదులవంకఁజూచి "వీని కేమిదండన మాచరింపవలయునో చెప్పుఁ"డని యడిగెను. "దండనీతి బాగుగా జరుగుచున్నచోఁ బ్రజ రక్షింపఁబడినదగు"నని యనెను. అపు డచట భృగువు, అంగిరస్సు, కుత్సుఁడు మొదలగుఁవారు, వసిష్ఠుఁడు, కాశ్యపుఁడు, ధర్మపాలక ముఖ్యులు, మంత్రులు, పౌరులు, మఱియుఁ బెక్కుఁరుపండితులు గూడియుండిరి. బ్రాహ్మణుఁ డవధ్యుఁడని శాస్త్రకారులు చెప్పి రనిరి. వారందఱును రాజధర్మములు బాగుగాఁ దెలిసినవారే. అట్టిపైని మునులందఱును రామునితో నిట్లనిరి: "రాజు లోకమును శాసించువాఁడు. రామా! అందును నీవు విశేషించి శాసించువాఁడవు. అదిగాక ముల్లోకములను శాసించు సనాతనుఁడవగు విష్ణుమూర్తివి." అని వారందఱును రామునితో ననఁగానే కుక్క యిట్లనియె: "రామా! నీవు సంతోషించితివేని, నాకు వరమొకటి దలఁచితివేని యీబ్రాహ్మణునకుఁ గౌలపత్యము నిప్పించుము. మహావీరా! ఏమిచేయుమందువని ముందుగా నాతోఁ బ్రతిజ్ఞ చేసియుంటివిగదా! కనుక వీనికిఁ గౌలంచర మనుప్రదేశమునఁ గౌలపత్యమును నధికారమిమ్ము" అనిచెప్పిన కుక్కమాటలువిని రాముఁడా బ్రాహ్మణునిఁ గౌలపత్యమున నభిషేకించెను. బ్రాహ్మణుఁడు సంతోషించుచు నేనుఁగుపై నారోహింపఁజేయఁబడినవాఁడై వెడలిపోయెను. పిమ్మట రామునిమంత్రులు నవ్వుచునిట్లనిరి: "మీరు నీతితత్వము నెఱిఁగినవారలు గారు. ఈకుక్కయే యందులకుఁ గారణ మెఱుఁగును" అని మంత్రులనఁగానే రాముఁడాకుక్కనుగఁగా నడియిట్లనియె: రామా! నేను బూర్వ

మునం దచట గులపతినై యుండి శిష్టాన్నమును భుజింపుచు దేవద్విజ పూజయం దాసక్తి గలిగి దాసీదాసాదులకుఁ బంచియిచ్చుచు శుభకార్య ములయం దాసక్తుఁడనై దేవద్రవ్యమును గాపాడుచు నుంటిని. మఱియు నేను వినయము గలిగి శీలసంపన్నుఁడ ననిపించుకొనుచు సర్వజంతువులకు మేలుచేయుచు నుండియు నిట్టిఘోరమగు నీచజాతియందుఁబుట్టి యధమ గతి ననుభవించుచున్నాను. ఇట్లు కోపముతోఁగూడిన యీబ్రాహ్మణుఁడు ధర్మము విడిచి యహితాసక్తుఁడై నృశంసుఁడు పరుషచిత్తుఁడు నగును. మఱియు నితఁడు పండితుఁడును ధర్మాత్ముఁడును గాఁడు కావున నితఁడు కులములను, నటేమంకులములను నరకమునఁ గూలఁద్రోయును. కావుననే యెట్టిచిక్కులు తటస్థించినను దేవాలయాధికారమునందుఁ బ్రవేశింపఁ గూడ దందురు. ఎవనిని బుత్రులతోడను, పశువులతోడను, బంధువుల తోడను నరకుమునకుఁ బంపఁ బలంచుకొందురో వానికి దేవాధికారము గోబ్రాహ్మణాధికారము నీయనలయును. బ్రాహ్మణధనము, దేవద్రవ్యము, స్త్రీధనము, బాలుకధనము నెవరు హరింతురో వారి యిష్టము లన్నియు నశించును. అందును దేవబ్రాహ్మణధనము నపహరించినవారు వెంటనే మహాపీచి యను నరకమందుఁ గూలుదురు. ఎవఁడు మనస్సుచేతనుగూడ దేవతలయు బ్రాహ్మణులయు ధనమును హరింపఁదలఁచునో వాఁడొక నరకమునుండి మఱియొకనరకమునకుఁ బోవుచునేయుండును" అని యిట్లు కుక్కచెప్పినమాటలు విని యాశ్చర్యముచే వికసించినకన్నులుగలవాఁడై యుండెను. కుక్క రామునియొద్ద సెలవుగైకొని వచ్చినదారినే పోయినది. అది పూర్వజన్మస్మృతిగలదై మనోనిగ్రహ మవలంబించి జాతిమాత్ర ముచేతనే దూషితమయ్యెను వారాణసికిఁబోయి ప్రాయోపవేశముచేసి ప్రాణము విడిచి యోగుల కందరాని పదమును బ్రాపించినది.

13-వ సర్గము

రాముఁడు గృధ్రోలూకవివాదము తీర్చుట

ఇట్లుండఁగా రమ్యమును, వృక్షములచేశోభితమును, నదీకీర్ణమును, గిరిచరమును, ననేకకోకిలకూజితమును, సింహములు పెద్దపులులు మొక లగు వనజంతువులు గలదియు, నానావిధములైన పక్షులు గలదియు నగు నొకానొకవనములో నొకగ్రద్ధయు గ్రుడ్లగూబయుఁ జిరకాలమునుండి

వాసము చేయుచుండినవి. గ్రుడ్లగూబ నివసించు నింటిని పాపనిశ్చయ మగు గృధ్రము "ఈయిల్లు నాది" అని యాక్రమించుకొని కలహాము ప్రారంభించినది. "రాజీవలోచనుఁడగు రాముఁడు సర్వలోకములకును రాజు. ఆయనదగ్గఱకుఁ బోయి చెప్పుకొందము. ఆయన యీయి ల్లెవ్వరి దని తీర్పుచెప్పునో వారే దీని ననుభవించవలెను." అని యన్యోన్యమును నాలోచించి యారెండును గోపామర్షములతో గూఁడి రామునియొద్దకు వచ్చినవి. అట్లన్యోన్యము జగడమాడుచువచ్చి యవి రామునిపాదముల పైఁబడినవి. అపుడు గ్రద్ధ రామునిఁ జూచి యిట్లనియె: "రామా! నీవు సురాసురులకుఁ బ్రధానుఁడవని నాతాత్పర్యము. నీతియందు బృహస్పతి కంటెను శుక్రునికంటెను నెక్కువవాఁడవు. భూతముల మంచిసెడ్డలెఱుఁగుదువు. కాంతిచేఁ జంద్రునివంటివాఁడవు. సూర్యునివలెఁ దేజోచూడ శక్యముగాని ప్రతాపము గలవాఁడవు. హేమవంతుని మించిన గౌరవము గలవాఁడవు. సముద్రమువంటి గాంభీర్యము గలవాఁడవు. లోకపాలుఁడగు యమునివంటిధర్మము గలవాఁడవు. భూమితో సమానమగు నోరిమి గలవాఁడవు. వేగమునం దనిలునివంటివాఁడవు. నీవ గురువవు; సర్వ సంపన్నుఁడవు; కీర్తిమంతుఁడవు; అమర్షముగలవాఁడవు; దుర్జయుఁడవు; జయించువాఁడవు; సర్వాస్త్రముల విధులను దెలిసినవాఁడవు. నక్షత్రేష్టుఁడ వగు రామా! నావొకవిన్నపము గలదు చిత్తగింపుము. నేను పూర్వము గట్టుకొన్నయిల్లు నా దని బాహుబలము నాశ్రయించి యీయులూక మాక్రమించుకొన్నది. నీవు నన్ను రక్షింపవలయును." అని యిట్లు గృధ్రము చెప్పఁగానే గ్రుడ్లగూబ యిట్లనియె: "రామా! చంద్రుని యొక్కయు, దేవేంద్రునియొక్కయు, సూర్యునియొక్కయు, యముని యొక్కయు నంశములవలన రాజు పుట్టును. మనుష్యుఁడనిపేరేకాని రాజు సాక్షాద్దేవాంశసంభూతుఁడు. అందును నీవు ధర్మమయుఁడవు. రెండవ నారాయణమూర్తివి. రాజా! నీసౌమ్యత బాగుగాఁ బ్రణిహితమైయున్నది. సముగా సంచరింతువు. కావున నీవు సోమాంశసంభూతుఁడవు. ప్రజా నాథా! క్రోధమువిషయమున, దండమువిషయమున, దానమువిషయము నను పాపమునలనఁ గలుగు భయమును బోఁగొట్టుటచేతను దాతవు, హరించువాఁడవు, రక్షకుఁడవు నగుటచేతను నీవే యింద్రుఁడవు. సర్వ భూతములయందును దేజస్సుచే ధర్షింప శక్యముగానివాఁడ వగుటను నీ

వగ్ని దేవునితో సమానుఁడవు. నీవు సాక్షాత్తుగాఁ గుబేరునితో సమానుఁడవు. అట్లననేల? రాజసత్తమా! నీవు కుబేరునికంటె నధికుఁడవు. విత్తేశునికి వలెనే నీకును పద్మయగు లక్ష్మిగలదు. స్థావరములు జంగమములు నగు సర్వభూతములయందును సముఁడవు. రాఘవా! శత్రువులయందును మిత్రులయందును నీవృష్టిసమానముగా నుండును. నీశాసనము నిత్యమును ధర్మము ననుసరించియుండును. వ్యవహారము విషయమై విధియొక్కక్రమము ననుసరించియుండును. నీ వెవనివిషయమై కోపింతువో వానియొద్దకు మృత్యువు పరుగెత్తును. అందుచే నీవు యముఁడవని యమితవిక్రముఁడవని చెప్పఁబడుచున్నావు. ఇపుడు నీకు మానుష భావము గలదు. నీ వానృశంస్యపరుఁడవు. జంతువులయందు క్షమతోఁ గూడియుందువు. దుర్బలునకు దిక్కులేనివానికి రాజే బలము; దిక్కు. కన్నులులేనివానికి నీవే కన్ను. గతిలేనివానికి నీవే గతి. మాబోంట్లకును నీవే నాథుఁడవు. ధర్మాత్మా! నామొఱ్ఱి వినుము. ఈగృధ్రము నాయింటఁ బ్రవేశించి నన్ను బాధించుచుండును. నరపుంగవుఁడవగు నోదేవా! మనుష్యులను నీవు శాసించువాఁడవు" అనిచెప్పిన యులూకముమాటలు విని రాముఁడు స్వయముగా మంత్రులను బిలిచెను. ధృష్టి, జయంతుఁడు, విజయుఁడు, సిద్ధార్థుఁడు, రాష్ట్రవర్ధనుఁడు, అశోకుఁడు, ధర్మపాలుఁడు, మహాబలుఁడు ననువారు రామునిమంత్రులు. వీరే దశరథునినాఁడును మంత్రులు. వారు నీతికోవిదులు, మహాత్ములు, సర్వశాస్త్రములు దెలిసిన వారు. ప్రీతిమంతులు, సత్కులమందుఁ బుట్టినవారు. నీతియందును, ఆలోచనచెప్పుటయందును నేర్పరులు. ధర్మాత్ముఁడగురాముఁడు పుష్పకమును స్మరించెను. అంత మంత్రులతోఁ గూడ దానిపై నాయిల్లు గల చోటికిఁబోయి పుష్పకమునుండి దిగి మంత్రులసమక్షమున నాగృధ్రోలూక వివాదమునుగూర్చి రాముఁడిట్లు ప్రశ్నించెను. "ఓగృధ్రమా! నీవెన్ని సంవత్సరములనాఁ డీయింటినిగట్టితివి? దీనికిఁ గారణము నీకుఁ దెలిసియుండినచో యథార్థముగాఁ జెప్పు"మని యడుగఁగా నాగృధ్రము రాముని తో నిట్లనియె:

"రామా! ఈభూమి యెపుడు మనుష్యులతోఁ గూడియున్నదో, అప్పటినుండియు నే నాయింట నుంటిని" అనఁగానే గూబ "రామా! ఎపుడీభూమి చెట్లతోఁ గూడియున్నదో, అదిమొదలు నే నాయింటనుంటి"

ననెను. ఇట్లుభయజంతువులును జెప్పినమాటలువిని రాముఁడు సభాసదు లతో నిట్లనియె: "వృద్ధులులేనిసభ సభ కాదు. ధర్మమును జెప్పనివారు వృద్ధులు గారు. సత్యములేనిది ధర్మముగాదు. మోసముతోఁ గూడినది సత్యము గాదు. ఏసభ్యులు సదా తెలిసి థ్యానించుచు నూరకయుందురో, సమయము తటస్థించినపుడు చెప్పరో, వారందఱును యథార్థము చెప్పని వారే యగుచున్నారు. తెలిసియుఁ బ్రశ్నములకుఁ గామముపలనఁగాని, క్రోధముపలనఁగాని, భయముపలనఁగాని చెప్పనిచో వారిని వేలకొలఁది వారుణపాశములువచ్చి చుట్టుకొనును. వారి కొకొక్కసంవత్సరమున కొకొక్కపాశము విడువల యగుచుండును. కావునఁ దెలిసినవారు సత్యమునే చెప్పవలయును." అనిచెప్పిన రాముని మాటలువిని మంత్రు లిట్లనిరి. "మహామతివగు రామా! ఉలూకము గెలిచినది, గృధ్ర మోడి పోయినది. మహారాజా! ఈవిషయమై నీవే ప్రమాణము. రాజేకదా యెల్లరకును బరమగతి. ప్రజలందఱకును రాజే మూలము. రాజు సనా తనమైనధర్మము. ఎవరిని రాజు శాసించునో వారు నరకమును బొందరు. వైవస్వతునిచే విడువఁబడినవారు పురుషోత్తమము లగుదురు" అని చెప్పిన మంత్రులమాటలు విని రాముఁడిట్లనియె: "నేను బురాణములయందుఁ దా హరింపఁబడిన సంగతి చెప్పెదను వినుఁడు: అప్పుడు చంద్రార్కనక్షత్రము లతోఁ గూడిన యంతరిక్షము, పర్వతములు మహావనములు మొదలగు వానితోఁ గూడినభూమి సముద్రములతోఁ గూడినదియు చరాచరము లతోఁ గూడినదియు, నగు నీలోకమంతయు నొక్కటియై రెండవ మేరువువలె నుండెను. పూర్వము భూమి లక్ష్మితోఁగూడ విష్ణునిజఠర ములోఁ బ్రవేశించినది. మహాతేజస్వియగునతఁడు సలిలార్ణవమును బ్రవేశించి యాభూమిని నిగ్రహించి బహుసంవత్సరములు నిదురించెను. విష్ణుఁడు నిద్రవోవుచుండఁగా బ్రహ్మ యతనిజఠరములోఁ బ్రవేశించెను. విష్ణునినాభియందు హేమవిభూషిత మగు పద్మము పుట్టినతోడనే బ్రహ్మ దేవుఁడు యోగబలముచే బయటికి వచ్చి సృష్టి చేయఁ దలఁచినవాఁడై భూమిని వాయువును పర్వతములను వృక్షములను మనుష్యులను సరీ సృపములు మొదలగువానిని జరాయుజములను అండజములను మహా తపస్వియతఁడు సృజించెను. తరువాత విష్ణునికర్ణమలమువలనఁ బుట్టిన మధుకైటభులు రాక్షసులు మహావీర్యులు ఘోరరూపులు దురాసదులు

నయి బ్రహ్మనుజూచి కోపించిరి. వెంటనే వారు మహావేగముతో గూడిన వారై బ్రహ్మమీఁదికి జగడమునకు వచ్చిరి. బ్రహ్మ వారి నిర్దయను జూచి వికృతముగా మొఱ్ఱపెట్టెను. ఆధ్వనిచే విష్ణువు నిద్ర మేల్కొని రాక్షసులతో యుద్ధముచేసి చక్రముచే మధుకైటభులను జంపెను. తరువాత వారిమెదడుచే నీభూమిని ముంచి లోకధారి యగుహరి భూమిని మరల శోధించి శుద్ధముచేసి వృక్షములచే నిండించెను. ఓషధులు సర్వవిధములైనసస్యములు వేఱువేఱుగాఁ బుట్టినవి. మేదోగంధము గలదీ యగుటచే సీభూమి మేదిని యని పేరుపడినది. కావున నీయిల్లు గ్రుడ్లగూబదేకాని గృధ్రముది కాదని నాయభిప్రాయము. ఒకరియింటిని హరించిన యీగృధ్రము పాపి; దండనకుఁ దగియున్నది. వినయము విడిచి యనాథజంతువును బీడించుచుఁ బాపము సంపాదించుచున్నది" అని రాముఁడు చెప్పినతోడనే యాకాశవాణి యిట్లనియె: "రామా! తపోబలముచేత నిదివఱకే దగ్ధమైయున్న యీగృధ్రమును నిష్కారణముగాఁ జంపకుము.ఇది పూర్వకాలమున గౌతమశాపదగ్ధమైన ప్రజానాథుఁడు ధనేశ్వరుఁడు. ఆపూర్వజన్మమున బ్రహ్మదత్తుఁడనుపేరుగలవాఁడు. శూరుఁడు, సత్యవ్రతుఁడు, శుచి. వీనియింటికి గౌతముఁడను బ్రాహ్మణుఁడు భోజనార్థము వచ్చెను. 'రాజా! నీయింట నూఱుసంవత్సరములు పూర్తిగా భుజించెద'ననెను. బ్రహ్మదత్తుఁడను రాజు గౌతమున కర్ఘ్యము పాద్యము స్వయముగా నిచ్చెను. అతనికిఁ బ్రీతిపూర్వకముగాఁ గోరినమేరకు భోజనము పెట్టెను. ఒకనాఁ డాహారములో నెట్లో మాంసము మిశ్రితమైనది. వెంటనే గౌతముఁడు కోపించి 'రాజా! నాకు మాంసము పెట్టితివి గనుక నీవు గృధ్రమవగు' మని శపించెను. మఱియు నతఁడిట్లనియె: రాజా! ఇక్ష్వాకువంశములో రాజీవలోచనుఁడు రాముఁడు పుట్టును. అతనిచే స్పృశింపఁబడి నిష్పాపుఁడవగుదు" వనెను. ఇట్లనిచెప్పిన యాకాశవాణి మాటవిని రాముఁడాగృధ్రమును స్పృశించెను. ఆగ్రద్ధ గృధ్రత్వమును విడిచి వెంటనే దివ్యగంధానులేపనుఁడగు దివ్యపురుషుఁడై రామునితో నిట్లనియె: "రామా! సాధు! సాధు! నీయనుగ్రహమువలన ఘోరనరకము నుండి విముక్తుఁడనైతిని. నీవు నాశిరమున కంతము గలిగించితివి. నీవయ వలన నేను బోవుచున్నాను" అని యెందేని పోయెను.

ప్రక్షిప్తసర్గములు సమాప్తము.

60-వ సర్గము

తాపసుల రాక

అపుడు రామలక్ష్మణు లిట్లుమాటలాడుకొనుచుండఁగాసమశీతోష్ణ మగు వసంతకాలపు రాత్రి తుదముట్టినది. తరువాత రాముఁడు విమల మగు ప్రభాతమునఁ బౌర్వాహ్ణికక్రియలు నిర్వర్తించుకొనిపౌరకార్యము లను జూచుట కుపక్రమించెను. తరువాత సుమంత్రుఁడు వచ్చి రాము నితో నిట్లనియె: "రాజా! తాపసులు ద్వారమునొద్ద కాచియున్నారు. వారు భార్గవచ్యవనుని బురస్కరించుకొని వచ్చిరి. వారు నీదరిసెనమును త్వరగాఁ గోరుచున్నారు. వారు నీయందుఁ బ్రేమగలవారు; యమునా తీరనివాసులు."అనిచెప్పిన సుమంత్రునిమాటలువినిధర్మాత్ముఁడగురాముఁ డిట్లనియె: "సుమంత్రా! భార్గవప్రముఖులగు ఋషిమహాభాగులను లోప లకుఁ దీసికొని రమ్ము." అనిచెప్పిన రాముని మాటలు విని ద్వారపాలుఁ డాదరముగాఁ జేతులు జోడించుకొని యావచ్చిన తాపసులను లోపలఁ బ్రవేశపఁజేసెను. తమతేజస్సుచేఁ బ్రకాశించుచున్నారు మహాత్ములు తాప సులు నూఱుగురికంటె హెచ్చుగానే యున్నారు. వారు సర్వతీర్థముల యందును, సంపాదింపఁబడిన పుణ్యజలముతోఁగూడిన కలశములను పట్టు కొనివచ్చి ఫలమూలాదికముతో రామునకు సమర్పించిరి. ప్రీతిపూర్వక ముగా శ్రీరాముఁడు వారిచ్చినవన్నియుఁ బరిగ్రహించి యామునులతో నిట్లనియె: "మహర్షులారా! ఇవిగో నాసనములు. యథోచితముగాఁ గూర్చుండుఁడు." అను రాముని మాట విని మహర్షులందఱును బంగారు వికారమైన బృసులయందుఁ గూర్చుండిరి. వారు కూర్చున్నపిదప పర పురంజయుఁడగు రాముఁడు నమస్కరించి చేతులు జోడించుకొని యిట్ల నియె. "మహత్తులారా! తమరాక కేమి ప్రయోజనము? నావలనఁ గావల సిన దేమి గలదో సెలవిండు. మీయాజ్ఞను శిరసావహించి నెఱవేర్చుటకు సిద్ధముగా నన్నాఁడను. నారాజ్యము, నాజీవనము మొదలగునదంతయు బ్రాహ్మణులకొఱకే. నేను యథార్థముగాఁ జెప్పుచున్నాను" అని రాముఁ డనఁగానే వారందఱును సాధువాదములు ప్రారంభించిరి. మఱియు యమునాతీరవాసు లగు ఋషులు పరమసంతోషముతోఁ గూడినవారై రామునితో నిట్లనిరి: "ఇట్లుచెప్పుట రామా! నీకే తగును గాని మఱియొక

రికిఁ దగదు. ఇదివఱ కెందఱో మహాబలులగు రాజులు గతించిరి. కార్య గౌరవ మాలోచించి ప్రతిజ్ఞ కిష్టపడరైరి. నీవో బ్రాహ్మణులయందుఁగల గౌరవమువలనఁ గారణమును గనిపట్టి యిట్లు ప్రతిజ్ఞ పట్టితివి. కావున మేము వచ్చినపని తప్పక నీవు చేసెదవు. ఇందు సందియము లేదు. కాక మహాభయమునుండి బుషులను రక్షించుట నీకే తగియున్నది."

61-వ సర్గము

లవణాసురనికథ

ఇట్లు చెప్పినబుషులతో రాముఁ డిట్లనియె: "ముసులారా! నా వలనఁ గాఁదగినకార్యము చెప్పుఁడు. మీభయము బోపునుగాక!" అని యిట్లడిగిన రాముని తో భార్గవుఁ డిట్లనియె: "నరేశ్వరా! దేశమునకు భయకారణము చెప్పెద నాలింపుము. రాజా! పూర్వము కృతయుగ మందు లోలయనుదాని పెద్దకొడుకు మధువనురాక్షసుఁ డొకఁ డుండెడి వాఁడు. వాఁడు మహాబలశాలి యయ్యును బ్రహ్మణ్యుఁడు బుద్ధిశాలియు నైయుండెడివాఁడు. వానికి దేవతలతో మిక్కిలి స్నేహముగలదు. వీర్య సంపన్నుఁడగు నామధువు ధర్మమునందు మిక్కిలి యాసక్తుఁడు. అతఁడు రుద్రునిఁగూర్చి పెక్కువేలసంవత్సరములు తప మాచరించెను. ఆతని తపస్సునకు సంతోషించి శివుఁడు వర మీయఁబోయెను. ఆతనియందలి గౌరవముచే నత్యద్భుతమైనవర మిచ్చెను. మఱియుఁ దనశూలమునుండి శూలమును సృజించి యిచ్చి యిట్లనియె: "ఓయీ! నీవు నాకనుగ్రహము గలుగులాగున నిరుపమాన మగు ధర్మము నాచరించితివి. నీయందు నాకు గొప్పప్రీతిగలుగుటచే నీ కీయాయుధము నిచ్చుచుంటిని. ఈశూలము మహావీర్యము, మహాప్రభము నని యెఱుఁగుము. నీవు దేవతలకును బ్రాహ్మణులకును హానిచేయకుండ నున్నంతవఱకును నీయొద్ద నుండును. హానిచేసితివేని నశించిపోవును. నీపైకి యుద్ధమునకు వచ్చినవానిని నశింపఁ జేసి యీశూలము మరల నీచేతికి వచ్చును." ఈరీతిగా నామధురాక్షసుఁ డీశ్వరునివలన వరము పొంది మరల నమస్కరించి యీశ్వరునితో నిట్లు విన్నవించెను: "శివభగవానులవారూ! తాము సురాసురుల కీశ్వరత్వ మును బొందియున్నారు. ఈయాయుధము నావంశమువారికి సంతతము నుండునట్లుగూడ వరమీయ వేఁడెదను." అనియిట్లు ప్రార్థించిన మధురాక్ష

సునిఁ జూచి సర్వభూతగతి యగు శివుఁ "డది యట్లు కానేర దైనను నా యనుగ్రహమునకుఁ బాత్రమవైన నీకోరిక వ్యర్థపుచ్చరాదు గనుక నీ కుమారునికిమాత్రమే యాయుధమై యుండు నని శివుఁ డనెను. ఎంత వఱకు నీకుమారునిచేతిలో నీశూలముండునో అంతవఱకును వాని నెవ్వరును జయింపఁజాలరు. వే యేల? వాఁడు నాతో సమానుఁ డగు"ననెను.

ఇట్లు మధురాసురుఁడు శివునివలన వరములు పొంది తనయిల్లు దేదీప్యమానముగాఁ జేయించెను. అతనిభార్యయే రావణాసురుని పినతాత కూఁతు కూఁతురు కుంభీనస యనునది. అది విశ్వావసు వను గంధర్వుని వలన ననల యనుదానియందుఁ బుట్టినది. దానికొడుకు లవణాసురుఁడు. వాఁడు మహాపరాక్రమశాలి. అతిదారుణ మైనవాఁడు. వాఁడు బాల్యమునుండియుఁ బాపములే చేయుచుండెను. అట్టి దుర్వినయ సంపన్నుఁడగు కొడుకునుజూచి మధువు కుపితుఁడై దుఃఖించెనేకాని వాని నేమియు ననఁడయ్యెను. ఆమధువీలోకమునను విడిచి వరుణలోకమునకుఁ బోవుచుఁ గొడుకున కాశూలము నిచ్చి శివునివరము సంగతి వినిచెను. వాఁడు మొదలే దుర్మార్గుఁడు. ఆపైన యాశూలముయొక్కప్రభావము వలన మూఁడులోకములను బాధించుచున్నాఁడు. అందును మాబోఁటి మునులను వాఁడు మఱియు బాధించుచున్నాఁడు. రామా! లవణాసురుఁ డిట్టిప్రభావముగలవాఁడు. వానియొద్దనున్న శూల మట్టిది. ఉన్న సంగతి విన్నవించుకొంటిమి. అటుపైని నీచిత్తము మాయదృష్టము. నీకన్న మాకు గతి లేదు లేదు లేదు. మేమిదివఱ కెందఱురాజులనో శరణుచొచ్చితిమి గాని యెవ్వరును మాభయమును దీర్చి కాపాడఁజాలకపోయిరి. ఇపుడు మే మందఱమును నీవు రావణాసురుని సహాపుత్రమిత్రాదులతోఁ జంపితి వని విని నీవేతప్ప నిఁక మమ్ములను రక్షించువారు లేరని నిన్ను శరణు చొచ్చితిమి. కావున లవణునివలన భయపడిన మమ్ములను గాపాడి పుణ్యము గట్టుకొనుము. రామా! మాభయకారణమంతయుఁ జెప్పితిమి. దానిని దొలఁగించుటకు నీవే తగినవాఁడవు. అహీనవిక్రమా! నీవు మా కోరిక నెఱవేర్పుము."

62-వ సర్గము

రాముఁడు లవణుని జంపించెద ననుట

అని యిట్లు ఋషులు చెప్పినమాటలు విని రాముఁడు చేతులు

జోడించుకొని వారితో నిట్లనియె: "వాఁ డెట్టియాచారముగలవాఁడు? వాని కాహార మేమి? వాఁడు నివసించు చో టేది?" అని యడిగిన రామునిమాటలు విని ముసులంగడును లవణుఁ డెట్లు వృద్ధిఁ బొందెనో దాని నిట్లు చెప్ప మొదలిడిరి: "రామా! వానికి సర్వజంతువులు నాహా రమే; కాని విశేషించి తాపసులను దినుచుండును. వాని యాచారము నిత్యమును రౌద్రతయే. వాఁడు మధువనమం దుండును. వాఁడు వేల కొలఁది సింహములను వ్యాఘ్రములను మృగములను జంపి, మనుష్యుల నాపైని జంపి నిత్యమును భోజన మాచరించుచుండును. మహాబలుఁడగు నాలవణాసురుఁడు మధ్యమధ్య నితరజంతువులనుగూడఁ జంపి తిను చుండును. వే యేల? వాఁడు సంహారమున కుపక్రమించినచో నోరు తెఱచుకొన్న యమునిఁ డే యని చెప్పక తప్పదు." అనిచెప్పిన ముసుల మాటలు విని "ముసులారా! నేను వానిని దప్పక చంపెదను. మీ రిటుపైని వానికి భయపడవల"దని ధైర్యము చెప్పెను. ఇట్లుగ్ర తేజులగు ముసులతోఁ బ్రతిజ్ఞపట్టి తమ్ములనందఱనుజూచి యిట్లనియె: "తమ్ములారా! లవణునిఁ జంపువా రెవ్వరు? వాని నెవ్వనిభాగముగా నిర్ణయించుకొంటిరి? భరతుని భాగమా? లేక శత్రుఘ్నుని భాగమా? వేగముగఁ జెప్పుఁ"డన భరతుఁ డిట్లనియె: "అన్నా! నేను వానిని జంపెదను. నాభాగముగా నేర్పఱుపవలెను" అనియిట్లు ధైర్యశౌర్యసమన్వితముగాఁ జెప్పినభరతుని పలుకు విని లక్ష్మణునితమ్ముఁడు శత్రుఘ్నుఁడు వెంటనే కనకాసనమునుండి దిగి నిలువఁబడెను. అతఁడు రామునకు నమస్కరించి యిట్లనియె:" అన్నా! మనభరతుఁడు చేయవలసినంతపని యిదివఱకే చేసియున్నాఁడు. మీరు పూర్వము దండకలో నున్నప్పు డీయయోధ్యాపట్టణమును బాలించెను గాదా! మీరు వచ్చువఱకును నీతఁడు పడిన సంతాప మిట్టిదని చెప్పుటకు వలనుపడదు. అదిగాక యితఁడు బహుదుఃఖములనుగూడ ననుభవించి యున్న వాఁడు. నందిగ్రామములోనుండి దుఃఖశయ్యలపైనే శయనించి దుఃఖములపాలాయెను. ఫలములు దుంపలు భుజించెను. జటలు ధరించెను. నారచీరలు గట్టెను. ఇదివఱకే యతఁ డెక్కువదుఃఖములను బొంది యిపుడు మరల దుఃఖములను బొందుటుచితముగాదు. అదియునుంగాక, కింకరుఁడ నేనుండఁగా నతఁడేల శ్రమపడవలయును?" అని శత్రుఘ్నుఁ డనుచుండఁగా రాముఁడిట్లనియె: "సరియే శత్రుఘ్నా! అట్లే చేయుము.

నాయానతి నెఱవేర్పుము. ని న్నిపుడే మధురాపురుని నగరమున కభిషే
కించెదను. భరతునికి శ్రమ గలుగు నని యోజించుచుంటివేని యతని
నాఁపుము. అదిగాక నీవును శూరుఁడవు; కృతవిద్యుఁడవు; రాజ్యమేలఁ
జాలినవాఁడవు. ఎవఁడు శత్రువును బెల్లగించి తత్థ్వానమున వెంటనే
మఱొకరాజు నుంచఁడో వాఁడు నరకమును బొందును. నీవు పాపనిశ్చ
యుఁడగు లవణుని జంపి నామాటయందు గుఱియుంచుకొని ధర్మముగా
రాజ్యమును బరిపాలింపుము. శూరా శత్రుఘ్నా ! నామాటకు బదులు
చెప్పకుము. బాలుఁడగుతమ్ముఁ డన్న చెప్పినమాట తప్పక వినవలయును.
శత్రుఘ్నా ! నాయిష్టప్రకార మిపుడు చేయఁబోవు నభిషేక మంగీకరిం
పుము. అదియును వసిష్ఠాదు లగు విప్రులచే విధిమంత్రపురస్సరముగఁ
జేయఁబడును."

63-వ సర్గము

శత్రుఘ్నుని మధురకు రాజునుగాఁ జేయుట

రాముఁ డిట్లు చెప్పఁగానే మిగుల సిగ్గుపడి వీర్యసంపన్నుఁడగు
శత్రుఘ్నుఁడు మెల్ల మెల్లఁగా ని ట్లనియె: "నరేశ్వరా ! ఈవిషయము నే
నధర్మముగా భావింతును. పెద్దలుండఁగాఁ జిన్న లభిషేకింపఁబడుదురా ?
తప్పక నీశాసన మాచరింపఁదగియున్నది. అదియునుంగాక, నీశాసనము
వాఁటుటకు వీలుగానిది. మహావీరా ! రామా ! నీవలనను శత్రువులవలనను
నేను వినియుంటిని. భరతుఁడు లవణునిజంపుటకుఁ బ్రతినపట్టుచుండఁగా
నేను బదులు చెప్పరాదు. అయినను నేనే లవణునిఁజంపెద ననియంటిని.
అనరానిమాట యన్నందులకు నాకీదుర్గతిరూపమైన రాజ్యాధికారము
తటస్థించినది. పెద్దవాఁడు చెప్పుచుండఁగా నే నూరకయుండవలసినది. అ
ట్లుండకపోవుట యధర్మము. మఱియుఁ బరలోకమును గలిగింపనిది. ఇది
వఱకే నదే చాలును. ఇపుడు మఱల బదులు చెప్పను. ఒకదానికే చాలుఁ
జాలును. ఇఁక రెండవమాటకుఁగూడ నాకు దండన లభించును. అట్లు
కాఁగూడదు. పురుషర్షభ ! నేను నీకుఁ గింకరుఁడను. నావిషయమునఁ
దటస్థించిన యధర్మమును బరిహరింపుము." అనియిట్లు శత్రుఘ్నుఁడనఁగా
రాముఁడు సంతోషించి భరతుని లక్ష్మణునిఁ జూచి యిట్లనియె: "మీరు
రాజ్యాభిషేకమునకు సంభారములు సిద్ధము చేయుఁడు. ఇపుడే నేను

శత్రుఘ్నునకు రాజ్యాభిషేకము చేసెదను. నే నాజ్ఞాపించితినని పురోహితుని, పౌరులను, ఋత్విజులను, మంత్రులను వెంటనే రావింపుడు" అని రాముఁ డాజ్ఞాపించినతోడనే వారు పురోహితాదులను రావించి సంభారములు సిద్ధపఱిచిరి. రాజులు, బ్రాహ్మణులు రాజభవనములోఁ బ్రవేశించిరి. అపుడు శత్రుఘ్నునకుఁ బట్టాభిషేకము ప్రారంభింపఁబడినది. అది రాఘవులకును, పౌరులకును సంతోషజనకమైనది. శత్రుఘ్నుఁ డభిషిక్తుఁడై పూర్వము సేనాపత్యమునం దభిషిక్తుఁడై యింద్రాదులతోఁ గూడిన కుమారస్వామివలెఁ బ్రకాశించుచుండెను.

అక్లిష్టకర్ముఁ డగు రాముని చే శత్రుఘ్నుఁ డభిషిక్తుఁడు కాఁగానే పౌరులు బహుశ్రుతులగు బ్రాహ్మణులు సంతోషించిరి. కౌసల్య, సుమిత్ర, కైక యింకను రాజభవనమందున్న స్త్రీలు మంగళోత్సవము జరపిరి. శత్రుఘ్నునకుఁ బట్టాభిషేకము కాఁగానే యమునాతీరవాసులగు మునులు లవణునిఁ జచ్చినవానినిగానే తలంచిరి. తరువాత రాముఁడు తమ్మునితోడ లపైఁ గూర్చుండఁబెట్టుకొని యతనికిఁ దేజమును హెచ్చుచేయుచు మధురముగా నిట్లనియె: "తమ్ముఁడా! ఈ బాణము మహోగ్రము. దీనిచే లవణునిఁ దప్పక చంపఁగలవు. ఇది దివ్యబాణము, శత్రుపట్టణములను జయించునది. మఱియు నీబాణము స్వయంభువు. దేవదేవుఁడు సురాసురుల కగపడనివాఁడు సముద్రములోఁ బడకొని యున్నప్పు డాయనచే సృజింపఁబడినది. ఇది సర్వభూతములకును నవధ్య మగుటచే శరోత్తమమైనది. దురాత్ములగు మధుకైటభులను వధించునిమిత్తమె సృజింపఁబడినది. క్రోధముచే నొడలెఱుఁగనియపుడు దీనిని సృజించి మధుకైటభులను దీనిచే వధించెను. అట్లు మధుకైటభులను జంపి జనుల యనుభవమునకై లోకములను సృజించెను. దీనిని నేను రావణుని వధించుటకుఁ గూడఁ బ్రయోగింపలేదు. అట్లు ప్రయోగించితినేని భూతములకు భయము గలుగునని తలంచితిని. శివుఁడు లవణునితండ్రి మధువను రాక్షసునకు శూల మొకటి యిచ్చెను. అది యిపుడు వానికుమారుఁ డగు లవణునియొద్ద నున్నది. వాఁడు దాని నింట నుంచి మాటిమాటికిని బూజించుచు నలుదిక్కులకును బోయి యాహారము సంపాదించుకొనుచుండును. ఎవరైనను దనపైకి యుద్ధమునకు వచ్చి పిలిచినచో వారి డాకశూలమును గైకొని వారిని భస్మముచేయును. కావున నదమ్ముఁడా! వాఁడాకశూల మేమరియుండఁగాఁ

బురములోనికిఁ బ్రవేశింపకుండ ద్వారము గాచి యాయుధముపట్టుకొని సిద్ధముగా నుండుము. ఎట్లైనను వాఁడు పురములో ప్రవేశింపఁబోవును. పోనీయక వానిని జంపుము. అట్లు చేయనిచో వానిని జంపుట సాధ్యము గాదు. నేను చెప్పినట్లు చేసితివేని వాఁడు తప్పక వినాశమును బొందును. నీకు వానియొక్కయు వానిశూలముయొక్కయుసంగతి యంతయుఁ జెప్పితిని. శ్రీమంతుఁడగు శివభగవానునికృత్యము దాఁటి వీలుగానిది గదా!

64-వ సర్గము

రాముఁడు సైన్యమును లవణునిమీఁదికిఁ బంపుట

శ్రీరాముఁ డిట్లు తమ్మునితో మాటిమాటికిని జెప్పి ప్రశంసించి మరల మఱియొకసంగతి చెప్పమొదలిడెను: "తమ్ముఁడా! శత్రుఘ్నా! ఇదిగో నాలుగువేలగుఱ్ఱములు, రెండువేలరథములు, ఉత్తమములగు నేనుఁగులు నూఱు, నానాపణ్యోపశోభితము లగు నంతరాపణవీథులు, నటులు, నర్తకులు మొదలగువారిని నీవెంటఁ దీసికొని పొమ్ము. మఱియు నీకుఁ గావలసినంతధనము తీసికొనిపొమ్ము. హృష్టము, పుష్టము, అనుద్ధతమునగు సైన్యమును దీసికొనిపొమ్ము. వారిమనసు రంజించునట్లు మాటలాడి వలసినంతధన మిచ్చుచుండుము. అచట ధన ముండదు; భార్యలుండరు; బంధువు లుండరు; నీ వున్నచోటున భృత్యవర్గము సుప్రీతమై యుండవలయును. ముందుగా సంతోషమును గలిగించి వలసినంత సైన్యమును బంపి తరువాత నీ వొక్కరుఁడవే ధనుష్పాణివై మధువనములోనికిఁ బొమ్ము. నీవు యుద్ధమును గోరి వచ్చుచున్నట్లు వానికిఁ దెలియనీయకుము. వాని కనుమానము గలుగకుండ వెళ్లుము. వానికి వేఱుగా మృత్యువే లేదు. వానికంటఁబడినవాఁడు తప్పక మృతినొందును. వానిని గ్రీష్మముపోయి వర్షాకాలమురాఁగా నాసమయమునఁ జంపుము. వానిని జంపుట కదియే తగిన సమయము. నీసైనికులు మహర్షులను బురస్కరించుకొని ముందుగాఁ బోవుదురుగాక! గ్రీష్మముండఁగానే వారు గంగానదిని దాఁటిపోవుదురుగాక! ఆగంగాతీరమునసైనికులనునిలిపి జాగరూకుఁడవై లక్షువిక్రముఁడవగు నీవు ముందుగాధనుష్పాణివై పొమ్ము" అనిరాముఁడు చెప్పినతోడనే సైనికులను మహాబలవంతులను రప్పించివారితోనిట్లనియె: "సైనికులారా! మీకు నివాసస్థానము లేర్పఱుపఁబడియున్నవి. అందు

మీరు నివసింపవచ్చును ఎవరికి నేవిధమైనబాధయుఁ గలుగకుండ నిర్విరోధముగ నుండుఁడు." ఆప్రకారముగా వారి కాజ్ఞాపించి సైన్యమును బంపించికౌసల్యాసుమిత్రాకైకేయులకు నమస్కరించెను. రామునకుఁ బ్రదక్షిణముచేసి సాష్టాంగనమస్కారమొనరించి రామునిచే ననుజ్ఞాతుఁడై, శత్రుతాపనుఁడగు నాశత్రుఘ్నుఁడు లక్ష్మణునకును భరతునకును నమస్కరించి చేతులు జోడించుకొని పురోహితుఁడగు వసిష్ఠభగవానునకుఁ బ్రదక్షిణనమస్కారము లాచరించి వారివారి యాశీర్వాదములను బొంది బయలుదేఱెను. అతఁడు ముందుగా నేనుఁగులు గుఱ్ఱములు రథములు మొదలగువానితో సంకులమైన సైన్యమును బంపించి, యొక్కమాసము వఱకు నన్న గారియొద్దనేయుండి తరువాత శత్రువుమీఁదికి యుద్ధమునకు వెడలెను.

65-వ సర్గము

వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసునికథ చెప్పుట

ఇట్లు బలమునంతయు ముందుగాఁబంపి నెలదినములు గడచిన తరువాత శత్రుఘ్నుఁ డొక్కరుఁడును త్వరితముగా బయలుదేఱి వెళ్లెను. అట్లు రెండుదినములుమాత్రము దారిలోనిలిచి వాల్మీకిమహాముని యొక్కపుణ్యాశ్రమమందు నివసించెను. అతఁడు వాల్మీకిమహాముని కి నమస్కరించి చేతులు జోడించుకొని యాయనతో నిట్లనియె: "భగవానులవారూ! మాయన్న గారియానతిపై నిట్లు వచ్చితిని. నేటిరాత్రి యిచ్చటనుండి రేపు తెల్లవాఱినతోడనే పశ్చిమదిశకుఁ బోయెదను" అనిచెప్పిన శత్రుఘ్నుని మాటలు విని మునిపుంగవుఁ డగు వాల్మీకి నవ్వి మహోత్సుఁడగు శత్రుఘ్నునితో నిట్లనియె: "మహాయశా! నీకు స్వాగతము. ఇది రఘువంశపువారి యాశ్రమము. నావలన నాసనము, పాద్యము, అర్ఘ్యము మొదలయిన వంగీకరింపుము. మఱియు నేఁ జేయుపూజను బరిగ్రహించి ఫలములను మూలములను భుజింపు" మనినతఁ డట్లు చేసి మిక్కిలి తృప్తిని బొందెను. అతఁడు భుజించిన తరువాత వాల్మీకితో నిట్లనియె: "మొదట నీయాశ్రమమెవ్వరిది? ఇచ్చట యజ్ఞసమృద్ధి పూర్వము జరిగినట్లు గనుపడుచున్న"దన నాతనితో వాల్మీకి యిట్లనియె: శత్రుఘ్నా! ఇది పూర్వ మెవరిదో చెప్పెదను వినుము. మీవంశములోఁ బూర్వము సుదాసుఁ డను రాజుండెడి

వాఁడు. అతనికుమారుఁడు వీరసహుఁ డను నతఁడు వీర్యవంతుఁడును, అతిథారి కుఁడును నైయుండువాఁడు. ఆతఁడు బాల్యమునండే వేఁటకు బయలుదేఱి, శార్దూలాకారమును ధరించి వేలకొలఁదిగ మృగములను భక్షించుచు సంతుష్టి యన నెట్టిదో యెఱుఁగక యుండు నిర్దయు రాక్షసులను జూచెను. అతఁ డట్లారాక్షసులను నిత్యమృగమైన యడవినిఁ జూచి చాలఁ గోపించి యొకరాక్షసుని బాణముతోఁ గొట్టెను. పురుషభక్షుఁడగు సౌదాసుఁ డట్లొకనిని జంపి విజ్వరుఁడు విగతశ్రమస్ఫుఁడు నై రెండవరాక్షసునిఁ జూచెను. అటు చూచుచున్న సౌదాసునిఁజూచి హతునిసహాయుఁడగు రాక్షసుఁడు చాల సంతాపమును బొంది సౌదాసునితో నిట్లనియె: "నీవు నిరపరాధుఁడగు నాసహాయుని గొట్టితివి గనుకఁ బాపాత్ముఁడా నీకుఁ బ్రతిక్రియ చేసెదను" అని ప్రత్యక్షముగఁ జెప్పి వాఁడచ్చటనే యంతర్ధానమును బొందెను. మఱికొంతకాలమున కారాజు మిత్రసహుఁడాయెను. ఆరాజీయాశ్రమసమీపమున వసిష్ఠునియాజమాన్యముక్రింద నశ్వమేధయాగ మారంభించెను. ఆయజ్ఞము చాలసంవత్సరములవఱకును జరగినది. వేయేల? అది పరమసమృద్ధమై దేవతలయజ్ఞముతో సమానముగ నుండెను. తరువాత యజ్ఞము పూర్తియగుచుండఁగా వెను కటివైరమును స్మరించుకొని యారాక్షసుఁడు వసిష్ఠునిరూపమును ధరించి సౌదాసుఁడనురాజుతోనిట్లనియె: "రాజా! నీయశ్వమేధము పూర్తియైనది, కనుక నాకు మాంసముతో భోజనము పెట్టుము. వేగము కావలెను. ఆలోచింపకుము." ఇట్లు బ్రాహ్మణరూపముతో వచ్చి రాక్షసుఁ డనఁగానే రాజు వంటలో నేర్పుగలవానిని బిలిచి యిట్లనియె:

"ఓయీ! మాగురువు సంతోషించునట్లు మాంసముతోఁ గూడిన హవిస్సును మంచి రుచిగా నుండునట్లు వేగము సిద్ధము చేయుము" అని రాజు చెప్పఁగానే వంటవాఁడు తొందరపడిన మనస్సుగలవాఁడైయుండెను. ఆరాక్షసుఁడు మరల వంటవానివేషము నవలంబించెను. వాఁడు మనుష్యమాంసమును వండి రాజుతో "రాజా! ఇది రుచియగు హవిస్సు మాంసముతో సిద్ధము చేసితిని" అనెను. ఆరాజు దానిని దనభార్యతోఁ గూడ వసిష్ఠునకు నివేదించెను. ఆయనభార్య మదయంతి రాక్షసుఁడు వండినదానిని వసిష్ఠునకు వడ్డించినది. మనుష్యమాంసము దనకుఁ బాత్రములో వడ్డించియుండుట దెలిసికొని మునిచాలఁ గోపించి రాజుతో

నిట్లనియె: "రాజా! నాకు మనుష్యమాంసమును బెట్టితివి గనుక నీకెప్పుడును నీమనుష్యమాంసమే యాహార మగుచుండుఁగాక!" యని శపింపఁగానే సౌదాసుఁడును గోపించి చేతితో జలము గ్రహించి వసిష్ఠుని శపింపఁబోఁగా నతనిభార్య మదయంతి వారించెను. "నాథా! వసిష్ఠభగవానులవారు మనకుఁ బ్రభువు. కావున దైవతుల్యుఁడగు పురోహితునిపై నలుక పూని మరల శపింపఁగూడదు." అని భార్య నివారింపఁగా, నతఁడు క్రోధమయమును తేజోబలసమన్వితమును నగు నాయుదకమును దన పాదములమీఁదను బోసికొనెను. అందువలన నారాజుపాదములు కల్మాషత్వమును బొందినవి. అదిమొద లామహాకీర్తియగు సౌదాసుఁడు కల్మాషపాదుఁ డని ప్రసిద్ధినొందెను. ఆరాజు భార్యతోఁగూడ మాటిమాటికిని నమస్కరించి బ్రాహ్మణరూపముతో రాక్షసుఁ డన్నమాటలను స్మరింపఁజేయఁగా, వసిష్ఠుఁడు ధ్యానదృష్టితోఁ గనుఁగొని యదియంతయు రాక్షసునికృతముగా భావించి రాజుతో నిట్లనియె: "రాజా! నేను కోపించి నీకు శాపమిచ్చితిని. అది త్రిప్పుట కెవ్వరికిని శక్యము గాదు. కాని నీకు వర మిచ్చెదను గైకొనుము. నే నిచ్చినశాపమునకుఁ బండ్రెండుసంవత్సరములే పరిమితి. అటుపై నది నిన్ను బాధింపదు. నాయనుగ్రహమువలన రాజా, గడచినదానిని స్మరింపవు." అని చెప్పఁగానే, యారాజు సంతోషించి యాశాపము ననుభవించి మరల నెప్పటియట్లు రాజ్యమును బొంది ప్రజలను బరిపాలించెను. ఇది యాకల్మాషపాదునియజ్ఞసదనము. నాయాశ్రమమునకు సమీపమునఁనే యున్నది. శత్రుఘ్నా! నీ వడిగితివి గనుకఁ జెప్పితిని." అట్లు శత్రుఘ్నుఁడు వాల్మీకిమహాముని చెప్పిన సౌదాసుని ఘోరమైనకథను విని యాయనకు నమస్కరించి పర్ణశాలలోఁ బ్రవేశించెను.

66-వ సర్గము

కుశలవుల జన్మము

శత్రుఘ్నుఁడు పర్ణశాలలోఁ బ్రవేశించిన సమయమునఁనే సీత యిద్దఱుకుమారులను ప్రసవించినది. తరువాత నర్ధరాత్రసమయమున మునికుమారులు సీత ప్రసవించినదని వాల్మీకిమహాముని తో శుభవర్తమానము నిట్లు చెప్పిరి: "భగవానులవారూ! రామునిభార్యయగు సీతాదేవి యిద్దఱుకుమారులను ప్రసవించినది. కావున మహాతేజా! భూతములను

నివారించు రక్ష చేయవలయును." అనిచెప్పిన బాలుకమాటలు విని వాల్మీకిమహాముని ప్రసూతిగృహముకొద్దకుఁ బోయి బాలచంద్రునితో సమానులై దేవపుత్రులవంటి తేజశ్శాలురను గుమారులను జూచెను. భూతప్రేతపిశాచాదులు చేరకుండ రక్ష చేసెను. అతఁడు కుశముష్టిని లవముసు బట్టుకొని వారికి భూతవినాశకరమగు రక్షను జేసెను. ముందు పుట్టిన బాలునకు మంత్రములచే సంస్కరింపఁబడిన కుశలతో మార్జన మొనరించుటచేఁ గుశుఁడనియే పేరు గలిగినది. రెండవబాలునకు లవ ముచే మార్జన మాచరించుటచే లవుఁడను పేరు గలిగినది. అట్లు కవలయి పుట్టిన వారికిద్దఱకును గుశలవులని పేరు కలిగినది. అపుడు వాల్మీకిమహా ముని "నాచే నుంచఁబడిన యీపేళ్లతోడనే వీరిద్దఱును ఖ్యాతిమంతు లగుదు" రనిచెప్పి తనచేతిలో నున్న రక్ష నచ్చటి స్త్రీలచేతి కీయఁగా వారు జాగ్రత్తగా వారికి రక్ష చేసిరి. అపుడు రక్షాకాలమున వృద్ధ లగుస్త్రీలు గోత్రము, తలిదండ్రులపేళ్లను నుచ్చరించిరి. ఆయర్ధరాత్రసమ యమున శత్రుఘ్నుఁడు శుభవార్త విని తరువాతఁ బర్ణశాలలోనికిఁబోయి "అమ్మా! దైవానుగ్రహ" మనెను. అట్లతఁడు సంతోషించుచుండఁగా నావర్షాకాలపురాత్రి యతివేగముగా నతిక్రమించిపోయినది. తెల్లవాఱిన తోడనే శత్రుఘ్నుఁడు పౌర్వాహ్ణికకృత్యములు నిర్వర్తించుకొని వాల్మీకి భగవానునియొద్ద సెలవుపొంది మరలఁబఱ్ఱిమాభిముఖుఁడై వెళ్లిపోయెను. అట్లతఁడేమరాత్రులు మార్గములో విశ్రమించి యమునాతీరమందలి పుణ్యకీర్తులగు మునులయాశ్రమములలో నివసించెను. ఆశత్రుఘ్నుఁడు భార్గవప్రముఖులగు ఋషులతోఁగూడ నభిరూపములగు కథలు వినుచు నివసించెను. నరేంద్రకుమారుఁడును మహోత్సుఁడును నగునాశత్రుఘ్నుఁడు రఘుప్రవీరుఁడు కాంచనాద్యులగు మునులతోఁగూడి యపుడు బహు ప్రకారములగు కథలచే నారాత్రిని విరమింపఁజేసెను.

67-వ సర్గము

లవణునిబలాదివర్ణనము

తరువాత రాత్రి ప్రవర్తించినతోడనే శత్రుఘ్నుఁడు భృగునందనుఁ డగు చ్యవనుని చూచి లవణునిబలమునుగూర్చి యడిగెను: "ఆర్యా! వానిశూల మెట్టిబలము గలది? ఆశూలముచేఁ బూర్వ మెవ్వరు వినాశ

మును బొందిరి?" అని యిట్లడిగిన శత్రుఘ్ను నిమాటలు విని చ్యవనుఁ డిట్లనియె: "శత్రుఘ్నా! ఆలవణుఁడు చేసిన కృత్యము లసంఖ్యములు. కాని వాఁడు మాంధాతవిషయమై చేసినది చెప్పెదను వినుము: పూర్వ మయోధ్యయందు యువనాశ్వనికుమారుఁడు మాంధాత బలవంతుఁడు ముల్లోకములయందును బేరుపడినవాఁడు గలఁడు. అతఁ డీభూలోకము నంతను దనయధీనముగాఁ జేసికొని దేవలోకమును జయించుటకుఁ బ్ర య త్నించెను. అతనిప్రయత్నమున కింద్రాదిదేవతలు భయపడిరి. ఆరాజు దేవేంద్రుని యర్ధాసనమును, అర్ధరాజ్యమును దేవతలసేవయు సంపా దింపఁ బ్రతిజ్ఞపట్టెను. ఇంద్రుఁ డతనిపాపసంకల్పమును దెలిసికొని మాంధాతతో సాంత్వపూర్వకముగా నిట్లనియె: "రాజా! నీవు మనుష్య లోకమునకు రాజవు. భూమిని స్వాధీనముగాఁ జేసికొనకుండ దేవరాజ్య మును గోరుచున్నావు. నీకు భూమియంతయు స్వాధీన మైయున్నయెడల సభృత్యబలవాహనుఁడ వై వచ్చి దేవరాజ్య మేలుకొనుము." ఇట్లు చెప్పుచున్న యింద్రునితో మాంధాత యిట్లనియె: "ఇంద్రా! నీ వట్లను చున్నావుగదా? భూమిలో నాశాసన మెచోట్లను జెల్లకుండ నున్నదో చెప్పుము" అన నింద్రుఁ డిట్లనియె: "రాజా! లవణుఁడు మధువనములో నున్నాఁడు. వాఁడు నీయాజ్ఞను లక్ష్యపెట్టుచున్నాఁడా?" అని యిట్లు విప్రియముగా నింద్రుఁడు చెప్పినమాట విని సిగ్గుపడి తలయెత్తి మాట లాడఁజాలకపోయెను. శిరస్సు వంచుకొనియే యింద్రుని యనుమతికొని మాంధాత మరల నీభూలోకమునకు వచ్చెను. అతఁడు మనస్సున నమర్షము నుంచుకొని సభృత్యబలవాహనుఁడై లవణుని స్వాధీనము చేసికొనుటకై మధువనమునకు వచ్చెను. అతఁడు లవణునితో యుద్ధము చేయఁగోరి తనదూతను వానియొద్దకుఁ బంపెను. ఆదూత లవణుని యొద్దకుఁ బోయి యెన్నో విప్రియవాక్యములు పలికెను. అట్లు పలుకు చున్నదూత నాలవణుఁడు భక్షించెను. ఎప్పటికిని దూత రాకుండుటచే మాంధాత కోపించి నలువైపులనుండియు బాణవర్షముగురిపించి లవణుని పీడించెను. తరువాత నాలవణుఁడు నవ్వి శూలముగైకొని సపరివార ముగా మాంధాతను జంపుట కాశూలమును ప్రయోగించెను. ఆశూల మందఱను భస్మముచేసి మరలి వానిచేతికిఁ బోయినది. ఈరీతిగా నట్టి మాంధాతృచక్రవర్తి నిశ్శేషముగా వానిశూలముచే మృతినొందెను.

కావున వానిశూలముయొక్కశక్తి యిట్టిదని వచింప వీలులేదు. అయినను నీవు రే పుదయము వాని నిస్సంశయముగాఁ జంపెదవు. వాఁడాయుధము చేతిలో లేకుండ సుండుసనుయమువూత్రము కనిపెట్టవలెను. అట్లైని జయము తప్పదు. నీవు వానిని జంపితివేని లోకములకు మేలు గలుగును. శత్రుఘ్నా, వానియొక్కయు వానిశూలముయొక్కయు బల మట్టిది. నీకంతయుఁ జెప్పితిని. ఆతీతిగా వాఁడు మాంధాతను జంపెను. మహాత్మా! శత్రుఘ్నా, నీవు రేపు ప్రభాతమునం దప్పక లవణునిఁ జంపి తీరెదవు. నాకావిషయమున సందియము లేదు. వాఁడు చేత శూలము లేకుండ మాంసమునిమిత్తమై యడవికి బయలుదేఁకినపుడు నీకుఁ దప్పక జయము గలుగును.

63-వ సర్గము

శత్రుఘ్నుఁడు లవణు నడ్డగించుట

శత్రుఘ్నునకు జయమును శుభమును గోరుచు మునులు కథలు చెప్పుచుండఁగా శీఘ్రముగా రాత్రి తెల్లవాఁకినది. తెల్లవాఁకినతోడనే లవణాసురుఁడు భక్ష్యాహారప్రచోదితుఁడై పట్టణమునుండి బయలు దేఁతెను. ఇంతలో వీరుఁడగు శత్రుఘ్నుఁడు యమున దాఁటి ధనుష్పాణి యై మధుపురద్వారమందు నిలిచెను. రెండుయామము లగునప్పటికిఁ గ్రూరకర్ముఁడగు లవణుఁడు వేఁకొలఁది జంతువులనుజంపి యాభారమును వహించి వచ్చెను. వాఁడు ద్వారమం దున్న శత్రుఘ్నునిఁ జూచెను. "నీ వీయాయుధము పట్టుకొనిరాకుంటివిగదా! యేమిచేయుదు?" వని యడిగెను. మఱియు "నరాధమా! నీవంటివారిని వేఁకొలఁది సాయుధులను భక్షిం చితిని. నీకుఁ గాలము గూడినది కాఁబోలును. పురుషాధమా! నేఁడు నాకు సంపూర్ణముగా నాహారము దొరికినది. ఓరీదుర్మతీ! నీయంతట నీవే వచ్చినానోటిలోఁ బ్రవేశించితివేలరా?" అనియిట్లు వణుకుచున్న వాఁడును మాటిమాటికిని నవ్వుచున్న వాఁడును నగు లవణునిఁజూచి వీర్యసంపన్నుఁ డగు శత్రుఘ్నుఁడు రోషమువలనఁ గన్ను లెఱ్ఱఁజేసెను. ఇట్లు రోషాభి భూతుఁడైన శత్రుఘ్నుని సర్వశరీరమునుండియుఁ దేజోమయము లయిన మరీచులు బయలుదేఁకినవి. మఱియు నతఁడు కోపించి యారాక్షసునితో నిట్లనియె: "ఓరీదుర్బుద్ధీ! లవణా! నీతోద్వంద్వయుద్ధము చేయవచ్చితినిరా.

నేను దశరథమహారాజునకుఁ గుమారుఁడను; శ్రీరామునకుఁ దమ్ముఁడను. నిత్యమును శత్రువులను జంపు శత్రుఘ్నుఁడను వేరుగలవాఁడను. నిన్నుఁ జంపుటకై వచ్చితిని. అటువంటి నాకు నీవు ద్వంద్వయుద్ధ మిమ్ము. సర్వ జీవులకును శత్రుఁడవగు నీవు నాయెదుటినుండి జీవముతోఁ బోఁజాలవు."

అని యిట్లు శత్రుఘ్నుఁడనుచుండఁగా రాక్షసుఁడు నవ్వుచు నిట్లనియె: "దుర్మతీ! దైవవశమున నాకంటఁబడితివి. నా పెద్దతల్లియన్న రాక్షసరాజు రావణుఁడు మాయన్నచే స్త్రీనిమిత్తమై చంపఁబడెను. రావణునికులక్షయ మంతయు విని క్షమించితిని. మీ రేమాత్రపువా రని లక్ష్యముచేయ నైతిని. నేను గొప్పగొప్పవారినిఁ జంపితిని. నాకందఱును తృణసమానులు. వెనుకటివారు, మీబోఁటి యిప్పటివారు, ముందు పుట్టఁబోవువారు ప్రతి వారును నాకు లొంగిపోవువారే కాని న న్నెదిరింపఁజాలరు. దుర్మతీ! నాతో యుద్ధముచేయవచ్చితివేమి? అటులేని రమ్ము; నీబుఱుపు తీర్చెదను. నే నాయుధము పట్టుకొని యిపుడే వచ్చెదను; క్షణమునే పాఁగుము. నీ కోరిక తీరును. నిన్ను జయించుట కాయుధము సిద్ధముచేసికొని వచ్చెదను" అను లవణునిమాటలు విని శత్రుఘ్నుఁడిట్లనియె: "ఓరి రాక్షసాధమా! నాయెదుటినుండి బ్రతికిపోఁజాలుదువఁటరా? ప్రాజ్ఞుఁడగువాఁడు శత్రువగపడినపుడు విడుచునా? ఎవఁడు భయస్వభావముగల బుద్ధిచేత శత్రువునకు సమయమిచ్చునో, అట్టిమందబుద్ధి కాపురుషుఁడు హతుఁడగును. కావున జీవలోకమునంతయు లెస్సగా నొక్కసారి చూడుము. నావాఁడిబాణములచేతను నిన్నిపుడు యమునిగృహమునకుఁ బంపెదను. పాపాత్ముఁడా! నీవు మూఁడులోకములవారిని బాధించు చుందువేమి? రాఘవుల కంటఁబడిన శత్రువు మఱలిపోఁగలఁడా?"

69-వ సర్గము

శత్రుఘ్నుఁడు లవణునిఁ జంపుట

ఇట్లు చెప్పిన శత్రుఘ్ను నిమాటలు విని లవణుఁడు తీవ్రముగఁ గోపించి యుండుండుమనెను. చేతులు పిసికికొనెను; పండ్లు పటపట లాడించెను. శత్రుఘ్ను ని మాటిమాటికిని బిలువ మొదలిడెను. ఇట్లు పిలుచుచున్న ఘోరదర్శనుఁడగు లవణుని జూచి దేవశత్రుఘ్నుండగు శత్రుఘ్నుఁడిట్లనియె: "ఓరీరాక్షసా! నీ విదివఱకుఁ జంపినవారివంటివాఁ డీశత్రుఘ్నుఁ

డెంతమాత్రమును గాఁడు. కావున నీ విపుడు నాబాణములచేఁ జచ్చి
యముని యింటికిఁ బొమ్ము. పాపాత్ముఁడవగు నిన్నుఁ జచ్చియుండఁగా
నిచ్చటి మునులందఱును జూచెదరుగాక! నీమామయగు రావణునిఁ జంపి
నప్పు డందఱును జూచి సంతసింపలేదా? పాపాత్ముఁడవగు నీవు నాచేఁ
జచ్చినప్పుడే పురములయందును బల్లెలయందును క్షేమము కలుగఁగలదు.
ఇపుడు నాబాహువునుండి బయలుదేఱిన వజ్రమువంటిబాణము, సూర్య
కిరణము పద్మములోఁ బ్రవేశించినటుల నీహృదయములోఁ బ్రవేశించును
గాక!" అని యిట్లు శత్రుఘ్నుఁడనఁగానే లవణుఁడు కోపించి యొకమహా
వృక్షమును శత్రుఘ్నునిపై వైచెను. అతఁడు దానిని చూర్ణము చేసెను.
అది విఫలమగుట చూచి వాఁడెన్నో యో వృక్షములను శత్రుఘ్నునిపైని
వైచెను. వచ్చిన వృక్షముల నన్నింటిని శత్రుఘ్నుఁ డొక్కొక్కటి రెం
డేసి మూఁడేసి బాణములతో మధ్యనే పొడి చేసెను. తరువాత రాక్ష
సునిపై బాణవర్షము గురిసెను. అట్లు కురియుచున్న వీర్యసంపన్నుఁడగు
శత్రుఘ్నునిబాణములకు లవణుఁడు కంపించుటయే లేదు. తరువాత లవ
ణుఁడు నవ్వి యొకవృక్షమును బెల్లగించి శూరుఁడగు శత్రుఘ్నుని శర
స్సునపైఁ బడవేయఁగా నతఁడు శిథిలాంగుఁడై మూర్ఛవోయెను. వీరుఁ
డగు నతఁడు మూర్ఛపోవఁగానే ఋషులు దేవతలు గంధర్వులు మొద
లగువారందఱును హాహాకారము చేసిరి. ఇట్లు శత్రుఘ్నుఁడు చచ్చిపడి
యుండె నని యోజించి లక్ష్యముచేయక వాఁడు సమయము దొరకినను
బట్టణములోని కాయుధమునకై పోలేదు. అతఁడు పడిపోయినట్లు నిశ్చ
యించుకొని శూలము తేలేదు. శత్రుఘ్నుఁడింక బ్రదుకఁడని నిశ్చయించు
కొని తాఁదెచ్చిన మృగములభారము నెక్కెను. ముహూర్తమాత్రములో
శత్రుఘ్నుఁడు లేచి యాయుధము చేతఁబట్టుకొని పురద్వారముచెంత
నిలువఁబడెను. ఋషు లాతనిఁ బూజించిరి. తరువాత శత్రుఘ్నుఁడు
దివ్యము, అమోఘము, జ్వలించునది, ఘోరము, తేజస్సుచే దశదిశలను
బూరించునది, వజ్రాననము, వజ్రవేగము, మేరుమందరములతో సరియై
నది, పర్వములయందు వంగియున్నది, ఏయుక్తములలోను బరాజయము
లేనిది, చంపనాదులచేఁ బూయఁబడినది, చారుపత్రము, దానవేంద్రులను
పర్వతములను భేదించునది, రాక్షసుల నివారించునది యగు రాముఁడిచ్చిన
యుత్తమశరమును వానిపైఁ బ్రయోగించెను.

ప్రళయాంతమునందలి కాలాగ్నివలె వెలుఁగునది యగు నాశర మును జూచి సర్వభూతములును భయపడినవి. దేవతలు, రాక్షసులు, గంధర్వులు, మునులు, అచ్చరలు మొదలగువారితోఁ గూడిన సర్వజగ మును స్వస్థత దప్పినది. అపుడు వా రందఱును బ్రహ్మయొద్దకుఁ బోయి యిట్లనిరి: "దేవా! ఇపుడు లోకముగాని యుగముగాని క్షయము గాఁగున్నదియా యేమి? ఇటువంటిసమయ మిదివఱకుఁ గనియు వినియు నెఱుఁగము. మాయందఱకును లోకక్షయ మగునేమో యని భయమగు చున్న"దనువారిమాటలు విని లోకపితామహుఁడగు బ్రహ్మలోకమున కభయంకరుఁడగుచు "భయకారణములను జెప్పెదను" వినుఁడని దేవా దులతో మధురముగా నిట్లనియె: "లవణాసురుని వధించునిమిత్తమై శత్రు ఘ్నుఁడు బాణమును సంధించెను. దానితేజస్సుచే సర్వలోకములును సమ్మోహమును బొందినవి. అది విష్ణుని సనాతనమైన తేజోమయమైన బాణము. దానిచే మీకిట్లు భయము గలిగినది. దానిని బూర్వము మధు కైటభులవధకై విష్ణుదేవుఁడు నిర్మించెను. దాని నాయన యొక్కఁడే యెఱుఁగును. ఇది మహోత్సుఁడగు విష్ణుని పూర్వశరీరము. మీ రిచ్చట నుండిపోయి శత్రుఘ్నునిచేఁ జంపఁబడు లవణుని జూడుఁడు. అతఁడు శ్రీరామునితమ్ముఁడగు శత్రుఘ్నుఁడు; లవణునిఁ జంపుటకై యతఁ డాశర మును బ్రయోగించుచున్నాఁడు" అని బ్రహ్మ చెప్పినతోడనే దేవాదు లందఱును శత్రుఘ్న లవణులయుద్ధమును జూచుటకై వచ్చిరి. శత్రుఘ్నుని హస్తముచేఁ బట్టఁబడినదియు దివ్యసంకాశమును, యుగాంతాగ్నివలె నున్న దియు నగు నాబాణము నందఱును జూచిరి. దేవతలచే నాకాశమంతయు నిండియుండుట చూచి శత్రుఘ్నుఁడు సింహనాదము చేసి మరల లవణా సురునిఁ జూచెను. మహోత్సుఁడగు శత్రుఘ్నుఁడు మరల నాలవణుని బిలి చెను. లవణుఁడు కోపముతోఁ గూడి యుద్ధమునకు వచ్చెను. ధనుర్ధర శ్రేష్ఠుఁడగు శత్రుఘ్నుఁడా బాణము నాకర్ణాంత మాకర్షించి లవణుని వక్షస్థలమునకు గుఱిచేసి ప్రయోగించెను. ఆబాణము వానివక్షస్థలమును భేదించి పాతాళమునకుఁబోయి విబుధపూజితమై మరల వెంటనే శత్రు ఘ్నునియొద్దకు వచ్చినది. ఇట్లు శత్రుఘ్ననిబాణముచే విదారితుఁడై యాలవణుఁడు వజ్రముచేఁ గొట్టఁబడిన కొండవలె నేలఁగూలెను. లవ ణుఁడు హతుఁడు కాఁగానే గొప్పదియగు వానిశూలము సకలదేవతలును.

చూచుచుండఁగా శివునియొద్దకుఁబోయినది. రఘుప్రవీరుఁడగుశత్రుఘ్నుఁ డిట్లొక్క బాణముచే మూఁడులోకముల భయమును బాపి చీఁకటిని బో నడఁచిన సూర్యునిలెఁ బ్రకాశించుచుండెను. తరువాత దేవతలు, ఋషులు, పన్నగులు, అప్సరసలు మొదలగు నెల్లరును శత్రుఘ్నునిఁ బూజించిరి. శత్రుఘ్ననకు దైవవశమున జయము చేకూరినది. అందఱి కును భయము పోయినది. అంతటను శాంతమును వహించిరి.

70-వ సర్గము

శత్రుఘ్నుఁడు మథురాపురమును వశపఱుచుకొనుట

లవణుఁడు హతుఁడు కాఁగానే యగ్నిపురస్సరు లగు దేవతలు శత్రుతాపనుఁడగు శత్రుఘ్ననిఁజూచి సుమధురముగా నిట్లనిరి:"వత్సా! దైవవశమున నీకు జయము గలిగినది. దైవవశమున లవణుఁడు హతుఁ డాయెను. పురుషశార్దూలా! సువ్రతా! వరము గోరుము. మహా బాహూ! నీకు వర మిచ్చుటకై సర్వదేవతలును వచ్చిరి. మే మందఱి మును నీకు జయము గోరుచుంటిమి. మాదరిసెన మమోఘమైనది." అని యిట్లు దేవతలు పలికిన పలుకులు విని శత్రుఘ్నుఁడు చేతులు జోడించు కొని వారితో నిట్లనియె: "దివ్యమైన యీమధుపురి మధుర; దేవినిర్మి తము. ఇది నాసేనానివేశమును బొందునట్లు వరమీయఁగోరితిని. ఇదియే నాకుఁ గావలసినవరము." ఇట్లని కోరిన శత్రుఘ్ననిపలుకులు విని దేవ తలు సంతోషించి మంచిదే యనిరి. ఈరమ్యమైనమధుర శూరులగు సేన గలది యగును సందియము లేదు. అని చెప్పి దేవత లంతరిక్షమునకుఁ బో యిరి. మహాతేజుఁడగు శత్రుఘ్నుఁడు తన సేనను రావించెను. ఆసేన శత్రు ఘ్ననిశాసనమునువిని శీఘ్రముగ వచ్చెను. శత్రుఘ్నుఁడు శ్రావణమున సేనానివేశనము నారంభించెను. దివ్యసంకాశ యగునది ముందుగా ద్వాద శవఱుగు సంవత్సరమున శూరసేనలకు నివేశమైనది. దేశము నిర్భయ మైనది. క్షేత్రములు సస్యయుక్తములైనవి. ఇంద్రుఁడు కాలముదప్పక వర్షించుచుండెను. అరోగవీరపూరుషము, శత్రుఘ్నభుజపాలితము, అర్ధ చంద్రప్రతీకాశము, యమునాతీరశోభితము, మంచిమంచి గృహాముల చేతను చత్వరాపణ వీథులచేతను ప్రకాశితము, చాతుర్వర్ణ్య సమా యుక్తము, నానావాణిజ్యశోభితము నై యొప్పారుచు నామథురాపట్ట

ణము కన్నులపండువైయున్నది. పూర్వము లవణాసురుండుండు నామథురలో నిపుడు శత్రుఘ్నుండుండెను. నానావర్ణోపశోభితము, ఆరామముల చేతను విహారములచేతను నెల్లయెడల శోభాయమానము, శోభనీయములగు దేవాగారములచేతను మనుష్యులచేతను శోభితమును, దివ్యసంకాశమును, నానాపణ్యోపశోభితమును, నానాదిక్కులనుండి వచ్చిన వణిజులచే నుపశోభితమును, సర్వసమృద్ధమును నగు నాపట్టణమును సమృద్ధార్థుండును, భరతానుజుండును నగు శత్రుఘ్నుండు చూచి పరమప్రీతుండై మిగుల సంతసించెను. అచ్చట దనసేనను నిలిపి పండ్రెండవసంవత్సరములో శ్రీరామపాదములను జూచెదనుగాక యని శత్రుఘ్ననకు బుద్ధి పుట్టినది. తరువాత శత్రుఘ్నుడు వివిధజనాభిసంవృతమై యమరావతివలె నొప్పారుచున్న యాపట్టణములోఁ దనసేనను నివసింపఁజేసి శ్రీరాముని సందర్శించుట కభిలాష గలవాఁడాయెను.

71-వ సర్గము

శత్రుఘ్నుఁడు కుశలవులగానము వినుట

ఇట్లు పండ్రెండవయేఁట శత్రుఘ్నుఁడు స్వల్పమగు సైన్యమును వెంటఁబెట్టుకొని శ్రీరామపాలిత మగు నయోధ్యకుఁ బోవ నుద్యుక్తుఁడాయెను. అపుడు మంత్రులు మొదలగువారిని, బలములో ముఖ్యులగువారిని మరలించి కొన్నిమంచిగుఱ్ఱములను సూఁబురథములను దీసికొని శత్రుఘ్నుఁడు బయలుదేఱెను. అతఁడు నిర్ణీతములైన యేడెనిమిది వాసస్థానములను దాఁటి వాల్మీకిమహాముని యాశ్రమములో నివాస మేర్పఱుచుకొనెను. పురుషర్షభుఁడగు శత్రుఘ్నుఁడు వాల్మీకిమహాముని పాదములకు నమస్కరించి యాతనివలన నర్ఘ్యపాద్యాదులను గ్రహించెను. మహాత్ముఁడగు శత్రుఘ్నున కావాల్మీకిమహాముని వేలకొలఁది మనోహరములైన కథలు చెప్పెను. మఱియు నాయన లవణునిసంబంధ మగు వాక్యము నిట్లు పలికెను: "నాయనా! నీవు లవణుని జంపి చాలమంచిపని చేసితివి. మహాబాహూ! ఆలవణుఁడిదివఱకెంతటనో మహామహులను యుద్ధములలోఁ జంపియున్నాఁడు. అట్టి పరమపాపాత్ముని నీవు విలాసముగాఁ జంపితివి. నీధర్మమున లోకములకు భయముపోయినది. రావణ

వధము మహాప్రయత్నముమీఁదఁ జరిగినదిగాని నీ వీలవణాసురుని నిష్ప్రయత్నముగాఁ జంపితివి. ఇది చాల గొప్పకార్యము. లవణుని జంపుటచే దేవతలకుఁ జాల సంతోషము గలిగినది. భూతములకును లోకములకును జాల సంతోషమును గలిగించితివి. నీవు లవణునితో యుద్ధము చేయుచుండఁగా నేను దేవేంద్రునిసభలో నుండి యంతయుఁ జూచితిని. శత్రుఘ్నా! అపుడు నా కెంతయు సంతోషము గలిగినది. నాయనా! ఒక్కమా టేటురమ్ము. నీశిరస్సు మూర్కొనియెదను. ప్రేమ కిది పరమావధి." అని యాయన శత్రుఘ్ననిశిరస్సు మూరుకొని యతనికిని, సైన్యములకును దగురీతి నాతిథ్య మొసఁగెను. అతఁడు ప్రీతిపూర్వకముగా భుజించి యాకాలమందు యథాక్రమముగా ను త్తమరీతిని గానముచేయఁబడిన రామచరితమును వినెను. ఆగీతము తంత్రీలయసమాయుక్తము, స్థిస్థానకరణాన్వితము, సంస్కృతము, లక్షణయుక్తము, సమతాళసమన్వితము, పూర్వము, వాల్మీకిచే జేయఁబడినదియు నైయుండెను. ఆయుత్తరములు సత్యములు, యథార్థముగా జరిగినవియు నై యానుపూర్వికగానున్నవి. పురుషశార్దూలుఁడగు శత్రుఘ్నుఁడదివిని విసంజ్ఞుఁడు బాష్పపూరితలోచనుఁడు నాయెను. అతఁడు ముహూర్తకాలము విసంజ్ఞుఁడై నిట్టూర్చి యాగీతము ప్రస్తుతము జరుగుచున్నట్లుగా భావించెను. ఆతని వెంటవచ్చినవారునుగీతమునువిని తలలువంచుకొని దీనులయి "యాశ్చర్యమాశ్చర్య"మనిరి. సైనికులందఱును "ఇది యేమి? మన మెచ్చటనున్నారము? ఇది స్వప్నమా? మనము పూర్వము చూచినదియు, వినినదియు, నెఱిఁగినదియు నగు సందర్భమునంతను మరల నీయాశ్రమమున వినుచున్నారము. ఇది గీతబంధము నాశ్రయించిన స్వప్నము కాదుగద!"అని యొకరితో నొకరనుకొనిరి. వా రట్లు విస్మయమును బొంది శత్రుఘ్ననితో నిట్లనిరి: "నరశ్రేష్ఠా! ఈసంగతియంతయు బాగుగా వాల్మీకిమహాముని నడుగుఁడు"అని చెప్పఁగా శత్రుఘ్నుఁడు కౌతూహలసమన్వితుఁడై తనసైనికులను జూచి "మనము వాల్మీకిమహాముని నడుగఁజాలము. ఈమహామునియాశ్రమం దిటువంటి యాశ్చర్యములు పెక్కుగలవు. మనము కౌతూహలపడి యాయన నడుగఁదగునా?" అనెను. అని యిట్లు సైనికులతోఁజెప్పి శత్రుఘ్నుఁడు వాల్మీకిమహర్షికి నమస్కరించి తన నివేశమునకు నపుడే పోయెను.

72-వ సర్గము

శత్రుఘ్నుఁడు రామునిఁజూచి మధురకుఁబోవుట

అట్లు పోయి నిదురకుఁ బండిన శత్రుఘ్నునకు నిద్ర రాదాయెను. అతఁడనేకార్థములుగల రామగీతమును మాటిమాటికిఁ జింతింపఁజొడఁగెను. సుమధురము, తంత్రీలయసమన్వితము నగు నాగీతశబ్దమును వినుచునే రాత్రి వేగించెను. ఆరాత్రి తెల్లవాఱినతోడనే క్రమముగా నిత్యకృత్యములు నెఱవేర్చుకొని శత్రుఘ్నుఁడు చేతులు జోడించుకొని వాల్మీకిమహాముని తో నిట్లనియె: "భగవానులవారూ! రఘువంశవర్ధనుండగు శ్రీరామునిఁ జూడఁ గోరికయగుచున్నది. తమయొద్ద నెలవుగైకొని సంశితవ్రతులగు వీరితోఁగూడి పోఁదలఁచితిని." అని యిట్లు చెప్పిన శత్రుఘ్నుని శత్రుతాపసుని వాల్మీకి కాఁగిలించుకొని వెళ్లుట కనుమతి యొసఁగెను. అతఁడాయనకు నమస్కరించి సుప్రభమగు రథమెక్కి రాముని చూడఁదలఁచినవాఁడై తొంబరగా నయోధ్యకుఁ బోయెను. ఇక్ష్వాకునందనుఁడగు నతఁడు క్రమముగాఁ బట్టణములోఁ బ్రవేశించి శ్రీరాముఁడున్న చోటికిఁ బోయెను. అతఁడు మంత్రిమధ్యస్థుఁడై తేజస్సుతో వెలుఁగొందుచు దేవేంద్రునివలె నున్న రామునిఁజూచి నమస్కరించెను. మఱియు నతఁడు తేజస్సుచే రెండవయగ్నివలె వెలుఁగుచున్న సత్యపరాక్రముఁడగు రామునితోఁ జేతులు జోడించుకొని యిట్లనియె: "మహారాజా! నీ యాజ్ఞాప్రకారముగా నంతయు నెఱవేర్చితిని. పాపాత్ముఁడగు లవణునిఁ జంపితిని. ఆపట్టణములోఁ నేనసుంచితిని. నిన్ను విడిచి యిప్పటికిఁ బండ్రెండు సంవత్సరములు గడచినవి. నిన్ను విడిచియుండుట కిష్టపడకపోతిని. కాకుత్స్థా! నాయం దనుగ్రహము నుంచుము. తల్లి నెడఁబాసిన బిడ్డనివలె నిన్ను విడిచి చిరకాలము ప్రవాసముచేయుట చాలఁగష్టమైనది" అని యిట్లు పలుకుచున్న శత్రుఘ్నుని కౌఁగిలించుకొని రాముఁ డిట్లనియె: "శూరా! నీవిప్పుడు విషాదమును బొంబకుము. ఇది క్షత్రియులకుఁ దగినది కాదు. నాయనా! రాజులు ప్రవాసమునకుఁ జింతించువారు గారు. ఎట్లయినను రాజు ధర్మము నవలంబించి ప్రజలను బరిపాలించుచుండవలయును. అపుడపుడు నన్నుఁజూచుట కయోధ్యకు వచ్చుచుఁ బోవుచునుండుము. నీవు నాకుఁ ప్రాణములకంటెను బ్రియమైనవాఁడవు. అయినను

దప్పక రాజ్యమును బాలింపవలయునుగదా! కావున నాయనా శత్రుఘ్నా! ఒక్కవారమునినములుమాత్ర మేయిచ్చటనుండి తరువాత నీసైన్యముతో మథుర మరలఁజేయుము." ఇట్లనిచెప్పిన రామునిమాటలు విని శత్రుఘ్నుఁడు గద్గదస్వరముతో మంచిదే యని యంగీకరించెను. అట్లు రామాజ్ఞాప్రకార మయోధ్యలో నేడునినములుమాత్ర మే నివసించి యతఁడు మరల మథురకు బయలుదేఱెను. వెళ్లునపుడు సత్యపరాక్రముఁడగు రామునకు, భరతునకు, లక్ష్మణునకు నమస్కరించి వారియొద్ద సెలవంది మహారథ మారోహించెను. భరతుఁడు లక్ష్మణుఁడు చాలదూరమువఱకును శత్రుఘ్నుని వెంటనంపిరి. అతనిని మథురకుఁబంపి వా రయోధ్యకు వచ్చిచేరిరి.

73-వ సర్గము

బ్రాహ్మణుఁడు మృతబాలునిఁ దెచ్చి యేడ్చుట

శ్రీరామచంద్రుఁడటుశత్రుఘ్నుని మథురాపురికిఁబంపి తమ్ములతోఁ గూడి సుఖవంతుఁడై సంతోషించుచు ధర్మముతో రాజ్యమును బాలించు చుండెను. ఇట్లు కొన్నాళ్లు గడచినతరువాత వృద్ధగు పల్లెటూరిబ్రాహ్మణుఁ డొకఁడు చచ్చినబాలునిఁదీసికొని రాజద్వారముచెంతకువచ్చెను. అతఁడు స్నేహదుఃఖసమన్వితుఁడై బహువిధములుగా నేడ్చుచు మాటిమాటికిని బుత్రునిగుఱించి యిట్లనెను: "నేను పూర్వజన్మములయం దెట్టిపాపమును జేసితినోకదా! అట్లుకానిచో నేకపుత్రుఁడవగు నిన్నును జచ్చియుండఁగాఁ జూచుచుందునా? నాయనా! నీవు యౌవనము ప్రాపించని పంచాబ్దంబుల వాఁడవు. అకాలమృత్యువునోటఁబడితివి. ఇది నాకెంతయు దుఃఖమును గలిగించుచున్నది. ఇఁక నేనును గొలఁదిదినములలో మృతినొందనుంటిని. నేనేకాక నీతల్లియు నీదుఃఖమున మృతినొందును. నే నీజన్మమున ననృత మాడినట్లు స్మరింపను. భూతహింస చేసి మొదలే యెఱుఁగను. మఱి యెవ్వరివిషయమునను నెట్టిపాపమును జేయ లేదు. ఏపాపముచేత నా కుమారుఁ డగు నీబాలుఁడు పిత్రకార్యములు చేయకుండ యముని యింటికిఁ బోయెనోకదా! ఇట్టిఘోరము నేనెన్నఁడును గనివిని యెఱుఁగను. రామునిదేశములోఁ గాలముగూడనివారికి మృతి గలుగుట చాల నాశ్చర్యమును గలిగించుచున్నది. ఇది నాచేసినపాపముగాచు. రాముఁడు చేసిన దుష్కృత్యమే యని తలంచెదను. కానిచోఁ దనరాజ్యమంచలి

బాలుర కకాలమృత్యువు సంభవించునా? ఇతరదేశములయందుండు బాలురకు మృత్యువువలన భయములేదే! రాజా! మృత్యువశంవదుండైన నా బాలుని బ్రదికించుము. లేనిచో నే నీరాజద్వారమున భార్యతోఁగూడ ననాథునివలెఁ జచ్చెదను. బ్రహ్మహత్య ననుభవించుచు నీవు సుఖముగా నుండుము. నీవు నీతస్ములును జిరకాలజీవులై యుండుఁడు. సుమహాబలా! ఇదివఱకు నీరాజ్యమున సుఖముగా నుంటిమి. ఇప్పు డిట్టిఘోరము తటస్థించినది. రామా! నీయధీన మైతిమి. కాలవశమును బొందియున్న మాకు స్వల్పముగానైనను సుఖములేదు. ఇన్నాళ్లు కిక్ష్వాకువంశపురాజుల దేశము దిక్కులేనిదయిపోయినది. రాముఁడు రాజగుటచే బాలురకు మృతి గలిగినది. ఇది నిజమైనసంగతి. రాజువలన దోషముగలిగిననే ప్రజలకు విధిశమున నిట్టియుపద్రవములు గలుగుచుండును. రాజు దుర్మార్గుడైననేప్రజలకకాలమరణము సంభవించును. లేదేని పట్టణములయందుఁగాని, పల్లెలయందుఁగాని జనులు తగనిపనులు చేయునపుడు రాజు వానిని గనిపట్టి చక్కఁజేయుచుండవలయును. అట్లుచేయనిచో నిట్టి యకాలమరణములు ప్రాప్తించును. ఏమైనను రాజదోషమువలననే యిట్టివి జరుగుచుండుట నిశ్చయము." అని యిట్లనేకవిధములుగా మాటిమాటికిని రాముని నింది చుచు నామునలి బ్రాహ్మణుఁడు కొడుకును గౌఁగిలించుకొని యేడుచు చుండెను.

74-వ సర్గము

నారదుఁడు బాలునిమృతికిఁ గారణము చెప్పుట

ఇట్లు జాలి కలుగునట్లు మాటిమాటికిని దుఃఖసంతప్తుఁడై యేడుచు చున్న యా బ్రాహ్మణుని యేడుపునంతయు రాముఁడు వినెను. అట్లు విని రాముఁడు తానును దుఃఖించి సంతప్తుఁడై మంత్రులను, వసిష్ఠవామదేవులను, భరతుని, లక్ష్మణుని, నీతిశాస్త్రవేత్తలను బిలిపించెను. అట్లు వసిష్ఠునితో నెనమండుగురు బ్రాహ్మణులు వచ్చి దేవసమానుఁడగు శ్రీరాము నాశీర్వదించిరి. మార్కండేయుఁడు, మౌద్గల్యుఁడు, వామదేవుఁడు, కాశ్యపుఁడు, కాత్యాయనుఁడు, జాబాలి, గౌతముఁడు, నారదుఁడు మొదలగువారందఱును యథోచితముగ నాసనముల నలంకరించిరి. రాముఁడిట్లు కూర్చుండిన మునులకందఱికిను నమస్కరించి మంత్రులను, నీతిజ్ఞు

లను సన్మానించెను. యథార్హముగా నందఱును గూర్చున్నపిదప రాముఁ డావృద్ధబ్రాహ్మణుని దుఃఖమంతయు విన్నవించెను.ఇట్లు దీనుఁడయి పలుకు చున్న శ్రీరామునిమాటలువిని సర్వఋషులును విసుచుండఁగా నారదుఁ డిట్లనియె: "రాజా! అకాలమందు బాలునకుమృతిగలిగినది. రఘునందనా! ఇపుడు కర్తవ్య మాలోచింపవలసియున్నది. పూర్వము కృతయుగమున బ్రాహ్మణులే తపస్సుచేసికొనుచుండెడివారు. బ్రాహ్మణుఁడు కానివాఁ డెవ్వఁడును దపమాచరించి యెఱుఁగఁడు. బ్రహ్మభూతమై యనావృతమై యాయుగము ప్రజ్వలితమైయుండఁగా నందఱును మృత్యువులేకుండ దీర్ఘజీవులై యుండెడివారు. తరువాతను త్రేతాయుగమువచ్చినది. అపుడు మానవులలో రాజులు తొల్లింటి తపస్సుకారణముగ వపుష్మంతులై పుట్టి చుండెడివారు. వారు వీర్యముచేతను, దపస్సుచేతను నధికులైరి. ఈ రెండు యుగములలోను బ్రాహ్మణక్షత్రియులు సమవీర్యసమన్వితులై యుండెడి వారు. వారికి విశేషమేమియు లేకుండనుండెను. వారు చాతుర్వర్ణ్యమును సమ్మతముగా స్థాపించిరి. అధర్మావరణరహితమై, ధర్మస్వరూపమై, యా యుగము ప్రజ్వలితమైయుండఁగా నధర్మ మొక్కపాదమును బుడమిపై నిడినది. అధర్మముతోఁగూడి దేజము మందమగును. అధర్మపులై ప్రజలు తేజోవిహీనులైరి. పూర్వుల కేది యామిషప్రాయమో మిక్కిలి మలభూత మగు రాజసమేదియో యది యన్నత మనుపేర నెలకొనినది. అది యొక పాదముగా భూమియందు వ్యాపించెను. ఆకారణమున ధర్మముయొక్క పాద మొకటి నశించినది. అన్నతమును బడఁగొట్టి యాయువును వృద్ధి చేయవలయును. అధర్మము, అన్నతము పోఁగా జనులు సత్యధర్మపరా యణులై శుభకార్యములనే చేయుచుందురు. త్రేతాయుగమున బ్రాహ్మ ణులు, క్షత్రియులు తపస్సు చేయుచుండఁగా నితరులు శుశ్రూష సేయు చుందురు. పరమమగు వారిధర్మము వైశ్యశూద్రులను సంక్రమించును. సర్వవర్ణములకును శూద్రులు విశేషముగాఁ బూజ సేయుచుందురు. ఇంతలోఁ నధర్మము, అన్నతము వారికిఁ బ్రాప్తింపఁగాఁ బూర్వులు నాశ మును బొందిరి. తరువాత రెండుపాదము లధర్మము వ్యాపించినతోడనే దానికి ద్వాపరయుగ మనిపేరు గలుగును. ఆద్వాపరయుగము ప్రవర్తిం పఁగా నన్నతాధర్మములు క్రమముగా వృద్ధినిగాంచును. ద్వాపర మను యుగమునందుఁ దపము వైశ్యులను బొందును. మూఁడుయుగములయం

దును గ్రమముగాఁ దపస్సు మూఁడువర్ణములవారిని బొందుచునుండును. మూఁడుయుగములయందును మూఁడువర్ణములను ధర్మము పొందుచుండును. యుగమునుబట్టి శూద్రున కిపుడు ధర్మాధికారము లేదు. నృపశ్రేష్ఠా! హీననరుఁడు గొప్పతపస్సు చేయుచున్నాఁడు. శూద్రులు తపస్సు చేయుచుండుట కలియుగమునందు సంభవించును. ద్వాపరమందు శూద్రున కధర్మము మిగులనుండును. శూద్రుఁడు నీరాజ్యప్రాంతమునందు దుర్బుద్ధియై తప మాచరించుచున్నాఁడు. కావుననే యిపు డీబాలుఁడు మృతినొందెను. ఏరాజుయొక్క దేశమం దధర్మకార్యములు జరుగునో ఆ రాజు తప్పక నరకమునకుఁ బోవును. అధ్యయనము, తపము, సుకృతము మొదలగువానిలో నాఱవపాలు ధర్మముగా రాజ్యమేలు రాజునకు లభించును. అట్లు బాగుగా రక్షింపనిచో రాజు ప్రజలపాపమునందలి నాలవ భాగమును బొందును. కనుక రాజు తనరాజ్యము ధర్మముగాఁ బాలింపవలెను.పురుషశార్దూలా! నీ దేశమంతయు వెదకుము.దుష్కృతమెచ్చటఁ గనవచ్చిన దానిని రూపుమాపుము. అట్లు జరిగినచో ధర్మవృద్ధియు నరులకు దీర్ఘాయువును గలుగును. రాజా! ఈబాలుఁడును వెంటనే జీవించును.

75-వ సర్గము

రాముఁడు శంబూకునిఁ జూచుట

శ్రీరాముఁ డట్లు నారదమహాముని చెప్పిన యమృతమయ మైన యామాటలు విని నిరుపమానమైన సంతోషమునుఁబొంది లక్ష్మణునిజూచి యిట్లనియె : "తమ్ముఁడా! నీవు వెళ్లి సుప్రతుఁడగు నా బ్రాహ్మణు నోదార్పుము. ఆమృతబాలునిశరీరమును తైలద్రోణికయం దుంపింపుము. పరమోదారములైన గంధములు, తైలములు మొదలగునవి నించి యాబాలునిశరీరము పాడువడకుండ నుంపించుము. శిష్టకర్తఁ డగు నా బ్రాహ్మణునికుమారుఁడు రక్షింపఁబడినవాఁడై విపత్తినిగాని, భేదమునుగాని పొందకుండఁ జేయింపుము." రాముఁ డిట్లు శుభలక్షణుఁ డగు లక్ష్మణున కాజ్ఞాపించి వెంటనే రమ్మని పుష్పకమును స్మరించెను. హేమభూషితమగు నాపుష్పకము రాముని మనోభావమును దెలిసికొని మహార్తమాత్రములో రామునిసన్నిధికి వచ్చెను. అటువచ్చి "నరాధిపా! ఇదిగో వచ్చితి

నేమి సెల"వని నమ్రముగఁ నమస్కరించినది. నీ కింకరుఁడను వశ్యుఁడను సన్నిధికి వచ్చితి ననెను. నరాధిపుఁ డాపుష్పకమునొక్క మధురమయిన పలుకు విని యచ్చటిమునులకు నమస్కరించి పుష్పక మారోహించెను. ధనుర్బాణములను గత్తిని చేతఁబట్టుకొనెను. లక్ష్మణభరతులకుఁ బట్టణ మప్పగించెను. అచ్చటచ్చట వెదకుచుఁ బశ్చిమదిశకు బయలుదేఱెను. మహా హిమవంతునిచే నావరింపఁబడిన యుత్తరదిక్కునకుఁ బోయెను. మహా స్వప్నమయిన దుష్కృతము నచ్చట నగపడమిచేఁ దూర్పుదిక్కంతయు వెదకెను. ఆదిక్కంతయు విశుద్ధసమాచారము, ఆదర్శనిర్మలముగాను గనుపట్టినది. అచ్చటినుండి బయలుదేఱి యారాజర్షినందనుఁడగు రాముఁడు దక్షిణదిక్కునకుఁ బోయెను. శైవలముయొక్క యుత్తరపుసార్శ్వమునఁ బెద్దసరస్సు చూచెను. ఆసరస్సులో నధోముఖుఁడై గొప్పతప మాచరించు వానిని జూచెను. రాముఁడు గొప్పతపస్సు చేయువానిదగ్గఱకుఁ బోయి "సువ్రతా! నీవు ధన్యుఁడవు, తపోవృద్ధా! నీ వేజాతియందుఁ బుట్టితివి? నేను సంతోషాశ్చర్యములతోఁగూడి యడుగుచున్నాను. నేను రాముఁడనువేగలవాఁడను. మాతండ్రిదశరథమహారాజు. నీకోరిక యేమి? స్వర్గలోకము గావలయునా? ఇంతదుష్కరమయినతప స్సెవరముకొఱకుఁ జేయుచున్నావు? తాపసా! నీ వెవని నాశ్రయించి యింత తపస్సు చేయుచున్నావు? బ్రాహ్మణుఁడవేని నీకు భద్రమగును. రాజవేని దుర్జయుండవు, మూఁడవవర్ణమగు వైశ్యుఁడవా? లేక శూద్రుఁడవా? యథార్థము చెప్పుము." రాముఁ డిట్లడుగఁగాఁ దలక్రిందుగాఁ దపస్సుచేయు నాతపస్వి తనజాతిని తపఃకారణమును రామున కిట్లనిచెప్ప మొదలిడెను.

76-వ సర్గము

శంబూకవధ, దేవతాదర్శనము

ఆతపస్వి యక్లిష్టకర్ముఁడగు రాముఁ డడిగినమాటలు విని తలక్రిందుగా నుండియే యిట్లనియె: "రాజా! నేను శూద్రయోనియందుఁ బుట్టితిని. నాపేరు శంబూకుఁడు. మహాయశా! యీశరీరముతో దేవత్వమును బడయఁగోరుచుంటిని. రామా! నే నసత్యమాడను. దేవలోకజిగీషచే నే నిట్టిఘోరతప మాచరించుచుంటిని. నేను నిజముగా శూద్రుఁడను." అని యాశూద్రుఁడిట్లుచెప్పుచుండఁగా రాముఁడు వాఁడియగు

కత్తిదూసి చటుక్కునవానికంఠము దెగఁగోసెను. ఆశూద్రుఁడు హతుఁడు కాఁగానే యగ్ని పురోగములగు దేవతలు మాటిమాటికిని రాముని సాధు వాదములతోఁ గొనియాడిరి. సుగంధయుక్తమగు పుష్పవర్షము గురిసినది. దేవదుందుభులు మ్రోఁగినవి. వాయువు మృదువై పుష్పరాశి యంతటను బడినది. దేవతలు సంతోషించి రామునితో నిట్లనిరి:"మహామతీ రామా! నీవు సురలకార్యము నెఱవేర్చితివి. అరిందమా! నీయిష్టమయిన వరము వేఁడుము. రఘునందనా! యీశూద్రుఁడు నీధర్మమున స్వర్గమునకు రాకుండఁజేసితివి. మాకంతియే చాలును."అనియిట్లు దేవతలన్నమాటలు విని రాముఁడు సావధానుఁడై చేతులు జోడించుకొని దేవేంద్రునితో నిట్లనియె : "దేవతలారా! ఇంద్రభగవానుఁడా! మీరు నాయంచనుగ్రహ ముంచితిరేని యీబాలుఁడు జీవించునుగాక. ఇదియే నాకుఁ గావలసిన వరము. నాయపచారమునలన నాబ్రాహ్మణబాలుఁ డకాలమున కాల ధర్మమునొంది యమునియింటికిఁ జనెను. వానిని బ్రదికింపుఁడు. నామాట నన్యథపు చేయకుండు. నీబాలుని బ్రదికించెద నని యీబ్రాహ్మణునితోఁ బ్రతిజ్ఞపట్టి చెప్పితిని." అనియిట్లు రాముఁ డన్నమాటలు విని దేవతలు సంతోషించి రామునితో నిట్లనిరి: "రామా" నెమఱిగా సుంచము. ఆ బాలుఁడు నేఁడే బ్రదికి తనబంధువులతోఁ గలసికొనెను. ఏముహూర్తమున శూద్రునిశిరస్సు ఖండించితివో యప్పుడే యీబాలునిప్రాణములు మరల శరీరమును బొందినవి. నీకు మేలగుఁగాక! మేము వెళ్లెదము. ఈ ప్రాంతమునఁనే యగస్త్యునియాశ్రమ మున్నది. అచ్చటికిఁబోయి యీయ నను జూచెదము. మహర్షి యయిన యాతనిదీక్ష సమాప్తమయినది. జల శయ్యయం దిప్పటికిఁ బండ్రెండేఁడులనుండి శయనించియున్నాఁడు. ఆముని నభినందించుకొఱకు వెళ్లెదము. ఆమునిని జూచుటకై నీవును మాతో రమ్ము." అని యన్న దేవతలమాటలు విని రాముఁ డంగీకరించి హేమ భూషిత మగు పుష్పకము నారోహించెను. బహువిస్తారము లగు విమా నము లెక్కి దేవతలు బయలుదేఱిరి. రాముఁడును వారివెంటఁ గుంభ యోని యగు నగస్త్యునిఁ జూచుటకు బయలుదేఱెను. తపస్సులకు నిధి యగు నగస్త్యుఁడు దేవతలను జూచి ధర్మాత్ముఁడతఁ డందఱను యథోచిత ముగాఁ బూజించెను. దేవత లతనివలనఁ బూజను గైకొని యీతనిఁ బూజించి సంతోషించుచు ననుచరులతో స్వర్గమునకుఁ బోయిరి.

దేవతలు పోఁగానే రాముఁడు విమానము దిగి ఋషిసత్తముఁడగు నగస్త్యునకు నమస్కరించెను. అతఁడగ్నిహోత్రమువలె వెలుఁగుచున్న మహోత్తున కాయగస్త్యునకు నమస్కరించి యాతనివలన నాతిథ్యమునుగైకొని యాసనము నలంకరించెను. అపు డగస్త్యుఁడాతనితో నిట్లనియె: "రాఘవా! నీకు స్వాగతము. నాపుణ్యవశమున నిటువచ్చితివి. ఉత్తమమయిన బహుగుణములచే నీవు నాకు బహుమానపాత్రుఁడవు. నీ వెప్పుడును నాహృదయమునందే యున్నాఁడవు. ఇప్పుడు ప్రత్యక్షముగా దగ్గరకు వచ్చితివి. అతిథివి; పూజనీయుఁడవు. నీవు శూద్రునిఁ జంపుటకై వచ్చితివని నాకు దేవతలు చెప్పిరి. నీవు ధర్మముచే బ్రాహ్మణబాలుని బ్రదికించితివి. నాదగ్గఱ నీరాత్రి యుండిపొమ్ము. తెల్లవాఱినతోడనే పుష్పకమెక్కి మీపట్టణమునకుఁ బోదువుగాక! నీవు శ్రీమంతుఁడవగు నారాయణుఁడవు. నీయందు సర్వమును ప్రతిష్ఠిత మైయున్నది. సర్వభూతములకును నీవే ప్రభుఁడవు. నీవు సనాతనుఁడవయిన పురుషుఁడవు సౌమ్యా! యీ యాభరణము విశ్వకర్మచే నిర్మింపఁబడినది. ఈదివ్యాభరణమును జాజ్వల్యమానమగు నీశరీరమున కలంకరించుకొని నామనస్సును సంతోషపెట్టుము. దత్తమయినదానిని మఱల దానమిచ్చినచోఁ జాలఫలము గలదందుము. నీ విప్రద్రవ్యములను భరించుటకుఁ దగినవాఁడవు. ఇంద్రాదిదేవతలను వరింపఁజేయుటకు నీవు శక్తిగలవాఁడవు. కావున రాజా! రామా! నేనిచ్చినదానిని విధిగాఁ బరిగ్రహింపుము" అనిచెప్పిన యగస్త్యునిమాటలు విని యిక్ష్వాకుకులమహారథుఁడు మతిమచ్ఛ్రేష్ఠుఁడు రాముఁడు రాజధర్మము నాలోచించుచు "బ్రాహ్మణోత్తమా! దానము గ్రహించుట బ్రాహ్మణునకుఁదగును. క్షత్రియుఁడనైన నేనెట్లు పుచ్చుకొందును? విశేషించి బ్రాహ్మణునిచే దత్తమయినదానిని." అని రాముఁడనఁగా నగస్త్యుఁడిట్లనియె.

"రామా! పూర్వము కృతయుగమునఁ బ్రజలు రాజులేకుండ నుండెడివారు. దేవతలకు శతక్రతువు రాజుగా నుండెడివాఁడు. ఆప్రజలు తమకు రాజు కావలయునని దేవదేవునియొద్దకుఁబోయి యిట్లనిరి: 'దేవా! నీవు దేవతలకు శతక్రతువును రాజునుగాస్థాపించితివి. లోకేశా! మాకును నరపుంగవుఁడగు రాజు నిమ్ము. మేమతనిని బూజించుచు నిష్పాపులమయి సంచరించెదము. రాజులేకుండ మేముండఁజాలము. ఇది మాముఖ్యమైన నిశ్చయము.' ఇట్లను ప్రజలమాటలు విని యుత్తమమయిన యర్థమును

నిశ్చయించి తరువాత బ్రహ్మ యింద్రాది లోకపాలకులను రావించి 'మీ మీతేజోభాగము లిత్తురుగాక!' యని యడిగెను. లోకపాలకులందఱును దమతమ తేజస్సులయందు నాలవభాగము నిచ్చిరి. తరువాత బ్రహ్మ వానితో నొకనిని సృజించెను. అతఁడు శూపుఁడను పేరుగలవాఁడాయెను. అతనిని బ్రహ్మ లోకపాలురయంశములతో యోజనచేసెను. ఆశూపుని ప్రజలకు రాజునుగా నిచ్చెను. ఆశూపుఁ డింద్రునియంశముచేతను భూమి నాజ్ఞాపించుచుండెను. రాఘవా! వరుణునిభాగముచేతను శరీరమును బోషించుచుండెను. కుబేరునిభాగముచేతను బ్రజలకు ధనమిచ్చుచుండెను. యమునియంశముచేతను ప్రజలను శాసించుచుండెను. నరశ్రేష్ఠ వగు రామా! నీయం దున్న యింద్రునియంశభాగముచేతను నే నిచ్చుదానిని బరిగ్రహింపుము. నేను దరింతును" అనియిట్లు చెప్పిన పరమధార్మికుఁడైన యగస్త్యనివాక్యములు విని యాయనయిచ్చిన యాభరణమును బరిగ్ర హించెను. అ ట్లాయాభరణమును బరిగ్రహించి బాగుగ వెలుగుచుండు నాయాభరణప్రాప్తి నడుగుటకుపక్రమించెను: "భగవానులవారూ! ఈయాభరణ మత్యద్భుత మయినది. దివ్యమైన యాకృతిగలిగియున్నది. ఇది తమ కెట్లు లభించినది? దీని నెవ్వరు తెచ్చి తమ కిచ్చిరి? మహాయశా! నాకుఁ జాలనాశ్చర్యముగలిగి యడుగుచున్నాను. తాము పరమాశ్చర్య ములకు నిధియని నాకుఁ దెలిసినది." అనియిట్లు శ్రీరాముఁ డడుగఁగా నగస్త్యుఁ డిట్లనియె: "రామా! జరిగినవృత్తాంతమును జెప్పెదను వినుము. పూర్వము త్రేతాయుగమున రమణీయప్రదేశ మగు నీవనమున నే నొక యాశ్చర్యమును జూచితిని. అది దీని యాగమనమునకు ముఖ్యహేతువు. దానిని జెప్పెద నాలింపుము.

77-వ సర్గము

అగస్త్యుఁడు చెప్పిన శ్వేతునికథ

రామా! పూర్వము త్రేతాయుగములో బహువిస్తారమగు నరణ్య ముండెను. అది యంతటను యోజనశతము పరిమితి గలిగి మృగములు పక్షులు లేకయుండెను. అట్టినిర్మానుష్యమయిన యరణ్యమం దుత్తమమగు తపస్సుచేయుటకై నేను బోయితిని. ఫలములచేతను, మూలములచేతను, బహురూపములగు వృక్షములచేతను నాయరణ్యముయొక్కరూపము

నిర్దేశించుటకు శక్యము గాకపోయినది. ఆయరణ్యమధ్యమున యోజన మాత్రపరిమితిగల యొకసరస్సు గలదు. అది హంసకారండవాకీర్ణము, చక్రవాకోపశోభితము, పద్మోత్పలసమాకీర్ణము, సమితిక్రాంతశైవలము, అత్యాశ్చర్యజనకము, సుఖాస్వాదజలము, అనుత్తమము, అరజస్కము, అక్షోభ్యము, శ్రీమత్పక్షిగణాయుతము నయి యొప్పారుచుండెను. ఆ సరస్సునకు సమీపమున మహాద్భుతజనకమయినదియుఁ బురాణమును, మిగులఁ బుణ్యవంతమును, తపస్విజనవర్జితమును నగు నొకయాశ్రమ ముండెను. పురుషోత్తమా! నే నాయాశ్రమములో వేసవిరాత్రియం దుంటిని. ప్రభాతసమయమున లేచి యాసరస్సునకుఁ బోయితిని. అచ్చట నొకశవమును జూచితిని. ఆశవము మిగుల బలసి జీర్ణము గాక పంక్తి భేదముచేతఁ బుష్టాంగమై సరోవరము నాశ్రయించి శోభాయమాన ముగా నున్నది. నేనచ్చటిసంగతిచూచి చింతింపఁ దొడఁగితిని. "ఇది యే మయియుండును" అని యాలోచించుచు ముహూర్తమాత్ర మచ్చటనే యుంటిని. తరువాత ముహూర్తమాత్రమున దివ్యము, అద్భుతదర్శనము, పరమోదారము, హంసయుక్తము, మనోజవము నగు నొకవిమానమును జూచితిని. రఘునందనా! ఆవిమానముపైని దివ్యభూషణములుధరించి వేల కొలఁది యప్సరసలచే సేవింపఁబడుచు వెలుంగుచున్న యొకదివ్యపురుషుఁ డుండెను. కొందఱు దివ్యములగుగీతములు పాడుచుండిరి. మఱికొందఱు దివ్యముగ వాయించుచుండిరి. ఇంకఁ గొందఱు నృత్యముచేయుచుండిరి. మఱికొందఱు హేమదండములుగలిగి చంద్రకిరణములతోసమానముగా వెలుఁగు చామరములు చేతఁబట్టి పుండరీకనిభేక్షణుఁ డగు నాపురుషునికి వీచుచు సేవచేయుచుండిరి. తరువాత నతఁడు సూర్యుఁడు హేమకూట మును విడుచున ట్లాసింహాసనమునువిడిచి నేను జూచుచుండఁగానే యా విమానమునుండి దిగి యాశవమును దినుట కుపక్రమించెను. బాగుగా బలసియున్న యాశవముమాంసమునుదృష్టిగాఁదిని సరస్తీరానికిఁబోయి యాచమనముచేయుటకుపక్రమించెను. రఘుపుంగవా! ఆదివ్యపురుషుఁడు యథాన్యాయముగా నాచమనముచేసి యుత్తమవిమానము నెక్కుట కుద్యుక్తుఁడాయెను. నేనాసమయమున నతనినిజూచి యిట్లంటిని: "దేవసంకాశా! నీవెవరు? నీవిట్టినిందితమైన యాహారముదినుటకేమి కారణము? దీనికిఁ గారణమున్నచో నాతోఁజెప్పుము. ఇటువంటి యాహారము

V.M. MORIAL LIBRARY
V.R. NARLA
V.R.I.

దినుట కెవ్వారు సమ్మతింతురు? అందును నీఁబోటి దివ్యపురుషుఁడా యిట్టి యాహారమును దినుట? ఇదియంతయు నాకుఁ జాలనాశ్చర్యమును గలిగించుచున్నది. యథార్థముగా నేను వినఁదలఁచుకొనియున్నాను. ఏమైనను నీకిది తినఁదగిన భక్ష్యముగాదని నేను ముఖ్యముగాఁ జెప్పఁగలను." రామా! నే నిట్లనఁగానే యాదివ్యపురుషుఁడు "నానిజమైన మాటలు విని తనసంగతియంతయు యథార్థముగా నీకుఁ జెప్పెద" ననియె.

78-వ సర్గము

శ్వేతునిపూర్వవృత్తాంతము

శ్రీరామా! ఆదివ్యపురుషుఁడు మధురాక్షరములు గల నావాక్యములు విని చేతులు జోడించుకొని నా కిట్లు బదులు చెప్పెను: "మునివర్యా! నాసుఖదుఃఖములను దెలుపు పూర్వవృత్తము చెప్పెద వినుము: నీవు సన్నడిగితివి. నీవంటిమహామునిమాటకు బదులుచెప్పకయుండరాదు. పూర్వము మహాయశుండగు నాతండ్రి విదర్భదేశాధీశ్వరుఁడు సుదేవుఁడను నతఁడు. మూఁడులోకములయందును విఖ్యాతుఁడుగా నుండెడివాఁడు. అతని కిద్దఱు భార్యలు గలరు. ఇద్దఱికిను నిద్దఱు కుమారులు పుట్టిరి. నేను శ్వేతుఁడనువాఁడను. సురథుఁడనువాఁడు చిన్నవాఁడు. తరువాత మాతండ్రి స్వర్గమునకుఁ బోఁగాఁ బౌరులు మొదలగువారు నన్నభిషేకించిరి. నేను సావధానచిత్తుఁడనై ప్రజలను ధర్మముతోఁ బరిపాలించుచుంటిని. సువ్రతా! ఇట్లు బహువర్షసహస్రములు గడచినవి. నేనెంతయు ధర్మముగాఁ బ్రజలనేలితిని. ద్విజోత్తమా! నేనొకానొక నిమిత్తమున నాయువు దెలిసినవాఁడనై కాలధర్మమును మనసున నుంచుకొని వనమునకుఁ దరలితిని. నే నీనిర్ణానుష్యమును నిర్మలగపటికమును నగువనమునకు వచ్చి యాసర స్సమీపమునఁ దపస్సుచేసికొనుటకు నిశ్చయించుకొంటిని. నేను నాతమ్ముని సురథుని రాజ్యమునం దభిషేకించితిని. నే నిచ్చటికి వచ్చి చిరకాలము తపమాచరించితిని. నేను మూఁడువేలసంవత్సరములు ఘోరముగఁ దపస్సుచేసి యనుత్తమమగు బ్రహ్మలోకమునకుఁ బోతిని. ద్విజోత్తమా! స్వర్గతుఁడనైన నన్ను నాఁకలిదప్పులు బాధింపఁ జొచ్చినవి. నేను వ్యాకులపడితిని. అపుడు త్రిభువనశ్రేష్ఠుఁడగు బ్రహ్మయొద్దకుఁబోయి "దేవా! ఇది బ్రహ్మలోక మనియు నిచ్చట నాఁకలిదప్పిక

లుండ వనియు నమ్మితి. కాని నేను తృత్పిపాసానుగతుండనై యుంటిని. ఇదియే దుష్కృతకర్మమునకుఁ బరిపాకము? నా కాహార మేమి? అది నాకుఁ జెప్పనలయును" అని యడుగఁగా బ్రహ్మ నాతో నిట్లనియె: "సుదేవతనూ జుఁడవగు నో శ్వేతా! నీశరీరమాంసము రుచిగా నుండును. నీవు దానిని నిత్యమును భక్షించుచుండుము. ఉత్తమమైన తపమాచరించుచు నీశరీర మును బుష్టముగాఁ జేసితివి. మహామతీ! బీజము నాటనుండఁ జెట్లు మొలచును? జంతునిషేవితమగు నడవిలో నీకు లవలేశమును దృప్తిలేక పోయినది. పూర్వము నీవు భిక్షకువచ్చిన యతులకుఁగాని, యతిథులకుఁ గాని భిక్ష యీయవయితివి. ఎల్ల కాలమును దపమే చేయుచుంటివి. కావు ననే నాయనా! నీ వీలోకమునకు వచ్చినను నిన్ను తృత్పిపాసలు బాధించు చున్నవి. నీవిటుపైని మంచిమంచియాహారములచేఁ బాగుగాఁ బెంచియున్న నీశరీరమునందలి మాంసమును దిని దృప్తిని పొందుచుండుము. ఎప్పు డా యడవిలోని కగస్త్యుఁడు వచ్చునో అప్పుడు నీ కాకష్టము తీరును. అతఁడు దేవతలనుగూడఁ దరింపఁజేయ శక్తిగలవాఁడు. తృత్పిపాసావశంగతుఁడ వైన నిన్నుఁ దరింపఁజేయుట యన నతని కెంత?" అని చెప్పిన బ్రహ్మావాక్య ములు విని "ద్విజోత్తమా! అది మొదలు నిందితమైన యీ నాశరీరమాంస మును భుజించుచున్నాను. నేనిదివఱ కెన్ని వేలసంవత్సరములనుండి యో యిట్లు తినుచున్నాను. నాకుఁ దృప్తిగాని యీశరీరమునకు తృప్తిగాని కనుపడదాయెను. కనుక నే నిట్టిసంకటమునుండి యెట్లు విడుదలను బొందు దునో యట్లుచేయఁగోరితిని. నన్ను రక్షింపుము. నన్నుఁ దరింపఁజేయుట కగస్త్యునకుఁదక్కఁ దక్కినవారికి వశముగాదు. నన్నుఁ దరింపఁజేయుట కుఁగా నీయాభరణము పుచ్చుకొనుము. నీకు క్షేమమగుఁగాక. నన్నిపు డనుగ్రహింపుము. ఇది ప్రతిదినమును సువర్ణమును, ధనమును, వస్త్రము లను, భక్ష్యమును, భోజ్యమును, అభరణములను నిచ్చుచుండును. మునిపుంగవా! సమస్తమయిన కోరికలను భోగములను నిచ్చెదను. నన్నెటులై నను దరింపఁజేయుము." ఇట్లు దుఃఖముతోఁగూడిన యాదివ్యపురుషుని వాక్యములు విని యతనిని దరింపఁజేయుటకై యుత్తమమైన యాయాభ రణమును బుచ్చుకొంటిని. శుభమైన యాయాభరణము ప్రతిగ్రహించిన తోడనే యారాజర్షియొక్క పూర్వదేహము నశించినది. ఆశరీరము నశిం చినతోడనే యతఁడు చాలసంతోషించి స్వర్గమునకుఁబోయెను. ఇంద్ర

తుల్యుఁడగు నాతనిచేత నీదివ్యాభరణము ఆత్మతరణార్థమై నాకీయఁబడినది. ఇది యతియద్భుతమైన యాభరణము.

79-వ సర్గము

అగస్త్యుఁడు చెప్పిన దండునికథ

శ్రీరామచంద్రుఁడిట్లుచెప్పిన యగస్త్యభగవానుని యత్యద్భుతమైన వాక్యమును విని గౌరవమువలనను విస్మయమువలనను మఱల నడుగుట కుపక్రమించెను. భగవానులవారూ! ఆశ్వేతుఁడు తపస్సుచేసిన యరణ్యము మృగపక్షిశూన్యమగుటకుఁ గారణ మేమి? అట్టి నిర్మానుష్యమైన యరణ్యములోఁ దపస్సుచేయుటకు శ్వేతుఁడెందులకు బ్రవేశించెను? ఇది వినుటకుఁ గోరికయగుచున్నది. సెలవీయఁ దగునని యడుగఁగా నగస్త్యుఁడు చెప్పుట కుపక్రమించెను. రామా! పూర్వము కృతయుగమున మనుచక్రవర్తి దండధరుఁడు ప్రభువై యుండెను. అతనికిక్ష్వాకుఁడు కుమారుఁడై పుట్టెను. ఆతఁడు తనకుమారుఁడగు నిక్ష్వాకునకు రాజ్యాభిషేకము చేసి భూమియందు రాజవంశములకుఁ గర్తవు కమ్మని చెప్పెను. తండ్రి చెప్పినమాట కుమారుఁ డంగీకరించెను. తరువాత మనువు చాల సంతోషించినవాఁడై కుమారునితో నిట్లనియె: "నాయనా! నేను చాలసంతోషించితిని. నేనుచెప్పినట్లు నీవుచేయుట కేవిధమైన యభ్యంతరమును లేదు. ప్రజలను దండముచే రక్షించుము. అకారణముగా దండమును ప్రయోగింపకుము. అపరాధముచేసినవారివిషయమై ప్రయోగించిన దండము విధిగైనది. అది రాజును స్వర్గమునకుఁ బంపును. కావున నాయనా! దండనీతి విషయమునఁ జాలయత్నముగలవాఁడవై యుండుము. అటు నడచువాఁడవైనచో నీకు ధర్మముగలుగును" అనియిట్లనేకవిధములుగాఁగుమారునకు బోధించి మనువు సమాధి నవలంబించి సంతోషముగా బ్రహ్మలోకమునకుఁ బోయెను. అట్లు మనువు బ్రహ్మలోకమునకుఁ బోయిన పిదప నమిత ప్రభుఁడైన యిక్ష్వాకుమహారాజు "నేనెట్లు పుత్రులను గనుదును" అని చింతాపరుఁడాయెను. అతఁ డాయాకర్మములచేత నెట్లో దేవసుతోపములగు నూఱుగురుకుమారులను గనియెను. రఘునందనా! రామా! వారిలోఁ గడగొట్టువాఁడు మూఢుఁడు, చదువనివాఁడునగుటచేఁ బూర్వాజులను సేవించినవాఁడు గాఁడు. బుద్ధితక్కువవాఁడగు వానికిఁ దండ్రియే

దండుఁ డని నామకరణము చేసెను. వీనిశరీరమునందుఁ దప్పక దండపతన మగునని యతఁడు తలఁచెను. ఆతనికిఁ దండ్రి వింధ్యశైవముల మధ్య మున రాజ్యమిచ్చెను. అతఁ డాపర్వతప్రాంతమున రాజై యొకానొక రమ్యమైన పురమును నిర్మింపఁజేసికొనెను. ఆపట్టణమునకు మధుమంత మని నామ మించెను. తనకు శుక్రాచార్యునిఁ బురోహితునిగా వరించు కొనెను. ఈరీతిగాఁ బురోహితునితోఁ గూడి యతఁడు రాజ్యమేలుచుం డెను. అతనిద్వారమునం దంతటను బ్రతివారును సంతోషించుచుండిరి. అతఁడు దేవేంద్రుఁడు స్వర్గము నేలినట్లుగా నేలుచుండెను.

80-వ సర్గము

దండుఁ డరజను బలాత్కరించుట

ఇట్లగ స్థూలశిరుమహాముని యింతవఱకుఁ జెప్పి యీకథాసందర్భమున నిం కొకసంగతినిఁ జెప్పుట కుపక్రమించెను. రామా! అట్లు దండుఁడను రాజు పెక్కువేలసంవత్సరములు దాంతుఁడై నిహతకంటకమగు రాజ్యమేలు కొనుచుండెను. ఇట్లుండఁగా నతఁడొకవసంతఋతువులో రమణీయమగు భార్గవుని యాశ్రమములోనికిఁ బోయెను. అచ్చట సర్వాంగసుందరియగు భార్గవునికన్యను వనములోఁ దిరుగుచుండుదానిని జూచి యాదుర్బుద్ధి మన్మథశరపీడితుఁడై యాకన్నియదగ్గఱకుఁబోయి యిట్లనియె: "సుశ్రోణీ! నీవెచ్చటిదానవు? సుందరీ! నీవెవ్వనితనయవు? నేను నిన్నుఁజూచి మన్మథ వశంవదుఁడనైతిని. కావున నాకోరికదీర్పవలయు"నను వానిని మోహో న్మత్తునిగాఁ దెలిసికొని బ్రతిమాలుచు నాకన్నియ యిట్లనియె: "రాజా! నేను శుక్రాచార్యుల కుమారితను. నాపే రరజ యందురు. నేను బెద్ద దానను. ఈయాశ్రమములో నుందును. నేను గన్యను. తండ్రియధీనమున నున్నదానను. నన్ను బలాత్కరింపకుము. వలదు వలదు. నన్ను ముట్ట వలదు. నాతండ్రి నీకు గురువు. నీవతనికి శిష్యుఁడవు. మహాతపశ్శాలి యగు నాయనకుఁ గోపముపచ్చినచో నీకుఁ జాలఁ గష్టము సంభవింపక తప్పదు. నేనింకను నీకేదియైనను జేయవలసిఁయుండినచో ధర్మదృష్టమైన సన్మార్గమున మహాద్యుతియగు మాతండ్రినిఁ గోరుము. అట్లు కాదేని నీ కిందువలన మహాఘోరశాపము తటస్థించితీరును. నాతండ్రికిఁ గోపమువచ్చి నచో మూఁడులోకములను దహించును. కావున నీవుపోయి మాతండ్రిని

యాచించినచో నతఁడు దప్పక నన్ను నీకిచ్చును" అని యిట్లు చెప్పుచున్న యాయరజను కామపరవశుఁడైన యాదండుఁడు మదోన్మత్తుఁడై శిరస్సునం దంజలి యుంచుకొని యిట్లనియె: "సుందరీ! నాయం దనుగ్రహింపుము. కాలహరణము చేయకుము. నీకొఱకు నాప్రాణములు పోవుచున్న ట్లున్నవి. నిన్నుఁబొందినవెనుక శాపమైనను గానిమ్ము, వధమైనను గానిమ్ము లక్ష్యముచేయను. నేను నీసేవకుఁడను, నన్నాదరింపుము" అనియి ట్లాపై తోఁ జెప్పి బలాత్కారముగా నామెనుబట్టుకొని యటునిటుఁ దప్పించు కొనుట కుద్యుక్తురాలైన యామెకు మానభంగముచేసి గ్రామ్యధర్మమున కుపక్రమించెను. దండుఁ డిట్టిమహాఘోరము నాచరించి వెంటనే తనపట్ట ణములోనికిఁ బోయెను. అరజయు నేడ్చుచు నాయాశ్రమసమీపమునకే యుండి భయంపడుచు దేవసన్నిభుఁ డగు తండ్రిరాక కెదురుచూచు చుండెను.

81-వ సర్గము

శుక్రుఁడు దండుని శపించుట

అమితతేజశ్శాలియు, దేవర్షియునగు శుక్రాచార్యుఁడు ముహూర్త మాత్రములో నామఘోరము విని ముహూర్తుఁడై శిష్యులతోఁ దన యాశ్రమమునకు వచ్చెను. అతఁడు వచ్చిచూచునప్పటి కాయరజ దీను రాలై ధూళిధూసరితాంగియై ప్రాతఃకాలమం దరుణునికాంతిచేఁ దిరస్క రింపఁబడిన వెన్నెలవలెఁ గాంతిహీనయై కనుపట్టినది. అతఁడు మిక్కి లి యూఁకలిగొన్నవాఁ డగుటచే మఱింతగోప మెక్కువయయినది. మూఁడు లోకములను దహించునా యనునట్లు చూచుచు శిష్యులతో నిట్లనియె: "ఆత్మనిగ్రహములేని దండుని విపరీతచర్య చూచితిరిగదా! సపరివార ముగా వానికి వినాశకాలము సమీపించినది కాఁబోలును! లేనిచో మండుచుండు నగ్నిజ్వాలను ముట్టఁబోవునా? వాఁ డిట్టి యకార్యమున కొడిగట్టినవాఁడగుటచే దానికిఁ దగినఫల మనుభవించును. ఈదుర్మార్గుని దేశముచుట్టును నూఱుయోజనముల మేర గొప్పపాంసువర్షముచేత దేవేంద్రుఁడు నశింపఁజేయఁగలఁడు. ఇచ్చట నుండెడి సర్వజంతువులును, స్థావరములును వెంటనే జయమును బొందఁగలవు. ఈదండునిదేశమంత యుఁ బాంసువర్షముచే నేడు దివారాత్రములు మునిఁగిపోవును." అని

చెప్పి క్రోధతామ్రాక్షుఁడయి యాయాశ్రమమునం దున్నవారిని మఱి యొకచోటికిఁ బొమ్మని చెప్పెను. ఇట్లుచెప్పిన శుక్రు నిమాటలు విని యా ప్రాంతమునం దున్నవారంబఱును వేఱుచోటికిఁ బోయిరి. అతఁడట్లు మునులతోఁజెప్పి కూఁతుతో నిట్లనియె ; "ఓసీ బుద్ధితక్కువదానా ! నీ వీయాశ్రమమునఁనే సావధానచిత్తురాలవయియుండుము. ఇది యోజన పర్యంతమును సురుచిరప్రభమగు సరస్సు. అరజా ! విజ్వరురాలవయి యనుభవించుచుఁ గాలము నెదురుచూచుచుండుము. నీసమీపమందున్న యావజ్జంతువులును పాంసువర్షముచే నవధ్యము లగును" అని యిట్లు తండ్రిచెప్పినమాటలు విని మిక్కిలి దుఃఖించుచుఁ దండ్రితో నట్లే యుం డెదనని చెప్పినది. తరువాత శుక్రుఁడు వేఱొకచోటికిఁబోయి యాశ్రమ మును గల్పించుకొని యందుండెను. దండుఁడును నారాజురాజ్యమంతయు శుక్రుఁడన్నట్లుగానే యేడురాత్రులు ధూళివర్షముగురియుటచే సభృత్య బలవాహనముగా భస్మీభూతమయిపోయినది. రామా ! అదియే వింధ్య శైవలములమధ్యనున్న దేశము. రాజు ధర్మము తప్పుటచే బ్రహ్మర్షి యగు శుక్రునిచే శపింపఁబడినది. అదిమొదలు రామా ! దండకారణ్యమని పేరు పడినది. ఇపు డచటఁ దస్వ్యుజనము నివసించుచుండెను. అటుపయిని జన స్థానమున్నది. నీవడిగినవిషయమంతయుఁ జెప్పితిని. రామా ! సంధ్యావంద నమునకు సమయ మతిక్రమించుచున్నది. ఈమహర్షులందఱును బూర్ణ కుంభములతో సూర్య నుపాసించుచున్నారు. సూర్యుఁడస్తాద్రిచాటు నకుఁ బోవుచున్నాఁడు. బ్రహ్మవిత్తములగు బ్రాహ్మణులతోఁ గూడిబోయి సంధ్యావందన మాచరింపుము.

82-వ సర్గము

శ్రీరాముఁడయోధ్యకు వచ్చుట

రాముఁడగస్త్యనిమాటలువిని యప్సరోగణసేవితమగు నాసరస్సు నకు సంధ్యావందనమాచరించుటకుఁ బోయెను. అచట నతఁడు సాయం సంధ్యావందన మాచరించి మరల నగస్త్యనియాశ్రమములోఁ బ్రవేశిం చెను. అతని కగస్త్యుఁడు బహుగుణమగు కందమూలాదికమును భోజన మునకై యేర్పాటుచేసెను. అమృతోపమ మగు నాయన్నము నతఁడు భుజించి సంతోషముగా నారాత్రి యచట నివసించెను. ప్రభాతసమయ

మున నిదురనుండి లేచి నిత్యకృత్యములు నెఱవేర్చుకొని గమనము కొఱకు నాబుషియొద్దకుఁ బోయెను. అతఁడు కుంభసంభవమహాముని కి నమస్కరించి "భగవానులవారూ! నెలవయిన చో నయోధ్యకుఁ బోయె దను. నన్ననుగ్రహింపవలెను. నేను ధన్యుఁడ నయితిని. తమదయకుఁ బాత్రుఁడనయితిని. తమదర్శనమువలనఁ గృతకృత్యుఁడనయితిని. అప్పు డప్పుడు దమదర్శనముచేసికొని పవిత్రుఁడ నగుచుందును." శ్రీరాముఁ డిట్లనుచుండఁగా నద్భుతదర్శనమగు నావాక్యములు విని మిగుల సంతో షించి ధర్మము జ్ఞానసాధనముగాఁగల యగస్త్యుఁడిట్లనియె: "రామా! నీ మాట లత్యద్భుతములు; మఱియు శుభాకరములు. రఘునందనా! సర్వ భూతములనుబవిత్రముచేయువాఁడవునీవే. రామా! ముహూర్తమాత్ర మయినను నిన్నుఁ జూచినవారు పవిత్రులయి స్వర్గభూతులై సర్వదేవతల చేతను బూజ్యులగుదురు. ఎవరు నిన్నుఁ దమఘోరచక్షువులచేఁ జూతురో వారు వెంటనే యమదండముచే హతులై ఘోరనరకములలోఁ గూలు దురు. రఘుశ్రేష్ఠా! నీవిటువంటివాఁడవు. సర్వదేహాములలోను పవిత్రుఁ డవు. రాఘవా! నిన్నీభూలోకములోఁ జెప్పుకొనుచుండువారుగూడ నిష్టసిద్ధులను బొందుచుందురు. జాగరూకతగా క్షేమముగాఁ బట్టణము నకుఁబోయి ధర్మముగా రాజ్యము నేలుచుండుము. నీవేకదా లోకము లకు దిక్కు?" అని యిట్లుచెప్పిన యాయగస్త్యమహాముఁనికి నమస్కరించి చేతులు జోడించుకొని పుణ్యవంతుఁడగు నాతనికిఁ బ్రదక్షిణ మాచరించి యచ్చటి తపోధనులకు నమస్కరించి వెంటనే హేమభూషితమైన పుష్ప కము నారోహించెను. ఇట్లు వెళ్లుటకు సిద్ధముగా నున్న రాముని జూచి దేవతలు దేవేంద్ర నాశీర్వదించిన ట్లాశీర్వదించిరి. రాము డంతరిక్షము నందు హేమభూషితమైన విమానముపైనుండి వర్షాకాలములో మేఘ ముల సమూహమునన్న చంద్రునివలెఁ బ్రకాశించెను. అతఁడచ్చటచ్చట బూజింపఁబడుచు రెండుజాము లగునప్పటి కయోధ్యకు వచ్చి మధ్య కక్ష్యలో దిగెను. తరువాత కామగమనముగల విమానమును జూచి "నీకు క్షేమమగుఁగాక. నీయిచ్చకు వచ్చిన నచ్చటనఁ బో"మ్మనెను. తరు వాత నాకక్ష్యాంతరమం దున్న ద్వారపాలకుని జూచి నీవు వేగముగఁ బోయి లక్ష్మణుని క్రముల గు భరతుని లక్ష్మణుని నేను వచ్చితి ననిచెప్పి వేగ ముగాఁ దీసికొని రమ్మనెను.

83-వ సర్గము

భరతుఁడు రాజసూయము వలదనుట

ఆక్షిప్తకర్ముఁడగు రామునిమాటలు విని ద్వారపాలుఁడు వెంటనే లక్ష్మణుని భరతునిఁ దోడ్కొనివచ్చి రామునకు విన్నపించెను: అట్లువచ్చిన తమ్ములను గౌఁగిలించుకొని రాముఁ డిట్లనియె: "తమ్ములారా! నిజముగా నేను బ్రాహ్మణకార్యము చేసివచ్చితిని. మఱియు ధర్మహేతువు నెప్పటియట్ల చేయఁగోరుచుంటిని. ధర్మహేతువవశ్యము, అవ్యయమునని నాకు బోధ పడినది. ఈధర్మగౌరవమునుది సర్వపాపప్రణాశకము. ఆత్మభూతులగు మీసాయమున రాజసూయము చేయఁ దలఁచుచున్నాను. అదిచేసినచో శాశ్వతమగు ధర్మము గలుగును. శత్రునిబర్హణుఁడగు మిత్రుఁడను నతఁడు రాజసూయమాచరించి పూర్వము మిత్రత్వమునుబొందెను. ధర్మవిదుఁడగు చంద్రుఁడు పూర్వము ధర్మముగా రాజసూయమాచరించి సర్వలోకములయందును శాశ్వతమగుకీర్తినిబొందెను. ఈదినమున మీరు నాతో నేదిశ్రేయమో దాని నాలోచింపుఁడు. మీరు నాకు హితమును, ఉత్తరకాలాభివృద్ధినిఁ జేయఁదగుదురు." ఇట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములువిని వాక్యవిశారదుఁడగు భరతుఁడు చేతులుజోడించుకొని యాతనితో నిట్లనియె: "అన్నా! నీయందు ధర్మమంతయు నున్నది. నీయందు సర్వభూమియుఁ బ్రతిష్ఠితమైయున్నది. అమితవిక్రమా! నీకీర్తియంతటను వ్యాపించియున్నది. ప్రజాపాలురందఱును దేవతలు బ్రహ్మను జూచుచుండునట్లు మావలెనే మహాత్మునినిన్నును జూచుచున్నారు. మహాబలా! ప్రజలందఱును నిన్నుఁ దండ్రినిగా భావించుచున్నారు. రాఘవా! నీవు భూమికినిబ్రాణిమాత్రమునకును గతివైయున్నావు. భూమియందలి రాజవంశ్యులకు వినాశమును గలిగించు నీరాజసూయమును నీవెట్లాచరించెదవు? రాజా! భూమియందలి పౌరుషవంతులు పౌరుషము నవలంబించి సంక్షయమును బొందుదురు. ఇపుడు నీయధీనమందున్న భూమినంతయుఁ బాడుచేయఁదగవు." అనియిట్లమ్మాత మొలుకునట్లు పలికిన భరతునిమాటను విని సత్యపరాక్రముఁడగు రాముఁడు మిగుల సంతోషించి కైకేయికొడుకగు భరతునిఁజూచి యిట్లనియె: "అనఘా! భరతా! నీవు చెప్పినమాటలకు నేనెంతయు సంతోషించితిని. నీవుచెప్పినమాట సార

వంతమును ధర్మముతోఁగూడినదియువైయున్నది. నీవు భూమికి హితము గలుగునట్లు చెప్పితివి. ఇపుడు నీవు చెప్పిన న్యాయమైన పలుకులచే రాజసూయారంభమునుండి నామనసును మరలించుకొంటిని. ధర్మజ్ఞా! ప్రాజ్ఞులగువారు లోకములకుఁ బీడగలుగు కార్యములు చేయఁగూడదు గదా! భరతా! బాలురమాటలు తప్పకవినవలయును. అందువలన శుభమొఁగూడును. మహామతీ! అందుచే నీవు బాగుగాఁ జెప్పిన మాటలు శ్రద్ధగా వింటిని.

84-వ సర్గము

లక్ష్మణుఁడశ్వమేధము చేయుమనుట

ఇట్లు రాముఁడు, భరతుఁడును జెప్పినతరువాత లక్ష్మణుఁడు రాముని తో శుభవాక్యములను బలుకుట కుపక్రమించెను: "అన్నా! అశ్వమేధము మహాయజ్ఞము. సర్వపాపములను బోఁగొట్టి పవిత్రముచేయును. కావున దానిచేయుట కంగీకరించవలయును. పూర్వము దేవేంద్రుఁడు బృహస్పతియనుమతిపై నశ్వమేధమొనరించి పవిత్రుఁడాయెనని విందును. మహాబాహూ! పూర్వము దేవాసురసమాగమనముగలిగినపుడు వృత్రుఁడను పేరుగల రాక్షసుఁడు లోకసమ్మతుఁడుగలఁడు. మూఁడువందల యోజనములవిస్తీర్ణము తొమ్మిదివేలయోజనముల పొడవుగలిగియుండెడివాఁడు. అతఁడు మూఁడులోకములను విశేషముగ ననురాగముచేఁ జూచుచుండువాఁడు. మఱియు ధర్మజ్ఞుఁడు కృతజ్ఞుఁడు బుద్ధిమంతుఁడునై సావధానముగా ధర్మముతప్పకుండ భూమిని బాలించుచుండెడివాఁడు. అతఁడట్లు పాలించుచుండఁగా భూమి సర్వకామముల నొసఁగుచుండెడిది. పువ్వులు, దుంపలు, ఫలములు రసవంతములైయుండెడివి. ఆమహాత్ముని పాలనవలన భూమి దున్నకుండనే పండుచుండెడిది. అతఁడట్లత్యద్భుతముగా విస్తారముగా రాజ్యము ననుభవించుచుండఁగా నతనికిఁ దప మాచరింపవలయునని బుద్ధిపుట్టినది. తపస్సేకదా మిగుల శ్రేయస్కరమైనదనియు, నితరసుఖములు సంమోహామును గలిగించునవియనియు నతనికిఁ దోఁచినది. అతఁడు తన పెద్దకుమారుని రాజ్యకర్తనుగాఁజేసి సర్వదేవతలకును దాపముగలుగునట్లుగా నుగ్రమైనతపముచేయ మొదలిడెను. అతఁడట్లు తపస్సుచేసుకొనుచుండఁగా దేవేంద్రునికి భయముగలిగినది. వెంటనే

యింద్రుఁడు విష్ణునొద్దకుఁబోయి యిట్లనియె : "దేవా ! వృత్రునితపస్సుచే మూఁడులోకములును జయింపఁబడినవి. అతఁడు బలవంతుఁడును, ధర్మాత్ముఁడును నగుటచే నతనిని జయింపఁజాలను. ఆరాధ్యుఁడగు నీశ్వరుఁడు మరలఁ దపముచేసెనని యెంతవఱకు లోకము లుండునో అంతవఱకును నతనికి స్వాధీనులుగా నుండవలసివచ్చును. మహాబలా, విష్ణూ! అట్టివాని నుపేక్షించితివేని యిక నిలువఁజాలము. సురేశ్వరా ! నీవు క్షణమాత్రము కోపించితివేని వృత్రుఁడుండఁబోడు. నీకు నాయం దనుగ్రహము గలిగినప్పటినుండియు నేను లోకములకుఁ బ్రభువునైయుంటిని. నీవు సావధాన చిత్తుఁడవై దేవతల ననుగ్రహదృష్టితోఁ జూడుము. నీకృత్యముచే జగమంతయుఁ బ్రశాంతమై నిరుపద్రవమైయుండును. ఈ దేవతలంబఱును నీకై యెదురుచూచుచున్నారు. వృత్రునిజంపి వీరికి సాయపడుము. మహత్తులగు దేవతలకు నిత్యమును నీవు సహాయముచేయుచునేయుంటివి. ఇపుడెవరికిని సాధ్యముగాని కార్యము తటస్థించినది. గతిలేని మాకు నీవు గతి వగుము."

౫౮-వ సర్గము

వృత్రవధవృత్తాంతము

శత్రునిబర్హణుఁడగు రాముఁడు లక్ష్మణునిమాటలువిని వృత్రవధ సాంతముగఁ జెప్పుమన లక్ష్మణుఁడు మరల నిట్లుచెప్ప మొదలిడెను: అట్లు దేవేంద్రుఁడు మొదలగు దేవతలపలుకు లాలించి విష్ణుఁడు వారికిట్లనియె: "దేవేంద్రాదులారా ! పూర్వము నేను మహత్తుఁడగు వృత్రాసురునితో స్నేహముగనుంటిని గనుక మీ ప్రీతికొఱకు నేను వానిని జంపను. కాని మీ కెట్టులైనను సుఖముగలుగఁ జేయవలయును. వృత్రుఁడు చచ్చునుపాయము చెప్పెదను. దేవతలారా! నాయాత్మను మూఁడువిధములుగాఁ జేసెదను. అందుచే నింద్రుఁడు తప్పక వృత్రుని వధింపఁగలఁడు. ఒకభాగము దేవేంద్రుని, ఒకభాగము వజ్రాయుధమును, మూఁడవభాగము వృత్రునిదేహమును ధరించుటకుశక్తిసిద్ధించుకొఱకు భూతలమును బొందించెదను. అపుడింద్రుఁడు వృత్రాసురుని వధించితీరును." విష్ణుఁడిట్లుచెప్పఁగా దేవత లిట్లనిరి: "విష్ణూ! నీ వన్నది నిజమే సందియములేదు. నీకు భద్రమగుఁగాక! మేము వృత్రాసురునివధను గోరుచుఁ బోరెదము. పరమో

దారా ! నీతేజస్సును దేవేంద్రునియందు యోజనచేయుము." అనిచెప్పి యింద్రాదిదేవతలు వృత్రాసురుఁ డుండు వనములోనికిఁ బోయిరి. అట్లు పోయి వారు తేజస్సుచే వెలుఁగుచు ఘోరముగఁ దపస్సు చేయువానిని మూఁడులోకములను ద్రాగివై చునట్లును, అంబరతలమును దహించు నట్లును నగపడువానిని వృత్రాసురునిఁ జూచిరి. అతనిని జూడఁగానే దేవతలకు భయము గలిగినది. 'వీనినెట్లు జయింతుము? మనకెట్లు పరాజయము కలుగకుండెడిని?' అనియిట్లు దేవత లాలోచించుచుండఁగా సహస్రాక్షుఁడగు పురందరుఁడు తనవజ్రము రెండుచేతులతోఁ బట్టుకొని వృత్రాసురుని శిరమున్పైఁ గొట్టెను. కాలాగ్నివలె ఘోరమై మండుచున్న యగ్నిజ్వాలా సమూహామును బోలిన వృత్రునిశిరస్సు పడఁగానే లోకములకు భయము గలిగినది. దేవేంద్రుఁ డతనిని జంపుట యనుచితమని చింతించుచు వెంటనే లోకమునొక్క తుదిప్రదేశమునకుఁ బోయెను. అట్లు పోవుచుండిన యింద్రుని వెంబడించి బ్రహ్మహత్యయుఁబోయి యింద్రునిసర్వావయవముల యందును వ్యాపించినది. ఇంద్రునకు దుఃఖము గలిగినది. అపు డగ్నిపురోగములగు దేవతలు హతశత్రులు ప్రణష్టేంద్రులునై మాటిమాటికిని విష్ణునిఁ బ్రభవనేశ్వరునిఁ బూజించిరి. పరమేశ్వరా ! నీవేదిక్కు. నీవు లోకములన్నింటికిని మొదటితండ్రివి. సర్వభూతములను రక్షించుటకై విష్ణుత్వ మవలంబించితివి. నీవు వృత్రుని జంపితివి. బ్రహ్మహత్య యింద్రుని బాధించుచున్నది. సురశార్దూలా ! విష్ణూ ! దానిని వదల్పించు నుపాయమును జెప్పుము."అని దేవత లడుగఁగా విష్ణుఁ డిట్లనియె: "నన్నుఁగూర్చి యింద్రుఁడు యజ్ఞముచేసినచో నేను బవిత్రునిగాఁ జేయుదును. అశ్వమేధ మాచరించినయెడల నెప్పటియట్లు బ్రహ్మహత్యతోలఁగి యింద్రుఁడు దేవతలకుఁ బ్రభువగును." విష్ణుఁ డిట్లు దేవతల కాజ్ఞాపించి వారిచే స్తుతి చేయఁబడుచుఁ దననివాసమునకుఁ బోయెను.

86-వ సర్గము

బ్రహ్మహత్యావిభాగము

లక్ష్మణుఁ డిట్లు వృత్రవధ వృత్తాంతము చెప్పి మరలఁగథాశేషము చెప్పుట కుపక్రమించెను: "దేవా! అట్లు దేవభయంకరుఁ డగు మహావీర్యశాలి వృత్రుఁడు హతుఁడు కాఁగా నింద్రుఁడు బ్రహ్మహత్యవృతుఁడై

తెలివినిబొందఁడాయెను. అతఁడు లోకములయంతప్రదేశము నాశ్ర
యించి నష్టసంజ్ఞుఁడును విచేతనుఁడునునై చుట్టుకొనుచున్న పామువలెఁ
గొంతకాల మచ్చటఁ గడపెను. పిమ్మట దేవేంద్రుఁడు లేకుండుటచే జగ
త్తంతయు బెగ్గిలిపోయినది. భూమియంతయు నిస్నేహయు శుష్కకాన
నయునై ధ్వంసప్రాయమయిపోయినది. ఎచ్చటను జలము లేకపోయినది.
అనావృష్టివలన జంతువులన్నియు సంక్షోభమును బొందినవి.ఇట్లు లోకమం
తయు క్షీణించిపోవుట చూచి దేవతలు సంభ్రాంతచిత్తులై విష్ణుఁడు చెప్పిన
చొప్పున యజ్ఞము చేయఁదలఁచి బృహస్పతి మొదలైన ఋషులతోఁగూడి
యింద్రుఁడు భయమోహితుఁడైపడియున్న చోటికిఁబోయిరి. అట్లుపోయి
బ్రహ్మహత్య చుట్టుకొనియున్న యింద్రునిఁజూచి యతనిఁ బురస్కరించు
కొని విష్ణునిఁగూర్చి యశ్వమేధయాగ ముపక్రమించిరి. అన్నా! మహేం
ద్రునిబ్రహ్మహత్యపోయి పవిత్రుఁడగుటకై యశ్వమేధము జరిగినది.తరు
వాత యజ్ఞము కాఁగానే బ్రహ్మహత్య నా కెచ్చట స్థాన మేర్పఱిచితివని
యడిగినది. అపుడు దేవతలు సంతోషచిత్తులై "దురాసదమనఘు నో బ్రహ్మ
హత్యా! నీవు నిన్నును నాలుగుభాగములుగాఁ జేయుము" అనిరి. మహో
త్తులగు దేవతలమాటలు విని తనకు స్థానములను వేఁడినది. "ఒకభాగ
ముచేఁ బూర్ణోదకము గల నదులయందు వర్షాకాలము నాలుగునెలలు
యథేచ్ఛముగ స్నానము చేయుచుందును. నేను సర్వకాలమును భూమి
యం దొకయంశముచే నుందును; నిజముగాఁ జెప్పుచున్నాను. నా
మూఁడవభాగముచే యౌవనవతులగు స్త్రీలయందు మూఁడురాత్రి
లుందును. అపుడు దర్పముచే నిండియుండువారలకుఁ బురుషసంయో
గము లేకుండఁ జేయుచుందు ననెను. ఎవరు నిష్కారణముగాఁ గోపపూర్ణు
లై బ్రాహ్మణులను జంపెదరో వారిని నాల్గవభాగముచే నావహించి
యుందు" ననెను. ఆమాటలువిని "దేవతలు నీ వన్నయట్లు చేయుము. నీ
యిష్టమువచ్చినట్లుపొమ్ము."అని దేవత లాబ్రహ్మహత్యను బంపివైచిరి.తరు
వాత దేవతలు ప్రీతిపూర్వకముగా నింద్రునకు నమస్కరించిరి. ఇంద్రుఁడు
పవిత్రుఁడై విచారముపోయి సుఖముగా నుండెను. దేవేంద్రుఁ డెప్పటి
యట్ల రాజ్యమేలుచుండఁగా జగత్తంతయు శాంతిని బొందినది. అత్య
ద్భుతమైన యశ్వమేధయాగమును దేవేంద్రుఁడు గౌరవించెను. రఘు
నందనా! అశ్వమేధముయొక్కప్రభావ మిట్టిది. కావున రాజా! నీవును

వేగముగ నశ్వమేధయాగము నాచరింపుము." ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన యుత్తమవాక్యమునువిని మహోత్సుఁడును, దేవేంద్రునితోఁ సమానమయిన పిక్రమము తేజస్సుగలవాఁడునునగు శ్రీరామచంద్రుఁ డెంతయు సంతోషించెను.

87-వ సర్గము

ఇలమహారాజుకథ

ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన వాక్యములు విని వాక్యవిశారదుఁడైన రాముఁడు నవ్వుచు నిట్లనియె: "లక్ష్మణా! వృత్రవధమును వాజిమేధ ఫలమును నీవు చెప్పిన చొప్పుననే జరిగినది. సౌమ్యా! పూర్వము కర్దమ ప్రజాపతికుమారుఁడు బాహ్లీకదేశాధీశ్వరుఁడు శ్రీమంతుఁడు మహా యశుఁడు నగు నిలుఁడనువాఁ డొకఁడు గలఁడు. ధార్మికుఁడగు నాయిల మహారాజు భూమినంతయుఁ దనయధీనముచేసికొని రాజ్యమును మహా నందముగఁ బాలించుచుండెను. లక్ష్మణా! అతనిని దేవతలు, రాక్షసులు, పన్నగులు, గంధర్వులు, యక్షులు మొదలగువా రందఱును గౌరవించు చుండెడివారు. అతనికిఁ గోపము గలిగినచో మూఁడులోకములవారును భయపడుచుండెడివారు. ధర్మాత్ముఁడును వీర్యసంపన్నుఁడును నగు నాతఁ డుత్తమవాఁడుగనేయుండెను. ఆబాహ్లీకదేశాధీశ్వరుఁడు చాలబుద్ధిమంతుఁడు. అతఁ డొకప్పుడు మనోహర మగు చైత్రమాసమున సభృత్యబలవాహనుఁడై యడవికి వేఁటకుఁబోయెను. అట్లుపోయి వేలకొలఁదిగ మృగములను గొట్టెను. అ ట్లెన్ని మృగములను గొట్టినను నతనికిఁ దృప్తి గలుగక పోయినది. ఇట్లనేకమృగములను జంపుచుఁ గుమారస్వామిపుట్టినచోటికిఁ బోయెను. ఆప్రదేశమందుఁ బార్వతీపరమేశ్వరులు తమయనుచరులతోఁ గూడఁ గ్రీడించుచుండిరి. వృషభధ్వజుఁడగుశివుఁడు స్త్రీవేషమును ధరించి దేవి నాపర్వతప్రాంతమున సంతోషింపఁజేయుచుండెను. పురుషరూప ముతో నాయడవిలో నుండు జంతువులు వృక్షములు మొదలుగా స్త్రీ రూపముతోడనే యున్నవి. వేయేల? అచ్చటిదంతయు స్త్రీమయమైయుం డెను. ఇంతలోఁ గర్దమునికుమారుఁడగు నిలమహారాజు మృగములఁ గొట్టుచు నాప్రదేశమునకుఁ బోయెను.

అచ్చటనంతయు స్త్రీమయమైయుండుటయుఁ దానును దనతోడి వారును నిశ్చేయుగుటయుఁజూచి చాలదుఃఖించెను. అదియంతయు శివుని

విలాస మని తెలిసికొని భయపడెను. తరువాత నారాజు సభృత్యబల వాహనుఁడై శివుని శరణు జొచ్చెను. అప్పుడు పార్వతితోఁగూడ శివుఁడు నవ్వి యారాజుతో నిట్లనియె : "రాజర్షి ! ఇలా ! లెమ్ము లెమ్ము. పురుషత్వముచక్కఁ దక్కిన యేవరమైన నడుగుము." ఆమాటవిని రాజు దుఃఖించి యాయనచే నిరాకరింపఁబడినవాఁడయ్యెను బురుషత్వమును దప్ప మఱి యేవరమును గోరఁడాయెను. తరువాత నతఁడు పట్టఁజాలని శోకముతోఁగూడిన మనస్సుచే దేవినిగూర్చి నమస్కరించి "అమ్మా! పార్వతీ! నాయంసు దయ దలఁపుము. నన్ను సౌమ్యదృష్టితోఁ జూడుము. నీవు సర్వలోకములకును దల్లివి; ఈశ్వరివి; వరదులకు వరదురాలవు. నీవరిసెన మెప్పుడును వ్యర్థము గాదు" అని ప్రార్థింపఁగా సర్వాంతర్యామిని యగు నాయంబ యతని యభిప్రాయము దెలిసికొని యీశ్వరునకు సమ్మతమగున ట్లిట్లనియె: "ఓయీ రాజా! నేను సగముశరీరము శివునిసంబంధము గలిగి యున్నాను. సగశరీరము నాయధీనము. కావున మూవలెనే సగము శరీరము పురుషుఁడవు, సగముశరీరము స్త్రీవియగుదువు" అను దేవియొక్క యత్యద్భుతమైన వరము విని రాజు కొంతసంతసించి యిట్లనియె: "దేవీ ! నీకు నాయెడదయయున్న చో నొకమాసము పురుషుఁడుగను,ఒకమాసము స్త్రీగను నుండున ట్లనుగ్రహింపుము" అని కోరఁగా నాయంబ యతని యిష్టమును దెలిసికొని యట్లే యగునని నవ్వుచు వరమిచ్చినది. మఱియు "రాజా ! పురుషుఁడ వైయున్నపుడు స్త్రీత్వమును, స్త్రీవైయున్నపుడు పురుషత్వమును స్మరింపకుండనుందువు." అని యామె చెప్పఁగానే యట్లే సమ్మతించి యారాజు నెలదినములు పురుషుఁడును, నెలదినములు స్త్రీలోక్యసుందరి యగు సుందరిగాను నగుచుండెను.

నిరువ సర్గము

ఇలమహారాజుకథ

ఇట్లు శ్రీరామునిచేఁ జెప్పఁబడిన యిలసంబంధ మగు కథ విని భరతుఁడు లక్ష్మణుఁడు మిక్కిలి యాశ్చర్యపడి వారు చేతులు జోడించుకొని యారాజుయొక్క యాకథను విస్తరించి చెప్పుమని రామునడిగిరి: "అన్నా! ఆరాజట్లు దుర్గతిని బొంది స్త్రీయై యేమేమి చేసెను ? పురుషుఁ డైనప్పు డెట్లుండెడివాఁడు?" అని తమ్ములడుగఁగా రాముఁడత్యద్భుతమయిన యా

తరువాతికథ యథార్థముగా నిట్లు చెప్పుట కుపక్రమించెను. తమ్ములారా! ఆరా జట్లు మొదటినెలలో త్రిలోకసుందరి యగు సుందరియై తనతోడి వారును నట్లే స్త్రీత్వమును వహించి తనవెంట వచ్చుచుండఁగా నాయడ విలో నిచ్చవచ్చినమచ్చునఁ గాలినడకతోనే నడచుచు విహరించెను. ఆసుందరి తనవాహనముల నన్నింటిని సమీపమున నున్న పర్వతస్రాంత మున విడిచివచ్చెను. ఆపర్వతమునకు సమీపమున నొక రమ్యమైన సర స్సున్నది. అందు జలపక్షులు మనోహరముగాఁ గూఁతలిడుచు విహ రించుచుండెను. అచ్చటనే చంద్రునికొడుకు బుధుఁడు తపస్సు చేసికొను చుండెను. అతఁడు రెండవపున్నమచందమామవలె వెలుఁగుచుండెను. అతఁ డాసరోవరములోనుండి ఘోరముగఁ దపమాచరించుచుండెను. మఱియు నతఁడు పూర్ణయౌవనుఁడు, కామమును గలిగించువాఁడునయి యుండెను. ఇట్లామె తనతోపాటు స్త్రీరూపమును ధరించిన సహచరు లతోఁగూడి యాసరస్సులోనికిదిగి సరస్సంతయు క్షోభింపఁజేసినది. బుధుఁ డామెను జూడఁగనే కామబాణపీడితుఁడై యాత్మను నిలుపుకోఁజాలక నీటిలోనికి దిగెను.

త్రిలోకసుందరి యగు నామందగమనచంచమంతయుఁజూచి "ఇంత చక్కని యీచంతిగమన యెవ్వతెయోకదా! ఇంతరూపవంతురాలగు నింతి దేవతాంగనలలోఁగాని, నాగకాంతలలోఁగాని, మఱి యే స్త్రీలలోఁగాని కనియు వినియు నెఱుఁగను. ఇది నాకు దొరకినచో నేనిఁక దేనిని గోరక యుందును" అని యాలోచించి మెల్లఁగా నీటినుండి యొడ్డెక్కెను. అతఁ డాశ్రమములోనికిఁబోయి యాయాస్త్రీలను దనయొద్దకుఁబిలిచెను. వారు పోయి యాయనకు నమస్కరించిరి. ధర్మాత్ముఁడగుబుధుఁ "డామెయెవరు? ఇచటి కెందులకు వచ్చినది? మీరు దాఁచక వృత్తాంతమంతయుఁ జెప్పుఁ" డని యడుగఁగా, వారు మధురాక్షరములుగల యతనిపలుకు లాలకించి యతిమధురముగా నతనికిట్లనిచెప్పిరి: "అయ్యా! ఆమె మాకుఁ బ్రభుత్వ మును వహించియున్నది. ఆమెకుభర్తలేఁడు. కాననాంతరముల మాతోఁ గూడి తిరుగుచుండును" అనియిట్లు వారుచెప్పిన యమృతమొలుకు పలు కులు విని యతఁడు దివ్యదృష్టితో సర్వవృత్తాంతమును గనిపెట్టి యా స్త్రీలతో నిట్లనియె: "సుందరులారా! మీరీకొండప్రాంతమున నెందుల కుండెదరు? మీరీయాశ్రమములో నివాసమేర్పఱుచుకొనుఁడు. ఇచ్చట

నుండి కందమూలాదులచే జీవనవ్యాపారమును గడపుకొనుచుండుడు. ఇచ్చటనుండు కింపురుషులను మీరు భర్తలనుగా వరింపుడు" అనియిట్లు బుధుడుచెప్పినమాటలు విని కింపురుషీకృతలైన యాస్త్రీలందరును నా పర్వతము నాశ్రయించిరి.

89-వ సర్గము

ఇలమహారాజుకథ

భరతుడు లక్ష్మణుడు కింపురుషుల పుట్టుపు విని చాల నాశ్చర్యముగా నున్నవని రామునితో ననిరి. మరల రాముడాకథాశేషము చెప్పుట కుపక్రమించెను. "ఆట్లు బుధుడు కిన్నరస్త్రీలందరును బాటి పోవుటచూచి చీఱునగవు మొగము నలంకరింప రూపవతియగు నాస్త్రీతో నిట్లనియె: 'సొగసైనమొగముగలదానా! నేను చంద్రుని ముద్దుగుమారుడను. వరారోహా! నన్ను భక్తిచేతను, స్నేహదృష్టిచేతను భజింపుము.' జనులులేని యాయాశ్రమమున బుధుడిట్లు పలికిన పలుకులు విని, యేకాకిని యగునిల సురుచిరప్రఖ్యుడును మహాగ్రహామును నగు నతని జూచి యిట్లనియె: 'సౌమ్యా! నేను కామచారిణిని. నేను నీయధీనురాలను. చంద్రతనూజా! నీయిచ్చకువచ్చినమచ్చున నన్నేలుకొనుము' అని యామెచెప్పిన యద్భుతపుమాటలకు సంతోషించి బుధుడామెతోగూడి క్రీడించుచుండెను. అతని కావసంతమాస మతివేగముగా గడచిపోయినది. పిమ్మట నామాసముపోగానే యిల పూర్ణచంద్రనిభాననుడై ప్రక్కనుండిలేచెను. సరోవరములోన దపస్సుచేయుచున్న బుధు నాతడు చూచెను. ఇట్లుచూచి యూర్ధ్వబాహుడు, నిరాలంబుడునగు నాబుధునితో నిలుడిట్లు మాటలాడదొడగెను: "మహాత్మా! నేను బరిజనులతోగూడ నీదుర్గమమగు పర్వతప్రాంతమునకు ప్రవేశించితిని. నాకై నికులెందుబోయిరో కానరాకుండ నున్నారు."

అని యిట్లు నష్టసంజ్ఞుడై పల్కిన రాజుపలుకులాలకించి బుధుడోదార్చుచు మధురముగా నిట్లనియె:"రాజా! నీభృత్యులు కాలవానచే నశించిపోయిరి. వాతవర్షభయార్దితుడవై నీవీయాశ్రమములోన బండుకొంటివి. సమాశ్వసించికొమ్ము. నీకు మేలు గలుగును. నిర్భయుడవై విగతజ్వరుడవుగమ్ము. ఇచ్చట ఫలమూలాశనుడవై సుఖముగా నుండు

ము." ఇట్లుచెప్పిన బుధునిమాటల కాతఁ డూఁటఁ చెంది భృత్యుల నాశన మునకుఁ గుందుచు దీనముగ నిట్లనియె: "నేను భృత్యులులేనిరాజ్యమును విడిచెదను. నాకనుజ్ఞయిచ్చితిరేనిభగవానులవారూ! తృణమాత్రములో వచ్చెదను. ధర్మపరుఁడు శశబిందు వసువాఁడు నాపెద్దకొడుకుగలఁడు.కీర్తి వంతుఁడగు నతఁడు రాజ్యమును బొందుఁగాక! సుఖాన్వితులగు భృత్య దారాదులతో నమంగళవాక్యములను బలుకఁజాలను." ఇట్లు రాజనుచుం డఁగాఁ దరువాత బుధుఁడు సాంత్వపూర్వముగ నీవిచ్చటనుండుట కంగీక రింపుమనియె. మఱియు "మహాబలా! కార్దమేయా! ఇలమహారాజా! నీవు సంతాపమును బొందకుము. నీవొకసంవత్సర మిచ్చటనుంటివేని నీకు హితము చేయించెదను."ఇట్లనికిష్టకర్తుఁడగు బుధుఁడు చెప్పినమాటలు విని యా బ్రహ్మవాది చెప్పినట్లే యచట వాస మంగీకరించెను. ఒకమాసము స్త్రీ యై యతని సంతోషపఱుచుచుండెను. మాసము పురుషుఁడై ధర్మముగ నడచుచుండెను. తరువాతఁ దొమ్మిదవమాసమున నిలాదేవి పురూరవస్సు డను పేరుగల బాలునిఁగనియె.పుట్టఁగానే యాబాలుని తండ్రిచేతిలో నప్ప గించెను. అతఁడు తండ్రితో సమానముగా నుండెడివాఁడు. బుధుఁడు పురుషీభూతుఁ డగు నతనిని ధర్మయుక్తములగు కథలు చెప్పి సంతోష పఱుచుచుండెను.

90-వ సర్గము

ఇలమహారాజుకథ

ఇట్లురామునఁ డాయద్భుతమైన యతనిజన్మవృత్తాంతమునుజెప్పఁగా మహాయశులగు భరతుఁడు, లక్ష్మణుఁడు నిట్లనిరి: "అన్నా! ఆయిల యట్లు బుధునియొద్ద సంవత్సరముండి యేమిచేసెనో నీవాసంగతిచెప్పుదువుగాక!" యని తమ్ము లడుగఁగా, నిలమహారాజుకథను రాము: డిట్లని చెప్పెను: "ఆయిల పురుషత్వమును బొందఁగానే పరమబుద్ధిశాలి యగు నాబుధుఁడు పరమమోదాయుఁడగు సంవర్తుని రావించెను. భృగుపుత్రుఁడగు చ్యవనుని, మఱియు నరిష్టనేమి యను నతనిని, మోదకరుఁ డగు ప్రమోదనుని, దుర్వాసోమునినిగూడ రావించెను. ఇట్లందఱిను రప్పించి వాక్యకోవిదుఁ డగు సతఁడు ధైర్యముగలవారును సావధానచిత్తులును స్నేహితులును నగు నాతత్త్వదర్శులను జూచి యిట్లనియె. మహాబాహుఁ డగు నీరాజు

కర్దమప్రజాపతికుమారుఁడగు నిలుఁడు. ఇతనియవస్థ మీరంబటును దెలిసి కొని యితనికి మేలుచేయుఁడు. వారట్లుమాటలాడుకొనుచున్నుండఁగానే మహాతేజశ్శాలియగు కర్దముఁడు బ్రాహ్మణులతోఁగూడి యాయాశ్రమము లోనికి వచ్చెను. పులస్త్యుఁడు, క్రతువు, వషట్కారుఁడు, ఓంకారుఁడు మొదలగువా రాయాశ్రమములోనికి వచ్చిరి. పరస్పరసమాగమముపలన వారంబటును సంతోషించిరి. వారంబటును నిలునికి హితమును గోరుచు నెవరిబుద్ధికిఁ దోఁచినట్లు వా రుపన్యసించిరి. అపుడు కర్దముఁడు సుతుని కొఱకుఁ బరమహితముగా నిట్లనియె: "బ్రాహ్మణులారా! నావాక్యము వినుఁడు. అది యీరాజునకు హితమగును. ఈశ్వరునికంటె నితరమయిన మందు వీనిరోగమునకు నాకుఁగనుపడ లేదు. అశ్వమేధముకంటె నెక్కువ యాగము లేదు. అది యామహాత్మునకుఁ బ్రియమైనది. కనుక మనమందఱము నీరాజుకొఱకు యజ్ఞమును జేయుదము."

ఇట్లు కర్దముఁడు చెప్పఁగానే యా బ్రాహ్మణులందఱును హయమేధ ముచే శివుని నారాధించుట కంగీకరించిరి. సంవర్తుఁడును రాజర్షిశిష్యుఁ డును పరపురంజయుండును బ్రసిద్ధుఁడును నగు మరుత్తుఁ డాయజ్ఞము నారంభించెను. పిమ్మట బుధునియాశ్రమం దాయజ్ఞము గొప్పగ జరిగి యీశ్వరునికిఁ జాల సంతోషమును గలిగించినది. ఇట్లు యజ్ఞము పూర్తి కాఁగానే సంతోషించి యుమాపతివచ్చి యిలునియొద్దనే యా బ్రాహ్మణు లందఱితోడను నిట్లనియె: "ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! మీరుచేసిన యశ్వ మేధమువలనను మీభక్తికిని జాలసంతోషించితిని. ఈయిలమహారాజున కేమిచేయుమందురో చెప్పుఁడు" అని యిట్లు శివుఁడు చెప్పఁగా, నా బ్రహ్మర్షులు సావధానచిత్తులై యిల పురుషుఁడగునట్లు వరముగోరిరి. తరువాత శివుఁడు సంతోషించి మరలఁ బురుషత్వము నొసఁగెను. ఇట్లు వరమిచ్చి శివుఁ డంతర్ధానము నొందెను. అశ్వమేధము పూర్తియై శివుఁడంతర్ధానము నొందఁగా దీర్ఘదర్శులగు బ్రహ్మర్షులందఱును తరలిపోయిరి. ఇలమహారాజు బాహ్లికదేశమును నిడిచి యుత్తమమగు మధ్యదేశమునందలి యశస్కర మగు ప్రతిష్ఠానపురములో నివసించెను. శశబిందుఁడు బాహ్లికదేశమును, ఇలమహారాజు ప్రతిష్ఠానపురమును బాలించుచుండిరి. మఱికొంతకాలము నకు మహాత్ముఁడగు నిలమహారాజు బ్రహ్మలోకమునకుఁ బోయెను. తదు వాతఁ బురూరవసుఁ డాప్రతిష్ఠానమున కధిపతియాయెను. తమ్ములారా!

అశ్వమేధప్రభావ మిట్టిది. ఆయిలుఁడు స్త్రీభూతుఁడై యశ్వమేధప్రభావమువలన దుర్లభమైన పురుషత్వమును మరలఁ బొందెను.

91-వ సర్గము

శ్రీరామునియశ్వమేధప్రారంభము

శ్రీరాముఁ డిట్లు తమ్ములతో నిలమహారాజుకథచెప్పి లక్ష్మణునితో ధర్మయుక్తముగా నిట్లనియె: "వసిష్ఠుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని, సర్వశ్రేష్ఠులును అశ్వమేధప్రవర్తకులునుగను బ్రాహ్మణులనురావించి వారితో నాలోచించి లక్షణసంపన్నమైన యశ్వమును విడిచెద"నను రామునిమాట విని త్వరతోఁ గూడినవాఁడై లక్ష్మణుఁడు బ్రాహ్మణాదులను రావించి శ్రీరామునికిఁ జూపించెను. వారు దేవసంకాశుఁడును, తమకు నమస్కరించినవాఁడును, దురాధర్షుఁడును నగు రాముని నాశీర్వదించిరి. అపుడు రాముఁడు చేతులు జోడించుకొని యాఁబుషులతోఁ దన యశ్వమేధసంకల్పమునుఁ జెప్పెను. వా రామాట విని, శివునకు నమస్కరించి యశ్వమేధమును మిగుల నభినందించిరి. అశ్వమేధము నభినందించు నాబుషులమాటలు విని రాముఁ డెంతయు సంతుష్టాంతరంగుఁడాయెను. అపుడు రాముఁడు వారు చేయఁదలఁచినదానిని దెలిసికొని లక్ష్మణునితో నిట్లనియె: "లక్ష్మణా! మహోత్సుఁడగు సుగ్రీవునియొద్దకు శీఘ్రముగా దూతలను బంపుము. నీవు సపరివారముగా యజ్ఞోత్సవము ననుభవించుటకు రమ్మని చెప్పుము. రాక్షసులతోఁగూడి విభీషణుఁడుగూడ నశ్వమేధమునకు వచ్చునట్లు వెంటనే వార్తలంపుము. నాకు మేలుచేయు రాజుల నందఱను శీఘ్రముగా వచ్చునట్లు చేయుము. వారు సపరివారముగా యజ్ఞమును జూచి సంతోషింతురుగాక! నానాదేశములయందు వసించు నుత్తములగు బ్రాహ్మణులను లక్ష్మణా! అశ్వమేధమునకై రావింపుము. తపోధనులగు బుషులనందఱను రప్పింపుము. దేశాంతరములయందలి గృహస్థులను బుత్రదారసమేతముగా రప్పింపుము. మఱియు గాయకులు, నటకులు, నర్తకులు మొదలగువారిని రప్పింపుము. నైమిశవనమందు గోమతియొడ్డున యజ్ఞవాటము సిద్ధము చేయింపుము. అది తమ్ముఁడా! మహాపుణ్యవంతమైన ప్రదేశముగదా! అంతటను శాంతులు జరిగింపుము. అనుత్తమము, మహాయజ్ఞము నగు నీయశ్వమేధమును నైమిశవనములో

గోమతీతీరమునఁ జేయుదానిని జూచి సంతోషించుకొఱకు ధర్మజ్ఞులగు వారిని పిలువకొలఁది రప్పింపుము. వారు సంతోషించులాగునఁ బుష్టిని బొందులాగునను, యథావిధిగ గౌరవింపఁబడులాగునను జేయుము. వేల కొలఁది బండ్లతో ధాన్యము, బియ్యము, తిలలు, పెసలు మొదలగు నవియుఁ; సెనగలు, ఉలవలు, మినుములు, లవణము వీనికిఁ దగినట్లు చమురు, సంక్షేపముగా గంధము మొదలయినవి పంపుము. ఇఁక సువర్ణము కోట్లకొలఁదిగాఁ బంపించుము. ఆయా సామగ్రియంతయు భరత పురస్సరముగా జాగ్రత్తగాఁ బంపుము. మధ్యమధ్య నంగడివీథు లుండునట్లు చేయించుము. నటులు, నర్తకులు, వంటవాండ్రు మొదలగువారిని, వయసులో నున్న యువతులను భరతునితోఁ బంపుము. పౌరులు, బాల వృద్ధులు, సావధానులగు ద్విజులు, పనిపాటులవాండ్రు, శిల్పులు మొదలగువారినిగూడఁ బంపుము. మనతల్లులను, అంతఃపురస్త్రీలను బంగారుతోఁ జేయఁబడిన నాభార్యను భరతునివెంటఁ బంపుము. అని యిట్లు చెప్పి, తోడనే యతఁడు విలువగల రాజసదనములను రాజులకును వారి యనుచరులకును యథోచితముగ నేర్పాటుచేయు" మనెను.

12-వ సర్గము

శ్రీరామునియశ్వమేధము

భరతాగ్రజుఁడగు రాముఁ డిట్లంతయు వేగముగఁ బంపునట్లుచేసి లక్షణసంపన్నమును, కృష్ణవర్ణప్రధానమును నగు గుఱ్ఱమును విడిచెను. కొందఱు ఋత్విజులతోఁగూడ లక్ష్మణుని గుఱ్ఱమును గాపాడుటకై నియోగించి సైన్యముతోఁగూడి నైమిశమునకుఁ బోయెను. మహాబాహుఁడగు రాముఁడు పరమాద్భుతమగు యజ్ఞవాటమునుజూచి చాల సంతోషించెను. రాజులెల్లరును నైమిశారణ్యములో నున్న శ్రీరామునకుఁగాను కలు విశేషముగా సమర్పించిరి. అని పుచ్చుకొని రాముఁ డవారిగ వారిని గౌరవించెను. ఆయాయి రాజసదనములయం దారాజులను పరివారముతోఁ గూడియుండునటు లాజ్ఞాపించెను. వచ్చిన రాజులకును వారి పరిజనులకును భరతశత్రుఘ్నులన్నపానాదికములు యథోచితముగ నిచ్చుచుండిరి. సుగ్రీవాదివానరులు వచ్చిన బ్రాహ్మణాదులకు వినయముతో భోజనసదుపాయములు చేయుచుండిరి. విభీషణుఁడు తన పరిజనులతోఁ

గూడి యుగ్రతపస్వులగు ఋషులను బూజించుచుండెను. ఈరీతిగా నా యశ్వమేధము మంచియేర్పాట్లుగలదియై ప్రవర్తిల్లుచుండెను. లక్ష్మణునిచే నభిగుప్తమై హయసంచారమును ప్రవర్తిల్లుచుండెను. ఆరాజసింహునియజ్ఞమిరీతిగా జరుగుచుండెను. ఆమహాత్ముని హయమేధములో నేదియు లేదను శబ్దమే లేదు. అందఱు యాచకులును మాకిది నక్కఱ-అ లేదన్న మాటయేకాని, మాకింకను కావలయునని యొక్కరును నడుగరైరి. అట్లు తృప్తిగలుగునట్లు భోజనపదార్థములు సర్వజనులకును వడ్డించుచుండిరి. భుజించువారి పెదవులుదాఁటి పైకి మాటరాకుండఁగనే వానరులు, రాక్షసులు వారివారికిఁ గావలసిన వస్తువులను సమృద్ధిగా వడ్డించుచుండిరి. ఆయజ్ఞములో మలినుఁడుగాని దీనుఁడుగాని దరిద్రుఁడుగాని కనుపడఁడు. ఆరామునియజ్ఞములో నందఱును సంతోషముతోఁ గూడియేయుండెడివారు. అచ్చటికివచ్చిన చిరజీవులగు ముని లిట్టియజ్ఞము స్మరింపరయిరి. ఏమన నిట్టియజ్ఞ మిదివఱకెన్నఁడును జరిగియుండలేదు. సువర్ణముగావలసినవారికి సువర్ణము, ధనము గావలసినవారికి ధనము, రత్నములుగావలసినవారికి రత్నములు, వెండి గావలసినవారికి వెండి, మాణిక్యములు గావలసినవారికి మాణిక్యములు, వస్త్రములు గావలసినవారికి వస్త్రములు బాత్రింబవళ్లు లొక్కమాదిరిగా నిచ్చుచునేయుండిరి. ఆయావస్తువులు కొండలపొడువున రాసులు పోయించి పంచిపెట్టుచుండిరి. తపోధనులు దేవేంద్రునియజ్ఞము గాని, కుబేరునియజ్ఞము గాని, యముని యజము గాని, వరుణుని యజ్ఞముగాని యెప్పుడును నీరీతిగా జరిగియుండలేదని చెప్పుకొనుచుండిరి. ఎక్కడఁ జూచినను వానరులే, యెచ్చటఁ జూచినను రాక్షసులే యగపడుచుండిరి. వారు యాచకులకు వస్త్రములు, ధనము, అన్నము మొదలగునవి తృప్తిగా నిచ్చుచుండిరి. రాజసింహుఁడగు రామునియజ్ఞము సర్వగుణసమృద్ధమై యిట్లు జరుగుచుండెను. ఇట్లు సంవత్సర మొక్కరీతిగా జరిగినదిగాని యొకిదానికిని లోపము గనుపడలేదు.

93-వ సర్గము

వాల్మీకి కుశలవుల రామాయణము గానముచేయు మనుట

ఇటువంటి పరమాద్భుతమైన యజ్ఞము జరుగుచుండఁగా మునిపుంగవుఁడగు వాల్మీకిభగవానుఁడు శిష్యసహితముగా నచ్చటకి విచ్చే

నెను. అతఁడు దివ్యసంకాశము, అత్యద్భుతోపక్రమమునగు యజ్ఞమును జూచి యేకాంతమందు ఋషివాటికలోని పర్ణశాలలో నివసించెను. ఫల మూలాదులతో నిండిన యనేకము లగు శకటములు వాల్మీకి పర్ణశాలకు సమీపమున నుండెను. ఆవాల్మీకిమహాముని ని శ్రీరాముఁడును, మహాత్ము లగుమునులును పూజించిరి. ఇట్లు పూజితుఁడై యతఁడు పర్ణశాలలో సుఖముగా నివసించెను. ఆతఁడు పరమానందభరితుఁడై శిష్యులను బిలిచి "మీరు సావకాశముగా రామాయణకావ్యమంతయుఁ బరమసంతోష ముగా గానముచేయుఁడు. పుణ్యపుణ్యములగుఋషివాటములయందును, బ్రాహ్మణులయిండ్లయందును, రథ్యలయందును, రాజమార్గములయందును, రాజులవిడిదులయందును, శ్రీరామునియజ్ఞవాటమునందును, ఋత్విజు లుండుచోటులను విశేషముగ గానముచేయుచుండుఁడు. ఇవిగో ఫల ములు నానావిధము లైనవియుఁ రుచికరములునునై యున్నవి. ఇవి పర్వతా గ్రములయందుఁ బుట్టినవి. మీకాఁకలియగునపు డివి తిని గానము చేయు చుండుఁడు. వత్సలారా! మీరు శ్రమపడకుఁడు. ఈఫలములు దుంపలు తిని యీనగరమునకు బయట నుండుఁడు. మీపాట వినుటకుఁ గోరిక గలిగి రాముఁడు పిలిపించినచోఁ దప్పక వెళ్లి ఋషులందఱును గూర్చుండి వినుచుండఁగా గానముచేయుఁడు. దినమున కిరువదిసర్గములవంతున మధు రముగా గానముచేయుఁడు. నేను బూర్వము బహుప్రమాణములతో నుద్దేశించినరీతి విడువకుఁడు. ధనమందు స్వల్పమును లోభపడకుండుఁడు. వత్సలారా! ఆశ్రమములలో నుండి ఫలములచేతను, దుంపలచేతను జీవిం చెడు మనకు ధన మెందులకు? మీ రెవరిబిడ్డ లని యొకవేళ రాముఁ డడిగినచో 'మేము వాల్మీకిభగవానుని శిష్యుల' మని రామునితోఁ జెప్పుఁడు. మీరిద్దఱును నిర్భయముగా నీతంత్రులు మధురమైనవి కనుక ముందు నేను జెప్పిన చొప్పున మూర్ఛనలుచేసి యతిమధురముగాఁ బాడుఁడు. మొదటినుండియుఁ బాడుఁడు. రాజు నవమానపఱుపకుఁడు. వత్సలారా! ధర్మమునుబట్టి రాజేగడా సర్వభూతములకును దండ్రి. కనుక మీరిద్దఱును రేపు ప్రభాతమునుండి తంత్రీలయసమన్వితముగా మధురముగ గానముచేయుఁడు" అని యిట్లు వాల్మీకిమహాముని హారి కనేకవిధములుగ బోధపఱిచి యూరకయుండెను. ఇట్లు నియమింపఁబడిన సీత కొడుకు లిద్దఱును "తాతగారూ! అట్లే చేయుదుము" అని బయటికి

బోయిరి. ఇట్లద్భుతముగా మధురముగా వాల్మీకిభగవానుఁడు చెప్పిన మాట లాకుమారులు మనస్సున సుంచుకొని యశ్వినీదేవతలవలె సము త్సుకులై యారాత్రి నెట్లో కడపిరి.

94-వ సర్గము

కుశలవులరామాయణగానము

ఆకుమారు లిద్దఱును రాత్రి వెల్లవాటినతోడనే స్నానాదికృత్య ములు దీర్చుకొని వాల్మీకిమహాముని చెప్పినచొప్పున గానముచేయుట కుప క్రమించిరి. పూర్వాచార్య వినిర్మితమును, అపూర్వమును, గేయముతో నలంకరింపఁబడినదియు, అనేకప్రమాణములతోఁగూడినదియు, తంత్రీలయ సమన్వితమునగు నాపాతజాతిని బాలుకవలన విని రాముఁడు కౌతూ హలపరుఁడాయెను. పిమ్మట యజ్ఞము సమాప్తికాఁగా నవకాశసమయమున రాజగు రాముఁడు మహాములులను, రాజులను, పండితులను, పౌరులను, పౌరాణికులను, శబ్దవిదులను, వృద్ధులగు బ్రాహ్మణులను, స్వరములలక్ష ణము దెలిసినవారిని, ఉత్సుకులగు ద్విజసత్తములను, లక్షణజ్ఞులగు సంగీత విద్వాంసులను, పాదాక్షరసమానముల నెఱిఁగినవారిని, ఛందస్సు బాగుగఁ దెలిసినవారిని, కలలు మాత్రలు దెలిసినవారిని, జ్యోతిష్కులను, క్రియా కల్పవిదులను, కావ్యములు బాగుగాఁ దెలిసినవారిని, భాషాజ్ఞానము గల వారిని, ఇంగితమెఱిఁగినవారిని, హేతూపచార కుశలులను, మాటల యందు నేర్పుగలవారిని, వైదికులను, చిత్రజ్ఞులను, వృత్తములు సూత్ర ములు దెలిసినవారిని, గీతనృత్యవిశారదులను, శాస్త్రజ్ఞులను, నీతి నిపుణు లను, వేదాంతార్థములను దెలిసినవారిని నొక్కచో సమావేశము చేయించి యాబాలకులచే గానము చేయించెను. రాజులు మునులు రాజును గాయ కులను కన్నులతోఁ ద్రాగివేయుచురా యనునట్లు చూడ మొదలిడిరి. "ఇద్దఱును రామునితో సమానముగా నున్నారు" అనియు, "బింబము నుండి బింబము పుట్టినట్లున్నది" అనియు నొండొరులతోఁ జెప్పుకో మొద లిడిరి వీరు జడలనుధరించి నారచీరలు కట్టుకొనకుండ నుండినచో వీరికిని రామునకును భేదమే తెలియకపోవు ననుకొనిరి. ఇట్లు సంతోషవృద్ధియగు నట్లుగా శ్రోతలు మాటలాడుకొనుచుండఁగా నాయిద్దఱు మునికుమారు

లును గాన ముపక్రమించిరి. అపు డతిమానుషమైన సంగీతము మధుర ముగాఁ బ్రవర్తించినది. ఆగానము విన్న వారి కెవ్వరికిని తృప్తిగలుగకపోయి నది. నారదుఁడు వాల్మీకికిఁ జెప్పిన మొదటిసర్గ మొదలుకొని యిరువది సర్గలవఱకును బాడిరి.

రాముఁ డిట్లుపరాహ్ణమువఱకును బాడిన యిరువదిసర్గలును విని తమ్మునితోఁ నిట్లనియెఁ: "తమ్ముఁడా! ఈబాలకుల కతివేగముగాఁ బదునెని మిదివేలు సువర ము లిము. మఱియు నేది గావలయు నందురో యదియు నిమ్ము." అన్నయాజ్ఞ కాఁగానే తమ్ముఁ డాయిద్దఱకును వేఱువేఱుగా నీయఁబోయెను. ఆగాయకులు భరతుఁడీయఁబోయిన సువర్ణములు పుచ్చు కోక యవి చూచి యాశ్చర్యపడి "ఇవి యెందులకు? మేము వనవాసు లము. మూలములచేతను ఫలములచేతను జీవించువార లము. వనములో నుండు మేము మీరిచ్చిన సువర్ణముచేతను హిరణ్యముచేతను నేమిచేయఁ గలము?" అనిరి. వారిట్లుచెప్పఁగానే యాసభలోని శ్రోతలు రాముఁడును గూడ మిగుల నాశ్చర్యపడిరి. రాముఁ డా కావ్యమునొక్క యాగమ ముసు వినఁదలఁచినవాఁడై యామునిబాలకుల నిట్లడిగెను. "బాలకు లారా! ఈ కావ్య మెంత ప్రమాణము గలది? ఈ కావ్యమును రచించిన మహానుభావుఁడెవ్వరు? ఆయన యెచ్చటనున్నా ఁడు?" అనియడిగిన రాము నకు బాలకులిట్లనిరి. "ఈకావ్యమును వాల్మీకిభగవానులవారు రచించిరి. వా రీయజ్ఞములోనికి దయచేసియున్నారు. ఇది యిరువదినాలుగువేలు శ్లోకములుగలది. ఇం దుపాఖ్యానశతముగలదు. మొదటినుండి యయిదు వందలసర్గములు గలవు. నీ ఉత్తరకాండముతో నిం దేమకాండములు గలవు. ఇది నీచరితము. దీనిని మాగురుభగవానులవారు రచించి మాకుఁ బాఠముచెప్పిరి. మహారథా! ఇది వినవలయునని కుతూహలముండినచో నవకాశము వెంట నీవు నీయనుజులతోఁగూడి వినుచుండుము." అని వారు చెప్పఁగా "మంచిదే"యని వారికి సెలవిచ్చి పంపెను. వా రటు లాము నితోఁజెప్పి వెంటనే వాల్మీకియున్న చోటికిఁబోయిరి. రాముఁడును మునుల తోడను రాజులతోడను వారు గానము చేసిన చరిత్రను విని యజ్ఞశాల లోనికిఁ బోయెను. ఇట్లు తాల లయోపపన్నము సర్గాన్వితము స్వరశబ్ద యుక్తము తంత్రీలయవ్యంజనయోగయుక్తము నగు నాకుశలవులు పాడిన చరిత్రమును రామాదులందఱును విని సంతోషించిరి.

95-వ సర్గము

రాముఁడు సీతను శపథముచేయఁ గోరుట

రాముఁడీరీతిగా వారిగానమును మునులతోడను రాజులతోడను గూడి చాలదినములు వినెను. ఆగీతముల సందర్భమున నాగాయకులను సీతాపుత్త్రులనుగాఁ దెలిసికొని యాసభలో రాముఁడు శుద్ధసమాచారము గల దూతలను దనబుద్ధిచేతనే యాలోచించి రావించి యిట్లనియె: "దూతలారా! వాల్మీకిభగవానులవారిసన్నిధి కేఁగి నేనన్నట్లు చెప్పుఁడు. సీత శుద్ధసమాచారురాలును వీతకల్మషయు నైనచో వాల్మీకిభగవానుల వారి యనుమతిపై నిచ్చటికివచ్చి తనశుద్ధినిఁ జూపించుఁగాక! మునిభగవానులవారియభిప్రాయమును సీతయభిప్రాయమును దెలిసికొనివచ్చి నాతోఁ జెప్పుఁడు. నానమ్మికకొఱకు రేపటిప్రభాతమున నీసభలో జానకి శపథ మాచరింపవలయును." ఇట్లనిచెప్పిన రామునిమాటలువిని దూతలు వాల్మీకిమహాముని యుండు బుషివాటికకుఁ బోయిరి. వారు మునికి నమస్కరించి రాముఁడుచెప్పినమాటలన్నియు మృదువుగను మధురముగను జెప్పిరి. ఆయన వారిమాటలువిని రాముని యభిప్రాయము దెలిసికొని వారితో నిట్లనియె: "అట్లేయగుఁగాక. మీకు భద్రమగుఁగాక! రాముఁడన్నప్రకారమే సీతశపథముచేయఁగలదు. స్త్రీలకుఁ బతియేకదా దైవము." అని యాయన చెప్పఁగానే దూతలు రాముని యొద్దకు వచ్చి యట్లే విన్నవించిరి. ఆమహాత్మునియంగీకారమును విని రాముఁడు సంతోషించి యచ్చటఁ గూడియున్న మునులను రాజులను జూచి యిట్లనియె: శిష్యులతోఁగూడిన మునీంద్రులారా! సపరివారులగు రాజేంద్రులారా! సీతా శపథమును జూచెదరుగాక! ఇంకను గోరినది యున్నచో నదియు జరుగును" అని యిట్లు రాముఁడనఁగానే మునిముఖ్యులందఱును సాధువాదములు పలికిరి. రాజులును రామునిఁ బ్రశంసించిరి. "నరశ్రేష్ఠా! ఇది నీకే తగియున్నదిగాని మఱొకరికిఁ గాదు." రేపంతయు జరుగునని రాముఁడు నిశ్చయము చేసికొని నాఁటికి సభ చాలించెను. సభలోనివా రందఱును దమతమ నివాసములకుఁ బోయిరి.

96-వ సర్గము

వాల్మీకి సీత పరిశుద్ధురా లని చెప్పుట

తరువాత దెల్లవాఱుగానే రాముఁడు యజ్ఞవాటములోనుండి మునీశ్వరులనందఱను బిలిపించెను. వసిష్ఠుఁడు, వామదేవుఁడు, జాబాలి, కాశ్యపుఁడు, దీర్ఘతపుఁడగువిశ్వామిత్రుఁడు, మహాతపశ్శాలియగు దుర్వాసుఁడు,పులస్త్యుఁడు,శక్తి,భార్గవుఁడు, వామనుఁడు,దీర్ఘాయువగుమార్కండేయుఁడు, మహాయశుఁడగు మౌద్గల్యుఁడు, గర్గుఁడు, చ్యవనుఁడు, ధర్మవిదుఁడగు శతానందుఁడు, తేజస్వియగు భరద్వాజుఁడు, సుప్రభుఁడగు నగ్నిపుత్రుఁడు, నారదుఁడు, పర్వతుఁడు, మహాయశుఁడగు గౌతముఁడు, కాత్యాయనుఁడు సుయజ్ఞుఁడు తపోనిధియైన యగస్త్యుఁడు మొదలగు మునులందఱును కౌతూహలముతోఁ గూడినవారైవచ్చిరి. రాక్షసులును వానరులును వచ్చియుండిరి.నానాదేశములనుండివచ్చిన నాలుగువర్ణముల వారును వచ్చియుండిరి. ఇట్లందఱును గూడియున్నారనివిని వాల్మీకిమహాముని సీతను దోడ్కొని సభకు వచ్చెను. రామునిహృదయపద్మమునందుంచుకొని, బ్రహ్మదేవునివెంట వచ్చు శ్రుతి వాల్మీకిమహాముని వెనుక వచ్చు సీతాదేవినిఁజూచి యందఱును సాధువాదములు పలికిరి. దుఃఖము వలనఁ గలిగి మిన్నుచ్చయిన శోకముచే నాకులపడువారి హాలహాలాశబ్దము వ్యాపించినది. 'రామా! సాధు!' అని కొందఱు, 'సీతా! సాధు!' అని కొందఱును బ్రశంసించిరి. రెండుతెగలవారును బ్రేక్షకులై యాక్రోశించిరి. తరువాత నాజనసంఘుమునధ్యను సీతతోఁగూడ వాల్మీకిమహాముని ప్రవేశించి రామునితో నిట్లనియె: "రామా! ఈసీత సుప్రతిష్ఠురాలు; ధర్మచారిణి; లోకాపవాదమునకు భయపడి నాయాశ్రమసమీపమున విడువఁబడినది. లోకాపవాదమునకు భయపడిన నీకు నమ్మికగలుగునిమిత్తమై శపథము చేయును. కావున నీవామె నంగీకరింపవలయును. ఈబిడ్డలిద్దఱును సీతకొడుకులు. వీరిసంగతి యిట్టిదని చెప్పరాదు. కవలలుగాఁ బుట్టిరి. నేను యథార్థముగాఁ జెప్పుచున్నాను. రఘునందనా! నేను ప్రచేతసునికడియవ కుమారుఁడను. నే నసత్యమాడినట్లు స్మరింపను. వీరు నీకొడుకులు. నేను బహువర్షసహస్రములు తపమాచరించితిని. ఈసీత దుష్టచిత్తురాలే యగునేని యాతపస్సునొక్కబలము నేననుభవించువాఁడనుగాను. నేను పంచ

భూతములు, నాయంతఃకరణము సాక్షులుగా సీత పరిశుద్ధురాలే యని యడవిలోనుండి నాయాశ్రమములోనికిఁ దోడ్కొ-నిపోతిని. ఈమె శుద్ధ సమాచార; పాపమెఱుఁగనిది; పతిదేవత. లోకాపవాదభీతుఁడవయిన నీకు నమ్మకము కలిగింపఁగలదు. కావున నోరామా! ఈమె శుద్ధాంతఃకరణురాలు. నేను దివ్యదృష్టితోఁజూచితిని. లోకాపవాదకలుషీకృతచిత్తుఁడవై విడిచితివి. పరిశుద్ధురా"లని నీవునుహృదయపూర్వకముగానెఱుఁగుదువు.

97-వ సర్గము

సీత పాతాళమునకుఁ బోవుట

ఇట్లు వాల్మీకి చెప్పిన మాటలు విని రాముఁడు చేతులు జోడించుకొని సభామధ్యమున్న సీతనుజూచి యిట్లనియె : "వాల్మీకిమునీంద్రా! ధర్మవిదులగు తాము సెలవిచ్చినసంగతులన్నియు యథార్థములు. అకల్మషములగు తమవాక్యములచేతనే నాకు నమ్మికగలిగినది. పూర్వమే లంకలో దేవతలసన్నిధిలో నగ్నిసాక్షిగా నమ్మకగలిగినది. అపుడు నమ్మిక కలుగుట చేతనే యింటికిఁ దోడుకొనివచ్చితిని. క్రమముగా లోకాపవాదము ప్రబలమైనది. విధిలేక విడిచితిని. నిర్దోషురాలని యెఱిఁగియుండియు మునీంద్రా! లోకాపవాదమునకు భయపడి సీతను విడిచితిని. నాయీ యపరాధమును మన్నింతురుగాక! వీరిద్దఱు కవలఁబుట్టు నాకుమారులని యెఱుఁగుదును. ఈసభలో శుద్ధురా లైన జానకియందు నాకుఁ బ్రీతి గలుగుఁగాక!" రామునియభిప్రాయమును దెలిసికొని యాసీతశపథమును జూచుటకై యింద్రాదిదేవతలు బ్రహ్మను బురస్కరించుకొనివచ్చిరి. మఱియు నాదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినీదేవతలు, గంధర్వులు, అప్సరసలు, సాధ్యులు, విశ్వేదేవతలు, పరమఋషులు, పన్నగులు, సుపర్ణులు, సిద్ధులు మొదలగువారు సంతుష్టాంతరంగులై సీతశపథమువిషయమై సంభ్రాంతులైవచ్చిరి.అపుడందఱనుజూచి రాముఁడిట్లనియె. "సురశ్రేష్ఠురాలా! అకల్మషములైన ఋషివాక్యములచేత నీసభామధ్యమున శుద్ధురాలైనసీతయందు నాకుఁ బ్రీతిగలుగుఁగాక."అపుడు శైత్యసౌరభ్యమాంద్యములతోఁగూడినవాయు వాసభవారిమీఁదఁ బ్రసరించి సంతోషింపఁజేసెను. వచ్చినవారందఱును నిది యత్యద్భుతమని ప్రసంగించిరి. ఇట్లు సమస్తజనులచేతను నిండియున్న యాసభలో సీత కాషాయవస్త్ర

ముసు గట్టుకొని చేతులు జోడించుకొని తలవంచుకొని నేల చూచుచు నిట్లనియె: "నేను రాముని కంటె నితరుని మనసుచేఁగూడఁ జింతింపక యుంటినేని, మాధవపత్నియగు భూదేవి నాకు దారియిచ్చుఁగాక. మనో వాక్కాయములచేతను నేను రాముని బూజించుచుంటినేని మాధవత్ని యగు భూదేవి నాకు దారియిచ్చుఁగాక. నేను రాముని కంటె నన్యు మెఱుఁగకుంటట సత్యమేని మాధవపత్నియగు భూదేవి నాకు దారి యిచ్చుఁగాక." సీత యిట్లు పలుకుచుండఁగా భూమిలోనుండి దివ్యసింహా సన మొకటి యత్యద్భుతముగా వచ్చినది. దానిని బలవంతు లగు నాగ కుమారులు మోసికొనివచ్చిరి. మొదలే యది దివ్యమైనది. పైని దానిని మఱింత నాగకుమారుల శిరోరత్నములు వెలిగించుచున్నవి. ఇక దాని సొగసు చెప్పుటకు సాధ్యమగునా? భూదేవి సీతను రెండుచేతులతోఁ బట్టుకొని స్వాగతముచే నభినందించి యాసింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టినది. ఆసింహాసనము సీతను దీసికొని పాతాళలోకమునకుఁ బోవుచుం డఁగా నాకసమునుండి పుష్పవర్షము గురిసినది. వెంటనే దేవతలు లేచి సాధువాదములు చేసిరి. "సీతా! నీశీల మిట్టిదా? ఎం తని కొనియాడఁ గలము?" అని ప్రశంసించిరి. ఇట్లు దేవతలంతరిక్షమునందుండి సీతాపా తాళమునకుఁ బోవుట చూచి సంతోషించుచుఁ బలికిరి. ఆమజ్జనవాటమునం దున్న మునులందఱును రాజులు మొదలగువారును విస్మయసముద్రము లోనే మునిఁగిపోయిరి. అంతరిక్షమునందును భూమియందును స్థావర ములు జంగమములు రాక్షసులును పాతాళములోని పన్నగులును కొందఱు సంతోషించుచుఁ గేకలువైచిరి. కొందఱు ధ్యానమున మునిఁగి యుండిరి. కొందఱు రాముని వైపు చూచుచుండిరి. కొందఱు దీనులై సీతవైపు చూడ మొదలిడిరి. సీత పాతాళమునకుఁ బోవుట చూచి జగ మంతయు నిట్లు క్రమముగా సమ్మోహమును బొందిపోయినది.

93-వ సర్గము

బ్రహ్మ రాము నోదార్చుట

సీత రసాతలమునఁ బ్రవేశించిన వెంటనే వానరులందఱును నేడి చిరి. "సాధ్వీ జానకి! సాధు! సాధు!" అని ముసలు రాముని సన్నిధిని ప్రశంసించిరి. రాముఁడు కన్నుల నీరు గ్రమ్ముచుండఁగా దండకాష్ఠమొకటి

యూఁతగొని తలవంచుకొని దీనచిత్తుఁడై మిగుల దుఃఖించుచుండెను. అతఁడు చాలసేపునకును నేడిచి కన్నుల నీరు కాల్వలుగట్టఁ గ్రోధశోక ములతోఁగూడి యిట్లనియె: "నే నిట్టిదుఃఖ మెపుడును నెఱుఁగను. ఇది నామనస్సునకు బాగుగా నాటిన ట్లున్నది. రూపమును ధరించి వచ్చిన లక్ష్మివంటిసీత చూచుచుండఁగనే మఱిగిపోయినది. పూర్వము సముద్రము నవతల లంకలోనుండఁగాఁ దెచ్చిన నేనిపుడు భూమిలోనికిఁబోయినసీతను దేఁజాలకపోవుదునా? భూదేవీ! నాసీతను నాకిమ్ము. లేదేని కోపముచూపెదను. అపుడు నాసంగతి తెలిసికొందువుగాక. నిజముగా నీవే నాకత్తవు. నీయొద్దనుండి పూర్వము జనకమహారాజుదున్నుచు నాఁగలియను చేతితో సీతను బయటికిఁ దీసెను. కావున నాసీతనైనను నాకిమ్ము. లేదేని నాకును దారియైన నిమ్ము. పాతాళమందుఁగాని స్వర్గమందుఁగాని దానితోఁగూడి యుండెదను. సీతనుదీసికొనిరమ్ము. సీతకొఱకు నాకుఁ బిచ్చియెత్తుచున్నది. ఎప్పటిచందమున నాకు సీతనుదెచ్చియీయవేని సపర్వతవనవగు నిన్ను ధ్వంసముచేసెదను. నే నిపుడే నీరూపు మాపెదను. సర్వము జలమయ మగుఁగాక! ధనుర్బాణములను గొనితెండు; సీతవిషయమున నీమెయభి ప్రాయమును గనుఁగొని, తరువాత నీభూమిని బ్రద్దలుచేసెదను." క్రోధ శోకములతో రాముఁడిట్లుపల్కుచుండఁగా బ్రహ్మదేవతలతోఁగూడ నిట్లనియె: "సువ్రతా! రామా! నీవు సంతాపమును బొందకుము. నీపూర్వపుసంగతిని జ్ఞప్తికిఁదెచ్చికొమ్ము. అవతారమునిమిత్తమై దేవత లతోఁ జేసిన యాలోచనను జ్ఞప్తికిఁ దెచ్చుకొమ్ము. అనుత్తముఁడవగు నిన్ను నేను స్మరియింపఁజేయను. దుర్ధర్షమగు నీమహార్ణవమునందు నీవైష్ణవభావమును స్మరింపుము. సీత విమలాంతఃకరణురాలు. పతివ్రత. పూర్వముండియు నీయందాసక్తురాలు. నిన్నాశ్రయించిన తపోబలము కతమున నాగలోకమునకుఁ బోయినది. తప్పక నిన్నుఁ గలసికొనును. ఈసభయందు నేను జెప్పుమాట నాలకింపుము. ఈకావ్యమే కావ్యము లలో నెల్ల నుత్తమము. దీనివలన సర్వము విస్తరముగాఁ దెలియును. వాల్మీకి జన్మము మొదలు నిర్యాణమువఱకునుగల నీచరిత్రమంతయు నిందుఁ బొందుపఱిచియున్నాఁడు. రామా! ఇది యాదికావ్యము. నీయందు సర్వమును బ్రతిష్ఠితమైయున్నది. కావ్యయశస్సు నీకంటె మఱొకనికిరాదు. నేనును దేవతలును బూర్వము దీనిని వినియుంటిమి

ఇందుఁ జెప్పినదంతయు సత్యమైనది. పురుషశార్దూలా! ధర్మముచే సావ
ధానుఁడవై మిగిలినకావ్యమునుగూడ వినుము. వీనును నీవును కావ్యము
యొక్కతుదిభాగమును వినుఁడు. నీకంటె నితరులచే నిది వినఁదగినది
గాదు. నీచేతనే వినఁదగినదానినిగా వాల్మీకి దీనిని రచించెను." ఇంత
వఱకుఁజెప్పి బ్రహ్మ దేవతలతోఁగూడ స్వర్గమునకుఁ బోయెను. అచ్చటికి
వచ్చిన మునులు మొదలగువారందఱును మిగిలినకథ వినుటయం దుత్సా
హముతో నుండిరి. అపుడు బ్రహ్మచెప్పినమాటలు విని వాల్మీకితో నిట్లు
నియె: "భగవానులవారూ! మిగిలిన కథాభాగమును వీరందఱును వినఁ
గోరుచున్నారు; గావున శేషప్రబంధము ప్రారంభింపుము." అనియిట్లుచెప్పఁగా
వాల్మీకి మంచిదేయని కుశీలవులగు కుశలవులను దోడుకొని యాసభలో
నుండి పర్ణశాలకుఁ బోయెను. అందఱును సీతసంగతి తలఁచుకొనుచునే
యారాత్రి వేగించిరి.

99-వ సర్గము

కౌసల్యాదులు స్వర్గమునకుఁ బోవుట

తెల్లవాఱినతోడనే యందఱును నిత్యకృత్యములు దీర్చుకొని
యాసభలో వచ్చి కూర్చుండిరి. నిర్విశంకముగా గానముచేయుఁడని
రాముఁడు కొడుకులతోఁ జెప్పెను. మహర్షులగు బ్రహ్మర్షులందఱును
గూర్చుండఁగానే యుత్తరచరితమును గానముచేయ మొనలిడిరి. అట్లు
సత్యసంపదచే సీత పాతాళలోకమునకుఁ బోయినతరువాత నాయజ్ఞము
పూర్తికాఁగానే రాముఁడు మిగుల దుర్మనాయమానుఁడై సీతకనుపడమిచే
జగమంతయు శూన్యముగాఁ దలఁచెను. శోకగ్రస్తుఁడై శాంతియన
నెట్టిదో యెఱుఁగకుండెను. యజ్ఞమునకు వచ్చినవారలనందఱను యథో
చితముగా సత్కరించి పంపివైచెను. ఆరాముఁడట్లు యథావిధిగా యజ్ఞము
పూర్తి గావించి సీతను హృదయములోఁ దలంచుకొనుచు నయోధ్యకు
వచ్చెను. వచ్చినపుడు కొడుకులనుగూడఁ దీసికొనివచ్చెను. సీతను విడిచి
మఱియొకస్త్రీని వెండ్లియాడ లేదు. ప్రతియజ్ఞమందును బంగారుసీతనే
దగ్గఱనుంచుకొనెడువాఁడు. పదివేలసంవత్సరము లశ్వమేధయాగము
లను వాజపేయములను జేసెను. అగ్నిష్టోమములు, అతిరాత్రములు,
గోమేధములు, ఇతరక్రతువులు లెక్కలేకుండఁజేసెను. ప్రతియజ్ఞము

నందును విస్తారముగ దక్షిణలిచ్చెను. ఇట్లు ధర్మమునకై ప్రయత్నించుచు న్యాయముగ రాజ్యమేలుచుఁ జిరకాలము గడిపెను. నానాఁటికంటను రామునియం దనురాగము నెక్కుడుగాఁజూప మొదలిడిరి. ఋషివానర రాక్షసులు రామునియాజ్ఞలోనుండిరి. సకాలమునఁ బర్జన్యుఁడు వర్షించుచుండెను. అంతటను సుభిక్షముగా నుండెను. దిక్కులు నిర్మలముగా నుండెను. పట్టణములు పల్లెలు హృష్టపుష్టజనాకీర్ణములై వెలుఁగొందుచుండెను. అకాలమరణములు, రోగములు, ననర్థములు మొదలయినవి రాముఁడు రాజ్యమేలుచుండఁగా లేనేలేవు. ఇట్లుండఁగాఁ గొంతకాలమునకు రామునితల్లి కౌసల్య యంటను దగ్గఱనుండఁగానే కాలధర్మమునొందినది. సుమిత్ర కైకేయిగూడ నామెతోనే మృతినొంది స్వర్గమునకుఁ బోయిరి. వీరందఱును స్వర్గమునందు దశరథునితోఁగూడి సంతోషించుచుండిరి. పతివ్రతలు గనుక సకలధర్మఫలములను బొందిరి. తల్లిను ద్వేషించి యాయాకాలములందు రాముఁడు మహాదానము లిచ్చుచుండెడివాఁడు. అట్లే తక్కినయిద్దఱు తల్లులవిషయమైకూడ నాచరించి బ్రాహ్మణులను మునులను దృప్తినొందించిరి. పిత్ర్యములగు ధనములు రత్నములు మొదలగువానిచేఁ బరమదుస్తరములగు యజ్ఞములుచేసి దేవతలను, పితృదేవతలను సంతుష్టినొందించెను. ఇట్లనేకవేలసంవత్సరములు సుఖముగాఁ గడపెను. నానాఁటికి యజ్ఞాదులచే ధర్మమును వృద్ధిచేసికొనెను.

100-వ సర్గము

యుధాజిత్తు గార్గ్యుని రామునియొద్దకుఁ బంపుట

మఱికొంతకాలమునకుఁ గేకయదేశాధీశ్వరుఁడగు యుధాజిత్తు శ్రీరామునియొద్దకుఁ దనగురువును బంపించెను. అంగిరసుని పుత్రుఁడగు నాగార్గ్యునితోఁగూడఁ బదివేలగుజ్జములను గానుకగాఁబంపెను.మఱియు రత్నకంబళములు, ఉత్తమమగు చిత్రవస్త్రము, శుభములైన యాభరణములుగూడ నిచ్చిపంపెను. రాముఁడు బ్రహ్మర్షియగు గార్గ్యుఁడు వచ్చియున్నాఁడని విని మాతులపురోహితుఁడగు నాయన నెదుర్కొని యాయనయిచ్చిన ధనాదికమంతయుఁ గైకొని దేవేంద్రుఁడు బృహస్పతిని వలెఁబూజించెను. అట్లుపూజించి యాయనతెచ్చినవి పుచ్చుకొని యందఱు

క్షేమము నడిగెను. ఆయన కూర్చుండినపిదప మఱియు నడుగుట కుపక్రమించెను: "మా మేనమామ యే మాజ్ఞాపించెను? తమరు దయచేసిన కార్య మేమి? సాకూత్తుగఁ దమరు బృహస్పతివంటివారు." ఇట్లడిగిన రాముని మాటలువిని యత్యద్భుతమైన తనరాకనుగూర్చి చెప్పుట కుపక్రమించెను: "రామా! ప్రీతిగా వింటివేని మీమామ చెప్పుచున్న మాటలు చెప్పెదను. ఈగంధర్వదేశము ఫలమూలోపశోభితము. సింధువు రెండు ప్రక్కలను బరమశోభనముగా నున్నది. దానిని యుష్మద్విశారదులగు గంధర్వ లాయుధములు పట్టుకొని రక్షించుచున్నారు. వారు శైలూషుని కొడుకులు: మూఁడుకోట్లమంది మహాబలవంతులు. రామా! వారిని జయించి శుభమగు గంధర్వనగరమును స్వాధీనముచేసికొనుము. అన్యుల కాదేశము స్వాధీనముగాదు. ఇది నీకిష్టమగుఁగాక. నే నీ కహితము బోధించువాఁడనుగాను" అని చెప్పుమన్న మాటలు గార్గ్యుఁడు చెప్పఁగా రాముఁడు 'మంచిదే' యని భరతునివైపు చూచెను. రాముఁడు చేతులు జోడించుకొని యా బ్రాహ్మణునితో నిట్లనెను: "ఈకుమారు లాదేశమును గూర్చి వచ్చిరి. వీరు భరతుని కొడుకులు. వీనిపేరు తక్షుఁడు. ఇతఁడు పుష్కలుఁడు. మేనమామను జూచుటకుఁ గొడుకులతోఁగూడ భరతుని సైన్యముతోఁగూర్చి పంపెను. గంధర్వకుమారులనుజంపి రెండుపట్టణములుగా విభజించి కొడుకులిద్దఱను రెండుపట్టణములలోనుంచి, ధార్మికుఁడగు భరతుఁడు మరల నాయొద్దకు వచ్చును. ఇట్లు గార్గ్యునితోఁ జెప్పి కుమారులకు వెంటనే యభిషేకముచేసి సైన్యముతోఁగూడ భరతుని బంపెను. ఇంద్రునివేఁట దేవసైన్యమువలె నాసేన భరతునివెంట బయలు దేఱినది. రాక్షసులు పిశాచములు మొదలైన రక్తమాంసాదుల కాసించి భరతునితోఁ బోయినవి. భూతములు దారుణములైనవి మాంసమును భక్షించుటకుఁ బోయినవి. గంధర్వమాంసము దినుటకు, వారలరక్తము ద్రావుటకు సమయము తటస్థించినందుల కవియన్నియు మిగుల సంతోషించి బయలుదేఱినవి. సింహాములు, పెద్దపులులు, వరాహాములు ఖేచరము లగు పక్షులు మొదలగునవి వేఱకొలఁదిగ సేనముందఱి బయలు దేఱినవి. నిరామయముగా సేన దారిలోఁ బదునేనుదినములు నడిచి క్రమముగా సంతోషించుచుఁ గేకయదేశమునఁ బ్రవేశించినది.

101-వ సర్గము

భరతుఁడు గంధర్వుల గెల్చుట

కేకయదేశాధిపతి యగు యుధాజిత్తు సేనను దీసికొని భరతుఁడు గాన్ధర్వినితోఁ గూడివచ్చె ననివిని చాల సంతోషించెను. కేకయాధిపుఁడు చాలసైన్యమును వెంటఁబెట్టుకొని తొందరగాఁ గామరూపులగు గంధర్వులపైకి బయలుదేఱెను. భరతుఁడును యుధాజిత్తుఁ గలిసికొని సైన్య సమేతులై గంధర్వనగరమును సమీపించిరి. భరతుఁడు వచ్చె ననివిని గంధర్వులు యుద్ధసన్నద్ధులై యంతటను సింహనాదములు చేసిరి. తరువాత వీరికిని వారికిని దొమ్మియుద్ధము జరిగినది. ఏడుదినములు రోమహర్షణముగా యుద్ధము జరిగినదిగాని యెవ్వరికిని జయము గలుగలేదు. ఖడ్గములు శక్తులు ధనుస్సులు గ్రాహములుగా, రక్తము నీరుగా, నదులు నృకళేబరములను ప్రవహింపఁజేసినవి. తరువాత భరతుఁడు కోపించి సుదారుణమగు సంవర్తమను కాలాస్త్రమును గంధర్వులపైని ప్రయోగించెను. ఆగంధర్వులు కాలపాశములచే బద్ధులై సంవర్తాస్త్రముచేనిదారితులై మూఁడుకోట్లమంది నిమేషమాత్రములోనిహతులైరి. ఘోరతరమగు నాఘాతమును దేవతలు నిమేషాంతరమాత్రమున స్మరింపరైరి. అట్లు గంధర్వులందఱును హతులుకాఁగా భరతుఁడు వెంటనే యాదేశమును రెండుభాగములుగా విభాగించెను. తక్షశిలయందుఁ దక్షుని, పుష్కలుని పుష్కలావతమందును నుంచెను. ఇట్లు గంధర్వదేశమందును మనోహరమైన గాంధారదేశమందును భరతుఁడు కొడుకుల నుంచెను. ఆరెండు పట్టణములు ధనముతోడను రత్నములతోడను నిండి యుద్యానవనములచే మనోహరములై యొకదానిశోభ నొకటి సహింపనంత స్పర్ధగలిగి యున్నదా యన్నట్లు సొంపుగా నున్నవి. మఱియు నారెండుపట్టణములు సుచిరములైనవియు, అకిల్బిషములైనవ్యవహారములతోఁ గూడినవియును ఉద్యానములతోడను యానములతోడను గూడినవియు వేరుపఱుపఁబడిన యంగడివీథులు గలవియును, విశాలములైనవియును, విమానములతో సమానములగు సుత్తమగృహములతోఁ గూడినవియును, దేవాయతనములచే సొంపారుచున్నవియును, తాల తమాల తిలక వకుళాదివృక్షములచే రమ్యములైనవియును నగు నాపట్టణములయందు భరతుఁడైదు

సంవత్సరములు నిపసించి మరల నయోధ్యకు వచ్చి సాక్షాత్తు అపరధర్మ దేవతవలె నున్న యన్నకు దేవేంద్రుడు బ్రహ్మకువలె నమస్కరించి, యా గంధర్వులవధను గుఱించి యంతయుఁ జెప్పెను. పట్టణముల విభాగము మొదలైనవి చెప్పఁగా విని రాముఁడు సంతోషించెను.

102-వ సర్గము

అంగదచంద్రకేతులపట్టాభిషేకము

ఇట్లు భరతుఁడు చెప్పిన వృత్తాంతము విని చాల సంతోషించి యప్పుడు లక్ష్మణునిఁజూచి యత్యద్భుతముగ నిట్లనియె: "తమ్ముఁడా! లక్ష్మణా! ఈనీకుమారులగు అంగదుఁడు, చంద్రకేతుఁడును రాజ్యమేలఁ దగినవారు; దృష్టవిక్రములు. మఱియు ధర్మవిశారదులు. వీరిని రాజ్యాభిషిక్తులను జేసెదను. తగినదేశమాలోచింపుము. అది రమణీయమైనదియుఁ, జిక్కులులేనిదియు, వీరి యిష్టమైనదియుఁగా నుండవలయును. అచట రాజులకును, మున్యాశ్రమములకును బీడగలుగరాదు. అటువంటిదేశము చూడుము. మనమెవ్వరికి నపరాధము చేసినవారము కాఁగూడదు" అని రాముఁడు చెప్పఁగా భరతుఁడిట్లనియె: "అన్నా! కారుపథ మను దేశము నీవు చెప్పిన చొప్పున నుండును. రమణీయమై యది నిరామయముగా నున్నది. అచ్చట నంగదునకు బట్టణమేర్పఱుపవలయును. చంద్రకేతునకుఁ జంద్రకాంతమనునది సుచిరము నిరామయమునై యుండును." అట్లు భరతుఁడుచెప్పినదానిని రాముఁడంగీకరించెను. శ్రేష్ఠుఁడగు చంద్రకేతునకు మల్లభూమియందలి చంద్రకాంతమని ప్రసిద్ధికెక్కి, రెండవస్వర్గము వలెనుండు పట్టణమును రాజధానిగాఁ జేసెను. యుద్ధమున జయింపసాధ్యముగాని రామలక్ష్మణభరతులు స్వయముగాఁ గుమారుల రాజ్యాభిషిక్తులఁ జేసిరి. అట్లు వారి నభిషిక్తులను జేసి యంగదునిపట్టినపురమునకును, చంద్రకేతునుత్తరముపైపునకునుబంపించెను. అంగదుఁడు లక్ష్మణుఁడును, చంద్రకేతునివెంట భరతుఁడును వెళ్లిరి. అంగదుఁడు వెళ్లి లక్ష్మణుఁడు సంవత్సరమువఱకు నందుండి కొడుకునకు రాజ్యము స్థిరముగానే మరల నయోధ్యకు వచ్చెను. భరతుఁడును మఱొకసంవత్సరముపైఁగానుండి యయోధ్యకు వచ్చి రాముని సేవించుచుండెను. ఇట్లు భరతుఁడును లక్ష్మణుఁడును రాముని పాదములు సేవించుచు, నతిథార్తికులగు

వారు స్నేహాధిక్యమువలన గతించినకాలమునుగూడఁ దెలియఁజాలరైరి. ఇట్లు ధర్మాసక్తులై నిత్యమును పౌరులకార్యములు నెఱవేర్చుచుండువారలకుఁ బదివేలసంవత్సరములు గడచినవి. ఇట్లు మహాక్రతుపులయంచలి యగ్నిత్రయమువలె వెలుఁగుచుఁ బరిపూర్ణమానసులై శ్రీమంతులై ధర్మమును జక్కఁగా నడపుచుండిరి.

103-వ సర్గము

➖ యముఁడు తాపసవేషముతో వచ్చుట ➖

ఇట్లు రాముఁడు ధర్మము దప్పక రాజ్య మేలుచుండఁగాఁ గొంత కాలమునకు యముఁడుతాపసవేషముతో రాజద్వారముచెంతకువచ్చెను. అతఁడు ధైర్యశాలియుఁ గీర్తిమంతుఁడును నగు లక్ష్మణునిజూచియిట్లనియె: "లక్ష్మణా! నేను కార్యగౌరవమువలన వచ్చియుంటినని రామునితో విన్నపింపుము. నే నతిబలుఁడును, అమితతేజస్కుఁడును నగు మహర్షి పంపిన దూతను; కార్య ముండుటచే రామునిఁ జూడవచ్చితిని" అని యతఁడు చెప్పఁగా లక్ష్మణుఁడు త్వరగా రామునియొద్దకేఁగి తాపసునిరాక మనవి చేసెను. "మహాద్యుతివగు రామా! ధర్మముచేత నుభయలోకములను జయించుము. దూత నిన్నుఁ జూచుటకువచ్చెను. అతఁడు తేజస్సుచే సూర్యునివలె సున్నాఁడు" అని చెప్పిన లక్ష్మణునిమాటలు విని రాముఁడిట్లనియె: "నాయనా! లక్ష్మణా! ఆమునిని లోపలఁ బ్రవేశింపఁజేయుము" అని రాముఁడుచెప్పఁగానే విని లక్ష్మణుఁడు బయటికివచ్చి మునిని లోపలఁ బ్రవేశపెట్టెను. రెండవయగ్నిహోత్రునివలె వెలుఁగుచున్న యాతాపసుఁడు రామునిసమీపించి మధురవాక్కున వృద్ధినొందుమని దీవించెను. రాముఁడతని కర్ఘ్యపాద్యములిచ్చి పూజించి కుశలమడుగుటకుపక్రమించెను. ఆముని రామునిచేఁ గుశల మడుగఁబడి దివ్యమగు బంగరు గద్దియపైఁ గూర్చుండెను. తరువాత రాముఁడతనిని స్వాగతమడిగి, వచ్చిన కార్యము చెప్పుమనెను. ఇట్లు రామునిచేఁ బ్రార్థితుఁడై యాముని యిట్లనియె: "రామా! నేను వచ్చినకార్యము రహస్యముగఁ జెప్పఁదగినది. అట్లయిన హితమగును. మనము మాటలాడునపుడు వినువారినిగాని, చూచువారినిగాని నీవు చంపవలయును. అట్లయిన నేను మునివాక్యము చెప్పెదను." అట్లతఁడు చెప్పఁగానే రాముఁ "డట్లే" యని లక్ష్మణునితో

నిట్లనియె : "తమ్ముఁడా! ద్వారపాలునిఁబంపివైచి నీవు జాగరూకతగా ద్వారమునందుండుము. నేనీఋషితో మాటలాడుచుండుట విన్న వారు గాని చూచువారుగాని వథార్హులగుదురు" అని లక్ష్మణుని ద్వారమందు నియోగించి తర్వాత మునినిజూచి "నీవు చెప్పఁదలఁచినదానిని జెప్పుము. నిన్నెవరెందులకుఁబంపించిరో ఆసంగతి నిశ్శంకముగాఁజెప్పిన వినవలయు." నని నాకును గోరికయున్నది.

10-వ సర్గము

యముఁడు బ్రహ్మసందేశము చెప్పుట

"రామా! మహాబాహూ! నే నెందులకువచ్చితినో చెప్పెదను వినుము. మహాబలా! నేను బ్రహ్మదేవునిచేఁ బ్రేషితుఁడనై వచ్చితిని. ఆతఁడు నీకుఁ బూర్వభావమునఁ గుమారుఁడు. వీరా! నేను మాయ నవలంబించి వచ్చిన యముఁడను. సర్వమును సంహరించువాఁడను. లోక పతియుఁ బ్రభువునగు బ్రహ్మదేవుఁడు నీకు సమయమేర్పాటుచేసి యిట్లు చెప్పు"మనెను. "సౌమ్యా! లోకములను రక్షించుటకై నీవు ప్రతిజ్ఞచేసి తివి. పూర్వము మాయచేత లోకములను సంక్షేపించి స్వయముగా మహార్ణవజలమున శయనించి నీవు నన్నుఁబుట్టించితివి. అనంతరము పడగ లతో నొప్పుచున్న యనంతుని, మధుకైటభులను, దానవులను సృజించితివి. నీవామహాభోగశాలి యగు ననంతుని సృజియించి యతనిపై శయనించి యుండఁగా బలవంతులగు మధుకైటభులనువారి నిద్రఅనుజంపి వారియస్థి మాంసములచేఁ బర్వతములతోఁ గూడిన యీభూమిని జేసితివి. సూర్య సంకాశమగు నీనాభిపద్మమునుండి నన్నుఁబుట్టించితివి. నన్నుఁ బ్రాజాపత్య కృత్యమందు నియోగించితివి. నేను సన్నస్తభారుఁడనై జగత్పతి వగు నిన్ను సేవించితిని. నాకుఁ దేజస్సునిచ్చిన నీవు నన్ను రక్షించు"మని విన్న పింపఁగా నీవును ధర్మమును సనాతనమును నగు నాభావమునుండి సర్వ భూతములను రక్షించుకొఱకు విష్ణుత్వమును బొందితివి. అదితియందు వీర్యవంతుఁడవైన పుత్రుఁడవై పుట్టి నీసహోదరులకు బలమును గలిగిం చుచుఁ గార్యములు దట్టించినపుడు వారికి సాయపడుచుంటివి. అట్టి నీవు ప్రజలు భయపడుచుండఁగా రావణవధకై నుసుష్యుఁడ వగుటకు సంకల్పించితివి. పదునొకండువేలసంవత్సరములు భూమియం దుండుటకు నీవే నిర్ణయించి వచ్చినాఁడవు. అట్టి నీవు మనోమయపుత్రుఁడవు.

మానుషజన్మమున నిదినీకుఁ బూర్ణాయువు. నరశ్రేష్ఠా! నీకు మాసమీపముఁజేరుట కిది సమయము. ఇంకను నీవు మనుష్యలోకములో నుండుటకిచ్ఛయుండినచో నుండుము." "బ్రహ్మ నీతో నీసంగతి చెప్పుఁమని నన్నుఁబంపెను. ఒకవేళ దేవలోకమునకు రానిచ్ఛయున్నచో దేవతలు విష్ణునితోఁగూడి విగతజ్వరులగుదురు." అనియిట్లు బ్రహ్మదేవుఁడు చెప్పుమనిన మాటలు యముఁడు చెప్పఁగా విని రాముఁడు నవ్వుచు సర్వసంహారియగు యమునితో నిట్లనియెఁ: పరమాద్భుతములైన బ్రహ్మదేవునిమాటలు వినుటచేతను నీరాకచేతను నాకుఁ జాలసంతోషము గలిగినది. మూఁడులోకములవారికార్యములనిమిత్తమై నే నవతరించితిని. నీకు భద్ర మగుఁగాక! నేనెచ్చటనుండి వచ్చినాఁడనో మరల నచ్చటికిఁబోయెదను. నేనును దలంచుచునేయుంటిని. ఇంతలో నీవును వచ్చితివి. ఈవిషయమై నాకు విచారణ యక్కఱలేదు. సర్వకార్యములయందును నేను దేవతలకు వశవర్తినై యుండవలెను. బ్రహ్మదేవుఁడు చెప్పినయంతయు సత్యమే."

105-వ సర్గము

దుర్వాసోముని రామునిఁ జూడవచ్చుట

రాముఁడు యమునిఁడు నిట్లు రహస్యముగ మాటలాడుచుండఁగా దుర్వాసోముని రామునిదర్శనమునకై వచ్చి ద్వారమునందుండెను. ఆబుషిసత్తముఁడు లక్ష్మణునియొద్దకువచ్చి యిట్లనియెఁ: "లక్ష్మణా! వెంటనే నాకు రామునిఁ జూపింపుము. ఆలస్యముచేసితివేని నాకార్యము చెడిపోవును." ఇట్లనిచెప్పిన యీమునిమాటలు విని లక్ష్మణుఁ డాయనకు నమస్కరించి యిట్లనియెఁ: "మహాత్మా! తమరు దయచేసినకార్య మేమి? ఏమిచేయుమని సెలవు? మీయన్న కార్యవ్యగ్రుఁడైయున్న వాఁడు.ముహూర్తమాత్రము ప్రతీక్షింపవలయును." అని లక్ష్మణుఁడు చెప్పఁగానే యీముని కోపాంధుఁడై కన్నుల నిప్పులు రాల్చుచు లక్ష్మణునితో నిట్లనియెఁ: "లక్ష్మణా! ఈక్షణమే నన్ను రామునియొద్దకుఁ దీసికొనిపొమ్ము. అట్లు చేయవేని నిన్ను నీపట్టణమును నీదేశమును నీయన్నను భరతుని మీవంశమును నశించునట్లు శపించెదను. నాకుఁ గోపము వచ్చినది. నేనాఁపుఁగోఁజాలను" అని యిట్లు ఘోరముగాఁ జెప్పిన దుర్వాసోమునిమాటలు విని యతని మాటల నిశ్చయమునుగూర్చి లక్ష్మణుఁడు చింతింపఁదొడఁగెను. "నే

నొక్కఁడన నశింతును; సర్వవినాశము కాఁగూడదు" అని నిశ్చయించి వెంటనేవెళ్లి రామునితో మనవిచేసెను. రాముఁడు లక్ష్మణునిమాటలువిని యమునికి సెలవిచ్చి వెంటనేవచ్చి యత్రికుమారుని సందర్శించెను. మండు చున్న యగ్నిహోత్రమువలెనున్న యామునికి నమస్కరించి చేతులు జోడించుకొని వినయముగా "నేమియాజ్ఞ?"యని యడిగెను. మునివరుఁ డగు దుర్వాసుఁడు రాముఁడన్నమాటవిని "ధర్మవత్సలా! విను"మని యిట్లుచెప్పుట కుపక్రమించెను: "రామా! నేనిప్పటికి వేయిసంవత్సరముల నుండి తపమాచరించుచుంటిని. అది నేఁటితో ముగిసినది. కావున వెంటనే నాకు భోజనము గావలసియున్నది. అది నీవలన నెఱవేఱునని వచ్చితిని." అని యతఁడు కోరఁగానే రాముఁడు సంతోషించి యతనికోరిక ప్రకారము భోజనము పెట్టించెను. అతఁడమృతోపమమగు నాయన్నమును భుజించి రామునిఁగొనియాడి తనయాశ్రమమునకుఁబోయెను. అతఁడట్లుపోయిన తోడనే రాముఁడు యమునిమాటలు స్మరించుకొని దుఃఖమొనలేడెను. అతఁడు దుఃఖసంతప్తుఁడై తనప్రతిజ్ఞను స్మరించుకొని తలవంచుకొని దీనుఁడై మాటలాడఁజాలకపోయెను. తరువాత రాముఁడు యమునిమాటలు బుద్ధిచే నిశ్చయించి "యిది గా"దని నిశ్చయించుకొని తూష్ణింభావమునవలంబించెను.

106-వ సర్గము

లక్ష్మణుఁడు స్వర్గమున కేఁగుట

తరువాతఁ దలవంచుకొని రాహుగ్రస్తుఁడగు చంద్రునివలెనున్న దీనుఁడగు రామచంద్రునితో లక్ష్మణుఁడు సంతోషించుచు మధురముగా నిట్లనియె: "మహాబాహూ! నానిమిత్తమై నీవు సంతాపమును బొందుటుచితముగాదు. పూర్వజన్మకర్మమిట్టిది. దానినెవరును దప్పింపఁజాలరు. కాలగతి తెలియదుగదా! సౌమ్యా! నన్నుఁజంపి నీప్రతిజ్ఞను నిలుపుకొనుము. పట్టినప్రతిజ్ఞను దప్పినవారు నరకమునకుఁ బోవుదురుగదా! నాయందు నీకుఁ బ్రీతియున్నచో, నన్ను గ్రహింపవలయుననియున్నచో నిర్విశంకముగా నన్నుఁజంపి ధర్మమును నిలుపుము" అని ఇట్లు లక్ష్మణుఁడన్నమాటలువిని రాముఁడు విచలితేంద్రియుఁడై మంత్రిపురోహితాదులను రావించి వారియెదుట జరిగినసంగతియంతయుఁ జెప్పెను. పురోహితాదులు రామునిమాటలు విని యూరకుండిరి. అపుడు వసిష్ఠమహాముని

యిట్లనియె: "మహాబాహూ! రోమహర్షణ మగు నీనాశము సిద్ధము. మహాయశా! లక్ష్మణునితోడి వియోగము నీకుఁదప్పనిది.వీనిని విడుపుము. విధి బలవంతమైనది. ప్రతిజ్ఞను దప్పకుము. నీవంటివాఁడే ప్రతిజ్ఞనుదప్పి నచో నిఁక ధర్మము నశింపకయుండునా? ధర్మము నశించినతోడనే మూఁడు లోకములును నిమిషమాత్రమున నశించిపోవును. సంశయము లేదు. కావున నోపురుషశార్దూలా! మూఁడులోకములను నిలుపుటకై లక్ష్మణుని విడువుము. జగత్తును నెమ్మదిగా నుంచుము" అనియిట్లు సభాసదులంద ఱును సన్నుతించునట్లు వసిష్ఠభగవానుఁ డన్నమాటలు విని రాముఁడు లక్ష్మణునితో నిట్లనియె: "లక్ష్మణా! నిన్ను విడిచెదను. ధర్మమునకు నాశము కాఁగూడదు. త్యాగముగాని, వధముగాని రెండును సమానమే యని పెద్ద లందురు" అని యిట్లు రాముఁ డనినతోడనే లక్ష్మణుఁడు బాష్ప వ్యాకులితేంద్రియుఁడై స్వగృహమునకైనను బోకుండనే త్వరితముగా సరయూతీరమునకుఁబోయి యాచమనమాచేసి చేతులు జోడించుకొని సర్వేంద్రియములను నిరోధించుకొని నిట్టూర్పునైనను బయటికిరానీయఁ డాయెను. ఇట్లు నిట్టూర్పు విడువకుండ యోగముపట్టి యున్న లక్ష్మణుని పైని దేవేంద్రుఁడు మొదలగు దేవతలందఱును బుష్పులును బుష్పవర్షము గురియించిరి. మనుజుల కెవ్వరికిని గనుపడనీకుండ మహాబలుఁడగు లక్ష్మణుని శరీరముతోడనే యింద్రుఁడు స్వర్గమునకుఁ దీసికొనిపోయెను. అపుడు దేవతలందఱును విష్ణునినాలవభాగము వచ్చుటచూచి సంతుష్టాంతరంగులై మహర్షులతోఁగూడఁ బూజించిరి.

107-వ సర్గము

కుశలవులపట్టాభిషేకము

అట్లు రాముఁడు లక్ష్మణుని విడిచి దుఃఖశోకసమన్వితుఁడై పురోహితుని మంత్రులను బౌరులను జూచి యిట్లనియె: "నేఁడు నేను భరతుని రాజ్యాభిషిక్తుని జేసెదను. అతని నయోధ్యకు రాజునుగాఁజేసి నేనిపుడే యడవికిఁ బోయెదను. కాలహరణము గాకుండ మీరు సంభారములను సిద్ధముచేయుఁడు. లక్ష్మణుఁడు పోయినదారినే నేనును బోయెదను" అని యిట్లు రాముఁడనఁగానే ప్రజలందఱును రామునిపాదములమీఁదఁబడి ప్రాణముపోయినవారివలె నిశ్చేష్టితులై యుండిరి. రామునిమాటలు విని

భరతుఁడు విసంజ్ఞుఁ డాయెను. కొంతతడవునకుఁ దెలిసి రాజ్యమును గర్హించుచు రామునితో నిట్లనియె: "అన్నా! నీపాదములాన. నీవు లేని రాజ్యము నాకేల? స్వర్గముకూడ నీవు లేనిచో నాకక్కఱలేదు. నీకుమారులఁ గుశలవులను రాజ్యాభిషిక్తులఁ జేయుము.కోసలదేశమునకుఁ గుశుని, ఉత్తరకోసలదేశమునకు లవుని రాజులనుగాఁ జేయుము. దూతలు శీఘ్రముగాఁబోయి మనస్వర్గయాత్రను శత్రుఘ్నునకుఁ దెలియఁ జేయుచురుగాక! అని యిట్లు భరతుఁడు చెప్పినమాటలువిని దుఃఖసంతప్తులై యధోముఖులైన పౌరులను జూచి వసిష్ఠభగవానుఁ డిట్లనియె: "వత్సా! రామా! ఈప్రజలందఱును దుఃఖించుచు తలలు వంచుకొని భూమినిఁ జూచుచున్నారు. వీరియభిప్రాయమును దెలిసికొని సంతోషింపఁ జేయుముగాని విప్రియమాచరింపకుము." ఇట్లు వసిష్ఠుఁడు చెప్పినమాటలువిని రాముఁడు ప్రజలను లేవఁదీసి యంజలిత్రోడను నేనిచేయఁ గోరుచున్నా రని యడిగెను. ఆపుడు ప్రజలందఱును రామునితో నిట్లనిరి: "రామా! నీ వెచ్చటికిఁబోయినను నీవెంటనే వచ్చెదము. నీకుఁ బౌరులయందుఁ ప్రీతియున్నచో, నీకు మాయందలిస్నేహము నిర్వాచ్యమైనదే యైనచో మేము భార్యలతోడను బిడ్డలతోడను నీవు పోవుచోటికి వచ్చెదము. ఇందు కంగీకరింపుము. తపోవనమునకుఁగాని, దుర్గమప్రదేశమునకుఁగాని నదినేని, సముద్రమునేని ప్రవేశించుటకుఁగాని మే మందఱమును సిద్ధులమైయున్నాము. మాయందు దయయుంచి మమ్ముల నత్యాజ్యులనుగాఁ దలఁచితివేని యీశ్వరా! మమ్ములను దోడ్కొని పొమ్ము. ఇదియే మాపరమప్రీతి. ఇదియే మాకు ముఖ్యమైనవరము. నీవెంటనే రావలయునని మాయందఱహృదయములలోనికోరిక" రాముఁడిట్లుచెప్పుచున్న పౌరుల మాటల కంగీకరించెను. దక్షిణకోసలములకుఁ గుశుని, ఉత్తరకోసలము లకు లవుని రాజులనుగాఁ జేసి వారినిద్దఱను దొడలపైఁ గూర్చుండఁ బెట్టుకొని కౌఁగిలించి మాటిమాటికిని ముద్దులాడి శిక్షణలు మార్కొనెను. వేలకొలఁది రథములు, పదివేలుగజములు, లక్షగుఱ్ఱములు, వలసినంతధనము నొక్కొక్కనికిచ్చెను. మఱియు కుశీలవులగు కుశలవులను చాలరత్నములు, ధనము నిచ్చి హృష్టపుష్టజనము గల వారివారిపట్టణములకుఁ బంపించెను. ఇట్లు కుమారులను బట్టాభిషిక్తులనుగాఁ జేసి రాజ్యములయం

దుంచి వెంటనే శత్రుఘ్నుని దోడ్కొనివచ్చుటకై రాముఁడు మధురా పట్టణమునకు దూతలను బంపెను.

108-వ సర్గము

రాముఁడు సుగ్రీవాదులను దనతో రానీయకొనుట

లఘువిక్రములగు దూతలు రాముని చేఁ బ్రేరితులై వారిలో నిలు వకయే యతివేగముగా మధురకుఁ బయనమైరి. వారు మూఁడహో రాత్రములు నడచి మధురచేరి జరిగినవృత్తాంతమంతయు శత్రుఘ్నునితోఁ జెప్పిరి. రాముని ప్రతిజ్ఞ, లక్ష్మణునిత్యాగము, కుశలవుల రాజ్యాభిషేకము, పౌరులయనుగమనము, వింధ్యపర్వతప్రాంతమున రాముఁడు కుశునికిఁ గుశావతియను రమ్యమైన పట్టణము నిర్మింపించుట, లవునికి శ్రావస్తియను పట్టణము నిర్మింపించుట, యయోధ్యను నిర్మానుష్యముగాఁ జేసి రాముఁడు భరతుఁడు స్వర్గమునకుఁ బోవుటకు సిద్ధముగ నుండుట మొదలగు నెల్ల వృత్తాంతములను మహోత్సుఁడగు శత్రుఘ్నునకుఁ దెలిపి యతనిఁ ద్వర పడుమనిచెప్పిరి. శత్రుఘ్నుఁడు ఘోరమైన కులక్షయమునకు దుఃఖించి ప్రజలను, పురోహితుని రావించి జరిగినదియు, జరుగఁబోవునదియు నగు వృత్తమును సర్వమును వారికిఁ దెలిపెను. తరువాతఁ గుమారులకుఁ బట్టాభిషేకముచేసి శత్రుఘ్నుఁడు మధురకు వచ్చెను. ధనమును సైన్య మును రెండుభాగములుగాఁ జేసి యిద్దఱుకుమారులకును బంచియిచ్చెను. సుబాహుఁడును కొడుకునకు మధురాపురిఁయు, శత్రుఘాతి యనువానికి వైదిశ మనుపట్టణము నిచ్చెను. ఇట్లంతయు నెఱవేర్చి శత్రుఘ్నుఁడు రథ మెక్కి యతివేగముగ నయోధ్యకు వచ్చి మండుచున్న యగ్నివలె వెలుఁగుచున్న వాఁడును, సన్ననిపట్టువస్త్రము గట్టుకొన్న వాఁడును, నటు యులగు మునులతోఁ గూడియుండువాఁడును నగు మహాత్ముని రాముని జూచి నమస్కరించి చేతులు జోడించుకొని ధర్మమును స్మరించుచు నిట్లనియె: "అన్నా! కుమారులకుఁ బట్టాభిషేకము చేసినవాఁడనగు నీవెంట వచ్చుటకు నిశ్చయించుకొనియున్నాను. నావిషయమున మాఱుమాట చెప్పకుము. నీయాజ్ఞ మీఱరానిది. నన్నును దప్పక యనుగ్రహింపుము. అందును నీయెడ మిగుల భక్తిగలవాఁడను. రాముఁడట్టి పౌరుష వంతమైన శత్రుఘ్నుని బుద్ధిని దెలిసికొని యాతని యనుగమనమున కంగీ

కరించెను. ఇట్లు వారు మాటలాడుచుండఁగనే కామరూపులగు సకల ఋక్షవానరరాక్షసులతోడ సుగ్రీవవిభీషణులును వచ్చిచేరిరి. రాముఁడు స్వర్గమునకుఁ బోవుటకు నిశ్చయించుకొని యుండెనని వారు విని వచ్చిరి. దేవపుత్రులు, ఋషికుమారులు, గంధర్వసుతులు రాముని స్వర్గయాత్రా సన్నాహమును విని వచ్చిరి. ఇట్లువచ్చి వారెల్లరు రామునకు నమస్కరించి "రామా! మేము నీవెంట వచ్చుటకు నిశ్చయమనస్కులమై యిటకేతెంచితిమి. పురుషోత్తమా! మమ్ములనువిడిచి నీవు పోదువేని నీవు యమదండముతో మమ్ములను జంపినవాఁడవగుదువు" అనిరి. ఇట్లు వారందఱును గోరఁగానే రాముఁ "డట్లేరం"డని యంగీకరించెను.

అంతలో మహాబలుఁడగు సుగ్రీవుఁడును విధియుక్తముగ నమస్కరించి రామునితో నిట్లనియె: "రామా! నేనంగదునకిఁ బట్టాభిషేకముచేసి వచ్చితిని. నేనును మీవెంటవచ్చుటకు సిద్ధుఁడనై యుంటిని" అని యిట్లు చెప్పిన సుగ్రీవునిమాటలువిని రాముఁ డతనిస్నేహము నాలోచించుచు నతనితో నిట్లనియె: "మిత్రమా! సుగ్రీవా! నేను నీతో వినాకృతుఁడనై స్వర్గమునకుఁగాని, దేవలోకమునకుఁగాని, పరమపదమునకుఁగాని పోవువాఁడను గాను" అనిచెప్పి విభీషణునితో నిట్లనియె: విభీషణా! ఎంతవఱకు భూమియుండునో, ఎంతవఱకు సూర్యచంద్రాదులుందురో అంతవఱకును నీవు లంకారాజ్యమేలుచుండుము. వేయేల? నాకథ భూలోకమునందున్నంతవఱకును నీవు లంకలోనుండక తీఱదు. నీవు స్నేహితుఁడవని భావించి నిన్ను శాసించితిని. నాశాసనము నీకుఁ దప్పఁజనదు. నీవు ధర్మముగాఁ బ్రజలను బాలింపుము. నామాటకు బదులు చెప్పకుము. మహామతీ! మఱియు నీతో నింక నొకసంగతి చెప్పుచున్నాను. ఇంద్రాదిదేవతలచే నారాధింపఁదగినవాఁడును, ఇక్ష్వాకుకులదైవతమును నగు జగన్నాథు(శ్రీరంగనాథు)ని నిరంతరము నారాధించుచుండుము." అని యిట్లుచెప్పిన రామవాక్యములను విభీషణుఁ డంగీకరించెను. రాక్షసరాజగు విభీషణునికి రామశాసనము దప్పవీలు లేనిదిగదా! ఇట్లు విభీషణునితోఁ జెప్పి హనుమంతునితో నిట్లనియె: "ఆంజనేయా! నీవు జీవించియుండ నిశ్చయించుకొంటిని. ఆనిశ్చయమునకు లోపము రానీకుము. హరీశ్వరా! నాకథలు భూలోకమునఁ బ్రచారమునం దున్నంతవఱకును నామాట ప్రతిపాలనచేయుచు సంతోషముగా నుండుము." అని యిట్లు

తమ్ములతోఁగూడ నీశరీరమును ధరించుము. నీకేశరీరముకావలెనో దానినే యవలంబింపుము. మహాతేజా! నీవైష్ణవశరీరము ధరించుము. అది సనాతనము వైకుంఠవిరాజమానము. దేవా! నీవే లోకములకుదిక్కు.నీపూర్వపరిగ్రహమగు నొక్కమాయనుతప్ప నిన్నెవ్వరును దెలిసికొనఁజాలరు. మహాతేజా! నీవు అచింత్యము, మహాద్భుతము, అక్షయము, నజరమునగు నీశరీరమును భరించినను సరియే, నీయిష్టము." మహామతి యగు రాముఁడు బ్రహ్మమాటలువిని బాగుగా నిశ్చయించుకొని తమ్ములతోఁగూడ వైష్ణవశరీరమును ప్రవేశించెను. అపుడు విష్ణుమయుఁడగు నాదేవుని దేవతలు పూజించిరి. మఱియు సాధ్యులు, మరుద్గణములు, ఇంద్రాదులు, అగ్ని మొదలగువారు, దివ్యఋషులు, బ్రహ్మర్షులు, గంధర్వులు, అప్సరసలు, సుపర్ణులు, నాగులు, యక్షులు, దైత్యదానవరాక్షసులు మొదలగువారందఱును సంతోషించి సంపూర్ణమనోరథులైరి. వారందఱును విష్ణుదేవుని సాధువాదములతో నభినందించిరి.

అపుడు మహాతేజశ్శాలియగు విష్ణుఁడు బ్రహ్మనుజూచి యిట్లనియె: "సువ్రతా! ఈవచ్చినప్రజలందఱికిను మంచిలోక మీయవలయును. ఈమనుష్యులందఱునునాయందలిస్నేహమును విడువఁజాలకవచ్చిరి.భక్తులు, భజింపఁదగినవారు, నావిషయమై ప్రాణము లర్పించువారు" అని చెప్పిన విష్ణునిపల్కు లాలకించి లోకపితామహుఁడగు బ్రహ్మ వీరు సాంతానికములను లోకములనుగూర్చి పోఁగలరు. నీవిషయమై ప్రాణములు విడువఁదలఁచిన తిర్యగ్జంతువులును, నిన్నుఁజింతించువారును, నీయందు భక్తిగలవారును సాంతానికలోకములలో నుందురు. అది బ్రహ్మలోకమునకు ననంతరపుది. బ్రహ్మలోకమునందలి గుణములతో నిండియున్నది. వానరులు, ఋక్షనాయకులు తమతమ స్వస్వరూపములను బొందుదురు. వారేయే దేవతలవలనఁ బుట్టిరో మరల వారిలోఁ గలిసెదరు. అందు సుగ్రీవుఁడు సూర్యమండలమును సమస్తసురలును జూచుచుండఁగాఁ బ్రవేశించెను. దేవేశుండగు బ్రహ్మ యిట్లుచెప్పుచుండఁగా నందఱును గోప్రకారఘట్టమును బొందినవారై సరయువును ప్రవేశించిరి. సరయువు నీటిలో మునిఁగిన యెల్లవారును దివ్యదేహములతో విమానములయందుండిరి. తిర్యగ్జంతువులు సరయూజలములోమునిఁగి ప్రభాసురశరీరములతో స్వర్గమును బొందినవి. వారందఱును దేవతలవలెనే ప్రకాశించుచుండిరి.

స్థావరములు జంగమములును సరయూజలమును స్పృశించి దేవలోక
మును బొందినవి. అచ్చటికి వచ్చిన ఋక్షవానరరాక్షసులు నీటిలోఁ దమ
దేహములను విడిచి దివ్యదేహములను దాల్చినవారై స్వర్గమునుబొందిరి.
తరువాత లోకగురుండగు శ్రీమన్నారాయణుండు తనతో వచ్చిన వారి
నందఱను స్వర్గమందు నిలిపి సదా సంతసించు దేవతలతోఁగూడ స్వర్గ
మును బొందెను.

111-వ సర్గము

రామాయణఫలశ్రుతి

బ్రహ్మపూజితమును, ఉత్తరచరితముతోఁ గూడినదియు నగు నీ
యాఖ్యాన మింతవఱకే. ఇది రామాయణ మను పేరు గలది; ముఖ్యమై
నది; వాల్మీకిమహాముని చే రచింపఁబడినది. తరువాత విష్ణుఁడు స్వర్గలోక
మం దెప్పటియట్లు ప్రతిష్ఠితుఁడాయెను. అతనిచేతనే యీచరాచర
ప్రపంచమంతయు నిండియున్నది. అందువలన దేవతలు, గంధర్వులు,
సిద్ధులు, పరమఋషులు సంతుష్టులై నిత్యమును దివ్యమగు రామాయణ
మును స్వర్గమందు వినుచుందురు. ఈయాఖ్యానము దీర్ఘాయువును
సౌభాగ్యమును గలిగించి పాపములను నశింపఁజేయును. రామాయణము
వేదములతో సమానమైనది. దీనిని ప్రాజ్ఞులు శ్రాద్ధములయందు విని
పించుచుండవలెను. ఈరామాయణములోని యొక్కపదమునైనను బఠించు
వాఁడధనుఁడైనచో ధనమును బొందును. పుత్రులులేనివారు పుత్రులను
బడయుదురు. సర్వపాపములును దొలఁగిపోవును. మానవుఁడు ప్రతిదిన
మును బాపములు చేయుచుండినను దీనిలోని ఒక్కశ్లోకమును బఠించిన
యెడల నన్ని పాపములును బోవును. రామాయణవాచకునికి విఘ్నములు
ధేనువు బంగారు మొదలగునవి యీయవలయును. వాచకుఁడు సంతో
షించినచో సర్వదేవతలును సంతోషింతురు. ఆయుష్యవర్ధనమగు నీ
రామాయణకథను బఠించిన నరుఁడు పుత్రపౌత్రాదులతో నిహలోకమున
సమస్తసుఖములు ననుభవించి పరలోకమున సుత్తమగతినిఁబొంది మోదింపఁ
బడుచుండును. రమ్యమగు నయోధ్యాపట్టణము బహుసంవత్సరములు
జనశూన్యమై ఋషభునిరాజునుగాఁబొంది సుజనాశ్రయమగును. ఆయు
ష్యకరమగు నీయాఖ్యానము భవిష్యముతో నుత్తరచరిత్రతో ప్రచేత
సునిపుత్రుఁడు రచించెను. దానిని బ్రహ్మవిని యనుమోదించెను. వేయశ్లో

V. R. NARLA
D.P.R.I.
ACC. No.

మేధములును, పదివేలువాజపేయములును జేసినఫలమిందులోని యొక్క-
సర్గము చదివినవానికిఁ గలుగును. ప్రయాగాదులగు తీర్థములు, గంగాదు
లగు నదులు, నైమిశాదిపుణ్యారణ్యములు, కురుక్షేత్రాదులు రామాయ
ణము విన్నవారు వెళ్లి సేవింప నక్క-అలేదు. సూర్యగ్రహణసమయమునఁ
గురుక్షేత్రమున బంగారు తులాభారము తూఁగి దానమిచ్చినవాఁడును,
రామాయణము విన్నవాఁడును సమానులు. భక్తిశ్రద్ధాత్పర్యము
లతో రామకథను విన్నవారు పాపవర్జితులై విష్ణులోకమును బొందు
దురు. ఇది యాదికావ్యము, ఆర్షము, పూర్వము వాల్మీకిచే రచింపఁబడి
నది. దీనిని విన్నవారు విష్ణుసాయుజ్యమును బొందుదురు. పుత్రదారా
దులు వృద్ధి పొందుదురు. వారి సంపదలు, సంతతి వృద్ధిని బొందును. ఇది
సత్యమని తెలిసికొని నియతాత్ములై వినవలయును. ఇందు గాయత్రియిమిడి
యున్నది. ఈరామాయణ మనుత్తమమైనది. దీనియం దొక్కపదమునైనఁ
జదివినచోఁ బుత్రులులేనివారికిఁ బుత్రులు గలుగుదురు, ధనములేనివారికి
ధనమునొరకును; వారిపాపములన్నియుఁ బటాపంచలై పోవును. రాముని
చరిత్రను జదివినవారును విన్నవారును భక్తివలన నిష్కల్మషులై దీర్ఘా
యువును బొందుదురు. శ్రేయస్సును బొందవలయునను నిచ్ఛయున్నచో
నిత్యమును రాముని జింతింపవలయును. నిత్యమును రామునిచరిత్రమును
బ్రాహ్మణులకు వినిపింపవలయును. ఈరఘురామునిచరిత్రమునంతయుఁ
జదివినవారు దేహాంతమందుఁ దప్పక విష్ణులోకమును బొందుదురు. వారి
తండ్రి, తాత, తాతతండ్రి, వానితండ్రి, వానితండ్రిగూడ నిస్సంశయ
ముగా విష్ణుసాయుజ్యము నొందుదురు. ధర్మార్థకామమోక్షముల నిచ్చు
సీరామచరితమును నిత్యమును బ్రయత్నపూర్వకముగా వినుచుండవల
యును. భక్తితో సీరామాయణములోని పాదమునుగాని పదమునుగాని
విన్నవారు బ్రహ్మలోకమునుగూర్చిపోయి సదా బ్రహ్మచేఁ బూజింపఁబడు
దురు. ఈయాఖ్యానము పూర్వమం దిట్లు జరిగినది. మీరందఱికిను
భద్రమగుఁగాక. విష్ణునిబలము వృద్ధిని బొందును గావుత మని నిర్భయ
ముగాఁ బలుకుచుండుఁడు.

ఇది శ్రీమదాన్ధ్రీకిరామాయణమునందలి
యుత్తరకాండము సమాప్తము.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1961

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావర్తిక

పుస్తకం సంఖ్య	AOUA104B134
పుస్తకం పేరు	శ్రీమదాంధ్ర వచనరామాయణముఉత్తరకాండము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES YES.
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	283
ఎర్ర సైజు పేజీలు	NIO
ఖాళీ పేజీలు	C:L8 NO
లేని పేజీలు	
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P Jayamma
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	